https://teluguislam.net

Qur'an Katha Maalika
Selected Stories from Qur'an (Telugu)

# ఖుర్ఆన్ కథామాలిక

అల్లాహ్ గ్రంథాన్ని అర్థం చేసుకోవటం ఇక చాలా తేలిక!


మూలం :

**షేఖ్ అబూబకర్ నజార్**

అనువాదం:

**అబ్దుల్ వాహెద్**

**హాఫిజ్ ఎస్.ఎమ్. రసూల్ షర్ఫీ**



ప్రకాశకులు

**శాంతి మార్గం పబ్లికేషన్ ట్రస్ట్,**

**హైదరాబాద్**

https://teluguislam.net

**Qur'an Katha Maalika**
**Selected Stories from Qur'an (Telugu)**

Written by : Sheikh Abubaker Najaar

Telugu Translation : Abdul Wahed
Hafiz S.M. Rasool Sharfi

© *All Rights Reserved with Publishers*

First Edition : February 2010

Second Edition : August 2010

Copies : 2000

Hadya : Fee Sabeelillah

DTP & Printing : Al-Baseer Graphics, Hyd.
9441055065

Published by : **Shanti Margam Publication Trust**
16-2-867/10, Akbar Bagh,
Sayeedabad, Hyderabad-500 059.
Cell : 9676144697
E-mail: shantimargam@gmail.com



*అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం*

## మా మాట

ఖుర్‌ఆన్ గ్రంథం ఎంత ప్రామాణికమో, అందులో ప్రస్తావించబడిన కథలూ అంతే ప్రామాణికం. వాటిలో అతిశయం ఉండదు. అవాస్తవాలు అసలే ఉండవు!

ఆది కాలం నుంచి ఈ సువిశాల ప్రపంచంలో సహజీవనం సాగిస్తున్న మానవ సమాజానికి సన్మార్గం చూపించేందుకు, స్వయానా మానవ సముదాయం నుంచే ఎంతో మంది దైవప్రవక్తలు ఉద్భవించారు. అయితే ఆ ప్రవక్తల తదనంతరం వారి పట్ల దురభిమానం వల్ల వారి అనుయాయుల్లో వెర్రి పోకడలు తలెత్తిన ఉదాహరణలు జగచ్చరిత్రలో కోకొల్లలు. ప్రవక్తలు అసలు మానవులే కారన్న ఒక మూఢ వాదన ప్రజల మనోమస్తిష్కాల్లో జీర్ణించుకుపోయి ఉండటం అందుకు ప్రధాన కారణం. ఫలితం మన కళ్ల ముందు స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. తమకు మార్గం తెలియజేసిన ప్రవక్తలను ప్రజలు మానవాతీత వ్యక్తులుగా, దైవశక్తి స్వరూపులుగా ఊహించుకున్నారు. తమకు విధిని ప్రబోధించిన సజ్జనులే సృష్టి విధాతలంటూ వితండవాదం చేశారు. తమను సన్మార్గంలో నడిపించిన సందేశహరులే, సాక్షాత్ భగవత్ స్వరూపులంటూ సృష్టికర్త అభీష్టాన్నే అపహాస్యం చేశారు.

దైవప్రవక్తల్లో లేని శక్తులను వారికి అంటగట్టి వారిని ఆకాశానికి ఎత్తేయటం ఒక దారుణమయితే, వారి కుహనా అనుచరులు తమ ప్రవక్తల సౌశీల్యానికి ఏ మాత్రం శోభించని అవాకులు చెవాకులు పేలటం - ప్రపంచం చవిచూసిన మరో చేదు చారిత్రక వాస్తవం. మానవాళికి అన్ని విధాలా ఆదర్శప్రాయులైన ప్రవక్తల గురించి వారి స్థాయికి అవనతమైన, అమర్యాదకరమైన చారిత్రక వక్రీకరణలతో పుస్తకాలు ప్రచురించటం ఒక దురదృష్టకర పరిణామం. అందునా దైవగ్రంథాలుగా చెలామణీ అవుతున్న మత పుస్తకాల్లో ఇటువంటి వక్రీకరణలు చోటు చేసుకోవటం మరింత హృదయ విదారక విషయం. ★

పై రెండు రకాల కథనాలకూ ఖుర్‌ఆన్ చెక్ పెట్టేసింది. మానవ కల్పనల మూలంగా మత గ్రంథాల్లో చోటు చేసుకున్న అసత్యాలను, అర్థసత్యాలను

★ *అటువంటి సందర్భాలను మచ్చుకు కొన్నింటిని ఈ పుస్తకంలోని 54, 129 పేజీల్లో పేర్కొనటం జరిగింది.*

https://teluguislam.net



సయితం అది ఎండగట్టింది. ప్రజలు ఇకపై ప్రవక్తల, పుణ్యాత్ముల, మహాత్ముల పట్ల విపరీతమైన అభిమానంలోగాని లేక విద్వేషంలోగాని వెర్రితలలు వేయ కుండా ఖుర్‌ఆన్, హదీసుల రూపంలో సహేతుకమైన విధానానికి, న్యాయ వంతమైన నియమావళికి పునాదులను పటిష్టం చేసింది.

అటువంటి ప్రామాణిక గ్రంథమైన దివ్యఖుర్‌ఆన్‌లోని కథలన్నిటినీ ఏరి, మాలగా కూర్చి రూపొందించినదే ఈ అందమైన **"ఖుర్‌ఆన్ కథామాలిక"**. దివ్య ఖుర్‌ఆన్ విచార ధారను కుంచెగా చేసుకుని, ప్రవక్త ప్రవచన వన్నెలతో, ఇస్లాం భావ సౌరభ స్ఫూర్తితో, స్వచ్ఛమైన చారిత్రక పత్రాలపై రమణీయంగా రూపుదిద్దు కున్న ప్రకృతిసిద్ధ కథా చిత్ర సమాహారం.

రచయిత షేఖ్ అబూ బకర్ నజార్ ఈ పుస్తక రూపకల్పన కోసం దాదాపు ఖుర్‌ఆన్, హదీసుల మీదనే ఆధారపడ్డారు. అయితే ప్రవక్తల జీవిత చరిత్రలను, వాటి లోతుల్లోకి వెళ్ళి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని అభిలషించినప్పుడు - ఆయా కథల్లోని వ్యక్తుల పేర్ల కోసం, కథలోని వివిధ సంఘటనల మధ్య సాపేక్షిక సంబంధాల కోసం ఇస్లామీయ చరిత్రకారులు తౌరాత్ వంటి మత గ్రంథాల్లోని ప్రామాణికమైన ఉల్లేఖనాలపై ఆధారపడటం సహజమే. ఎవరో ఎందుకు? సుప్రసిద్ధ ఇస్లామీయ విద్వాంసులు, జగమెరిగిన ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన పండితులు హాఫిజ్ ఇబ్నె కసీర్ (రహ్మలై) గారు తన వ్యాఖ్యాన గ్రంథంలో అవసరం మేరకు అటువంటి ఇస్రాయీలీ ఉల్లేఖనాలను పొందుపరిచారు. అయితే అటువంటి వివరణలను సయితం దివ్యఖుర్‌ఆన్, దైవప్రవక్త ప్రవచనాల వెలుగులో పరికించి, పరిశోధించి అవి ఇస్లాం ధర్మ సమగ్ర స్ఫూర్తికి విరుద్ధంగా లేవని నిర్ధారించుకున్న మీదటే వాటిని రచయిత తన రచన కోసం ఎంచుకోవటం ఈ పుస్తకం ప్రత్యేకత.

దివ్యఖుర్‌ఆన్‌లో గల వివిధ గాథల నేపథ్యాన్ని అర్థం చేసుకోవటంలో దోహద పడుతుందని భావించి, ఆంగ్లమూలమైన ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదింపజేసి ప్రచురిస్తోంది **శాంతిమార్గం పబ్లికేషన్స్ ట్రస్ట్**.

ఈ కృషిని ఆమోదించి, ఇందులో పాలుపంచుకున్న వారందరికీ ఇహ లోకంలోనూ, పరలోకంలోనూ ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించాలని అల్లాహ్‌ను కోరుకుంటూ.....

**- ప్రకాశకులు**



# నాలుగు మాటలు ఈ పుస్తకం గురించి !

'అల్లాహ్ గ్రంథాన్ని అర్థం చేసుకోవటం ఇక చాలా తేలిక' అన్న ఓ సరికొత్త స్ఫూర్తి వచనంతో పాఠకులకు పరిచయం అవుతున్న ఈ 'ఖుర్‌ఆన్ కథామాలిక' పుస్తకం నిజంగా ఖుర్‌ఆన్ అవగాహనను ఎంతమటుకు తేలికపరుస్తుంది? అన్నది తెలుసు కోవటం పాఠకులకు ఎంత ముఖ్యమో, అది ఏ విధంగా సాధ్యమనేది వారికి తెలియ జేయటం ప్రకాశకులకూ అంతే ముఖ్యం. ఆ పరస్పర అవగాహన నిమిత్తం రాయ బడుతున్నవే ఈ నాలుగు మాటలు.

మనందరికి అనుభవైక విషయమే ఇది. ఖుర్‌ఆన్ పఠనంలో మనకు కొన్ని కొన్ని సందర్భాలు ఎదురవుతూ ఉంటాయి. ఖుర్‌ఆన్ బోధనా శైలి అక్కడ విషయాన్ని చాలా క్లుప్తంగా వివరించి ముందుకు సాగిపోతుంది. సందర్భానికి అవసరమైన అంశాలను మాత్రమే ప్రస్తావిస్తుంది. ఉదాహరణకు, రెండవ సూరా అయిన అల్ బఖరాలోని 67 నుంచి 74 వాక్యాల్లో ఒక ఆవుదూడ గురించిన కథ ప్రస్తావనకు వచ్చింది. ఆ కథ ఏమిటంటే -

ఇస్రాయీల్ జాతివారికి అల్లాహ్ ఒక ఆవును జిబహ్ చేయమని ఆజ్ఞాపిస్తాడు. అయితే ఆ ఆవు రూపురేఖలు ఎలా ఉండాలో తమకు తెలియజేయాలని ఇస్రాయీల్ జాతివారు మూసా ప్రవక్త (అస)ను కోరుతారు. మూసా ప్రవక్త వారికి కొన్ని సూచనలు చెప్పినప్పటికీ వారు, తమకు మరిన్ని గుర్తులు కావాలని మూసా ప్రవక్త (స) పట్ల చాలా మూర్ఖంగా ప్రవర్తిస్తారు. ఎట్టకేలకు వారు ఒక ఆవును కోస్తారు. ఆ ఆవు మాంసంలోని ఒక ముక్కను అదే రోజుల్లో హత్యకు గురికాబడిన ఒక మనిషి మృతదేహానికి తాకించమని అల్లాహ్ వారికి ఆజ్ఞాపిస్తాడు.

ఆవు కథ అంతటితో ముగిసిపోతుంది. ఖుర్‌ఆన్ ఇవ్వ దలచిన హితబోధ కూడా పాఠకునికి సంతృప్తిగా లభిస్తుంది. కాని 'కథ' అన్న తర్వాత దాని పూర్వాపరాలను తెలుసుకో వాలని పాఠకులు వాంఛించటమూ సహజమే. కనుక -

అల్లాహ్ అసలు ఇస్రాయీల్ జాతివారికి ఆవును జిబహ్ చేయమని ఆజ్ఞ ఎందుకు ఇచ్చాడు? ఇస్రాయీల్ జాతివారు మూసా ప్రవక్త (అస)కు వేసిన యక్షప్రశ్నల లోగుట్టు ఏమిటి? చివరికి వారు ఆవును ఎలా జిబహ్ చేయ గలిగారు? ఆ ఆవు వారికి ఎక్కడ లభించింది? జిబహ్ చేయబడిన ఆవు మాంసపు ముక్కను హతుని దేహానికి తగిలించమని అల్లాహ్ ఆజ్ఞాపించటం వెనుక మర్మం ఏమిటి? మొదలగు ప్రశ్నలు పాఠకుని మనసులో నశేషంగానే ఉండిపోతాయి.

https://teluguislam.net



అటువంటి సందర్భాల్లో ఖుర్‌ఆన్ వ్యాఖ్యానకర్తలు ఆయా కథలకు సంబంధించిన పూర్వాపరాలను ప్రామాణిక చారిత్రక గ్రంథాల నుంచి వెలికి తీసి తమ తఫ్సీర్ గ్రంథాలలో పొందుపరచటానికి ప్రయత్నిస్తారు. ఆ విధంగా వివిధ ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన పండితులు ఖుర్‌ఆన్ కథల గురించి ప్రస్తావించిన విశేషాలన్నింటినీ ఏర్చికూర్చి తయారు చేసినదే ఈ ఖుర్‌ఆన్ కథామాలిక. పైన పేర్కొనబడిన ఆవుదూడ కథ సాంతం ఈ పుస్తకంలోని 111 - 114 పేజీల్లో మీకు ఒకేచోట లభిస్తుంది. అదే ఈ పుస్తకం ప్రత్యేకత.

మరో ఉదాహరణ చూద్దాం. అల్ బఖర (రెండవ) సూరాలోనే 259వ వాక్యంలో ఒక కథ ఈ విధంగా ప్రస్తావనకు వచ్చింది:

ఒకాయన పాడుబడిన ఒక నగరం గుండా వెళ్తుంటాడు. ఆ నగరం మొత్తం సర్వనాశనమై ఉంటుంది. ఆయన అక్కడి ప్రజలను గురించి ఆలోచిస్తూ, "మరణించిన వారిని అల్లాహ్ తిరిగి ఎలా బ్రతికిస్తాడా?" అని సందేహపడతారు. అప్పుడు అల్లాహ్ ఆయనకు మృత్యువునిస్తాడు. దాంతో ఆయన చనిపోతారు. వందేళ్ల దాకా అల్లాహ్ ఆయన్ని అదే స్థితిలో ఉంచుతాడు. తర్వాత ఆయన్ని తిరిగి బ్రతికించి, నువ్వు ఎంతకాలం నిద్రపోయావని అల్లాహ్ ఆయన్ని అడుగుతాడు. దానికి ఆయన సరిగ్గా సమాధానం చెప్పలేకపోతారు. అప్పుడు అల్లాహ్ ఆయనకు వాస్తవాన్ని సాక్ష్యాధారాలతో సహా తెలియజేస్తాడు.

ఇంతటితో ఆ కథ ముగుస్తుంది. అల్లాహ్ తాను మానవులకు చెప్పాలనుకున్నది మూడు ముక్కల్లో చెప్పేశాడు. ఖుర్‌ఆన్ ద్వారా హితబోధ గ్రహించాలనుకునే వారికి ఆ క్లుప్త వివరణ చాలు. అయితే -

ఆ కథ పూర్వాపరాలు కూడా కొన్ని ఉంటాయి కదా?! అసలు ఆ వ్యక్తి ఎవరు? ఆయన పేరేమిటి? ఆయన ఏ కాలంనాటి వారు? ఏ ప్రాంతం గుండా వెళుతున్నప్పుడు ఈ సంఘటన జరిగింది? వందేళ్ళ తరువాత ఆయన మేల్కొన్నప్పుడు జరిగిన పరిణామాలేమిటి? అప్పటికి ఆయన కుటుంబ పరిస్థితులు ఎలా తయారయ్యాయి? మొదలగు వాటి గురించి తెలుసుకోవాలంటే పాఠకులు వ్యాఖ్యాన (తఫ్సీర్) గ్రంథాలను సంప్రతించవలసి ఉంటుంది. అదే ఈ పుస్తకంలోనయితే ఆ కథ మొత్తం 159వ పేజీలో మీకు లభిస్తుంది.

ఇక మూడో ఉదాహరణకు వద్దాం.

హాబిల్ - ఖాబిల్ కథ. ఇది మాయిదా (5వ) సూరాలోని 27 నుంచి 31 వాక్యాల్లో ఉంది.



ప్రవక్త ఆదంకు ఇద్దరు కుమారులు ఉండేవారు. ఏదో విషయంలో వారిద్దరికి మధ్య తగాదా వస్తుంది. వారిరువురూ అల్లాహ్‌కు నజరానా సమర్పించుకుంటారు. ఒకరిది స్వీకరించబడుతుంది. ఇంకొకరిది తిరస్కరించబడుతుంది. క్రమంగా వారిద్దరి మధ్య విద్వేష భావాలు రాజుకుంటాయి. వారిలో ఒకడు ఇంకొకడిని చంపుతానని బెదిరిస్తాడు. ఆఖరికి అదే జరుగుతుంది. ఆ సోదరుల్లో ఒకడు ఇంకొకడిని హత్య చేస్తాడు. రెండవ వాడు మాత్రం చివరి దాకా సహనంతోనే వ్యవహరిస్తాడు. అది భూమిపై జరిగిన మొదటి హత్య. కాబట్టి ఆ శవాన్ని ఏం చేయాలో హంతకునికి అర్థం కాదు. రెండు కాకుల్ని చూసి శవాన్ని పూడ్చిపెట్టే పద్ధతి నేర్చుకున్న అతను తన నిస్సహాయతకు సిగ్గుతో కుమిలి పోతాడు.

ఖుర్‌ఆన్ చెప్పదలచుకున్న కథ ఇంతటితో పూర్తయినట్టే. కాని ఈ సందర్భంగా ఆసక్తికరమైన మరెన్నో ప్రశ్నలకు తావుంటుంది.

ఆదం గారి ఆ ఇద్దరు కుమారుల పేర్లేమిటి? అసలు ఏ విషయం కారణంగా వారి మధ్య విద్వేషం రగులుకుంది? ఆనాటి కుటుంబ స్థితిగతులేమిటి? మొదలగు ప్రశ్నల షరా మామూలే. వాటి గురించి పాఠకులు పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే వ్యాఖ్యాన గ్రంథాలైనా చదవాలి లేదా 'ఖుర్‌ఆన్ కథామాలిక' లాంటి పుస్తకాలనయినా సంప్రతించాలి. ఈ పుస్తకంలోని 8, 9 పేజీల్లో పై కథ మొత్తం వివరంగా ఉంది.

చివరగా మరొక్క ఉదాహరణతో విషయాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిద్దాం. అల్ ఖలమ్ (68వ) సూరాలో 17 నుంచి 28 వరకు గల వాక్యాల్లో తోటవారి గురించి ఒక ఆసక్తికరమైన కథ ప్రస్తావనకు వచ్చింది:

ఒక తోట యజమానులైన అన్నదమ్ములు తెల్లవారు జామునే తోటకు వెళ్ళి పండ్లను కోసుకోవాలని నిశ్చయించుకుంటారు. అయితే అనుకోకుండా ఆ రాత్రి, వారు నిద్రపోతున్న సమయంలోనే వారి తోట పెనుముప్పుకు గురై సర్వనాశనమైపోతుంది. తెల్లవారిన తర్వాత తోటకెళ్ళి చూస్తే, అక్కడ ఏమీ మిగులుండదు. అప్పుడు వారు, తాము అల్లాహ్ ఆదేశానికి, ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించామని గ్రహించి వాపోతారు. అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాపపడతారు.

దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ కథ దాదాపు ఇంతే ఉంది. అయితే-

ఈ తోటవారు ఎవరు? దివ్యఖుర్‌ఆన్ ప్రత్యేకంగా ఎవరిని ఉద్దేశించి ఈ మాటలు చెప్పింది? వారు ఏ కాలం వారు? ఆ కథ గురించిన పూర్తి సమాచారం ఏమిటి? మొదలగు ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు పాఠకులకు ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన గ్రంథాల్లో మాత్రమే లభిస్తాయి.

https://teluguislam.net



ఈ విధంగా ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన గ్రంథాల్లో చెదురుమదురుగా ప్రస్తావితమై ఉన్న చిన్న చిన్న చారిత్రక విశేషాలను ప్రామాణికమైన ఉల్లేఖనాల వెలుగులో విశ్లేషించి, విశదీకరించి, కాలానుగుణంగా కూర్చి, ఓ చక్కటి కథాసంపుటిగా తయారు చేయటా నికి జరిగిన కృషి ఫలితమే ఈ 'ఖుర్‌ఆన్ కథామాలిక' పుస్తకం!

**మరొక్క మనవి!**

ఈ పుస్తకం కేవలం ఇస్లామీయ నేపథ్యంతో రాయబడిన ఒక చారిత్రక పుస్తకం మాత్రమే. ఇస్లాం దృష్టిలో చరిత్ర వేరు. హదీసు వేరు. యావత్ చరిత్రను ఖుర్‌ఆన్ మరియు దైవప్రవక్త (స) వారి ప్రవచనాల ధర్మకాంటాపై సరితూచి, అందులోని అణు వణువునూ పరిశీలించి, పరిశోధించిన మీదట సత్యాలుగా స్థిరపడినవి 'హదీసులు' అయితే మిగిలిన ముడి సరుకు మొత్తం చరిత్రగానే తలపోయబడుతుంది. ఇస్లాం దృష్టిలో హదీసులకు పటిష్టమైన ఆధారాలు ఉంటాయి. కాని చరిత్రకు అంత పటిష్ట మైన ఆధారాలు ఉండకపోవచ్చు. అయితే ఖుర్‌ఆన్ హదీసులకు వ్యతిరేకంగా లేనంత వరకూ అటువంటి చారిత్రక అంశాలను గ్రహించటంలో తప్పు లేదన్నది పండితుల ఏకాభిప్రాయం.

అటువంటప్పుడు చరిత్రలోని ప్రతి అంశం ఖుర్‌ఆన్ మరియు ప్రామాణిక హదీసుల్లోనిదే అయి వుండాలని గిరి గీస్తే ఖుర్‌ఆన్‌లోని చాలా కథలను మనం సంపూ ర్ణంగా అర్థం చేసుకోలేక పోవచ్చు. వివిధ కథల్లోని వ్యక్తుల పేర్లు, స్థలాలు, ప్రాంతాల పేర్లు, ఖుర్‌ఆన్ పేర్కొన్న అనేక సంఘటనల మధ్య సాపేక్షిక సంబంధం మొదలగు వాటి కోసం, ఎంతో సుసంపన్నమైన హదీసు సంపదతో పాటు, ఇస్రాయీల్ జాతివారి ఉల్లేఖనాల మీద కూడా కొంతవరకు ఆధారపడక తప్పని పరిస్థితి చరిత్ర గ్రంథాల రూపకల్పనలో ఉంటుంది. అయితే అందులోనూ మన రచయిత షేఖ్ అబూ బక్ర్ నజార్ గారు ప్రతి అంశాన్ని ఖుర్‌ఆన్ హదీసుల వెలుగులో అన్ని విధాలా పరిశీలించి, పరిశోధించిన మీదటే ఈ పుస్తకంలో వాటిని పొందుపరచారు. అదీ ఈ పుస్తకం ప్రత్యేకత. దీనిని చదువుతున్నప్పుడు పాఠకులు సయితం పై విషయాలన్నిటినీ దృష్టిలో పెట్టుకొని మసలుకోగలరని ఆశిస్తున్నాము.

మేము చేసిన ఈ చిరుకృషికి స్వీకృతిని ప్రసాదించి, ఈ సత్కార్యంలో పాలు పంచుకున్న వారందరికీ ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించాలని అల్లాహ్‌ను వేడుకుంటూ..............

**– ఎస్.ఎమ్. రసూల్ షర్ఫీ**

# కథా సూచిక

## మొదటి విభాగం


| | |
|---|---|
| సృష్టి కథ | 1 |
| ప్రవక్త ఇద్రీస్ (అలైహిస్సలాం) | 12 |
| ప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) | 14 |
| ప్రవక్త హూద్ (అలైహిస్సలాం) | 21 |
| ప్రవక్త సాలిహ్ (అలైహిస్సలాం) | 25 |


## రెండవ విభాగం


| | |
|---|---|
| ప్రవక్త ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) | 30 |
| ప్రవక్త లూత్ (అలైహిస్సలాం) | 50 |
| ప్రవక్త ఇస్‌హాక్ (అలైహిస్సలాం) | 55 |
| ప్రవక్త యాకూబ్ (అలైహిస్సలాం) | 57 |
| ప్రవక్త యూసుఫ్ (అలైహిస్సలాం) | 60 |
| ప్రవక్త షుఐబ్ (అలైహిస్సలాం) | 81 |


## మూడవ విభాగం


| | |
|---|---|
| ప్రవక్త మూసా (అలైహిస్సలాం) | 83 |
| మార్గదర్శి ఖిజర్ (అలైహిస్సలాం) | 106 |
| దైవమార్గంలో వదలివేయబడిన ఆవుదూడ | 111 |
| మహా సంపన్నుడు ఖారూన్ | 115 |
| తాలూత్ (మహారాజుగా మారిన పశువులకాపరి) | 118 |
| ప్రవక్త దావూద్ - జాలూత్ (డేవిడ్ & గోలియత్) | 123 |
| మధురస్వరం కలిగిన పాలకుడు | 127 |
| మహావివేకి లుఖ్మాన్ | 130 |
| 'సబ్బత్' నియమాన్ని అతిక్రమించడం | 133 |
| ప్రవక్త సులైమాన్ (అలైహిస్సలాం) | 136 |
| స్వార్థపరులైన సోదరులు(తోట వారి గాథ) | 147 |
| యహూదా -అతని సోదరుడు | 151 |
| ప్రవక్త యూనుస్ (అలైహిస్సలాం) | 155 |
| ఉజైర్ (అలైహిస్సలాం) | 159 |
| ప్రవక్త అయ్యూబ్ (అలైహిస్సలాం) | 163 |
| ప్రవక్త ఇల్యాస్ (అలైహిస్సలాం) | 171 |
| చెల్లాచెదరైన బనీఇస్రాయీల్ ప్రజలు | 173 |


## నాల్గవ విభాగం


| | |
|---|---|
| ప్రవక్త జకరియా (అలైహిస్సలాం) | 177 |

| | |
|---|---|
| నగర ప్రజలు-నలిపి చంపబడినవారు | 181 |
| మర్యమ్ ప్రవక్త ఈసా (అస)గారి మాతృమూర్తి | 184 |
| ప్రవక్త ఈసా (అస) జననం | 187 |
| క్రయిస్తవ విశ్వాసం (నేడు మనకు తెలిసిన విశ్వాసాలు) | 198 |
| జుల్‌ఖర్‌నైన్ (మహా సాహసవంతుడు) | 204 |
| కొండ గుహ వారు | 207 |
| **ఐదవ విభాగం** | |
| తున్‌నువాస్ | 212 |
| అగ్ని అఖాతాల ప్రజలు | 214 |
| సబా రాజ్యం | 218 |
| అబ్రహా (ఏనుగుల వాళ్ళ గాథ) | 220 |
| **ఆరవ విభాగం** | |
| ఇస్లామీయ యుగం | 225 |
| ఇస్రా (రాత్రి ప్రయాణం) | 239 |
| వలస (హిజ్రత్) | 243 |
| బద్ర్ యుద్ధం | 250 |
| పరిహారం | 264 |
| ఖుబైబ్ (చిత్రవధకు గురైన కవి) | 268 |
| ఉహుద్ యుద్ధం | 271 |
| పొరబాటుగా జరిగిన ప్రతీకారం | 280 |
| శత్రు మూకలు (అహ్‌జాబ్) | 285 |
| ఇస్లాం విజయారంభం | 292 |
| ఒప్పందం | 302 |
| అబూ బసీర్ దైన్యస్థితి | 308 |
| విజయంలోనూ వినయం! | 319 |
| హునైన్ యుద్ధం | 325 |
| ముగ్గురు ముస్లింల బహిష్కారం | 331 |
| విశ్వాసుల మాతపై కపటుల నీలాపనిందలు | 337 |
| మస్జిదె జిరార్ - కపటుల మస్జిదు | 348 |
| ముబాహిలా | 351 |
| తప్పుడు సమాచారం | 356 |
| అల్ ముజాదిలా (వాదించిన మహిళ) | 359 |
| అత్ తహ్‌రీమ్ (నిషిద్ధం) | 364 |
| జైనబ్ జహష్ కుమార్తె (రజియల్లాహు అన్హా) | 368 |


https://teluguislam.net



మొదటి విభాగం

# సృష్టి కథ

(చరిత్ర పూర్వయుగం నుంచి ప్రవక్త సాలిహ్ (అస) వరకు గల కాలం)



విశ్వాసులు నిల్చుని, కూర్చుని, తమ పడకలపై ఒత్తిగిలి అల్లాహ్‌ను స్మరిస్తూ ఉంటారు. భూమ్యాకాశాల సృష్టి గురించి యోచన చేస్తూ ఉంటారు. వారిలా అంటారు: "మా ప్రభూ! నువ్వు ఈ సృష్టిని నిరర్థకంగా చేయలేదు. నువ్వు పవిత్రుడవు. మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుంచి కాపాడు."
(ఖుర్ఆన్ 3 : 191)

దివ్యఖుర్ఆన్ మనిషికి చక్కగా అర్థమయ్యేలా ప్రతి విషయాన్ని విడమర్చి చెబుతుంది. అవసరమైన గుర్తులు, ఉదాహరణలు, చారిత్రక సంఘటనల ద్వారా మనిషికి అవగతమయ్యేలా వివరిస్తుంది. నిత్యజీవితంలో మనిషి చూసే, వినే, అనుభూతి చెందే లేదా ఊహించే ఉదాహరణల, గుర్తుల ద్వారానే దివ్యఖుర్ఆన్ మనిషికి అవసరమైన మార్గదర్శకత్వాన్ని ప్రసాదిస్తుంది.

జీవం, పదార్థాల పుట్టుక గురించిన వివిధ సిద్ధాంతాలన్నింటిని ప్రస్తావించడం ఈ పుస్తకం పరిధిలో సాధ్యం కాదు. చాలా మంది భావిస్తున్నట్లు బిలియన్ల సంవత్సరాలకు పూర్వం రోదసీలో సంభవించిన మహాప్రేలుడు వల్ల సేంద్రీయ పదార్థాలు (ఆర్గానిక్ మెటీరియల్) విశ్వంలో విరజిమ్మబడడం వల్ల సృష్టి పరిణామక్రమం ప్రారంభమయ్యిందా లేక మరో విధంగా సృష్టి పరిణామక్రమం చోటుచేసుకుందా అన్నది వివరించే వివిధ సిద్ధాంతాలపై చర్చించడం ఇక్కడ సాధ్యం కాదు. కాని ఈ సిద్ధాంతాలు వివరించే సంఘటనలకు పూర్వం ఉనికిలో ఉన్న పదార్థానికి కూడా ఏదో ఒక ప్రారంభం ఉండి తీరాలన్నది అందరూ గమనించవలసిన వాస్తవం (అంటే "బిగ్‌బాంగ్" జరుగక ముందు సంకోచించిన ఆ పదార్థానికి కూడా ఒక పుట్టుక ఉండాలి కదా).

https://teluguislam.net



అయితే సృష్టి ప్రారంభానికి సంబంధించిన వివిధ దశలను, యుగాలను, రోజులను గురించి దివ్యఖుర్‌ఆన్ ప్రస్తావిస్తుంది. రోదసీ శాస్త్రం (కాస్మాలజీ), సముద్ర శాస్త్రం (ఓషనాలజీ), ఖగోళ శాస్త్రం (ఆస్ట్రానమీ), చివరకు గర్భస్థపిండ అధ్యయనం (ఎంబ్రియాలజీ) గురించిన ప్రస్తావనలు కూడా ఈ సందర్భంగా మనకు దివ్యఖుర్‌ఆన్‌లో కనబడతాయి.

పధ్నాలుగు వందల సంవత్సరాల క్రితమే తల్లి గర్భంలో పిండం పరిణామ క్రమాన్ని ఖచ్చితంగా దివ్యఖుర్‌ఆన్ ఎలా వివరించిందన్నది నేడు వైద్యశాస్త్రాన్ని ఆశ్చర్యపరచే విషయం. ఆధునిక వైద్యపరికరాలు అందుబాటులో లేని కాలంలో, ఒక నిరక్షరాస్యుడైన వ్యక్తి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విషయానికి సంబంధించి మార్పులు చేర్పులకు గురయిన మతగ్రంథాల వల్ల ఏర్పడిన అపోహలను చక్కదిద్దడం జరిగింది. జీవపరిణామక్రమాన్ని కూడా దివ్యఖుర్‌ఆన్ ఈ సందర్భంగా ప్రస్తావించింది. జీవావిర్భావానికి సంబంధించిన మట్టి, నీరు (వీర్యం, వీర్య సంబంధిత ద్రవాల) గురించి కూడా తెలిపింది.

## సృష్టికర్త

విశ్వం, విశ్వంలోని సమస్తం ఏదీ సృష్టించబడక ముందు వీటన్నింటిని సృష్టించిన సృష్టికర్త ఉన్నాడని విశ్వసించడం హేతుబద్ధమైన ఆలోచన. ఆయన నిత్యుడు, ఆద్యంత రహితుడు, సాటిలేనివాడు, ఆయన్ను పోలినవారు మరొక రెవ్వరూ లేరు. ఆయన్నే దివ్యఖుర్‌ఆన్ అల్లాహ్ అని ప్రస్తావించింది. అంటే దేవుడు, ఆరాధనకు అర్హుడైన ఏకైక దైవం.

## ప్రపంచాలు

నేల, సముద్రాలు కలసిన ఈ భూప్రపంచం అనేక ఇతర ప్రపంచాలలో ఒకటి. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, ఇతర గ్రహాలు ఇలా మనం లెక్కపెట్ట లేనన్ని ఖగోళాలు ఉన్నాయి. ఇవన్నీ కలసి విశ్వంగా ఏర్పడ్డాయి. ఒకప్పుడు ఇదంతా ఒక చాలా పెద్ద ఖాళీ ప్రదేశం అని, పొగ వంటి వాయువులతో నిండిన ప్రదేశం అని దివ్యఖుర్‌ఆన్ తెలుపుతోంది.

## ఆకాశాలు

ఆకాశాలు ఈ విశ్వంలో మరొక ప్రదేశానికి, మరొక స్థితికి చెందినవి. ఇందులో స్వర్గనరకాలు ఉన్నాయి. స్వర్గంలో ప్రతిదీ సుందరంగా ఉంటుంది.



శాంతియుతంగా ఉంటుంది. నరకం దీనికి విరుద్ధమైనది. ప్రతిదీ వికారంగా ఉంటుంది. దహించే అగ్ని ఉంటుంది. అది శాశ్వత దుఃఖబాధల నిలయం. దివ్యఖుర్‌ఆన్ ఈ రెండు ప్రదేశాలను మనిషి మస్తిష్కం అర్థం చేసుకునే వర్ణనలతో వివరించింది.

## ఇతర జీవం

అల్లాహ్ ప్రపంచాలను రెండు దశలుగా సృష్టించాడు. మనిషిని సృష్టించడానికి చాలా ముందుగానే వీటిని సృష్టించడం జరిగింది. ఇందులో సమస్త జీవవిశేషాలను (జంతువులు, చెట్టుచేమలు వగైరా) లక్షలాది రకాల వాటిని నీటి ద్వారా నాలుగు దశలుగా సృష్టించడం జరిగింది.

## జంటలు

అల్లాహ్ ప్రతిదీ జంటలుగా సృష్టించాడు. జంతువులను, చెట్టుచేమలను లేక నిర్జీవ పదార్థాలను (మనకు జీవం లేనివిగా కనిపించే రాళ్ళు వగైరాలను అన్నింటినీ) ఆయన జంటలుగానే సృష్టించాడు. మానవులను మాత్రమే కాదు, ప్రకృతి శక్తులను కూడా జంటలుగా సృష్టించాడు. ప్రతి చోట పాజిటివ్, నెగిటివ్ శక్తులు ఉన్నాయి. రాత్రితోపాటు పగలు, పరమాణువులో ప్రోటాన్లతో పాటు ఎలక్ట్రాన్లు. ఇలాంటి ఉదాహరణలు మనకు చాలా కనబడతాయి.

## పోషణ.. సమతుల్యం

అల్లాహ్ అన్నింటికి పోషణను ప్రసాదించాడు. ప్రతి వస్తువు దానికి సంబంధించి అల్లాహ్ నిర్దేశించిన చట్టానికి(తఖ్‌దీర్‌కు) లోబడి పనిచేస్తోంది. అన్నీ ఖచ్చితమైన సమతుల్యానికి లోబడి ఉన్నాయి. దీనినే ప్రకృతి చట్టంగా లేదా 'అల్లాహ్ సంప్రదాయంగా' పిలుస్తాము. 'అహ్‌కామ్' (లేక ఆదేశాలు) అన్న పదం శాశ్వత నియమాలను సూచిస్తుంది. వీటిని అల్లాహ్ తప్ప మరెవ్వరూ మార్చలేరు.

## ఆకాశప్రాణులు లేదా శక్తులు

అల్లాహ్ వెలుతురు నుంచి దూతలను ('మలాయికా'ను) సృష్టించాడు అగ్ని నుంచి జిన్నులను సృష్టించాడు (ఇంగ్లీషులోని 'జీని' అన్న పదం అరబీ 'జిన్' పదం నుంచి పుట్టినదే). వీటన్నింటినీ తన ఆరాధన కొరకు సృష్టించాడాయన. ఈ ప్రాణులు అల్లాహ్ ఆదేశాలను తూ.చా. తప్పక పాటిస్తాయి. అయితే జిన్నుల

స్వభావం దైవదూతల స్వభావానికి భిన్నమైనది. జిన్నుల్లో మంచివి, చెడ్డవి ఉన్నాయి. మనిషి మాదిరిగా తమ నడవడికను ఎంచుకునే స్వేచ్ఛ వీటికి కూడా ఉంది. అందువల్ల తమ పనులకు గాను అల్లాహ్‌కు జవాబు చెప్పుకోవలసిన బాధ్యత కూడా వాటిపై ఉంది.

## మానవ సృష్టి

ఆ పిదప అల్లాహ్ మనిషిని సృష్టించాలని నిర్ణయించాడు. ఆయన దైవ దూతలతో ఈ విషయం చెప్పినప్పుడు వారు తమ వల్ల జరిగిన ఏదైనా పొరబాటు వల్ల అల్లాహ్ అసంతృప్తి చెందాడేమో అని భావించారు. తాము (దైవదూతలు) దేవుని ఆదేశాలను తూ.చా. తప్పక పాటిస్తున్నప్పుడు, భూమిపై కల్లోలాన్ని, రక్తపాతాన్ని సృష్టించే ప్రాణిని మీరు సృష్టిస్తారా అని వారు దేవుణ్ణి ప్రశ్నించారు. తాము కేవలం దేవుణ్ణి ఆరాధించడం తప్ప మరేదీ తెలియని వాళ్ళమని అన్నారు. అయితే అల్లాహ్ వారికి జవాబిస్తూ, "మీకు తెలియనిది నాకు తెలుసు. నేను కోరినది సృష్టిస్తాను. నేను కోరిన వారిని భూమిపై ప్రతినిధులుగా నియమిస్తాను. ఇప్పుడు అస్పష్టంగా ఉన్నది తర్వాత మీకు బోధపడుతుంది. నేను మనిషిని సృష్టించి అతణ్ణి సజీవంగా రూపొందించినప్పుడు మీరందరూ అతనికి సాష్టాంగ పడవలసి ఉంది" అన్నాడు.

ఆ విధంగా అల్లాహ్ ఆదం (అస)ను సృష్టించాడు. అంటే మనిషిని నల్ల మట్టితో సృష్టించాడు.* ఆదం (అస)ను సృష్టించిన అల్లాహ్, ఆత్మను అంటే దివ్యశక్తిని మనిషిలో ప్రవేశపెట్టాడు. మనిషి శరీరం ప్రాణం పోసుకుంది. ఆదం (అస) మొదటి మానవునిగా అవతరించారు. ఆ పిదప అల్లాహ్ ఆయన (అస)కు జ్ఞానాన్ని ప్రసాదించాడు. సృష్టిలోని మిగిలిన వాటన్నింటికన్నా ఎక్కువ జ్ఞానాన్ని ప్రసాదించాడు.

దైవదూతలకు ఉన్న జ్ఞానం తమ విధి బాధ్యతల పరిధికి పరిమితమైనది. కాని మనిషికి తన జ్ఞానాన్ని పెంపొందించుకునే శక్తిని ప్రసాదించడం జరిగింది. ఆ విధంగా మనిషి విశ్వంలోని చాలా విషయాలను అర్థం చేసుకునే సామర్థ్యం

★ *దివ్యఖుర్‌ఆన్ ప్రకారం, మనిషిని మట్టితో సృష్టించడం జరిగింది (సూరా 20 : 55 వగైరా). ఇక్కడ తలెత్తే ప్రశ్న ఏమంటే, మనిషిని సృష్టించడానికి ముందే దైవదూతలు మనిషి గురించి అతను కల్లోలం సృష్టించేవాడని, రక్తపాతం సృష్టిస్తాడని ఎలా చెప్పగలిగారు? ఆదం(అస)కు ముందు మరో విధమైన మానవ సృష్టి ఉండిందా? ఆ మానవ సృష్టి ఇలాంటి పనులకు పాల్పడిందా? అల్లాహ్‌కే బాగా తెలుసు.*

https://teluguislam.net



పొందాడు. అల్లాహ్ ఆదం (అస)కు భూమిపై ఉన్న అన్ని వస్తువుల స్వభావాన్ని బోధించాడు. ఆ తర్వాత అయా వస్తువుల స్వభావం గురించి మీకు తెలిస్తే చెప్పండని దైవదూతలను ప్రశ్నించాడు. దైవదూతలు జవాబిస్తూ, "సకల స్తోత్రాలు అల్లాహ్‌కే.. మీరు ఇచ్చిన జ్ఞానం తప్ప మాకు మరేదీ తెలియదు. సత్యమేమంటే మీకే సమస్తం తెలుసు" అన్నారు. ఆ పిదప అల్లాహ్ ఆదం (అస)తో వారికి ఈ వస్తువుల పేర్లు (లక్షణాలు, వాటికి సంబంధించిన సమాచారం) చెప్పమన్నాడు. ఆదం (అస) ఆయా వస్తువుల గురించి వివరించిన తర్వాత అల్లాహ్ దైవ దూతలతో, "నేను మీకు చెప్పలేదా.. నాకు భూమ్యాకాశాల సమస్త రహస్యాలు తెలుసని, మీరు పైకి చెప్పేవి, మీరు దాచేవి అన్నీ నాకు తెలుసని" అన్నాడు.

## తిరస్కారి ఇబ్లీస్

ఆదం (అస) ముందు సాష్టాంగపడమని అల్లాహ్ తన దూతలను ఆజ్ఞాపించాడు (అంటే మనిషి ఔన్నత్యాన్ని అంగీకరించమన్నాడు). వారందరూ వెంటనే ఆదేశాన్ని పాటించారు. కాని ఇబ్లీసు పాటించలేదు. ఇబ్లీసు ఆజ్ఞాపాలన చేయలేదు. తిరస్కారానికి పాల్పడ్డాడు. అల్లాహ్ ఇబ్లీసుతో నేను సృష్టించిన మనిషి ముందు సాష్టాంగపడడానికి నీకు అభ్యంతరమేమిటని ప్రశ్నించాడు. నీవు అంతటి అహంకారివా అన్నాడు. ఇబ్లీసు జవాబిస్తూ, "నేను మనిషికన్నా ఉన్నతుడిని, మీరు నన్ను అగ్ని నుంచి సృష్టించారు, ఇతడిని మట్టితో సృష్టించారు" అన్నాడు. (ఇబ్లీసు నిజానికి జిన్నులలోని వాడు. దైవదూతలలోని వాడు కాదు. కాని తన ఆరాధనలు, దైవభక్తి తత్పరతల ద్వారా దైవదూతల స్థాయికి చేరుకున్నాడు. కాని తిరస్కారానికి పాల్పడి తర్వాత దుష్టశక్తులకు నాయకుడైపోయాడు.)

## ఇబ్లీసుకు శిక్ష

తిరస్కారానికి పాల్పడిన ఇబ్లీసును అల్లాహ్ శిక్షించాడు. "ఇక్కడి నుంచి (అంటే స్వర్గవనం నుంచి, శాంతి సంతోషాల ప్రదేశం నుంచి)తొలగిపో. నీవు బహిష్కృతుడివయ్యావు. తీర్పుదినం వరకు నీపై నా అభిశాపం ఉంటుంది" అన్నాడు. ఇబ్లీసు తనకు వ్యవధి కావాలని కోరాడు. తీర్పుదినం వరకు జీవించే అనుగ్రహం కావాలని కోరాడు. అల్లాహ్ అతడి కోరికను మన్నించి నిర్ధారిత సమయం వరకు నీకు వ్యవధి ఇస్తున్నానన్నాడు.

https://teluguislam.net



ఇబ్లీసు తనకు లభించిన వ్యవధికి కృతజ్ఞత చెల్లించే బదులు మరింత తిరస్కారానికి పాల్పడ్డాడు. మీరు నాకు ఇచ్చిన ఈ వ్యవధిలో, మీరు ప్రసాదించిన ఉన్నత స్థానానికి మనిషి అర్హుడు కాదని నేను నా శక్తి మేరకు నిరూపిస్తానన్నాడు. మీ పట్ల మనిషి కృతఘ్నుతను, విశ్వాసరాహిత్యాన్ని నిరూపిస్తానన్నాడు. ఇబ్లీసు ఇప్పుడు మనిషిని మార్గం తప్పించడానికి పూర్తి స్వేచ్ఛను పొందాడు. మనిషిని అనుమానాల్లో పడవేయడానికి, అనుమానాల్లో పడిన మనిషిలో దుష్ట ఆలోచనలు రెచ్చగొట్టడానికి నడుం కట్టాడు. అయితే అల్లాహ్ మార్గాన్ని అనుసరించే వారిని మార్గం తప్పించడం ఇబ్లీసు వల్ల కాదని, కాని ఇబ్లీసు మార్గాన్ని అనుసరించిన వారు ఇబ్లీసుతో నరకాగ్నికి చేరుకుంటారని అల్లాహ్ చెప్పాడు.

## హవ్వా (అస) సృష్టి

ఆదం (అస)ను సృష్టించిన అల్లాహ్ ఆ తర్వాత ఆయన కొరకు ఒక సహచరిని (ఆయనకు భార్యను) సృష్టించాడు. ఆమెకు హవ్వా అని పేరు పెట్టడం జరిగింది. అల్లాహ్ అనుగ్రహాల పట్ల ఆదం (అస) అపరిమితానందం పొందారు. ఈ దంపతులు స్వర్గవనంలో నివసించడానికి అనుమతి పొందారు. స్వర్గంలోని సమస్తం అనుభవించే అనుమతి వారికి లభించింది. అయితే ఒక ప్రత్యేక వృక్షం దరిదాపుల్లోకి పోరాదని, దాని ఫలాలను తినరాదని వారిని నివారించడం జరిగింది. ఆ చెట్టు వద్దకు వెళ్ళి ఆ ఫలాలను తింటే అవిధేయతగా పరిగణించడం జరుగుతుందని హెచ్చరించడం జరిగింది. (నిషిద్ధ ఫలం పేరును దివ్యఖుర్‌ఆన్ తెలుపలేదు. ఆదం (అస)పై ఒత్తిడి తీసుకొచ్చేలా హవ్వాకు ఒక సర్పం ప్రలోభ పెట్టిందన్న ప్రస్తావన కూడా ఖుర్‌ఆన్‌లో లేదు. ఇందుకు సంబంధించిన ఎలాంటి సూచనలు కూడా ప్రామాణిక హదీసుల్లో లేవు.)

## ఇబ్లీస్ ప్రతీకారం

స్వర్గంలో ఆదం, హవ్వాలు సంతోషంగా ఉండడాన్ని చూసి ఇబ్లీసు భరించలేకపోయాడు. తాను స్వర్గం నుంచి బయటకు గెంటేయబడ్డాడు. కాని వాళ్ళు ఆనందంగా ఉన్నారు. ఇది భరించలేని ఇబ్లీసు వారి ఆనందాన్ని నాశనం చేయాలని నిర్ణయించాడు. తన దుస్థితికి కారణం మనిషే అని భావించాడు. మనిషి స్థాయి హోదాలను దిగజార్చడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవాలని భావించాడు. అందుకు ఒక పథకం వేశాడు.



ఆదం, హవ్వాల వద్దకు వచ్చాడు ఇబ్లీస్. వారు నిషిద్ధ ఫలాన్ని తింటే వారికి మరణం ఉండదని, ఎన్నటికీ అంతరించని స్వర్గవనాల్లో శాశ్వతంగా ఉంటారని చెప్పాడు. మొదట ఆదం(అస) ఇబ్లీసు మాటలు వినలేదు. కాని ఇబ్లీసు నిరాశ చెందకుండా ప్రయత్నించాడు. తీయతీయని మాటలతో మోసం చేయడంలో ఇబ్లీసు మహా నేర్పరి. ఆదం, హవ్వాలను ఇబ్లీసు మాటిమాటికి భయపెట్టడం ప్రారంభించాడు. వారు స్వర్గంలోని సుఖాలను కోల్పోతారని, ఆ చెట్టు ఫలం తినకపోతే వారికి ఈ సుఖసంతోషాలు శాశ్వతంగా దక్కవని నూరిపోశాడు. ఇబ్లీసు శతవిధాలా వారికి నచ్చజెప్పటానికి ప్రయత్నించాడు. అల్లాహ్‌పై ప్రమాణం చేస్తూ తాను చెప్పేది నిజమని అన్నాడు. వాడి మాయమాటలు ఆదం, హవ్వాలను ప్రభావితం చేశాయి. ఇబ్లీసు వేసిన వలలో వారు చిక్కుకున్నారు. నిషిద్ధ వృక్ష ఫలాన్ని తిన్నారు. ఆ వెంటనే వారికి తమ నగ్నత్వం అనుభూతికి వచ్చింది. సిగ్గుతో కుంచించుకుపోయి తమ శరీరాన్ని చెట్ల ఆకులతో కప్పుకున్నారు.

అల్లాహ్ వారికి తన మాటను గుర్తు చేశాడు. ఆ చెట్టు ఫలాలు తినవద్దని చెప్పాను కదా అన్నాడు. ఇబ్లీసు మీకు శత్రువని చెప్పిన విషయాన్ని కూడా గుర్తు చేశాడు. వారిద్దరూ తమ తప్పు ఒప్పుకుని పశ్చాత్తాపపడ్డారు. వారు అల్లాహ్‌ను వేడుకుంటూ, "ప్రభూ! మేము తప్పు చేశాము. మీరు మమ్మల్ని క్షమించకపోతే, మాపై దయచూపకపోతే మేము నిస్సందేహంగా నాశనమైపోతాము" అని ప్రాధేయపడ్డారు. ఇబ్లీసు ప్రలోభాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అల్లాహ్ వారిని మళ్ళీ హెచ్చరించాడు. వారి అవిధేయతను క్షమించాడు.

ఆదం, హవ్వాలతో అల్లాహ్ చెప్పిన మాట దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా ప్రస్తావితమయింది:

"మీరంతా ఇక్కడి నుండి దిగిపోండి. ఇకపై నా తరపు నుండి ఏదైనా ఉపదేశం మీ వద్దకు వచ్చినప్పుడు, నా ఈ ఉపదేశాన్ని అనుసరించే వారికి ఏ విధమైన భయం కానీ, విచారం కానీ కలిగే అవకాశం ఉండదు. దానిని స్వీకరించటానికి నిరాకరించేవారూ, మా వాక్యాలను అసత్యాలుగా కొట్టి పారేసే వారూ నరకాగ్నిలోకి పోతారు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు."

*(దివ్యఖుర్‌ఆన్ 2:38-39)*

## ఆదం (అస) కుమారులు ఖాబిల్, హాబిల్

దాంపత్య జీవితంలోని అత్యుత్తమ అనుగ్రహాన్ని ఆదం, హవ్వా దంపతులు

https://teluguislam.net



కవల పిల్లల రూపంలో పొందారు. ఆదం (అస) దైవభీతి కలిగిన తండ్రిగా, హవ్వా భర్త అడుగుజాడల్లో నడిచే తల్లిగా జీవితం కొనసాగించారు. కవల పిల్లల్లో మగపిల్లవాడు ఖాబిల్, అతని కవల సోదరి జన్మించారు. ఆ తర్వాత కొంత కాలానికి మళ్లీ హవ్వాకు కవల పిల్లలు జన్మించారు. హాబిల్ మగపిల్లవాడు, అతని కవల సోదరి జన్మించారు.

ఈ కుటుంబం భూమిపై దేవుని అనుగ్రహం వల్ల లభించే ఫలాలు, ఆహారం తింటూ ఆనందంగా గడుపసాగింది. పిల్లలు పెరిగి పెద్దవారయ్యారు. ఖాబిల్ సేద్యం చేయడం ప్రారంభించాడు. హాబిల్ పశువులను పెంచసాగాడు.

వారు యుక్తవయస్సుకు చేరుకున్నారు. వారికి తగిన జంటను ఇచ్చి పెళ్ళి చేయవలసిన వయసు వచ్చింది. అల్లాహ్ ప్రణాళికలో భాగంగానే ఇదంతా జరిగింది. ఎందుకంటే ఆ ఇద్దరు అమ్మాయిల్లో ఖాబిల్ సోదరి ఎక్కువ అందగత్తె. దైవాజ్ఞ ప్రకారం ఆ అమ్మాయి హాబిల్‌కు భార్య కావాలి. దీనికి భిన్నంగా తనకు కాబోయే భార్య(హాబిల్ సోదరి) అంత అందంగా లేకపోవటం ఖాబిల్‌లో అసంతృప్తిని రగిలించింది. మానవాళి విస్తరించడానికి వివిధ జాతులు, సంస్కృతులు ఏర్పడడానికి ప్రక్రియ ప్రారంభ మయ్యింది. అల్లాహ్ ఆదం (అస)ను ఆదేశిస్తూ తన కవల పిల్లల్లో మగపిల్లవాడికి మరో కవల పిల్లల్లోని ఆడపిల్లతో పెళ్లి చేయాలని చెప్పాడు. కాని ఖాబిల్‌కు ఈ ఏర్పాటు నచ్చలేదు. ఎందుకంటే ఆ ఇద్దరు అమ్మాయిల్లో ఖాబిల్ సోదరి ఎక్కువ అందగత్తె. దైవాజ్ఞ ప్రకారం ఆ అమ్మాయి హాబిల్‌కు భార్య కావాలి. దీనికి భిన్నంగా తనకు కాబోయే భార్య (హాబిల్ సోదరి ) అంత అందంగా లేకపోవటం ఖాబిల్‌లో అసంతృప్తిని రగిలించింది.

ప్రారంభం నుంచి శరీర సౌందర్యం అన్నది స్త్రీపురుషుల మధ్య ముఖ్యమైన ఆకర్షణగా ఉండింది. ఈ ఆకర్షణ ఖాబిల్‌లో ఈర్ష్యాసూయలను రెచ్చగొట్టింది. ఖాబిల్ అల్లాహ్ ఆదేశాలకు విరుద్ధంగా తిరస్కారానికి ఒడిగట్టాడు. తండ్రి సలహాను పాటించడానికి నిరాకరించాడు.

## మనిషి ద్వంద్వ ప్రవృత్తి

ఖాబిల్ తిరస్కారం మనకు కాస్త ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కాని మనిషికి స్వచ్ఛమైన ప్రవృత్తి ఉన్నప్పటికీ మనిషిలో అంతర్గతంగా "ద్వంద్వ ప్రవృత్తి" కూడా ఉంటుంది. అంటే మనిషిలో మంచితనంతో పాటు దానికి వ్యతిరేకమైన చెడు



కూడా దాగి ఉంటుంది. మనిషి అత్యాశాపరుడిగా, అసూయాపరుడిగా, స్వార్థ పరునిగా, విధ్వంసకారునిగా మారగలడు. అంటే, మనిషి అవసరమైతే తన సుఖసంతోషాల కోసం ఇహపర లోకాల సాఫల్యాన్ని కూడా నాశనం చేసుకోవడానికి వెనుకాడడు. మనిషి సాఫల్యానికి, సన్మార్గానికి కావలసినది మనిషి తనలో ఉన్న తన శత్రువును, అంటే, తనలో దాగి ఉన్న దుష్టత్వాన్ని, చెడు ఆలోచనలను, చేష్టలను నియంత్రించడం. తన ఆచరణలు, తన కోరికల విషయంలో మితాన్ని పాటించడం. అందుకు బదులుగా మనిషి ఇహలోకంలో, పరలోకంలో గొప్ప ప్రతిఫలాలను పొందుతాడు. అల్లాహ్ మనిషిని అతనిలో ఉన్న ద్వంద్వ ప్రవృత్తి ద్వారా పరీక్షిస్తున్నాడు.

## తండ్రికి ఎదురైన క్లిష్టపరిస్థితి

ఆదం (అస) క్లిష్టపరిస్థితిని ఎదుర్కొన్నారు. తన కుటుంబంలో శాంతి ఉండాలని ఆయన కోరుకున్నారు. కనుక సహాయం కొరకు దేవుణ్ణి వేడుకున్నారు. అల్లాహ్ ఆయన వేడుకోలును మన్నించాడు. ఆయన కుమారులిద్దరికి ఒక పరీక్ష పెట్టాడు. తనకు బలి సమర్పించమని వారిద్దరిని ఆదేశించాడు. ఎవరి బలి స్వీకరించబడుతుందో వారి ఇష్టప్రకారం జరుగుతుందని చెప్పాడు. హాబిల్ తన వద్ద ఉన్న అత్యుత్తమమైన ఒంటెను బలి ఇచ్చాడు. ఖాబిల్ తన వద్ద ఉన్న పనికి రాని మొక్కజొన్న సమర్పించాడు. ఖాబిల్ సమర్పించిన దానిని అల్లాహ్ స్వీకరించలేదు. హాబిల్ బలిని అల్లాహ్ స్వీకరించాడు. తన తండ్రి పట్ల అవిధేయత చూపినందుకు, దేవునికి సమర్పించే బలి విషయంలో నిజాయితీ లేకుండా వ్యవహరించినందుకు ప్రతిఫలంగా ఖాబిల్ బలి నిరాకరించబడింది. దీని వల్ల ఖాబిల్ మరింత రెచ్చిపోయాడు. అందమైన తన స్వంత సోదరిని తాను వివాహం చేసుకోవడం సాధ్యపడదని గ్రహించాడు. అతడు తన సోదరుడిని చంపేస్తానని బెదిరించాడు. తాను అసంతృప్తితో రగిలిపోతూ ఉండగా, తన సోదరుడు సంతోషంగా ఉండడాన్ని చూసి సహించేది లేదన్నాడు.

హాబిల్ తన సోదరుని పరిస్థితి చూసి బాధపడ్డాడు. తన సోదరునికి జవాబిస్తూ, "సోదరా! నీ అసంతృప్తికి కారణమేమిటో నువ్వు తెలుసుకుంటే బాగుంటుంది. ఆ తర్వాత నీవు శాంతిని పొందే మార్గంలో ముందుకు సాగగలవు. అల్లాహ్ తన పట్ల భయభక్తులు కలిగిన వారి ఆచరణలనే స్వీకరిస్తాడు" అన్నాడు.

హాబిల్ చాలా తెలివికలిగిన వాడు. విధేయత కలిగినవాడు. అల్లాహ్

https://teluguislam.net



ఆదేశాలను శిరసావహించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవాడు. కాని అతని సోదరుడు అందుకు పూర్తిగా విరుద్ధం. అతడు అహంభావి, స్వార్థపరుడు, అల్లాహ్ పట్ల అవిధేయత కలిగినవాడు. తన సోదరుని బెదిరింపులకు హాబిల్ భయపడ లేదు. అలాగే తన సోదరునికి హాని కలిగించాలని కూడా అతను భావించలేదు. అల్లాహ్ హాబిల్‌కు స్వచ్ఛమైన మనసును ఇచ్చాడు. పవిత్రమైన భావాలను ఇచ్చాడు.

## భూమిపై మొదటి హత్య

తన సోదరుని మనసులో చోటుచేసుకున్న విద్వేషాన్ని తగ్గించడానికి హాబిల్ ప్రయత్నిస్తూ, "సోదరా! నీవు సన్మార్గాన్ని వదలి దారి తప్పుతున్నావు. పాపాలకు దారి తీసే నిర్ణయాలు తీసుకుంటున్నావు. నువ్వు అల్లాహ్‌తో పశ్చాత్తాపం వేడు కోవడం మంచిది. నీవు మూర్ఖంగా చేసిన బెదిరింపులను మరచిపోవడం మంచిది. అలా కానట్లయితే నేను ఈ వ్యవహారాన్ని అల్లాహ్‌కే వదిలేస్తున్నాను. నీ పాపాల ప్రతిఫలాన్ని నీవే అనుభవించవలసి వస్తుంది. దుర్మార్గులకు నరకాగ్ని ప్రతిఫలంగా లభిస్తుంది" అన్నాడు. కాని ఖాబిల్‌లో తిష్ఠవేసుకున్న విద్వేషాన్ని హాబిల్ హితబోధ తగ్గించలేక పోయింది. అల్లాహ్ శిక్ష విషయంలో కూడా అతను అస్సలు భయపడలేదు. తండ్రి మాటలు అతని చెవికెక్కలేదు. అంతే! ఒక పెద్ద రాతితో హాబిల్‌ను కొట్టాడు. హాబిల్ మరణించాడు.

ఇది మనిషి భూమిపై చేసిన మొదటి హత్య, మొదటి నేరం.

## ఖాబిల్ అపరాధభావం

హాబిల్ కొంతకాలం కనిపించకపోయేసరికి ఆదం (అస) అతని కోసం వెదకడం ప్రారంభించారు. కాని తన ప్రియమైన కుమారుని జాడ ఎక్కడా దొరక లేదు. హాబిల్ గురించి ఆయన ఖాబిల్‌ను ప్రశ్నించారు. దానికి ఖాబిల్ చాలా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. హాబిల్‌ను కనిపెట్టుకు ఉండడం, అతడిని కాపాడుతూ ఉండడం తన పని కాదని అన్నాడు. ఈ మాటలను బట్టి హాబిల్ మరణించి ఉంటాడని ఆదం(అస) అర్థం చేసుకున్నారు. ఆదం (అస) తీవ్రమైన మనోవేదనకు గురయ్యారు.

హాబిల్ శవాన్ని ఏం చేయాలో తెలియని ఖాబిల్ అయోమయంలో పడ్డాడు. తన వీపుపై వేసుకుని ఒక చోటె నుంచి మరొక చోటికి తిరిగాడు. శవాన్ని



దాచేయడానికి ప్రయత్నించాడు. ఇప్పుడతనిలో ఆగ్రహం చల్లారింది. విద్వేషం తగ్గింది. మృతదేహం బరువు మోయలేక అలసిపోతున్నాడు. మృతదేహం నుంచి చెడు వాసన రావడం కూడా ప్రారంభమయ్యింది. మరణానంతరం కూడా మనిషి గౌరవమర్యాదలను ఎలా కాపాడాలో అల్లాహ్ ఈ సందర్భంగా ఖాబిల్‌కు ఒక ఉదాహరణ చూపించి పూర్తి మానవాళికి మార్గం తెలియజేశాడు. అల్లాహ్ రెండు కాకులను పంపాడు. అవి ఒకదానితో ఒకటి పోట్లాడుకున్నాయి. ఒక కాకి చనిపోయింది. గెలిచిన కాకి తన ముక్కుతో, కాలి గోళ్ళతో ఒక గొయ్యి తవ్వింది. చనిపోయిన కాకిని అందులో నెట్టి పైన మట్టి కప్పింది. ఇదంతా చూసిన ఖాబిల్ సిగ్గుతో, అపరాధభావంతో చితికిపోయాడు. ఈ కాకి చేయగలిగిన పని కూడా నేను చేయలేకపోయానే అని బాధపడ్డాడు. ఇది మనిషి చరిత్రలో మొదటి ఖననం.

*(చదవండి దివ్య ఖుర్‌ఆన్ : 5:30-34)*

### గ్రహించవలసిన పాఠాలు

- మనిషిలో ద్వంద్వ ప్రవృత్తి ఉంటుంది. మంచి, చెడు స్వభావాలు కలగలసి ఉంటాయి.
- శారీరక ఆకర్షణ మార్గం తప్పిస్తుంది. ఈర్ష్యాసూయలకు జన్మనిస్తుంది. వినాశానికి కారణమవుతుంది.
- మనం అత్యంత ఇష్టపడేవే దేవునికి సమర్పించాలి.
- అల్లాహ్ ఆదేశాలను తిరస్కరించడం, తల్లిదండ్రుల మాటను పెడచెవిన పెట్టడం పతనానికి దారితీస్తుంది.
- మానవ చరిత్రలోని మొదటి కుటుంబంలో ఒక మినహాయింపుగా అల్లాహ్ కవల జతల మధ్య వివాహాన్ని అనుమతించాడు.
- ఇస్లామీయ పద్ధతిలో జరిగే శవఖననం దివ్య ఖుర్‌ఆన్‌లోని మార్గ దర్శకత్వానికి అనుగుణంగా జరుగుతుంది.

(గమనిక: దివ్యఖుర్‌ఆన్ ఈ సంఘటనను పేర్కొన్నప్పటికీ హాబిల్, ఖాబిల్ అనే పేర్లను మాత్రం ప్రస్తావించలేదు.)

https://teluguislam.net



# ప్రవక్త ఇద్రీస్
(అలైహిస్సలాం)



వ్రాత ప్రారంభ రూపాన్ని కనిపెట్టింది ఇద్రీస్ (అస) అని తెలుస్తోంది

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఇద్రీస్ ప్రవక్త(అస) బాబిలోనియా లో జన్మించారు. అక్కడే పెరిగి పెద్దవార య్యారు. ఇద్రీస్ ప్రవక్త గురించి ఖుర్‌ఆన్ గ్రంథంలో ఈ విధంగా ప్రస్తావిత మయింది.

"ఈ గ్రంథంలో ఇద్రీస్‌ను గురించి ప్రస్తా వించు. అతను ఒక నిజాయితీ పరుడైన మనిషి, ఒక ప్రవక్త. మేము అతనిని ఉన్నత స్థాయికి లేపాము."

*(దివ్య ఖుర్‌ఆన్ 19:56-57)*

ప్రవక్త ఆదం (అస) బోధనలను, ఆయన అనుసరించిన మతధర్మాన్ని ప్రవక్త ఇద్రీస్ (అస) అనుసరించారు. ప్రవక్త ఆదం (అస) తర్వాత అయిదవ తరంలోని వారు ప్రవక్త ఇద్రీస్ (అస). ఆయన ప్రజలను ఆదం (అస) పాటిం చిన మతధర్మం వైపునకు పిలిచారు. కొందరు ఆయన మాటలను విశ్వసిం చారు. కాని చాలా మంది ఆయన్ను తిరస్కరించారు.

ఇద్రీస్ ప్రవక్త (అస), ఆయన అనుచ రులు బాబిలోనియా వదలి ఈజిప్టుకు వెళ్ళారు. అక్కడ ఆయన తన సత్య సందేశ ప్రచారాన్ని కొనసాగించారు. ప్రజలకు సత్యాన్ని, న్యాయాన్ని బోధిం చసాగారు. వారికి సరియైన ప్రార్థనా రీతులు నేర్పసాగారు. కొన్ని నిర్ధారిత రోజుల్లో ఉపవాసాలు పాటించాలని ప్రోత్సహించసాగారు. తమ సంపదలో



కొంత భాగాన్ని బీదలకు ఇవ్వాలని బోధించసాగారు. వ్రాతకు సంబంధించిన ప్రారంభ రూపాన్ని కనిపెట్టింది ఇద్రీస్ (అస) అని తెలుస్తోంది. ఆయన బోధనల్లో కొన్ని :

- ★ తన ఆచరణలను సమీక్షించుకునే వ్యక్తి సంతోషాన్ని పొందుతాడు. అలాగే తన ప్రభువు వద్ద తన తరఫున వాదించడానికి తన ఆచరణలను ఏర్పరచుకున్న వ్యక్తి కూడా నిజమైన సంతోషాన్ని పొందుతాడు.
- ★ అల్లాహ్ అనుగ్రహాలను ఇతరులతో పంచుకోవడాన్ని మించి ఆయన పట్ల కృతజ్ఞత చూపే మార్గం మరొకటి లేదు.
- ★ ప్రజలకు ఉన్న భాగ్యాన్ని చూసి అసూయపడరాదు. ఎందుకంటే వారు ఆ భాగ్యాన్ని కొంతకాలం మాత్రమే అనుభవిస్తారు.
- ★ అతిశయానికి పాల్పడే వ్యక్తి దాని వల్ల ఎలాంటి లాభం పొందలేడు. వివేకాన్ని కలిగి ఉండటమే జీవితంలోని నిజమైన ఆనందం.

https://teluguislam.net



# ప్రవక్త నూహ్
## (అలైహిస్సలాం)



తుదకు మా ఆదేశం వచ్చి, పొయ్యి పొంగినప్పుడు, "ఈ ఓడలోకి ప్రతి (జీవ)రాసి నుంచి రెండేసి (ఒకటి ఆడ, ఇంకొకటి మగ జంతువు) చొప్పున ఎక్కించుకో. నీ ఇంటివారలను కూడా తీసుకో.... ఇంకా విశ్వాసులం దరిని కూడా ఎక్కించుకో" అని మేము నూహ్కు చెప్పాము.
(ఖుర్ఆన్ 11 : 40)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

చాలా తరాలుగా నూహ్ ప్రవక్త (అస)కు చెందిన జాతి ప్రజలు విగ్రహాలను ఆరాధించేవారు. వాటిని 'దేవుళ్ళు'గా పిలిచేవారు. ఈ దేవుళ్ళు తమకు మేలు చేస్తారని తలపోసేవారు. తమను కాపాడుతారని, తమ అవసరాలను తీరుస్తారని భావించేవారు. ఈ దేవుళ్ళకు వారు పేర్లు పెట్టుకున్నారు. ఈ దేవుళ్ళకు ఉన్నాయని భావిస్తున్న శక్తులకు అనుగుణంగా వద్ద్, సువా, యగూస్, నస్ర్ వగైరా పేర్లను వారు పెట్టుకున్నారు. నిజానికి ఈ పేర్లు అంతకు ముందు కాలానికి చెందిన పుణ్యాత్ముల పేర్లు. ఈ పుణ్యాత్ముల మరణం తర్వాత వారి జ్ఞాపకార్థం ముందు వారి విగ్రహాలను తయారు చేసుకున్నారు. ఆ పిదప వారినే ఆరాధించడం ప్రారంభించారు. తరాలు గడిచిన తర్వాత ప్రజలకు అసలు ఈ విగ్రహాలను ఎందుకు తయారు చేశారన్నది తెలియకుండా పోయింది. ఏదో తమ పూర్వీకులు వీటిని పూజించారు కాబట్టి తాము కూడా తప్పకుండా వాటిని పూజించాలన్న ఒక మొండి వాదన మొదలయింది. ఆ విధంగా విగ్రహారాధన చోటుచేసుకుంది. వారికి విశ్వప్రభువైన అల్లాహ్ గురించిన జ్ఞానం లేనందు వల్ల, తమ చెడు ప్రవర్తనకు దేవుడు శిక్షిస్తాడన్న



స్పృహ లేనందు వల్ల వారు క్రూరమైన వారిగా, నీతినియమాలు లేనివారిగా తయారయ్యారు.★

ఈ ప్రజల పట్ల అల్లాహ్ దయ చూపాడు. తన ప్రవక్త నూహ్ (అస)ను వారికి మార్గదర్శిగా పంపించాడు. నూహ్ (అస) మంచి వక్త. చాలా సహనం కలిగిన వారు. ఆయన గొప్పలు చెప్పుకునే వారు కాదు. చాలా మృదువుగా వ్యవహరించేవారు. అందరినీ ప్రేమించేవారు. ప్రజలకు మనిషి పుట్టుక పరమార్థాన్ని ఆయన బోధించారు. విశ్వంలోని వింతల గురించి చెప్పారు. పగలు వెనుక రాత్రి నిరంతరం భ్రమించడం ఎలా జరుగుతుందో వివరించారు. అల్లాహ్ మానవుల మేలు కోసం విరుద్ధాంశాల మధ్య సమతుల్యాన్ని నెలకొల్పాడని తెలిపారు. రాత్రి మనిషికి కావలసిన చల్లదనాన్ని, విశ్రాంతిని ఇస్తుంది. పగలు మనిషికి కావలసిన వేడిని, ఉపాధి కార్యక్రమాల సౌలభ్యాన్ని ఇస్తుంది. సూర్యుడు ఎదుగుదలకు, ప్రాణులు బ్రతికి ఉండడానికి తోడ్పడుతాడు. జీవుల కాలాన్ని, దిక్కులను, రుతువులను తెలుసుకోవడానికి చంద్రుడు, నక్షత్రాలు ఉపయోగపడతాయి. భూమ్యాకాశాలను సృష్టించిన అల్లాహ్యే సకల చరాచర సృష్టికి ప్రభువు. మానవులు తనను తప్ప మరెవ్వరినీ ఆరాధించరాదని ఆయన ఆదేశించాడు. అలా కాక మానవులు దైవేతరులను ఆరాధిస్తూ తమ దుష్టకార్యాలను కొనసాగిస్తే తీవ్రమైన శిక్ష తప్పదని హెచ్చరించాడు. నూహ్ (అస) ప్రజలకు ఈ ధార్మిక సత్యాలను బోధించారు. కాని అహంభావులైన ఆయన జాతి ప్రజలు ఆయన మాటలు వినలేదు. అజ్ఞానం వల్ల వారు అహంభావానికి, తిరస్కారానికి పాల్పడ్డారు. వారి మూర్ఖవైఖరి వారిని అనేక చెడులకు పురికొల్పింది. ఫలితంగా క్రూరత్వం, నీతిరాహిత్యం వారి జీవన విధానంగా మారింది.

## వాదోపవాదాలు

నూహ్ (అస) బోధనల వల్ల కొందరు ఆయనకు అనుచరులయ్యారు.

★ *బహుదైవారాధన(షిర్క్)ను ఇస్లాం ధర్మం తీవ్రంగా గర్హిస్తుంది. షిర్క్ అంటే నిజమైన దేవునికి సమానంగా మరొకరిని నిలబెట్టడం అని అర్థం. అంటే దేవుని స్థానంలో మరొకరిని, విగ్రహాల రూపంలో ఉన్న మానవాకారాలను లేదా మరో ఆకారాన్ని పూజించడం అన్నమాట. అంతేకాదు, అల్లాహ్ను, అల్లాహ్ ప్రవక్త (స)ను కాక మరెవరినైనా లేక మరిదేనినైనా తమకు అత్యంత ఇష్టమైనదిగా భావించడం కూడా షిర్క్ క్రిందికే వస్తుంది.*

వారు నూహ్ (అస) బోధనలను, దివ్యసందేశాన్ని విశ్వసించారు. కాని కొన్ని అల్లరి శక్తులు మాత్రం నూహ్ (అస) పట్ల శత్రుత్వం వహించాయి. అటువంటివారు అధిక సంఖ్యలో ప్రజలను ఆయనకు వ్యతిరేకంగా రెచ్చగొట్టారు. వారికి నచ్చచెప్పడానికి నూహ్(అస) శతవిధాల ప్రయత్నించారు. కాని వారు ఆయన్ని అపహాస్యంపాలు చేశారు. ఆయన్ను ఎగతాళి చేశారు. “నిన్ను దేవుడు ఎన్నుకున్నాడని చెబుతున్నావు...అల్లాహ్ ఆదేశాలను తిరస్కరిస్తే అల్లాహ్ ఆగ్రహం వచ్చిపడుతుందని హెచ్చరిస్తున్నావు. నువ్వు చెప్పేది అబద్ధం. నిజానికి దేవుని అనుగ్రహాలను అధికంగా పొందుతున్నది మేము. మాకు సంపద, సేవకులు, అధికారం అన్నీ లభించాయి. కాని నీ వద్ద ఏముంది? ఏమీ లేదు. ఏ విధంగా నువ్వు మాకన్నా మెరుగ్గా ఉన్నావు?”అన్నారు.

నూహ్(అస) వారికి జవాబిస్తూ, “మంచి చేయాలని నేను చేసిన ప్రయత్నాలన్నీ నిష్ఫలమయ్యాయి. అల్లాహ్ రుజుమార్గాన్ని మీకు దూరం చేశాడని భావిస్తున్నాను. మీ హృదయాల కాఠిన్యమే మిమ్మల్ని ఈ స్థితికి చేర్చింది. చెడు చేయాలని నిర్ణయించుకున్న వారిని అల్లాహ్ వారి నిర్ణయానికి వదిలేస్తాడు” అని చెప్పారు. వారు ఆయనకు జవాబిస్తూ, “మేము నిన్ను అనుసరించాలని నువ్వు కోరుతుంటే, నీ వెంట ఉన్న అల్ప జనాన్ని పారద్రోలు. మేము ఉన్నత తరగతికి చెందినవాళ్ళం” అన్నారు. నూహ్(అస) వారికి సమాధానమిస్తూ, “నేను ఉన్నత, నిమ్న తరగతి ప్రజలందరిని, సంపన్నులను, బీదవారిని, పాలకులను, పాలితులను అందరినీ ఒకేఒక దైవధర్మం వైపు ఆహ్వానించడానికి వచ్చాను. నా అనుచరులు తమ విశ్వాసం విషయంలో దృఢంగా ఉన్నారన్నది నాకు తెలుసు. కాని మీరు తిరస్కారం తప్ప మరేదీ ఇంతవరకు చూపలేదు” అన్నారు.

వారు నూహ్(అస)ను సవాలు చేస్తూ, “నువ్వు హెచ్చరిస్తున్న అల్లాహ్ ఆగ్రహం, శిక్ష ఎలా ఉంటాయో ఒకసారి తీసుకురా” అన్నారు. నూహ్ (అస) జవాబిస్తూ, “శిక్షను తీసుకురావడానికి నేనెవర్ని? కేవలం అల్లాహ్ మాత్రమే శిక్షించగలడు. ఆయన తలచుకుంటే శిక్షిస్తాడు. ఆయన శిక్ష నుంచి మీరు తప్పించు కోలేరు. నేను మీలాంటి మానవమాత్రుడిని. నాకు దేవుని నుంచి మార్గదర్శకత్వం లభించడం తప్పిస్తే మిగిలిన విషయాల్లో నేనూ మీలాంటి వాడినే. మీరు అల్లాహ్ ఆదేశాలను అంగీకరిస్తే మీకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. తిరస్కరిస్తే మీకు శిక్ష పడుతుంది”అన్నారు.

https://teluguislam.net



## నూహ్ (అస) ఉద్యమం

అల్లాహ్ తన ప్రవక్త నూహ్ (అస)కు గొప్ప సహనాన్ని ప్రసాదించాడు. ప్రజల తిరస్కారాన్ని, ఎగతాళిని భరించే సహనాన్ని ఇచ్చాడు. ఆయన వారి మధ్య చాలా కాలం పనిచేశారు. వారి అపహాస్యాన్ని, ఎగతాళిని భరిస్తూ అల్లాహ్ ధర్మాన్ని ప్రచారం చేశారు. ఏదో ఒక రోజున వారి హృదయాల్లో విశ్వాసం చోటుచేసుకుంటుందని ఆశించారు. ఏళ్ళు గడిచిపోయాయి. నూహ్ ప్రవక్త (అస) తన జాతివారిని 950 సంవత్సరాలపాటు అల్లాహ్ ధర్మం వైపు ఆహ్వానిస్తూ ఉన్నారు. కాని వారిలో ఎలాంటి మార్పు రాలేదు. “ఇప్పటికి విశ్వసించిన వారు తప్ప మిగిలిన వారెవ్వరూ విశ్వసించేది లేదు. కాబట్టి వారు చేస్తున్న పనుల గురించి ఆందోళన చెందవద్ద”న్న సందేశం వచ్చింది ఆయనకు. ఇక వ్యవహారం అల్లాహ్ చేతుల్లో ఉందని, ఈ ప్రజల్లో మార్పు వచ్చే అవకాశం లేదని నూహ్ (అస) అర్థం చేసుకున్నారు. ఆయన అల్లాహ్‌తో మొరపెట్టుకుంటూ, “ప్రభూ! భూమిపై ఈ అవిశ్వాసులను ఎవరినీ మిగల్చవద్దు. వారిలో ఏ ఒక్కరిని వదలినా వాడు నీ దాసులను మళ్ళీ దారి తప్పిస్తాడు. చెడుకు, కృతఘ్నతకు, అవిశ్వాస సంతానానికి కారకుడవుతాడు” అని ప్రార్థించారు.

## నౌక

నూహ్ (అస) ప్రార్థనను అల్లాహ్ స్వీకరించాడు. ఒక నౌకను నిర్మించాలని, తన ఆదేశం, ప్రేరణల ప్రకారం నౌక నిర్మాణం కొనసాగించాలని ఆదేశించాడు. చెడుకు పాల్పడ్డవారి గురించి తనతో మాట్లాడరాదని కూడా హెచ్చరించాడు. వారందరిని ముంచివేయడం జరుగుతుందని చెప్పాడు.

నౌకా నిర్మాణం కోసం పట్టణానికి బయట సముద్రతీరానికి చాలా దూరాన ఉన్న ఒక ప్రదేశాన్ని నూహ్ (అస) ఎంచుకున్నారు. కలపను సేకరించారు. పనిముట్లు సంపాదించారు. నౌక నిర్మాణానికి రాత్రింబవలు పనిచేయడం ప్రారంభించారు.

ప్రజలు ఆయన్ను ఎగతాళి చేయడం ఇంకా ఎక్కువయ్యింది. “నూహ్! మతబోధనలు మానేసి వడ్రంగం మొదలెట్టావా. అయినా సముద్రతీరానికి ఇంత దూరాన నౌక తయారు చేస్తున్నావేంటి? ఈ నౌకను సముద్రం వరకు నువ్వు లాక్కెళతావా లేక గాలి మోసుకుపోతుందా?” అంటూ అపహసించారు. నూహ్

https://teluguislam.net



(అస) వారికి జవాబిస్తూ, "ఎవరు నష్టానికి గురవుతారో మీరే చూస్తారు. పరాభవానికి, శాశ్వత దుఃఖానికి ఎవరు గురవుతారో కూడా మీకు త్వరలోనే బోధపడుతుంది" అన్నారు.

నూహ్(అస) నౌక నిర్మాణాన్ని పూర్తి చేసి అల్లాహ్ ఆదేశం కోసం ఎదురు చూడసాగారు. అల్లాహ్ ఆయన్ను ఆదేశిస్తూ విశ్వాసులతో పాటు తక్షణం నౌకలోకి ఎక్కమన్నాడు. తమతో పాటు ప్రతి జంతువును, ప్రతి పక్షిని, ప్రతి కీటకాన్ని, ఆడమగ జంటలను తీసుకుని నౌకలోకి చేరుకొమ్మన్నాడు.

నూహ్ (అస) జంతువులను, పక్షులను, కీటకాలను నౌక వద్దకు తీసుకు వెళ్ళడం చూసిన ప్రజలు పెద్దగా నవ్వుకున్నారు. "నూహ్‌కు పిచ్చి పట్టింది. ఈ జంతువులతో ఏం చేయాలనుకుంటున్నాడో?" అనసాగారు.

## జల ప్రళయం

నూహ్(అస) తన పని పూర్తి చేసి, నౌకలోకి చేరుకున్న వెంటనే భారీ వర్షం ప్రారంభమయ్యింది. ప్రతి ప్రాంతంలోకి నీరు శరవేగంగా చొచ్చుకురాసాగింది. అదో జలప్రళయం. నీరు ఎంత ఎత్తుకు వచ్చిందంటే నూహ్ (అస) నౌక నీటిలో తేలియాడసాగింది. నౌక నీటిలో తేలుతూ పోసాగింది. అవిశ్వాసులు వందలాదిగా నీట మునిగిపోయారు.

## నూహ్(అస) కుమారుడు

ప్రజల్లో నూహ్ (అస) తన కుమారుడు కనాన్‌ను చూశారు. అతడు ఒక కొండపైకి పరుగెత్తుతున్నాడు. నూహ్ (అస) తన మమకారాన్ని అణచుకోలేక పోయారు. ఆయన తన కుమారుడితో దేవుడిని విశ్వసించి, నౌకలోకి రమ్మని ఎలుగెత్తి పిలిచారు. కాని అతడు తండ్రి మాటను పెడచెవిన పెట్టాడు. కొండపైకి పోయి సురక్షితంగా ఉంటానన్నాడు. కొండ వైపునకు పరుగెత్తసాగాడు. బాధాతప్త హృదయంతో నూహ్(అస) కుమారుడిని హెచ్చరిస్తూ, "అల్లాహ్ తీర్పు నుంచి నేడు ఎవ్వరూ తప్పించుకోలేరు. ఆయన దయతలచిన వారు తప్ప" అన్నారు.

అంతలో ఒక మహా కెరటం నూహ్(అస) కుమారుడిని ముంచేసింది. నూహ్ (అస) మానవ సహజమైన బలహీనతతో అల్లాహ్‌తో మొరపెట్టుకుంటూ, "ప్రభూ! నా కుమారుడు నా కుటుంబంలోని వాడే కదా" అన్నారు. అల్లాహ్ జవాబిస్తూ, "నూహ్! అతను నీ కుటుంబంలోని వాడు కాదు. అతడి ప్రవర్తన అమర్యాదకర మైనది. అతడు సత్యాన్ని తిరస్కరించాడు. హృదయపూర్వకంగా విశ్వసించిన వారిని తప్ప మరెవ్వరినీ నీవు నీ వాడిగా భావించకు. అతడు స్వయంగా నీ కన్నకొడుకైనా నీవు సిఫారసు చేయడానికి తగిన వాడు కాదు. నీకు తెలియని విషయాలకు సంబంధించి నా నుంచి ఏదీ అడగవద్దు. ఈ విషయమై నిన్ను హెచ్చరిస్తున్నాను" అన్నాడు.



## మానవ బలహీనత

నూహ్ ప్రవక్త(అస) తన తప్పిదాన్ని గుర్తించారు. కేవలం మానవ బలహీనత వల్ల ఈ తప్పిదం జరిగింది. తనను కాపాడిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పడం సముచితంగా ఉండేది. తన తప్పిదానికి పశ్చాత్తాపపడుతూ దేవుని శరణు కోరు కున్నారు.

ఆ నౌక చాలా రోజులు నీట తేలియాడింది. ప్రపంచంలో కనబడేదంతా నీట మునిగిన తర్వాత అల్లాహ్ ఆకాశాలను వర్షించడం ఆపివేయాలని ఆదేశించాడు. నేలపై నీరు ఇంకిపోయే అనుమతి ఇచ్చాడు. నౌక ఒక కొండపై ఆగి పోయింది. అల్లాహ్, నూహ్ (అస)ను ఆదేశిస్తూ, "శాంతి అనుగ్రహాలతో ఈ కొండ దిగండి. మీ నుంచి ఒక జాతి ఉద్భవిస్తుంది. ఇంకా అనేక జాతులు వస్తాయి. వాటికి మేము కొంతకాలం వ్యవధి ఇస్తాము. చివరకు ఒక బాధాకరమైన శిక్ష వారిని కప్పివేస్తుంది" అన్నాడు.

నూహ్(అస), ఆయన వెంట ఉన్న విశ్వాసులు, జంతువులు, పక్షులు, కీటకాలు అందరూ నేలపై స్థిరపడ్డారు. అల్లాహ్ అనుగ్రహంతో వారు సమృద్ధి, సంతోషాలు సాధించారు.

*(చదవండి దివ్య ఖుర్ఆన్ : 2:33, 4:163, 6:83, 7:59-64, 10:71-73, 11:25-49, 21:76-77, 25:37, 26:105-122, 29:14-15, 37:75-82, 71:1-28, 54:9-16, 23:23-31, 40:5-6)*

### గ్రహించవలసిన పాఠాలు

☛ ఆ కాలంలో ప్రజలు రెండు తరగతులుగా విభజించబడ్డారు. సంపన్నులు, బీదవారు. బీదవారు ఎల్లప్పుడు దైవప్రవక్తల బోధనలను విశ్వసించారు. ఎందుకంటే సంపన్నులు, బీదవారు అందరూ సమానులనీ, సమన్యాయం, దయాగుణం పెంపొందించుకోవాలని ప్రవక్తలు

బోధించేవారు. దాడులు, దోపిళ్ళకు గురికాకుండా అందరికీ భద్రత ఉండాలని బోధించేవారు. సంపన్నులు నూహ్(అస)ను దూషించారు. బెదిరించారు. ఎందుకంటే వారికి వారి హోదా ఔన్నత్యాలు కోల్పోతాయన్న భయం పట్టుకుంది.

- అల్లాహ్ సమానత్వం విలసిల్లే సమాజాన్ని అభిలషిస్తాడు. మంచివారు, జ్ఞాన సంపన్నులు నాయకత్వం వహించాలని కోరుతాడు.
- నూహ్ (అస) దృఢసంకల్పాన్ని ప్రదర్శిస్తూ అల్లాహ్ సందేశాన్ని ప్రచారం చేయడానికి చాలా కృషి చేశారు.
- సంతానం పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని ఇస్లాం నొక్కి చెప్పింది. కాని అల్లాహ్ పట్ల అవిధేయత చూపిన వారి పట్ల కాదు, అలాంటి వారు కన్న బిడ్డలైనా సరే; నూహ్ (అస) తన కుమారుడిని రక్షించాలని వేడుకున్నప్పుడు అల్లాహ్ ఆయన్ను మందలించాడు. అల్లాహ్ ప్రజలను వారి ఆచరణలపరంగా నిర్ణయిస్తాడు. చివరకు ప్రవక్త కన్నకొడుకు, కట్టుకున్న భార్య అయినా సరే ఇదే నియమం వర్తిస్తుంది. సాఫల్యం అన్నది రక్త సంబంధం వల్ల లభించదు. కేవలం ఆచరణల వల్ల లభిస్తుంది.
- అల్లాహ్ తన ఆదేశాలను పాటించిన వారి పట్ల కారుణ్యం చూపుతాడు. తన క్షమాభిక్ష అర్థించిన వారి పట్ల దయ చూపుతాడు. కాని ఆయన్ను తిరస్కరించిన వారు శాశ్వతంగా అభిశాపానికి గురవుతారు.



# ప్రవక్త హూద్

(అలైహిస్సలాం)

## (ఆద్ జాతి ప్రజలు)



ఆద్ వారు ప్రచండమైన పెనుగాలుల ద్వారా నాశనం చేయబడ్డారు. వాటిని అల్లాహ్ వారిపై నిరంతరం ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్ళు విధించాడు. (నీవు గనక అక్కడ ఉండి ఉంటే) వారు అక్కడ బోసిపోయిన ఖర్జూరపు బొద్దులవలే నేలకొరిగి పడి ఉండటం చూసేవాడివి.

(ఖుర్‌ఆన్ 69 : 6-7)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

యమన్, ఒమన్‌ల మధ్య ఉన్న ప్రదేశంలో కొండచరియల వద్ద ఆద్ జాతి ప్రజలు చాలా కాలం నివసించారు. వారు శారీరకంగా దృఢకాయులు. భవన నిర్మాణ కౌశలానికి వారు పెట్టింది పేరు. ఎత్తయిన అనేక భవనాలు నిర్మించిన ఘనత వారిది. వారి బలసామర్థ్యాల వల్ల, వారి సంపద వల్ల మిగిలిన జాతుల కన్నా వారికి విశిష్ట స్థానం లభించింది. కాని భౌతికంగా వారు సాధించిన ప్రగతీ వికాసాలు, వారి శారీరక బలాధిక్యత వారిని అహంకారానికి, గర్వాతిశయానికి గురి చేశాయి. దౌర్జన్యాలు, అన్యాయానికి మారు పేరయిన పాలకుల చేతుల్లో రాజ్యాధికారం ఉండేది. వారికి వ్యతిరేకంగా గొంతువిప్పే సాహసం ఎవరూ చేసేవారు కాదు.

అల్లాహ్ గురించి ఏమీ తెలియని జాతి కాదు వారిది. అలాగే వారు అల్లాహ్ ఆరాధనను పూర్తిగా నిరాకరించనూ లేదు. కాని వారు కేవలం అల్లాహ్‌ను మాత్రమే, అంటే ఒక్క అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించడాన్ని నిరాకరించారు. అల్లాహ్‌తో పాటు వారు అనేక దేవీదేవతలను ఆరాధించేవారు. ఇది మహాపరాధం, అల్లాహ్ ఎంతమాత్రం సహించని అపరాధం ఇది.

అల్లాహ్ ఈ ప్రజలకు మార్గదర్శకత్వం అందించాలని, వారికి హితబోధ

https://teluguislam.net

https://teluguislam.net



చేయాలని నిర్ణయించి, వారిలో ఒకరిని దైవప్రవక్తగా ఎన్నుకున్నాడు. ఆయనే హూద్ (అస). ఆయన తనకు అప్పగించిన పనిని నిబద్ధతతో, దృఢసంకల్పంతో, సహనంతో నిర్వర్తించారు. ఆయన విగ్రహారాధనను ఖండించారు. ప్రజలకు బోధిస్తూ, "ప్రజలారా! ఈ రాళ్ళ వల్ల లాభం ఏముంది? మీ స్వంత చేతులతో మీరు చెక్కే వీటి వల్ల ప్రయోజనం ఏముంటుంది? నిజానికి ఇలా చేయడం మీ వివేకవివేచనలను పరాభవించుకోవడమే అవుతుంది. దేవుడు కేవలం ఒకే ఒక్కడు. ఆయనే ఆరాధనకు అర్హుడు. ఆయనే అల్లాహ్. ఆయన్ను మాత్రమే ఆరాధించడం మీ బాధ్యత. ఆయనే మిమ్మల్ని సృష్టించాడు. ఆయనే మీకు పోషణనిస్తున్నాడు. ఆయనే మీకు జీవన్మరణాలు ఇస్తున్నాడు" అని చెప్పారు. అల్లాహ్ మీకు అద్భుతమైన శారీరక శక్తిని ప్రసాదించాడు. అనేక విధాలుగా మిమ్మల్ని అనుగ్రహించాడు. కాబట్టి దేవుణ్ణి విశ్వసించండి. ఆయన మీకు ప్రసాదించిన అనుగ్రహాల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దు. లేకపోతే నూహ్ జాతి ప్రజలకు పట్టిన దుర్గతి మీకూ పట్టవచ్చు అని వారిని హెచ్చరించారు.

## అజ్ఞానుల వాదన

హేతుబద్ధమైన వాదనతో హూద్ ప్రవక్త (అస) ప్రజల్లో దైవవిశ్వాసాన్ని పాదుకొల్పడానికి ప్రయత్నించారు. కాని వారు ఆయన సందేశాన్ని స్వీకరించడానికి నిరాకరించారు. పైగా హూద్ (అస)తో వాదనకు దిగారు. "హూద్ ! నీవు చెబుతున్న దేమిటి? ఈ దేవీదేవతలు అల్లాహ్‌తో మా తరపున సిఫారసు చేస్తాయి" అని దబాయించారు. హూద్ (అస) వారికి జవాబిస్తూ, "ప్రజలారా! అందరి దేవుడు అల్లాహ్ ఒక్కడే. ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరు. ఆయన మీ బృహద్ధమనికన్నా మీకు దగ్గరగా ఉన్నాడు. ఈ విగ్రహాలు మీ కోసం సిఫారసు చేయలేవు. వీటిని ఆరాధించడం వల్ల మీరు అల్లాహ్‌కు మరింత దూరం అవుతారు. మేము చాలా తెలివైన వాళ్ళం అని మీరు భావిస్తున్నారేమో! కాని మీ విశ్వాసాలు మీ అజ్ఞానాన్ని చాటిచెబుతున్నాయి" అన్నారు.

## నిష్ఫలం

కాని వారు హూద్ (అస) మాటలను తిరస్కరించారు. ఆయన్ను ఎగతాళి చేశారు. "హూద్! నీవు కూడా మాలాంటి మామూలు మనిషివే. అలాంటప్పుడు



అల్లాహ్ నీకు మాత్రమే ప్రవక్త పదవీ బాధ్యతలను అనుగ్రహించాడా? అలా ఎన్నటికీ జరగదు. నువ్వు అబద్ధాలాడుతున్నావు" అన్నారు. హూద్ (అస) వారికి జవాబిస్తూ, "నేను నా జీవితమంతా మీ మధ్యనే గడిపాను. నా వివేకవివేచనలను మీలో ఎవ్వరూ ప్రశ్నించలేదు. అల్లాహ్ నన్ను హెచ్చరించేవానిగా, మార్గం చూపేవానిగా ఎన్నుకున్నాడు. అల్లాహ్ ఒక్కడే. ఆయన ఏకత్వం అన్నది విశ్వంలోని ప్రతి వస్తువులోనూ కనబడుతుంది. ప్రతి వస్తువులోనూ ఒక సూచన ఉంది. కాబట్టి ఆయన్ను విశ్వసించండి. ఆయన్ను క్షమాభిక్ష కోర్తకై అర్థించండి. ఆయన కారుణ్యానికి దూరం కావద్దు. పరలోకం కొరకు ఏర్పాట్లు చేసుకోండి. మీకు వైభవోపేతమైన ఎత్తయిన భవనాలు ఉన్నాయి. ఈ భవనాలు మీ శక్తిని, మీ సంపదను చాటిచెబుతున్నాయి. కాని వీటి వల్ల మీకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇవి కేవలం మీ వైభవానికి చిహ్నాలైన అవశేషాలుగా మిగిలిపోతాయి. మీరు మీ సంపదను, మీ నైపుణ్యాలను ఎలాంటి జీవిత లక్ష్యం లేకుండా వెచ్చిస్తున్నారు. మీరు శాశ్వతంగా ఇక్కడే ఉంటారన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మీరు కేవలం సుఖవిలాసాల కోసం ప్రాకులాడుతున్నారు" అని హెచ్చరించారు. కాని ఆ ప్రజలు ఆయన బోధనలను పెడచెవిన పెట్టారు. హూద్ (అస) తన ప్రచారోద్యమం నిష్ఫలమయ్యిందని గుర్తించారు. ఆయన వారితో, "అల్లాహ్ ముందు సాక్షులుగా ఉండండి. నేను దైవసందేశాన్ని మీకు అందజేశాను. నేను నా ప్రయత్నాలు కొనసాగిస్తునే ఉంటాను. మీ బెదిరింపులకు భయపడను. నేను కేవలం అల్లాహ్‌కు మాత్రమే భయపడతాను" అన్నారు.

ఒక రోజు వారు ఆకాశాన్ని ఒక నల్లమబ్బు కప్పివేయడాన్ని చూశారు. వర్షం వస్తుందని వారు భావించారు. ఈ తొలకరి వర్షానికి పొలాలను సిద్ధం చేసుకోవాలనుకున్నారు. హూద్ (అస) వారిని హెచ్చరించారు. ఇది దేవుని కరుణ వల్ల వచ్చిన మేఘం కాదు. ఇది అభిశాపంగా వస్తున్న గాలివాన. ఇది బాధాకరమైన శిక్షను తీసుకువస్తుంది. దీని గురించే నేను మీకు హెచ్చరికలు చేశాను అన్నారు.

భయంకరమైన తుఫాను గాలి ఎనిమిది పగళ్ళు, ఏడు రాత్రులు కొనసాగింది. ఆ ప్రాంతం యావత్తు శిథిలమయంగా మారే వరకు అది ఆగలేదు. అక్కడి దుర్మార్గ ప్రజలు అందరూ వినాశం పాలయ్యారు. ఎడారి ఇసుక వారిని

https://teluguislam.net



ముంచెత్తింది. కేవలం హూద్ (అస), ఆయన అనుచరులు మాత్రం బ్రతికి బయటపడ్డారు. వారు అక్కడి నుంచి 'హద్రమౌత్'కు వలస పోయారు. వారు అక్కడ ఒకేదేవుడు అల్లాహ్‌ను ఆరాధిస్తూ శాంతియుతంగా జీవించారు.

*(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 7:65-72, 11:50-60, 26:123-140)*

### గ్రహించవలసిన పాఠాలు

- *ఇటీవల స్పేస్‌షటిల్ నుంచి తీసుకున్న ఆధునిక రాడార్ ఇమేజ్‌ల వల్ల లభించిన వైజ్ఞానిక ఆధారాలతో దక్షిణ ఓమ్మాన్‌లోని ఉబార్ వద్ద ఎనిమిది ఎత్తయిన టవర్లను కనిపెట్టడం జరిగింది. ఈ ప్రాంతాన్ని "ఖాళీ ప్రదేశం" (ఎమ్టీ క్వార్టర్)గా పిలువడం జరుగుతుంది. ఈ సంఘటన దాదాపు 5000 సంవత్సరాలకు పూర్వం జరిగిందని భావిస్తున్నారు. ఒక్క దివ్యఖుర్‌ఆన్ తప్ప మరో మతగ్రంథం లేదా ధార్మిక పుస్తకం ఏదీ ఈ పట్టణం పతనాన్ని ప్రస్తావించలేదు.*



## ప్రవక్త సాలిహ్

(అలైహిస్సలాం)

(సమూద్ జాతి ప్రజలు వారి విశిష్ట ఒంటె)



సమూదు (జాతి) వారు తమ పొగరు మూలంగా (వారి ప్రవక్తను) ధిక్కరించారు...... "మీరు దేవుని ఈ ఆడ ఒంటె విషయంలో, దాని నీళ్ల వంతు విషయంలో జాగ్రత్తగా ఉండండి" అని దైవప్రవక్త వారిని హెచ్చరించాడు. కాని వారు మాత్రం తమ ప్రవక్త (మాటల)ను త్రోసిపుచ్చి, దాని గిట్టెలను నరికి(చంపేశారు).

**(ఖుర్‌ఆన్ 91 : 11-14)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఆద్ జాతి ప్రజల వినాశం తర్వాత సమూద్ జాతి వైభవోపేత స్థానాన్ని ఆక్రమించుకుంది. అయితే ఈ జాతి ప్రజలు కూడా విగ్రహారాధనకు లోనయ్యారు. భౌతిక సంపద పెరిగిన కొద్దీ వారి దుష్ట స్వభావం కూడా అధికమయ్యింది. సన్మార్గం కనుమరుగయ్యింది. ఆద్ జాతి ప్రజల మాదిరిగా వీరు కూడా ఎత్తయిన భవనాలను మైదాన ప్రాంతాల్లో నిర్మించారు. కొండలను తొలచి అందమైన సౌధాలు నిర్మించారు. అణచివేతలు, దౌర్జన్యాలు వారిలో నిత్యకృత్యమైపోయాయి. దుష్టులు, దుర్మార్గులు రాజకీయాధికారాన్ని ఆక్రమించుకున్నారు.

వారి వద్దకు ప్రవక్తగా సాలిహ్ (అస) పంపబడ్డారు. కాని ఆయన సందేశాన్ని కేవలం నిరుపేదలు, అణగారిన ప్రజలు మాత్రమే స్వీకరించారు. సంపన్నులు, అధికారం కలిగినవారు ఆయన ప్రవక్త పదవిని నిరాకరించారు. అబద్ధాలు చెబుతున్నాడని వారు ఆయన్ను దూషించారు. ప్రవక్త సాలిహ్ (అస)తో వారు, "నీవు చాలా కాలంగా మా మధ్య నివసిస్తున్నావు. నీ తెలివితేటలు, నీ వివేకం మాకు ఉపయోగపడతాయనుకున్నాము. కాని ఇప్పుడు నువ్వు మా పూర్వీకులు పూజించిన దేవుళ్ళను వదలుకోవా

https://teluguislam.net



లని చెబుతావా?" అన్నారు. సాలిహ్ (అస) వారికి జవాబిస్తూ, "మీరు మీ నాయకులను, వారి దుష్ట మార్గాలను అనుసరించడం మానండి. వారు ఔచిత్యాన్ని పూర్తిగా కోల్పోయారు. మీరు సాఫల్యాన్ని పొందే ఏకైక మార్గం అల్లాహ్‌కు భయపడడం మాత్రమే. మీకు నా నిజాయితీ గురించి బాగా తెలుసు. అల్లాహ్ సందేశాన్ని ప్రచారం చేయడంలో నాకు వేరే రహస్య ఉద్దేశ్యాలు ఏవీ లేవు" అన్నారు.

## విశిష్టమైన ఆడ ఒంటె

సాలిహ్ (అస) తన సందేశ ప్రచారాన్ని మానుకునేలా లేడని వారు భావించారు. ఆయన్ను అనుసరించే వారి సంఖ్య పెరుగుతుందన్న భయం వారికి పట్టుకుంది. ఆయన్ను నిరోధించడానికిగాను వారు ఒక పథకం వేశారు. ఆయనతో, "నీవు అల్లాహ్ ప్రవక్తవన్న విషయాన్ని మాకు నిరూపించు. ఏదైనా స్పష్టమైన మహత్యాన్ని మాకు చూపించు. కొండల్లోంచి ఒక విశిష్టమైన ఒంటెను బయటకు వచ్చేలా చేయి" అన్నారు.

అల్లాహ్ సాలిహ్ (అస)కు ఈ మహత్యాన్ని ప్రసాదించాడు. ఒక విశిష్టమైన, భారీకాయం కలిగిన ఆడ ఒంటె కొండ నుంచి బయటకు వచ్చింది. వారందరూ ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టారు. వారు ఆ ఒంటెను చంపుతారేమో అన్న భయం సాలిహ్ (అస)కు కలిగింది. ఆ విధంగా చేస్తే దేవుని శిక్షను ఆహ్వానించడమే అవుతుంది. అందువల్ల వారిని ఆయన హెచ్చరించారు. "ఆ ఒంటె మీకు దేవుని చిహ్నం. మీ జీవితాలు ఇప్పుడు దానితో ప్రత్యక్షంగా ముడిపడి ఉన్నాయి. మీ పొలాల్లో దానిని స్వేచ్ఛగా మేయనీయండి. బావి నీటిని ఒక రోజు మొత్తం ఆ ఒంటె తాగడానికి వదిలేయండి. మరుసటి రోజు మీరూ, మీ పశువులు బావి నీటిని వాడుకోండి. ఆ ఒంటెకు మీరు హాని కలిగిస్తే తక్షణం మీపై అల్లాహ్ శిక్ష విరుచుకుపడుతుంది"అని చెప్పారు.

కొంతకాలం వాళ్ళు ఆ ఒంటెను స్వేచ్ఛగా మేయడానికి, నీరు తాగడానికి వదిలేశారు. కాని మనస్సులో వారందరూ దానిని ద్వేషించడం ప్రారంభించారు. అయితే ఒక మహత్యంగా ఆ ఒంటె కొండ నుంచి రావడం చూసిన కొందరు సాలిహ్ (అస) సందేశాన్ని సత్యమైనదిగా విశ్వసించారు. ఇది చూసి పాలక వర్గానికి చెందిన వారు మరింత ఆందోళన చెందారు. సాలిహ్ (అస) అనుచరులను వారు



అయోమయానికి గురిచేసే ప్రయత్నం చేశారు. కాని సాలిహ్(అస) అనుచరులు తమ విశ్వాసాన్ని హృదయాల్లో ప్రతిష్ఠించుకున్నారు.

అవిశ్వాసుల నాయకులు ఆ ఆడ ఒంటెపై ఫిర్యాదులు మొదలు పెట్టారు. భారీ ఆడ ఒంటె బావిలో నీరు మొత్తం తాగేస్తోందనీ, తమ పశువులు దాన్ని చూసి భయపడుతున్నాయని వారు ఆరోపించడం ప్రారంభించారు.

ఆ ఆడ ఒంటెను చంపడానికి వాళ్ళు ఒక పథకం రచించారు. అందుకు వారు ఆడవాళ్ళ సహాయం తీసుకున్నారు. తమ ఆదేశాలను మగవాళ్ళు పాటించేలా ఆడవాళ్ళతో చెప్పించారు. మాహ్యా కుమార్తె సాదుక్ ఉన్నత వంశానికి, సంపన్న కుటుంబానికి చెందినది. మప్రాజ్ కుమారుడు మస్దా యువకుడు. సాదుక్ అతణ్ణి ప్రలోభపెట్టింది. ఆ భారీ ఆడ ఒంటె మోకాలి కండరాన్ని తెగ్గొడితే నీ దాన్నయి పోతానంది. అనీజా అనే వృద్ధమహిళ తన కుమార్తెల్లో ఒక కుమార్తెను చూపించి సాలిఫ్ కుమారుడు కుదార్‌ను ప్రలోభపెట్టింది. ఆడ ఒంటెను చంపితే నా కూతురు నీదేనని చెప్పింది. సహజంగానే ఈ కుర్రాళ్ళు ఈ ప్రతిపాదనల ప్రలోభానికి గురయ్యారు. వారు మరో ఏడుగురిని తమ సహాయానికి ఎన్నుకున్నారు. వారందరూ ఆ ఒంటెను చాలా దగ్గరగా పరిశీలించారు. దాని కదలికలను జాగ్రత్తగా పరికించారు.

ఆ ఒంటె బావి దగ్గర నీళ్ళు తాగుతున్నప్పుడు మస్దా బాణంతో దాని కాలిని గురిచూసి కొట్టాడు. అది తప్పించుకోవడానికి ప్రయత్నించింది. కాని బాణం దెబ్బకు పరుగెత్తలేకపోయింది. కుదార్ దాన్ని అనుసరించి ఖడ్గంతో దాని కాలిపై వేటు వేశాడు. అది నేలపై కూలిపోగానే దానిని ముక్కలు ముక్కలు చేశాడు.

ఒంటెను చంపిన వారికి గొప్ప స్వాగతం లభించింది. పాటలు పాడుతూ వారిని పొగిడారు. వారి గొప్పదనాన్ని కీర్తిస్తూ కవితలు అల్లారు. అహంభావంతో వారు సాలిహ్ (అస)ను ఎగతాళి చేశారు. ఆయన వారితో, "మరో మూడు రోజులు జీవితాన్ని అనుభవించండి. ఆ పిదప మీపై శిక్ష రానుంది" అన్నారు. వారు తాము చేసిన తప్పులు తెలుసుకుంటారనీ, ఈ మూడు రోజుల్లో తమ ప్రవర్తనను మార్చుకుంటారని సాలిహ్ (అస) ఆశించారు. కాని వాళ్ళు ఆయన్ను ఎగతాళి చేస్తూ, "మూడు రోజులెందుకు? ఆ శిక్షేదో త్వరగా రానివ్వు" అన్నారు. ఆయన

https://teluguislam.net



వారికి నచ్చచెబుతూ, "ప్రజలారా! మీరు మంచికి బదులుగా చెడు కోసం తొందరపడు తున్నారెందుకు? మీరు అల్లాహ్‌తో క్షమాభిక్ష ఎందుకు కోరుకోవడం లేదు? ఆ విధంగా మీరు దేవుని కారుణ్యం పొందే అవకాశం ఉంది కదా!" అన్నారు. కాని వారు ఆయన మాటల్ని ఖాతరు చేయలేదు. పైగా "నీ ఉనికి, నీ అనుచరుల ఉనికి మాకు చెడ్డ శకునంగా దాపురించింది" అని వారు ఆయనతో అన్నారు.

## అల్లాహ్ పథకం

అవిశ్వాసులు సాలిహ్ (అస)ను, ఆయన కుటుంబీకులను హతమార్చే పథకం వేశారు. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ దీని గురించి చెబుతూ, "వారు పథకం వేశారు. మేము కూడా ఒక పథకం వేశాము, దాన్ని వారు అర్థం చేసుకోవడం సాధ్యం కాదు" అని పేర్కొన్నాడు. అల్లాహ్ సాలిహ్(అస)ను, ఆయన అనుచరులను అవిశ్వాసుల కుట్ర నుంచి కాపాడాడు. సాలిహ్ (అస) బాధాతప్త హృదయంతో దుర్మార్గులను వదలి తన అనుచరులతో సహా మరో ప్రదేశానికి తరలి పోయారు.

సాలిహ్ (అస) హెచ్చరించిన మూడు రోజులు గడిచిన పిదప మహా ఉరుములు దద్దరిల్లాయి. భయంకరమైన భూకంపం కుదిపేసింది. మొత్తం జాతిని, వారి ఇళ్ళను సర్వనాశనం చేసింది. వారి బలమైన భవనాలు, కొండలను తొలచిన వారి నివాసాలు ఏవీ వారిని కాపాడలేకపోయాయి.

*(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 11:61-67, 7:73-79, 26:141-159, 26:45-53, 27:51, 54:23-31, 91:11-15)*

## గ్రహించవలసిన పాఠాలు

- ఆద్, సమూద్ జాతుల కథల్లో ఒకే విధమైన గుణపాఠం ఉంది. అల్లాహ్ ప్రసాదించిన నైపుణ్యాలను, సంపదను, బలసామర్థ్యాలను దుర్వినియోగం చేయడం ప్రారంభించిన జాతి వినాశం వైపునకు ప్రయాణిస్తుంది. హూద్ (అస) ఆద్ జాతి ప్రజలను దేవుని అవిధేయతకు పాల్పడవద్దని బోధించారు. తమ సంపదను ప్రదర్శించడానికి విలాసవంతమైన భవనాలు నిర్మించి సుఖవిలాసాల కోసం వృథా చేయవద్దని వారించారు. సమూద్ జాతి ప్రజలు సాలిహ్ (అస)ను మహత్యం చూపించమని కోరారు. ఆ విధంగా ప్రవక్తనని నిరూపించుకొమ్మన్నారు. కాని మహత్యం చూపించిన తర్వాత దాని పట్ల అనుచితంగా వ్యవహరించారు.



- హూద్ (అస) జాతి ప్రజలను అల్లాహ్ కఠినంగా శిక్షించాడు. ఎందుకంటే వారు దుర్మార్గులైన తమ పాలకులను గుడ్డిగా అనుసరించారు. ఆ విధంగా వినాశాన్ని కొనితెచ్చుకున్నారు.
- దివ్యఖుర్‌ఆన్ ప్రకారం, సంపద అన్నది వ్యక్తిగతమైనది కావచ్చు. కాని దాని ప్రయోజనాన్ని అవసరార్థులు, నిరుపేదలతో పంచుకోవాలి.
- సంస్కర్తకు స్థైర్యం, సహనం ఉండాలి. హూద్(అస) తనపై కుట్ర పన్నిన వారిని ఎదిరించారు. కేవలం అల్లాహ్‌పై మాత్రమే భారం వేశారు. అల్లాహ్ ఆయన భయాలను దూరం చేసి భద్రతను ప్రసాదించాడు. ఆయన బలహీనతలను బలంగా మార్చాడు.
- ప్రజలు తమకు లభించిన జ్ఞానవిజ్ఞానాలు, వైజ్ఞానిక, సాంకేతిక ప్రగతీ వికాసాలు చూసి అహంభావానికి గురవుతారు. సత్యాన్ని నిరాకరిస్తారు. బలహీనులను బానిసలుగా చేసుకుంటారు. వారి సంపదను, వనరులను దోచుకోవడానికి ప్రయత్నిస్తారు.
- పాపాలు, అవిధేయత జీవనవిధానంగా మారినప్పుడు అల్లాహ్ చట్టం ప్రభావం చూపుతుంది. అది వారి వినాశానికి మార్గం అవుతుంది. కేవలం అల్లాహ్ వైపునకు మరలడం ద్వారా, ఆయన్ను క్షమాభిక్ష వేడుకోవడం ద్వారా మాత్రమే దైవాగ్రహం నుంచి తప్పించుకోగలుగుతారు.

https://teluguislam.net



రెండవ విభాగం

# ప్రవక్త ఇబ్రాహీమ్

(అలైహిస్సలాం)

(క్రీ.పూ. 2000-1950, ప్రవక్త షుఐబ్ (అస) కాలం వరకు)



"ఆ తరువాత ఇబ్రాహీమ్ ఆ విగ్రహాలన్నింటినీ ముక్కలు ముక్కలుగా పగులగొట్టాడు. అయితే పెద్ద విగ్రహాన్ని మాత్రం విడిచి పెట్టాడు. వారంతా దానివైపు మరలటానికే (అలా చేశాడు)." (ఖుర్‌ఆన్ 21 : 58)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

బాబిలోనియా ప్రజలు సెమెటిక్ జాతికి చెందిన ప్రజలు. భోగభాగ్యాల జీవితం గడిపేవారు. విగ్రహాలను చెక్కి వాటిని పూజించేవారు.

కనాన్ కుమారుడు నమ్రూద్ వారి పాలకుడు. పరమ స్వార్థపరుడు. నిరంకుశుడైన నియంత. ప్రజలను బెదిరించి, భయపెట్టి తన చెప్పుచేతల్లో ఉంచుకున్నాడు. తన పాలనలో ప్రజలు భోగభాగ్యాలతో జీవిస్తున్నారన్న విషయం నమ్రూద్‌కి బాగా తెలుసు. ప్రజలు విలాసవంతమైన జీవితం తప్ప మరేదీ పట్టించుకోరన్నది కూడా అతనికి తెలుసు. ప్రజలు ఆరాధిస్తున్న విగ్రహాలకన్నా తానే గొప్పవాడినని భావించాడు. ఎందుకంటే విగ్రహాలు కనీసం చూడలేవు, వినలేవు, ఆలోచించలేవు, అనుభూతి చెందలేవు, ఎవరికీ రక్షణ కల్పించలేవు, ఎవరినీ సంపన్నులుగా లేదా నిరుపేదలుగా మార్చలేవు, కాని తాను ఎవరినైనా ఏమైనా చేయగల అధికారాలు కలిగిన వాడు. ఈ ఆలోచన కలిగిన వెంటనే నమ్రూద్ తానే అసలైన దేవుడినని ప్రకటించుకున్నాడు. విలాసవంతమైన జీవితం గురించి తప్ప మరి దేని గురించీ పట్టించుకోని ప్రజలు అతడు చెప్పినట్లు అతనే దేవుడని ఒప్పుకున్నారు.

ఈ నేపథ్యంలో పద్దాన్ అరమ్ అనే పట్టణంలో ఇబ్రాహీమ్ (అస) జన్మించారు. అల్లాహ్ ఆయనకు ఎంతో



వివేకాన్ని, విజ్ఞతను, వివేచనను ప్రసాదించాడు. ఆయనకు సత్యమార్గాన్ని చూపించాడు. ఇబ్రాహీమ్ (అస) ప్రజలకు నిజమైన దేవుడిని ఆరాధించాలని బోధించడం ప్రారంభించారు. ఏకైక దేవుడైన అల్లాహ్‌నే ఆరాధించాలనీ, విగ్రహాలను ఆరాధించడంలో విజ్ఞత లేదని ప్రచారం చేయసాగారు.

ఇబ్రాహీమ్ (అస) అల్లాహ్ పట్ల దృఢమైన విశ్వాసం కలిగినవారు. సృష్టికర్త అయిన అల్లాహ్ సర్వశక్తిమంతుడన్న బలమైన నమ్మకం కలిగినవారు. తనకు అల్లాహ్ తరపున అందిన సందేశాన్ని హృదయపూర్వకంగా విశ్వసించేవారు. మనుష్యులందరూ మరణానంతరం ఒక రోజున మళ్ళీ బ్రతికించబడతారనీ, వారు తమ కర్మలకు జవాబు చెప్పుకోవలసి ఉంటుందని పూర్తి విశ్వాసం కలిగిన వారు. అయితే ఆయనకు మరణానంతరం మనిషి మళ్ళీ ఎలా బతుకుతాడో కళ్ళారా చూడాలన్న కుతూహలం ఉండేది.

## పక్షుల మహత్యం

ఆయన అల్లాహ్‌ని వేడుకుంటూ మరణానంతరం మళ్ళీ లేపబడడం అన్నది ఎలా జరుగుతుందో చూపించాలని ప్రార్థించారు. నాలుగు పక్షులను పట్టుకుని వాటిని కోసి వాటి శరీర భాగాలను కలగలపమని అల్లాహ్ ఆయన్ను ఆదేశించాడు. అలా కలగలిపిన శరీర భాగాలను నాలుగు వాటాలుగా చేసి వాటిని వేరు వేరు కొండలపై పెట్టాలని నిర్దేశించాడు. ఆ పిదప ఆ పక్షులను దేవుని పేరుతో పిలువాలని చెప్పాడు. ఇబ్రాహీమ్ (అస) దేవుని ఆదేశం ప్రకారం చేశారు. ఆయన పిలిచిన వెంటనే కలగలిసిన శరీర భాగాలు ఏ పక్షివి ఆ పక్షివిగా వేరు పడ్డాయి. పక్షులు బ్రతికి ఎగిరి వచ్చాయి. అలాంటి అద్భుతమైన మహిమ చూసిన వ్యక్తికి మనిషి మరణానంతరం మళ్ళీ లేపబడతాడన్న విషయంలో ఎలాంటి సందేహం ఉండే ఆస్కారమే లేదు. అయితే అల్లాహ్‌కు ఏది చేయడమైనా కష్టం కాదు. ఆయన ఏదయినా చేయదలిచితే "అయిపో" అంటాడు. అంతే ఆ పని అయి పోతుంది *(దివ్యఖుర్‌ఆన్ 2 :260)*.

## తండ్రీ కుమారుల వాగ్వివాదం

ఇబ్రాహీమ్ (అస) తండ్రి పేరు ఆజర్. అతను విగ్రహారాధకుడు మాత్రమే కాదు, విగ్రహాలను చెక్కి అమ్మేవాడు. ఒక మంచి కుమారుడిగా తాను తన తండ్రికి ఈ పనిలోని అనౌచిత్యం గురించి చెప్పడం తన బాధ్యతగా ఇబ్రాహీమ్

(అస) భావించారు. ఆ విధంగా తన తండ్రిని అల్లాహ్ ఆగ్రహం నుంచి కాపాడాలనుకున్నారు. కాని ఈ విషయాన్ని చాకచక్యంగా, తండ్రి బాధపడకుండా చెప్పాలనుకున్నారు. ఆయన తన తండ్రి ఆరాధిస్తున్న విగ్రహాల విషయంలో ఎగతాళి చేయలేదు. తండ్రి పట్ల తనకున్న ప్రేమను తెలియజేసి ఆ విధంగా తండ్రిలో ప్రేమాభిమానాలను ప్రేరేపించి తన మాటలను తండ్రి శ్రద్ధగా వినేలా చేసుకున్నారు. ఆ తర్వాత నెమ్మదిగా నచ్చజెప్పారు. జీవం లేని విగ్రహాలను ఎందుకు పూజిస్తున్నారని ప్రశ్నించారు. వినలేని, చూడలేని, కాపాడలేని విగ్రహాలను పూజించడం ఎందుకని అడిగారు. తండ్రికి కోపం రాకముందే, "నాన్నా! మీకు తెలియని జ్ఞానం నా వద్దకు వచ్చింది. నన్ను అనుసరించడం చిన్నతనమవుతుందని దయచేసి భావించవద్దు. మీ అనుభవం కాని, మీ వయసు కాని నాకు లేవన్న సంగతి నాకు బాగా తెలుసు. కాని షైతాన్ మానవాళికి శత్రువు, మనిషిని దారి తప్పించి దుర్మార్గానికి పాల్పడేలా చేస్తాడు" అన్నారు. కుమారుడు నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా చెబుతున్న ఈ మాటలు విని ఆ తండ్రి ఆశ్చర్యపోయాడు. కుమారుడితో మాట్లాడుతూ, "నీవు నా దేవుళ్ళను కాదంటున్నావా? ఇబ్రాహీమ్! నువ్వు అలా చేస్తే నేను నిన్ను రాళ్ళతో కొట్టిస్తాను. నా కోపం నీకు తెలుసు. ఒక తండ్రి మాదిరి దయాగుణాన్ని నువ్వు నాలో చూడలేవు. ఇక నన్ను ఒంటరిగా వదిలేయ్!" అన్నాడు. (అంటే ఇబ్రాహీమ్ (అస) తన ఇల్లు వదలి వెళ్ళిపోవాలని పరోక్షంగా సూచించాడు).

ఇబ్రాహీమ్ (అస) మౌనంగా ఊరుకున్నారు. అయితే తన తండ్రికి నచ్చజెప్పడం మానుకోలేదు. "మీకు శాంతి కలుగుగాక! మీ కోసం నా ప్రభువుతో క్షమాభిక్ష అర్థిస్తాను. అల్లాహ్ అనంత కరుణామయుడు. మీకూ, మీరు ఆరాధిస్తున్న వాటికి నేను దూరంగా వెళ్ళక తప్పదు" అన్నారు. తన తండ్రికి వీడ్కోలు చెప్పి భారమైన మనసుతో ఇల్లు వదలి వెళ్ళిపోయారు.

## సంవాదం

తండ్రి కఠినంగా నివారించినా ఇబ్రాహీమ్ (అస) తన సత్యసందేశ ప్రచారాన్ని మానుకోలేదు. ప్రజలు ప్రాణం లేని విగ్రహాల ముందు సాష్టాంగ పడడం చూసి ఆయన చాలా బాధపడేవారు. ఈ ఆచారాన్ని మానిపించాలని ఆయన తీర్మానించుకున్నారు. ఈ విషయమై ప్రజలతో వాదించడానికి సిద్ధపడ్డారు.

https://teluguislam.net



ఇలాంటి వాదనల వల్ల తనకు ప్రమాదమని తెలిసినా ఆయన వెనుదీయలేదు.

ఒక వైద్యుడు తగిన చికిత్స సూచించడానికి రోగనిర్ధారణకు పరీక్షలు చేసినట్లుగా, ఒక న్యాయమూర్తి నిందితుడిని ప్రశ్నించి సత్యాన్ని రాబట్టడానికి ప్రయత్నించినట్లుగా ఇబ్రాహీమ్ (అస) ప్రజలను ప్రశ్నించారు. "మీరు సాష్టాంగ పడినప్పుడు ఈ విగ్రహాలు మిమ్మల్ని చూస్తాయా? మీకు ఏ విధంగా నయినా ఇవి ప్రయోజనం కలిగిస్తాయా?" అని అనేవారు.

ప్రజలు ఆయనకు జవాబిస్తూ, విగ్రహాలకు ప్రాణం లేదన్న వాస్తవం తమకు కూడా బాగా తెలుసనీ, కాని తమ తాతముత్తాతలు వాటిని పూజించారనీ, విగ్రహాల శక్తిసామర్థ్యాలకు ఇంతకన్నా రుజువు ఏంకావాలని అన్నారు.

మీ తాతముత్తాతలు తప్పు చేశారని ఇబ్రాహీమ్ (అస) వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. ఈ మాటలు విన్న ప్రజలు ఆగ్రహంతో మండిపడ్డారు. "నువ్వు మా దేవుళ్ళను, మా తాతముత్తాతలను నిందిస్తున్నావా? లేక పరిహాసానికి చెబుతున్నావా?" అని నిలదీశారు. ఇబ్రాహీమ్ (అస) ఎలాంటి సంకోచం లేకుండా తాను పరిహాసం చేయడం లేదనీ, సత్యం చెబుతున్నాననీ, తాను ఒక సత్యమైన ధర్మం తీసుకువచ్చాననీ, అందరి ప్రభువైన అల్లాహ్ తనకు మార్గదర్శకత్వాన్ని ఇచ్చి పంపాడనీ, అల్లాహ్ ఒక్కడే ఏకైక దేవుడనీ, ఆయనే సృష్టికర్త అనీ, భూమ్యాకాశాలను సృష్టించింది ఆయనేననీ, ఆయనే జీవన వ్యవహారాలన్నీ నడుపుతున్నాడనీ, కేవలం కలప, రాళ్ళతో చేసిన ఈ విగ్రహాలు కాదని నిర్మొహమాటంగా చెప్పారు. ఈ విగ్రహాలు తనకు ఎలాంటి హాని చేయలేవని వారికి నచ్చజెప్పడానికి ఆయన వారితో సవాలు చేశారు. "నేను విగ్రహాలను బాహాటంగా విమర్శించాను. వాటికి నిజంగా శక్తి ఉంటే ఈ పాటికి అవి నాకు హాని కలిగించి ఉండేవి" అన్నారు.

అల్లాహ్ సృష్టిలోని సౌందర్యాన్ని ఇబ్రాహీమ్ (అస) వారికి వివరించారు. అల్లాహ్ శక్తి సామర్థ్యాలను, అల్లాహ్ వివేకవిజ్ఞతలను తెలియజేశారు. విగ్రహారాధనను అల్లాహ్ ఏవగించుకుంటాడనీ, ఈ సమస్త విశ్వానికి అల్లాహ్ మాత్రమే నిజమైన ప్రభువనీ, ఆయన తనను సృష్టించాడనీ, తనకు మార్గదర్శకత్వాన్ని ఇచ్చాడనీ, తనకు అన్నపానీయాలు కల్పిస్తున్నాడనీ, జబ్బు పడినప్పుడు స్వస్థత ఇస్తున్నాడనీ, ఆయనే మృత్యువును ఇస్తాడనీ, తర్వాత మళ్ళీ బ్రతికించి లేపుతాడని వివరించారు. తాను ఆయన్నే ఆరాధిస్తున్నాననీ, ఆయనే తీర్పుదినాన తన

https://teluguislam.net



తప్పులను మన్నిస్తాడని చెప్పారు. కాని ప్రజలు ఈ వాస్తవాలను గుర్తించకుండా విగ్రహారాధన కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## విగ్రహాల యుద్ధం

పట్టణానికి బయట ఒక ఉత్సవం జరుపుకునే సంప్రదాయం వారికి ఉండేది. అయితే ఆ ఉత్సవానికి వెళ్ళే ముందు విగ్రహాలకు ప్రసాదాలు పెట్టి వాటి ఆశీర్వాదం తీసుకుని వెళ్ళేవారు. ఉత్సవం నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఆ ప్రసాదాన్ని పంచుకు తినేవారు. ఇబ్రాహీమ్ (అస) వారితో పాటు ఉత్సవానికి రానన్నారు. పట్టణంలోనే ఉండిపోయారు. పూర్తి పట్టణంలోని ప్రజలందరూ ఊరి బయటకు ఉత్సవంలో పాల్గొనడానికి వెళ్ళారు. పూజారులు కూడా వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఇబ్రాహీమ్ (అస) విగ్రహాలున్న ఆలయంలోకి ప్రవేశించారు. చాలా విగ్రహాల పాదాల వద్ద ఆహార పదార్థాలు ఉన్నాయి. ఇబ్రాహీమ్ (అస) విగ్రహాలను భోంచేయడం లేదేమని వ్యంగ్యంగా అడిగారు. కోపంగా ఆ విగ్రహాలన్నింటినీ విరగ్గొట్టారు. ఒక దాని తర్వాత ఒకటిగా విగ్రహాలన్నీ ముక్కలు చేసి ఒక పెద్ద విగ్రహాన్ని మాత్రం వదిలేశారు. అప్పటికి ఆయన కోపం చల్లారింది. పూజారులు, ప్రజలు తిరిగి వచ్చి విగ్రహాలన్నీ ధ్వంసమై ఉండడం చూసి నిర్ఘాంతపోయారు. ఇలాంటి పని చేసేది ఇబ్రాహీమ్ తప్ప మరెవ్వరూ కాదని నిర్ణయించారు. ఆగ్రహంగా ఇబ్రాహీమ్‌ను నిర్బంధించి విచారణ జరపాలన్నారు. ఇబ్రాహీమ్ (అస) కూడా అందుకు ఒప్పుకున్నారు. ఆయన కూడా విచారణ జరగాలనే కోరుకున్నారు. బహిరంగంగా విచారణ జరిగితే ప్రజలకు వారి మూర్ఖ ఆచారాల గురించి బాహాటంగానే వివరించవచ్చని ఆయన భావించారు.

## విచారణ

విచారణలో ఇబ్రాహీమ్ (అస)ను విగ్రహాల విధ్వంసం గురించి ప్రశ్నించారు. విగ్రహాలను విరగ్గొట్టింది నీవేనా అని అడిగారు. ఇబ్రాహీమ్ (అస) నవ్వుతూ, విరక్కుండా ఉన్న పెద్ద విగ్రహాన్ని అడిగితే చెబుతుంది కదా అన్నారు. అసలు ఆ పెద్ద విగ్రహమే మిగిలిన విగ్రహాలను విరగ్గొట్టి ఉంటుంది అని కూడా చెప్పారు. ఈ మాటలు విన్న వాళ్ళు కోపంతో, విగ్రహాలు మాట్లాడవని నీకు తెలియదా అన్నారు. ఈ జవాబు కోసమే ఎదురు చూస్తున్న ఇబ్రాహీమ్ (అస) ప్రాణం



లేని వాటిని పూజించడం ఎంత నిష్ప్రయోజనకరమో వారికి వివరించారు.

తమ విశ్వాసాలలోని హేతురాహిత్యాన్ని వాళ్ళు కూడా గుర్తించారు. కాని వారి అహంకారం సత్యం అంగీకరించకుండా అడ్డుపడింది. తమ బలాన్ని ప్రదర్శించడం తప్ప వారు మరో జవాబు ఇవ్వలేకపోయారు. సాధారణంగా నియంతలు చేసే పనే ఇది. వారు ఇబ్రాహీమ్ (అస)ను సంకెళ్ళతో బంధించి ప్రతీకారం తీర్చుకునే పథకం వేశారు.

*(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 21:52-68, 26:69-102, 29:16,17,34)*

## అగ్నిగుండం

వారి గుండెల్లో కోపం బుసలు కొట్టసాగింది. ఇబ్రాహీమ్ (అస)ను ఒక మహా అగ్నిగుండంలో విసరివేయాలని నిర్ణయించారు.

తమ దేవుళ్ళకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రజలందరూ కట్టెలు సమీకరించాలని ఆదేశించడం జరిగింది. అజ్ఞానంతో కొందరు వ్యాధిగ్రస్తులైన మహిళలు, తమ వ్యాధి తగ్గిపోతే తాము సాధ్యమైనంత ఎక్కువ కలప ఇబ్రాహీమ్ (అస) దహనానికి ఇస్తామని మొక్కుకున్నారు. అనేక రోజుల పాటు వారు కట్టెలు, కలప సేకరించారు. ఆ తర్వాత వాళ్ళు మహా అగ్ని గుండాన్ని వెలిగించారు. ఆ మహా అగ్నిగుండం భగభగ మండసాగింది. ఆ మంటల నుండి వచ్చిన భీకరధ్వని చాలా దూరం వరకు వినిపించసాగింది. అందులో నిప్పులు ఎర్రగా మండసాగాయి. వాళ్ళు ఇబ్రాహీమ్ (అస)ను తాళ్ళతో కట్టేసారు. ఆయన్ను అగ్ని గుండంలోకి విసరివేసారు. నల్లని దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని ఆవరించుకుంది.

ఆ అగ్నిగుండం చల్లారిన తర్వాత, పొగ తగ్గిన తర్వాత వాళ్ళు అందులో చూసి దిగ్భ్రాంతి చెందారు. అందులో నుంచి ఒక వ్యక్తి ఒంటరిగా బయటకు వస్తున్నాడు. తన స్నేహితునిగా అభివర్ణించిన ఇబ్రాహీమ్ (అస)ను విశ్వప్రభువైన అల్లాహ్ కాపాడాడు. భగభగలాడే అగ్నికీలలు ఇబ్రాహీమ్ (అస)కు పూలమాలల్లా స్వాగతమిచ్చాయి. ఆయనకు కట్టి ఉన్న తాళ్ళను మాత్రమే అవి దహించాయి. ఈ మహత్యాన్ని చూసి నిరంకుశ పాలకుడు సిగ్గుపడ్డాడు. కాని వారి మనస్సులో ఉన్న ఆగ్రహజ్వాలలను ఇది చల్లార్చలేకపోయింది. అయితే ఈ మహత్యాన్ని చూసిన తర్వాత చాలా మంది ఇబ్రాహీమ్ (అస) సందేశాన్ని విశ్వసించారు.

కొందరు తమ విశ్వాసాన్ని రహస్యంగా ఉంచారు. నిరంకుశుడైన పాలకుడు తమను హతమార్చ వచ్చుని లేదా తమకు హాని కలిగించవచ్చని భయపడ్డారు.

ఇబ్రాహీమ్ (అస) నిరపాయంగా అగ్నిగుండం నుంచి బయటపడిన వార్త నిరంకుశ పాలకుడు నమ్రూద్ విన్నాడు. కోపంతో మండిపడ్డాడు. తన్ను తాను దేవుడిగా ప్రకటించుకున్న నమ్రూద్ తన దైవత్వానికి ప్రమాదం వచ్చిందని భయపడ్డాడు. అదీ ఒక సాధారణ మానవుడైన, ఇబ్రాహీమ్ (అస) వల్ల ఆ ప్రమాదం ముంచుకు వస్తోందని ఆందోళన చెందాడు. ఇబ్రాహీమ్ (అస)ను తన రాజ భవనానికి పిలిచి తీవ్రంగా హెచ్చరించాడు. "నువ్వు నా ప్రజల్లో అలజడి సృష్టిస్తున్నావు. నన్ను మించిన దేవుడు ఎవడూ లేడు" అన్నాడు. ఇబ్రాహీమ్ (అస) జవాబిస్తూ, "జీవన్మరణాలు ప్రసాదించేవాడే నా ప్రభువు. ఆయనే ఈ సమస్త విశ్వానికి సృష్టికర్త" అన్నారు. ఈ మాటలు విన్న నమ్రూద్ తన గొప్పదనాన్ని చూపించడానికి, "నేను కూడా జీవితాన్ని ప్రసాదిస్తాను. నేను తలచిన వారిని ప్రాణాలతో వదిలేస్తాను. నేను తలచిన వారిని చంపించగలను. కాబట్టి నీ ప్రభువు చేసే పని ప్రత్యేకమైనదేం కాదు" అన్నాడు.

ఇబ్రాహీమ్ (అస) నవ్వుతూ తలాడించారు. "నా ప్రభువు సూర్యుడిని తూర్పు నుంచి ఉదయించేలా చేస్తున్నాడు. పడమట అస్తమించేలా చేస్తున్నాడు. నువ్వు దేవుడివైతే ఈ క్రమాన్ని మార్చి చూపించు" అన్నారు. ఈ మాటలు విన్న నమ్రూద్ నోరెళ్ళబెట్టాడు. అతడి మూర్ఖపు వాదన తేటతెల్లమైపోయింది. అందరి ముందు సిగ్గుపడే పరిస్థితి ఏర్పడింది. కాని ఇబ్రాహీమ్ (అస)ను బహిరంగంగా చంపించడానికి భయపడ్డాడు. చాలా మంది దీని వల్ల తనకు వ్యతిరేకులై పోతారనీ, తనకు శత్రువులైపోతారనీ భయపడ్డాడు. అందువల్ల ప్రజల్లోకి తన మనుష్యులను పంపించి ఇబ్రాహీమ్ (అస)ను అనుసరిస్తే వారికి తీవ్రపరి ణామాలు తప్పవనీ, మరణశిక్ష విధించడం కూడా జరుగుతుందని బెదిరింపులను జారీ చేయించాడు.

ఆ పట్టణంలో తన సందేశాన్ని స్వీకరించేవారు ఇంకెవరూ లేని పరిస్థితిని గమనించిన ఇబ్రాహీమ్ (అస) అక్కడి నుంచి తరలిపోయారు.

*(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 2:2,5,8)*



https://teluguislam.net

## ఖగోళాలను ఆరాధించే ప్రజలు

ఇబ్రాహీమ్ (అస) అక్కడి నుంచి హర్రాన్ అనే ప్రదేశానికి వచ్చారు. ఈ ప్రదేశం పలస్తీనాకు దగ్గరగా ఉంది. అక్కడే ఆయన స్థిరపడ్డారు. అక్కడి ప్రజలు తెలివిగల వారని విన్నారు. ప్రకృతిలోని వింతలను పరిశీలించడం వారికి చాలా యిష్టమని కూడా గ్రహించారు. తన సందేశాన్ని స్వీకరించేవారు ఇక్కడ లభిస్తారని ఆశించారు. అయితే అక్కడి ప్రజలు ఖగోళాలను పూజించడం కనబడింది. కాని ఆ ప్రజలు ఆలోచించే, పరిశీలించే అలవాటు కలిగిన ప్రజలు కాబట్టి హేతుబద్ధ మైన వాదనతో వారిని మార్చవచ్చుని ఆయన భావించారు. ఒక రాత్రి నక్షత్రాలు మిలమిల లాడుతున్నప్పుడు ఆయన వాటిని చూపించి, "అదే నా ప్రభువు" అని బిగ్గరగా పలికారు. కాని ఆ నక్షత్రాలు కనుమరుగైపోయిన తర్వాత, "అరె నా ప్రభువు ఎక్కడికి వెళ్ళాడు?" అని బిగ్గరగా పలికారు. ఇది విన్న ప్రజలు నక్షత్రాలు అస్తమించాయని అన్నారు. ఆ మాటలు విన్న ఇబ్రాహీమ్ (అస), "ఇలా కనుమరుగయ్యే వాడు నా దేవుడు కాదు" అన్నారు. చంద్రుడు పెద్దగా, ప్రకాశవంతంగా కనబడడాన్ని చూసి ఆయన, "ఇదే నా ప్రభువు కావచ్చు" అని బిగ్గరగా పలికారు. కాని చంద్రుడు కూడా అస్తమించాడు. ఇది చూసిన ఇబ్రాహీమ్ (అస), "నా ప్రభువు నాకు మార్గదర్శకత్వాన్ని ఇచ్చి ఉండనట్లయితే నేను కూడా దారితప్పే వాడిని" అన్నారు. ఉదయం సూర్యుడు ఉదయించాడు. సూర్యుడిని చూస్తూ ఇబ్రాహీమ్ (అస), "ఇది తప్పక నా ప్రభువు అయి ఉండాలి. ఇది చాలా పెద్దగా ఉంది. చాలా తీక్షణమైన ప్రకాశం కలిగి ఉంది. కాబట్టి మరింత ప్రయోజన కరమైనది" అన్నారు. కాని సూర్యుడు కూడా అస్తమించడాన్ని చూసి "నిస్సం దేహంగా ఈ ఖగోళాలు అన్నీ కూడా ఒక విశ్వప్రభువు ఆదేశాల ప్రకారం నడుచు కుంటున్నాయి" అని బిగ్గరగా పలికారు. ఈ విధమైన హేతుబద్ధమైన మాటలు ప్రజల మనోమస్తిష్కాలపై పని చేస్తాయనీ, వారు సత్యాన్ని గ్రహిస్తారనీ ఆయన ఆశించారు. కాని ఆయన ఎంత ప్రయత్నించినా వాళ్ళు ఒకే దేవుడన్న విశ్వాసానికి రాలేదు. వారు అల్లాహ్ శిక్షకు భయపడలేదు. వారి వైఖరి వారిని నరకానికి తీసుకు పోతుందని ఇబ్రాహీమ్ (అస) వారిని హెచ్చరించారు. *(దివ్యఖుర్‌ఆన్: 6:74-83)*

## ఈజిప్టు యాత్ర

పలస్తీనాలో కరవు ఏర్పడింది. ఫలితంగా జీవితం దుర్భరమైంది. ఇబ్రాహీమ్ (అస) తన భార్య సారాను తీసుకుని ఈజిప్టుకు వలస వెళ్ళారు. సారా చాలా

https://teluguislam.net



అందమైన స్త్రీ. ఆమె అద్భుత సౌందర్యరాశి అన్న విషయాన్ని రాజోద్యోగులు రాజుకు తెలియజేశారు. అలాంటి సౌందర్యరాశి తన భవనంలో ఉంటే తన ప్రతిష్ఠ చాలా పెరుగుతుందని భావించిన రాజు ఇబ్రాహీమ్ (అస)ను పిలిపించి ఆయనకు సారాతో ఉన్న బాంధవ్యం ఏమిటని ప్రశ్నించాడు. ఆమెకు తానే భర్తనని చెబితే రాజు తనను హతమార్చే ప్రమాదాన్ని పసిగట్టిన ఇబ్రాహీమ్ (అస) ఆమె తన సోదరి అని చెప్పారు. రాజు ఇబ్రాహీమ్ (అస)తో ఆమెకు పెళ్ళయ్యిందా అని ప్రశ్నించినపుడు ఆయన మౌనం వహించారు.

## సౌశీల్యవతి సారా

రాజోద్యోగులు సారాను రాజప్రాసాదానికి తీసుకువెళ్ళారు. ఆమెకు ఖరీదైన దుస్తులు, ఆభరణాలతో అలంకరణలు చేశారు. కాని రాజప్రాసాదంలోని ఆడంబరాలు, సుఖభోగాలు ఆమెను సంతోషపెట్టలేదు. ఆమె హృదయ విదారకంగా రోదించసాగింది. అన్నపానీయాలు మానేసింది. రాజు ఆమెను ఓదార్చాలని ప్రయత్నించాడు. కాని ఫలితం దక్కలేదు. రాజు ఆమె సమీపానికి వచ్చినప్పుడల్లా ఒక విచిత్రమైన అనుభూతి అతన్ని క్రమ్ముకునేది. ఒకవిధమైన భయం ఆవరించేది. ఆమెను కనీసం తాకలేకపోయేవాడు. చివరికి రాజుకు కలలో ఆమె వివాహిత అని తెలిసింది. మరుసటి రోజు ఉత్తముడైన ఆ రాజు సారాను స్వేచ్ఛగా విడిచిపెట్టడమే కాదు, తన వద్ద ఉన్న సేవకురాలు హాజిరాను ఆమెకు కానుకగా ఇచ్చాడు. ఒక కొత్త దేశంలో ఒంటరివాడైన ఇబ్రాహీమ్ (అస)గారి గౌరవ మర్యాదలను ఆ విధంగా కాపాడాడు అల్లాహ్.

## పలస్తీనాకు తిరిగి రావడం

ఇబ్రాహీమ్ (అస) ఈజిప్టులో చాలా కాలం ఉన్నారు. అక్కడ ఆయన చాలా కష్టపడి పనిచేయడం వల్ల సంపన్నుడయ్యారు. అయితే జీవితంలో విజయాలు సాధించిన వ్యక్తికి ఇతరుల ఈర్ష్యాసూయలను కూడా ఎదుర్కోవలసి వస్తుంది. తన పట్ల ప్రజల్లో ఒక విధమైన అసూయ ఉందని గుర్తించిన ఇబ్రాహీమ్ (అస) తన భార్య సారాను, సేవకురాలు హాజిరాను తీసుకుని అక్కడి నుంచి పలస్తీనాకు తరలి వచ్చారు.



## ప్రవక్త ఇస్మాయీల్ (అస)

పలస్తీనాలో ఇబ్రాహీమ్ (అస) సందేశాన్ని కొందరు విశ్వసించారు. సత్య సందేశాన్ని స్వీకరించారు.

సారాకు సంతానం కలుగలేదు. ఆమెకు వయసుపైబడింది. పిల్లలు కలిగే వయసు దాటిపోయింది. తన భర్తకు ఒక పిల్లవాడిని ఇవ్వలేకపోయానని ఆమె బాధపడేవారు. అందువల్ల తమ సేవకురాలు హాజిరాను పెళ్ళి చేసుకోవలసిందిగా ఆమె భర్తను కోరారు. ఇబ్రాహీమ్ (అస) ఈ సలహా మన్నించారు. హాజిరాను వివాహం చేసుకున్నారు. హాజిరాకు ఒక కుమారుడు, ఇస్మాయీల్ (అస) జన్మించారు. ఇబ్రాహీమ్ (అస) చాలా సంతోషించారు. ఇస్మాయీల్ (అస)ను అమితంగా ప్రేమించారు.

## సహజమైన ఈర్ష్యాసూయలు

మొదట్లో సారా కూడా ఇబ్రాహీమ్ (అస) సంతోషంలో పాలుపంచుకున్నారు. కాని తర్వాత తన భర్త కొత్తగా జన్మించిన శిశువు పట్ల, శిశువు తల్లి అయిన హాజిరా పట్ల అధిక శ్రద్ధ చూపడం ఆమెలో ఈర్ష్యాసూయలకు కారణమయ్యింది. ఆమెలో అసూయ బుసలుకొట్టింది. వాళ్ళిద్దరిని ఎక్కడైనా దూరంగా విడిచి రావలసినదిగా ఆమె భర్తను కోరారు. సారా కోరినట్లు చేయవలసిందిగా అల్లాహ్ ఇబ్రాహీమ్ (అస)కు సూచించాడు. ఆయన ఎక్కడికి వెళ్ళవలసింది దేవుడు స్వయంగా మార్గం చూపిస్తానన్నాడు. అనేక రోజులు ప్రయాణించిన తర్వాత, భయంకరమైన ఎడారిని దాటిన తర్వాత, ఒక నిర్మానుష్యమైన ప్రదేశం వద్ద వారు విడిది చేశారు. అక్కడ చెట్టుచేమ మచ్చుకు కూడా లేవు. నీటి బొట్టు కూడా దొరకని నిర్జనమైన ప్రదేశం అది. ఆ ప్రదేశంలోనే ఇబ్రాహీమ్ (అస) తన భార్యాపిల్లలను వదలి వెళ్ళాలని దేవుడు ఆజ్ఞాపించాడు. ఇబ్రాహీమ్ (అస) తన భార్యకు కొన్ని ఎండు ఫలాలు, కొంత నీరు, ఒక గుడారం, మరికొన్ని వస్తువులు ఇచ్చి బరువైన మనసుతో విచారంగా అక్కడి నుంచి వెనుదిరగడానికి తన ఒంటెను అధిరోహించారు. హాజిరా ఆ ఒంటెను పట్టుకుని, “ఇబ్రాహీమ్! మమ్మల్ని ఈ నిర్జన ప్రదేశంలో ఎందుకు వదిలేస్తున్నారు? మీకు నా పట్ల ఎలాంటి అభిమానం లేకపోయినా కనీసం మీ కన్నబిడ్డ గురించి ఆలోచించండి. మీ

https://teluguislam.net



కుమారుడు ఇక్కడ ఆకలి దప్పులతో ప్రాణం వదిలేయవచ్చు. ఇక్కడ క్రూర మృగాలు మాపై దాడి చేయవచ్చు" అని వేడుకున్నారు. ఇబ్రాహీమ్ (అస) ఎడారిని చూస్తూ, సహనం వహించాలని ఆమెతో చెప్పారు. తాను తన ఇష్టప్రకారం వ్యవహరించడం లేదనీ, కేవలం అల్లాహ్ ఆదేశాలను అమలు చేస్తున్నాననీ జవాబిచ్చారు. ఆయన జవాబు ఆమెకు ఊరట కలిగించింది. కన్నీళ్ళు తుడుచు కుంటూ, "ఇది అల్లాహ్ అభీష్టమైతే ఆయన మమ్మల్ని ఒంటరిగా వదలిపెట్టడు" అన్నారు.

## ఇబ్రాహీమ్ (అస) దుఃఖం

తన కుటుంబాన్ని వదలి ఒక్కో అడుగు దూరంగా వెళుతున్న కొద్దీ ఇబ్రాహీమ్ (అస)కు దుఃఖం అతిశయించసాగింది. ముసలి వయసులో తనకు అల్లాహ్ ప్రసాదించిన ఏకైక కుమారుడిని అక్కడ వదిలి వెళుతున్న ఆలోచన కూడా భరించరానిదిగా ఉందాయనకు. అయితే విశ్వప్రభువు పట్ల దృఢమైన తన నిబద్ధతను నిరూపించుకునే పరీక్షల్లో ఇదొకటని ఆయన గుర్తించారు. ఆయన అల్లాహ్‌ను ప్రార్థిస్తూ, "ఓ ప్రభూ ! నీ పవిత్రమైన గృహానికి దగ్గరగా నిర్జన ప్రదేశంలో నేను నా కుటుంబీకులను వదలివచ్చాను. వారు అక్కడ దైవారాధనను స్థాపించాలని భావిస్తున్నాను. వారి పట్ల సానుభూతి, ఆదరాభిమానాలను ప్రజల్లో కలిగించు. వారికి కావలసిన సదుపాయాలు ప్రసాదించు" అని వేడుకున్నారు.

దేవునిపై భారం వేసిన హాజిరాకు విశ్వప్రభువు సహనాన్ని, ధైర్యాన్ని ప్రసాదించాడు. కొన్ని రోజులు గడచిన తర్వాత, వారి వద్ద ఉన్న ఆహారం, నీరు అయిపోయాయి. పసిబిడ్డతో సహా ఆమె ఆకలిదప్పులతో అలమటించసాగారు. బిడ్డకు పాలుపట్టడానికి ఆమె రొమ్ముల్లో పాలు కూడా రావడం లేదు. పసిబిడ్డ ఆకలితో దయ నీయంగా ఏడుస్తున్నాడు. హాజిరా కన్నీరు మున్నీరయ్యింది. బిడ్డను అక్కడే నేలమీద వదలి నీటి కోసం, ఆహారం కోసం వెదుకాడుతూ తిరగసాగారు. ఒక కొండను ఎక్కారు (ఈ కొండనే తర్వాత సఫా కొండగా పిలుస్తున్నారు). ఆ కొండపై నుంచి ఆ లోయ మొత్తాన్ని పరిశీలించి చూశారు. మరో వైపున ఇంకో కొండ కనబడింది (దీనిని తర్వాత మర్వా కొండ అని పిలుస్తున్నారు). ఆ కొండపై నుంచి చూస్తూ నీటి జాడ కనబడుతుందన్న ఆశతో ఆ కొండపై కెక్కారు. కాని ఏమీ



కనబడలేదు. ఆమె ఆందోళనతో మళ్ళీ మొదటి కొండపై కెక్కారు. ఆ విధంగా ఆమె నీటి కోసం వెదుకాడుతూ ఆ రెండు కొండల మధ్య ఏడుసార్లు పరుగులు తీశారు. (హజ్ యాత్ర సందర్భంగా సఫా మర్వా కొండల మధ్య ఏడుసార్లు పరుగెత్తుతూ చేసే 'సయీ' ఈ సంఘటన జ్ఞాపకార్థమే జరుగుతోంది.)

## జమ్‌జమ్

ఆమె నిరాశగా పసిబిడ్డ వద్దకు వచ్చారు. బిడ్డ పరిస్థితి దయనీయంగా ఉంది. "ఓ ప్రభూ! కరుణించు" అంటూ మొరపెట్టుకున్నారు. బిడ్డ పరిస్థితి క్షణ క్షణానికి దిగజారుతోంది. ఊపిరి మందగిస్తోంది. శ్వాస కష్టమవుతోంది.

బాధాతప్త హృదయంతో, తన ఏకైక సంతానం కొనప్రాణంతో పెనుగులాడడాన్ని ఆమె నిస్సహాయంగా చూడసాగారు. ఎండిపోయిన బిడ్డ గొంతు నుంచి ఎలాంటి ధ్వని రావడం లేదు. కేవలం కాళ్ళు కొట్టుకుంటున్న శబ్దం మాత్రం వినిపిస్తోంది. పసిబిడ్డ ఇస్మాయీల్ తన చిన్నారి కాళ్ళతో నేలను కొడుతున్న ప్రదేశంలో స్వచ్ఛమైన నీటి ఊట అకస్మాత్తుగా ఉబికి వచ్చింది. ఆమె తన కళ్ళను తాను నమ్మలేకపోయారు.

అల్లాహ్ పట్ల ఆమె చూపిన విధేయత, ఆమె ప్రదర్శించిన సహనాలకు అత్యుత్తమ బహుమానం లభించింది. ఎండిపోయిన నేల నుంచి స్వచ్ఛమైన జల ధార ఉబికి వచ్చేలా చేశాడాయన. తనకు నమ్మకస్తుడైన స్నేహితుడు ఇబ్రాహీమ్ (అస) కుటుంబం కష్టాల నుంచి బయటపడే దారి చూపించాడు. హాజిరా ఆ స్వచ్ఛమైన నీటిని బిడ్డ నోటిలో పోసారు. ఆ నీటితో బిడ్డ ప్రాణాలు కుదుట పడడాన్ని ఆమె ఆనందంగా వీక్షించారు. కన్నీళ్ళతో ఆమె అల్లాహ్‌కు కృతజ్ఞతలు అర్పించారు. ఆ అద్భుతమైన జలధారలే "జమ్‌జమ్" జలంగా ప్రసిద్ధి కెక్కాయి. 4000 సంవత్సరాల క్రితం నాటి ఈ జలధార నేటికి కూడా నిరంతరం ప్రవహిస్తూనే ఉంది. లక్షలాది హజ్ యాత్రికులకు అత్యంత ఆరోగ్యప్రదమైన నీటిని అందిస్తోంది. ఒకప్పుడు నిర్జనమైన ఆ ప్రదేశంలో జీవం తొణికిసలాడేలా చేసింది ఈ జమ్‌జమ్ జలమే.

## మరిన్ని చిహ్నాలు

దూరదూర ప్రాంతాలకు చెందిన పక్షులు ఆ నీటిని చూసి దాహం తీర్చుకోవడానికి అక్కడ వాలడం ప్రారంభించాయి. యెమన్ నుంచి వస్తున్న ఒక

అరబ్బు తెగ "జుర్‌హుమ్"★ దూరం నుంచి పక్షులు గుంపులుగా ఆ ప్రదేశం వైపునకు వెళ్ళడాన్ని గమనించారు. విచారించడానికి కొందరిని అక్కడికి పంపించారు. అక్కడికి వెళ్ళి వచ్చిన వారు అక్కడ నీటి వనరు ఉందని తెలిపారు. ఆ అరబ్బు తెగ ఆ ప్రదేశానికి వచ్చింది. ఆ నిర్జనప్రదేశంలో మనుష్యుల్ని చూసి హాజిరా చాలా సంతోషించారు. తనకు, తన కుమారునికి అల్లాహ్ పరిరక్షణ లభించిందనడానికి సూచనగా వారి ఆగమనాన్ని ఆమె భావించారు. ఆ ప్రజల హృదయాల్లో వారి పట్ల సానుభూతిని అల్లాహ్ జనింపజేశాడు. ఆ ప్రదేశం వైపునకు వారు వచ్చేలా చేశాడు. ఆ విధంగా ఇబ్రాహీమ్ చేసిన ప్రార్థనను దేవుడు ఆమోదించాడు.

ఆ ప్రదేశంలో జమ్‌జమ్ నీటి ఊట బయటపడినందు వల్ల యెమన్ నుంచి అక్కడకు వచ్చిన జుర్‌హుమ్ తెగ అక్కడ విడిది చేయడానికి, ఆ నీటిని వాడు కోవడానికి హాజిరా అనుమతి కోరారు. హాజిరా సంతోషంగా వారిని స్వాగతించారు. వారిని అతిథులుగా గౌరవించారు. వారిలో కొందరు తమ కుటుంబాలను అక్కడకు పిలిపించుకున్నారు. చాలా మంది ఆ ప్రదేశం(మక్కా)నే తమ శాశ్వత నివాసంగా మార్చుకున్నారు.

## ఇబ్రాహీమ్ (అస) అభిలాష

నిర్మానుష్య ప్రదేశంలో తాను వదలి వచ్చిన తన భార్యాబిడ్డల గురించి ఇబ్రాహీమ్ (అస) ఎప్పుడూ చింతిస్తూ ఉండేవారు. అప్పుడప్పుడు ఆయన అక్కడికి వెళ్ళి వారిని చూసి వచ్చేవారు. తాను కోరిన విధంగా తన కుమారుడు పెద్ద వాడవ్వడాన్ని చూసి సంతృప్తి చెందేవారు. తన కుటుంబాన్ని ఆదుకున్న విశ్వ ప్రభువుకు కృతజ్ఞతలు అర్పించేవారు. తన కుటుంబానికి నిలువనీడ కల్పించి, వారికి కావలసిన అన్నపానీయాలు ఏర్పాటు చేసిన అల్లాహ్‌కు ధన్య వాదాలు తెలుపుకునేవారు.

## నిరుపమానమైన త్యాగం

ఇబ్రాహీమ్ (అస) జీవితం యావత్తు విశ్వప్రభువు పట్ల ఆయన నిబద్ధతను,

★ *యెమన్ వాసులు నిజమైన అరబ్బులు అనబడుతారు. వారు మాట్లాడే అరబ్బీ భాష చాలా ప్రామాణికమైనది.*

https://teluguislam.net



చెక్కుచెదరని విశ్వాసాన్ని ప్రకటించే పరీక్షల సంగమం. దేవుని పట్ల నమ్మకం కలిగి ఉన్న వారు ఎన్నడూ నిరాశ చెందరు. అల్లాహ్ ఆదేశాలను ఎన్నడూ ప్రశ్నించరు. అల్లాహ్ ఎల్లప్పుడూ చెడుపై మంచికి విజయాన్ని ప్రసాదిస్తాడని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఇస్మాయిల్ (అస) చిన్నపిల్లవానిగా ఉన్నప్పుడు అల్లాహ్ మరోసారి ఇబ్రాహీమ్ (అస)ను కఠినమైన పరీక్షకు గురిచేశాడు. ఒక కల ద్వారా ఇబ్రాహీమ్ (అస) తన ఏకైక కుమారుణ్ణి అల్లాహ్‌కు బలిపెట్టాలని ఆదేశించడం జరిగింది.★

ఇబ్రాహీమ్ (అస) దృఢమైన విశ్వాసం కలిగినవారు. అల్లాహ్ పంపిన ప్రవక్త. అల్లాహ్ సందేశహరుడు. ఆయన తన ఏకైక పుత్రుడిని బలిపెట్టాలని అల్లాహ్ కోరితే ఇబ్రాహీమ్ (అస) దైవాదేశాన్ని ఎలా కాదనగలరు? అయితే ఎవరికైనా ఇలా చేయడం ఊహించరాని త్యాగమే అవుతుంది. ఆ కుమారుడు ఆయనకు లేకలేక ముసలి వయసులో జన్మించిన కుమారుడు. ఆయనకు వయసు ఉడిగిన సమయంలో అతడే ఆధారం. ఆయన కున్న ఏకైక ఆనందం ఆ కుమారుడే. కేవలం ఇబ్రాహీమ్ (అస) వంటి గొప్ప ప్రవక్త మాత్రమే ఇలాంటి బాధాకరమైన ఆదేశాన్ని అమలు చేయగలరు. తన సృష్టికర్త పట్ల, తన ప్రభువు పట్ల తన నిశ్చలమైన ప్రేమను ఈ విధంగా ప్రదర్శించడం ఆయనకు మాత్రమే సాధ్యం.

ఆత్మవిశ్వాసంతో ఇబ్రాహీమ్(అస) మక్కాకు బయలుదేరారు. ఈ వార్తను తన కుమారునికి చెప్పడం ఆయనకు ఒక పరీక్ష వంటిదే. అయితే ఇస్మాయిల్ (అస) కూడా తండ్రికి తగిన కుమారులు. ఆయన అనితర సాధ్యమైన ధైర్య సాహసాలు ప్రదర్శించారు. దేవుని ఆదేశాన్ని అమలు చేయాలని ఆయన నిబ్బరంగా తన తండ్రికి చెప్పారు. "నాన్నా! మీకు ఆజ్ఞాపించబడినట్లు చేయండి. అల్లాహ్

★ *బైబిలులో కూడా ఈ ప్రస్తావన ఉంది, అబ్రహంకు అతని ఏకైక పుత్రుడు, ఇస్సాక్‌ను బలి ఇవ్వాలని ఆదేశించడం జరిగిందని. కాని ఇస్సాక్ ఆయనకు ప్రథమ పుత్రుడు కాదు. ఇస్మాయిల్ ఆయనకు ప్రథమ పుత్రుడు. అంటే ఈ ఆదేశం అందిన సమయంలో ఆయనకు ఉన్న ఏకైక పుత్రుడు ఇస్మాయిల్ (అస) మాత్రమే. ఇస్సాక్ ఆ తర్వాత చాలా సంవత్సరాలకు జన్మించారు. ఇస్మాయిల్ (అస) అరబ్బు తెగల్లో కలిశారు. ఆయన సంతానంలో అరబ్బు ప్రవక్త జన్మించారు. కాగా ఇషాక్ సంతానంలో యూద ప్రవక్తలు జన్మించారు. అందువల్లనే అరబ్బులు, యూదులు సోదరులని చెప్పడం జరుగుతుంది.*

https://teluguislam.net



కోరిన విధంగా నేను చేయడానికి సిద్ధంగా ఉన్నాను” అని బదులిచ్చారు. ఆయన తన దుస్తులు తొలగించారు. తల్లికి సలాములు చెప్పాలని తండ్రిని కోరారు. తన గుర్తులుగా తన దుస్తులు తల్లికి ఇవ్వాలని చెప్పారు. తాను కాళ్ళుచేతులు కొట్టుకోవడం జరిగితే తన తండ్రికి బాధ కలుగుతుందన్న ఉద్దేశ్యంతో తన కాళ్ళను చేతులను కట్టేయాలని తండ్రిని కోరారు.

ఇబ్రాహీమ్ (అస) తన కత్తికి పదును పెట్టారు. ఆ విధంగా ఇస్మాయీల్‌కు మృత్యువు బాధ లేకుండా ఉండాలని భావించారు. కుమారుడిని గట్టిగా కౌగి లించుకుని రోదించారు. తర్వాత ఇస్మాయీల్ (అస)ను పడుకోబెట్టి కాళ్ళుచేతులు కట్టేశారు. బాధాతప్త హృదయంతో కుమారుణ్ణి చివరిసారిగా చూసుకున్నారు. బరువెక్కిన హృదయంతో కత్తిని ఎత్తారు. ఇస్మాయీల్ (అస) గొంతుపై వేటు వేశారు. కాని ఆ కత్తి గొంతును కోయలేదు. తన తండ్రి తగినంత గట్టిగా కత్తిని ఉపయోగించడానికి వెనుకాడుతున్నారని భావించిన ఇస్మాయీల్ (అస) గట్టిగా కోయాలని తండ్రితో చెప్పారు. ఇబ్రాహీమ్ (అస) అలాగే చేశారు. అయినా ఆ కత్తి గొంతును కోయలేదు. ఇబ్రాహీమ్ (అస) ఆశ్చర్యపోయారు. తన బలహీన తను క్షమించవలసినదిగా ఆయన అల్లాహ్‌ను వేడుకున్నారు. అల్లాహ్ ఆయన వేడుకోలుకు బదులిచ్చాడు. “ఇబ్రాహీమ్! నీవు నిజంగా కలను సార్థకం చేశావు. మేము నీ విధేయతకు బహుమానం ప్రసాదిస్తున్నాము”అన్నాడు. ఆ తండ్రీ కొడుకులు దేవుని ఆదేశం శిరసావహించడానికి క్షణం వెనుకాడలేదు. అల్లాహ్‌కు కావలసింది బలి కాదు. తన ఆదేశాల పట్ల వారు చూపిన నిబద్ధతనే ఆయన పరీక్షించాడు. తండ్రీ కొడుకులు దేవుని కారుణ్యం పట్ల కృతజ్ఞతలు అర్పించారు. ఇస్మాయీల్(అస)కు బదులుగా బలి ఇవ్వడానికి ఆ దగ్గర్లోనే ఒక పెద్ద గొర్రె కనబడింది. అంతకు ముందు కోయడానికి మొండికేసిన కత్తి ఆ గొర్రె గొంతును ఒక్క వేటుకు కోసింది. ఈ సంఘటనను స్మరిస్తూ ప్రతి సంవత్సరం ఈదుల్ అజ్‌హా (బక్రీదు పండుగ) సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడం జరుగుతుంది.

## ద్వారబంధాన్ని మార్చడం

ఇస్మాయీల్ (అస) ఒక అందమైన యువకునిగా ఎదిగారు. జుర్‌హుమ్ తెగ వారి వద్ద ఆయన అరబీ భాషను నేర్చుకున్నారు. ఈ తెగకు చెందిన అమ్మా యినే వివాహమాడారు. ఆయన చాలా ఆనందంగా జీవితాన్ని గడుపసాగారు.



ఆయన జీవితంలో ఎదురైన ఒకే ఒక్క దుఃఖకరమైన సంఘటన ఆయనను అమితంగా ప్రేమించిన మాతృమూర్తి తనువు చాలించడం. ఇస్మాయీల్(అస)ను కంటికి రెప్పలా సాకిన హాజిరా మరణించిన సంఘటన ఆయన్ను విపరీతంగా కలచి వేసింది.

ఇబ్రాహీమ్ (అస) అప్పుడప్పుడు వచ్చి కుమారుణ్ణి చూసి వెళ్ళేవారు. ఆ ఎడారిలో ఆయన కుమారుణ్ణి చూడడానికి అనేక రోజులు ప్రయాణం చేసి రావలసి వచ్చేది. ఒకసారి ఆయన వచ్చినప్పుడు ఇస్మాయీల్(అస) ఇంట లేరు. ఆయన భార్య ఇంట ఉండడంతో ఆమెతో ఇబ్రాహీమ్(అస) మాట్లాడారు. ఆమె భర్త ఆరోగ్యం ఎలా ఉందని వాకబు చేశారు. అయితే ఆమె ఆయన చెప్పే విష యాలు ఏవీ వినకుండానే తన భర్త గురించి ఫిర్యాదులు ప్రారంభించింది. తమ బీదస్థితి గురించి చెప్పుకొచ్చింది. వచ్చింది ఎవరని కూడా ఆమె అడుగలేదు. కనీసం మంచినీరన్నా అందించలేదు. అసహనం నిండిన స్త్రీని ఇబ్రాహీమ్ (అస) ఆమెలో చూశారు. అల్లాహ్ అనుగ్రహాలను గుర్తించే శక్తిలేని స్త్రీని చూశారు. ఆయన కనీసం తన ఒంటె నుంచి క్రిందికి కూడా దిగలేదు. ఆయన ఆమెతో, “నీ భర్తను అడిగానని చెప్పు... ఇంటి ద్వారబంధాన్ని మార్చడం మరచిపోవద్దని చెప్పు” అని వెళ్ళిపోయారు.

ఇస్మాయీల్(అస) ఇంటికి వచ్చిన తర్వాత ఆమె జరిగింది ఆయనకు చెప్పింది. వచ్చిన వ్యక్తి ఎలా ఉన్నారని ఇస్మాయీల్ (అస) ప్రశ్నించారు. ఆమె ఆ వ్యక్తిని వర్ణించింది. ఆ వచ్చింది తన తండ్రి అని ఆయన చెప్పారు. ఆయన చెప్పిన మాటలకు అర్థాన్ని వివరిస్తూ, సరిగా లేని ద్వారబంధం ఇంటికి తగినది కాదనీ, దాని వల్ల మనిషికి ఎదురుదెబ్బలు తగలడమే కాదు గాయాలు కూడా అవుతాయనీ, అదే విధంగా ఆమె తనకు తగిన భార్య కాదని అన్నారు.

కొంతకాలం తర్వాత ఇబ్రాహీమ్(అస) తన కుమారుణ్ణి చూడ్డానికి మళ్ళీ వచ్చారు. అప్పుడు కూడా ఆయన కుమారుడు ఇంట లేరు. అయితే ఇంట మరో స్త్రీ ఉంది. ఆమె ఇస్మాయీల్(అస) మళ్ళీ పెళ్ళాడిన స్త్రీ. ఆమె ఆయనకు నీరం దించింది. భోజనం వడ్డించింది. ఆయన ఒంటె దిగి.. ఆమెను ఆమె భర్త గురించి అడిగారు. తన భర్త వేటకు వెళ్ళారని ఆమె బదులిచ్చింది. ఆ కాలంలో ఎడారి

https://teluguislam.net



జీవితం చాలా కష్టంగా ఉండేది. ఆహారం కోసం వేటాడ్డానికి చాలా దూరం వెళ్ళవలసివచ్చేది.

ఆమె తన భర్త గురించి చెబుతూ ఆయన చాలా కష్టపడి తమను పోషిస్తున్నారని ప్రశంసలతో ముంచెత్తింది. అల్లాహ్‌కు కృతజ్ఞతలు అర్పిస్తూ మాట్లాడింది. ఇబ్రాహీమ్ (అస) చాలా సంతోషించారు. ఇస్మాయీల్(అస)కు తగిన భార్య లభించిందని ఆనందించారు. తాను ఎవరైనది ఆమెకు చెప్పలేదు. తాను ఒక స్నేహితుడిని అని మాత్రమే చెప్పారు. (ఆమె ఎలాంటి కోడలో తెలుసుకోవాలని ఆయన భావించారు. ఆమె గురించి తన అభిప్రాయాన్ని నర్మగర్భంగా ఒక సందేశం రూపంలో అందించి ఆమెను ఆశ్చర్యపరచాలని భావించారు.) అక్కడి నుంచి బయలుదేరుతూ ఆయన ఆమె చూపిన అతిథి మర్యాదలకు కృతజ్ఞతలు చెప్పారు. "మీ భర్త వచ్చిన తర్వాత నా సలాములు చెప్పండి. ఇప్పుడు ద్వారబంధం చక్కగా కుదిరిందని చెప్పండి" అని వెళ్ళిపోయారు.

ఇస్మాయీల్ (అస) ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఆమె జరిగింది వివరించారు. వచ్చిన అతిథి ఎలా ఉన్నారని ఇస్మాయీల్ (అస) ప్రశ్నించారు. ఆమె వివరించిన తర్వాత ఇస్మాయీల్ (అస) నవ్వుతూ, వచ్చినది తన తండ్రి అనీ, ఆయన నిన్ను నాకు తగిన భార్యగా అభివర్ణించారనీ, నీతో కలసి ఉండాలని, నిన్ను కాపాడాలని కోరారని వివరించారు. ఇస్మాయీల్ (అస) జీవితాంతం ఆమెతో కలసి ఉన్నారు. ఆమె ద్వారా ఆయనకు సన్మార్గులైన సంతానం కలిగారు.

## కాబా నిర్మాణం

ఇబ్రాహీమ్(అస) తన కుమారుణ్ణి చూసి చాలా కాలమయ్యింది. ఈసారి ఆయన ఒక అతి ముఖ్యమైన పని చేయవలసి ఉంది. ప్రపంచంలో మొట్టమొదటి ఆరాధనాలయాన్ని నిర్మించవలసిందిగా అల్లాహ్ ఆయన్ను ఆజ్ఞాపించాడు. మక్కా లోయలో ఈ ఆరాధనాలయం ప్రాచీన కాలంలో ఉండేది. ఇబ్రాహీమ్ (అస) మక్కా లోయకు వచ్చారు. అక్కడ జమ్‌జమ్ బావి వద్ద తన కుమారుడు ఇస్మాయీల్(అస) బాణాలకు పదునుపెడుతుండడాన్ని చూశారు. తండ్రిని చూసి ఆయన అత్యంత సంతోషించారు. తండ్రీకొడుకులు ఆనందంతో కౌగలించుకున్నారు. అల్లాహ్ తనకు కాబా గృహాన్ని నిర్మించమని ఆదేశించాడని ఇబ్రాహీమ్ (అస) కుమారునికి తెలియజేశారు. ఇస్మాయీల్ (అస) ఎల్లప్పుడు



తన ప్రభువు ఆదేశాలను అమలు చేయడానికి సిద్ధంగా ఉండేవారు. ఇరువురు కలసి కాబా గృహం పునాదులు తవ్వసాగారు. ఈ పని చేస్తున్నప్పుడు వారి నోట క్రింది పదాలు వారి హృదయాల్లోని భావాలను వ్యక్తం చేస్తూ వెలువడసాగాయి.

> **"ఓ ప్రభూ! మా యిద్దర్ని ముస్లిములుగా జేయి. మా సంతానంలో ముస్లిం జాతిని ఉద్భవింపజేయి. మా ప్రయత్నాల ఫలితాలను మాకు చూపించు. మా పశ్చాత్తాపాన్ని స్వీకరించు. నీవే పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడివి. అత్యంత కరుణామయుడివి."**

ఇస్మాయీల్(అస) రాళ్ళను మోసుకుని వస్తుంటే ఇబ్రాహీమ్(అస) వాటిని అమర్చసాగారు. కొంతకాలానికే నిర్మాణం రూపురేఖలు దిద్దుకుంది. తమకు సహాయంగా ఎవరినీ వారు తీసుకోలేదు. గోడలు చాలా ఎత్తుకు లేచాయి. ఇప్పుడు రాళ్ళు పేర్చడానికి ఇబ్రాహీమ్(అస) ఏదైనా ఎత్తు వేసుకోవలసిన అవసరం ఏర్పడింది. ఆయన ఇస్మాయీల్(అస)తో ఏదైనా మంచిరాయి, తాను నిలబడడానికి చూడమని చెప్పారు. ఇస్మాయీల్(అస) ఒక పెద్దరాయిని అక్కడికి దొర్లించారు.★ ఆ విధంగా కాబాగృహం నిర్మించబడింది. మక్కాలో కాబా గృహం నిర్మించబడినప్పటి నుంచి ప్రపంచవ్యాప్త ముస్లిములకు (దైవవిధేయులకు) పవిత్రమైన గృహంగా కొనసాగుతోంది. విశ్వప్రభువైన అల్లాహ్ పట్ల తమ కృతజ్ఞతలను ముస్లిములు ఇక్కడికొచ్చి తెలియజేస్తుంటారు.

*(చదవండి దివ్యఖుర్ఆన్ : 14:37-38)*

### గ్రహించవలసిన పాఠాలు

- ఇబ్రాహీమ్ (అస)ను ప్రవక్తల పితామహునిగా పేర్కొనడం జరిగింది. సమాజంలో విగ్రహారాధన, మానవ బలి వంటి దురాచారాలను తుదముట్టించడానికి ఆయన నిరంతరం శ్రమించారు.
- ఇబ్రాహీమ్ (అస) తండ్రి అల్లాహ్ సందేశాన్ని తిరస్కరించినప్పుడు ఆయన తన తండ్రిని నిందించలేదు. ఆయన సాఫల్యం కొరకు ప్రార్థిం

★ *ఈ రాయి వేలాది సంవత్సరాలుగా పరిరక్షించబడుతుంది. నేడు 'మకామె ఇబ్రాహీమ్' అన్న పేరుతో గాజు పలకల మధ్య ఉన్న రాయి ఇదే.*

https://teluguislam.net



చారు. ఆయనను సత్యసందేశం స్వీకరించేలా మార్చాలని ఆశించారు. తండ్రి పట్ల ఆయన చాలా ప్రేమగా వ్యవహరించారు. ఆయన పట్ల గౌరవమర్యాదల్లో లోపం చేయలేదు. ఇబ్రాహీమ్ (అస) అల్లాహ్ పట్ల పూర్తి విశ్వాసం కలిగిన వారు. ఎలాంటి త్యాగానికైనా వెనుదీయని వ్యక్తిత్వం ఆయనది. విశ్వప్రభువైన అల్లాహ్ ఆయన్ను "ఖలీలుల్లాహ్" (అల్లాహ్‌కు మిత్రుడు)గా అభివర్ణించాడు.

- విగ్రహారాధకులను ఎదుర్కొన్నప్పుడు ఆయన అనితరసాధ్యమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. వారు అత్యంత పవిత్రంగా భావిస్తున్న అంశాల్లోని ఔచిత్యాన్ని నిర్భయంగా ప్రశ్నించారు. మాటల వల్ల ఎలాంటి ప్రయోజనం లేనప్పుడు ఆయన తన నిరసనను చేతల్లో చూపించారు. విగ్రహాలను ధ్వంసం చేశారు. అందువల్ల ఆయన అగ్నిగుండంలోకి విసరివేయబడడం జరిగింది. కాని అల్లాహ్ పట్ల ఆయనకున్న చెక్కు చెదరని విశ్వాసం ఆయన్ను కాపాడింది.

- ఆయన భార్యలు సారా, హాజిరా ఇద్దరూ సౌశీల్యవతులు, ఆయన పట్ల పూర్తి నిబద్ధత కలిగినవారు. సహనంతో వ్యవహరిస్తూ గొప్ప గొప్ప త్యాగాలు చేశారు. అందుగ్గాను అల్లాహ్ వారికి అనేక విధాల బహూకరించాడు.

- హాజిరా పట్ల, హాజిరా కుమారుని పట్ల ఇబ్రాహీమ్ (అస)గారి శ్రద్ధ చూసి సారా అసూయపడడం మానవ సహజమైన ప్రతిక్రియగా అర్థం చేసుకోవాలి.

- సారాతో తన సంబంధాన్ని రాజుకు చెప్పకుండా దాచారు ఇబ్రాహీమ్ (అస). ఆ విధంగా తమ ప్రాణాలకు ప్రమాదం రాకుండా చూసుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఈ విధంగా వ్యవహరించే అనుమతి ప్రకారమే ఆయన చేశారు.

- ఇబ్రాహీమ్ (అస) కుమారుడు ఇస్మాయీల్ (అస) తండ్రికి తగిన



తనయుడు. తనకు తానుగా బలికి సిద్ధమై అల్లాహ్ సంతుష్టిని పొందారాయన.

- అల్లాహ్‌కు మానవ బలి అవసరం లేదు. అల్లాహ్ కోసం కన్నకొడుకును బలిపెట్టడానికి సిద్ధపడడాన్ని, అల్లాహ్ సేవ కోసం కన్న కుమారుడిని అంకితం చేయడంగా మనం అర్థం చేసుకుని ఆచరణలో పెట్టగలం.

- వారు నిర్మించిన కాబా గృహం దేవుని ఏకత్వానికి చిహ్నంగా గత 4000 ఏళ్ళ సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తోంది.

https://teluguislam.net



# ప్రవక్త లూత్
(అలైహిస్సలాం)



**స్వలింగ సంపర్క పాపాత్ములైన లూత్ జాతి వారిపై మేము ఒక (ప్రత్యేకమైన రాళ్ల) వాన కురిపించాము. హెచ్చరించబడిన ఆ జనులపై చాలా చెడ్డ వాన కురిసింది. (ఖుర్ఆన్ 27 : 58)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) ఈజిప్టును వదలి తన సోదర కుమారునితో సహా పలస్తీనా వచ్చి అక్కడ స్థిరపడ్డారు. ఆ సోదర కుమారుడే లూత్ (అస). ఆ పిదప లూత్(అస) సదూమ్ పట్టణానికి వెళ్ళిపోయారు. ఈ పట్టణం మృత సముద్రానికి పశ్చిమ తీరాన ఉంది. ఈ పట్టణంలో అనేక చెడులు వ్యాపించి ఉండేవి. అక్కడి ప్రజలు ప్రయాణీకులను దోచుకునేవారు. బాటసారులను దోచు కుని హతమార్చేవారు. మరో పెద్ద చెడు స్వలింగ సంపర్కం. పురుషులు తమ భార్యలతో కాక పురుషులతోనే కామ వాంఛలు తీర్చుకునేవారు. ఈ అసహజ లైంగిక క్రియకు తర్వాత 'సోడోమి' అనే పేరుపడింది. (సదూమ్ పట్టణం పేరు వల్ల). అక్కడ స్వలింగ సంపర్కం నిర్లజ్జగా బాహాటంగా జరిగేది.

ఈ చెడులు పెట్రేగిపోయినప్పుడు అల్లాహ్ వారి వద్దకు లూత్ (అస)ను పంపాడు. ఈ చెడులను వదలుకోవలసినదిగా ఆయన వారికి బోధించారు. కాని వారు తమ చెడులలో పూర్తిగా కూరుకుపోయారు. లూత్ (అస) బోధనల పట్ల వారు ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. అల్లాహ్ శిక్ష గురించి లూత్ (అస) వారిని హెచ్చరించినప్పటికీ వారు తమ చెడుల్లో మునిగిపోయి ఆయన మాటల్ని ఏ మాత్రం లక్ష్యపెట్టలేదు. ఇలాంటి



బోధనలు కొనసాగిస్తే పట్టణం నుంచి తరిమేస్తామని ఆయన్ను బెదిరించారు. వారి చెడులు ఇతర పట్టణాలకు కూడా వ్యాపిస్తాయని లూత్ (అస) భయపడ్డారు. వారిపై చర్య తీసుకోవాలని అల్లాహ్‌ను వేడుకున్నారు.

## హెచ్చరించే దూతలు

అల్లాహ్ ఇద్దరు దైవదూతలను అందమైన యువకుల రూపంలో అక్కడికి పంపాడు. వారు మొదట పలస్తీనాలోని ఇబ్రాహీమ్ (అస) ఇంటికి వచ్చారు. బాటసారులుగా వచ్చిన వారిద్దరిని ఇబ్రాహీమ్ (అస) స్వాగతించి అతిథి మర్యాదలు చేశారు. తన వద్ద ఉన్న ఉత్తమమైన ఆహారపానీయాలు ఇచ్చి ఆదరించారు. వారు ఆహారాన్ని ముట్టకపోవడం చూసి ఆయన ఆందోళన చెందారు. వారి ప్రవర్తన చూసి ఆయన వారిని శత్రువులుగా భావించారు (ఆ కాలంలో శత్రువులు ఒకరి ఆహారాన్ని మరొకరు ముట్టుకునేవారు కాదు). కాని వారు ఆయన భయాలను దూరం చేస్తూ, భయపడవలసిన పనిలేదని, తాము దైవదూతలమని (అందుకే ఆహారాన్ని ముట్టుకోలేదనీ), లూత్(అస) జాతి ప్రజలను శిక్షించడానికి వచ్చామని, అల్లాహ్ మీకు ఒక శుభవార్త కూడా చెప్పమన్నాడని, ఈ ముసలి వయసులో మీకూ సారాకు సంతానాన్ని అల్లాహ్ ప్రసాదిస్తాడని చెప్పారు. (అప్పటికి ఇబ్రాహీమ్(అస), సారాలు ఇరువురూ వయోవృద్ధులు).

అల్లాహ్ అనుగ్రహాల పట్ల ఇబ్రాహీమ్ (అస) చాలా సంతోషించారు. కాని సదూమ్ పట్టణం పట్ల చాలా ఆవేదన చెందారు. ఈ విధ్వంసంలో తన సోదర కుమారుడు లూత్ (అస)కు కూడా హాని కలగవచ్చని భయపడ్డారు. ఆ పట్టణ వాసులకు ఒక అవకాశాన్ని ఇవ్వవలసిందిగా ఆయన దైవదూతలతో వాదించారు. ఆ పట్టణవాసులు సన్మార్గానికి రావచ్చున్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దైవ దూతలు ఆయనకు హామీ ఇస్తూ లూత్ (అస)కు, ఆయన కుటుంబానికి, (భార్యకు తప్ప) ఎలాంటి హాని కలుగదని హామీ ఇచ్చారు. లూత్ (అస) భార్య ఆ పట్టణ వాసుల మాదిరిగా చెడుల్లో కూరుకుపోయిన మహిళ.

ఆ పిదప దైవదూతలు సదూమ్ పట్టణానికి చేరుకున్నారు. పట్టణ ముఖ ద్వారం వద్ద ఒక బాలిక నీటిని తీసుకువెళ్ళడాన్ని వాళ్ళు చూశారు. తాము బాటసారులమని చెప్పి వారు ఆ బాలిక సహాయం కోరారు. పట్టణవాసుల వ్యవహారం, వారి అలవాట్లు తెలిసిన ఆ బాలిక ఈ బాటసారులకు ఎలాంటి ప్రమాదం కలుగరాదన్న ఉద్దేశ్యంతో వారిని అక్కడే ఉండవలసిందిగా కోరింది. ఆమె వెంటనే తన

https://teluguislam.net



తండ్రిని సంప్రదించడానికి వెళ్ళింది. ఆమె నిజానికి లూత్ (అస) కుమార్తె. తన తండ్రితో ఆమె, "శివార్లలో ఇద్దరు బాటసారులు ఉన్నారు. వారికి మీ సహాయం కావాలి. వారు ఇద్దరు అందమైన యువకులు. వారి గురించి పట్టణంలో తెలిస్తే వారి పట్ల పట్టణవాసులు చాలా దౌర్జన్యంగా వ్యవహరిస్తారు" అని చెప్పింది.

మొదట లూత్ (అస) ఈ కొత్తవారిని ఆహ్వానించడానికి సిద్ధపడలేదు. గుంపు నుంచి వారిని కాపాడ్డం తన వల్ల కాదని ఆయన భయపడ్డారు. కాని ఆయన చాలా మంచి వ్యక్తి. కాబట్టి చివరకు ఆ బాటసారులకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. వారిని రహస్యంగా తీసుకురావాలని ఆయన భావించారు. అయితే ఆయన భార్య కూడా మిగిలిన పట్టణవాసుల మాదిరిగా చెడుల్లో కూరుకు పోయిన మహిళ. తన భర్త తీసుకువచ్చిన అతిథుల గురించి ఆమె అందరికీ చెప్పివేసింది. ఒక పెద్ద గుంపు తన ఇంటి వైపు రావడాన్ని చూసిన లూత్ (అస) తలుపులు మూసివేశారు. ఆ గుంపు తలుపులు బాదడం ప్రారంభించింది. లూత్ (అస) ఆ గుంపును బ్రతిమాలుతూ తన అతిథులను వదలివేయమని, అల్లాహ్ శిక్షకు భయపడమని చెప్పారు. కామవాంఛలు భార్యల వద్ద తీర్చుకోవడమే మేలయిన పద్ధతి అనీ, అల్లాహ్ అనుమతించిన పద్ధతి అదేనని వారికి బోధించారు. చివరకు తన కుమార్తెలను వారికిచ్చి పెళ్ళి చేయడానికి కూడా సిద్ధపడ్డారు.

లూత్(అస) వారించినప్పటికీ ఆ గుంపు ఏమాత్రం లక్ష్యపెట్టలేదు. ఆయనకు బదులిస్తూ, "లూత్! నీ కుమార్తెల పట్ల మాకు ఆసక్తి లేదు. మేము కోరేదేమిటో నీకు బాగా తెలుసు" అన్నారు. కామంతో కళ్ళు మూసుకుపోయిన వారు ఆవేశంతో తలుపులు విరగ్గొట్టారు. లూత్ (అస) విపరీతమైన ఆగ్రహంతో వారిని ఆపాలనుకున్నారు. కాని ఆ గుంపును నిరోధించే శక్తి ఆయనలో లేదు. తన అతిథులను దౌర్జన్యం నుంచి రక్షించే స్థితిలో ఆయన లేరు. అయినప్పటికీ ఆయన నిర్భయంగా గుంపును నిరోధిస్తూ వారిని ఆపడానికి ప్రయత్నించారు. ఆయన నిస్సహాయంగా, దుఃఖంతో నిలబడి ఉండడాన్ని చూసిన దైవదూత, "లూత్! మేము సాధారణ మానవులం కాదు. మేము దేవుని దూతలం. ఈ ప్రజల దౌర్జన్యాల నుంచి నిన్ను కాపాడ్డానికే వచ్చాము. వారిలో ఎవ్వరూ నీకు ఎలాంటి హాని కలిగించలేరు. వారంతా నేడు ఓటమి పాలవుతారు" అన్నారు. ఈ మాటలు విన్న గుంపు భయంతో లూత్(అస) ఇంటిని వదలి పారిపోయింది. వెళుతూ



వెళుతూ లూత్(అస)ను బెదిరిస్తూ వెళ్ళిపోయారు. ఆ తర్వాతి రోజు దైవదూతలు లూత్(అస)కు సలహా ఇస్తూ, సూర్యోదయానికి ముందే పట్టణం వదలి వెళ్ళి పొమ్మన్నారు. తనతోపాటు కుటుంబ సభ్యులను (ఒక్క భార్యను తప్ప మిగిలిన వారిని) తీసుకు వెళ్ళిపొమ్మని చెప్పారు.

సదూమ్ పట్టణాన్ని నాశనం చేయాలని అల్లాహ్ ఆదేశించాడు. లూత్ (అస) ఆయన కుటుంబం ఆ పట్టణాన్ని వదిలిన మరుక్షణం ఆ పట్టణాన్ని ఒక భయానకమైన భూకంపం కుదిపేసింది. ఒక మహాశక్తి ఆ పట్టణాన్ని ఎత్తికుదేసినట్టయ్యింది. పట్టణంపై రాళ్ళవాన కురిసింది. ప్రతి ఒక్కరు, ప్రతి ఒక్క వస్తువు నాశనమయ్యింది లూత్ (అస) భార్యతో సహా.

(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 7:80-84, 27:54-58, 11:67-83, 29:27-35, 26:160-175, 15:56-77, 37:133-138, 6:86, 21:74-75, 22:43-44, 18:13-14, 54:33-39, 14:37)

## గ్రహించవలసిన పాఠాలు

- లూత్ (అస) కథ, అతిచెడ్డ చేష్ట అయిన స్వలింగ సంపర్కం నుంచి ముఖ్యంగా వారిస్తుంది. ఇది అత్యంత అశ్లీలమైన చేష్ట. ఇది ప్రకృతి నియమాలను ఉల్లంఘించే, వాటిని కలుషితం చేసే రోగగ్రస్తమైన మనస్తత్వానికి సంబంధించిన చేష్ట. ఈ చేష్ట మనిషిని జంతువుకన్నా హీనమైన స్థాయికి దిగజార్చుతుంది. ఎందుకంటే జంతువులు కూడా ఇలాంటి హీనమైన చేష్టకు పాల్పడవు. స్వలింగ సంపర్కులు ఈ నికృష్టమైన చేష్టకు పాల్పడుతుంటారు. వీరిని "గే"లని, 'ఫెయిర్‌లీ'లని పిలువడం కూడా జరుగుతోంది. పురుషులే కాక స్త్రీలు కూడా స్వలింగ సంపర్కానికి పాల్పడటం జరుగుతోంది. వీరిని 'లెస్బియన్ల'ని అంటున్నారు.
- దివ్యఖుర్‌ఆన్ స్వలింగ సంపర్కాన్ని ఒక అత్యాచారంగా, తీవ్రమైన అజ్ఞానంగా, శక్తిని వ్యర్థం చేయడంగా, అల్లాహ్ మానవాళికి నిర్దేశించిన హద్దులను అతిక్రమించడంగా పేర్కొన్నది. కాని ప్రస్తుతం ప్రపంచంలో చాలా చోట్ల ఈ నికృష్టమైన చేష్ట "వ్యక్తిగత స్వేచ్ఛ" పేరిట సర్వసాధారణమైపోయింది.

- స్వలింగ సంపర్కం వల్ల లైంగిక వ్యాధులు, ఎయిడ్స్ వ్యాప్తి చెందుతాయి. ప్రస్తుతం మానవ సమాజాలను ఎయిడ్స్ ఒక శాపంగా కబళిస్తోంది. చివరకు అమాయక శిశువులు కూడా తల్లిదండ్రుల ద్వారా ఈ వ్యాధికి గురవుతున్నారు.
- స్వలింగ సంపర్కం వంటి అనైతిక చేష్టకు ఇస్లామ్ తీవ్రమైన శిక్షలను నిర్దేశించింది. ఇమామ్ అహ్మద్ ఈ విషయమై ఉటంకించిన హదీసు దీన్ని స్పష్టంగా తెలుపుతోంది. ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన ప్రవచనాన్ని ఇబ్నెఅబ్బాస్(రజి) ఇలా పేర్కొన్నారు: "స్వలింగ సంపర్కానికి పాల్పడిన వారిద్దరినీ హతమార్చండి." ఇమామ్ షాఫయీ, ఇమామ్ హంబలీ ఇంకా వారితో పాటు చాలా మంది ధర్మవేత్తలు ఈ శిక్షను ఆమోదించారు. ఇమామ్ అబూహనీఫా ఈ చేష్టకు శిక్షగా నేరస్తులను ఒక కొండ మీది నుంచి క్రిందికి గెంటేయాలని, వారిపై రాళ్లను దొర్లించాలని పేర్కొన్నారు. అంటే అల్లాహ్ లూత్ (అస) పట్టణ ప్రజలను శిక్షించిన విధంగా అన్నమాట.
- అతిథుల ప్రాణాలను, వారి గౌరవమర్యాదలను కాపాడవలసిన బాధ్యత ముస్లింపై ఉంటుంది. లూత్ (అస) అందుగ్గాను పూర్తి ప్రయత్నాలు చేశారు. నేరస్తులను నిరోధించడానికి గాను చివరకు తన కుమార్తెలను వారికి ఇచ్చి పెళ్ళి చేయడానికి కూడా సిద్ధమయ్యారు. తన అతిథులను దౌర్జన్యం నుంచి కాపాడడానికి తనకు చేతనైన ప్రయత్నాలన్నీ చేశారు.
- బైబిలులో లూత్(అస) గురించిన ప్రస్తావన చాలా అనుచితమైన రీతిలో ఉంది. లూత్(అస) కుమార్తెలు ఆయనకు మద్యం తాగించి ఆయన మత్తులో ఉన్నప్పుడు ఆయనతో లైంగికక్రియలో పాల్గొన్నారని, ఫలితంగా గర్భం దాల్చారని (జెనిసిస్ 19:30-38) ప్రస్తావించడం జరిగింది. ఈ ప్రస్తావన దిగ్భ్రాంతికరమైనది. తన ప్రవక్త ద్వారా ఇలాంటి పనులు జరిగేలా అల్లాహ్ అనుమతిస్తాడన్నది ఆలోచనకు కూడా అందని విషయం. దీనికి భిన్నంగా దివ్యఖుర్‌అన్ అల్లాహ్ ప్రవక్తలు అందరిని ఉత్తమమైన వారిగా, ధర్మపరాయణులుగా, సన్మార్గులుగా పేర్కొన్నది. ప్రవక్తల వల్ల అనైతికమైన చేష్టలు జరిగిన ఒక్క సంఘటన కూడా దివ్యఖుర్‌అన్‌లో లేదు.

https://teluguislam.net



# ప్రవక్త ఇస్‌హాక్

## (అలైహిస్సలాం)

(క్రీ.పూ. 1800 నుంచి క్రీ.పూ.1750 వరకు)



ఇస్‌హాక్ ప్రవక్త పాలస్తీనా ప్రాంతంలో జన్మించారు.

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఇబ్రాహీమ్ (అస) మొదటి భార్య సారా. వయసుమీద పడడం వల్ల, తనకు పిల్లలు జన్మించే ఆశ లేనందు వల్ల తమ సేవకురాలు హాజిరాను తన భర్త పెళ్ళాడితే ఆ విధంగా తన భర్తకు అతను కోరే సంతానం లభిస్తుందని భావించి సారా తన భర్తకు హాజిరాతో పెళ్ళి జరిపించారు. హాజిరా వల్ల ఇస్మాయీల్(అస) జన్మించారు. కాని తర్వాత సారా అసూయతో రగిలిపోయారు. ఫలితంగా హాజిరా, ఆమె కుమారుడు ఇస్మాయీల్ నిర్మానుష్య ప్రదేశంలో వదలివేయబడ్డారు. కాని సారా స్వతహాగా త్యాగ స్వభావం కలిగిన స్త్రీ. అందువల్ల ఆమెను దేవుడు వదలివేయలేదు. ఆమెకు కూడా వృద్ధాప్యంలో సంతానాన్ని ప్రసాదించాడు. ఆ విధంగా ఆమెకు ఇస్‌హాక్ (అస) జన్మించారు.

దివ్యఖుర్‌అన్‌లో సూరా 37:112-113 అయతుల్లో ఈ విధంగా చెప్పడం జరిగింది:

**"మేము ఆయనకు (ఇబ్రాహీమ్‌కు) తెలియజేశాము. ఇస్‌హాక్ ఒక ప్రవక్త అవుతారని, గౌరవనీయుడవుతారని చెప్పాము. వారిద్దరిని మేము అనుగ్రహించాము. వారి సంతానంలో కొందరు సన్మార్గులుగా వ్యవహరించారు కాగా కొందరు దారి తప్పారు."**

https://teluguislam.net



ఇస్‌హాక్ (అస) జీవితం గురించిన పూర్తి వివరాలు మనకు దివ్య ఖుర్‌ఆన్‌లో కనబడవు. అయితే విశ్వసించదగిన దివ్యఖుర్‌ఆన్ వ్యాఖ్యానకర్తలు కొందరు ఇస్‌హాక్ ప్రవక్త (స) జీవితానికి సంబంధించిన కొన్ని విశేషాలు ఇలా వెల్లడించారు: ఇబ్రాహీమ్ (అస) తన జీవిత చరమాంకంలో ఇస్‌హాక్ (అస)కు పెళ్ళి జరిగితే చూడాలనుకున్నారు. ఆయన కనాన్ జాతి స్త్రీతో ఇస్‌హాక్ (అస) పెళ్ళి జరుగరాదని భావించారు. ఎందుకంటే, కనాన్లు విగ్రహారాధకులు. అందు వల్ల ఆయన నమ్మకస్తుడైన తన సేవకుడిని ఇరాక్‌లోని హర్రాన్‌కు పంపించారు. ఇస్‌హాక్ (అస)కు తగిన వధువును ఎంపిక చేయడానికి ఈ సేవకుడిని పంపడం జరిగింది. ఆ సేవకుడు రఫీకాను ఇస్‌హాక్ (అస)కు తగిన జోడీగా ఎంపిక చేశాడు. ఆమె బెతూల్ కుమార్తె. బెతూల్ నాఖుర్ కుమారుడు. ఇబ్రాహీమ్ (అస)కు నాఖుర్ సోదరుడవుతారు. ఇస్‌హాక్ (అస) ఆ అమ్మాయిని వివాహం చేసుకున్నారు. ఆమెకు కవల పిల్లలు కలిగారు. వారి పేర్లు ఇసావ్, యాకూబ్ (జాకబ్).

వీరిద్దరు పెరిగి పెద్దయిన తర్వాత ఇరువురి మధ్య సఖ్యత కరవయ్యింది. యాకూబ్ (అస) పట్ల తండ్రి అధిక శ్రద్ధ చూపడాన్ని, అల్లాహ్ ఆయన్ను ప్రవక్తగా ఎంపిక చేయడాన్ని ఇసావ్ భరించలేకపోయాడు. ద్వేషంతో రగిలిపోయిన ఇసావ్ చివరకు యాకూబ్ (అస)ను చంపుతానని బెదిరించాడు. యాకూబ్(అస) తన ప్రాణాలు కాపాడుకోవడానికి దేశం వదలి పోవలసివచ్చింది.

*(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 6:84, 19:49, 21:72, 37:12-113)*



# ప్రవక్త యాకూబ్
## (అలైహిస్సలాం)
**(క్రీ.పూ. 1750 నుంచి 1700 వరకు)**

*(ప్రవక్త యాకూబ్ (అస) నుంచి బనీ ఇస్రాయీల్ ప్రారంభమయ్యింది. బనీ ఇస్రాయీల్ అంటే ఇస్రాయీల్ తెగ లేదా ఇస్రాయీల్ సంతానం అని అర్థం. ఈ సంతానంలోని అన్ని తెగలను ఈ పేరు సూచిస్తుంది.)*



యాకూబ్ ప్రవక్త పాలస్తీనా ప్రాంతంలో జన్మించారు.

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

యాకూబ్ (అస) వృద్ధుడైన తన తండ్రిని సలహా అడిగారు. ఆయన ఎల్లప్పుడు తన కుమారుడిని, కుమారుడి సంతానాన్ని దీవించేవారు. కాని దీనివల్ల అతని సోదరుడు ఇసావ్ మనసులో అసూయ రగిలింది. యాకూబ్ పట్ల సోదర ప్రేమను మరచిపోయాడు. ఆయన్ను చంపుతానని బెదిరించడం ప్రారంభించాడు. ఇసావ్‌కు ఇద్దరు భార్యలు. వారిద్దరు కనాన్ తెగకు చెందినవారే. వారిద్దరి వల్ల తనకు చాలా సంతానం కలుగుతుందని, ఆ సంతానం యాకూబ్ (అస)ను, అతని కుటుంబాన్ని జీవితాంతం వేధించగలరని చెప్పేవాడు. యాకూబ్ (అస) ఈ విషయాన్ని తండ్రి ఇస్‌హాక్ (అస)తో ప్రస్తావిస్తూ, మీరు లేకపోతే అతను నిశ్చయంగా నన్ను చంపుతాడని చెప్పారు.

ఇదంతా విని ఇస్‌హాక్ (అస) చాలా బాధపడ్డారు. ఆయన యాకూబ్ (అస)కు సలహా ఇస్తూ బాబిలోనియా లోని పద్దాన్ అరమ్‌కు వెళ్ళవలసిందిగా సూచించారు. అక్కడ యాకూబ్ (అస)కు మేనమామ ఉంటున్నారు. ఆయన పేరు లబన్. ఆయన కుమార్తెను పెళ్ళాడవలసిందిగా చెప్పారు. తన కుమారుడికి ధైర్యం చెబుతూ, “నీకు అల్లాహ్ చాలా మంది కుమారులను ప్రసాదిస్తాడు. నీ

https://teluguislam.net



సోదరునికన్నా మంచి జీవితాన్ని ప్రసాదిస్తాడు. అల్లాహ్ నిన్ను కాపాడుతాడు" అన్నారు.

ఆ రాత్రి కన్నీళ్ళతో యాకూబ్ (అస) తన తల్లిదండ్రులకు వీడ్కోలు పలికి తన సోదరునికి తెలియకుండా వెళ్ళిపోయారు.

## కల

యాకూబ్(అస) ప్రయాణం అనేక రోజుల పాటు కొనసాగింది. ప్రయాణం చాలా కష్టంగా, అంతం లేనిదిగా కనబడసాగింది. కనుచూపుమేరలో ఒక్క ఇల్లు కూడా కానరావడం లేదు. తానిక వెనక్కి వెళ్ళిపోవడం మంచిదని ఆయన భావించారు. ఒక రాతినీడన కూర్చుని నిద్రపోయారు. ఆయనకు ఒక ప్రేరణాత్మకమైన కల వచ్చింది. తనకు అల్లాహ్ ఒక మంచి జీవితాన్ని, ఇద్దరు మంచి కుమారులను ప్రసాదించినట్లు, వారు ఒక పెద్ద రాజ్యానికి పరిరక్షకులైనట్లు, వారు దేవుని హిత బోధను ప్రజలకు బోధిస్తున్నట్లు ఆయన కలగన్నారు. ఈ కల ఆయనకు గొప్ప ప్రేరణను ఇచ్చింది.

ఆయన తన ప్రయాణాన్ని కొనసాగించారు. కొన్ని రోజుల తర్వాత ఆయనకు ఒక మైదానంలో మేస్తున్న గొర్రెలు, కొందరు పిల్లలు కనబడ్డారు. వారితో ఆయన లబన్ గురించి ప్రశ్నించారు. వారు జవాబిస్తూ, "ప్రవక్త ఇస్‌హాక్ (అస) బావమరిది గురించి తెలియని వారెవ్వరు. ఆయన తన జాతిప్రజల నాయకుడు. ఈ గొర్రెలన్నీ ఆయనవే" అంటూ ఒక అమ్మాయిని చూపించి, "అదిగో, ఆ అమ్మాయి ఆయన కూతురు రాకెల్ " అన్నారు. ఆమె చాలా అందమైన అమ్మాయి. యాఖూబ్ (అస) సిగ్గుపడుతూ ఆమె వద్దకు వెళ్ళి తనను తాను పరిచయం చేసుకున్నారు. ఆమె ఆయనకు మర్యాదగా స్వాగతం పలికి ఇంటికి తీసుకువెళ్ళింది.

కన్నీళ్ళతో లబన్ తన సోదరి కుమారుడిని స్వాగతించారు. పలకరింపులు అయిన తర్వాత యాకూబ్ (అస) తాను ఇంత దూరం ప్రయాణించి రావడానికి కారణం వివరించారు. లబన్ అంతా విని యాకూబ్ (అస) ప్రతిపాదనను అంగీకరించారు. అయితే ఆయన ఒక షరతు విధించారు. పెళ్ళికి ముందు యాకూబ్ (అస) ఏడేళ్ళు తన వద్ద పనిచేయాలని అన్నారు. యాకూబ్(అస) ఆ షరతుకు అంగీకరించారు. తన పనులను నిబద్ధతతో నిర్వర్తించసాగారు.

*(రచయిత వ్యాఖ్య : ఈ విధంగా యాకూబ్ (అస) పెళ్ళిని ఆలస్యం చేయడానికి కారణం బహుశా......లబన్ పెద్ద కుమార్తెకు అప్పటికి వివాహం*



*కాలేదు. ఈ లోపు ఆమెకు వివాహం చేస్తే చిన్న కుమార్తెను యాకూబ్ (అస)కు పెళ్ళిచేయడానికి వీలవుతుందని ఆ తండ్రి భావించి ఉంటారు.)*

ఏడేళ్ళు గడచిన తర్వాత కూడా తండ్రికి తన పెద్ద కుమార్తెకు పెళ్ళి చేయడం అన్న సమస్య పరిష్కారం కాలేదు. ఆయన ఈ సమస్యను యాకూబ్ (అస)తో చర్చించారు. తన పెద్ద కుమార్తె "లీహ్"ని ముందుగా పెళ్ళి చేసుకోవాలని, తర్వాత మరో ఏడేళ్ళు పనిచేసి చిన్న కుమార్తె రాకెల్‌ను పెళ్ళి చేసుకోవాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను కూడా యాకూబ్(అస) అంగీకరించి మరో ఏడేళ్ళపాటు ఆయన వద్ద పని చేశారు. చివరకు ఆయన రాకెల్‌ను వివాహం చేసుకున్నారు.

*(తర్వాతి కాలంలో అక్కాచెల్లెళ్ళను ఇద్దరినీ ఒకే సమయంలో పెళ్ళి చేసుకోవడాన్ని ఇస్లాం నిషేధించింది. భార్య మరణించక ముందు గాని లేక విడాకులు కాకుండా కాని ఆమె సోదరిని పెళ్ళాడ్డం నిషిద్ధమయ్యింది.)*

తండ్రి ఆ ఇరువురు కుమార్తెలకు ఇరువురు బానిస స్త్రీలను ఇచ్చారు. వారికి సేవకులుగా, వారికి తోడు ఉండేవారిగా వారిని బహూకరించడం జరిగింది. ఆ ఇరువురు తమ బానిస స్త్రీలకు తమ భర్తతో పెళ్ళి చేశారు. ఈ నలుగురు భార్యల వల్ల ఆయనకు పన్నెండు మంది సంతానం కలిగారు. రబున్, షమూన్, లావి, యహూదా, జౌలున్ అనే కుమారులు మొదటి భార్య లీహ్ వల్ల జన్మించారు. రెండవ భార్య రాకెల్ వల్ల యూసుఫ్ (అస), బిన్‌యామిన్‌లు జన్మించారు. మిగిలిన నలుగురు మరో ఇద్దరు భార్యల వల్ల జన్మించారు.

### గ్రహించవలసిన పాఠాలు

- సోదరుల మధ్య ఈర్ష్యాసూయలు జనిస్తే వారు విడిపోవడమే మంచిది.
- యాకూబ్(అస) మామగారు నిజానికి ఒక ఒప్పందం చేసుకున్నారు. కాని ఆయన ఉన్న పరిస్థితుల్లో ఆయన పట్ల తగిన సానుభూతి చూపడం అవసరమయ్యింది. అందువల్ల యాకూబ్ (అస) ఆయన ప్రతిపాదనకు అంగీకరించి మరో ఏడేళ్ళ పాటు ఆయన వద్ద పని చేశారు. ఆయన చేసిన ఈ త్యాగానికి, ఆయన సహనానికి అల్లాహ్ అనేక విధాలుగా బహూకరించాడు.

# ప్రవక్త యూసుఫ్

(అలైహిస్సలాం)

(క్రీ.పూ. 1700 నుంచి క్రీ.పూ.1680 వరకు)

(దివ్యఖుర్‌ఆన్‌లో ఈ కథ చాలా వివరంగా, చాలా ఆసక్తిదాయకంగా చెప్పడం జరిగింది. ఇందులో హాస్యం, మానవ బలహీనతలు, ఉన్నత గుణ గణాలు, ఈర్ష్యాసూయలు, విద్వేషం, అహం, వాంఛలు, మోసం, కుట్ర, క్రూరత్వం, బీభత్సం, సహనం, విశ్వాసం, ధైర్యం, సద్వర్తనం, సాను భూతి వంటి అనేక గుణగణాలు మన ముందుకు వస్తాయి. ప్రాచ్య దేశాల కవులపై ఈ కథ చాలా గొప్ప ప్రభా వాన్ని వేసింది. ఈ కథ అధారంగా అల్లిన కొన్ని కవితలు సాహిత్యంలో అత్యుత్తమ కళా ఖండాలుగా నిలిచి పోయాయి. దివ్యఖుర్‌ఆన్‌లో ఈ కథ ప్రస్తావించబడిన తీరు నైతికంగా మనిషిని తీర్చిదిద్దేదిగా ఉంది.)



సవతి సోదరులు అసూయతో బాల యూసుఫ్‌ను బావిలో పడవేశారు.

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

సూర్యుడు తూర్పున లేతకిరణాలను వర్షిస్తున్నప్పుడు ప్రవక్త యాకూబ్ (అస) కుమారుడు యూసుఫ్ (అస) నిద్ర లేచారు. ఆయనకు నిద్రలో ఒక మంచి కల వచ్చింది. సంతోషంగా ఆయన తన తండ్రి వద్దకు పరుగున వెళ్ళి తనకు వచ్చిన కలను చెప్పారు. "నాన్నా! పద కొండు నక్షత్రాలు, సూర్యుడు, చంద్రుడు నా ముందు సాష్టాంగపడినట్లు కల గన్నాను" అన్నారు. తండ్రి ముఖంలో సంతోషం విప్పారింది. తన తాతగారు ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) చెప్పిన భవిష్య వాణి నెరవేరేది యూసుఫ్ (అస) వల్లనే అని ఆయన గ్రహించారు. తన సంతానంలో దైవసందేశాన్ని ప్రజలకు చేరవేసే వారు జన్మిస్తారని ఇబ్రాహీమ్ ప్రవక్త (అ) ముందే చెప్పి ఉన్నారు.

"నీకు గొప్ప భవిష్యత్తు ఉందని నీ కల సూచిస్తుంది" అని యాఖూబ్ (అస) తన కుమారునికి చెప్పారు. అయితే యూసుఫ్(అస)కు ఉన్న అనేక మంది సోదరుల అసూయ గురించి ఆయన భయపడ్డారు. అందువల్ల ఈ కల గురించి సోదరులకు ఎవరికీ చెప్పవద్దని అన్నారు. ఈ కల గురించి చెబితే వారు నీకు వ్యతిరేకంగా కుట్రలు చేయవచ్చని హెచ్చరించారు. మానవాళికి శత్రువైన షైతాన్ సోదరుల మధ్య వైరాన్ని రెచ్చ గొట్టగలడని యాకూబ్ (అస) భయ పడ్డారు.



యూసుఫ్(అస) పద్ధెనిమిది సంవత్సరాల వయసులో ఉన్నారు. ఆయన దృఢమైన, అందమైన యువకునిగా ఎదిగారు. చాలా నమ్రత కలిగిన వారిగా పేరుపడ్డారు. ఆయన గౌరవంగా వ్యవహరించేవారు. దయ సానుభూతులతో ప్రవర్తించేవారు. ఆయన సోదరుడు బిన్‌యామిన్ కూడా అలాంటి గుణగణాలు కలిగినవాడే. వీరిద్దరూ ఒకే తల్లి రాకెల్ కుమారులు. సుగుణ సంపన్నులైన ఈ ఇరువురు కుమారుల పట్ల తండ్రి యాఖూబ్ (అస) ఎక్కువ ఇష్టం ప్రదర్శించే వారు. వీరిద్దరిని తన దృష్టి నుంచి పక్కకు వెళ్ళనిచ్చేవారు కాదు. వారిని పరిరక్షించ డానికి గాను ఇంటి తోటలోనే వారిని పనిచేసేలా నిర్దేశించారు.

## సోదరుల కుట్ర

అసూయ అగ్ని వంటిది. అది సోదరుల గుండెల్లో పొగలు గ్రక్కడం ప్రారం భించింది. విద్వేషంగా మారింది. ఒక సోదరుడు మిగిలిన వారితో, "నాన్నగారు మనందరికన్నా యూసుఫ్, బిన్‌యామిన్‌ల పట్ల ఎక్కువ ప్రేమ చూపుతున్నారు. నిజానికి వారిద్దరికన్నా మనం బలంగా ఉన్నాం. మన అమ్మలకన్నా వారిద్దరి అమ్మనే ఆయన ఎక్కువ ప్రేమిస్తారు. ఇది న్యాయం కాదు" అన్నాడు. వారందరూ తమకు అన్యాయం జరిగిపోతోందని భావించారు.

వారి మనస్సుల్లో చెడు ఆలోచనలు మొలకెత్తి పెనువృక్షాలు కాసాగాయి. యూసుఫ్(అస)ను చంపేయాలని వారు కుట్రపన్నారు. కాని వారిలో పెద్దవాడు, తెలివిగలవాడు అయిన యహూదా మాత్రం చంపడానికి అంగీకరించలేదు. "హత్య చేయడానికి విశ్వాసులకు అనుమతి లేదు. యూసుఫ్ ఎలాంటి నేరం చేయలేదు. అతను మనకు ఎలాంటి హాని కలిగించలేదు. మనం ఒక పని చేద్దాం. వర్తక బృందాలు వెళ్లే దారిలో ఏదైనా బావిలో అతడిని తోసేద్దాం. నీటి కోసం బావి వద్దకు వచ్చే ప్రయాణీకులు అతడిని చూసి తమతో తీసుకుపోయి దూర ప్రాంతాల్లో బానిసగా అమ్మేస్తారు. ఈ విధంగా మనం అతడిని వదిలించుకోవచ్చు" అని అతను సలహా ఇచ్చాడు.

ఒక రోజు గొర్రెలను కాయడానికి వెళుతూ యూసుఫ్‌ను కూడా తమతో పంపమని వారు తండ్రిని కోరారు. అతణ్ణి జాగ్రత్తగా చూసుకుంటామని తండ్రికి హామీ ఇచ్చారు. యూసుఫ్(అస) తాను కూడా వెళ్ళాలని చాలా సరదా పడ్డారు. బిన్‌యామిన్‌కు కూడా వెళ్ళాలని ఉంది. కాని తండ్రి పంపనందు వల్ల ఆయన చాలా నిరాశపడ్డాడు. యాకూబ్(అస) తన భయాన్ని వెలిబుచ్చుతూ, మీరు

https://teluguislam.net

https://teluguislam.net



గొర్రెలపై దృష్టి పెట్టి ఉన్నప్పుడు ఏదైనా క్రూరజంతువు వచ్చి యూసుఫ్‌కు హాని తలపెట్టవచ్చన్నారు. కాని వారు ఆయనకు హామీ ఇస్తూ తాము చాలా మందిమి ఉన్నామని, ఎలాంటి క్రూరజంతువు వల్ల ప్రమాదం ఉండదని అన్నారు. చివరకు ఆయన యూసుఫ్ (అస)ను వారితో పంపడానికి అంగీకరించారు.

ఇప్పుడు యూసుఫ్‌ను వదలించుకోవచ్చని వారు సంబరపడ్డారు. ఇక నుంచి తండ్రి ప్రేమ తమకే లభిస్తుందని భావించారు. ఇల్లు వదలి బయటకు రాగానే వారు తిన్నగా బావి వద్దకు వెళ్ళారు. నీళ్ళు తాగాలన్న సాకుతో అక్కడకు యూసుఫ్‌ను తీసుకుపోయారు. వారిలో ఒకడు యూసుఫ్(అస)ను గట్టిగా పట్టుకున్నాడు. ఉలిక్కిపడిన యూసుఫ్(అస) వదలించుకోవడానికి పెనుగులాడారు. మిగిలిన సోదరులు కూడా వచ్చి ఆయన్ను గట్టిగా పట్టుకున్నారు. అందులో ఒకడు యూసుఫ్(అస) చొక్కా విప్పి తీసుకున్నాడు. మిగిలిన వాళ్ళు ఆయన్ను ఎత్తి బావిలో పారేసారు. యూసుఫ్(అస) ఎంతగా ప్రాధేయపడినా వారి రాతిమనసులు కరగలేదు. తర్వాత వారు ఒక గొర్రెను చంపి ఆ రక్తంలో యూసుఫ్(అస) చొక్కాను తడిపారు. తాము చేసిన పని రహస్యంగా ఉంచాలని అందరూ ప్రమాణం చేసుకున్నారు.

ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత రక్తంతో తడిసిన చొక్కాను తండ్రికి చూపించి మొసలి కన్నీరు కార్చడం ప్రారంభించారు. "నాన్నగారూ! మీరు భయపడినట్టే జరిగింది. మేము అటూఇటూ పరుగులు తీస్తూ, మా వస్తువుల వద్ద యూసుఫ్‌ను ఉంచాము. మేము లేనప్పుడు ఒక తోడేలు వచ్చి యూసుఫ్‌ను తినేసింది" అని కథ అల్లి చెప్పారు.

వారు అబద్ధమాడుతున్నారన్నది యాకూబ్(అస)కు తెలుసు. తన కుమారుడు బ్రతికే ఉన్నాడన్నది కూడా ఆయన మనసుకు తెలుసు. రక్తంతో తడిసిన ఆ చొక్కాను ఆయన తన చేతుల్లోకి తీసుకున్నారు. దాన్ని పరచి, "విచిత్రమైన తోడేలు.. నా కుమారుడిని తినేసింది కాని చొక్కాను అస్సలు చింపలేదు" అన్నారు. వారి ముఖాలు మాడిపోయాయి. వారిని యాకూబ్(అస) గుచ్చి గుచ్చి ప్రశ్నించే సరికి వారు తాము నిజమే చెబుతున్నామని అల్లాహ్ పేరు మీద అబద్ధపు ప్రమాణాలు చేశారు.

ఆ తండ్రి హృదయం బ్రద్దలైంది. కన్నీళ్ళతో, నిరుపమాన సహనాన్ని ప్రదర్శిస్తూ ఆయన దేవునితో తన కుమారుని కోసం ప్రార్థించారు.



## చీకటి బావిలో యూసుఫ్ (అస)

ఆ చీకటి బావిలో ఒక రాతిని పట్టుకుని యూసుఫ్ (అస) దానిపై కూర్చున్నారు. ఆయన చుట్టూ కటిక చీకటి. చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశ్శబ్దం తాండవిస్తోంది. ఆయన మనసులో భయంగొలిపే ఆలోచనలు రాసాగాయి. ఇప్పుడు ఏం కానుంది? ఆహారం ఎలా లభిస్తుంది? తన సోదరులే తనపై ఎందుకు కుట్ర చేశారు? తన పరిస్థితి గురించి తండ్రికి తెలుసా? తన తండ్రి చిరునవ్వు ఆయన కళ్ళ ముందు కదలాడింది. తన పట్ల తండ్రి చూపిన ప్రేమాభిమానాలు గుర్తుకువచ్చాయి. యూసుఫ్ (అస) దేవుణ్ణి ప్రార్థించడంలో మునిగిపోయారు. నెమ్మదిగా ఆయనలో భయం తగ్గుముఖం పట్టింది. సృష్టికర్త ఆ యువకుడిని పెద్ద ఆపదకు గురిచేసి పరీక్షిస్తున్నాడు. అతనిలో అనితర సాధ్యమైన స్థయిర్యాన్ని, సహనాన్ని పుట్టించడానికి ఈ పరీక్ష పెట్టాడు. యూసుఫ్(అస) దైవాభీష్టానికి తలొగ్గారు.

## సహాయం

ఆ బావి వద్దకు వర్తకుల బృందం ఒకటి వచ్చింది. నీరు తోడుకోవడానికి వారిలోని ఒక వ్యక్తి బావిలోకి నీటిని తోడే చేద వేయగానే ఆ శబ్దానికి యూసుఫ్ (అస) ఉలిక్కి పడ్డారు. ఆయన దానిని గట్టిగా పట్టుకున్నారు. ఆ మనిషి దానిని పైకి లాగడం ప్రారంభించి చాలా బరువుగా ఉండడంతో బావిలోకి తొంగి చూశాడు. లోపలి దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఒక మనిషి తాడును గట్టిగా పట్టుకుని కనబడ్డాడు. అతను తాడు గట్టిగా పట్టుకుని మిగిలిన వారిని కేకవేసి పిలిచాడు. "కాస్త చెయ్యి వేయండి.. ఇక్కడ మనకు ఒక ఖజానా దొరికినట్లుంది" అంటూ పిలిచాడు.

అతని తోటివారు పరుగు పరుగున బావి వద్దకు వచ్చారు. బావి నుంచి యూసుఫ్(అస)ను బయటకు లాగడానికి సహాయం చేశారు. బయటకు లాగి చూస్తే, ఒక అందమైన, దృఢమైన యువకుడు కనబడ్డాడు. అతడిని బానిసగా అమ్మితే చాలా డబ్బు వస్తుందని భావించారు. ఆ వెంటనే ఆయన్ను ఇనుప సంకెళ్ళతో నిర్బంధించారు. ఆయన్ను అక్కడి నుంచి సుదూరాన ఉన్న ఈజిప్టుకు తీసుకుని వెళ్లారు.

## బానిసల వేలం

ఈజిప్టు నగరంలో ఈ వార్త దావానలంలా వ్యాపించింది. చాలా అంద

https://teluguislam.net



మైన, దృఢమైన ఒక బానిస యువకుడు అమ్మకానికి ఉన్నాడన్న వార్త నగర మంతా పాకిపోయింది. బానిసల బజారులో వందలాది మంది గుమిగూడారు. కొందరు కేవలం చూడ్డానికి వచ్చారు, కొందరు వేలం పాడడానికి వచ్చారు. కులీనులు, సంపన్నులు అందరూ మెడలు నిక్కించి ఆయన్ను చూస్తున్నారు. చివరకు గవర్నరుగారు యూసుఫ్ (అస)ను కొనుక్కున్నాడు. యూసుఫ్(అస)ను ఆయన తన భవనానికి తీసుకువెళ్ళాడు.

గవర్నరు అజీజ్★కు పిల్లలు లేరు. అతను తన భార్యతో, "ఈ కుర్రాడిని జాగ్రత్తగా చూసుకో. ఈ కుర్రాడు ఒక రోజు మనకు చాలా పెద్ద అదృష్టాన్ని కలుగ జేస్తాడని నా నమ్మకం. కనీసం మనం అతడిని మన పుత్రుడిగానయినా దత్తత తీసుకో వచ్చు" అని చెప్పాడు.

యూసుఫ్(అస)ను బంధించి ఉన్న సంకెళ్ళు విప్పమని అజీజ్ తన సేవకు లను ఆదేశించడం చూసి యూసుఫ్ (అస) ఆశ్చర్యపోయారు. యూసుఫ్(అస)తో మాట్లాడుతూ, తన నమ్మకాన్ని వమ్ము చేయవద్దని, మంచిగా మసలుకుంటే ఆయన్ను బాగానే చూడడం జరుగుతుందని అజీజ్ హామీ ఇచ్చాడు. యూసుఫ్ (అస) చిరునవ్వుతో తనను కొనుక్కుని ఆదరించిన గవర్నరుకు కృతజ్ఞతలు చెప్పారు. తాను విశ్వాసపాత్రునిగా ఉంటానని చెప్పారు.

ఇక్కడ యూసుఫ్(అస)కు కాస్త ఆశ్రయం లభించింది. బాగా చూసుకునే అదరువు లభించింది. ఆయన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటూ జీవితంలో ఎదురయ్యే సంఘటనల పట్ల ఆలోచించసాగారు. కొన్ని రోజుల క్రితం తాను ఒక చీకటి బావిలో, బ్రతికే ఆశ లేని పరిస్థితిలో ఉన్నారు. తర్వాత తనను కొందరు కాపాడారు, కాని ఇనుప సంకెళ్ళతో బంధించారు. ఇప్పుడు ఒక విలాసవంతమైన భవనంలో తాను స్వేచ్ఛగా తిరుగాడుతున్నారు. ఆహారానికి ఎలాంటి కొదువ లేదు. కాని ఆయన తన తల్లిదండ్రుల కోసం, సోదరుడు బిన్‌యామిన్ కోసం పరితపించ సాగారు. వారిని గుర్తుచేసుకుని రోజూ దుఃఖించేవారు.

గవర్నరు గారి భార్యకు వ్యక్తిగత సేవకునిగా ఆయన నియమించబడ్డారు. ఆయన చాలా విధేయంగా పని చేసేవారు. నమ్రత, సహనం, మృదువైఖరి కలబోసిన ఆయన , అందరి హృదయాలూ చూరగొన్నారు. గవర్నరు అజీజ్ కూడా ఆయన్ను చాలా అభిమానించసాగాడు.

★ ఇక్కడ 'అజీజ్' అనేది పేరు కాదు. ఈజిప్ట్ దేశ అధికారిక బిరుదు.



కాలం గడచిన కొద్దీ ఆయన ఒక తెలివైన, జ్ఞానసంపన్నుడైన యువకునిగా ఎదిగారు. ఆయనలోని సుగుణాల కారణంగా అల్లాహ్ ఆయనకు వివేకాన్ని, విజ్ఞతను, వివేచనను ప్రసాదించాడు.

ఆయన చాలా అందమైనవారు. ఆయన సౌందర్యం పట్టణంలో చర్చ నీయాంశమైంది. కవులు ఆయన్ను తాము చూసిన అత్యంత అందమైన వ్యక్తిగా కీర్తిస్తూ కవితలు అల్లసాగారు. దూరప్రాంతాల నుంచి ప్రజలు ఆయన్ను చూడ డానికి రాసాగారు. అనేక మంది కన్యలు, కులీన కుటుంబాలకు చెందిన స్త్రీలు ఆయన్ను స్వంతం చేసుకోవాలని కలలు కనసాగారు. కాని ఆయన ఎన్నడూ ఎలాంటి అనుచితమైన చేష్టలకు పాల్పడలేదు. ఎల్లప్పుడూ మర్యాదగా, నమ్రతగా వ్యవహరించేవారు.

త్వరలోనే ఆయనకు జీవితంలో మరో పరీక్ష ఎదురైంది. అందమైన యూసుఫ్ (అస) సౌందర్యం గవర్నరు భార్య జులేఖాను నిలువనీయలేదు. ఆయన పట్ల వెర్రివ్యామోహం వల్ల ఆమె నిద్రలేని రాత్రులు గడిపింది. ఆయన పట్ల ప్రేమలో మునిగిపోయింది. తాను అమితంగా ప్రేమించే వ్యక్తి అంత దగ్గరగా ఉన్నప్పటికీ కనీసం తాకడానికి కూడా అవకాశం లేని పరిస్థితి ఆమెకు భరించరాని దయ్యింది. అయితే ఆమె బరితెగించిన స్త్రీ కాదు. ఆమెకు ఉన్న హోదా అంత స్తుల ద్వారా ఆమె తాను కోరిన పురుషుడిని పొందగలదు. ఆమె చాలా తెలివి కలిగిన అందమైన స్త్రీ. అందుకే గవర్నరు కావాలని ఆమెను వివాహం చేసు కున్నాడు. ఆమె వల్ల సంతానం కలగకపోయినా ఆయన మరో పెళ్ళి చేసుకోలేదు. ఆమెను అంతగా ప్రేమించేవాడు.

## ప్రలోభం

యూసుఫ్ (అస) పట్ల ఆకర్షణను తట్టుకోలేని జులేఖా ఒక రోజు అందంగా ముస్తాబు చేసుకుని యూసుఫ్ (అస)ను తన శయనాగారానికి రమ్మని పిలిపిం చింది. ఆయన రాగానే లోపలి నుంచి తలుపులు మూసి, నేను నీ కోసమే ఉన్నా నని తన కోరికను వెళ్ళగక్కింది.

యూసుఫ్ (అస) నిర్ఘాంతపోయారు. ఈ ప్రలోభం చాలా బలమైనది. దీన్ని తిరస్కరించడం సాధారణమైన విషయం కాదు. పూర్తి యవ్వనంలో ఉన్న యూసుఫ్(అస) మనసులో నైతికమైన ఆలోచనలే కదలాడాయి. నన్ను కన్న కొడుకులా చూస్తున్న గవర్నరు గారి గౌరవమర్యాదలను ఎలా భంగపరచగలను?

https://teluguislam.net



అన్నారు. "అల్లాహ్ క్షమించుగాక! మీ భర్త నాకు యజమాని. ఆయన నన్ను చాలా బాగా చూస్తున్నారు. చెడుగా వ్యవహరించిన వారికి ఎలాంటి మంచీ జరగదు" అని జవాబిచ్చారు. స్త్రీల దుర్మార్గపు ఆలోచనల నుంచి తనను కాపాడమని ఆయన దేవుణ్ణి శరణు కోరారు.

యూసుఫ్ (అస) తిరస్కారం ఆమె వాంఛను మరింత పెంచింది. ఆయన బయటకు వెళ్ళడానికి తలుపు తీస్తుండగా ఆమె వెనక నుంచి పరుగున వెళ్ళి ఆయన చొక్కా పట్టుకుంది. గట్టిగా లాగడం వల్ల ఆయన చొక్కా చిరిగిపోయింది. చిరిగిన చొక్కా ముక్క ఆమె చేతిలో ఉండిపోయింది. అప్పుడే యూసుఫ్ (అస) తలుపు తెరిచారు. ఎదురుగా గవర్నరు అజీజ్ నిలబడి ఉన్నాడు. తెలివైన ఆ స్త్రీ వెంటనే తన స్వరాన్ని మార్చి తన చేతుల్లో చిరిగిపోయిన చొక్కా ముక్కను భర్తకు చూపిస్తూ, "నీ భార్య పట్ల చెడుగా వ్యవహరించిన వ్యక్తికి శిక్ష ఏమిటి?" అని ప్రశ్నించింది. యూసుఫ్ (అస) తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని చెబుతూ అందుకు రుజువుగా ఆ చొక్కా ముక్కను చూపించింది. తాను అమాయకురాలినని, యూసుఫ్ (అస) తనను లొంగదీయడానికి ప్రవర్తించాడని ఆరోపించింది. యూసుఫ్(అస) మొదట దిగ్భ్రాంతికి గురయ్యారు. తర్వాత జరిగినది అజీజ్‌కు వివరించే ప్రయత్నం చేశారు. అయితే మూసి ఉన్న తలుపుల వెనుక ఏం జరిగిందో యూసుఫ్(అస)కు, జులేఖాకు తప్ప మరెవ్వరికీ తెలియదు.

## సాక్ష్యం

అజీజ్ వెంటనే జులేఖా సోదరునితో మాట్లాడారు. జులేఖా సోదరుడు నిజాయితీ, తెలివితేటలు కలిగిన వ్యక్తి. ఆయన జులేఖా కథనాన్ని, యూసుఫ్ (అస) చెప్పిన మాటలను విన్నాడు. తన అభిప్రాయాన్ని చెబుతూ, "సేవకుని చొక్కా ముందు భాగం చిరిగి పోయి ఉంటే జులేఖా చెబుతున్నది నిజం. అతడు ఆమె పట్ల అసభ్యంగా వ్యవహరించాడని చెప్పాలి. అలా కాక అతని చొక్కా వెనుక భాగం చిరిగి ఉంటే జులేఖా అబద్ధమాడుతోంది" అన్నాడు. చిరిగిన చొక్కాను పరిశీలిస్తే ఆమె చెప్పేది అబద్ధమని స్పష్టంగా తెలిసింది. నిరాశా నిస్పృహలకు గురైన ఆ భర్త ఆమెతో, "సిగ్గు.. సిగ్గు.. మీ స్త్రీల మాయోపాయాలు!" అన్నాడు.

న్యాయప్రియుడైన అజీజ్ వెంటనే తన భార్య ప్రవర్తనకు యూసుఫ్ (అస)కు క్షమాపణలు చెప్పాడు. యూసుఫ్(అస)పై అసత్యపు ఆరోపణలు



చేసినందుకు క్షమాపణలు వేడుకోవాలని తన భార్యకు కూడా ఆదేశించాడు. అయితే సేవకులతో నిండిన అలాంటి భవనంలో జరిగిన ఈ సంఘటన ఒక రహస్యంగా ఉండడం సాధ్యం కాదు. ఈ కథ ఆ నోట ఈ నోట అందరికీ తెలిసింది. జులేఖా ప్రవర్తన సిగ్గుచేటని స్త్రీలు మాట్లాడుకోసాగారు. "ఒక గవర్నరుకు భార్యగా ఉండి ఒక బానిసతో ప్రేమ వ్యవహారాన్ని నడుపాలనుకోవడం సిగ్గుచేటు" అని వ్యాఖ్యానించసాగారు.

ఈ వ్యాఖ్యలు జులేఖాను చాలా బాధించాయి. యూసుఫ్ (అస) వంటి సాటిలేని అందం కలిగిన వ్యక్తిని చూసిన ఏ స్త్రీ అయినా తన లాగే వ్యవహరిస్తుందని ఆమె భావించింది. తన అభిప్రాయాన్ని నిరూపించడానికి, తాను ఎలాంటి ఆకర్షణకు గురయ్యిందో అలాంటి ఆకర్షణకే మిగిలిన స్త్రీలు అందరూ గురయ్యే పథకాన్ని వేసింది. వారందరిని ఒక పెద్ద విందుకు ఆహ్వానించింది. గవర్నరు గారి భార్య ఇచ్చిన విందుకు రాకుండా ఎలా ఉంటారు. అందరూ వచ్చారు. ఈ సందర్భంగా ఆ బానిస కుర్రాడిని కూడా చూడాలని వచ్చారు. జులేఖాతో చనువు ఉన్న కొందరు స్త్రీలయితే యూసుఫ్(అస)ను పరిచయం చేయటానికి అంగీకరిస్తేనే తాము విందుకు వస్తామని హాస్యమాడారు.

విందు ప్రారంభమయ్యింది. రకరకాల ఫలాలు వారి ముందు ఉన్నాయి. వాటిని కోయడానికి పదునైన కత్తిని ప్రతి ఒక్కరి ముందు ఉంచడం జరిగింది. ఆ ఫలాలను తినడానికి వారు కత్తితో వాటిని కోస్తున్నప్పుడు జులేఖా అక్కడికి యూసుఫ్ (అస)ను పిలిచింది. ఆయన అక్కడికి హుందాగా వచ్చారు. జులేఖా ఆయన్ను పేరు పెట్టి పిలువగానే ఆ స్త్రీలు అందరూ తలెత్తి ఆయన్ను చూశారు. అలాంటి అందమైన యువకుడిని వారు ఎన్నడూ చూడలేదు. ఆయన అందం వారిని మంత్రముగ్ధుల్ని చేసింది. వారు తమ చూపును ఆయనపై నుంచి తప్పించలేకపోయారు. ఆయన్ను అలా చూస్తూ ఉండిపోయారు. చివరకు తమ చేతుల్లో ఉన్న ఫలాన్ని కోసే బదులు వేళ్ళు కోసుకున్నారు. ఇది చూసిన జులేఖా ముఖంలో సంతృప్తి కదలాడింది. తన పథకం ఫలించిందని ఆమె భావించింది. అందరినీ ఉద్దేశించి మాట్లాడుతూ ఆమె, "ఈ యువకుడి విషయంలోనే మీరందరూ నాపై ఆరోపణలు, విమర్శలు చేశారు, ఇతడు నాకే స్వంతం, నా మాటకు ఒప్పుకోకపోతే ఇతడ్ని జైల్లో నేరస్తులతో పాటు మగ్గేలా చేస్తాను" అని అందరి ముందు ధైర్యంగా ప్రకటించింది. ఈ మాటలు విన్న యూసుఫ్ (అస) దేవునితో, "ప్రభూ! చెడుకు పాల్పడేకన్నా జైలే నాకు మేలయినది" అని ప్రార్థించారు.

https://teluguislam.net



ఆమె ఎన్ని విధాలుగా ప్రయత్నించినా యూసుఫ్ (అస)ను లోబరచుకోలేక పోయింది. ఆమె దెబ్బతిన్న తాచులా బుసలు కొట్టింది. తన గౌరవమర్యాదలు నిలబడాలంటే యూసుఫ్ (అస) జైలుకు పోవాలని తన భర్తకు నచ్చజెప్పింది. లేకపోతే తాను అతడి గౌరవమర్యాదలను కాపాడలేనని స్పష్టంగా చెప్పేసింది. యూసుఫ్ (అస) నిర్దోషి అన్న విషయం అజీజ్‌కు బాగా తెలుసు. యూసుఫ్ (అస) మంచి యువకుడని, విశ్వాసపాత్రుడైన సేవకుడని ఆయనకు బాగా తెలుసు. అందువల్లనే ఆయన యూసుఫ్ (అస)ను అభిమానిస్తున్నాడు. ఒక అమాయకుడిని జైలులో పెట్టించడం ఆయనకు ఇష్టం లేదు. కాని ఆయనకు మరో దారి కూడా కనబడలేదు. యూసుఫ్(అస)ను జులేఖాకు దూరంగా ఉంచడం వల్లనే యూసుఫ్ (అస) గౌరవమర్యాదలు కూడా భద్రంగా ఉంటాయని ఆయన భావించాడు. ఆ రాత్రి ఆయన బరువైన మనసుతో యూసుఫ్(అస)ను జైలుకు పంపాడు.

## యూసుఫ్(అస) కలల అర్థాన్ని వివరించడం

ఈ జైలు శిక్ష యూసుఫ్ (అస)కు మూడవ పరీక్ష. ఈ సమయంలో అల్లాహ్ ఆయనకు ఒక అసాధారణమైన వరాన్ని ప్రసాదించాడు. కలల అర్థాన్ని గ్రహించే శక్తి ప్రసాదించాడు. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు ఏదో అపరాధం వల్ల అదే జైలుకు వచ్చారు. అందులో ఒకడు రాజుగారి వ్యక్తిగత సేవకుడు. రెండవవాడు రాజుగారి వంటవాడు. యూసుఫ్(అస)ను చూసి వారు ఆయన నేరస్తుడు కాదని గ్రహించారు. ఆయన ముఖంలో ధర్మపరాయణతకు సంబంధించిన తేజస్సు దేదీప్యమానంగా ప్రకాశించేది. వారిద్దరికి విచిత్రమైన కలలు వచ్చాయి. ఆ కలల అర్థం తెలుసుకోవాలని వారు ఆతృత కనబరిచారు. వారు యూసుఫ్(అస)ను తమ కలలకు అర్థం చెప్పవలసిందిగా కోరారు. రాజుగారి వ్యక్తిగత సేవకుడు తన కల గురించి చెబుతూ, "నా కలలో నేను ఒక ద్రాక్ష తోటలో ఉన్నాను. ద్రాక్షపళ్ళ రసాన్ని తీసి రాజుగారి కోసం పాత్రలో పోస్తున్నాను" అన్నాడు. రాజుగారి వంటవాడు తన కల గురించి చెబుతూ, "నేను కలలో ఒక రొట్టెలు ఉన్న బుట్టను నెత్తిన పెట్టుకుని వెడుతున్నాను. పక్షులు ఆ రొట్టెలను తినేస్తున్నాయి" అన్నాడు. వారి కలలకు అర్థం చెబుతానని యూసుఫ్ (అస) హామీ ఇచ్చారు. కలల అర్థాన్ని గ్రహించే శక్తి తనకు అల్లాహ్ ప్రసాదించాడని వారికి చెప్పారు. అల్లాహ్‌ను



తిరస్కరించేవారు, మరణానంతర జీవితాన్ని తిరస్కరించేవారి మార్గాన్ని తాను తిరస్కరిస్తున్నానని, తాను తన తాతముత్తాతలైన ప్రవక్తల ధర్మానికి కట్టుబడుతున్నానని, తాను అల్లాహ్‌కు భాగస్వాములను చేర్చేవాడిని కాదని, అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ ఆరాధించరాదని స్వయంగా ఆయనే ఆదేశించాడని వివరించారు.

ఆ తర్వాత ఆయన ఆ ఇద్దరి కలల అర్థాన్ని గురించి వివరించారు. అందులో ఒకరి కల మంచిని సూచిస్తుందని, మరొకరి కల చెడును సూచిస్తుందని అన్నారు. రాజుగారి వ్యక్తిగత సేవకుడు నిర్దోషిగా విడుదల అవుతాడని, కాని రాజు గారి వంటవాడు దోషిగా నిరూపించబడి శిలువ వేయబడతాడని అన్నారు. పక్షులు అతని తలను పొడిచి తింటాయని చెప్పారు. (రాజుగారి వ్యక్తిగత సేవకుడు నిజానికి అబద్ధపు ఆరోపణల వల్ల జైలుపాలయ్యాడు. కాని రాజుగారి వంటవాడు మాత్రం రాజుకు విషం ఇచ్చి చంపే కుట్రలో పాలుపంచుకున్న నేరస్తుడు.)

యూసుఫ్(అస) చెప్పిన విధంగానే రాజుగారి వంటవాడికి శిక్ష పడింది. రాజుగారి వ్యక్తిగత సేవకుడు విడుదలయ్యాడు. అతను మళ్ళీ రాజుగారి కొలువులో చేరిపోయాడు. యూసుఫ్ (అస) తన కలకు అర్థాన్ని వివరించడం, ఆయన చెప్పినట్లే జరగడం, ఆయన ముఖంలోని తేజస్సు రాజుగారి వ్యక్తిగత సేవకుడిపై గొప్ప ప్రభావాన్ని వేశాయి. యూసుఫ్ (అస)కు ఎలా తాను బదులు తీర్చుకునేదని ప్రశ్నించాడు. తనకు అన్యాయంగా విధించిన జైలు శిక్ష గురించి రాజుగారికి చెప్పమని యూసుఫ్(అస) అతడిని కోరారు. కాని జైలు నుంచి విడుదలైన రాజుగారి వ్యక్తిగత సేవకుడు ఈ విషయాన్ని మరచిపోయాడు. అందువల్ల యూసుఫ్ (అస) మరికొన్ని సంవత్సరాలు జైలులోనే ఉండవలసి వచ్చింది.

## రాజుగారి కల

ఒక రోజు రాజుగారికి ఒక కల వచ్చింది. ఆ కల ఆయన్ను చాలా కలచివేసింది. రాజ్యంలోని పండితులు, మేధావులందరినీ ఆయన హాజరుపరచి తన కలకు అర్థాన్ని చెప్పమన్నాడు. రాజుగారు తన కలలో ఏడు పుష్టికరమైన ఆవులను చూశారు. వాటిని ఏడు బక్కచిక్కిన ఆవులు తినేస్తున్నాయి. ఏడు విరగపండిన మొక్కజొన్న పొత్తులను, మరో ఏడు ఎండిన పొత్తులను చూశారు. ఈ కలకు అర్థం చెప్పవలసిందిగా రాజు కోరాడు. దర్బారులోని మేధావులు, పండితులు

https://teluguislam.net



నిజాయితీగా తమ అశక్తతను ప్రకటించారు. ఈ కలకు అర్థం తాము చెప్పలేమన్నారు. ఈ కలలో మిశ్రమ సంకేతాలున్నాయని, ఇలాంటి కలల అర్థం చెప్పే శక్తి తమకు లేదని అన్నారు.

జైలు నుంచి విడుదలైన రాజుగారి వ్యక్తిగత సేవకుడు అప్పటికి రాజుగారి కొలువులో మళ్ళీ చేరి ఉన్నాడు. అప్పుడు అతడికి జైలులో తన కలకు అర్థం చెప్పిన యూసుఫ్ (అస) గుర్తుకు వచ్చారు. అతను రాజుగారితో, "ప్రభూ! మీ కారాగారంలో ఒక పుణ్యాత్ముడు ఉన్నారు. ఆయన కలల అర్థాన్ని వివరించే విద్యలో ప్రావీణ్యం కలిగినవారు. నన్ను మీరు ఆయన వద్దకు పంపితే నేను వెళ్ళి కలకు అర్థాన్ని తెలుసుకుని వస్తాను" అన్నాడు. రాజుగారు అతడిని వెంటనే వెళ్ళాలని ఆజ్ఞాపించారు.

రాజుగారి కలకు అర్థాన్ని తన వద్దకు వచ్చిన సేవకుడికి యూసుఫ్ (అస) ఇలా వివరించారు: రాజ్యంలో ఏడు సంవత్సరాలు పుష్కలంగా పంటలు పండుతాయి. సరియైన విధంగా సేద్యం చేస్తే మంచి దిగుబడి వస్తుంది. ప్రజల అవసరాలకు మించి పంటలు పండుతాయి. ఈ మిగులును నిలువ చేసుకోవాలి. ఆ పిదప ఏడు సంవత్సరాలు కరవు ఉంటుంది. నిలువ ఉంచుకున్న ధాన్యాన్ని ఈ కరవు కాలంలో ఉపయోగించుకోవాలి. అయితే కరువు సంవత్సరాల్లోనూ కొంత ధాన్యాన్ని మిగుల్చుకుని తర్వాతి సంవత్సరాలకు ఉంచుకోవాలని ఆయన తెలిపారు. ఇంకా ఆయన కలకు అర్థాన్ని వివరిస్తూ, "ఏడు సంవత్సరాల కరవు కాలం గతించిన తర్వాత ఒక సంవత్సరం పుష్కలంగా వర్షాలు కురుస్తాయి. సరియైన విధంగా నీటిని ఉపయోగించుకుంటే ద్రాక్ష, ఆలివ్ పంటలు బాగా పండుతాయి. ఆ విధంగా ద్రాక్ష, ఆలివ్ నూనెలు ప్రజలకు పుష్కలంగా లభిస్తాయి" అని చెప్పారు.

ఈ శుభవార్తను తీసుకుని రాజుగారి వ్యక్తిగత సేవకుడు రాజుగారి వద్దకు వచ్చాడు. యూసుఫ్(అస) తన కలకు చెప్పిన అర్థం రాజుగారికి ఆసక్తికరంగా కనబడింది. ఆయన వెంటనే యూసుఫ్(అస)ను పిలుచుకు రావలసిందిగా ఒక భటుని పంపించాడు. కాని ఆ భటుడు యూసుఫ్ (అస) మాటలు విని ఆశ్చర్యపోయాడు. జైలు నుంచి విముక్తి లభిస్తుందంటే ఏ ఖైదీ అయినా సంతోషంతో కేరింతలు కొడతాడు. కాని యూసుఫ్(అస) మాత్రం ముందు తనపై మోపబడిన



అబద్ధపు ఆరోపణలను ఉపసంహరించుకుంటేనే జైలు నుంచి బయటకు వస్తానని చెప్పారు. ఆయన భటునితో ఈ విషయం చెబుతూ, "రాజుగారి వద్దకు వెళ్ళి చెప్పు. ఆయన్ను అవసరమైతే గవర్నరు గారి భార్య ఇచ్చిన విందుకు హాజరైన మహిళలను విచారించమని చెప్పు. నాకు ఎందుకు జైలు శిక్ష విధించారో వారిని అడగమను" అని చెప్పి పంపించారు.

భటుని ద్వారా ఈ విషయం తెలుసుకున్న రాజుగారు వెంటనే విచారణ జరిపించారు. అప్పటికి గవర్నరు గారి భార్య కూడా ముసలిదయ్యింది. యూసుఫ్ (అస) కష్టాలకు తానే కారణమని ఒప్పుకుంది. తాను మానవమాత్రురాలినని, తనకూ బలహీనతలు ఉండడం సహజమని ఆమె చెప్పుకుంది. కాని ఇప్పుడు తాను అల్లాహ్ శరణువేడుకుంటున్నానని, చెడు ఆలోచనలు మానుకున్నానని, తనను క్షమించాలని రాజుగారిని వేడుకుంది. ఆమె పట్ల జాలితో రాజుగారు ఆమెను క్షమించారు. యూసుఫ్(అస) నిర్దోషి అని రుజువయ్యింది. రాజుగారు ఈ విషయం యూసుఫ్(అస)కు తెలియజేసి, ఆయన్ను రాజభవనానికి ఆహ్వానించారు. యూసుఫ్(అస)ను చూడగానే ఆయన ఔన్నత్యాన్ని గుర్తించి రాజుగారు ఆయనకు తన దర్బారులో ఉన్నత పదవిని కట్టబెట్టారు. రాజ్యంలోని ధాన్యాగారాల నియంత్రణ బాధ్యతలు ఆయనకు అప్పగించారు. ఆ విధంగా ఆయన రాజ్యంలోని పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకుని రానున్న కరవు కాలాల్లో ఇబ్బందులు ఎదురవ్వకుండా తగిన ఏర్పాట్లు చేస్తారని రాజుగారు ఆశించారు.

## ఏడేళ్ళ వ్యవధులు

కాలచక్రం గిరగిర తిరిగింది. పుష్కలంగా పంటలు పండే మొదటి ఏడు సంవత్సరాల కాలం మొదలయింది. యూసుఫ్ (అస) ఆ కాలంలో రాజ్యంలోని పంటల విషయంలో పూర్తిగా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ తర్వాతి ఏడేళ్ళు రాజ్యంలో కరవు కాలం వచ్చిపడింది. ఆ ప్రాంతమంతటా కరవు అలముకుంది. యూసుఫ్(అస) స్వదేశం కన్ఆన్‌లో కూడా కరవు అలముకుంది. తమ రాజ్యంలో పుష్కలంగా ధాన్యం నిలువ ఉంది కాబట్టి అవసరం ఉన్న రాజ్యాలకు తగిన ధరకు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని అమ్మవచ్చని యూసుఫ్ (అస) రాజుగారికి సలహా ఇచ్చారు. రాజుగారు ఈ సలహాను అంగీకరించారు.

https://teluguislam.net



## యూసుఫ్(అస) సోదరుల రాక

యాకూబ్ (అస) తన కుమారులను ఈజిప్టు పంపించారు. బిన్‌యామిన్ తప్ప ఆయన కుమారులు అందరూ ధాన్యం కొనుక్కుని వెళ్ళడానికి ఈజిప్టు వచ్చారు. ధాన్యం కోసం సుదూర ప్రాంతం నుంచి వచ్చిన అనేక మంది సోదరుల గురించి యూసుఫ్ (అస) విన్నారు. వారు ఈజిప్టు భాష కూడా మాట్లాడ లేకపోతున్నారని ఆయన వద్దకు సమాచారం వచ్చింది. తమకు కావలసిన ధాన్యం కొనుగోలు కోసం వారు ఆయన ముందు హాజరైనప్పుడు యూసుఫ్ (అస) వెంటనే తన సోదరులను గుర్తించారు. కాని వారు ఆయన్ను గుర్తించలేక పోయారు. అసలు వారు ఆయన్ను ఎలా గుర్తిస్తారు? వారి దృష్టిలో యూసుఫ్ (అస) ఇకలేరు. ఏళ్ళ క్రితం చీకటి బావిలో విసరివేయబడ్డారు.

యూసుఫ్ (అస) వారిని సాదరంగా ఆహ్వానించారు. వారికి కావలసిన ధాన్యాన్ని ఇచ్చిన తర్వాత వారిని ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. తాము గౌరవనీయుడైన ప్రవక్త సంతానమని, తాము పదకొండు మంది సోదరులమని వారు సమాధానమిచ్చారు. తమలో అందరికన్నా చిన్నవాడు ఇంటి వద్ద తమ ముసలి తండ్రికి సేవచేయడానికి ఉండిపోయాడని చెప్పారు. తండ్రి గుర్తుకు రాగానే యూసుఫ్ (అస) కళ్ళు నీటితో నిండిపోయాయి. తన మనసు తండ్రి కోసం పరితపించింది. తన సోదరులతో ఆయన, "మిమ్మల్ని నమ్మవచ్చా?" అని ప్రశ్నించారు. వారు కాస్త అసహనంగా, "మేము అబద్ధాలు ఎందుకు చెబుతాము" అన్నారు.

"మీరు చెప్పేది నిజమైతే సాక్ష్యంగా మీ సోదరుడిని తీసుకురండి. నేను మీకు రెట్టింపు ధాన్యం ఇస్తాను" అన్నారు యూసుఫ్ (అస). "మీ సోదరుడిని తీసుకురానట్లయితే మీరు మళ్ళీ ఇక్కడికి రాకపోవడమే మంచిది" అని హెచ్చరించారు.

వాళ్ళు ఆనందంగా తమ సోదరుడిని తీసుకువస్తామని చెప్పారు. కాని అందుకు తమ తండ్రి అనుమతి తీసుకోవలసి ఉంటుంది. వారిని మళ్ళీ వచ్చేలా చేయడానికి యూసుఫ్ (అస) తన సేవకునితో, వాళ్ళు ధాన్యానికి చెల్లించిన నాణాలున్న సంచిని కూడా ఒక బస్తాలో ఉంచేయమన్నారు. ఆ విధంగా వాళ్ళు ఆశతో మళ్ళీ వస్తారని ఆయన ఆశించారు.



ఇంటికి తిరిగి వెళ్ళిన ఆ సోదరులు తమ తండ్రి యాకూబ్ (అస)తో ఈజిప్టులో జరిగింది యావత్తు వివరించారు. బిన్‌యామిన్‌ను తీసుకుని ఈజిప్టు వెళ్ళవలసి ఉందని ఆయనతో చెప్పారు. యాకూబ్ (అస) దుఃఖంతో తాను వారి వెంట బిన్‌యామిన్‌ను పంపేది లేదని అన్నారు. మిమ్మల్ని నమ్మి యూసుఫ్ (అస) ను మీ వెంట పంపితే మీరు ఏం చేశారని దుఃఖించారు.

ఆ తర్వాత వాళ్ళు తమ ధాన్యం బస్తాలు తెరిస్తే వాటిలో ఒకదానిలో తాము చెల్లించిన సొమ్ము ఎలాంటిదలాగే ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. వారు వెంటనే తమ తండ్రి వద్దకు వచ్చి, "చూడండి! అక్కడి అధికారి మేము ఇచ్చిన డబ్బు కూడా వాపసు ఇచ్చేశాడు. అతను బిన్‌యామిన్‌కు ఎలాంటి హాని కలిగించడనడానికి ఇదే సాక్ష్యం. బిన్‌యామిన్‌ను తీసుకువెళ్ళడం వల్ల లాభమే ఉంటుంది" అని వాదించారు. కాని యాకూబ్ (అస) వారితో పాటు బిన్ యామిన్‌ను పంపడానికి ఇష్టపడలేదు.

## సోదరుల పునరాగమనం

కొంతకాలం గడచిన తర్వాత వారి వద్ద ఉన్న ధాన్యం అయిపోయింది. మళ్ళీ ఈజిప్టు వెళ్ళి ధాన్యం తీసుకురావలసిందిగా యాకూబ్ (అస) వారికి చెప్పారు. కాని యూసుఫ్(అస) చేసిన హెచ్చరిక వారికి గుర్తుకు వచ్చింది. బిన్‌యామిన్ లేకుండా తాము ఈజిప్టు వెళ్ళలేరు. తప్పనిసరయి యాకూబ్ (అస) వారితో పాటు బిన్‌యామిన్‌ను పంపించారు. అయితే వారితో పాటు బిన్‌యామిన్‌ను పంపే ముందు వారితో ఒక ప్రమాణం చేయించారు. "అతడిని ఎలా తీసుకువెడుతున్నారో అదే స్థితిలో సురక్షితంగా తిరిగి తీసుకువస్తామని నాకు అల్లాహ్ పేరు మీద మీరు ప్రమాణం చేయండి లేకపోతే నేను అతన్ని మీ వెంట పంపను" అని అన్నారాయన. తండ్రి కోరిన విధంగా వారు ప్రమాణం చేశారు. యాకూబ్ (అస) వారిని ఆశీర్వదించి వారిని కాపాడాలని అల్లాహ్‌ను ప్రార్థించారు. వారు ఈజిప్టుకు సుదీర్ఘ ప్రయాణం ప్రారంభించారు. బిన్‌యామిన్ భద్రత విషయమై పూర్తి జాగ్రత్తలు తీసుకున్నారు.

యూసుఫ్(అస) వారిని సాదరంగా ఆహ్వానించారు. తన స్వంత సోదరుడు బిన్‌యామిన్‌ను గుండెలకు హత్తుకోవాలన్న కోరికను ఆయన అతికష్టమ్మీద

https://teluguislam.net



అణచుకున్నారు. వారందరికీ ఆయన ఒక విందు ఇచ్చారు. భోజనాల వద్ద వారు జంటలు జంటలుగా కూర్చున్నారు. యూసుఫ్(అస) తాను అమితంగా ప్రేమించే సోదరుడు బిన్‌యామిన్ ప్రక్కన కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయించారు. బిన్‌యామిన్ ఈ ఏర్పాటు చూసి దుఃఖిస్తూ తన సోదరుడు యూసుఫ్ (అస) ఉన్నట్లయితే తన ప్రక్కన కూర్చుని ఉండేవాడని చెప్పారు.

ఆ రాత్రి యూసుఫ్ (అస) బిన్‌యామిన్‌ను ఒంటరిగా కలుసుకుని తనను సోదరునిగా పరిగణిస్తావా అన్నారు. బిన్‌యామిన్ జవాబిస్తూ, "మీరు చాలా మంచి అధికారి. కాని నా సోదరుడు యూసుఫ్ (అస) స్థానం మీరు పూరించలేరు" అన్నారు. యూసుఫ్(అస) కన్నీళ్ళతో తానే ఆ సోదరుడినని వివరించారు. అనేక సంవత్సరాల యెడబాటు, తర్వాత విధి తమను మళ్ళీ కలిపిందని, ఇదంతా అల్లాహ్ అనుగ్రహమని అన్నారు. అయితే ప్రస్తుతానికి ఈ విషయాన్ని రహస్యంగా తామిద్దరి మధ్యనే ఉండనీయాలని చెప్పారు. సోదరులిరువురు సంతోష సంబరాలతో ఒకర్నొకరు కౌగలించుకున్నారు.

## దొంగతనం

మరుసటి రోజు వారికి ఇవ్వవలసిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి ఒంటెలపైకి ఎక్కిస్తున్నప్పుడు, రాజుగారి బంగారు పాత్రను బిన్‌యామిన్ సంచిలోకి ఒక వ్యక్తి జారవిడిచాడు. వారి ఒంటెలు పట్టణం దాటక ముందే వారిని ఒక అధికారి వెంబడిస్తూ వచ్చి, ఒంటెలు ఆపండని ఆజ్ఞాపించాడు. రాజుగారి బంగారు పాత్ర పోయిందని, వర్తక బృందాలన్నింటినీ తనిఖీ చేయవలసి ఉందని వారన్నారు. ఆ బంగారు పాత్రను వెదకి ఇచ్చిన వారికి రాజుగారు ఒక ఒంటె మోయగలిగిన ధాన్యం బహుమానంగా ఇస్తారని కూడా వారు చెప్పారు. సోదరులు అల్లాహ్ మీద ప్రమాణం చేస్తూ తాము ఇక్కడికి ఎలాంటి నేరం చేయడానికి రాలేదని అన్నారు. తాము దొంగలం కాదని వాదించారు. కాని ఆ అధికారి వారిని నిలదీస్తూ మీరు అబద్ధం చెబుతున్నట్లయితే మీకు ఎలాంటి శిక్ష విధించాలని ప్రశ్నించాడు. ఎవరి సంచిలో ఆ పాత్ర లభిస్తుందో ఆ వ్యక్తిని నిర్బంధించి విచారించాలని వారు జవాబిచ్చారు.

మొత్తం అందరినీ తనిఖీ చేయడం జరిగింది. బిన్‌యామిన్ సంచిలో ఆ పాత్ర దొరకడం చూసి వారు నిర్ఘాంతపోయారు. వారందరిని నిర్బంధించి



యూసుఫ్(అస) ముందు హాజరుపరచటం జరిగింది. సోదరులు బిన్‌యామిన్ నిజాయితీని, మంచితనాన్ని, సద్వర్తనాన్ని వివరించే బదులు, బిన్‌యామిన్ దొంగతనం చేయడం కొత్తకాదన్నట్లు మాట్లాడారు. అతడి పెద్దన్న (అంటే యూసుఫ్ -అస) కూడా అలాంటివాడే అన్నారు. తమ ఈర్ష్యాసూయలను ప్రకటించే మరో అవకాశం వారికి లభించినందుకు వారు సంబరపడ్డారు. దొంగను జైల్లో పెట్టాలని యూసుఫ్ (అస) అన్నారు. తనను కూడా దొంగను చేసి వారు తన ముందే మాట్లాడడాన్ని ఆయన సహనంతో విన్నారు. మీరు చెప్పేది నిజమో కాదో అల్లాహ్‌కు బాగా తెలుసు అనుకున్నారు.

అయితే బిన్‌యామిన్ లేకుండా ఇంటికి వెళ్ళి తమ తండ్రికి ముఖం చూపించలేమన్నది వారికి బాగా తెలుసు. తమ తండ్రి ఎనభై సంవత్సరాల వృద్ధుడని, ఈ వార్త ఆయన్ను చాలా కలచివేస్తుందని యూసుఫ్ (అస)కు నచ్చజెప్పాలనుకున్నారు. బిన్‌యామిన్ బదులుగా తమలో ఎవరినన్నా నిర్బంధించి, బిన్‌యామిన్‌ను వదలిపెట్టాలని కోరారు. కాని యూసుఫ్ (అస) వారి విజ్ఞప్తిని మన్నించలేదు.

వారిలో పెద్ద సోదరుడు యహూదా చాలా ఆందోళన చెందాడు. తాము బిన్‌యామిన్‌ను క్షేమంగా తీసుకువస్తామని తండ్రికి ప్రమాణం చేసి వచ్చారు. అందువల్ల తాను ఇక్కడే ఉండిపోతానని, తండ్రి అనుమతిస్తేనే, లేదా అల్లాహ్ ఆదేశిస్తేనే తిరిగి ఇంటికి వస్తానని అన్నాడు. వారు అతని కోసం కావలసిన ఆహార పదార్థాలు విడిచి పెట్టి వెళ్ళిపోయారు. యహూదా అక్కడే బిన్‌యామిన్‌కు ఎలాంటి విచారణ జరుగుతుందో అని ఎదురుచూస్తూ ఉండిపోయాడు.

## అంతా ఒక పథకం

ఈలోగా యూసుఫ్(అస) తన భవనంలో బిన్‌యామిన్‌ను అతిథిగా ఉంచుకున్నారు. అతని సంచిలో రాజుగారి పాత్రను ఉంచేలా పథకం వేసింది తానేనని వివరించారు. ఆ విధంగా బిన్‌యామిన్‌ను తన వద్ద ఉంచుకునేలా చేశానని, ఆ విధంగా ఆయన్ను కాపాడుకోవాలనుకున్నానని చెప్పారు. యహూదా కూడా బిన్‌యామిన్ కోసం అక్కడే ఉండిపోయాడని తెలిసి ఆయన సంతోషించారు. యహూదా స్వతహాగా మంచివాడే. యహూదా మంచిచెడ్డలు గమనించడానికి యూసుఫ్(అస) రహస్యంగా ఏర్పాట్లు చేశారు. మిగిలిన సోదరులను

https://teluguislam.net



వెనక్కి పంపడంలోనూ ఆయన వివేచన దాగి ఉంది. వారు తమ సోదరుల కోసం తిరిగి వస్తారో లేదో చూడాలని ఆయన భావించారు.

తిరిగి వచ్చిన కుమారులతో పాటు బిన్‌యామిన్ లేకపోవడాన్ని యాకూబ్ (అస) గుర్తించారు. కుమారులు ఈజిప్ట్‌లో జరిగింది వివరించిన తర్వాత ఆయన నిరాశతో కూలబడ్డారు. బిన్‌యామిన్ అలాంటి నేరం ఎన్నడూ చేయడన్నది ఆయనకు బాగా తెలుసు. వారి నుంచి ముఖం తిప్పుకుంటూ ఆయన, "మీరు కథ అల్లి చెబుతున్నారు. నేను సహనం వహిస్తాను. బహుశా అల్లాహ్ వారందరినీ నా వద్దకు తీసుకువస్తాడు. ఆయనే అత్యంత వివేకం కలిగినవాడు, జ్ఞాన సంపన్నుడు" అన్నారు.

బిన్‌యామిన్ విషయమై ఆయన చాలా బాధకు గురయ్యారు. దైవప్రార్థన మాత్రమే ఆయనకు సాంత్వననిచ్చేది. ఆ విధంగా ఆయన ధార్మిక విశ్వాసాన్ని బలోపేతం చేసుకునేవారు, సహనం వహించేవారు. ఇంతకాలం ఆయన తనకు అత్యంత ఇష్టుడైన కుమారుడు యూసుఫ్(అస) కోసం దుఃఖిస్తూ వచ్చారు. ఇప్పుడు ఆయన తనకు ఇష్టులైన మరో ఇద్దరు కుమారులను కోల్పోయారు. నిరంతరం రోదిస్తూ ఉండటం మూలంగా యాకూబ్ (అస) కంటిచూపు కూడా పోయింది. మిగిలిన కుమారులు ఆయనతో, "నాన్నా! మీరు ఉత్తములైన ప్రవక్త. అల్లాహ్ పంపిన గొప్ప సందేశ హరులు. మీ వద్దకు దైవసందేశం అవతరిస్తోంది. ప్రజలు మీ నుంచి మార్గదర్శకత్వాన్ని పొందుతున్నారు. ధార్మిక విశ్వాసాన్ని పొందుతున్నారు. మీరు ఎందుకు ఈ విధంగా మిమ్మల్ని మీరు కృశింపచేస్తున్నారు" అనడిగారు. యాకూబ్ (అస) వారికి జవాబిస్తూ, "ఇలాంటి మాటల వల్ల నా దుఃఖం తగ్గేది కాదు. నా కుమారులు తిరిగి వస్తేనే నా దుఃఖం ఉపశమిస్తుంది. కుమారులారా! వెళ్ళండి, వెళ్ళి యూసుఫ్(అస) ను, అతని సోదరుడిని వెదకి తీసుకురండి. అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందవద్దు. అవిశ్వాసులు మాత్రమే అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందుతారు" అన్నారు.

యూసుఫ్ (అస)ను ఎక్కడ వెదకాలో వారికి అర్థం కాలేదు. ఆయన బ్రతికి ఉన్నారో చనిపోయారో కూడా వారికి తెలియదు. ఆయన్ను చీకటి బావిలో వారు క్రూరంగా నెట్టేశారు. తాము చేసిన దానికి ఇప్పుడు సిగ్గుపడుతున్నారు. అయితే బిన్‌యామిన్, యహూదాలు ఎక్కడ ఉన్నారో వారికి తెలుసు. అందువల్ల మళ్ళీ



ఈజిప్టుకు వెళ్లి అక్కడి అధికారులకు నచ్చజెప్పి బిన్‌యామిన్ విడుదలకు ప్రయత్నించాలని భావించారు.

ఈజిప్టు వచ్చిన తర్వాత వారు యహూదాను కలిశారు. ఆ పిదప యూసుఫ్ (అస) వద్దకు వచ్చి, "మేము మళ్ళీ మీ వద్దకు రాక తప్పలేదు. మా సోదరుడిని విడుదల చేయవలసిందిగా మేము మిమ్మల్ని వేడుకుంటున్నాము. మా తండ్రిగారి దుఃఖాన్ని ఈ విధంగా మేము తగ్గించగలము. దయ చూపండి. దయ చూపేవారిని అల్లాహ్ కనికరిస్తాడు" అన్నారు.

తానెవరో చెప్పవలసిన సమయం ఆసన్నమయ్యిందని యూసుఫ్(అస) గ్రహించారు. "మిమ్మల్ని షైతాన్ తప్పుదారి పట్టించిన రోజు మీకు గుర్తున్నదా.. చాలా కాలం క్రితం మీరు నన్ను చీకటి బావిలో నెట్టేసిన రోజు మరచిపోయారా? అప్పుడు నేనెంత బ్రతిమాలినా మీ మనసు కరగలేదు కదా!" అన్నారు. వారంతా ఆశ్చర్యంతో ఆయన వైపు చూస్తుండిపోయారు. వారిలో ఒకడు అసంకల్పితంగా, "నువ్వు యూసుఫ్‌వా?" అని పలికాడు. "అవును నేను యూసుఫ్‌నే . అల్లాహ్ నాపై అనుగ్రహించాడు. అల్లాహ్ నిస్సందేహంగా అపారకృపాశీలుడు" అన్నారాయన.

సోదరులు భయంతో వణకిపోసాగారు. యూసుఫ్(అస) వారి భయాన్ని పోగొడుతూ, "ఇప్పుడు భయపడవలసిన పనిలేదు. అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక.. ఆయన పరమ దయామయుడు" అన్నారు. వారిని యూసుఫ్(అస) ఆలింగనం చేసుకున్నారు. వారంతా ఆనంద భాష్పాలు రాల్చారు. ఆ రాజ్యంలో యూసుఫ్(అస) ఒక బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నారు. తన స్థానంలో మరొకరిని నియమించకుండా అక్కడి నుంచి తప్పుకోవడం ఆయనకు సాధ్యం కాదు. కాబట్టి ఆయన తన సోదరులను తక్షణం ఇంటికి వెళ్ళి తల్లిదండ్రులను వెంటబెట్టుకుని ఇక్కడికే వచ్చేయండి అన్నారు. వారిని కలువాలన్న ఆతృత ఆయన్ను నిలువనీయలేదు. సోదరులకు తన చొక్కా ఒకటి ఇచ్చి ఆ చొక్కాను తండ్రి కళ్ళపై వేయమని చెప్పారు. ఆ విధంగా ఆయనకు కంటిచూపు మరలా వస్తుందని చెప్పారు.

యాకూబ్(అస) ఇక్కడ రాత్రింబవలు దైవప్రార్థనల్లో గడుపుతున్నారు. విచిత్రంగా ఒక ప్రశాంతత తనను ఆవహించుకున్న భావన ఆయనకు కలిగింది.

https://teluguislam.net



ఆయన ఆశ్చర్యపోయారు. "నిశ్చయంగా నాకు యూసుఫ్(అస) సువాసన అనుభూతికి వస్తుంది. మీరు నన్ను మతిచెడిన ముసలివాడనుకున్నా సరే" అన్నారు. ప్రజలు ఆయన ఏదేదో ఊహించుకుంటున్నారని భావించారు. ఈలోగా ఈజిప్టు నుంచి సోదరులు రానే వచ్చారు. తమతో పాటు వారు యూసుఫ్(అస) చొక్కాను కూడా తీసుకువచ్చారు. వారు సంతోషంగా తమ తండ్రికి జరిగిన వృత్తాంతం వివరించారు. యూసుఫ్ (అస) చొక్కాను ఆయన కళ్ళపై వేశారు. ఆ వెంటనే ఆయనకు కంటిచూపు వచ్చింది.

వారు తమ తండ్రితో తాము చేసిన తప్పుకు క్షమాపణ కోరుకున్నారు. యాకూబ్ (అస)వారితో, "నాకు మీపై ఎలాంటి అధికారమూ లేదు. మీకు అల్లాహ్ శిక్ష విధించకుండా నేను కాపాడలేను. నేను కేవలం మీ క్షమాపణ కోసం అల్లాహ్‌ను ప్రార్థించగలను. ఆయన చాలా క్షమించేవాడు. పరమ దయామయుడు" అన్నారు. ఆ పిదప వారందరూ ఈజిప్టుకు వెళ్ళిపోయారు.

వారందరినీ యూసుఫ్(అస) అత్యంత సాదరంగా ఆహ్వానించారు. అల్లాహ్ అనుగ్రహాలకుగాను అమితంగా కృతజ్ఞతలు తెలిపారు. తన తల్లిదండ్రులను ఆలింగనం చేసుకుని, "నాన్నా! నేను కన్న కలకు అర్థం ఇదే. నా ప్రభువు నా కలను నిజం చేశాడు. ఆయన నన్ను కరుణించాడు. జైలు నుంచి బయటకు తీశాడు. నాకు, నా సోదరులకు మధ్య షైతాన్ విద్వేషాన్ని రగిల్చిన తర్వాత ఇంత కాలానికి సుదూర ఎడారి నుంచి మిమ్మల్ని నా వద్దకు చేర్చాడు. నా ప్రభువు తాను తలచిన వారిపై దయచూపుతాడు. ఆయన అన్నీ తెలిసినవాడు, మహా జ్ఞాన సంపన్నుడు" అన్నారు.

యూసుఫ్(అస) తన తల్లిదండ్రులను రాజుగారి వద్దకు తీసుకువెళ్ళారు. వారందరూ ఈజిప్టులో స్థిరపడడానికి అనుమతి కోరారు. రాజ్యంలో యూసుఫ్ (అస) ఒక ముఖ్యమైన అధికారి. రాజు చాలా సంతోషంగా యూసుఫ్ (అస) కుటుంబం రాజ్యంలో ఉండడానికి అనుమతించాడు. యూసుఫ్ (అస) కృతజ్ఞతతో అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడ్డారు.

*(చదవండి దివ్యఖుర్ఆన్ 12:3,104; 23:34,75)*

## గ్రహించవలసిన పాఠాలు

- తల్లిదండ్రులు తమ పిల్లలందరినీ ప్రేమిస్తారు. కాని కొందరి పట్ల ఎక్కువ ఇష్టం చూపుతారు. అందుక్కారణం ఆ పిల్లల మంచి గుణ



గణాలు. అయితే ఈ ప్రేమాభిమానాలు వ్యక్తం చేయడంలో జాగ్రత్తగా ఉండడం అవసరం. సంతానంలో కొందరి పట్ల ఎక్కువ ఇష్టాన్ని ప్రదర్శిస్తే మిగిలిన వారిలో అసహనం, అసూయలు జనించడానికి అవకాశం ఉంది.
- అసూయ వల్ల బాధలకు గురయినవానికి దేవుని రక్షణ లభిస్తుంది. యూసుఫ్(అస) సోదరులు ఆయన్ను బానిసగా అమ్ముడుపోయేలా చేయడానికి పన్నిన కుట్ర నిజానికి ఆయన్ను జీవితంలో ఉన్నత స్థానానికి చేర్చింది.
- తాను చాలా ప్రేమించే తన కుమారుడు యూసుఫ్(అస) మరణించాడని విన్నప్పుడు యాకూబ్(అస) చాలా బాధపడ్డారు. కాని ఆయన నిరాశ చెందలేదు. సహనాన్ని, దేవుని కారుణ్యాన్ని ఆయన కోరుకున్నారు. అల్లాహ్‌పై భారంవేసి తాను అధికంగా ప్రేమించే మరో కుమారుడు బిన్‌యామిన్‌ను నమ్మకస్తులుకాని కుమారుల చేతుల్లో పెట్టడానికి ఆయన సిద్ధమయ్యారు. ఈసారి కూడా ఆయన నమ్మకం వమ్మయినట్లు కనబడింది. అయితే సృష్టికర్త పట్ల ఆయన విశ్వాసం చెక్కుచెదరలేదు. ఫలితంగా ఆయనకు దేవుని గొప్ప అను గ్రహాలు లభించాయి.
- దేవుని ఏకత్వాన్ని ప్రజలకు తెలియజేయడమే ప్రవక్తల ముఖ్య ఉద్దేశ్యం. అన్ని పరిస్థితుల్లోను, చివరకు జైలు గోడల మధ్య కూడా యూసుఫ్(అస) ఖైదీలకు దేవుని ఏకత్వాన్ని బోధించారు. ముస్లిములందరూ ఈ వైఖరిని కలిగి ఉండాలని అల్లాహ్ కోరుతున్నాడు.
- స్త్రీపురుష కలివిడి సంప్రదాయం వల్ల ప్రమాదాలు వాటిల్లుతాయి. యూసుఫ్ (అస) తన యజమానురాలి వెంట ఎల్లప్పుడూ ఉండేవారు. అందువల్ల ఆమె మనసులో వాంఛ తలెత్తింది. ఆమె ఆయన్ను లోబరచుకోవాలనుకున్నప్పుడు - ఆయన దేవునికి భయపడేవారు కాబట్టి, బలమైన నైతికస్థాయి కలిగిన వారు కాబట్టి- ఆమె కోరికను

తిరస్కరించారు. జైలు గురించి బెదిరించినప్పుడు కూడా ఆయన, "మీరు చేయమనే దానికన్నా జైలే నాకు మంచిది" అన్నారు.

- ప్రజలు చాలా త్వరగా మరచిపోతారు. తమకు చేసిన మంచిని కూడా మరచిపోతారు. రాజుగారి సేవకుడు చేసింది అదే.
- యూసుఫ్(అస) తాను చేయని నేరానికిగాను చాలా సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. తన నిర్దోషిత్వం రుజువు కాకుండా విడుదల కావడానికి ఆయన తిరస్కరించారు.
- అజీజ్ భార్య, తర్వాత తన తప్పు తెలుసుకుంది. దేవుణ్ణి క్షమాపణ వేడుకుంది.
- యూసుఫ్(అస), బిన్‌యామిన్‌లకు వ్యతిరేకంగా సోదరులు పన్నిన కుట్రలకు గాను వారిని యూసుఫ్(అస) మరణశిక్షకు గురిచేసినా, జైల్లో వేయించినా, వారిని మరో విధంగా హింసించినా సముచితమే అయ్యేది. అలా చేసే శక్తి కూడా ఆయనకు ఉండింది. కాని ఆయన వారందరినీ క్షమించారు.
- దివ్యఖుర్ఆన్‌లో అజీజ్ భార్య పేరు ప్రస్తావనకు రాలేదు. కాని ఆమె పేరు జులేఖాగా ఇతర ఉల్లేఖనాల్లో ప్రస్తావనకు వచ్చింది.
- బైబిలు ప్రకారం, జోసెఫ్(అంటే యూసుఫ్ ప్రవక్త) ఈజిప్టు దేశానికి ఫారోల కాలంలో వచ్చారు. కాని ఇది వాస్తవం కాదు, పశుపాలక రాజులుగా పేరొందిన హిక్సోస్ రాజుల కాలంలో ఆయన ఈజిప్టుకు వచ్చారు.

https://teluguislam.net



# ప్రవక్త షుఐబ్

(అలైహిస్సలాం)

**తూనికలు కొలతలు**



**కొలతలు తూనికల్లో మోసాలకు పాల్పడిన జాతి వారి హితబోధకై షుఐబ్ ప్రవక్త పంపబడ్డారు**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

మదియన్ ప్రాంతవాసులు అరబ్బులు. వారు మఅన్ రాజ్యంలో నివసించేవారు. నేడు ఇది సిరియాలో ఒక భాగంగా ఉంది. వారు అత్యాశపరులైన ప్రజలు. వారికి దేవుని ఉనికి పట్ల ఎలాంటి నమ్మకం ఉండేది కాదు. అన్ని విధాల చెడులతో నిండిన జీవితాన్ని వారు గడిపేవారు. తూనికలు కొలతల్లో మోసాలు చేసేవారు. తాము అమ్మే వస్తువులలోని లోపాలు దాచి చాలా గొప్ప వస్తువులుగా పొగిడేవారు. వినియోగదారులకు అబద్ధాలు చెప్పి మోసగించేవారు.

వారి వద్దకు అల్లాహ్ తన ప్రవక్తను పంపించాడు. ఆ ప్రవక్త షుఐబ్(అస). ఆయనకు అల్లాహ్ కొన్ని మహత్తులు కూడా ఇచ్చి పంపాడు. షుఐబ్ (అస) వారికి హితబోధ చేయడం ప్రారంభించారు. అల్లాహ్ అనుగ్రహాలను ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలని, దుర్మార్గానికి పాల్పడితే తీవ్రమైన ఫలితాలు చవిచూడవలసి వస్తుందని వారికి బోధించారు. కాని వారు ఆయన్ను ఎగతాళి చేశారు. అపహసించారు. షుఐబ్(అస) సహనంగా, తనకు వారితో ఉన్న బంధుత్వాన్ని గుర్తుచేస్తూ, తాను చేస్తున్నది తన స్వంత ప్రయోజనం కోసం కాదని వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు.

వారు ఆగ్రహించి షుఐబ్ (అస),

https://teluguislam.net



ఆయన అనుచరుల వస్తుసంపద మొత్తం లాక్కున్నారు. వారిని పట్టణం నుంచి బయటకు తరిమివేశారు. ప్రవక్త షుఐబ్ (అస) దేవుని సహాయం కోసం ప్రార్థించారు. ఆయన ప్రార్థనకు జవాబు లభించింది. అల్లాహ్ ఆ పట్టణంపైకి బొబ్బలెక్కించే వేడిని పంపాడు. ఈ వేడికి వారు అల్లాడిపోయారు. ఆకాశంలో ఒక మేఘాన్ని చూసి హమ్మయ్య ఇక చల్లగా వర్షం పడుతుందని భావించారు. కాని ఆ మేఘం తీవ్రగర్జనలతో పిడుగులు కురిపించింది. పైనుంచి గుండెలవిసే ఉరుములు వినబడ్డాయి. వాటి శబ్దానికి వారి కాళ్ళ క్రింది భూమి కంపించింది. భయభీతులతో దుర్మార్గులు నాశన మయ్యారు. దుర్మార్గుల అంతాన్ని దూరంగా నిలబడి షుఐబ్ (అస) చూశారు.

> "ఓ ప్రజలారా! ప్రభువు సందేశాన్ని నేను మీకు చేరవేశాను. మీకు మంచి సలహాలు ఇచ్చాను. సత్యాన్ని తిరస్కరించిన ప్రజల పట్ల నేను ఎలా సానుభూతి చూపగలను" అన్నారు.

*(ఇంకా చదవండి దివ్యఖుర్‌ఆన్: 7:85-93, 11:84-95, 26-176-191, 29:36-37)*

### గ్రహించవలసిన పాఠాలు

- సంస్కరణకర్త ఎల్లప్పుడు ప్రజలకు నచ్చజెబుతూ ఉండాలి. హోదా, పదవి, సంపద వగైరాలు పొందాలన్న ఉద్దేశ్యాలు అతనిలో ఉండరాదు. కేవలం అల్లాహ్ కోసం మాత్రమే పనిచేయాలి.
- తూనికలు కొలతల్లో ప్రజలు మోసాలు చేయకుండా వారిని మార్చడానికి షుఐబ్ (అస) చాలా ప్రయత్నించారు.
- వస్తువులను వాటి వాస్తవ పరిస్థితికి మించి పొగడడాన్ని ఇస్లామ్ అంగీకరించదు. వాటిలో లోపాలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశిస్తుంది. నిజాయితీ అన్నది ఇస్లామ్‌లో ఒక విధానం మాత్రమే కాదు, అన్ని వ్యవహారాల్లోనూ ఇదే ముఖ్యమైన సూత్రం.
- అవినీతికరమైన వ్యవహారాల్లో అల్లాహ్ తన అనుగ్రహాన్ని చూపడు. నేరస్తులను తీవ్రంగా శిక్షిస్తాడు. దేవుని శిక్ష విభిన్న విధాలుగా ఉంటుంది.



మూడవ విభాగం

# ప్రవక్త మూసా (అలైహిస్సలాం) విమోచనకర్త

**(కాలం : క్రీ.పూ. 1400-1250, లుక్మాన్ (అస) కాలం వరకు)**

(దివ్యఖుర్‌ఆన్‌లో ఉన్న ప్రవక్తల కథలలో ఇది అతిపెద్ద కథ. అనేక విభాగాలుగా ప్రస్తావనకు వచ్చింది.)



**ఫిర్‌ఔన్ మంత్రగాళ్ళతో జరిగిన పోటీలో మూసా ప్రవక్త విసిరిన కర్ర మహాసర్పంగా మారింది.**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఈజిప్టును పరిపాలించిన ఫిరౌన్ పరమ నియంత. యాకూబ్ (అస) సంతానంపై (అంటే బనీఇస్రాయీల్‌పై) ఫిరౌన్ అతి దారుణంగా అణచివేతలు, అత్యాచారాలకు పాల్పడ్డాడు. వారిని పరాభవించడానికి, వారిని అన్ని విధాలుగా త్రొక్కి వేయడానికి అతడు తనకు అందుబాటులో ఉన్న మార్గాలన్నింటినీ ఉపయోగించాడు. వారిని బానిసలుగా చేసుకున్నాడు. నామమాత్రంగా జీతభత్యాలు ఇస్తూ, కొన్ని సందర్భాల్లో అస్సలు ఏమీ ఇవ్వకుండా వారితో బండచాకిరి చేయించుకునేవాడు. ఫిరౌన్ ఒంటరిగా ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడడం సాధ్యం కాదు, అతడితోపాటు అతని అనుచరులు అనేక మంది ఈ దౌర్జన్యాలలో పాలు పంచుకునేవారు. వీరంతా కలసి అణగారిన బనీఇస్రాయీల్ ప్రజలపై దౌర్జన్యాల పరంపర కొనసాగించే వారు.

## పసిపాపలను హతమార్చడం

ఫిరౌన్ దర్బారులోని ఒక పూజారి చెప్పిన మాటల వల్ల ఫిరౌన్ పసిపిల్లల హత్యాకాండకు పాల్పడ్డాడు. బనీ ఇస్రాయీల్‌లో జన్మించే ఒక యువకుని వల్ల ఫిరౌన్‌కు పతనం వాటిల్లుతుందని ఆ పూజారి చెప్పాడు. ఆ మాటలు విన్న తర్వాత ఫిరౌన్ మండిపడి, బనీ ఇస్రాయీల్ ప్రజల్లో ఎవరికైనా మగపిల్లవాడు

https://teluguislam.net



జన్మిస్తే వెంటనే హతమార్చాలని ఆదేశించాడు. అంతేకాదు బనీఇస్రాయీల్ మహిళలను పురుషులకు దూరం చేయాలని తన సైనికులకు చెప్పాడు. రాజుగారి ఆదేశంతో సైనికులు విచ్చలవిడిగా దుర్మార్గాలకు పాల్పడ్డారు. పసిపాపల సుకుమారమైన శరీరాల్లోకి కరవాలాలను దిగేశారు. గర్భిణులపై నిఘా వేసి ఉంచడం జరిగేది. వారికి ప్రసవం అయిన వెంటనే పుట్టింది మగపిల్లవాడైతే వెంటనే హతమార్చేవారు.

## నదిలో పసివాడు

ఈ కాలంలో ఒక ఇస్రాయీల్ కుటుంబంలో ఒక పిల్లవాడు జన్మించాడు. అతడి పేరు మూసా. తల్లి యుకాబిద్. ఆమె రహస్యంగా పిల్లవాని ఆలనాపాలనా చూసింది. ఏదో ఒక విధంగా మూడు నెలల పాటు పిల్లవానికి పాలుపట్ట గలిగింది. ఆ తర్వాత తనకు దైవికంగా తోచిన భావాన్ని ఆచరణలో పెడుతూ ఆమె పసివాడిని ఒక బుట్టలో ఉంచి ఆ బుట్టను నదిలో విడిచిపెట్టింది. నైలు నదిలో ఆ విధంగా తన కుమారుణ్ణి విడిచిపెట్టిన ఆ తల్లి తన కుమార్తెతో ఆ బుట్ట ఏ దిశగా పోతుందో వెంట వెళ్ళి చూడమని చెప్పింది. ఆమె కుమార్తె నది తీరం వెంబడి బుట్ట ఎటు కొట్టుకు పోతున్నదో చూస్తూ వెళ్ళసాగింది. ఆ నీటి ప్రవాహం రాజభవనం ఆవరణలోని తోటలో నుంచి ప్రవహిస్తూ వెళ్ళింది. ఆమె ఆశ్చర్యంతో తన కళ్ళముందు కనబడిన దృశ్యాన్ని చూస్తూ ఉండిపోయింది. ఆ ప్రవాహంలోని బుట్ట రాజభవనం వద్ద తీరానికి చేరింది. రాజసేవకులు ఆ బుట్టను, అందులో ఉన్న శిశువును చూసి, శిశువును తీసుకుని ఫిరౌన్ దంపతుల వద్దకు వెళ్ళారు. ఫిరౌన్ భార్య, అక్కడి మహారాణి ఆ శిశువును చూసి ముగ్ధురాలయ్యింది. అల్లాహ్ ఆమె హృదయంలో ఆ శిశువు పట్ల ప్రేమ పుట్టుకువచ్చేలా చేశాడు. ఆమె తన భర్తతో, "ఈ పసివాడిని మనం పెంచుకుందాం, మన కుమారునిలా పెంచుకుందాం" అని చెప్పింది.★ ఫిరౌన్‌కు కూడా ఆ పసివానిపై అభిమానం కలిగింది. పిల్లవాడిని పెంచుకునే అనుమతి మహారాణికి ఇచ్చాడు.

★ ఫిరౌన్ భార్య దైవభక్తి కలిగిన విశ్వాసి. ఆమె ఎల్లప్పుడు దేవునితో తన సాఫల్యం కోసం, దుర్మార్గుడైన తన భర్త నుంచి, అతని దుర్మార్గాల నుంచి, అతనితో ఉన్న దుష్టుల నుంచి విముక్తి కోసం అల్లాహ్‌ను ప్రార్థించేది. (దివ్యఖుర్‌ఆన్: 66:11). దివ్యఖుర్‌ఆన్ వ్యాఖ్యానకర్తలు ఆమెను 'ఆసియా'గా పేర్కొన్నారు. ఆమె 'మూసా'ను పెంచుకున్నది. బైబిలు పేర్కొన్న మాదిరిగా ఆమె ఫారో (ఫిరౌన్) కుమార్తె కాదు.



మూసా సోదరి రాజభవన ఆవరణం వదలి బయటకు వెళ్ళేముందే ఫిరౌన్ మహామంత్రి హామాన్ ఆమెను గమనించాడు. ఆమెను బంధించి ఫిరౌన్ వద్దకు తీసుకువెళ్ళాడు. ఆమె చాలా భయపడింది. అయినా ధైర్యాన్ని కోల్పోకుండా నిబ్బరంగా వ్యవహరించింది. రాజభవనంలో ఏం చేస్తున్నావని గుచ్చి గుచ్చి ప్రశ్నించినా ఆమె ఒక్క మాట కూడా చెప్పలేదు.

ఈలోగా పసివాడైన మూసాకు పాలు త్రాగించడానికి ఆయాలను పిలవవలసిందిగా మహారాణి ఆజ్ఞాపించింది. చాలా మంది ఆయాలు వచ్చారు. కాని మూసా ఎవరి వద్ద కూడా పాలు తాగడం లేదు. మహారాణి నిరాశగా ఇంకా ఎవరైనా ఆయాలు ఉంటే పిలుచుకు రమ్మని సేవకులను పంపింది. మూసా అక్క కూడా ఆందోళనగా చూడసాగింది. పసివాడైన మూసా పాలు తాగి చాలా సేపయ్యింది. మహారాణి కూడా చాలా ఆందోళనగా ఆయాల కోసం సేవకులను పంపుతుండడాన్ని చూసిన ఆమె ధైర్యం చిక్కబట్టుకుని మహారాణితో నెమ్మదిగా, ఈ శిశువుకు పాలు తాగించగల మహిళ తనకు తెలుసని చెప్పింది. నీటిలో తేలియాడే బుట్టను అనుసరించి ఎందుకు వచ్చావని వాళ్ళు నిలదీశారు. ఆ బుట్టలో ఏముందో చూడాలన్న కుతూహలంతో వచ్చానని చెప్పిందామె. ఆమె చెప్పిన సమాధానం నమ్మశక్యంగానే వారికి కనబడింది. అయితే వెంటనే వెళ్ళి ఈ శిశువుకు పాలు పట్టగలిగిన ఆ మహిళ ఎవరో తీసుకురా... వెళ్ళు అని పంపించారు. ఇంటి వద్ద ఆమె తల్లి కూడా తీవ్రమైన దుఃఖంతో ఎదురు చూస్తోంది. పసివానికి ఏమయ్యిందో అన్న ఆందోళనతో ఎదురుచూస్తోంది. ఇంటికి తిరిగి వచ్చిన కూతురు తల్లికి తాను చూసిన విషయాలతో పాటు రాజభవనం నుంచి వచ్చిన ఆదేశాన్ని .. శుభవార్తను తల్లికి తెలిపింది. పిల్లవాడు క్షేమంగా ఉన్నాడు, పిల్లవానికి పాలుపట్టడానికి రాజభవనానికి రమ్మని తల్లికి ఆదేశం వచ్చింది. ఆమె తక్షణం పరుగు పరుగున రాజభవనానికి చేరుకున్నది.

ఎవరి పాలూ తాగని శిశువు ఈ మహిళ పాలుపట్టగానే తాగడం చూసి ఫిరౌన్ ఆశ్చర్యంగా ఎవరు నువ్వు? అని అడిగాడు. ఈ శిశువు ఎవరి పాలూ తాగలేదు, కాని నువ్వు పాలుపట్టగానే తాగుతున్నాడు! అంటూ నిలదీశాడు. ఆమె నిజం చెప్పినట్లయితే ఫిరౌన్‌కు ఆ పిల్లవాడు ఇస్రాయీల్ జాతి వాడని తెలిసేది, వెంటనే హతమార్చి ఉండేవాడు. కాని అల్లాహ్ ఆమెకు సమాధానం ఇచ్చే స్థయిర్యాన్ని ప్రసాదించాడు. ఆమె ఫిరౌన్‌కు జవాబిస్తూ, "దేవుని దయవల్ల నా

https://teluguislam.net



పాలు చాలా తీయగా ఉంటాయి. అందువల్ల ఏ శిశువైనా నా పాలు తాగుతాడు" అంది. ఈ జవాబు ఫిరౌన్‌కు సంతృప్తిని ఇచ్చింది. ఆ రోజు నుంచి ఆమెను మూసాకు పాలు పట్టే ఆయాగా రాజభవనంలో నియమించడం జరిగింది. ఆమె తన పిల్లవాడిని అక్కడ చాలా కాలం కనిపెట్టుకు ఉన్నది. పిల్లవాడు పెరిగి పెద్దయిన తర్వాత, పాలు తాగడం మానేసిన తర్వాత, అప్పుడప్పుడు వచ్చి పిల్ల వాడిని చూసి వెళ్ళే అనుమతి ఆమెకు లభించింది. రాజభవనంలో మూసా ఒక రాకుమారుని మాదిరిగా పెరిగారు.

## యాదృచ్ఛిక హత్య

అల్లాహ్ మూసా(అస)కు మంచి ఆరోగ్యం, శారీరక బలం, వివేకం, విజ్ఞానాలు ప్రసాదించాడు. బలహీనులు, అణగారిన వారు రక్షణ కోసం, న్యాయం కోసం ఆయన వద్దకు వచ్చేవారు. ఒకరోజు, రాజధాని నగరంలో ఇద్దరు పోట్లాడు కోవడాన్ని ఆయన చూశారు. ఒక ఈజిప్షు వ్యక్తి ఒక బనీ ఇస్రాయీల్ వ్యక్తిని కొడుతున్నాడు. మూసా(అస)ను చూసిన ఇస్రాయీల్ వ్యక్తి సహాయం కోసం వేడుకున్నాడు. మూసా(అస) ఈ తగాదాలో జోక్యం చేసుకున్నారు. మాటా మాటా పెరిగింది. పట్టరాని ఆగ్రహంతో మూసా(అస) ఆ ఈజిప్షు వ్యక్తిని బలంగా కొట్టారు. ఆ దెబ్బకు వాడు అక్కడికక్కడే మరణించాడు. తన వల్ల ఒక హత్య జరిగిందని, ఒక మనిషి తన వల్ల మరణించాడని గ్రహించిన మూసా(అస) చాలా బాధపడ్డారు. ఆయన అల్లాహ్ క్షమాభిక్ష వేడుకున్నారు. చంపాలన్న ఉద్దేశ్యం తనకు లేదని, యాదృచ్ఛికంగా హత్య జరిగిందని అల్లాహ్‌కు మొరపెట్టుకున్నారు. అల్లాహ్‌ను ఆయన్ను క్షమించాడు. మూసా(అస)కు మనసులో ఒక విధమైన సంతృప్తి వంటి భావం కలిగింది. ఆ పిదప మూసా (అస) ఇతరుల పట్ల అత్యంత సహనాన్ని చూపడం ప్రారంభించారు.

## పునరావృతం

మరుసటి రోజు అదే బనీ ఇస్రాయీల్ వ్యక్తి మరో వ్యక్తితో పోట్లాడుతూ కనబడ్డాడు. మూసా (అస) అతని వద్దకు వెళ్ళి, "నువ్వు చాలా తంపులమారిలా ఉన్నావే. ప్రతిరోజు ఎవరో ఒకరితో పోట్లాడుతుంటావా?" అన్నారు. మూసా(అస) తనను కూడా కొడతారేమో అని బనీ ఇస్రాయీల్ వ్యక్తి భయపడ్డాడు. భయంతో గట్టిగా అరుస్తూ, "మూసా! నిన్న వాడిని చంపినట్లు నేడు నన్ను కూడా చంపే స్తావా?" అన్నాడు. వాడితో పోట్లాడుతున్న ఈజిప్షు వ్యక్తి ఈ మాట విన్నాడు. వెంటనే



మూసా (అస) గురించి రాజాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత మూసా (అస) దగ్గరికి ఒక వ్యక్తి పరుగున వచ్చి, "మూసా! అధికారులు నీపై ఫిర్యాదును స్వీకరించారు. నీ కోసం వెతుతున్నారు. నీపై విచారణ జరగొచ్చు, వాళ్ళు నిన్ను చంపవచ్చు, నువ్వు పారిపో" అని సలహా ఇచ్చాడు. ఒక ఈజిప్షువాడిని చంపితే మరణశిక్ష పడుతుందని, చట్టం ఆ విధంగా ఉందని మూసా(అస)కు తెలుసు.

## పలాయనం

రాత్రి చీకటిలో మూసా (అస) నగరాన్ని విడిచి వెళ్ళిపోయారు. "అల్లాహ్! నన్ను ఈ దుర్మార్గుల నుంచి కాపాడు" అని ఆయన అల్లాహ్‌ను ప్రార్థిస్తూ నగరం దాటారు. మద్‌యన్ దిశగా పయనించారు. సిరియా, ఈజిప్షులకు మధ్యన ఉన్న జనావాస ప్రాంతం అది. వేడి గాడ్పుల ఆ ఎడారి దారిలో ఆయన ఒంటరిగా, కేవలం అల్లాహ్ తోడుగా ప్రయాణించారు. ఆయన (అస) వెంట ఉన్న సామగ్రి దైవభీతి మాత్రమే. దారిలో ఆకలి తీర్చుకోవడానికి గడ్డిపరక కూడా లభించలేదు. వేడి ఇసుక ఆయన కాళ్ళను కాల్చసాగింది. కాని ఫిర్‌ఔన్ సైన్యం తనను వెంటాడు తుందన్న ఆందోళన వల్ల ఆయన ప్రయాణం ఆపలేదు. ఆ విధంగా ఆయన (అస)ఎనిమిది రాత్రులు ప్రయాణించారు. పగటి పూట ఎక్కడయినా దాక్కుని గడిపేవారు. ఆ విధంగా ప్రధాన ఎడారి భాగాన్ని దాటిన తర్వాత ఆయన (అస) ఒక బావి వద్దకు చేరుకున్నారు. అది మద్‌యన్ శివార్లలో ఉన్న బావి. అక్కడ గొర్రెల కాపరులు తమ గొర్రెలకు నీళ్ళు పడుతున్నారు.

ఆయన అక్కడ కూర్చున్నారు. నీళ్ళు తాగడానికి తన వంతు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. అక్కడ ఇద్దరు యువతులు తమ గొర్రెలకు నీళ్ళు తాపడానికి వచ్చి, సంకోచిస్తూ నిలబడడాన్ని ఆయన గమనించారు. ఆయనలో ఆసక్తి కలిగింది. వారి వద్దకు వెళ్ళి వారి సమస్య ఏమిటో అడిగారు. వారు జవాబిస్తూ... అక్కడ ఉన్న గొర్రెల కాపరులు మొరటువాళ్ళని, తాము ఆడవాళ్ళయినందువల్ల తమ గొర్రెలకు నీళ్ళు పట్టడానికి అవకాశం దొరకడం లేదని, తమ తండ్రి చాలా ముసలి వారని, అందువల్ల గొర్రెలకు తామే నీళ్ళు పట్టి తీసుకువెళ్ళవలసి ఉందని తెలిపారు. మూసా (అస) వారి గొర్రెలను తీసు కుని నీళ్ళు పట్టడానికి బావి వద్దకు వచ్చారు. పొడవుగా, బలిష్ఠంగా ఉన్న మూసాను చూసి ఆ గొర్రెల కాపరులు దారి విడిచారు. ఆయన (అస) గొర్రెలకు

https://teluguislam.net



నీళ్ళు పట్టి, నీటి సంచులు నింపి, తాను కూడా కడుపారా నీళ్ళు తాగారు. ఆ పిదప బావి దగ్గర నీడలో సేదదీర్చుకుంటూ కూర్చున్నారు. దేవుని సహాయం కోసం, మార్గదర్శకత్వం కోసం ప్రార్థించసాగారు. ఆ యువతులు అక్కడి నుంచి వెళ్ళే ముందు ఆయన వద్దకు వచ్చి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## మూసా (అస)కు స్వాగతం

ఆ యువతులు ప్రతిరోజు కన్నా కాస్త ముందుగానే ఇంటికి చేరుకున్నారు. త్వరగా ఇంటికి చేరుకున్న వారిని చూసి వారి తండ్రి ఆశ్చర్యపోయారు. వారు తండ్రికి, జరిగిన వృత్తాంతం వివరించి మూసా (అస) వల్ల తాము త్వరగా ఇంటికి రావడం సాధ్యమైందని చెప్పారు. ఆ అపరిచితుడిని (మూసాను) ఇంటికి పిలుచుకు రావలసిందిగా తండ్రి ఇద్దరిలో ఒక అమ్మాయిని పంపించాడు. ఆ అమ్మాయి సిగ్గుపడుతూ మూసా (అస) వద్దకు వెళ్ళి తన తండ్రి పంపిన సందేశాన్ని వినిపించింది. "మీరు చేసిన సహాయానికి మా నాన్నగారు చాలా కృతజ్ఞతలు తెలిపారు. మీకు స్వయంగా కృతజ్ఞతలు తెలుపడానికి ఆయన మిమ్మల్ని ఇంటికి రమ్మంటున్నారు" అని చెప్పింది. మూసా (అస) ఈ ఆహ్వానాన్ని మన్నించారు. ఆ అమ్మాయి వెంట వారి ఇంటికి వెళ్ళారు. వారు సౌకర్యవంతంగా, సంతోషంగా జీవిస్తున్న కుటుంబంగా ఆయన గుర్తించారు. ఆ వృద్ధునికి తన్ను తాను పరిచయం చేసుకున్నారు. తనపై వచ్చిన ఆపద గురించి చెప్పారు. ఈజిప్టు వదలి ఎందుకు రావలసి వచ్చిందో కూడా తెలియజేశారు. వృద్ధుడు ఆయనకు ఊరట నిస్తూ, భయపడవద్దని, దుర్మార్గుల నుంచి తప్పించుకుని వచ్చేసినట్టేనని అన్నాడు.

## మూసా (అస) వివాహం

మూసా (అస) సచ్ఛీలాన్ని, ఆయన సద్వర్తనలను ఆ వృద్ధుడు, అతని కుమార్తెలు గమనించారు. మూసా(అస)ను తన ఇంటనే ఉండవలసిందిగా ఆ వృద్ధుడు ఆహ్వానించాడు. మూసా (అస) అంగీకరించారు. ఆ కుటుంబ సభ్యులు దేవునికి భయపడే సద్వర్తనులు. మూసా (అస)ను పనిలో పెట్టుకుంటే బాగుంటుందని వృద్ధుని కుమార్తెలలో ఒక అమ్మాయి సూచించింది. మూసా (అస) బలిష్టంగా ఉన్న యువకుడు, నమ్మకస్తుడు. కాబట్టి పనిలో పెట్టుకోవడం మంచిదని సలహా ఇచ్చింది. ఆయన వంటి యువకుడి అవసరం వారికి ఉంది. ముఖ్యంగా బావి వద్ద, మొరటు జనం గుమిగూడే ప్రాంతాల్లో అలాంటి యువ



కుని అవసరం ఎంతయినా ఉంది. అయితే మూసా (అస)నమ్మకస్తుడని స్వల్పకాలంలో చెప్పడం ఎలా సాధ్యమని తండ్రి ఆ అమ్మాయిని ప్రశ్నించాడు. ఆ అమ్మాయి జవాబిస్తూ, "నేను తనను ఇంటికి రమ్మని ఆహ్వానించినపుడు, అతను నన్ను తన వెనక నడువమన్నాడు, ఆ విధంగా నేను ముందు నడువడం, నాపై తన దృష్టి పడడం జరక్కుండా (ఏ విధమైన వికారాలకు అవకాశం లేకుండా) జాగ్రత్త పడ్డాడు" అని చెప్పింది. ఈ మాటలు విని వృద్ధునికి నమ్మకం కలిగింది. వృద్ధుడు మూసా (అస) వద్దకు వచ్చి, "నా యిద్దరు కుమార్తెలలో ఒకమ్మాయిని నీకు ఇచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నాను, కాని ఒక షరతు, నువ్వు ఎనిమిది సంవత్సరాలు నా వద్ద పని చేయడానికి ఒప్పందం కుదుర్చుకోవాలి" అన్నాడు. (ఆ కాలంలో యువకులు కష్టపడి పని చేసి పెళ్ళికి అర్హులుగా నిరూపించుకో వలసి ఉండేది). ఈ ప్రతిపాదన మూసా(అస)కు కూడా నచ్చింది. కొత్త దేశంలో అపరిచితునిగా వచ్చిన తనకు ఆశ్రయం, ఉపాధి ఎలాగూ అవసరమే. మూసా(అస) ఆ ఇద్దరు అమ్మాయిలలో ఒకమ్మాయిని వివాహం చేసుకుని వృద్ధుని పశువుల సంరక్షణ చూడసాగారు. ఆ విధంగా తన ఒప్పందంకన్నా రెండేళ్ళు ఎక్కువగా పదేళ్ళపాటు అక్కడ పనిచేశారు.

## తన ప్రజల గురించి ఆందోళన

మూసా(అస) ఎలాంటి సమస్య లేని జీవితం గడుపుతున్నప్పటికీ ప్రశాం తంగా ఉండలేకపోయారు. ఆయనకు ఎల్లప్పుడు తాను వదలివచ్చిన ప్రజల సమస్యలు, కష్టాలే గుర్తుకు వచ్చేవి. శిక్ష గురించిన భయం వెంటాడుతున్నప్పటికీ ఆయన (అస) తన కుటుంబాన్ని తీసుకుని ఈజిప్టుకు బయలుదేరారు. తన్ను అల్లాహ్ కాపాడుతాడనే నమ్మకంతో ఆయన ప్రయాణమయ్యారు. ఆయనకు వ్యక్తిగత స్వార్థాలు ఏవీ లేవు, ఆయన (అస) కోరేది బానిసత్వంలో మగ్గుతున్న తన ప్రజలను రక్షించడం.

## పిలుపు

వారు ఎడారిలో చాలా దూరం ప్రయాణించి సినాయ్ పర్వతం వద్దకు చేరు కున్నారు. తాము దారి తప్పినట్లు మూసా(అస)కు అక్కడికి వచ్చిన తర్వాత అర్థ మయ్యింది. ఆయన అల్లాహ్‌ను మార్గదర్శనం కోసం ప్రార్థించారు. ఆయన (అస)కు దైవికంగా మార్గం కనిపించింది. ఆయన (అస) ఒక రాత్రి తూర్ పర్వతం

https://teluguislam.net



వద్దకు చేరుకున్నారు. మూసా(అస)కు అక్కడ దూరంగా మంట కనిపించింది. ఆయన తన ఇంటివారితో, "ఇక్కడే ఉండండి, దూరంగా మంట కనిపిస్తోంది. అక్కడి నుంచి మండే కట్టె ఏదైనా తీసుకువస్తాను. ఇక్కడ చలిలో కాస్త మనకు వేడి దొరుకుతుంది. ఇక్కడి నుంచి ముందుకు వెళ్ళే దారి కూడా తెలుస్తుంది" అన్నారు. ఆయన ఆ మంట దగ్గరకు వెళ్ళినప్పుడు ఆయనకు గంభీరమైన స్వరం వినిపించింది. ఆ స్వరం ఆయన్ను పిలిచింది.

*"ఓ మూసా! నేను అల్లాహ్‌ను, విశ్వానికి ప్రభువును."*

ఈ స్వరాన్ని విని మూసా (అస)దిగ్భ్రాంతి చెందారు. నలుదిసెలా చూశారు. "నీ కుడి చేతిలో ఏముంది మూసా?!" అని మరలా ఆయనకు ఆ విచిత్రమైన స్వరం వినిపించింది. మూసా (అస) వణుకుతున్న గొంతుతో , "ఇది నా చేతికర్ర. నేను దీనికి ఆనుకుని నిలబడతాను, దీనితో గొర్రెలకు చెట్ల ఆకులు రాల్చుతాను.. ఇంకా ఇలాగే ఇంకొన్ని విధాలుగా పనికివస్తుంది" అన్నారు. (మూసా దృష్టిని మరల్చడానికి, ఆయనలో ఆందోళనను తగ్గించి జరుగబోయే మహత్యాలకు తగిన విధంగా సిద్ధం చేయడానికి ఈ ప్రశ్న అడుగడం జరిగింది. ఒక ప్రవక్తగా మూసా(అస) ఉద్యమానికి ప్రారంభం ఇది.)

ఆ స్వరం మూసా(అస)ను ఆదేశిస్తూ, "చేతికర్ర క్రిందికి విసిరేయ్" అంది. మూసా (అస) ఆ విధంగా చేయగానే అది వంకర్లు తిరుగుతూ ప్రాకే పాముగా మారిపోయింది. మూసా (అస) భయంతో పారిపోబోయారు. కాని ఆ స్వరం ఆయన్ను నిలువరించింది. "భయపడకు... దానిని పట్టుకో.. దాన్ని ఎప్పటి మాదిరిగా మేము మార్చేస్తాము" అని వినిపించింది. ఆ పాము మళ్ళీ చేతికర్రగా మారిపోయింది. మూసా(అస)లో ఆందోళన తగ్గుముఖం పట్టింది. సత్యాన్ని కనుగొన్న ఎరుక ఆయనలో ప్రశాంతతను కలుగజేసింది. ఆ పిదప అల్లాహ్ ఆయన్ను (అస)ఆదేశిస్తూ చేతిని చంకలో పెట్టుకుని గట్టిగా నొక్కమని ఆదేశించాడు. అలా చేసి చేతిని బయటకు లాగగానే ఆ చేయి మిరుమిట్లు గొలిపే కాంతితో ప్రకాశించింది. అల్లాహ్ ఆ తర్వాత ఆయన్ను ఆదేశిస్తూ, "ఇప్పుడు నీకు దేవుని రెండు చిహ్నాలు ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ఫిరౌన్ వద్దకు, అతని సర్దారుల వద్దకు వెళ్ళు. వాళ్ళు పరమ దుర్మార్గులు. అన్ని హద్దులను అతిక్రమించారు వాళ్ళు" అన్నాడు. కాని మూసా (అస)కు ఫిరౌను తనను నిర్బంధిస్తాడన్న



భయం ఉంది. ఆయన (అస) అల్లాహ్‌తో, "ప్రభూ! నేను వారి వ్యక్తిని ఒకడిని హత్య చేశాను. వాళ్ళు నన్ను హతమార్చవచ్చని భయపడుతున్నాను" అన్నారు. ఎలాంటి ప్రమాదం జరగదని అల్లాహ్ ఆయనకు హామీ ఇచ్చాడు. ఆయన భయాన్ని దూరం చేశాడు. మూసా (అస) మళ్ళీ దేవునితో, "ప్రభూ! ప్రవక్త బాధ్యతలు నిర్వర్తించడానికిగాను నా మనసును విశాలంగా చేయి.. నా మార్గంలో కష్టాలను తొలగించి నా కర్తవ్యాన్ని సునాయాసంగా మార్చు... నా నాలుక ముడు లను వదులు చేయి, తద్వారా నా మాటలు వాళ్ళకు అర్థమయ్యేలా చెప్పగలను. నా మాటలు వారి మనసులో నాటుకునేలా చెప్పగలను. నా పనిలో నాకు సహాయకునిగా ఒకరిని ప్రసాదించు.. నా జాతికి చెందిన వాడిని, నా సోదరుడు హారూన్‌ను నాకు సహాయకునిగా ప్రసాదించు" అని వేడుకున్నారు. అల్లాహ్ ఆయన విజ్ఞప్తిని మన్నించాడు. అప్పటికి ఈజిప్టులో ఉన్న హారూన్‌కు దైవికంగా సమాచారం అందడంతో ఆయన సినాయ్ వద్దకు వచ్చి మూసా(అస) ను కలుసుకున్నారు. అల్లాహ్ వారిద్దరినీ ఉద్దేశించి, "మూసా! నీవు, నీ సోదరుడు ముందుకు సాగండి. నా సూచనలు తీసుకుని వెళ్ళండి. ఫిరౌన్‌కు, అతడి ప్రజలకు నా సందేశాన్ని నెమ్మదిగా వినిపించండి. దేవుని సందేశహరులుగా వచ్చామని, బనీ ఇస్రాయీల్ ప్రజలను బానిసత్వం నుంచి, అణచివేతల నుంచి విడుదల చేయమన్న దేవుని సందేశం తీసుకువచ్చామని చెప్పండి" అన్నాడు.

## విమోచకునిగా తిరిగి వచ్చిన మూసా (అస)

మూసా(అస), హారూన్‌లు కలసి ఈజిప్టుకు వచ్చారు. వారిద్దరు ఫిరౌన్ వద్దకు వెళ్ళి దేవుని సందేశాన్ని అందజేశారు. "నిజంగా మేము అల్లాహ్ తరఫున నీ వద్దకు వచ్చిన సందేశహరులం. ఆయన వద్ద నుంచి సూచనలను తీసుకుని నీ వద్దకు వచ్చాము. ఇస్రాయీల్ ప్రజలను క్రూరంగా వేధించడం మానేయ్. మా ప్రజలను విడిచిపెట్టు... వారిని మేము అల్లాహ్ వాగ్దానం చేసిన ప్రాంతానికి తీసుకుని పోతాము" అన్నారు. ఫిరౌన్ కోపంతో మండిపడ్డాడు. "మూసా! నిన్ను బాల్యం నుంచి మేము పెంచి పెద్దచేయలేదా? నీ జీవితంలో చాలా సంవత్సరాలు నీవు మా వద్ద గడపలేదా? నీవు నా జాతి ప్రజలలో ఒకరిని చంపావు. ఇప్పుడు నీ జాతి ప్రజలను తీసుకుపోవడానికి వచ్చావు. నీవు కృతఘ్నుడివి" అన్నాడు. మూసా (అస) ఈ మాటలకు జవాబిస్తూ, "నేను ఆ పని పొరబాటున చేశాను. నేను నీకు భయపడి పారిపోయాను. అల్లాహ్ నన్ను క్షమించాడు.

https://teluguislam.net



అల్లాహ్ నన్ను కాపాడాడు. నాకు వివేకాన్ని ప్రసాదించాడు. నీ వద్దకు నన్ను సందేశహరునిగా పంపాడు. నీ భూ భాగంలో నా ప్రజలను నీవు బానిసలుగా చేశావు. నిస్సందేహంగా అల్లాహ్ నిన్ను శిక్షిస్తాడు. కాబట్టి, నీవు చేసిన అపరాధాలకుగాను అల్లాహ్‌తో క్షమాపణ వేడుకో, నా ప్రజలను నాతో పంపించు. వారికి అల్లాహ్ ఒక కొత్త భూభాగాన్ని ఇచ్చే వాగ్దానం చేశాడు" అన్నారు. ఫిరౌన్ మరింత కోపంగా, "మీ యిద్దరికి ప్రభువని చెబుతున్న ఈ అల్లాహ్ ఎవరు? నేను తప్ప మీకు మరో దేవుడులేడు" అన్నాడు గర్వంగా. మూసా (అస) జవాబిస్తూ, "అల్లాహ్ మాకు, నీకు ప్రభువు. తూర్పు పడమరలకు, వాటి మధ్య ఉన్న సమస్తానికి ఆయనే ప్రభువు" అన్నారు.

మూసా(అస)ను బెదిరిస్తూ ఫిరౌన్,"నేను తప్ప మరో దేవుడున్నాడని చెబితే నిన్ను జైల్లో పారేస్తాను" అన్నాడు. కాని మూసా (అస) లక్ష్యపెట్టలేదు. "నీ సందేహాలను తొలగించే మహత్యాన్ని నేను నీకు చూపించిన తర్వాత కూడా నీవు ఈ విధంగా బెదిరింపులకు దిగుతావా?" అన్నారు. ఫిరౌన్ జవాబిస్తూ, "మూసా! నువ్వు అబద్ధాలరాయుడివి. నువ్వు చెప్పేది నిజమైతే, నీ ప్రభువు నుంచి నువ్వేదయినా సూచన తీసుకుని వస్తే దాన్ని చూపించు" అన్నాడు.

## మాంత్రికుల పోటీ

ఆ కాలంలో ఈజిప్టులో చాలా మంది మంత్రగాళ్ళు ఉండేవారు. ఒక గొప్ప కళ స్థాయికి మంత్రతంత్రాలను అభివృద్ధి చేసి అనేక గమ్మత్తులు ప్రదర్శించేవారు. మూసా (అస) తన మొదటి సూచనను ప్రదర్శించారు. ఆయన తన చేతికర్రను విసరగానే అది దేవుని ఆజ్ఞతో ఒక పాముగా మారిపోయింది. ఇది చూసి రాజు ఆశ్చర్యపోయాడు, అయినా తన అహాన్ని వదలలేదు. మూసా (అస) ప్రదర్శించగలిగినది ఒకే ఒక్క మాయాజాలం అనుకున్నాడు. "నువ్వు నాకింకేం చూపించాలను కుంటున్నావ్" అన్నాడు. మూసా (అస) తన చేతిని చంకలో ఉంచి తీయగానే అది మిరుమిట్లుగొలుపుతూ ప్రకాశించింది. రాజు దిగ్భ్రాంతికి గురయ్యాడు. తన అధికారానికి ప్రమాదం ముంచుకొచ్చేలా ఉందని భయపడ్డాడు. తన సర్దారులు, సలహాదారులతో సంప్రదించాడు. "వీళ్ళిద్దరు పెద్ద మంత్రగాళ్ళు. మన ఘనమైన సంప్రదాయాలను నాశనం చేసి, తమ మంత్ర తంత్రాలతో ఈ దేశం నుంచి వెళ్ళగొట్టగలరు. ఇప్పుడు ఏం చేయాలో సలహా ఇవ్వండి" అని



అడిగాడు. వాళ్ళు ఫిరౌన్‌కు సలహా ఇస్తూ, మూసా(అస)ను, ఆయన సోదరుడిని ఇద్దరినీ జైల్లో ఉంచాలని, ఈలోగా దేశంలో ఉన్న పెద్ద పెద్ద మంత్రగాళ్ళందరిని పిలుస్తామని, వాళ్ళు వచ్చి తమ మంత్రాలను ప్రదర్శించి కర్రలను పాములుగా మార్చడం చేస్తారని, ఆ విధంగా ప్రజలపై మూసా (అస) ప్రభావాన్ని తగ్గించగలమని చెప్పారు. ఫిరౌన్ వారి మాటల ప్రకారం మూసా, హారూన్‌లను జైల్లో వేయించాడు. దేశ వ్యాప్తంగా చాటింపులు వేయించి పెద్ద పెద్ద మంత్రగాళ్ళను పిలిపించాడు. గెలుపొందిన మంత్రగాడికి ఘనమైన కానుకలతో పాటు రాజదర్బారులో స్థానం కూడా ఇస్తామని చెప్పాడు.

## పోటీ

ఈజిప్టు సామ్రాజ్యంలోని ప్రజలందరూ పాల్గొనే ఒక పండుగ సందర్భంగా ఫిరౌన్ తన మంత్రగాళ్ళకు, మూసా(అస)కు మధ్య పోటీ ఏర్పాటు చేశాడు. ప్రజలు ఎన్నడూ లేనంత పెద్ద సంఖ్యలో ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. ఫిరౌన్ తరఫున దేశంలోని పెద్ద పెద్ద మంత్రగాళ్ళ గుంపుకు, దైవప్రవక్తగా చెప్పుకుంటున్న ఒకే ఒక్క వ్యక్తికి మధ్య జరుగుతున్న పోటీ గురించి ప్రజల్లో అప్పటికే ప్రచారం జరిగింది. ఒకప్పుడు నైలు నదిలో కొట్టుకువచ్చిన శిశువు ఫిరౌన్ ప్రాసాదంలో ప్రవేశించి, రాజకుమారుని మాదిరిగా పెరగడం గురించి కూడా వాళ్ళు విని ఉన్నారు. కాని ఆ రాజకుమారుడు ఒక ఈజిప్టు వ్యక్తిని ఒకే ముష్ఠిఘాతానికి హతమార్చి దేశం వదలి పారిపోయాడని కూడా వాళ్ళు విని ఉన్నారు. ఈ పోటీ చూడడానికి అందరూ చాలా ఆత్రంగా వచ్చారు. పోటీ మొదలు కాకముందు మూసా (అస)లేచి నిలబడ్డారు. గుమిగూడిన ప్రజల్లో గుసగుసలు మొదలయ్యాయి. మూసా (అస) అక్కడికి వచ్చిన మంత్రగాళ్ళను ఉద్దేశించి, "అల్లాహ్ సూచనలను మాయాజాలంగా వర్ణించి అల్లాహ్ గురించి మీరు అసత్యాలు పలికితే, అల్లాహ్‌ను విశ్వసించకపోతే మీకు వినాశం తప్పదు. సత్యానికి - అసత్యానికి మధ్య గల భేదాన్ని తెలుసుకోండి. లేకపోతే మీరు నాశనమవుతారు. అల్లాహ్ మిమ్మల్ని శిక్షిస్తాడు" అని బోధించారు.

మూసా (అస) నిజాయితీగా మాట్లాడిన మాటలు మంత్రగాళ్ళలో పునరాలోచనను రేకెత్తించాయి. కాని ఫిరౌన్ ఇస్తానన్న సంపద, పేరు ప్రతిష్ఠల ప్రలోభం వారిని ముంచెత్తింది. తమ మాయాజాలంతో ప్రజలను ఆకట్టుకోవాలను

కున్నారు. ఆ విధంగా మూసా(అస)ను ఒక మోసగానిగా నిరూపించాలను కున్నారు.

మూసా (అస) వారిని ఉద్దేశించి, "మీరే ముందు ప్రారంభించండ"న్నారు. వారు తమ మంత్రదండాలను నేలపై విసిరారు. మరుక్షణం ఆ కర్రలు, తాళ్ళు పాములుగా మారి బుసలు కొట్టడం ప్రారంభించాయి. ప్రజలు నిర్ఘాంతపోయి చూడసాగారు. ఫిరౌన్, అతడి అనుచరులు సంతోషంగా చప్పట్లు కొట్టారు. మూసా (అస) భయపడ్డారు. కాని ఆ తర్వాత భయపడకుండా కర్రను విసరమని అల్లాహ్ ఆయనకు ధైర్యాన్నిచ్చాడు. మూసా(అస) తన చేతికర్రను విసిరారు. అది ఒక పెద్ద కొండచిలువగా మారింది. ప్రజలు భయంతో లేచి నిలబడ్డారు. ఏం జరుగుతుందో అని మెడలు నిక్కించి చూడసాగారు. ఫిరౌన్, అతడి అనుచరులు నిశ్శబ్దంగా చూడసాగారు. ఆ పాములన్నింటిని కొండచిలువ ఒకదాని తర్వాత ఒకటిగా అన్నింటిని మింగేసింది. మూసా (అస) క్రిందకి వంగి దాన్ని పట్టు కున్నారు. ఆ వెంటనే అది చేతికర్రగా మారి పోయింది. ప్రజలు ఒక మహా కెరటంగా లేచి కేరింతలు కొట్టారు. ఇలాంటి వింతను వారు గతంలో ఎన్నడూ చూడలేదు. మూసా (అస) ప్రదర్శించిన ఈ మహత్యాన్ని చూడగానే మంత్రగాళ్ళు తక్షణం అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడ్డారు. "మేము మూసా, హారూన్‌ల దేవుడిని విశ్వసిస్తున్నాము" అన్నారు. ఈ పరిణామం చూసి ఫిరౌన్ ఉగ్రుడై పోయాడు. మూసా(అస)ను దెబ్బతీయడానికి మరో కుట్ర ఆలోచించాడు. మంత్రగాళ్ళకు, మూసా(అస)కు మధ్య మరో పోటి రహస్య స్థలంలో జరుపుతా మని ప్రకటించాడు. తన పథకానికి ఒప్పుకోవాలని మంత్రగాళ్ళపై ఒత్తిడి తెచ్చాడు. కాని సత్యాన్ని గుర్తించిన మంత్రగాళ్ళు అంగీకరించలేదు. వారిని హత మార్చుతానని ఫిరౌన్ బెదిరించినా వాళ్ళు మాత్రం అల్లాహ్ పట్ల తిరస్కారానికి పాల్పడేది లేదని నిక్కచ్చిగా చెప్పారు.

## దౌర్జన్యకాండ

ఫిరౌన్ తన క్రూరత్వాన్ని నిర్లజ్జగా ప్రదర్శించాడు. మంత్రగాళ్ళ కాళ్ళు చేతులు నరికిస్తానని బెదిరించాడు. ఖర్జూర చెట్లకు శిలువ వేయిస్తానని అన్నాడు. ఫిరౌన్ దుర్మార్గాలకు అతడి అనుచరులు వంతపాడసాగారు. తమ అధికారాన్ని, తమ దేవుళ్ళను సవాలు చేసి దేశంలో ఎలాంటి అలజడి లేపకుండా మూసా (అస)ను, ఆయన అనుచరుల్ని అడ్డుకోవాలని ఫిర్‌ఔన్ మీద ఒత్తిడి తెచ్చారు.

https://teluguislam.net



ఫిరౌన్ ఆగ్రహంతో, "మనం అధికారంలో ఉన్నాం.. మనం వారి మగసంతానాన్ని హతమార్చుదాం.. ఆడవారిని విడిచిపెడదాం" అన్నాడు. తన ఆగ్రహాన్ని బనీ ఇస్రాయీల్ ప్రజలపై ప్రదర్శిస్తూ వారిని ఊచకోతలకు గురి చేసి బీభత్సాన్ని సృష్టించాడు.

## పలాయనం

ఫిరౌన్ దౌర్జన్యాలు భరించలేని ఇస్రాయీల్ ప్రజలు మూసా (అస) వద్దకు వచ్చి, "మూసా(అస)! నీవు రాక ముందు కూడా మేము దౌర్జన్యాలను భరించాం.. కాని ఇప్పుడు మాపై దౌర్జన్యాలు అనేక రెట్లు పెరిగిపోయాయి" అన్నారు. మూసా(అస) వారిని ఓదార్చుతూ, "అల్లాహ్ సహాయం కోసం ప్రార్థించండి.. సహనం వహించండి. ఈ భూమి అల్లాహ్‌కు చెందినది. ఆయన తాను కోరిన వారికి ఇక్కడ వారసత్వాన్ని ప్రసాదిస్తాడు. అల్లాహ్ పట్ల తమ విధులను నిర్వర్తిం చిన వారికి మంచి జరుగుతుంది" అన్నారు. ఈలోగా ఫిరౌన్ కుట్రలు చేస్తూ మూసా(అస)ను హతమార్చడానికి పథకం వేశాడు. ఈ విషయం మూసా (అస)కు తెలిసింది. ఆయన వెంటనే ఫిరౌన్‌కు ఒక సందేశం పంపించారు. "తీర్పుదినాన్ని విశ్వసించని ప్రతి దుర్మార్గుని నుంచి నేను నా ప్రభువు శరణు కోరుకుంటున్నాను" అని ఆ సందేశంలో తెలిపారు.

ఫిరౌన్, అతని అనుచరులు, సలహాదారులు కలసివున్న ఒక సమావేశంలో రాజకుటుంబానికి చెందిన ఒక వ్యక్తి లేచి, " 'నా ప్రభువు అల్లాహ్' అని ప్రకటించి నందుకు ఆ వ్యక్తిని చంపుతారా? అతను తాను చెబుతున్నది సత్యమని నిరూ పించే స్పష్టమైన రుజువులు కూడా తీసుకువచ్చాడు. ఆయన చెబుతున్నది నిజమే అయితే ఆయన హెచ్చరిస్తున్న శిక్ష మనపై వచ్చిపడుతుంది. పాతకాలానికి చెందిన ఆద్, సమూద్ జాతుల మాదిరి గతి మనకు కూడా పట్టవచ్చని నేను భయపడు తున్నాను" అన్నాడు. ఈ సలహాను స్వీకరించే బదులు అక్కడి వారందరూ అతడిని అవమానించారు. ఆ వ్యక్తి వారికి జవాబిస్తూ "ప్రజలారా! నేను సాఫల్యం వైపునకు పిలుస్తున్నాను. కాని మీరు అగ్ని వైపునకు ఆహ్వానిస్తున్నారు. నా ప్రభువును నేను విశ్వసించడం మీకు ఇష్టంలేదు. మీరు దేవునికి భాగస్వాములను కల్పించమని కోరుతున్నారు. నేను మిమ్మల్ని సర్వశక్తిమంతుడైన, అపార కృపాశీలుడైన దేవుని వైపునకు పిలుస్తున్నాను. ఆయన వైపునకే మనం మరలిపోవలసి ఉంది. ఆయనే తన దాసులను కాపాడేవాడు" అని చెప్పాడు. ఈ మాటలు విని ఫిరౌన్, అతడి

https://teluguislam.net



అనుచరులు మండిపడ్డారు. ఆ వ్యక్తిని తీవ్రంగా బెదిరించారు. కాని ఆ వ్యక్తి తన అభిప్రాయాలు మార్చుకోవడానికి ఒప్పుకోలేదు. వాళ్ళు అతడిని ప్రలోభపెట్టడానికి ప్రయత్నించారు. కాని ఆ వ్యక్తి నిక్కచ్చిగా, "మీరు మీ వినాశాన్ని కొనితెచ్చుకుంటున్నారు" అన్నాడు. ఫిరౌన్ ఉగ్రుడై ఆ వ్యక్తిని చంపేస్తానని బెదిరించాడు. అల్లాహ్ ఆ విశ్వాసిని రక్షించాడు. బనీ ఇస్రాయీల్ ప్రజలను బానిసత్వం నుంచి విడుదల చేయాలని మూసా (అస) పట్టుబట్టారు. ఫిరౌన్ ఒక బహిరంగ సభ ఏర్పాటు చేసి బనీఇస్రాయీల్‌తో సహా ప్రజలందరినీ అక్కడకు పిలిచాడు. ప్రజలందరికీ తానే ప్రభువుననీ, వారి అవసరాలన్నీ తీర్చేది తానేనని, మూసా(అస) వద్ద ఎలాంటి బంగారు ఆభరణాలు లేవని, ఆయన వెనుక ఎలాంటి దైవదూతలు లేరని, ఆయన ఒక నిరుపేద మాత్రమేనని ప్రకటించాడు.

చాలా కాలంగా అణచివేతలకు గురయి ఉన్న ఆ ప్రజలు తమ స్వంత ఆలోచనలను కూడా కోల్పోయిన దశలో ఉన్నారు. తాము కళ్ళతో చూసిన విషయాలను ఆధారంగా చేసుకుని మాత్రమే నిర్ణయాలు తీసుకునే స్థితిలో ఉన్నారు. తమ రాజుగారు చాలా సంపన్నుడు, తమకు అవసరమైన వాటన్నింటినీ ఇచ్చే స్థితిలో ఉన్నాడు. కనుక అజ్ఞానంతో వాళ్ళు ఫిరౌన్‌కు విధేయత చూపి మూసా(అస)ను నిర్లక్ష్యం చేశారు.

## శిక్షలు

బనీఇస్రాయీల్‌పై దౌర్జన్యాలకు పాల్పడినందుకు, అల్లాహ్ పట్ల అవిశ్వాసానికి పాల్పడినందుకు ఈ ప్రపంచంలోనే శిక్ష అనుభవించవలసి ఉంటుందని ఫిరౌన్‌ను హెచ్చరించవలసిందిగా అల్లాహ్ మూసా(అస)ను ఆదేశించాడు. అల్లాహ్ విధించే శిక్షకు ముందస్తు సూచనగా నైలు నది ఒడ్డున ఉన్న భూములను తడిపే కాలువలు రాలేదు. ప్రతి ఏటా భూములను తడుపుతూ ఉండే కాలువలు రానందున ఆ సంవత్సరం పంటలు ఎండిపోయాయి. దేశంలో కరవు నెలకొంది. అయినా ఫిరౌన్ తన అహంకారాన్ని వదలలేదు. ఆ పిదప అల్లాహ్ భయానకమైన వరదలు వచ్చేలా చేశాడు. ఆ వరదలు తీవ్రమైన వినాశాన్ని సృష్టించాయి. ఆ పిదప అల్లాహ్ గొప్ప మిడతల దండును పంపాడు. మిగిలిన కొద్దోగొప్పో పంటలను కూడా మిడతలు తినేసాయి. ఆ పిదప గుంపులు గుంపులుగా కప్పలు వారిపైకి వచ్చి పడ్డాయి. చివరిగా వారిపైకి వ్యాధులు వచ్చిపడ్డాయి. ఫలితంగా వారి శరీరాలు రక్తం ఓడసాగాయి. ఈ పరిణామం వారిని భయభీతులకు



గురిచేసింది. బెంబేలెత్తి వారు మూసా (అస) వద్దకు పరుగెత్తుకు వచ్చారు. "నీ ప్రభువుకు నీతో ఒప్పందం ఉంది కాబట్టి మా కోసం నువ్వు ఆయన్ను ప్రార్థించు. ఈ బాధలను తొలిగేలా చేస్తే మేము బనీఇస్రాయీల్ ప్రజలను విడుదల చేస్తాము. వారు నీ వెంట వెళ్ళడానికి ఒప్పుకుంటాము" అన్నారు. మూసా (అస) వారి కోసం దేవుణ్ణి ప్రార్థించారు. అల్లాహ్ వారి బాధలను తొలగించాడు. వారి పంటలు మళ్ళీ చక్కగా పండసాగాయి. నైలు నది ఎప్పటి మాదిరిగా నిండుగా ప్రవహించసాగింది. కాని పరిస్థితులు చక్కబడిన తర్వాత వారు తమ మాటను నిలబెట్టుకోలేదు.

## సముద్రం చీలడం

మూసా (అస) సందేశంలోని సత్యాన్ని చివరకు బనీఇస్రాయీల్ ప్రజలు గుర్తించారు. ఫిరౌన్ బెదిరింపులను లక్ష్యపెట్టక తమ నాయకుని (మూసా) వద్దకు వచ్చి ఆయన నుంచి మార్గదర్శకత్వాన్ని కోరారు. ఈజిప్టు వదలివెళ్ళడానికి వారిని మూసా (అస) సిద్ధం చేశారు. ఈ పరిణామమే వలసగా అభివర్ణించబడింది. అల్లాహ్ ఆజ్ఞానుసారం రాత్రి చీకటిలో మూసా (అస) తన ప్రజలను తీసుకుని సముద్రం దిశగా బయలు దేరారు. పొద్దుటికల్లా వారు సముద్రపు ఒడ్డుకు చేరుకున్నారు. అప్పటికి ఫిరౌన్‌కు వారి ప్రయాణం గురించి తెలిసిపోయింది. అతడు వారిని వెంటాడుతూ సైన్యంతోసహా వచ్చాడు.

ఇస్రాయీల్ ప్రజలు అసహనానికి గురయ్యారు. ఒకతను తీవ్ర అసహనంతో, "మన ముందు మనం దాటలేని ఈ సముద్రం, మన వెనుక శత్రు సైన్యం.. నిజంగా మనకు ఇక చావు తప్పదు" అన్నాడు. మూసా (అస) జవాబిస్తూ, అల్లాహ్ మనతో ఉన్నాడు, ఆయన మార్గదర్శనం కోసం ఎదురు చూద్దామన్నారు. ఈ మాటలు విని వాళ్ళు కొద్దిగా ఊరట పొందారు. కాని మనిషి ఫలితాల కోసం తొందరపడతాడు. వాళ్ళు మళ్ళీ బానిసత్వంలోకి వెళ్ళిపోవడమే మంచిదన్న అభిప్రాయానికి వచ్చేశారు. అప్పుడే అల్లాహ్ నుంచి మూసా(అస)కు మార్గదర్శనం లభించింది. "నీ చేతికర్రతో సముద్రాన్ని కొట్టు" అన్న ఆదేశం విన్న మూసా (అస) అలాగే చేశారు. మహావేగంతో గాలి వీయడం ప్రారంభమయ్యింది. ఎండ తీక్షణంగా కాయసాగింది. ఒక్క క్షణంలో సముద్రం రెండుగా చీలిపోయింది. కెరటాలు రెండువైపులా రెండు కొండల్లా నిలిచాయి. గాలి, ఎండల వల్ల బురద ఎండి పోయింది. మూసా (అస) తన ప్రజలను తీసుకుని ఆ మార్గాన నడిచారు.

https://teluguislam.net



"నా ప్రభువు నాతో ఉన్నాడు" అని మూసా (అస) చెప్పిన మాటలను ఈ పరిణామం నిరూపించింది.

వారు వెనుకకు తిరిగి చూస్తే ఫిరౌన్, అతని సైన్యాలు వస్తూ కనబడ్డాయి. వాళ్ళు కూడా చీలిన సముద్రం నుంచే రావడం కనబడింది. భయాందోళనలతో వాళ్ళు ఆ దారిని మూసేలా దేవుణ్ణి ప్రార్థించమని అడిగారు. అయితే సముద్రాన్ని మళ్ళీ చేతికర్రతో కొట్టరాదని అల్లాహ్ మూసా(అస)ను ఆదేశించాడు. ఎందుకంటే అల్లాహ్ ఆదేశం అప్పటికే అమలవుతోంది. ఫిరౌన్, అతడి సైన్యాలు సముద్రం చీలిపోయే మహత్యాన్ని చూశారు. కాని ఫిరౌన్ తన సైన్యాలను ఉద్దేశించి తన కాపట్యాన్ని ప్రదర్శిస్తూ, "చూశారా! నా ఆజ్ఞతో సముద్రం చీలిపోయింది. నేను ఆ తిరుగుబాటుదారులను వెంటాడి పట్టుకోవడానికే సముద్రం నాకోసం దారి వదిలింది" అన్నాడు. వాళ్ళు సముద్రం చీలిన ఆ మార్గాన ముందుకు రావడం ప్రారంభించారు. కాని వాళ్ళు సముద్రం మధ్యకు చేరుకున్న తర్వాత యథా రూపంలో రావలసిందిగా అల్లాహ్ సముద్రాన్ని ఆజ్ఞాపించాడు. భయాందోళనలకు గురయిన ఫిరౌన్ తన అంతం సమీపించిందని గ్రహించాడు. భీతావహుడై, "ఇస్రాయీల్ సంతతి ప్రజలు విశ్వసిస్తున్న దేవుడు తప్ప ఆరాధనకు అర్హుడైన దేవుడెవ్వడూ లేడని నేను విశ్వసిస్తున్నాను. ఆ దేవునికి విధేయత చూపిన వాడిగా మారుతున్నాను" అని ప్రకటించాడు. కాని అల్లాహ్ అతడి విశ్వాస ప్రకటనను స్వీకరించలేదు. ఫిరౌన్, అతడి సైన్యాలను సముద్రజలాలు ముంచేసాయి.★

★ *ఇక్కడ ఫిరౌన్‌గా పిలువబడిన వాడు ఫారో రామసేస్ 2గా ఈజిప్టాలజిస్టులు భావిస్తున్నారు. ఫిరౌన్‌కు అతడి కుమారుడు మిన్‌పాత్ సహాయసహకారాలు అందించాడు. క్రీ.పూ. 13/14 శతాబ్దాలలో ఫిరౌన్ ఇస్రాయీల్ సంతతి ప్రజలను అణచివేసి నిరంకుశ పరిపాలన కొనసాగించాడు. అంటే దాదాపు 3000 సంవత్సరాలకు పూర్వం. ఈ కాలం చాలా వరకు ఖచ్చితమైనదిగా చెప్పవచ్చు. ఎందుకంటే 1886లో లభించిన మిన్‌పాత్ శిలాఫలకాలలో "ఇస్రాయీలీలు పూర్తిగా నాశనం చేయబడ్డారు. వారి పునరుత్పత్తికి ఎలాంటి విత్తనాలు మిగల్లేదు" అని వుంది. అంటే ఇస్రాయీలీ ప్రజలు మూసా (అస) తో పాటు వలస పోకముందు, సముద్రం చీలిపోయిన సంఘటనకు ముందుకాలం వరకు వారిపై కొనసాగిన జాతినిర్మూలన ఊచకోతలను ఈ శిలాఫలకాలు సూచిస్తున్నాయి. సముద్రం చీలిపోయిన సంఘటనలో ఫిరౌన్, అతడి సైన్యాలు పూర్తిగా మునిగిపోయాయి. అయితే దివ్యఖుర్‌ఆన్ ప్రస్తావనలు పురాతత్వవేత్తలను ఆశ్చర్య చకితులయ్యేలా చేస్తున్నాయి. ఎందుకంటే ఇటీవల పురాతత్వ వేత్తలు కనుగొన్న విషయాలు*



## ఆధ్యాత్మిక ప్రక్షాళన

మూసా(అస)తో పాటు బనీ ఇస్రాయీల్ ప్రజలు సినాయ్ ఎడారిలో స్థిరపడ్డారు. తన ప్రజలు ఎక్కడ స్థిరపడాలన్న విషయమై మూసా (అస) అల్లాహ్ మార్గదర్శనాన్ని కోరారు. అల్లాహ్ ఆయనకు ఆదేశమిస్తూ ముప్ఫయి రోజులు ఉపవాసాలు పాటించి పరిశుద్ధులు కావాలని చెప్పారు. ఆ పిదప సినాయ్ కొండ వద్దకు వెళ్ళాలి, అక్కడ ఆయనకు అవసరమైన చట్టాలను ప్రసాదించడం జరుగుతుందని తెలిపాడు.

మూసా (అస) తన ప్రజలలో డెబ్బయి మందిని ఎన్నుకున్నారు. అల్లాహ్ చెప్పిన ప్రాంతానికి, అల్లాహ్ ఇచ్చే చట్టాలను స్వీకరించడానికి తనతో పాటు రమ్మని వారిని కోరారు. వారికి నాయకునిగా తన సోదరుడు హారూన్‌ను నియమించారు. మూసా (అస) వారి కోసం కొంత కాలం ఎదురుచూశారు. కాని వారెంతకీ రాలేదు. మూసా (అస) ఇక ఓపిక పట్టలేక తానే ఒంటరిగా తూర్ శిఖరానికి చేరుకున్నారు. అక్కడికి చేరుకోవడానికి ఆయన ముప్ఫయి రోజులు ప్రయాణించారు. అక్కడికి వెళ్ళిన తర్వాత అల్లాహ్ ఆయన్ను ప్రశ్నిస్తూ, నీ ప్రజలు వచ్చేవరకు ఎందుకు వేచిఉండలేదని అడిగాడు. మూసా జవాబిస్తూ, "వారు వెనుక వస్తున్నారు. నేను మీ ప్రసన్నత పొందడానికి త్వరత్వరగా వచ్చాను ప్రభూ" అన్నారు. మరో పదిరోజులు ఉపవాసాలు పాటించి పరిశుద్ధత పొందాలని ఆయన్ను ఆదేశించడం జరిగింది.

మళ్ళీ మూసా సినాయ్ కొండవద్దకు వచ్చారు. విశ్వప్రభువైన అల్లాహ్‌తో సంభాషించారు. ఈ సంభాషణల వల్ల ఆయనకు అల్లాహ్‌తో సాన్నిహిత్యం

*అప్పట్లో జరిగిన చారిత్రక సంఘటనలకు అద్దం పడుతున్నాయి. ఇంతవరకు పురాతన రాతల్లో ఎక్కడా లభించని చారిత్రక వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. సముద్రం చీలిపోయిన సంఘటన తర్వాత 2000 సంవత్సరాలకు దివ్యఖుర్‌ఆన్ ఈ సంఘటనను ప్రస్తావిస్తూ, 'ఈ రోజు మేము నీ మృతదేహాన్ని భద్రంగా ఉంచుతున్నాము.. అది వారికి (ఈజిప్టువాసులకు) వారి తర్వాతి వారికి ఒక సూచన కావాలి" అని ప్రకటించింది. ఆశ్చర్యమేమంటే, ఫారో రామ్‌సేస్-2 శవం ఒక రాజశ్మశానంలో లభించింది. దానిని ప్రదర్శనగా మ్యూజియంలో ఉంచారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆ శవం మమ్మీగా మార్చక ముందు నీటి నుంచి ఒడ్డుకు వచ్చిపడిన శవం (సముద్రం బయటకు విసిరివేసిన శవం). అది ఎలాంటి శవమైనప్పటికీ, ఫిరౌన్ శవాన్ని రానున్న తరాలకు ఒక సూచనగా భద్రపరచడం జరుగుతుందన్న దివ్యఖుర్‌ఆన్ వాక్యం నిజమని నిరూపించబడింది.*

https://teluguislam.net



పెరిగింది. ఆయన హృదయం ఆధ్యాత్మిక భావనలతో నిండిపోయింది. తన భావావేశాలను వ్యక్తపరుస్తూ ఆయన, "ఓ ప్రభూ! నీ దర్శనభాగ్యం ప్రసాదించు, నేను కళ్ళారా నిన్ను చూడాలనుకుంటున్నాను" అని ప్రాధేయపడ్డారు. కాని విశ్వప్రభువు జవాబిస్తూ, "నీవు నన్ను చూడలేవు. ఆ కొండపై నీ దృష్టి నిలుపు, అది తన పునాదిపై నిలబడి ఉన్నట్లయితే నీవు నన్ను చూడగలవు" అన్నాడు. మూసా వెంటనే ఆ కొండపై దృష్టి సారించారు. ఫెళఫెళరావాలతో ఆ కొండ కుప్ప కూలింది. ఆ ప్రభావానికి మూసా నేలపై విసిరివేయబడ్డారు. ఆయన నిర్ఘాంత పోయారు. కాని అల్లాహ్ ప్రసన్నత పొందినవారికి ఆయన కారుణ్యం ఎల్లప్పుడూ లభిస్తుంది. మూసా స్పృహలోకి వచ్చిన తర్వాత ఆశ్చర్యంగా, "ప్రభూ! సర్వ స్తోత్రాలు నీకే. నేను పశ్చాత్తాపంతో నీ వైపునకే మరలుతున్నాను. నిజమైన విశ్వాసుల్లో అగ్రభాగాన ఉండాలని భావిస్తున్నాను" అన్నారు. ఆయన ముందు దేవుని చట్టాలు లిఖించబడి ఉన్న శిలాఫలకాలు ఉన్నాయి. బనీఇస్రాయీల్ ప్రజలను పాలించడానికి అవసరమైన చట్టాలవి. దేవుని పట్ల తన కృతజ్ఞతను వ్యక్తపరుస్తూ మూసా, "ప్రభూ! నీవు నాకు గొప్ప గౌరవాన్ని ప్రసాదించావు. ఇంతకు ముందు ఎవరూ ఇలాంటి గౌరవాన్ని పొందలేదు" అన్నారు. అల్లాహ్ జవాబిస్తూ, "మూసా! ఇతరుల కన్నా నీకు ప్రాముఖ్యం ఇచ్చి నా సందేశాన్ని అందజేయడానికి, నా ఆదేశాలు అందుకోవడానికి నిన్ను ఎన్నుకున్నాను. కాబట్టి నేను ప్రసాదించిన వాటిని (చట్టాలను) దృఢంగా పట్టుకో, కృతజ్ఞత చూపేవారిలో ఒకనిగా ఉండు" అన్నాడు.

## బంగారు ఆవుదూడ

బనీ ఇస్రాయీల్ ప్రజలను వదలి మూసా (అస) సినాయ్ కొండ వద్దకు వెళ్ళి నలభై రోజులు గడిచిపోయాయి. ప్రజలు అసహనానికి, అలజడికి గురయ్యారు. అల్లాహ్ మూసా(అస)కు మరో పది రోజులు అధిక కాలం అక్కడ ఉంచాడన్న విషయం వారికి తెలుసు. వారిలో ఒక వ్యక్తి సామిరి. దుర్మార్గపు ఆలోచనలు కలిగిన సామిరి తమ జాతికి మరో మార్గదర్శిని వెదుక్కోవాలని ప్రచారం చేశాడు. అన్నమాట ప్రకారం మూసా (అస) రాలేదు కాబట్టి, నిజమైన మార్గదర్శనం పొందడానికి తమకు ఒక దేవుని అవసరం ఉంది కాబట్టి, జాతి వారికి ఒక కొత్త దేవుడిని తాను వెదకిపెడతానన్నాడు. అందుకోసం ప్రజల వద్ద నుంచి బంగారు ఆభరణాలన్నింటినీ సేకరించాడు. ఒక గొయ్యి తవ్వి ఆ



బంగారు ఆభరణాలను అందులో వేశాడు. పెద్ద మంట పెట్టి వాటిని కరగ బెట్టాడు. దాన్ని పోతపోస్తూ, మంత్రగాళ్ళు అమాయకులను మభ్యపుచ్చడానికి చేసే చేష్టలన్నీ చేశాడు. అలా కరిగిన ఆ బంగారాన్ని ఒక ఆవుదూడ బొమ్మగా తయారు చేశాడు. ఆ ఆవుదూడ విగ్రహం లోపల బోలుగా ఖాళీస్థలం ఉంది. అందులోంచి గాలి వీస్తే ఒక విధమైన శబ్దం వచ్చేది. వారి గతకాలం అంతా మూఢనమ్మ కాలతోనే గడిచిపోయింది కాబట్టి వారు ఆ విచిత్రమైన శబ్దం మానవాతీత శక్తి అన్న నిర్ణయానికి వచ్చేశారు. ఆ విగ్రహాన్ని ఒక సజీవమైన దైవంగా భావించారు.

వారికి నాయకునిగా మూసా (అస) తన సోదరుడు హారూన్‌ను నియ మించి వెళ్ళారు. హారూన్ ఈ పరిణామం చూసి చాలా దుఃఖానికి గురయ్యారు. వారికి నచ్చ చెబుతూ, "ప్రజలారా! మీరు మోసానికి గురవుతున్నారు. మీ ప్రభువు అపార కృపాశీలుడు, నా మాటలు వినండి, నేను చెప్పినట్లు చేయండి" అని ఎంతగా చెప్పినా వాళ్ళు వినలేదు. ఆయనకు జవాబిస్తూ, "మూసా(అస) వస్తే గాని ఈ దైవానికి పూజలు చేయడం ఆపేదిలేదు" అన్నారు. అయితే ఒకే దేవుని విశ్వాసంలో స్థిరంగా ఉన్నవాళ్ళు ఈ అజ్ఞానులకు వేరయ్యారు. భేదాభిప్రాయా లున్నప్పటికీ శాంతి భద్రతలు కొనసాగాయి. అల్లాహ్‌తో సంభాషణల సందర్భంగా మూసా(అస)కు ఈ విషయం తెలిసింది. "నీవు లేనప్పుడు మేము నీ ప్రజలను పరీక్షించాము. సామిరి వాళ్ళను తప్పుదోవ పట్టించాడని" అల్లాహ్ తెలిపాడు.

## మూసా (అస) పునరాగమనం

తిరిగివచ్చిన మూసా (అస) తన ప్రజలు ఆవుదూడ విగ్రహం ముందు పాటలు పాడుతూ నృత్యాలు చేయడం చూశారు. ఈ అజ్ఞానపు ఆచారాన్ని చూసిన ఆయన, కోపం పట్టలేక వారి కోసం తాను తీసుకువచ్చిన చట్టాలున్న శిలాఫల కాలను క్రిందపడేశారు. తన సోదరుడు హారూన్ గెడ్డాన్ని పట్టుకుని గుంజుతూ, "వాళ్ళు తప్పుదారి పట్టకుండా ఎందుకు ఆపలేదు. ఈ దురాచారాన్ని ఎందుకు నిలువరించలేదు" అని నిలదీశారు. హారూన్ జవాబిస్తూ, "నా తల్లి పుత్రుడా! నా గెడ్డం వదులు. ఈ ప్రజలు నన్ను బలహీనుడిగా చేశారు. వాళ్ళు దాదాపు నన్ను చంపినంత పని చేశారు. నా శత్రువులు ఆనందించేలా వ్యవహరించకు. నన్ను దుర్మార్గుల్లో చేర్చకు. ఇస్రాయీల్ సంతతి ప్రజల్లో వర్గాలు సృష్టించానని నువ్వు నిందిస్తావని కూడా నేను భయపడ్డాను" అన్నారు.

మూసా (అస) ఆగ్రహం నెమ్మదిగా చల్లారింది. హారూన్ నిస్సహాయ స్థితిని ఆయన అర్థం చేసుకున్నారు. పరిస్థితిని సంయమనంతో చక్కదిద్దాలనుకున్నారు. అవిశ్వాసుల నాయకుడు సామిరీని పిలిచారు. "సామిరీ! నువ్వేమంటావు?" అనడిగారు. సామిరీ నిర్లక్ష్యంగా జవాబిస్తూ, "వాళ్ళు అర్థం చేసుకోలేనిది నేను అర్థం చేసుకున్నాను. అందువల్ల, నా మనసుకు తట్టిన విధంగా చేశాను. మీ పాదచిహ్నాల వద్ద నుంచి కాస్త మట్టి తీసి ఆవుదూడ పోతపోస్తున్నప్పుడు విసిరాను" అన్నాడు. మూసా (అస) అతడిని అక్కడి నుంచి పంపేశారు. ఆ పిదప ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. "మీ ప్రభువు మీకు వాగ్దానం చేయలేదా? నిర్ధారిత సమయం చాలా ఎక్కువైపోయిందా? లేక నా పట్ల విశ్వాసాన్ని మానుకుని ప్రభువు ఆగ్రహాన్ని కొనితెచ్చుకోవాలని భావిస్తున్నారా?" అని నిలదీశారు. వారు తలలు వంచుకుని జవాబిస్తూ, "మీ పట్ల విశ్వాసాన్ని గాని, మా సంకల్పాన్ని గాని మేము వదులుకోలేదు. కాని ఆ బంగారు ఆభరణాల భారం చాలా ఎక్కువైంది. అందుకే సామిరీ చెప్పినట్లు వాటిని మంటలో పారేశాము. వాడు ఈ బంగారు ఆవుదూడను తయారు చేసి మమ్మల్ని తప్పుదారి పట్టించాడు" అన్నారు.

ఇస్రాయీల్ ప్రజలు పశ్చాత్తాపపడుతూ, "మా ప్రభువు మాపై కరుణ చూపకపోతే, మమ్మల్ని క్షమించకపోతే మేము నిస్సందేహంగా వైఫల్యం చెందుతాము" అన్నారు. వారు మూసా (అస)ను ప్రాధేయపడుతూ తగిన మార్గాన్ని చూపమని కోరారు. మూసా (అస) వారికి జవాబిస్తూ, "పశ్చాత్తాపపడండి. పశ్చాత్తాపానికి, క్షమాభిక్షకు మార్గం చూపమని ప్రభువును వేడుకోండి. మీ ప్రాపంచిక కోరికలను అణచివేయండి. ప్రక్షాళన పొందండి. మీరు పరిశుద్ధులయ్యే వరకు మీలో ఉన్న దుర్మార్గపు ఆలోచనలను నిర్మూలించండి. మీరు ఆత్మవికాసం పొందగలరు" అన్నారు. వాళ్ళు పశ్చాత్తాపపడ్డారు. అల్లాహ్ వారి పశ్చాత్తాపాన్ని స్వీకరించాడు. ఆయన అపార కృపాశీలుడు, అమితంగా కరుణించేవాడు.

కాని సామిరీ ఎలాంటి పశ్చాత్తాపాన్ని ప్రకటించలేదు. తాను చేసిన పనికి బాధపడనూ లేదు. సామిరితో ఎవరూ ఎలాంటి సంబంధం కలిగి ఉండరాదని మూసా ఆదేశించారు. ఆ విధంగా సామిరి బహిష్కరించబడ్డాడు. మూసా (అస) ఆ బంగారు ఆవుదూడ విగ్రహాన్ని కరిగించి కరిగిన లోహాన్ని సముద్రంలో పారవేయించారు. ఆ విధంగా బంగారు ఆవుదూడ కథను ముగించారు.

https://teluguislam.net



# అల్లాహ్ అనుగ్రహాలు

బనీఇస్రాయీల్ ప్రజలను అల్లాహ్ అనేక విధాలుగా అనుగ్రహించాడు. వారికి అనేక వరాలు ప్రసాదించాడు. వారిని దౌర్జన్యాల నుంచి, అణచివేతల నుంచి రక్షించాడు. క్రూరమైన పాలకుడు ఫిరౌన్ నీటమునిగి చావడాన్ని వాళ్ళు కళ్ళారా చూశారు. ఎడారి భూమిలో వారికి త్రాగడానికి నీరు దొరకని పరిస్థితిలో అల్లాహ్ వారికి సహాయపడ్డాడు. చేతికర్రతో ఒక రాతిని కొట్టమని అల్లాహ్ మూసా (అస)కు ఆదేశించాడు. ఆ రాయి చీలి అందులో నుంచి పన్నెండు నీటి ఊటలు ఉబికాయి. పన్నెండు విభిన్నమైన తెగలకు ఆ పన్నెండు నీటి ఊటలను కేటాయించడం జరిగింది. ఆ విధంగా అల్లాహ్ నీటి కరవు విషయంలో వారి మధ్య ఎలాంటి వివాదాలు తలెత్తకుండా చూశాడు. మలమలమాడ్చే ఎండ నుంచి వారిని కాపాడడానికి ఆకాశాన్ని మేఘావృతమై ఉండేలా చేశాడు. వారి ఆకలి తీర్చడానికి ఒక విధమైన రుచికరమైన రేగులాంటి పళ్ళు (మన్న్), సల్వా అనబడే ఒక విధమైన పక్షి మాంసం ప్రసాదించేవాడు.

బనీఇస్రాయీల్ ప్రజలను తీసుకుని వాగ్దానం చేయబడిన పవిత్ర భూమికి వెళ్ళాలని మూసా(అస)ను అల్లాహ్ ఆదేశించాడు. ఆ పవిత్ర భూమి సిరియాలో ఉంది. వాస్తవానికి ఈ పవిత్ర భూమి ఇబ్రాహీమ్ (అస)కు వాగ్దానం చేయబడింది. ఇబ్రాహీమ్ (అస) సంతతిలో సన్మార్గులు, దైవభీతి కలిగిన వారు, దేవుని చట్టాలను పరిరక్షించే వారు నివసించడానికి ఈ భూమిని అల్లాహ్ ప్రసాదించాడు.★

★ *ఇబ్రాహీమ్ ప్రవక్త (అస) సంతానానికి ఈ పవిత్ర భూమి వాగ్దానం చేయబడింది. వారిలో ఇస్రాయీల్ సంతతి ప్రజలు, ఇస్మాయీల్ సంతతి ప్రజలు ఉన్నారు. వారికి ఈ పవిత్ర భూమి వాగ్దానం చేస్తూ అందుకు షరతుగా వారు దేవుని ఏకత్వానికి కట్టుబడాలని, ఆరాధనలు, దానధర్మాలు చేయాలని చెప్పడం జరిగింది. బనీ ఇస్రాయీల్ ఈ షరతుకు కట్టుబడడంలో విఫలమయ్యారు. అందువల్లనే సూరా 21:05లో అల్లాహ్ ఈ విధంగా చెప్పాడు: "తౌరాత్ ఇవ్వబడిన తర్వాత మేము లేఖనాల్లోనూ (జబూర్‌లోనూ)పేర్కొన్నాము. నా దాసుల్లో సన్మార్గులు మాత్రమే భూమికి వారసత్వాన్ని పొందుతారు." (లేఖనాల్లోనూ ఇదే కనబడుతుంది. 37:29. "సన్మార్గులే పవిత్ర భూమికి వారసత్వాన్ని పొంది అక్కడ శాశ్వతంగా ఉంటారు")*

https://teluguislam.net



## సాకులు చెప్పే జనం

బనీఇస్రాయీల్ కృతజ్ఞత లేని ప్రజలు. అల్లాహ్ వారిని అపారంగా అనుగ్రహించినప్పటికీ వారు చెడులకు దూరంగా ఉండలేదు. అల్లాహ్ చట్టాల పట్ల తమ నిర్లక్ష్యాన్ని కొనసాగించారు. కనాన్, హిటైట్ ప్రజల పట్టణాలను ఆక్రమించుకోవాలని మూసా (అస) వారిని ఆదేశించారు. ఈ రెండు జాతులు బనీ ఇస్రాయీల్‌కు శత్రుజాతులు, బనీఇస్రాయీల్ ప్రజలను వెంటాడి వేధిస్తున్న జాతులు. కాని, మూసా (అస) ఆదేశం విన్న బనీఇస్రాయీల్ ప్రజలు పిరికితనాన్ని చూపారు. సాకులు చెప్పసాగారు. "మూసా! ఆ పట్టణాల్లో బలాఢ్యులైన ప్రజలున్నారు. వారు అక్కడి నుంచి వెళ్ళనంత కాలం ఆ పట్టణాల్లోకి మేము ప్రవేశించం" అన్నారు.

కాని వారిలో, నిజమైన విశ్వాసం కలిగినవారు ఇద్దరు ఉన్నారు. వారిద్దరూ, "ఆ పట్టణాల్లోకి సింహద్వారం గుండా ప్రవేశించండి. మీకు విజయం లభిస్తుంది. మీరు విశ్వాసులైతే అల్లాహ్ పట్ల పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉండండి" అన్నారు. కాని బనీఇస్రాయీల్ ప్రజలు పిరికితనాన్ని వదలలేదు. "మూసా! ఆ ప్రజలు ఉన్నంత కాలం మేము ఆ పట్టణంలోకి ప్రవేశించం. కాబట్టి నువ్వు, నీ ప్రభువు వారితో పోరాడండి. మేమిక్కడ వేచి ఉంటాం" అన్నారు.

మూసా (అస), హారూన్‌లు ఈ పిరికివాళ్ళను మార్చలేకపోయారు. నిరాశతో మూసా (అస) అల్లాహ్‌ను వేడుకున్నారు. "నాకు నా సోదరునిపైన, నాపైన తప్ప మరెవ్వరిపై అదుపు లేదు. కాబట్టి అవిధేయులైన వారికి - మాకు మధ్య విచక్షణ చేయి" అని ప్రార్థించారు. దిక్కుతోచని స్థితిలో వారు మరో నలభై సంవత్సరాలు గమ్యరహితంగా తిరుగుతూ ఉండేలా అల్లాహ్ వారిని శపించాడు. మూసా (అస)వారిని వదలి దూరంగా వెళ్ళిపోయారు. ఈ తరం ప్రజలు దిక్కుతోచని స్థితిలో గమ్యరహితంగా తిరుగాడుతూ చివరకు అంతరించారు. తర్వాతి తరాలు మాత్రమే పవిత్ర భూమిని చేరుకోగలిగాయి.

(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 28:3-43, 20:9-100, 26:1-68, 7:100-156/160, 10:75-92, 27:7-14, 79:15-26, 11:96-101, 14:5-8, 23:45-48, 17:101-104)



### గ్రహించవలసిన పాఠాలు

- అణచివేతకు, పక్షపాతానికి, నిరంకుశత్వానికి గురయిన జాతులు నైతికంగా దిగజారుతాయి. పరాభవాలు, అణచివేతలు వారిని కూడా తమను అణచి వేసిన నియంతల మాదిరిగా తయారు చేస్తాయి. దౌర్జన్యాలు, అణచివేతల వల్ల అల్లాహ్ పట్ల విశ్వాసాన్ని కోల్పోవడం కూడా జరుగుతుంది. నిరాశావాదులుగా, భవిష్యత్తు పట్ల ఆశలేని వారిగా మారడం కూడా జరుగుతుంది.
- నియంతలతో అయినా సరే చక్కని వివేకంతో వాదించాలని అల్లాహ్ తన సందేశహరులను ఆదేశించాడు.
- ఒక సైన్యం లేదా అసత్యం ఎంత బలమైనదయినాగాని చివరకు అది సత్యం చేతిలో ఓటమిని చవిచూస్తుంది.
- గత సంప్రదాయాలను గుడ్డిగా అనుసరించడం వల్ల ప్రజలు సంస్కరణలను వ్యతిరేకిస్తారు.

https://teluguislam.net



# ప్రవక్త మూసా- (అలైహిస్సలాం) మార్గదర్శి ఖిజర్ (అలైహిస్సలాం)



మూసా, ఖిజర్‌లు బయలుదేరారు. చివరకు ఒక పడవలో పయనమైనప్పుడు అతను (ఖిజరు) దాని చెక్క పలకలను పగుల గొట్టారు. దానికి మూసా, "ఇదేమిటీ, పడవ ప్రయాణీకులందరినీ ముంచేయటానికా వీటిని పగులగొట్టారు? మీరు చాలా ఘోరమైన పనికి ఒడిగట్టారు" అని చెప్పనే చెప్పేశాడు. (ఖుర్‌ఆన్ 18 : 71)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఒక రోజు, మూసా (అస) ప్రజల్లో చైతన్యాన్ని రగిలించే ఒక ప్రభావవంతమైన ప్రసంగం చేశారు. ఆ ప్రసంగం వారిపై తీవ్రమైన ప్రభావం వేసింది. ప్రజల్లో ఒక వ్యక్తి, "దైవప్రవక్తా! భూమిపై మీకన్నా ఎక్కువ జ్ఞానం కలిగిన వ్యక్తి ఉన్నాడా?" అని ప్రశ్నించాడు. అల్లాహ్ తనకు మహత్యాలు ప్రదర్శించే శక్తి ఇచ్చాడు. తౌరాత్ గ్రంథాన్ని ప్రసాదించాడు కాబట్టి తానే అందరికన్నా ఎక్కువ జ్ఞానం కలిగిన వాడినని భావిస్తూ మూసా (అస) ఆ వ్యక్తితో, "లేదు" అని జవాబిచ్చారు. కాని తెలుసుకోవలసి నదంతా తెలుసుకున్న వ్యక్తి ఎవరూ లేరని, సంపూర్ణ జ్ఞానానికి ఒకే దైవప్రవక్త కేంద్రం కావడం కూడా జరగదని, ఒక వ్యక్తికి తెలియని విషయాలు తెలిసిన మరో వ్యక్తి ఎల్లప్పుడు ఉంటాడని అల్లాహ్ ఆయనకు తెలియజేశాడు. అప్పుడు మూసా (అస) అల్లాహ్‌తో, "ప్రభూ! ఆ వ్యక్తి ఎక్కడ ఉన్నారు? నేను ఆయన్ను కలుసుకుని ఆయన నుంచి విద్య నేర్చుకోవాలని భావిస్తున్నాను" అన్నారు. ఆ వ్యక్తిని గుర్తించడానికి గుర్తు చెప్పమని కూడా అల్లాహ్‌ను కోరారు.

అల్లాహ్ ఆయనకు మార్గం చూపుతూ, నీటితో నిండిన ఒక పాత్రలో ఓ చేపను తీసుకుని బయలుదేరాలని, ఆ చేప పాత్ర నుంచి మాయమైన ప్రదేశంలో



ఆ వ్యక్తి కనబడతాడని చెప్పాడు. మూసా (అస) ఆ వ్యక్తిని కలుసుకోవడానికి బయలుదేరారు. ఆయన వెంట ఒక అనుచరుడు చేపవున్న నీటిపాత్రను పట్టుకుని రాసాగాడు. వారిద్దరు రెండు నదులు కలసిన సంగమ ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ విశ్రాంతి తీసుకోవాలని భావించారు. మూసా (అస)అక్కడ నిద్రలోకి జారుకున్నారు.

ఆయన నిద్రపోతున్నప్పుడు, నీటి పాత్రలోని చేప ఎగిరి నదిలో దూకడాన్ని ఆయన అనుచరుడు చూశాడు. కాని అతడు ఈ సంఘటన గురించి మూసా (అస)కు చెప్పడం మరచిపోయాడు. మూసా (అస) లేచిన తర్వాత ఇద్దరూ ప్రయాణం కొనసాగించారు. వారు బాగా అలసిపోయారు, చాలా ఆకలితో ఉన్నారు. మూసా(అస) తన అనుచరునితో ఆహారం గురించి అడిగారు. అప్పుడు అనుచరునికి నీటి పాత్రలోని చేప నదిలో దూకి వెళ్ళిపోయిన విషయం గుర్తుకువచ్చింది. ఆ విషయాన్ని మూసా(అస)కు తెలియజేశాడు. మూసా (అస), "అర్రర్రె.. మనం వెదుకుతున్న ప్రదేశం అదే" అన్నారు. వారు త్వరత్వరగా వెనక్కి వచ్చారు. రెండు నదులు కలసిన ప్రదేశానికి, చేప నదిలో దూకి ఈదుకుంటూ వెళ్ళిపోయిన ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ వారికి ఒక వ్యక్తి కనిపించాడు. అతని ముఖం సగ భాగాన్ని ఒక వస్త్రం కప్పిఉంది. ఆయనే ఖిజర్ (అస).. మార్గదర్శి!

## వింత మనిషి

మూసా (అస) ఆయనకు అభివాదం చేశారు. "అస్సలాము అలైకుమ్ (మీపై శాంతి కలుగుగాక!)"అన్నారు. ఆ వ్యక్తి తన ముఖంపై ఉన్న వస్త్రాన్ని తప్పించి వారిని చూశారు. "మీరు నాకు శాంతి కలగాలని అభివాదం చేశారు. కాని ఈ దేశంలో శాంతి ఉందా? అసలు మీరెవరు?" అని ప్రశ్నించారు. మూసా (అస) జవాబిస్తూ, "నేను ఇస్రాయీల్ వారి ప్రవక్తను" అన్నారు. ఆ వ్యక్తి తిరిగి, "మీకు బోధనలు ఎవరు చేశారు? ఎవరు మిమ్మల్ని ఇక్కడకు పంపించారు?" అనడిగారు. మూసా (అస) జరిగిన విషయాన్ని ఆయనకు వివరించారు. చాలా మర్యాదగా, "నేను మీతో రావచ్చా.. ఆ విధంగా మీరు మీ వద్ద ఉన్న జ్ఞానాన్ని నాకు బోధించగలరు. మిమ్మల్ని కలవడానికి నేను చాలా ప్రయాసపడి ఇక్కడకు వచ్చాను. నేను మీకు అవిధేయత చూపను" అన్నారు. ఖిజర్ (అస) ఆయనకు జవాబిస్తూ, "మీరు నన్ను భరిస్తారని నేను అనుకోవడంలేదు. ఎందుకంటే మీరు

https://teluguislam.net



అనేక విచిత్రమైన విషయాలను చూడవచ్చు. చాలా విచిత్రమైన వాటిని చూసి మీరు నన్ను విమర్శించకుండా ఉండలేరు. ఎందుకంటే మీ అవగాహన పరిమితమైనది. అందువల్ల మీరు వాదనకు దిగుతారు" అన్నారు. మూసా (అస) చాలా నిజాయితీగా, "దైవం తలిస్తే ... నేను సహనంతో ఉంటాను. మీ పట్ల అవిధేయత చూపను" అన్నారు. చివరకు ఖిజర్ (అస) ఆయన్ను వెంట తీసుకువెళ్లడానికి అంగీకరిస్తూ ఒక షరతు పెట్టారు. తాను ఏం చేసినా ప్రశ్నించరాదని అన్నారు. మూసా (అస) తన అనుచరుడిని వెనక్కు పంపి తాను ఖిజర్ (అస)తో పాటు బయలుదేరారు.

## పడవకు నష్టం కలిగించడం

వారు ఒక నది వద్దకు చేరుకున్నారు. ఇద్దరూ ఒక పడవలోకి ఎక్కారు. ఆ పడవ యజమాని వారిద్దరి పట్ల ఒక విధమైన అభిమానాన్ని చూపించాడు. వారిద్దరిని అభిమానంగా పడవలోకి ఆహ్వానించాడు. పడవలోకి ఎక్కిన తర్వాత ఖిజర్ (అస) చాలా వింతగా వ్యవహరించారు. పడవ ప్రక్కల బిగించి ఉన్న కొన్ని చెక్కలను పీకిపారేశారు. దాని వల్ల పడవకు ఒకవైపు పెద్ద రంధ్రంలా ఏర్పడింది. ఈ విచిత్ర ప్రవర్తనను చూసి నిర్ఘాంతపోయిన మూసా(అస), "అరె, ఎందుకు పడవను నాశనం చేస్తున్నారు? మన పట్ల అభిమానంగా ఆహ్వానించిన పడవ యజమానికి ఇదా మనం ఇచ్చే ప్రతిఫలం? పైగా మనమంతా మునిగిపోయే ప్రమాదం కూడా ఉందని మీరు గ్రహించడం లేదా? మీరు చేసిన పని చాలా అనుచితమైనది" అన్నారు.

ఖిజర్ (అస) ఆయనకు తమ మధ్య కుదిరిన అంగీకారాన్ని గుర్తుచేశారు. మూసా(అస)కు వెంటనే తాను చేసిన పొరపాటు గుర్తుకువచ్చింది. ఆయన్ను క్షమాపణలు కోరుకున్నారు. "నా మతిమరుపుకు కోపం తెచ్చుకోవద్దు, నా బలహీనత విషయంలో కఠినంగా వ్యవహరించవద్దు. మీతో రాకుండా నివారించవద్దు. నేను నా మాటకు కట్టుబడి ఉండడానికి ఈసారి పూర్తిగా ప్రయత్నం చేస్తాను" అన్నారు. అందుకు అంగీకరించి ఖిజర్ (అస) ఆయన్ను వెంటతీసుకుని బయలుదేరారు.

## పిల్లవాడిని హతమార్చడం

దారిలో వారికి ఒక పిల్లవాడు తన మిత్రులతో ఆడుకుంటూ కనబడ్డాడు.



ఖిజర్ (అస) ఆ పిల్లవాడిని మిత్రబృందం నుంచి వేరు చేసి ఒక ప్రక్కకు తీసుకు వెళ్ళి హతమార్చారు. ఈ అఘాయిత్యం చూసి మూసా (అస) నిర్ఘాంతపోయారు. "మీరు ఒక అమాయక పిల్లవాడిని చంపేశారు. ఇది నిజంగా అమానుషం" అని అరిచారు. ఖిజర్ (అస) ఆయన వైపు తీక్షణంగా చూసి తమ మధ్య కుదిరిన అంగీకారాన్ని గుర్తుచేశారు. తన పనులను మరోసారి ప్రశ్నిస్తే ఇక తనతో రావడం ఉండదని హెచ్చరించారు. మూసా (అస) మళ్ళీ క్షమాపణ కోరుకున్నారు. "నేను మరోసారి ఈ పొరపాటు చేస్తే నన్ను మీ వెంట రాకుండా చేయండి" అన్నారు. ఖిజర్ (అస) ఆయన్ను మన్నించారు.

## ఖిజర్ (అస) చేసిన మంచి పని

వారిద్దరు ఒక గ్రామానికి చేరుకున్నారు. అక్కడి గ్రామస్తులతో వారు ఆశ్రయాన్ని, ఆహారాన్ని కోరారు. కాని పిసినారి ప్రజలు వారికి ఏదీ ఇవ్వలేదు. అందువల్ల వాళ్ళిద్దరూ అలాగే ప్రయాణం కొనసాగించవలసి వచ్చింది. వారిద్దరూ వెడుతున్నప్పుడు ఒక చోట ఒక గోడ కూలడానికి సిద్ధంగా ఉండడాన్ని వాళ్ళు చూశారు. వెంటనే ఖిజర్ (అస) ఆ గోడను మరమ్మత్తు చేయడానికి పూనుకున్నారు. ఇది చూసిన మూసా (అస) ఉండబట్టలేక, "మీరు భలే విచిత్రమైన మనిషి. ఈ స్వార్థపరుల పట్ల మీరు సానుభూతి చూపుతున్నారు. పైగా మీరు చేస్తున్న కష్టానికి ప్రతిఫలం కూడా కోరడం లేదు. మనం చేసిన కష్టానికి వారి నుంచి ప్రతిఫలం తీసుకుని మన ప్రయాణానికి కొద్దిగా ఆహారాన్ని సమకూర్చుకోగలిగే వాళ్ళం" అన్నారు. తన పనులకు తగిన వివరణ ఇచ్చే వరకు వాటిని మూసా (అస) భరించలేరని ఖిజర్(అస)కు అర్థమయ్యింది. "ఇక చాలు... ఇక మనం ఎవరి దారి వారు వేరవ్వడం మంచిది. మీకు సహనం లేదు. అయితే మనం వేరయ్యే ముందు నేను చేసిన పనులకు కారణాలు వివరిస్తాను" అన్నారు. మూసా సిగ్గుపడుతూ తల వంచుకున్నారు.

1. నేను నష్టపరచిన పడవను కిరాయికి నడుపుకుని ఆ పడవ యజమాని, అతని భార్య బ్రతుకుతున్నారు. నేను ఆ పడవను ఎందుకు నష్టపరిచానంటే, వారి రాజు పడవలను స్వాధీనం చేసుకుని పెద్ద నౌకాదళాన్ని తయారు చేయాలని చూస్తున్నాడు. ఈ పడవను నష్టపరచడం వల్ల దీన్ని చూసినా కూడా పనికిరానిదిగా భావించి రాజు దాన్ని వదిలివేస్తాడు. మూసా! నేను చేసిన పని చూడడానికి

https://teluguislam.net



బాధ్యత లేని పనిగా కనబడినా... నేను నిజానికి ఆ పడవను కాపాడడానికి, పడవ యజమానిపై సానుభూతితో చేసిన పని.

2. నేను చంపిన పిల్లవాడి తల్లిదండ్రులు నిజమైన విశ్వాసులు. కాని ఆ పిల్లవాడిలో ఉన్న దుర్మార్గం గురించి నాకు తెలిసింది. కన్నకొడుకు కాబట్టి ఆ తల్లి దండ్రులు అతడి దుర్మార్గాన్ని భరిస్తారు. కాని, చివరకు వాడి దుర్మార్గాలు ఆ తల్లిదండ్రులను కూడా ప్రభావితం చేస్తాయని నేను గ్రహించాను. అతడిని చంపి నేను వారి విశ్వాసాన్ని కాపాడాను. అల్లాహ్ వారికి మంచి సంతానాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

3. నేను ఆ గోడను నిర్మించినది స్వార్థపరులైన గ్రామస్తుల కోసం కాదు, ఆ గోడ ఇద్దరు అనాథలైన బాలలది. ఆ గోడ క్రింద గుప్తనిధి ఉందని అల్లాహ్ నాకు తెలియజేశాడు. ఆ పిల్లల తండ్రి పుణ్యాత్ముడు, దానధర్మాలు చేసేవాడు. ఆ పిల్లలు పెరిగి పెద్దయ్యే వరకు ఆ గుప్తనిధి రహస్యంగా ఉండడం చాలా అవసరం. వారు పెద్దయిన తర్వాత అల్లాహ్ వారికి ఆ నిధిని చూపిస్తాడు. ఆ గోడ పడిపోతే స్వార్థపరులైన గ్రామస్తులు ఆ నిధిని దోచుకుంటారు. కాబట్టి నేను చేసిన ప్రతీ పని నా ప్రభువు కారుణ్యం వల్ల చేసిన పని. నేను ఏ పనీ నా స్వంతంగా చేయలేదు. ఈ మాటలు చెప్పి ఖిజర్ (అస), వేగంగా నడుచుకుంటూ వెళ్ళిపోయారు. (చదవండి దివ్యఖుర్‌ఆన్ : 18:60-82)

### గ్రహించవలసిన పాఠాలు

- జ్ఞానం పొందిన వ్యక్తి తానొక్కడే కాదన్న విషయం తెలిసిన వెంటనే మూసా (అస) మరింత జ్ఞానం సంపాదించడానికి కష్టసాధ్యమైన ప్రయాణానికి పూనుకున్నారు. జ్ఞానం సులభసాధ్యంగా లభించేది కాదు. జీవితంలో విజయం సాధించాలంటే మనిషి కష్టపడి పనిచేయవలసి ఉంటుంది.
- అల్లాహ్ ఆదేశాల మర్మాలన్నింటినీ మనం అర్థం చేసుకోలేము. మనకు తప్పుగా కనబడుతున్న విషయం నిజానికి ఒక అనుగ్రహం కావచ్చు. "తాను చేసేది అల్లాహ్‌కే బాగా తెలుసు".



# దైవమార్గంలో వదలివేయబడిన ఆవుదూడ



బనీ ఇస్రాయీల్ వారు బలి ఇచ్చిన అవు పూర్వ రంగం

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

బనీ ఇస్రాయిల్ ప్రజల్లో ఒక పుణ్యాత్ముడు నివసించేవాడు. అతను చాలా బీదవాడు. అయినప్పటికీ తన సంపాదన విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేవాడు. నీతిగా, నిజాయితీగా సంపాదించేవాడు. అతను చేసిన ప్రతి పనీ అల్లాహ్ ప్రసన్నత పొందడానికే చేశాడు. ఎన్నడూ స్వార్థంకోసం, తన అభీష్టాల ప్రకారం నడుచుకోలేదు.

ఆ వ్యక్తి చనిపోతున్నప్పుడు అతని చివరి పలుకులు, "అల్లాహ్! నా భార్యను, పసివాడైన నా కుమారుడిని, నా ఆస్తి అయిన ఆవుదూడను నీ సంరక్షణలో వదులుతున్నాను". ఈ మాటలు పలికిన ఆ వ్యక్తి విచిత్రంగా తన భార్యతో, "ఆవుదూడను తీసుకువెళ్ళి అడవిలో వదిలేసి రమ్మన్నాడు." అతను అలా చెప్పడానికి కారణం లేకపోలేదు. ఇస్రాయీల్ ప్రజల నడవడి గురించి తెలిసిన ఆ వ్యక్తి వారిని నమ్మదలచుకోలేదు. వారు స్వార్థం, అత్యాశ నిండిన జనం అన్న విషయం అతనికి బాగా తెలుసు.

కొన్ని సంవత్సరాలు గడచిపోయాయి. ఆ పిల్లవాడు పెరిగిపెద్దయ్యాడు. అప్పుడు అతని తల్లి కుమారుడితో, "మీ నాన్నగారు ఒక ఆవుదూడను అడవిలో వదలివేయమని చెప్పారు. అల్లాహ్‌పై భారమేసి వదిలేశాను. ఈ పాటికి ఆ దూడ పుష్టిగా

https://teluguislam.net



ఎదిగి ఉంటుంది" అని చెప్పింది. ఆ కుమారుడు కాస్త ఆశ్చర్యంగా ఆ ఆవుదూడ ఎక్కడ ఉందని తల్లిని ప్రశ్నించాడు. తల్లి అతడితో, "మీ నాన్న గారి అడుగు జాడల్లో నడవడానికి ప్రయత్నించు. అల్లాహ్‌ను విశ్వసిస్తున్నానని చెప్పు. అల్లాహ్‌పై భారం వేసి ఆ ఆవుదూడను వెదుకు" అని చెప్పింది. ఆ కుమారుడు ఒక తాడును తీసుకుని అడవికి బయలుదేరాడు. అడవికి చేరుకున్న తర్వాత అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడి, "అల్లాహ్! ఇబ్రాహీమ్, యాకూబ్‌ల ప్రభువా! నా తండ్రి అప్పగించిన దానిని నాకు తిరిగి అప్పగించు" అని ప్రార్థించాడు. అతను తన చేతిని ఎత్తిన వెంటనే అతనికి ఒక ఆవు తన వైపు వస్తున్నట్లు కనబడింది. ఆ ఆవు అతని వద్దకు వచ్చి మచ్చికైన ఆవు మాదిరిగా నిలబడింది. ఆ ఆవు మెడకు ఒక తాడు కట్టి అతను తనతో ఇంటికి తీసుకువచ్చాడు. ఆ ఆవు కూడా ఆ కుర్రాడిని తప్ప మరెవ్వరినీ తన వద్దకు రానిచ్చేది కాదు.

ఆ కుర్రవాడు కూడా తన తండ్రి మాదిరి పుణ్యాత్ముడు, సన్మార్గాన్ని అవలంబించేవాడు. కట్టెలు కొట్టడం ద్వారా జీవనోపాధి పొందేవాడు. తాను సంపాదించినదానిని మూడు సమానభాగాలు చేసేవాడు. ఒక భాగాన్ని తన తల్లికి ఇచ్చేవాడు. ఒక భాగాన్ని తన సొంతం కోసం ఉపయోగించుకునేవాడు. ఒక భాగాన్ని దానధర్మాలకు ఉపయోగించేవాడు. రాత్రి సమయాన్ని మూడు భాగాలుగా విభజించుకునేవాడు. రాత్రి ప్రథమ భాగంలో తన తల్లికి సహాయపడేవాడు. తర్వాతి భాగం ఆరాధనలో గడిపేవాడు. ఆ తర్వాతి సమయం నిద్రకు కేటాయించేవాడు.

## వారసుని హత్య

ఈ కాలంలో ఒక సంపన్నుడు మరణించాడు. అతనికి ఒకే ఒక్క కుమారుడు. తండ్రి యావదాస్తి ఆ కుమారునికి లభించింది. కాని అతని బంధువులకు కొందరికి కన్నుకుట్టింది. రహస్యంగా ఆ యువకుడిని హత్య చేశారు. ఆ విధంగా ఆ యావదాస్తిని తాము కాజేయాలనుకున్నారు. మరణించిన ఆ యువకుని బంధువుల్లో ఈ హత్యతో ప్రమేయం లేనివారు ప్రవక్త మూసా (అస) వద్దకు వచ్చారు. హంతకుణ్ణి కనుగొనడానికి సహాయపడమని కోరారు. మూసా (అస)



వారికి సలహా ఇస్తూ, ఒక ఆవును కోసి దాని నాలుకను ఆ యువకుడి శరీరంపై ఉంచాలని చెప్పారు. ఆ నాలుక హంతకుని గురించి తెలుపుతుందని అన్నారు. మూసా (అస) పరిహాసమాడుతున్నారని వాళ్ళు ఆయన్ను నిందించారు. మూసా (అస) వారికి జవాబిస్తూ, "అల్లాహ్ శరణు! నేను అవివేకంగా వ్యవహరించను" అన్నారు. ఎలాంటి ఆవును కోయాలని వాళ్ళు ఆయన్ను ప్రశ్నించారు. మూసా (అస) వారికి జవాబిస్తూ, మరీ లేగదూడ కారాదు, అలా అని పూర్తిగా ఎదిగిన ఆవు కూడా కారాదు అన్నారు. మధ్యస్థంగా ఉన్న దానిని కోయాలని చెప్పారు. కాని వాళ్ళు ఆయన సలహాను పాటించే బదులు, ఆ ఆవు ఎలా ఉండాలని మరిన్ని వివరాలు అడగడం ప్రారంభించారు. "ఆ ఆవు రంగు ఎలా ఉండాలి?" అని అడిగారు. "పసుపు రంగు కలిగినదై ఉండాలి" అన్నారు మూసా (అస). అయినా వారికి తృప్తి కలుగలేదు. మరిన్ని వివరాలు చెప్పమని అడిగారు. "ఆ ఆవు దుక్కి దున్నినది కారాదు. కాడి లాగినది కారాదు. నీళ్ళు తోడడానికి ఉపయోగించినది కారాదు. ఎలాంటి మచ్చలు ఉండరాదు" అన్నారు మూసా(అస).

అలాంటి ఆవు కోసం వాళ్ళు వెదుకుతూ బయలుదేరారు. ఈ లక్షణాలన్నీ ఉన్న ఆవు ఒకే ఒక్కటి దొరికింది. ఆ ఆవు అనాథ యువకుడి వద్ద ఉన్న ఆవు. వాళ్ళు అతని వద్దకు వెళ్ళి ఆ ఆవును ఎంతకు అమ్ముతావని ప్రశ్నించారు. ఆ యువకుడు తన తల్లితో అడిగి చెబుతానని అన్నాడు. వారంతా కలసి అతని ఇంటికి వచ్చి అతని తల్లితో మాట్లాడారు. ఆ ఆవుకు బదులుగా మూడు బంగారు నాణేలు ఇస్తామన్నారు. కాని ఆమె ఆ ప్రతిపాదనకు తిరస్కరించింది. వాళ్ళు ఆ ఆవు ధర పెంచుతూ పోయారు. కాని ఆమె అంగీకరించలేదు. చివరకు వాళ్ళు ఆమెను ఒప్పించమని యువకుడిని కోరారు. కాని అతడు అందుకు ఒప్పుకోలేదు. "నా తల్లి ఒప్పుకోకపోతే ఆవును అమ్మేది లేదు.. మీరు ఆవు ఎత్తు బంగారం ఇచ్చినా అమ్మను" అన్నాడు. ఈ మాటలు విన్న అతడి తల్లి చిరునవ్వుతో, "అంత సొమ్ము ఇవ్వండి.. ఆవు ఎత్తు బంగారం ఇచ్చి ఆవును తీసుకువెళ్ళండి" అంది. చివరకు వాళ్ళు ఆ గుర్తులన్నీ ఉన్న ఆవు అదొక్కటే కాబట్టి ఆవు ఎత్తు బంగారం ఇచ్చి కొనుక్కున్నారు.

(చదవండి దివ్యఖుర్‌ఆన్ 2 : 67-74)

https://teluguislam.net



## గ్రహించవలసిన పాఠాలు

- అల్లాహ్, ఆ యువకుడి తండ్రి తనకు అప్పగించిన దానిని తల్లి పట్ల సేవా భావం, దానగుణం కలిగి ఉన్న ఆ యువకునికి అనుగ్రహించాడు. అల్లాహ్‌ను విశ్వసించాలని కుమారుడికి బోధించిన ఆ తల్లినీ అనుగ్రహించాడు. ఈ పూర్తి వృత్తాంతం- దైవవిశ్వాసం విషయంలో-ఇస్రాయీల్ ప్రజలకు, మూసా ప్రవక్తకు ఒక పాఠంగా నిలిచింది.
- మరో ముఖ్యమైన పాఠం ఏమంటే, మూసా (అస) వారికి ఒక ఆవును కోయాలని చెప్పారు. ప్రత్యేకమైన ఆవు అని చెప్పలేదు. కాని వాళ్ళు ఇంకా వివరాలు కావాలని ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. అనవసరమైన ప్రశ్నలు వేశారు. వాళ్ళు ఈ రంధ్రాన్వేషణ చేయకుండా చెప్పిన విధంగా ఒక ఆవును కోసి ఉన్నట్లయితే వారికి ఎలాంటి సమస్యా ఉండేది కాదు. కాని అనవసరమైన ప్రశ్నల వర్షం వల్ల వారికి ఆ ఆవు చాలా ఖరీదైన ఆవుగా మారింది.

**నీతి:** గుచ్చిగుచ్చి అడగడం అన్నది చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది.



# మహా సంపన్నుడు ఖారూన్

(పూర్వకాలంలో కథకులు, గొప్ప సంపద అని చెప్పడానికి 'ఖారూన్ సంపద' అని పోల్చి చెప్పేవారు. అంటే సాటిలేని మహా సంపద అన్న భావంతో వాడేవారు.)



"చివరికి మేము ఖారూన్‌ను, అతని నివాసాన్ని నేలలో కూర్చివేశాము. అప్పుడు అల్లాహ్ బారి నుంచి అతన్ని ఆదుకోవటానికి ఏ సమూహమూ లేకపోయింది. మరి వాడు సయితం తనకు ఏ సాయమూ చేసుకోలేకపోయాడు."
**(ఖుర్ఆన్ 28 : 81)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఖారూన్, ప్రవక్త మూసా (అస) వంశానికి చెందినవాడు. చాలా సంపన్నుడు. ఒక మహా ప్రాసాదంలో భోగభాగ్యాలతో జీవించేవాడు. అత్యంత ఖరీదైన దుస్తులు ధరించేవాడు. అసంఖ్యాక బానిసలు ఎల్లప్పుడూ అతని సేవకు సిద్ధంగా ఉండేవారు. అన్ని రకాల సుఖవిలాసాలతో ఆడంబరంగా జీవితం గడిపేవాడు. అపారమైన ధన సంపత్తులు అతనిలో గర్వాన్ని పెంచాయి. అహంకారంతో విర్రవీగేవాడు.

ఖారూన్ బీదలను చూసి అసహ్యించుకునేవాడు. తెలివితేటలు లేకపోవడం వల్లనే వారు బీదరికంలో మగ్గుతున్నారని ఈసడించుకునేవాడు. తన తెలివితేటలు, వ్యాపార నైపుణ్యం వల్లనే తనకు అపార సంపద లభించిందని మిడిసిపడేవాడు.

జకాత్ చెల్లించవలసిందిగా ప్రవక్త మూసా(అస) అతడికి చెప్పారు. జకాత్ అన్నది బీదలకు ఒక హక్కుగా సంపన్నులు చెల్లించవలసిన నిర్ధారిత వాటా. విశ్వాసులందరూ తప్పనిసరిగా జకాత్ చెల్లించాలని అల్లాహ్ ఆదేశించాడు. కాని ఈ సలహా విన్న ఖారూన్ కోపంతో మండిపడ్డాడు. తనపై దేవుని అనుగ్రహం వర్షిస్తుందని, తన ధన సంపదలే అందుకు నిదర్శనమని ప్రవక్త మూసా (అస)తో చెప్పాడు. తన జీవిత విధానాన్ని

ఆమోదించినందువల్లనే దేవుడు తన సంపదను అనునిత్యం పెంచు తున్నాడని వాదించాడు. ప్రవక్త మూసా (అస) అతడికి నచ్చ జెప్పారు. దుర్మార్గపు ఆలోచనల పరిణామాలు నష్టదాయకంగా ఉంటాయని హెచ్చరించారు.

చివరకు ఖారూన్ తన సంపదపై జకాత్ లెక్కించాడు.★ జకాత్‌ను లెక్కిస్తే తాను చెల్లించవలసిన మొత్తం అతడికి చాలా ఎక్కువగా కనబడింది. అంత మొత్తం చెల్లించాలంటే ప్రాణాలు పోయినట్లనిపించింది. జకాత్ చెల్లించేది లేదని తిరస్కరించడమే కాదు, ప్రవక్త మూసా(అస) తన స్వార్థప్రయోజనాల కోసం జకాత్ చట్టం తీసుకొచ్చారని ప్రచారం మొదలుపెట్టాడు. ప్రవక్త మూసా(అస)కు వ్యతిరేకంగా ప్రజల అభిప్రాయాన్ని కూడగట్టడానికి కొంతమందికి లంచాలు కూడా ఇచ్చాడు. ప్రవక్త మూసా (అస) గురించి నానావిధాల పుకార్లు వ్యాపించేలా చేశాడు.

ఖారూన్ కుట్రల గురించి అల్లాహ్, ప్రవక్త మూసా(అస)ను హెచ్చరించాడు. ఖారూన్ పిసినారితనానికి, అల్లాహ్ చట్టాల పట్ల అతని తిరస్కారానికిగాను అతడిని శిక్షించాలని ప్రవక్త మూసా (అస) దేవుణ్ణి ప్రార్థించారు. అల్లాహ్ ఆగ్రహం ఖారూన్‌పై విరుచుకుపడింది. భూమి ఒక్కసారిగా పగులుబారి ఖారూన్‌తో సహా అతడి భవనాన్ని, యావత్తు సంపదను తనలో కలిపేసుకుంది. ఖారూన్ అనేవాడు ఒకప్పుడు ఉండేవాడన్న చిహ్నాలు కూడా లేకుండా అతడు తుడిచిపెట్టుకు పోయాడు. ఖారూన్ సంఘటన మూసా (అస) జాతి ప్రజలకు ఒక గుణపాఠంగా మిగిలి పోయింది.

ఈ విషయమై దివ్య ఖుర్‌ఆన్‌లో ఇంకా ఏముందంటే, ఖారూన్ సంపదను చూసి ఈర్ష్యపడిన వారు, అప్పటి వరకు ఖారూన్‌ను కీర్తించడమే ఘనకార్యంగా భావించిన వారు ఈ సంఘటన తర్వాత, "అల్లాహ్ ఎవరికి తలచుకుంటే వారికి సంపద ఇస్తాడు. ఎవరికి తలచుకుంటే వారికి నిరాకరిస్తాడు. మనపై అల్లాహ్ అనుగ్రహం లేనట్లయితే మనల్ని కూడా భూమి మ్రింగేసి ఉండేది. అల్లాహ్‌ను తిరస్కరించేవారు పురోభివృద్ధి సాధించలేరు. ఈ ప్రపంచంలో ఔన్నత్యాన్ని కోరుకోని వారికి, దుర్మార్గానికి పాల్పడని వారికి మాత్రమే పరలోక స్వర్గవనాలు లభిస్తాయి" అనడం ప్రారంభించారు.

★ *జకాత్ అంటే పేదల కోసం, సమాజ శ్రేయస్సు కోసం అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టవలసిన సొమ్ము.*



https://teluguislam.net

## గ్రహించవలసిన పాఠాలు

- ఖారూన్ వంటి వారు ప్రపంచంలో చాలా మంది ఉన్నారు. కొంతమంది నడమంత్రపు సిరి పొంది తమ పాత రోజులను, అప్పటి కష్టాలను మరచిపోతారు. తాము కష్టపడి, శ్రమించి తమ తెలివితేటలతో సంపాదించిందే అంతా అనుకుంటారు. అందులో దేవుని కారుణ్యం లేదని భావిస్తారు. అల్లాహ్ పట్ల ఏలాంటి కృతజ్ఞత చూపించరు. అల్లాహ్ ఆదేశాలను విస్మరిస్తారు. బీదసాదలకు ఏలాంటి సహాయం అందించడం వారికి ఇష్టం ఉండదు. పైగా తమ సంపదను పెద్ద భవనాలు కట్టడం ద్వారా, సంపన్నులకు గొప్ప విందులు ఇవ్వడం ద్వారా, అనవసరమైన ఆడంబరాల ద్వారా, ఖరీదైన దుస్తులు, వాహనాల ద్వారా ప్రదర్శిస్తూ విర్రవీగుతుంటారు. మరికొందరు ఇందుకు విరుద్ధంగా అత్యంత పిసినారులుగా మారిపోతారు. పిల్లికి బిచ్చమెత్తని ధోరణి ప్రదర్శిస్తారు. స్వంతం కోసం, తమ కుటుంబం కోసం ఖర్చుపెట్టడానికి కూడా వెనుకాడుతారు. సంపద పోగుచేయడంలోనే మునిగిపోతారు. కాని ఇలాంటి వారు తాము ఈ ప్రపంచంలో కేవలం కొంత సమయం గడిపి వెళ్ళడానికి వచ్చామన్న వాస్తవాన్ని మరచిపోతుంటారు.
- అల్లాహ్ నిర్దేశించిన వాటాను బీదలకు చెల్లించడం ద్వారా మనిషి తన సంపదను పరిశుద్ధం చేసుకుంటాడు. లేనట్లయితే సంపద కలుషితమైపోతుంది. సంపద ఒక శాపంగా మారిపోతుంది. తన మార్గంలో ఖర్చు చేసిన సంపదను అనేక రెట్లు పెంచి ఇస్తానని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. దాన ధర్మాలకు ఖర్చు చేసినది తనకు ఇచ్చిన ఉత్తమమైన రుణంగా అల్లాహ్ అభివర్ణిస్తున్నాడు. అల్లాహ్‌కు రుణం ఇచ్చి ఆయన నుంచి తిరిగి పొందడం అన్నది మనిషికి ఎంత గౌరవప్రదం! ఎంత శుభప్రదం!!
- అల్లాహ్ మనిషికి ధనసంపదలను ఒక పరీక్షగా అప్పగిస్తాడు (అమానత్- అంటే ఏదన్నా వస్తువును జాగ్రత్తగా ఉంచమని ఎవరికైనా అప్పగించడం). ధనసంపదలు కూడా అల్లాహ్ మనిషికి అప్పగించిన అమానత్ (అప్పగింత). తాను ఇచ్చిన ధనసంపదలతో ఎవరు ఏం చేస్తారన్నది చూడడానికి అల్లాహ్ వాటిని ప్రసాదిస్తాడు.

https://teluguislam.net



# తాలూత్

**మహారాజుగా మారిన పశువులకాపరి**

**(1030-1010 క్రీ.పూ.)**

> "అల్లాహ్ తాలూత్‌ను మీ రాజుగా నియమించాడ"ని వారి ప్రవక్త వారికి తెలియజేసినప్పుడు, "అతని అధికారం మాపై ఎలా నడుస్తుంది? రాజ్యాధికారానికి అతనికన్నా ఎక్కువ హక్కుదారులము మేమాయె! కనీసం అతనికి సిరిసంపదల్లో కూడా విస్తృతి వొసగబడలేదు" అని (సాకులు) చెప్పసాగారు. ప్రవక్త వారికి ఇలా నచ్చజెప్పాడు: "(చూడండి!) అల్లాహ్ అతన్నే మీపై (నాయకునిగా) ఎన్నుకున్నాడు. జ్ఞానపరంగా, శారీరకంగా కూడా అతనికి ఆధిక్యతను ప్రసాదించాడు. అల్లాహ్ తాను కోరిన వారికి రాజ్యాధికారం ఇస్తాడు. అల్లాహ్ విశాల సంపన్నుడు, జ్ఞాన సంపన్నుడు కూడా!" *(ఖుర్‌ఆన్ 2 :247)*

ఇస్రాయీల్ ప్రజలు తమ వద్ద ఉన్న పవిత్ర పెట్టె (మూసా కాలానికి చెందిన కొన్ని పవిత్రమైన వస్తువులు కలిగి ఉన్న బంగారు తాపడం ఉన్న పెట్టె - టాబర్నికల్) చాలా పవిత్రమైనదని, తమ చరిత్రకు సంబంధించి చాలా ముఖ్యమైన చిహ్నమని భావించేవారు. చివరకు యుద్ధాలలోను దానిని తీసుకుని వెళ్ళేవారు. దాని వల్లనే అల్లాహ్ తమను కాపాడుతున్నాడని నమ్మేవారు. ఈ నమ్మకం వల్ల వారికి మానసిక శాంతి, అపార ధైర్యసాహసాలు లభించేవి. దీని వల్ల వారి శత్రువులు కూడా భయ భీతులయ్యేవారు. దానికి అల్లాహ్ ప్రత్యేకమైన శక్తులు ప్రసాదించాడని వారి శత్రువులు భావించేవారు.

క్రమేణా ఇస్రాయీల్ ప్రజలు అల్లాహ్ ఆదేశాలను, చట్టాలను విస్మరించడం ప్రారంభించారు. చెడులు, దుర్నడతలు వారి జీవితాల్లో భాగాలుగా మారిపోయాయి. అల్లాహ్ వారిపై వారి శత్రువులను (పలస్తీనులను) పంపించాడు. ఇస్రాయీల్ ప్రజలను పలస్తీనులు ఓడించారు. వారి పవిత్రపెట్టెను స్వాధీనం చేసుకున్నారు. వారిని వారి ప్రాంతాల నుంచి వెళ్ళగొట్టారు. వారి సంతానాన్ని నిర్బంధించి బానిసలుగా మార్చారు. ఇస్రాయీలీల అధికారం,



ప్రాబల్యం అంతా అంతరించింది. వారు ఒకరికి ఒకరు కాకుండాపోయారు. నిరాశానిస్పృహలకు గురయ్యారు.

అప్పుడు ప్రవక్త శామ్యూల్ (అస)వారి వద్దకు వచ్చారు. ఆయన రాకతో వారికి కాస్త ఉపశమనం లభించింది. తమకు ఒక బలమైన నాయకుడి అవసరం ఉందని అందుకు ప్రవక్త సహకరించాలని వారు ఆయన్ను కోరారు. ఒక బలమైన నాయకుని పర్యవేక్షణలో తాము శత్రువులతో పోరాడాల్సి ఉందని చెప్పారు. కాని ప్రవక్త శామ్యూల్ (అస)కు వారి బలహీనతలు బాగా తెలుసు. అందువల్ల ఆయన వారితో, "పోరాడవలసిన సమయం వచ్చినప్పుడు మీరు వెనక్కి తగ్గుతారు" అన్నారు. కాని వారు ఆయనతో, తాము చాలా పరాభవాలు సహించామని, ఇప్పుడు అల్లాహ్ మార్గంలో పోరాడడానికి సిద్ధంగా ఉన్నామని, తమ ప్రాణాలు పోయినా ఫర్వాలేదని అన్నారు.

## ఇస్తిఖారా

ప్రవక్త శామ్యూల్ (అస) ఇస్తిఖారా (తగిన దారి చూపించాలని అల్లాహ్‌ను ప్రార్థించడం) చేశారు. అల్లాహ్ ఆయనకు మార్గం చూపిస్తూ తాలూత్ అనే వ్యక్తిని వారికి రాజుగా ఎంపిక చేయాలని ఆదేశించాడు. కాబోయే రాజును ఎలా గుర్తించాలని ప్రవక్త దేవుణ్ణి ప్రార్థించారు. తాలూత్ తానే స్వయంగా మీ వద్దకు వస్తారని అల్లాహ్ ఆయనకు తెలియజేశాడు. తాలూత్ వచ్చిన తర్వాత అధికారాన్ని ఆయనకు కట్టబెట్టాలని ఆదేశించాడు. శత్రువులతో జిహాద్‌కు ఆయన నాయకత్వం వహిస్తారని తెలిపాడు.

తాలూత్ పొడవైన బలిష్టమైన వ్యక్తి. చాలా తెలివి కలిగినవారు. మంచివారు. తన తండ్రితో పాటు పొలంలో పని చేస్తూ జీవించేవారు. ఒక రోజు వారి పశువుల్లో అనేక గాడిదలు తప్పిపోయాయి. వాటిని వెదుక్కుంటూ తన సేవకునితో కలసి తాలూత్ బయలుదేరారు. చాలా రోజులు ప్రయాణించి బాగా అలసి పోయారు. తన సేవకునితో, "ఇక వెనక్కి పోదాం.. నాన్నగారు కూడా చాలా కంగారు పడుతూ ఉంటారు. మిగిలిన పశువులను కూడా చూసుకో వలసి ఉంది కదా!" అన్నారు. సేవకుడు ఈ మాటలు విని, "మనం ఎలాగూ ప్రవక్త శామ్యూల్ ప్రాంతానికి వచ్చేశాం కదా, ఆయన వద్దకు వెళ్ళి తప్పిపోయిన గాడిదల గురించి అడిగి చూద్దాం" అన్నాడు. తాలూత్ అందుకు అంగీకరించారు. ఇద్దరూ కలసి

https://teluguislam.net



బయలుదేరారు. దారిలో వారు కొంతమంది బాటసారులను చూసి వారిని దారి అడిగారు. బాటసారులు వారికి దారి చూపిస్తూ, కనబడే కొండ వైపు వెళ్లమని చెప్పారు. అక్కడ ప్రవక్త శామ్యూల్ (అస) కోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. తాలూత్ అక్కడికి చేరుకున్నారు. ప్రవక్త శామ్యూల్‌ను చూడగానే తనలో కలిగిన పవిత్ర భావం వల్ల ఆయనే ప్రవక్తగా తాలూత్ పోల్చుకున్నారు. ప్రవక్త శామ్యూల్ (అస) కూడా తాలూత్‌ను చూడగానే అల్లాహ్ పంపిన రాజు ఈయనే అని గుర్తించారు. తాలూత్ మర్యాదపూర్వకంగా ప్రవక్త శామ్యూల్‌కు అభివాదం చేశారు. తప్పిపోయిన తన గాడిదల గురించి వాకబు చేశారు. ప్రవక్త శామ్యూల్ (అస) జవాబిస్తూ, తప్పిపోయిన గాడిదలు తిరిగి వారి పొలం వైపు వెళుతున్నాయని, వాటి గురించి కంగారు పడవలసింది ఏదీ లేదని అన్నారు. ఆ పిదప ఆయన తాలూత్‌కు ఇస్రాయీలీలకు రాజుగా అల్లాహ్ ఆయన్ను ఎన్నుకున్న విషయాన్ని తెలియజేశారు. కాబట్టి ఆయన ఇస్రాయీలీల వ్యవహారాలను చూడాలని, వారిని ఒక వేదికపై సమైక్యపరచాలని, వారి శత్రువుల నుంచి వారిని కాపాడాలని అన్నారు. అల్లాహ్ ఆదేశాలను పాటిస్తే తప్పక విజయం లభిస్తుందని చెప్పారు. అకస్మాత్తుగా తనకు లభించిన ఈ గౌరవం చూసి తాలూత్ ఆశ్చర్యపోయారు. పైగా ఇది చాలా పెద్ద బాధ్యత. ప్రవక్త శామ్యూల్‌కు జవాబిస్తూ, తాను బిన్‌యామిన్ వంశస్తుడననీ తెలియజేశారు. యాకూబ్ సంతానంలో అతితక్కువ పేరుప్రతిష్ఠలు కలిగిన వంశం బిన్‌యామిన్ వంశం. పైగా తనకు నాయకత్వం గురించి, రాజరికం గురించి ఏమీ తెలియదని, తన వద్ద సంపద కూడా ఏమీ లేదని అన్నారు. ప్రవక్త శామ్యూల్ (అస) ఆయనకు సమాధానమిస్తూ, రాజుగా బాధ్యతలు స్వీకరించడం అల్లాహ్ అభీష్టమని, తనకు లభించిన గౌరవానికిగాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపి, అల్లాహ్ పట్ల దృఢమైన విశ్వాసం కలిగి ఉండాలని చెప్పారు.

## అభ్యంతరాలు

తాలూత్ చేయి పట్టుకుని ప్రవక్త శామ్యూల్ స్వయంగా ప్రజల వద్దకు తీసుకుని వెళ్ళి ఆయన్ని ఎంపికైన రాజుగా ప్రకటించారు. "నిస్సందేహంగా అల్లాహ్ తాలూత్‌ను మీ రాజుగా నియమించాడు. కాబట్టి అతని ఆదేశాలను పాటించడం మీ బాధ్యత. అతను మిమ్మల్ని పాలిస్తాడు. మీ శత్రువులపై జిహాద్



(ధర్మయుద్ధం)లో మీకు నాయకత్వం వహిస్తాడు" అన్నారు. ఇస్రాయీల్ ప్రజలు ఈ ఎన్నిక చూసి ఆశ్చర్యపోయారు. "ఇతను బనీఇస్రాయీల్ రాజకుటుంబానికి చెందినవాడు కాదు. లెవి కుటుంబానికి చెందిన వాడు కూడా కాదు. కనీసం యహూదా రాజులకు చెందినవాడు కూడా కాదు. ఇతనికన్నా మా వద్ద ఎక్కువ సంపద, హోదాలు ఉన్నాయి" అని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రవక్త వారి అభ్యంతరాలను అడ్డుకుని, "సైనిక నాయకత్వానికి, రాజ్యపాలనకు సంపద హోదాలు అవసరం లేదు. సంపదను ఎలా ఉపయోగించాలో తెలియనప్పుడు సంపద ఉండి ప్రయోజనం ఏమిటి? తాలూత్‌కు నాయకత్వ లక్షణాలు ఉన్నాయి. మీకన్నా ఎక్కువ జ్ఞాన సంపద ఉంది కాబట్టి అల్లాహ్ అతన్ని మీకు రాజుగా ఎంపిక చేశాడు. అతనికి శారీరకబలం ఉంది. నైపుణ్యం ఉంది. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు. అత్యంత వివేకవంతుడు" అన్నారు. కాని ప్రజలు దేవుని వద్ద నుంచి ప్రత్యక్ష నిదర్శనం ఏదన్నా కావాలని ఒత్తిడి చేశారు.

## నిదర్శనం

ప్రవక్త వారితో పట్టణం బయటకు వెళ్ళి నిదర్శనాన్ని చూడమన్నారు. అందరూ ఆ నిదర్శనం చూడడానికి వెళ్ళారు. ఈ సంఘటనను దివ్యఖుర్ఆన్ ఇలా వర్ణించింది: "అల్లాహ్ నుంచి తాలూత్‌ను రాజుగా నియమించిన నిదర్శనం ఏమంటే, అతని పాలనాకాలంలో మీరు మీ పవిత్ర పెట్టెను తిరిగి పొందుతారు. అందులో మీ ప్రభువు తరపున మీకు మానసిక శాంతిని ప్రసాదించే సాధనాలున్నాయి. అందులో మూసా, హారూన్ కుటుంబానికి చెందిన పవిత్ర చిహ్నాలున్నాయి. ప్రస్తుతం దానిని దైవదూతలు మోస్తున్నారు. మీరు నిజమైన విశ్వాసులైతే ఇందులో మీకు గొప్ప నిదర్శనాలున్నాయి."

ప్రజలు ఆ వెంటనే తాలూత్‌ను తమ రాజుగా అంగీకరించి ప్రతిజ్ఞ చేశారు.

## సైన్యానికి పరీక్ష

తాలూత్ తన సైన్యాలను వ్యవస్థీకరించడం ప్రారంభించారు. దేవునిపై బలమైన విశ్వాసంతో, వివేకంతో సైన్యాన్ని తీర్చిదిద్దడం మొదలుపెట్టారు. ఎలాంటి బాధ్యతలు లేని పురుషులు సైన్యంలో చేరాలని ఆదేశించాడు. ఇంటి నిర్మాణం పనుల్లో ఉన్నవారు, పెళ్ళి చేసుకోబోతున్నవారు, వ్యాపార కార్యకలాపాల్లో ఉన్నవారు సైన్యంలో చేరనవసరం లేదన్నారు.

https://teluguislam.net



ఆ విధంగా ఒక సుశిక్షితమైన సైన్యాన్ని రూపొందించారు. వారిని ఇక పరీక్షకు నిలబెట్టాలని భావించారు. తమ దారిలో ఒక నదిని దాటవలసి ఉందని, నదిలో నీటిని దాహం తీర్చుకోడానికి తగినంత మాత్రమే తాగాలని అంతకన్నా ఎక్కువ తాగరాదని ఆదేశించారు. కాని వారు నదిలో నీటిని దాహం తీర్చుకోవడానికి అవసరమైన దానికంటే చాలా ఎక్కువగా తాగారని ఆయనకు తర్వాత తెలిసింది. వారి అవిధేయత కారణంగా ఆయన వారిని సైన్యం నుంచి తొలగించారు. తన ఆదేశా లను పాలించిన కొంత మందిని మాత్రమే సైనికులుగా నియమించుకున్నారు. ఎందుకంటే, వారు తమ నిజాయితీని నిరూపించుకున్నారు. కాని ఈ చర్య వల్ల సైన్యంలో చీలిక వచ్చింది. అయినా ఆయన లక్ష్యపెట్టలేదు. పెద్దసంఖ్యలో సైన్యం ఉండడంకన్నా ఆదేశాలు తూ.చా. తప్పక పాటించే కొందరు ఉండడమే మేలని భావించారు. అవిశ్వాసుల పెద్ద సైన్యం కన్నా గుప్పెడు మంది విశ్వాసు లపై ఆధారపడడమే ఉత్తమమని తలచారు.

నదికి అవలి వైపు శత్రుసైన్యాలను తాలూత్ సైనికులు చూశారు. శత్రువులు శారీరకంగా చాలా బలంగా కనిపించారు. వారి వద్ద ఆయుధబలం కూడా చాలా ఎక్కువగా కనబడింది. మహాపరాక్రమశాలి జాలూత్ (గోలియత్) వారికి నాయకత్వం వహిస్తున్నాడు. ఈ బలమైన సైన్యాన్ని చూడగానే తాలూత్ సైన్యం కకావికలయ్యింది. తాలూత్ వెంట మిగిలిన కొద్దిమంది సైనికులు మాత్రం అన్నిటికి తెగించి పోరాడడానికి సిద్ధమయ్యారు. అల్లాహ్ అనుగ్రహం వల్ల చిన్న సైన్యం చేతిలో పెద్ద పెద్ద సైన్యాలు ఓడిపోయిన సంఘటనల గురించి వారు విని ఉన్నారు. వారు అల్లాహ్‌ను ప్రార్థించారు, “ప్రభూ! మాకు దృఢమైన సంకల్పాన్ని ప్రసాదించు. మా అడుగులకు బలాన్నివ్వు. నిన్ను విశ్వసించని వారిపై మాకు విజయం ప్రసాదించు” అని వేడుకున్నారు.

(మిగిలిన కథ తరువాతి అధ్యాయంలో చూడగలరు)



# ప్రవక్త దావూద్ - జాలూత్

(డేవిడ్ & గోలియత్)

(1030-970 క్రీ.పూ.)

**మహాకాయుడిని ఓడించిన బాలుడు**



“దావూద్ జాలూత్‌ను వధించాడు.”
(ఖుర్‌ఆన్ 2 : 251)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

రెండు సైన్యాలు ఒకదానిని ఒకటి ఢీకొన్నప్పుడు, జాలూత్ ద్వంద్వ యుద్ధానికి సవాలు చేశాడు. తాలూత్ సైన్యంలో ఎవరైనా సరే తనతో తలపడాలన్నాడు (ఆ కాలం యుద్ధాల సంప్రదాయం ఇది. మహాకాయుడైన జాలూత్ తన బలాన్ని ప్రదర్శించాలనుకున్నాడు). అతడిని చూసి తాలూత్ సైనికులు భీతిల్లారు. సవాలు ఎదుర్కునే ధైర్యం ఎవరూ చేయలేకపోయారు.

సైనికులను ప్రోత్సహించడానికి రాజు ఒక ప్రకటన చేస్తూ, జాలూత్‌తో పోరాడినవారికి తన అందమైన కుమార్తెను ఇచ్చి వివాహం చేస్తానన్నారు. కాని ఈ ప్రకటన కూడా బెంబేలెత్తిన సైన్యంలో కొత్త ఉత్సాహాన్ని నింపలేకపోయింది. అప్పుడే, ఆశ్చర్యకరంగా ఒక బాలుడు ముందుకు వచ్చాడు. అతడిని చూసి శత్రు సైన్యం పకపక నవ్వడం ప్రారంభించింది. చివరకు తాలూత్ సైనికులు కూడా ఆ బాలుణ్ణి తక్కువగానే చూశారు.

ఆ బాలుడిపేరు దావూద్ (డేవిడ్). బెత్లెహామ్ పట్టణానికి చెందినవాడు. ముసలివాడైన అతని తండ్రి తన ముగ్గురు కుమారులను తాలూత్ సైన్యంలో పంపాడు. అందరికన్నా చిన్నవాడైన దావూద్‌ను పోరాటంలో పాల్గొనవద్దని ప్రత్యేకంగా చెప్పాడు. సైన్యానికి

https://teluguislam.net



ఇతర విధాలుగా సహాయం చేయాలని, ప్రత్యక్ష పోరాటంలో పాల్గొనరాదని తండ్రి చెప్పి పంపించాడు. యుద్ధరంగంలో ఏం జరుగుతుందో తండ్రికి ఎప్పటికప్పుడు చెప్పాలని కూడా నిర్దేశించాడు.

ఆ బాలుని ధైర్యం తాలూత్‌కు చాలా నచ్చింది. బాలునికి సలహా ఇస్తూ, "నీ ధైర్యాన్ని అభినందిస్తున్నాను. కాని ఆ యుద్ధవీరుడికి నీవు సరిజోడి కావు. బలమైన సైనికులు ముందుకు వస్తార్లే" అన్నారు. కాని దావూద్ మాత్రం పోరాడాలనే నిర్ణయించుకున్నాడు. తాను అంతకు ముందు రోజునే ఒక సింహాన్ని చంపానని, తమ గొర్రెలను తినడానికి వచ్చిన సింహాన్ని మట్టి కరిపించానని, అంతకు ముందు ఒక ఎలుగుబంటిని కూడా చంపానని, తన ఆకారం చూసి తనను తక్కువగా అంచనా వేయవద్దని, తాను మనుష్యులకు గాని, క్రూర జంతువులకు గాని ఎవరికీ భయపడనని ధైర్యంగా తాలూత్‌కు జవాబిచ్చాడు. తాలూత్ ఈ మాటలు విని అతని ధైర్యానికి ఆశ్చర్యపోయారు. "నీ ధైర్యాన్ని ప్రశం సిస్తున్నాను. నీవు నిర్ణయించుకుంటే, అల్లాహ్ నీకు శక్తిని ప్రసాదించి కాపాడుగాక!" అన్నారు.

రాజుగారు దావూద్‌కు కవచం తొడిగి, ఖడ్గం చేతికిచ్చారు. యుద్ధరంగ దుస్తులు ధరించే అలవాటు దావూద్‌కు లేదు. ఆ దుస్తులు చాలా అసౌకర్యంగా అనిపించాయి. పైగా ఆ దుస్తుల్లో కదలడం కూడా కష్టంగా ఉంది. అందువల్ల కవచం తీసిపారేశారు. తర్వాత కొన్ని రాళ్ళు సేకరించి తన తోలుసంచిలో వేసుకున్నారు. ఆ సంచిని తన భుజానికి తగిలించుకున్నారు. వడిసెల పక్కన వేలాడదీసుకున్నారు. చేతిలో ఉన్న కర్రతో శత్రువు వైపు నడవడం ప్రారంభించారు. తాలూత్ ఆందోళనతో, "వడిసెల, కంకరరాళ్ళతో ఆ మహాకాయుడిని ఎలా ఎదుర్కొం టావు?" అనడిగారు. దావూద్ జవాబిస్తూ, "ఎలుగుబంటి గోళ్ళ నుంచి, సింహం పంజా నుంచి నన్ను కాపాడిన అల్లాహ్ తప్పకుండా ఈ మహాకాయుడి నుంచి కూడా కాపాడుతాడు" అన్నారు.

## అపహాస్యం

తన వైపు వస్తున్న బాలుడిని చూసి జాలూత్ బిగ్గరగా నవ్వుతూ, "నీ తోటి కుర్రాళ్ళతో కర్ర యుద్ధం చేయడానికి వస్తున్నావా? లేక బతకడం చికాకనిపించి చావడానికి వస్తున్నావా? నా ఖడ్గంతో ఒకేఒక్క వేటుతో నీ తలను మొండెం నుంచి వేరుచేస్తాను" అన్నాడు. దావూద్ జవాబిస్తూ, "నీ దగ్గర కవచం, డాలు, ఖడ్గం,



విల్లంబులు ఉండొచ్చు. కాని నేను అల్లాహ్ పేరుతో పోరాడ్డానికి వస్తున్నాను. ఆయన ఆదేశాలను నువ్వు అపహాస్యం చేశావు. ఈ రోజు ప్రాణాలు తీసేది కత్తి కాదని, అల్లాహ్ అభీష్టమేనని నువ్వు తెలుసుకుంటావు" అంటూ తన వడిసెల తీసి అందులో ఒక రాయి ఉంచి జాలూత్ వైపు గురిచూసి విసిరారు. వడిసెల నుంచి రివ్వున బయలుదేరిన రాయి శరవేగంగా జాలూత్ తలకు తగిలింది. నెత్తురు ధారగా బయటకు చిమ్మింది. జాలూత్ ఆ దెబ్బకు దిమ్మెరపోయి నేలపై పడ్డాడు. అతను ఖడ్గాన్ని తీసే సమయం కూడా అతనికి దక్కలేదు. నేలపై పడిన వాడు అలాగే ప్రాణాలు కోల్పోయాడు. తమ సైన్యాధిపతి ఈ విధంగా హతం కావడం చూసిన సైన్యం కాలికి బుద్ధి చెప్పింది. వారిని ఇస్రాయీల్ సైనికులు వెంటాడడం ప్రారంభించారు. శత్రువుల చేతుల్లో అనేక సంవత్సరాలుగా పడిన బాధలకు ప్రతీకారం తీర్చుకోవడం మొదలుపెట్టారు. తమ వల్ల సాధ్యమైనంత మంది శత్రుసైనికులను హతమార్చారు. ఈ యుద్ధంలో ఇస్రాయీలీలు తాము చాలా కాలం క్రితం పోగొట్టుకున్న గౌరవాన్ని, అధికారాన్ని తిరిగి సంపాదించుకున్నారు. దావూద్ పేరు కూడా మారుమ్రోగిపోయింది. తాలూత్ తన మాట నిలబెట్టుకుని తన కుమార్తె మికెల్‌ను దావూద్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆయన్ని తన ముఖ్య సలహాదారునిగా నియమించుకున్నారు. తాలూత్ మరణించిన తర్వాత దావూద్ రాజుగా బాధ్యతలు స్వీకరించారు. (దివ్యఖుర్‌ఆన్ 2:251)

### గ్రహించవలసిన పాఠాలు

- తాలూత్ ఒక పశువుల కాపరి. అల్లాహ్ ఆయన్ని ఉన్నత స్థానానికి చేర్చాడు.
- నాయకుడిని వంశం ఆధారంగా, తెగ ఆధారంగా, కుటుంబం ఆధారంగా ఎన్నుకోవడం జరగదు. రాజ్యపాలనా భారాన్ని మోసే యోగ్యత ఆధారంగా ఎన్నుకోవడం జరుగుతుంది.
- మహాప్రవక్త ముహమ్మద్ (స) ఏమన్నారంటే, "తనకన్నా అర్హత, యోగ్యతలున్న వారు చాలామంది ఉన్నారని తెలిసి కూడా అధికారం కోసం ప్రయ

https://teluguislam.net



త్నించే వ్యక్తి అల్లాహ్‌ను, అల్లాహ్ ప్రవక్తను, విశ్వాసులను మోసగించే వాడు." అంతేకాదు, అధికారం కోసం ప్రయత్నించే వ్యక్తి విషయంలో జాగ్రత్తగా ఉండాలని కూడా ఆయన హెచ్చరించారు.

- ప్రవక్త ముహమ్మద్ (స) ముఖ్య సహచరుల్లో ఒకరైన హజ్రత్ అబూ బకర్ (రజి) తాను ఖలీఫాగా నియమించబడినప్పుడు ప్రజలను ఉద్దేశించి, "నేను మీకన్నా గొప్పవాడిని కాబట్టి నన్ను ఖలీఫాగా నియమించారని భావించవద్దు. మీ వ్యవహారాల్లో నేను అల్లాహ్‌కు, అల్లాహ్ ప్రవక్తకు విధేయంగా పని చేస్తే నాకు సహాయం చేయండి. నేను అవిధేయంగా వ్యవహరిస్తే నన్ను సరిచేయండి"అని అన్నారు.
- రాజ్యవ్యవహారాల్లో సైనికబలం కన్నా నైపుణ్యం ముఖ్యమైనది.



# మధురస్వరం కలిగిన పాలకుడు

"మేము పర్వతాలను అతని (దావూద్) అదుపులో పెట్టాము. అవి అతనితోపాటే సాయంత్రం పూట, ఉదయం పూట (మా) పవిత్రతను కొనియాడేవి. అలాగే, పక్షులను కూడా గుమి గూడిన స్థితిలో. అవన్నీ కలసి అతనితోపాటే (అల్లాహ్ వైపుకు) మరలేవి."

*(ఖుర్ఆన్ 38 : 18, 19)*

దావూద్ ప్రవక్త న్యాయశీలి. ప్రజా రంజకులైన పాలకులు. శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లేలా రాజ్యాన్ని పాలించారు. ఆయన్ను అల్లాహ్ తన ప్రవక్తగా ఎన్ను కున్నాడు. అల్లాహ్ సందేశాన్ని ఆయన ప్రజలకు వినిపించేవారు. అల్లాహ్ ఆయ నకు మధురమైన స్వరాన్ని ప్రసాదిం చాడు. ఆయన జబూర్ గ్రంథాన్ని పఠి స్తుంటే ప్రకృతి అంతా తలవూపుతున్నట్లు ఉండేది. ప్రజలు మంత్రముగ్ధులై వినే వారు. దావూద్ ప్రవక్త ప్రజలకు చేరవేసిన దైవసందేశం అత్యంత ప్రజాదరణ పొందింది. ప్రజలు ఆ సందేశాన్ని చక్కగా గుర్తుంచుకునేవారు (వీటిని బైబిలులో "పత్రాలు"గా, "దావూద్ పాటలు"గా పేర్కొనడం జరిగింది).

దావూద్ (అస) తన రోజువారీ కార్యక్రమాలను నాలుగు భాగాలుగా విభజించారు. తన ఉపాధి సంపాదించుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి ఒక భాగం కేటాయించేవారు. అల్లాహ్‌ను ఆరాధించడానికి ఒక భాగం కేటాయించేవారు. ప్రజల సమస్యలు వినడానికి ఒక భాగం కేటాయించేవారు. తన ప్రసంగాల కోసం ఒక భాగాన్ని కేటాయించేవారు. ప్రజల ఫిర్యాదులు స్వీకరించడానికి ఆయన కొంతమంది అధికారులను కూడా నియమించారు.

ఆ విధంగా తాను లేనప్పుడు ప్రజల సమస్యలు నిర్లక్ష్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయన రాజ్యాన్ని పాలించే రాజయినప్పటికీ ఖజానా సొమ్ము తన కోసం ఉపయోగించేవారు కాదు. ఆయుధాలు తయారు చేసే విద్యలో ఆయన నిష్ణాతులు. ఆయుధాలు తయారు చేసి వాటిని అమ్మి ఆ ఆదాయంతో జీవించేవారు.

దివ్యఖుర్‌ఆన్‌లో క్రింది సంఘటన వర్ణించబడింది:

"ఇద్దరు వ్యక్తులు ఫిర్యాదులు స్వీకరించే సమయంలో వచ్చారు. కాని వారిని రాజప్రాసాదంలో ప్రవేశించకుండా రాజభటులు అడ్డుకున్నారు. వారిద్దరూ రాజప్రాసాదం చుట్టూ తిరిగి గోడ ఎక్కి రాజుగారి ఆంతరంగిక గదిలోకి ప్రవేశించారు. వారిని చూసి దావూద్ ప్రవక్త కంగారుపడ్డారు. తనకు హాని కలిగించడానికి వచ్చినవారని భావించారు. కాని వారెందుకు వచ్చారో తెలిసిన తర్వాత ఆయనకు నెమ్మది కలిగింది. "మేమిద్దరం ఒక ఫిర్యాదు తీసుకుని వచ్చాము. మా మధ్య ఒక వివాదం ఉంది. మీరు తీర్పు చెప్పాలి" అని వారిలో ఒకడు అన్నాడు. రెండవ వాడు, "ఇతను నా సోదరుడు, ఇతనికి తొంభైతొమ్మిది గొర్రెలున్నాయి. నా వద్ద కేవలం ఒక్కటే ఉంది. నాకు మాయమాటలు చెప్పి నా ఒక్క గొర్రెను తీసేసుకున్నాడు" అన్నాడు. దావూద్ జవాబిస్తూ, "తన వద్ద చాలా గొర్రెలున్నప్పటికీ నీ గొర్రె కూడా తీసుకుని అతను తప్పు చేశాడు. చాలామంది ఇతరులను అణచివేస్తుంటారు, అల్లాహ్ పట్ల విశ్వాసం కలిగినవారు, మంచి పనులు చేసేవారు తప్ప. కాని అలాంటి వారు చాలా తక్కువ మంది ఉన్నారు" అని చెప్పారు. ఈ మాటలు చెప్పిన వెంటనే దావూద్‌కు తాను చెప్పిన మాటల్లోని తప్పు గుర్తుకు వచ్చింది. ఆయన రెండవవాని కథనం వినకముందే తన తీర్పు చెప్పేశారు. వెంటనే ఆయన అల్లాహ్ ముందు సాష్టాంగపడి క్షమాపణ వేడుకున్నారు. అల్లాహ్ ఆయన తప్పును క్షమించి విధి బాధ్యతల నిర్వహణలో ఆయనకు మార్గదర్శనాన్ని ప్రసాదించాడు." *(చదవండి దివ్యఖుర్‌ఆన్ 38:21-26)*

https://teluguislam.net



## గ్రహించవలసిన పాఠాలు

- బలహీనంగా కనబడేవారి చేతిలో మహాబలశాలి కూడా మట్టికరవడం జరగవచ్చు.
- దావూద్ ప్రవక్త అల్లాహ్‌కు ఎంతగా భయపడేవారంటే, రాజుగా ఉన్నప్పటికీ, ఖజానా సొమ్ము వాడుకునే హక్కు తనకు ఉన్నప్పటికీ తన స్వంత సంపాదనతోనే జీవించేవారు.
- బైబిలు ప్రకారం, దావూద్ తన సైన్యాధికారుల్లో ఉరైహ్ అనే సైన్యాధికారి భార్యను ప్రేమించారు. ఫలితంగా ఆమె గర్భవతి అయ్యింది. ఆయన ఆ సైన్యాధికారిని ఒక ప్రమాదకరమైన యుద్ధమైదానానికి పంపించివేశారు. అక్కడ ఆ అధికారి చంపబడతాడని భావించారు. అప్పుడు అతని భార్యను తాను వివాహం చేసుకోవచ్చునుకున్నారు. కాని ఈ కథనం చాలా వక్రీకరణతో, బురదజల్లే కథనంలా ఉంది. బైబిలులో అనేకమంది ఇతర ప్రవక్తల గురించి కూడా ఇలాంటి బురదజల్లే కథనాలు ఉన్నాయి. ఈ విధంగా అక్రమ సంబంధాలు, అమాయకుడిని హతమార్చే కుట్రలు ఒక ప్రవక్తకు అంటగట్టడం దారుణం.

https://teluguislam.net



# మహావివేకి లుక్మాన్



మంచికైనా చెడుకైనా మనిషి నాలుక, హృదయాలే మూలమని చెప్పిన మహానుభావుడు లుక్మాన్

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

లుక్మాన్ (అస) ఆఫ్రికా ఖండంలో జన్మించారు. ఆయన అడవుల్లో పెరిగి పెద్దయ్యారు. అడవుల్లో కాలికి చెప్పులు కూడా లేకుండా తిరిగేవారు. కేవలం ఒక వస్త్రాన్ని చుట్టుకుని అడవుల్లో వన్య మృగాలతో పాటు ఉండేవారు. అడవిలో జీవితం, రోజూ అడవి మృగాలతో తల పడడం - ఈ విధంగా ఆయన కఠిన మైన జీవితాన్ని గడిపేవారు. భయం అంటే ఎరుగని వ్యక్తిత్వాన్ని సంతరించుకున్నారు. తన చుట్టూ ఉన్న ప్రకృతి గురించి దీర్ఘంగా ఆలోచించేవారు. ఈ ఆలోచనల వల్ల అనేక కొత్త విషయాలను ఆయన తెలుసుకున్నారు.

## బానిసత్వం

ఆఫ్రికాపై దండెత్తిన బానిస వ్యాపారులు ఆయన్ను నిర్బంధించారు. ఆయన్ను ఒక బానిసగా అమ్మివేశారు. తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోల్పోయారాయన. స్వేచ్ఛగా తిరగడానికి లేదు, మాట్లాడడానికి లేదు. జీవితంలో ఎదురైన ఈ కష్టాన్ని ఆయన భరించారు, సహనం వహించారు. అల్లాహ్ అనుగ్రహం కోసం ఎదురుచూడసాగారు. ఆయన్ను కొనుక్కున్న వ్యక్తి మంచి మనిషి. తెలివి, వివేకం కలిగినవాడు. అతను లుక్మాన్‌ను దయగా చూసేవాడు. లుక్మాన్ (అస) సాధారణమైన వ్యక్తి కాదని అతను గుర్తించాడు. లుక్మాన్



వివేకానికి ఒక పరీక్ష పెట్టాలనుకున్నాడు. ఒక రోజు లుక్మాన్‌ను పిలిచి గొర్రెను కోసి అందులో అత్యంత చెడ్డ భాగాలు తన వద్దకు తీసుకురమ్మన్నాడు. లుక్మాన్ (అస) ఒక గొర్రెను కోసి దాని గుండె, నాలుకలను తీసుకుని యజమాని వద్దకు వెళ్ళారు. లుక్మాన్ తీసుకొచ్చిన వాటిని చూసి యజమాని మెచ్చుకోలుగా చిరునవ్వు నవ్వాడు. శరీరంలో అత్యంత చెడ్డ భాగాలుగా గుండె, నాలుకలను తీసుకు వచ్చిన ఎన్నిక ఆయనకు నచ్చింది. లుక్మాన్ (అస) చాలా లోతయిన విషయాన్ని ఈ విధంగా చెప్పారని అతను అర్థం చేసుకున్నాడు. అప్పటి నుంచి యజమాని లుక్మాన్ (అస) పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడం ప్రారంభించాడు. ఆయన్ను మరింత ఆదరంగా చూడసాగాడు.

కొన్ని రోజుల తర్వాత యజమాని లుక్మాన్‌ను మళ్ళీ పిలిచి ఈసారి గొర్రెను కోసి దానిలో అత్యంత ఉత్తమమైన అవయవాలు తీసుకురమ్మన్నాడు. లుక్మాన్ యజమాని చెప్పినట్టు చేశారు. కాని విచిత్రంగా ఈసారి కూడా గొర్రె గుండె, నాలుకలే తీసుకువచ్చారు. యజమాని వాటిని చూసి శరీరంలో అత్యంత చెడ్డ భాగాలు, మంచి భాగాలు రెండు కూడా ఇవే ఎలా అవుతాయని ప్రశ్నించాడు. లుక్మాన్ (అస) యజమానికి సమాధానమిస్తూ, "మనిషి మంచివాడైతే అతని గుండె, నాలుకలు చాలా ఉత్తమమైన భాగాలు, మనిషి చెడ్డవాడైతే అతని గుండె, నాలుకలు అత్యంత చెడ్డ భాగాలు" అన్నారు. ఈ సంఘటన తర్వాతి నుంచి యజమాని లుక్మాన్ పట్ల అత్యంత గౌరవాదరాలు చూపడం ప్రారంభించాడు. చాలామంది లుక్మాన్ వద్దకు సలహా కోసం కూడా వచ్చేవారు. ఆయన వివేక విచక్షణలు, తెలివితేటలు యావత్తు రాజ్యంలో మారు మోగిపోసాగాయి.

## స్వేచ్ఛ

యజమాని తన కుటుంబ సభ్యులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాడు. తన మరణానంతరం లుక్మాన్ (అస)కు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని చెప్పాడు. యజమాని మరణించిన తర్వాత లుక్మాన్(అస)కు స్వాతంత్ర్యం లభించింది. ఆయన (అస) అక్కడి నుంచి బయలుదేరి చాలా ప్రాంతాలు తిరిగి చివరకు బనీఇస్రాయీల్ వద్ద స్థిరపడ్డారు. దావూద్ (అస) పాలనా కాలంలో ఆయన న్యాయమూర్తిగా నియమించబడ్డారు. మహావివేకంతో, విచక్షణతో, నిష్పక్షపాతంగా ఆయన ఇచ్చే తీర్పులు చాలా ప్రసిద్ధి పొందాయి. అక్కడే ఆయన పెళ్ళి చేసుకుని సంసార జీవితాన్ని గడిపారు.

లుక్మాన్ తన కుమారుడికి చేసిన బోధ దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా ప్రస్తావించ బడింది:

> లుక్మాన్ తన కుమారునికి హితబోధ చేసిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకో, అప్పుడు అతను ఇలా అన్నాడు: "కుమారా! అల్లాహ్‌కుఃభాగ స్వాములను ఎవరినీ చేర్చకు. నిజం ఏమిటంటే, ఇతరులను అల్లాహ్‌కు భాగ స్వాములుగా చేర్చటం పరమ దుర్మార్గం."
>
> "కుమారా! ఒక వస్తువు, అది ఆవగింజంతటిదైనప్పటికీ కొండ రాయి లోగాని, ఆకాశాలలోగాని, భూమిలోగాని, ఎక్కడ దాగి ఉన్నప్పటికీ, అల్లాహ్ దానిని బయటికి తీసుకువస్తాడు. ఆయన సూక్ష్మగ్రాహి మరియు సర్వజ్ఞుడు. కుమారా! నమాజును స్థాపించు, మంచిని ఆజ్ఞాపించు, చెడు పనుల నుంచి నిరోధించు, ఏ కష్టం కలిగినా దానికి సహనం వహించు. ఈ విషయాలు ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన విషయాలు. ప్రజలతో ముఖం ప్రక్కకు త్రిప్పి మాట్లాడకు, భూమిపై నిక్కుతూ నడవకు. అహంభావి, బడాయికోరు అయిన ఏ వ్యక్తినీ అల్లాహ్ ప్రేమించడు. నీ నడకలో సమమైన తూకం పాటించు. నీ కంఠస్వరాన్ని తగ్గించు, అన్ని స్వరాలకంటే అతి చెడ్డ స్వరం గార్దభాల స్వరం."
>
> *(దివ్యఖుర్‌ఆన్ : 31 : 13-19)*

### గ్రహించవలసిన పాఠాలు

- మనిషి మంచివాడు లేదా చెడ్డవాడన్నది అతని హృదయం, నాలుకల వల్ల తెలుస్తుంది. ఈ రెండు అవయవాలను ఎలా వాడాలన్నది మనిషి చేతుల్లో ఉంది.
- మంచి యజమాని తన వద్ద ఉన్న వివేకవంతులైన నౌకర్లను గౌరవించాలి.
- లుక్మాన్ తన కుమారునికి ఇచ్చిన సలహాను అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో ప్రస్తావించి మానవాళికి ఒక ఉదాహరణగా చూపించాడు. ఈ సలహాను యావత్తు మానవాళి మార్గదర్శక సూత్రంగా అనుసరించవలసి ఉంది.

https://teluguislam.net



## 'సబ్బత్' నియమాన్ని అతిక్రమించడం



" (ఇస్రాయీల్ జాతివారు) శనివారం నాటి విషయంలో హద్దుమీరి ప్రవర్తించేవారు. మరి ఆ శనివారం నాడే చేపలు పైపైకి తేలియాడుతూ వారి ముందుకు వచ్చేవి. శనివారం కాని దినాలలో అవి వారి ముందుకు వచ్చేవి కావు. వారి అవిధేయత మూలంగా మేము వారిని ఈ విధంగా పరీక్షకు గురి చేసేవారము."

**(ఖుర్‌ఆన్ 7 : 163)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఇస్రాయీల్ ప్రజలు వారంలో ఒక రోజు తమ పనులన్నింటినీ మానుకోవాలని ప్రవక్త మూసా (అస) బోధించారు. అలా పనులన్నింటినీ మానుకునే రోజును 'సబ్బత్' అంటారు. సబ్బత్ రోజున అన్ని పనులు మానుకుని కేవలం అల్లాహ్‌ను ఆరాధించవలసి ఉంది. అల్లాహ్ తమపై కురిపించిన అనుగ్రహాలకు కృతజ్ఞతలు చెల్లించవలసి ఉంది. ఈ విధంగా చేయడం వల్ల వారి హృదయాలు పరిశుద్ధమవుతాయని ఆయన బోధించారు. యూదులు శనివారాన్ని తమ సబ్బత్ రోజుగా ఎన్నుకున్నారు. ఈ సంప్రదాయాన్ని అనేక తరాలు ఆచరించాయి.

ప్రవక్త దావూద్ (అస) కాలంలో ఎలాత్ ప్రాంతంలో కొందరు ఇస్రాయీల్ ప్రజలు నివసించేవారు. ఎలాత్ ఎర్ర సముద్ర తీరాన ఉన్న ఒక పట్టణం. వారంతా చేపలు పట్టే జాలర్లు. సబ్బత్ రోజున సముద్రంలో చేపలు రెండు శిలల మధ్య గుమిగూడి గుంపులు గుంపులుగా కనబడడాన్ని వాళ్ళు చూశారు.

సబ్బత్ రోజున జాలర్ల వలలు తమను ఏమీ చేయవన్న విషయం వాటికి తెలిసినట్లు, ఆ రోజునే అవి తీరానికి వచ్చి ఊరించేవి. వాటిని చూసి కొందరు

జాలర్లు నిగ్రహాన్ని కోల్పోయారు. అత్యాశతో చివరకు వాళ్ళు సబ్బత్ నియమాన్ని అతిక్రమించాలని నిర్ణయించుకున్నారు.

ఒక సబ్బత్ రోజు ఉదయం ఈ జాలర్లు చేపలు పట్టడానికి వెళ్ళారు. కాని దైవభయం కలిగిన ప్రజలు ఈ విషయం గురించి తెలిసి దైవాదేశాలను అతిక్రమించవద్దని వారికి హితోపదేశం చేశారు. కాని దురాశకు గురయిన జాలర్లు వినలేదు. అందువల్ల పట్టణం నడిబొడ్డున ఒక గోడ నిర్మించి సబ్బత్ పాటించే ప్రజలు, సబ్బత్‌ను అతిక్రమించిన ప్రజలుగా పట్టణాన్ని విభజించడం జరిగింది. అల్లాహ్ శిక్ష తమపై ఎక్కడ పడుతుందో అని మంచివాళ్ళు భయపడ్డారు.

దుర్మార్గులు ప్రతి సబ్బత్ రోజున నిర్భయంగా, నిస్సంకోచంగా చేపల వేట కొనసాగించేవారు. చివరకు వాళ్ళు తమ ఇళ్ళకు దగ్గరగా కందకాలు తవ్వి సముద్రం నీటినుంచి చేపలు తమ ఇళ్ళ దగ్గరి వరకు వచ్చేలా చేసేవారు. ప్రవక్త దావూద్ (అస) స్వయంగా వారిని హెచ్చరించడానికి వెళ్ళారు. అల్లాహ్ ఆదేశాలను అతిక్రమిస్తే అల్లాహ్ శిక్ష వారిని పట్టుకుంటుందని నచ్చజెప్పారు. కాని వారు వినలేదు. వారి వైఖరిని చూసి కొందరు వారిని వారి ఖర్మకు వదలివేయడమే మంచిదని చెప్పారు.

ప్రవక్త దావూద్ (అస) ఈ విషయమై దేవుని సహాయం కోసం ప్రార్థించారు. చివరకు ఒక పెద్ద భూకంపం నగరాన్ని కుదిపేసింది. సబ్బత్ నియమ ఉల్లంఘన పాపాన్ని సహించిన విశ్వాసులు కూడా ఆ భూకంపం ప్రభావానికి గురయ్యారు. దుర్మార్గులు పాల్పడే చెడ్డ పనులను వ్యతిరేకించి అభ్యంతరపెట్టిన వారిని మాత్రం అల్లాహ్ రక్షించాడు. సబ్బత్ నియమాన్ని ఉల్లంఘించి దుర్మార్గానికి పాల్పడిన వారిని అల్లాహ్ భూకంపం ద్వారా అంతమొందించాడు. భూకంపంలో నాశనమయ్యే ముందు సబ్బత్ నియమాన్ని ఉల్లంఘించిన వారు కోతులుగా మారిపోయారు. కొందరు వ్యాఖ్యానకర్తల అభిప్రాయం ప్రకారం, వారు కోతుల మాదిరిగా ప్రవర్తించారు.



https://teluguislam.net

## గ్రహించవలసిన పాఠాలు

- నేటికి కూడా యూదులు శనివారం రోజును సబ్బత్‌గా పాటిస్తారు. ప్రవక్త ఈసా (అస) కూడా సబ్బత్ పాటించేవారు. తర్వాత క్రయిస్తవులు ఆదివారంగా మార్చుకున్నారు. ప్రాచీన రోమన్లు ఆరాధించిన సూర్యదేవునికి చెందిన రోజైన ఆదివారాన్ని క్రయిస్తవులు తమ కోసం ఎన్నుకున్నారు
- దేవుడు పూర్తి ప్రపంచాన్ని ఆరు రోజుల్లో సృష్టించాడని ఏడవ రోజున విశ్రమించాడని క్రయిస్తవులు విశ్వసిస్తారు (జెనిసిస్ 2-2). కాని దేవుడు కూడా మానవుల మాదిరిగా అలసిపోతాడని, విశ్రాంతి అవసరమని ముస్లిములు ఎన్నటికీ భావించరు.
- శుక్రవారం ముస్లిములకు సంబంధించి సబ్బత్ ఎంతమాత్రం కాదు. శుక్రవారం మధ్యాహ్న ప్రార్థనల సమయంలో పనులన్నీ మానుకుని తప్పనిసరిగా సామూహిక ప్రార్థనలకు హాజరు కావలసి ఉందన్న మాట నిజమే కాని ఆ ప్రార్థనలు మహాఅయితే అరగంట కన్నా అధిక సమయం ఉండవు. ఆ పిదప వారు తమ ఉపాధి కార్యక్రమాల్లో నిమగ్నం కావచ్చు *(చదవండి దివ్యఖుర్‌ఆన్ 62:9-10).*

# ప్రవక్త సులైమాన్

(అలైహిస్సలాం)

(970-931 క్రీ.పూ.)



"చివరకు సులైమాన్ సైన్యమంతా ఒక చీమల లోయకు చేరుకున్నప్పుడు ఒక చీమ ఇలా ప్రకటించింది: "ఓ చీమల్లారా! సులైమాను, అతని సైన్యాలు తెలీకుండా మిమ్మల్ని నలిపివేసే స్థితి ఏర్పడకుండా ఉండేందుకు, మీరు మీ మీ పుట్టలలోనికి దూరిపోండి."

(ఖుర్‌ఆన్ 27 : 18)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ప్రవక్త దావూద్ (అస) వివేకం మూర్తీభవించిన పాలకులు. ఆయన కుమారుడు సులైమాన్ మరింత తెలివి, వివేకసంపద కలిగినవారు. ఆయన చిన్న పిల్లవానిగా ఉన్నప్పుడే తెలివితేటలు, వివేకవిచక్షణలు ప్రదర్శించారు. రాజ దర్బారులో వివాదాల, ఫిర్యాదుల తీర్పులు జరుగుతున్నప్పుడు ప్రవక్త దావూద్ (అస) తన కుమారుణ్ణి కూడా దర్బారులో పిలిచి కూర్చుండబెట్టేవారు.

ఒకసారి ఒక రైతు ఓ ఫిర్యాదు తీసుకుని వచ్చాడు. ఆ రైతు తన పొలంలో గోధుమ, మొక్కజొన్న పండించే వాడు. పొలంలో ఫలవృక్షాలు కూడా ఉండేవి. ఈ రైతుకు పొరుగున మరో వ్యక్తి ఉన్నాడు. ఈ పొరుగు వ్యక్తి గొర్రెలు పెంచేవాడు. రైతు పొలంలో పంట బాగా ఏపుగా పెరిగినప్పుడు పొరుగువాని గొర్రెలు పొలంలో పడి పంట మొత్తం ఆగం చేసి వెళ్ళేవి. ఈ వివాదం దర్బారుకు వచ్చింది. పొరుగువాడు రైతు చేసిన ఫిర్యాదు నిజమేనని ఒప్పుకున్నాడు. ఇద్దరి వాంగ్మూలాలు విన్న తర్వాత ప్రవక్త దావూద్ (అస) తన తీర్పు చెబుతూ, రైతుకు జరిగిన నష్టానికిగాను పొరుగు వ్యక్తి తన గొర్రెలను రైతుకు ఇచ్చి నష్ట పరిహారం చెల్లించాలని అన్నారు. తన గొర్రెలు విచ్చలవిడిగా తిరగడానికి వదలి వేసిన పొరుగువాడు ఈ విధంగా



గుణపాఠం కూడా నేర్చుకుంటాడని దావూద్ (అస) అన్నారు. అప్పటికి సులైమాన్ వయసు కేవలం పదకొండు సంవత్సరాలు మాత్రమే. ఆయన ఈ తీర్పు విని లేచి నిలబడి మాట్లాడడానికి తండ్రి అనుమతి కోరారు. తండ్రి ఆయనకు అనుమతి ఇచ్చారు. సులైమాన్ మాట్లాడుతూ తాను ఈ తీర్పుతో ఏకీభవించడం లేదని, ఈ శిక్ష చాలా తీవ్రంగా ఉందని అన్నారు. బాల సులైమాన్ ధైర్యంగా చెప్పిన ఈ మాటలు విని పూర్తి దర్బారు నిర్ఘాంతపోయింది. దర్బారులో గుసగుసలు వ్యాపించాయి. దావూద్ ప్రవక్త చిరునవ్వుతో తన కుమారుడిని చూస్తూ ఈ వివాదానికి నీ తీర్పు ఏమిటో చెప్పు అన్నారు. అప్పుడు సులైమాన్ మాట్లాడుతూ, గొర్రెలను కొంతకాలం వరకు రైతుకు అధీనం చేయాలని, ఆ విధంగా రైతు వాటి ఉత్పత్తుల ద్వారా అంటే పాలు, ఉన్ని, వగైరాలతో లాభం పొంది తన నష్టాన్ని పూడ్చుకుంటాడని, ఈ లోగా గొర్రెల యజమాని ఒక సంవత్సరం పాటు రైతు పొలాన్ని సాగుచేసి పంట పండించి పంట కోయకుండా రైతుకు అప్పగించాలని, రైతు తన అధీనంలో ఉన్న గొర్రెలను, ఎన్ని గొర్రెలయితే పొరుగువాడు తన అధీనం చేశాడో అన్ని గొర్రెలను తిరిగి అతనికి అప్పగించాలని, వాటికి పుట్టిన గొర్రెపిల్లలను ఇవ్వనవసరం లేదని అన్నారు. ఈ విధంగా గొర్రెల యజమాని నిర్లక్ష్యానికి తగిన శిక్ష కూడా పడుతుందని, అతను ఒక సంవత్సరం పాటు ఎలాంటి ప్రతిఫలం లేకుండా పొలంలో పని చేసి పంట పండించి రైతుకు అప్ప గించవలసి ఉంటుందని, అలాగే అతను పూర్తిగా తన గొర్రెలను కోల్పోయే పరిస్థితి కూడా ఉండదని చెప్పారు. పంట సిద్ధంగా ఉన్న పొలాన్ని అతను అప్ప గించిన తర్వాత రైతు దానిని కోసుకోవచ్చు. ఈ తీర్పును రాజదర్బారు నిశ్శబ్దంగా వింటూ ఉండిపోయింది.

రాజు దావూద్ (అస) తన తీర్పును ఉపసంహరించుకుంటున్నానని, తన కుమారుని తీర్పును అమలు చేయాలని ఆదేశించారు. కుమారుని తీర్పు నిష్పక్షపాతంగా, న్యాయసమ్మతంగా, వివేకవంతంగా, తన తీర్పు కన్నా ఉత్తమంగా ఉందని ప్రకటించారు. రైతు, గొర్రెల యజమాని ఇద్దరూ కూడా తీర్పు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. *(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 21:78-82)*

## కుమారుని ద్రోహం

ప్రవక్త దావూద్ (అస) తన తర్వాత తన కుమారుడు సులైమాన్‌ను రాజుగా చేయాలని నిర్ణయించారు. కాని దావూద్(అస) గారి మరో కుమారుడు అబ్సాలోమ్

https://teluguislam.net

పెద్దవాడు. పెద్దవాడయినప్పటికీ రాజబాధ్యతలు నిర్వర్తించే యోగ్యతలు అతనికి లేవు. తన తండ్రి సులైమాన్‌ను రాజుగా చేయాలని నిర్ణయించడం అబ్సాలోమ్‌కు నచ్చలేదు. అతనిలో ఈర్ష్యాద్వేషాలు బుసలు కొట్టాయి. ఎలాగైనా రాజసింహాసనాన్ని హస్తగతం చేసుకోవాలని అతను కుట్రపన్నాడు.

ముందుగా అతడు ప్రజలను మభ్యపుచ్చి తన పక్షానికి వచ్చేలా చేయాలనుకున్నాడు. ప్రజలను తన వైపు త్రిప్పుకోవడానికి ఒక పథకం వేశాడు. ప్రజలు తమ వివాదాల పరిష్కారానికి సులైమాన్ దర్బారుకు వస్తున్నప్పుడు వారిని అక్కడకు వెళ్ళకుండా అడ్డుకుని తన వద్దకు వచ్చేలా చేశాడు. ఆ విధంగా తాను చాలా వివేకవంతుడినన్న అభిప్రాయాన్ని ప్రజల్లో కలిగించడానికి ప్రయత్నించాడు. ఆ పిదప తన కుట్రకు పనికివచ్చే కొంతమంది దుర్మార్గులను తన అనుచరులుగా చేర్చుకున్నాడు. ఒక రోజు అతను తన తండ్రితో గిబియన్ పట్టణానికి వెళ్తాను అనుమతించమని కోరాడు. గిబియన్ పట్టణంలో తాను చేయవలసిన పని ఉందని సాకులు చెప్పాడు. తనతో పాటు తన అనుచరులను తీసుకుని వెళ్ళాడు. గిబియన్ పట్టణానికి వెళ్ళిన వెంటనే బనీ ఇస్రాయీల్‌లోని వివిధ తెగలకు రహస్య సందేశాలు పంపాడు. నగారా శబ్దం వినగానే తనను రాజుగా ప్రకటించాలని వారందరికీ సూచనలు పంపించాడు. కాని దావూద్ (అస) పట్ల విశ్వాసం కలిగిన ప్రజలు ఈ ఆదేశాన్ని లక్ష్యపెట్టలేదు. అబ్సాలోమ్ అనుచరులకు, వివిధ తెగలకు మధ్య తీవ్రమైన పోరాటం జరిగింది. జెరుసలేమ్ పట్టణం దాదాపుగా నాశనం అయ్యింది.

తన కుమారుని ద్రోహం గురించి దావూద్ ప్రవక్తకు తెలిసింది. తన స్వంత కుమారుడు ఇలా వ్యవహరించాడని తెలిసి ఆయన చాలా బాధకు గురయ్యారు. అయినా ఆయన సంయమనాన్ని కోల్పోలేదు. తన రాజ్యంలో రక్తపాతాన్ని ఆయన ఇష్టపడలేదు. అబ్సాలోమ్ పట్టణాన్ని బలవంతంగా వశపరచుకోవచ్చని ఆయన భయపడ్డారు. అందువల్ల ఆయన తన వారికి వెంటనే పట్టణాన్ని వదిలి వేయాలని సందేశం పంపించారు. హాని కలుగకముందే అక్కడి నుంచి తప్పించుకొమ్మని చెప్పారు. చాలా మంది పట్టణాన్ని వదిలి జోర్డాన్ నదిని దాటి వచ్చేశారు. దావూద్ (అస) ఆలివ్ కొండను ఎక్కి అల్లాహ్‌ను ప్రార్థించారు. ప్రజలను ఈ ప్రమాదం నుంచి కాపాడమని వేడుకున్నారు. కొంతమంది ప్రజలు తమ దుస్థితికి రాజుగారే కారణమని విమర్శించారు. కాని చాలా మంది దావూద్ పక్షాన విశ్వాసంగా



నిలబడ్డారు. ఆయన వారితో, "నా స్వంత కుమారుడు నాకు ద్రోహం చేసినప్పుడు పరులు నాకు వ్యతిరేకమయ్యారని నేను ఎలా చెప్పగలను" అన్నారు.

దావూద్ (అస) కొందరు అధికారులను అక్కడికి పంపి పరిస్థితి చక్కదిద్దమన్నారు. అబ్సాలోమ్‌కు ఎలాంటి హాని చేయవద్దని వారిని ఆదేశించారు. దావూద్ (అస) పంపిన అధికారులు కఠినంగా అక్కడి తిరుగుబాటును అణచి వేశారు ఈ పోరాటంలో అబ్సాలోమ్ హతమయ్యాడు. జెరుసలేమ్‌లో మళ్ళీ శాంతిభద్రతలు పునరుద్ధరించబడ్డాయి. దావూద్ (అస) రాజుగా పరిపాలించడం కొనసాగింది.

## సులైమాన్ రాజరికం

తన తండ్రి మరణానంతరం సులైమాన్ (అస) రాజుగా పాలనాపగ్గాలు చేపట్టారు. తన రాజ్యం వంటి మరో రాజ్యం లేనంత చక్కగా పాలించే అనుగ్రహం ప్రసాదించాలని ఆయన అల్లాహ్‌ను ప్రార్థించారు. అల్లాహ్ ఆయన కోరికను మన్నించాడు. సులైమాన్ (అస)మహావివేకవంతుడు మాత్రమే కాదు, అల్లాహ్ ఆయనకు అనేక వరాలు ప్రసాదించాడు. ఆయన గాలులను తన అదుపులో ఉంచుకోగలిగేవారు. పశుపక్ష్యాదులతో మాట్లాడగలిగేవారు. భూగర్భంలో ఉన్న ఖనిజాలను త్రవ్వి బయటకు తీసి వాటితో ఉపకరణాలు, ఆయుధాలు తయారు చేసే విద్యను మనుష్యులకు, జిన్నాతులకు (అగ్నితో సృష్టించబడిన బుద్ధిజీవులైన ప్రాణులకు) నేర్పాలని అల్లాహ్ ఆయనకు ఆదేశించాడు. అల్లాహ్ ఆయనకు ఒక రాగి గనిని కూడా ప్రసాదించాడు. ఆ కాలంలో రాగి అరుదైన లోహంగా ఉండేది.

ఒక రోజు సులైమాన్ (అస) తన సైన్యాన్ని సమావేశపరచారు. అదొక విచిత్రమైన సైన్యం. అందులో మనుష్యులు, పశుపక్ష్యాదులు, జిన్నాతులు ఉన్నారు. సైన్యాన్ని తీసుకుని ఆయన అష్కెలాన్ రాజ్యానికి బయలుదేరారు.

వారు ఒక లోయ నుంచి వెళుతున్నప్పుడు ఒక చీమ ఈ సైన్యం రావడాన్ని చూసింది. మిగిలిన చీమలను హెచ్చరిస్తూ, "పారిపోండి. పుట్టల్లో తలదాచుకోండి. లేకపోతే మనల్ని చూడకుండా సులైమాన్ సైన్యం మనల్ని తొక్కేస్తుంది" అని అరిచింది. ఈ అరుపు సులైమాన్ చెవులకు సోకింది. ఆయన నవ్వుకున్నారు. ఒక ప్రవక్తగా తాను కావాలని దేవుని సృష్టి దేనికీ హాని తలపెట్టనన్న విషయాన్ని

https://teluguislam.net

ఆ చీమ గుర్తించినందుకు సంతోషించారు. చీమలను కాపాడినందుకు ఆయన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## రాతి గుమ్మటం

జెరుసలేమ్‌లో ఒక పెద్ద శిలపై సులైమాన్ (అస) ఒక అందమైన ఆరాధనా లయాన్ని నిర్మించారు. ప్రజలు అల్లాహ్‌ను ఆరాధించడానికి వచ్చేలా ఈ ఆరాధనా లయాన్ని కట్టారు. నేడు దీనిని "మస్జిదుల్ అక్సా" లేదా మస్జిదుల్ ఖుద్స్ లేదా "డోమ్ ఆఫ్ రాక్" అని పిలుస్తున్నారు. ఇక్కడి నుంచి సులైమాన్ (అస) వెంట పెద్ద సంఖ్యలో అనుచరులు మక్కాలోని పవిత్ర గృహానికి యాత్రకు బయలు దేరారు. వారు తమ హజ్ యాత్ర పూర్తి చేసుకుని అక్కడి నుంచి యమన్ చేరుకుని సనా పట్టణానికి వచ్చారు. ఇక్కడ తెలివిగా పట్టణాల్లో నీటిపారుదల సదుపాయాన్ని ఏర్పాటు చేసిన పద్ధతి చూసి ఆయన చాలా ప్రభావితులయ్యారు. తన రాజ్యంలో కూడా అలాంటి నీటిపారుదల సదుపాయం ఏర్పాటు చేసుకోవా లని భావించారు. కాని తన రాజ్యంలో అందుకు అవసరమైన నీటివనరులు లేవు. ఆయన వెంటనే హూపో పక్షి కోసం కబురంపారు. ఆ పక్షి భూగర్భంలో జనవనరులను పసిగట్టగలదు. ఆయన హూపో పక్షి కోసం నాలుగుచెరగులా సందేశాలు పంపారు. కాని ఆ పక్షి ఎక్కడా లేదు. ఆయన కోపంగా ఆ పక్షి కనుక సరియైన కారణం లేకుండా గైర్హాజరైతే దానిని కఠినంగా శిక్షిస్తానని అన్నారు.

## షీబా రాణి బిల్కిస్

చివరకు హూపో పక్షి సులైమాన్ వద్దకు వచ్చింది. తన ఆలస్యానికి కారణాన్ని వివరించింది. "మీకు తెలియని ఒక విషయాన్ని నేను కనిపెట్టి వచ్చాను. నేను సబా (షీబా) నుంచి ఒక శుభవార్త తీసుకుని వచ్చాను" అంది. ఈ మాటలు విన్న సులైమాన్ ఆగ్రహం మాయమై ఆయనలో కుతూహలం చోటుచేసుకుంది. "సబా రాజ్యాన్ని బిల్కిస్ అనే రాణి పాలిస్తోంది. ఆమెకు అన్ని సౌభాగ్యాలు పుష్కలంగా ఉన్నాయి. ఆమె సింహాసనం చాలా అద్భుతంగా ఉంది. కాని ఇంత సంపద ఉన్నప్పటికీ, ఆమె హృదయంలో, ఆ రాజ్య ప్రజల హృద యాల్లో షైతాన్ తిష్ఠవేసుకుని ఉన్నాడు. ప్రజలు ఆమె పట్ల చాలా విశ్వాసంగా ఉన్నారు. వారంతా విశ్వప్రభువైన అల్లాహ్‌కు బదులు సూర్యుణ్ణి పూజించడం చూసి నేను నిర్ఘాంతపోయాను" అని ఆ పక్షి వివరించింది.

https://teluguislam.net



హూపో పక్షి చెప్పిన మాటలు నిర్ధారించుకోవడానికి సులైమాన్ (అస) ఆ పక్షితో సబా రాణికి ఒక లేఖ పంపారు. రాణికి లేఖ చేరవేసి అక్కడే రహస్యంగా ఉండి రాణి ఏం చేస్తుందో చూడమని పక్షికి సూచనలిచ్చారు.

హూపో పక్షి ఆ లేఖను సబా రాణి ముందు పడవేసి ఎగిరిపోయింది. వెళ్ళి ఓ మూలన దాక్కుని చూడసాగింది. సబా రాణి ఆ లేఖను ఆశ్చర్యంగా తీసుకుని చది వింది. "ఈ లేఖ సులైమాన్ నుంచి పంపబడింది. అనంత కరుణా మయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం. నాకు వ్యతిరేకంగా బలప్రదర్శనకు దిగవద్దు. లొంగిపోయిన మనిషి మాదిరిగా నా వద్దకు రావాలి....." ఈ లేఖ చూసి రాణి చాలా ఆందోళనకు గురయ్యింది. వెంటనే తన సలహాదారులను పిలిపించింది. వారు ఆమెతో తాము కేవలం సలహా మాత్రమే ఇవ్వగలమని, ఆదేశాలిచ్చి చర్యలు తీసుకోవలసినది రాణిగారేనని విన్నవించు కున్నారు. వారి ఉద్దేశ్యాన్ని ఆమె గ్రహించింది. వారంతా సులైమాన్‌తో యుద్ధరంగంలో ఢీకోవాలని భావిస్తున్నారు. కాని ఆమె వారితో, "స్నేహం, శాంతి యుద్ధం కన్నా మంచివి. వివేక వంతమైనవి. యుద్ధం వల్ల పరాభవాలు వాటిల్లు తాయి. ప్రజలు బానిసలవుతారు. సంపద నాశనం అవుతుంది. నేను సులైమాన్‌కు కానుకలు పంపాలని భావిస్తున్నాను. మన ఖజానాలోని విలువైన వస్తువుల్ని పంపుదాం. ఈ కానుకలు తీసుకుని వెళ్ళే రాజప్రతినిధులు సులైమాన్ గురించి కూడా తెలుసుకోవచ్చు, అతని సైనిక బలాన్ని కూడా అంచనా వేయవచ్చు" అని చెప్పింది.

కాని ఆమెకు తన మాటలన్నింటినీ హూపో పక్షి వింటుందన్న విషయం తెలియదు. హూపో వెంటనే సులైమాన్ వద్దకు వెళ్ళి ఈ విషయాలు చేరవేసింది.

## కానుకలా? లంచాలా?

సులైమాన్ (అస) వెంటనే తన అధీనంలో ఉన్న ఒక జిన్నుతో ఒక మహా ప్రాసాదాన్ని నిర్మించమని ఆదేశించారు. ఆ మహాసౌధంలో రాబోయే అతిథులను స్వాగతిస్తానని చెప్పారు. సబా రాణి వద్ద నుంచి వచ్చిన రాజప్రతినిధులను ఆయన చాలా ఆదరంగా స్వాగతించారు. అద్భుతమైన ఆ భవనాలను చూసి వారు దిగ్భ్రాంతికి గురయ్యారు. వారు తమ రాణి పంపిన విలువైన కానుకలను సులైమాన్(అస)కు అందజేశారు. స్నేహానికి గుర్తులుగా వాటిని తమ రాణి పంపిం దని, వాటిని స్వీకరించాలని కోరారు. కాని సులైమాన్ ఆ కానుకలను విప్పి

https://teluguislam.net



చూడకుండానే వారిని ఉద్దేశించి, "అల్లాహ్ నాకు పుష్కలంగా ప్రసాదించాడు. ఒక పెద్ద రాజ్యాన్ని ఇచ్చాడు. ప్రవక్త పదవిని ఇచ్చాడు. కాబట్టి నేను లంచాలకు లొంగే అవకాశం లేదు. నా లక్ష్యం ఒక్కటే, తౌహీద్ (ఏకదైవారాధన)ను వ్యాపింప జేయడం" అన్నారు. అంతేకాదు, ఆ కానుకలను తిరిగి తీసుకువెళ్ళాలని ఆదేశించారు. మీ రాణి తన ఆరాధనా పద్ధతిని మార్చుకోనట్లయితే రాజ్యాన్ని వశపరచు కుంటానని, ప్రజల్ని అక్కడి నుంచి వెళ్ళగొడతానని కఠినంగా చెప్పారు.

రాణి ప్రతినిధులు ఆ కానుకలు తీసుకుని ఆమె వద్దకు చేరుకుని సులైమాన్ (అస) చెప్పిన మాటలు చెప్పారు. అంతేకాదు, సులైమాన్ రాజ్యంలో తాము చూసిన అద్భుతాలను కూడా వివరించారు. సులైమాన్ సందేశం పట్ల ఆమె ఆగ్రహం ప్రదర్శించే బదులు సులైమాన్ రాజ్యాన్ని సందర్శించాలని నిర్ణయించుకుంది. తనకు విశ్వాసపాత్రులైన నౌకర్లతో ఆమె సబా రాజ్యాన్ని వదలి బయలుదేరింది. ఒక సందేశహరుడితో సులైమాన్ (అస) వద్దకు తాను వస్తున్న వర్తమానం ముందుగానే పంపించింది.

## సులైమాన్ ఆదేశపాలన కోసం జిన్నుల పోటీ

సులైమాన్ (అస) తన అధీనంలో ఉన్న జిన్నులను పిలిచి సబా రాణి రాక ముందే ఆమె సింహాసనాన్ని తన వద్దకు ఎవరు తీసుకువస్తారని అడిగారు. ఒక జిన్ను, "ఈ సమావేశం ముగిసేలోపే ఆ సింహాసనాన్ని మీ ముందు ఉంచు తాను. నేను నిస్సందేహంగా బలం కలవాడిని. ఇలాంటి పనులు చేయడానికి నమ్మక స్తుడిని" అన్నాడు. కాని ఈ పని చేయడానికి జిన్నులు పోటీపడ్డారు. ఇంతలో ప్రత్యేక జ్ఞానం కలిగిన ఒక జిన్ను, "నేను రెప్పపాటులో ఆ సింహాసనాన్ని మీ ముందు ఉంచుతాను" అంటూ మాట పూర్తయ్యేలోపే సింహాసనాన్ని ముందు ఉంచాడు. సులైమాన్ (అస) ఆశ్చర్యంగా, "ఇదంతా అల్లాహ్ అనుగ్రహం నేను కృతజ్ఞత చూపుతానో లేదో అని ఆయన పరీక్షిస్తున్నాడు" అన్నారు. ఆ తర్వాత ఆయన ఆ జిన్నుతో ఆ సింహాసనం ఆకారాన్ని మార్చమన్నారు.

## సబా రాణి ఆగమనం

బిల్కీస్ సులైమాన్ రాజప్రాసాదంలోకి వచ్చినప్పుడు ఆమెను ఘనంగా స్వాగతించడం జరిగింది. ఆ తర్వాత సులైమాన్ (అస) తన వద్ద ఆకారం మార్చి ఉన్న సింహాసనాన్ని ఆమెకు చూపించి ఆమె సింహాసనం కూడా అలాంటిదేనా అని ప్రశ్నించారు. ఆమె ఆ సింహాసనాన్ని పదే పదే చూసింది. తాను చూస్తున్న



సింహాసనం తన సింహాసనం అయ్యే అవకాశం లేదని భావించింది. ఎందుకంటే, తన సింహాసనం తన రాజభవనంలో ఉంది. కాని తన సింహాసనానికి ఈ సింహా సనానికి పోలికలు చాలా ఉండడం చూసి ఆమె ఆశ్చర్యంగా, "ఈ సింహాసనం నా సింహాసనాన్ని చాలా విధాలుగా పోలి ఉంది" అంటూ జవాబిచ్చింది. ఆమె చాలా తెలివైన, దౌత్యపరమైన నైపుణ్యం ఉన్న మహిళగా సులైమాన్ (అస) గుర్తించారు.

ఆ తర్వాత ఆయన ఆమెను ఒక పెద్ద హాలులోకి ఆహ్వానించారు. ఆ గది లో నేల అంతా గాజుతో పరచబడి ఉంది. ఆమె గాజు నేలను చూసి అదంతా నీరుగా భ్రమపడింది. ఆమె అక్కడ అడుగుపెట్టేటప్పుడు తన దుస్తులు తడవకుండా కొద్దిగా కాలిమడమల పైకి లాక్కుంది. సులైమాన్ (అస) ఆమెను చూస్తూ ఇక్కడ నీరు లేదు, గాజుతో చేసిన నేల అని చెప్పారు. ఆమె ఆశ్చర్య పోయింది. అలాంటి నిర్మాణాన్ని ఆమె అంతకుముందు ఎన్నడూ చూడలేదు. తన ముందు ఉన్నది విజ్ఞానవివేకాలు మూర్తీభవించిన అసాధారణ వ్యక్తి అని ఆమె గుర్తించింది. ఆయన కేవలం ఒక రాజ్యానికి పాలకుడు మాత్రమే కాదని, దేవుని ప్రవక్త కూడా అని తెలుసుకుంది. ఆమె తన ఆరాధనా పద్ధతులలోని తప్పులకు పశ్చాత్తాపపడింది. సూర్యుణ్ణి పూజించే అలవాటు మానుకుంది. అల్లాహ్‌ను ఒకే ఒక్క దేవునిగా విశ్వసించింది. తన రాజ్యంలోని ప్రజలను కూడా అదే విధంగా చేయాలని కోరింది.

*(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 6:84, 21:81-82, 34:12-14, 27:15-44, 2-103, 38:32-40)*

## అశ్వప్రేమికుడు సులైమాన్(అస)

సులైమాన్ (అస) కాలంలో ప్రజలు గుర్రాలపై ప్రయాణాలు చేసేవారు. యుద్ధరంగంలో సైనికులకు యుద్ధ సామగ్రిని, ఆయుధాలను చేరవేయడానికి గుర్రాలనే ఉపయోగించేవారు. వస్తురవాణాకు, వాహనాలు లాగడానికి కూడా గుర్రాలనే వాడేవారు. గుర్రాల పట్ల చాలా శ్రద్ధ చూపేవారు. వాటికి చక్కని శిక్షణ ఇచ్చేవారు. సులైమాన్ (అస) గుర్రపుశాలలో చాలా గుర్రాలు ఉండేవి. గుర్రాలంటే ఆయనకు చాలా శ్రద్ధ ఉండేది. ఒకసారి ఆయన తన గుర్రపుశాలలో గుర్రాలను చూస్తూ వాటిని ప్రేమగా నిమురుతూ చాలాసేపు గడిపారు. సూర్యుడు అస్తమించే సమయం అయిపోయింది. అస్ర్ నమాజు సమయం దాటిపోతోంది.

https://teluguislam.net



ఆయన తాను చేస్తున్న ఆలస్యాన్ని గుర్తించి వెంటనే, “నేను ఈ సంపదను నా ప్రభువు సంస్మరణార్థం ప్రేమించాను.” ....“వాటిని నా వద్దకు తిరిగి తీసుకు రండి” అన్నారు. *(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 38:32-33)*

## సులైమాన్ (అస) విచిత్ర మృతి

సులైమాన్ (అస) పాలనలో అనేక పనులను జిన్నులే చేస్తుండేవి. జిన్నులు చేసిన పాపాలకు శిక్షగా వాటితో ఈ పనులు చేయించడం జరిగేది. అగ్నితో సృష్టించబడిన జిన్నులు తమకు సమస్త శక్తులున్నాయని, తాము అగోచరాలను కూడా చూడగలమని, భవిష్యత్తును తెలుసుకోగలమని ప్రజలను నమ్మించడం వంటి పాపాలకు పాల్పడేవారు. తన అనుచరుల్లో ఇలాంటి తప్పుడు విశ్వాసాలు చోటుచేసుకోకుండా చూడవలసిన బాధ్యత ఒక ప్రవక్తగా సులైమాన్(అస)పై ఉంది. భవిష్యత్తు తెలుసుకునే శక్తి జిన్నులకుగాని, ప్రవక్తలకు గాని ఎవరికీ లేదని, కేవలం అల్లాహ్‌కు తప్ప అలాంటి శక్తి మరెవ్వరికీ లేదని ప్రజలు తెలుసుకునేలా చేయడం ఆయన బాధ్యత. ఈ దిశగా ఆయన చేసిన ప్రయత్నాలు ఆయన మరణానంతరం కూడా కొనసాగడం చెప్పుకోదగిన విశేషం.

ఒక గనిలో జిన్నుల పనిని పర్యవేక్షిస్తూ ఆయన తన చేతికర్రకు ఆనుకుని కూర్చుని ఉన్నారు. ఆ విధంగా కూర్చున్న స్థితిలోనే ఆయన తుదిశ్వాసను విడిచారు. చాలా సమయం వరకు ఆయన (అస) మరణం గురించి ఎవరికీ తెలియదు. ఆయన (అస) అక్కడ కూర్చున్నట్లే చాలా మందికి కనబడ్డారు. సులైమాన్ (అస) చూస్తున్నారన్న భయంతో జిన్నులు విరామం లేకుండా పని కొనసాగిస్తూ పోయారు. ఈ సంఘటనను దివ్యఖుర్‌ఆన్ ఇలా వివరించింది. “ఆ తరువాత సులైమాన్‌పై మేము మరణ నిర్ణయాన్ని అమలు జరిపినప్పుడు, జిన్నాతులకు అతని మరణం గురించి తెలియజేసిన వస్తువు అతని చేతి కర్రను తింటూ ఉన్న చెదపురుగు తప్ప మరొకటేదీ కాదు, ఈ విధంగా సులైమాన్ పడిపోగా, తమకు అగోచర విషయాలు తెలిసి ఉంటే అవమానకరమైన ఈ బాధకు గురి అయి ఉండేవారము కాము అని జిన్నాతులకు స్పష్టంగా తెలిసి పోయింది.”

ఆ విధంగా ఆయన మరణం కూడా ఆయన అనుచరులకు ఒక పాఠంగా మిగిలింది. జిన్నులేకాదు, ఎవరూ కూడా భవిష్యత్తును గురించి తెలుసుకునే అవకాశం లేదన్నది అందరికీ తెలిసివచ్చింది. *(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 34:14)*



## గ్రహించవలసిన పాఠాలు

- సరియైన విధంగా న్యాయం చేయాలంటే, తీర్పు చెప్పేముందు ఇరు పక్షాల వాదనను పూర్తిగా వినాలి. న్యాయం జరిగిందని ప్రజలు తెలుసుకునేలా ఉండాలి.
- వయసులో చిన్నవాడైన తన కుమారుడి వివేకాన్ని గుర్తించి తండ్రి తన స్వంత నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాడు.
- ప్రార్థనలతో సహా వివిధ పనులకు తగిన విధంగా సమయాన్ని విభజించుకోవాలి. ప్రవక్తలు, చాలామంది పాలకులు ఇహపరలోకాల విధులు నిర్వర్తించడానికి తగిన విధంగా సమయాన్ని విభజించుకునేవారు.
- మనిషి ఆధ్యాత్మిక శక్తి అతని ధార్మిక విశ్వాసంలో ఉంది.
- మంచి పనులు జాతిని పతనానికి గురికాకుండా కాపాడుతాయి. అయితే విదేశీ దాడుల నుంచి కాపాడుకోవడానికి సైనిక ఏర్పాట్లు అవసరం.
- **ఆత్మసమీక్ష** : మనిషి తన ఆచరణల విషయంలో ఏమాత్రం అనుమానం వచ్చినా తక్షణం అల్లాహ్ వైపునకు మరలి మార్గదర్శనం కోసం ప్రార్థించాలి.
- అల్లాహ్ సృష్టి పట్ల సులైమాన్ (అస) చాలా శ్రద్ధ తీసుకునేవారు, చివరకు ఒక చీమకు కూడా హాని కలుగడాన్ని ఇష్టపడలేదు.
- వివేకజ్ఞానాలు ఉన్న సులైమాన్ (అస) కూడా ఒక పక్షి నుంచి నేర్చుకున్నారు. ఆ పక్షి సలహా తీసుకుని ఆ ప్రకారం వ్యవహరించారు.
- పరస్పర సంప్రదింపులు : బిల్కీస్ ఒక స్త్రీ, ఆమె ఒక పాలకురాలు కూడా. అయినప్పటికీ అల్లాహ్ ఆమె పాలనాశైలిని గుర్తించాడు. ఆమె ఇతరులతో సంప్రదింపులు జరిపింది, కాని వారిచ్చిన తప్పుడు సలహాలను పాటించలేదు.
- శాంతి అన్నది సంతోషాన్ని, సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుంది. యుద్ధాలు, పోరాటాలు వినాశానికి కారణమవుతాయి.
- లంచాలకు, అవినీతికి ఎన్నడూ లొంగరాదు.

https://teluguislam.net



- సులైమాన్ (అస) మరణం కూడా మానవాళికి గుణపాఠం వంటిది. మనిషి జిన్నులను కూడా పాలించగలడు. అవి మనిషిపై ఆధిపత్యాన్ని సాధించ లేవు. వాటికి భవిష్యత్తును తెలుసుకునే శక్తి కాని, అగోచరాలను గ్రహించే శక్తి కాని లేవు.
- బైబిలులో కింగ్స్.. చాప్టర్ 2లో సులైమాన్ (అస) దేవుని ఆదేశాలకు విరుద్ధంగా 700 మంది మహిళలను వివాహం చేసుకున్నారని, 300 మంది మహిళలను ఉంచుకున్నారని, ఆ మహిళలు ఆయన్ను విగ్రహారాధన చేసేలా ప్రలోభపెట్టారని, ఆయన అనేక విగ్రహారాధనాలయాలు కట్టించాడని, తన భార్యల కోసం బలిపీఠాలు కట్టించాడని ఇలాంటి అనేక అసత్య ఆరోపణలు ఉన్నాయి. కాని దివ్యఖుర్‌ఆన్ ఈ అసత్య ఆరోపణలను, అలాగే బ్లాక్‌మ్యాజిక్‌కు పాల్పడ్డాడన్న ఆరోపణలన్నింటినీ ఖండిస్తోంది. *(చదవండి దివ్యఖుర్‌ఆన్ 2-102)*



# స్వార్థపరులైన సోదరులు

## (తోట వారి గాథ)



**"ఆ సోదరులు నిద్రపోతుండగానే నీ ప్రభువు తరఫున ఒక ఆపద వారి తోటను చుట్టుముట్టి పోయింది. అంతే! తెల్లవారే సరికల్లా ఆ తోట కోతకోసిన చేను మాదిరిగా అయిపోయింది."**
***(ఖుర్‌ఆన్ 68 : 19 - 20)***

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఒక రోజు ప్రాతఃకాలం, నలు దిశలా ప్రశాంత వాతావరణం అలుము కుని ఉంది. రాతినేలపై చేతికర్రతో కొడుతూ ఎవరో నడుస్తున్న శబ్దం విని పిస్తోంది. మధ్యమధ్యలో ఆ వ్యక్తి ఆయాసంతో దీర్ఘశ్వాస విడువడం కూడా చెవులకు సోకుతోంది. ఆ వ్యక్తి ఒక ముసలివాడు. ఆయన తన తోట వద్దకు వెళుతున్నాడు. ఆ తోటలో అనేక పండ్ల చెట్లు ఉన్నాయి. చెట్లన్నీ విరగకాసాయి. తోట మధ్యలో ఒక సెలయేరు ప్రవహిస్తోంది. అనేక పూల వాసనతో అక్కడ గాలి మధురంగా గుబాళిస్తోంది. ప్రాతఃకాలం మసకమసక వెలుతురు నెమ్మదిగా ప్రకాశమానం అవుతోంది. పక్షులు ప్రపంచాన్ని నిద్రలేప డానికి కిలకిలరావాలు ప్రారంభిం చాయి. కాని ఈ ప్రకృతి సౌందర్యం ఆ ముసలి వ్యక్తి ధ్యాసను మరల్చలేదు. విశ్వప్రభువు అనుగ్రహాలను అన్వేషించే విషయంలో ఆయన ఏమాత్రం నిర్లక్ష్యం చేయదలచుకోలేదు. ఆయన సమయం కాగానే అల్లాహ్‌ను స్మరిస్తూ నమాజు చేసి దేవుని అనుగ్రహాలకు కృతజ్ఞతలు చెల్లిం చాడు.

తన తోటలోకి ఆయన అందరినీ అనుమతించేవాడు. అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించే అవకాశం కల్పించేవాడు. అయితే ఎవరూ తన తోటను నాశనం చేయకుండా జాగ్రత్తగా

https://teluguislam.net



ఉండేవాడు. తోటలో పండ్లను దించేటప్పుడు బీదలను పిలిచి వారికి ఉదారంగా తన ఫలసాయం నుంచి పంచి పెట్టేవాడు. అంతేకాదు, తోటలో దించకుండా మిగిలిపోయిన పండ్లను దించుకునే అనుమతి బీదలకు ఇచ్చేవాడు.

## ముగ్గురు కుమారులు

ఆ ముసలి వ్యక్తికి ముగ్గురు కుమారులు. అందులో ఇద్దరు తమ తండ్రికి పూర్తి విరుద్ధమైన స్వభావం కలిగిన వారు. తమ తండ్రి ఉదారంగా చేసే దాన ధర్మాలు వారికి సహించేవి కావు. వారిలో ఒకడు తండ్రితో, "మీరు బీదలకు అంతా పంచిపెట్టి మాకు రావలసిన వాటా తగ్గిపోయేలా చేస్తున్నారు" అని కూడా అన్నాడు. రెండవ కుమారుడు మరింత ముందుకు పోయి, "మీ దానధర్మాలు చివరకు మనల్ని కూడా బిచ్చగాళ్ళయ్యేలా చేస్తాయి" అన్నాడు. ఇది విన్న మూడవ కుమారుడు జవాబు చెప్పబోయాడు. కాని తండ్రి అతడిని వారించాడు. ఆ ముసలి వ్యక్తి తన కుమారులను విచారంగా చూస్తూ, "పిల్లల్లారా! నేను దాన ధర్మాలు చేయడం వల్ల మనం బీదవాళ్ళమైపోతామని మీరనుకోవడం చాలా పొరపాటు. ఇది స్వార్థపూరితమైన ఆలోచన. మీరు కోరుతున్న ఈ సంపద నిజానికి మీది కాదు, నాది కాదు. ఈ సంపద అల్లాహ్‌ది. నేను కేవలం ఈ సంపదకు పర్యవేక్షకుడిని మాత్రమే. ఈ సంపదను కేవలం నా స్వంతానికి మాత్రమే ఖర్చు చేసుకునే అనుమతి నాకు లేదు. అల్లాహ్ సృష్టించిన మిగిలిన వారికి కూడా దీనిలో భాగం ఉంది. ముఖ్యంగా బీదలకు, బాటసారులకు, అవసరార్థులకు ఇందులో భాగం ఉంది. పక్షులు, క్రిమి కీటకాలకు కూడా ఇందులో భాగం ఉంది. ఎందు కంటే, అవి కూడా అల్లాహ్ సృష్టిలోనివే. ఆ తర్వాత మిగిలినదే మనది. ఆ విధం గానే మనిషి తన సంపదను పరిశుద్ధం చేసుకోగలడు. సౌభా గ్యాన్ని, సంపదలో వృద్ధిని పొందగలడు. నేను ఈ విధానాన్ని నా యవ్వనం నుంచి అనుసరిస్తూ వస్తున్నాను. మరణించే వరకు ఈ పద్ధతికే కట్టుబడి ఉంటాను.

ఇప్పుడు నేను ముసలివాడినై పోయాను. నా శరీరం వ్యాధులతో క్రుంగి పోయింది. నా చావు ఇక ఎంతో దూరంలో లేదు. కాబట్టి ఇదంతా మీరు స్వంతం చేసుకునే రోజు పెద్ద దూరంలో లేదు. అప్పుడు మీ ముందు రెండు దారు లుంటాయి. మీరు కూడా నా మాదిరిగా మీ సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తే అల్లాహ్ మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. కాని మీరు స్వార్థపరులై సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయకపోతే మీరు ఆయన అనుగ్రహాలను కోల్పోవడమే



కాదు, చివరకు ఉత్త చేతులతో మిగులుతారు. కాబట్టి కుమారులారా! అల్లాహ్ మనల్ని ఇలా ఉండాలని ఆదేశిస్తున్నాడు" అని చెప్పాడు.

ఈ సంభాషణ జరిగిన కొంతకాలానికే ఆ ముసలి వ్యక్తి మరణించాడు. తర్వాత తోటలో పండ్లు దించే సమయం వచ్చినప్పుడు బీదలు ఎప్పటి మాదిరిగా అక్కడకు వచ్చి తమకు కూడా ఇవ్వడం జరుగుతుందని ఎదురుచూడసాగారు. కాని ఇప్పుడు ఆ తోటకు యజమానులు కుమారులు. వాళ్ళు బీదలకు తోటలో లభించే పండ్లలో ఏదీ ఇవ్వరాదని, బాటసారులు తోటలో ప్రవేశించే అనుమతి ఇవ్వరాదని నిర్ణయించుకున్నారు. కాని మూడవ కుమారుడు తండ్రిని పోలిన వాడు. అతను తన సోదరులతో, "మీరు చెప్పే మాటలు దుర్మార్గంతో కూడు కున్నవి. దుర్మార్గం చెడును కొనితెస్తుంది. బీదలను కాదనడం ద్వారా మనం ప్రయోజనాలు పొందలేం. పైగా మనం స్వయంగా ఇబ్బందులకు గురికావచ్చు. కాబట్టి అల్లాహ్ ప్రసాదించిన ఈ సంపద మన తండ్రి వద్ద ఉన్నప్పుడు ఆయన ఎలా ఇచ్చేవారో అలాగే ఇవ్వడం మంచిది" అన్నాడు. కాని సోదరులు ఈ మాటలకు ఆగ్రహించి, "నీకు సంబంధంలేని వ్యవహారాల్లో మాకు సలహాలు ఇవ్వవద్దు. నాన్న బ్రతికి ఉన్నప్పుడు చాలా సలహాలు తీసుకున్నాం" అన్నారు. కాని మూడవ కుమారుడు తన పట్టు వదల్లేదు. "మనం అల్లాహ్‌ను ప్రార్థించి దేవుని మార్గదర్శనాన్ని కోరుకుందాం.. ప్రార్థన మనిషిని చెడు నుంచి కాపాడు తుంది" అన్నాడు. కాని సోదరులు అతని మాటలను ఏమాత్రం లక్ష్యపెట్టలేదు.

మరుసటి రోజు తెల్లవారుజామున లేచి తోటలోని పండ్లను దించి తామే పంచుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. అలాగే మరుసటి రోజు తెల్లవారు జామున తోటకు వెళ్ళారు. కాని అక్కడ కనబడిన దృశ్యం చూసి నిర్ఘాంత పోయారు. వారి తోట పరిస్థితే మారిపోయింది. అంతా నాశనమైపోయింది. అసలు గుర్తుపట్టడానికి కూడా వీల్లేకుండా మారిపోయింది.

ఈ వార్త మూడవ కుమారునికి తెలిసి, "మీ దుర్మార్గపు ఆలోచనల వల్ల ఏమయ్యిందో చూడండి" అని వ్యాఖ్యానించాడు. ఇద్దరు సోదరులు తమ తప్పు తెలుసుకుని అల్లాహ్‌ను క్షమాభిక్ష కోరారు. "మా ప్రభువు పరిశుద్ధుడు.. నిజంగానే మేము పాపాత్ములం... మన ప్రభువు దీనికి బదులు దీనికన్నా మెరుగైన తోటను మనకు ప్రసాదించడం అసంభవమేమీ కాదు"అన్నారు.

*(చదవండి దివ్యఖుర్ఆన్ : 68:17-33)*

### గ్రహించవలసిన పాఠాలు

- అల్లాహ్ మనకు సంపదను ఒక బాధ్యతగా అప్పగిస్తాడు. దానితో మనం ఏం చేస్తామో పరీక్షిస్తాడు. ఆ సంపదలో పేదలకు, అవసరార్థులకు, బాటసారులకు ఇవ్వడానికి నిరాకరిస్తే అల్లాహ్ సంపదను తీసుకుని అనేక విధాలుగా శిక్షిస్తాడు. మనం చేసిన తప్పుకు చిత్తశుద్ధితో పశ్చాత్తాప పడితే, అల్లాహ్ తాను తీసుకున్న దానికన్నా మెరుగైనది ప్రసాదిస్తాడు.

https://teluguislam.net



# యహూదా - అతని సోదరుడు



(ఖుత్రూస్) తన ఆత్మకు అన్యాయం చేసుకున్న స్థితిలో తన తోటలోకి వెళ్ళి, "ఏనాటికైనా ఈ తోట నాశనమైపోతుందని నేననుకోను" అన్నాడు.
(ఖుర్‌ఆన్ 18 : 35)

బనీఇస్రాయీల్‌లో ఒక వ్యక్తి ఉండేవాడు. అతనికి ఇద్దరు కుమారులు. ఇద్దరూ భిన్న ధృవాల వంటివారు. రాత్రింబవళ్ళ మధ్య ఎంత తేడా ఉందో వారిద్దరి మధ్య అంత తేడా ఉండేది. ఒక కుమారుడు యహూదా దైవభక్తి కలిగినవాడు. దానధర్మాలు చేసే ఉదార స్వభావి. ఈ ప్రపంచం అంటే ఏమిటో గుర్తించినవాడు. అందువల్ల ఇక్కడి సంపద సౌభాగ్యాలను పట్టించుకునే వాడు కాదు. రెండవ కుమారుడు ఖుత్రూస్ ప్రాపంచిక సుఖభోగాలంటే పడిచచ్చేవాడు. చెడు నడతకు అలవాటు పడినవాడు. తండ్రి చాలా సంపన్నుడు. తండ్రి మరణించిన తర్వాత ఇద్దరు సోదరులూ వారసత్వంగా ఆ సంపదను సమాన భాగాలుగా పంచుకున్నారు.

యహూదా తన భాగాన్ని అందుకున్న తర్వాత అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించాడు. "అల్లాహ్! నేను ఈ సంపదను నీ ప్రసన్నత పొందే మార్గంలో ఖర్చు చేస్తాను" అన్నాడు. అతని ఇంటికి వచ్చిన అవసరార్థులైన వారెవ్వరూ ఉత్తచేతుల్తో వెళ్ళేవారుకాదు. తన సంపదలో అధిక భాగం మంచి పనుల కోసం ఖర్చు చేసేవాడు. తన కోసం చాలా తక్కువ మిగిలినప్పటికీ అతను మాత్రం సంతృప్తితో ఉండేవాడు.

## ప్రాపంచిక ఆకర్షణలు

అతని సోదరుడు ఖుత్రూస్ ఎన్నడూ

https://teluguislam.net



దానధర్మాలు చేసేవాడు కాదు. అతని సంపద రోజురోజుకూ పెరిగింది. బీదలు ఎంత మొత్తుకున్నా అతని హృదయం కరిగేది కాదు. అతను రెండు తోటలను కొన్నాడు. వాటిని అభివృద్ధి చేయడానికి తన సంపద, తన శక్తి సామర్థ్యాలు అన్నీ వెచ్చించాడు. ఆ తోటలు పట్టణంలో ప్రముఖ తోటలుగా పేరుపొందాయి. వాటి కోసం రోడ్డు వేయించాడు. తోటల్లోని చెట్ల మధ్యగా సెలయేరు ప్రవహించేలా చేశాడు. తోటలోని పూల సువాసన చాలా దూరం వరకు వ్యాపించేది. అతని తోటలో కాస్త నడిస్తే స్వర్గవనాల్లో విహరించి నట్లేనని ప్రఖ్యాతి పొందింది. పచ్చని దట్టమైన చెట్లు, వాటి మధ్య సెలయేరు, ప్రకృతి సౌందర్యం అక్కడ తొణికిస లాడేది. మనసు ప్రశాంతమయ్యేది. ఆ అందమైన తోటను చూడడానికి ప్రజలు చాలా దూరం నుంచి వచ్చేవారు. తన తోట ప్రసిద్ధికెక్కడం చూసి ఖత్రూస్ చాలా ఆనందించాడు. అంతేకాదు, ఈ పేరు ప్రతిష్టల వల్ల అతను అహంభావిగా మారాడు. తన పట్ల అల్లాహ్ ప్రత్యేకంగా అనుగ్రహాలు కురిపిస్తున్నాడని, తన సంపద అందుకు నిదర్శనమని భావించేవాడు.

## సోదరుణ్ణి కించపరచడం

ఒక రోజు అతని సోదరుడు యహూదా అతని వద్దకు వచ్చాడు. ఖత్రూస్ అతన్ని చిన్నచూపు చూస్తూ, "నీకు వారసత్వంగా లభించిన సంపద ఏమయ్యింది? చూడు ఎలా ఉన్నావో.. నీ దుస్తులు పరమ మురికిగా ఉన్నాయి. నీకు సేవకులు ఎవరూ లేరు. కాని నన్ను చూడు, మనిషి కోరుకునేవి అన్నీ నా వద్ద ఉన్నాయి. నా వద్ద సంపద ఉంది. పిల్లలు ఉన్నారు. సేవకులు ఉన్నారు. స్నేహితులు ఉన్నారు. ఇంకా ప్రసిద్ధికెక్కిన తోటలు ఉన్నాయి. రా.. భూమిపై స్వర్గం ఎలా ఉంటుందో చూపిస్తాను. నువ్వు ఎప్పుడూ తీర్పుదినం గురించి, పరలోకం గురించి చెబుతుంటావు కదా.. ఒకవేళ ఆ రోజు వస్తే...ఆ రోజున కూడా నేడు ఎంతగా సౌభాగ్యాలు పొందానో అన్ని సౌభాగ్యాలు పొందుతానన్న నమ్మకం నాకుంది" అన్నాడు. దానికి యహూదా జవాబిస్తూ, "సోదరా! నువ్వు అల్లాహ్ పట్ల విశ్వాసాన్ని తిరస్కరిస్తున్నావు. మరణానంతర జీవితాన్ని, తీర్పుదినాన్ని నిరాకరిస్తున్నావు. దేవుని స్వర్గాన్ని ఊహించడం కూడా సాధ్యం కాదు. ఆయన మనిషిని మట్టి నుంచి పుట్టించాడు. మనిషి వీర్యాన్ని ఆయన సురక్షితమైన స్థానంలో ఉంచాడు. తర్వాత దానిని ఒక నెత్తుటి ముద్దగా మార్చాడు. ఆ పిదప దానిని ఒక మాంసపు ఖండంగా మార్చాడు. తర్వాత దానికి కండరాలు, ఎముకలు చేర్చాడు. ఆ విధంగా మానవుడిని సృష్టించాడు. సృష్టికర్త, నిన్ను అద్భుతమైన ఆకారంలో



సృష్టించినవాడు. మరణానంతరం కూడా ఆయన నిన్ను మళ్ళీ బ్రతికించగలడు. ఒకప్పుడు ఉన్న దానిని మళ్ళీ సృష్టించడం అన్నది అసలు లేనిదానిని సృష్టించడం కన్నా చాలా తేలిక. ప్రాపంచిక ఆకర్షణలను చూసి నీ దృష్టి చెదిరిపోయింది. నీ మనసు మొద్దుబారిపోయింది. నేను బీదవాడిని కాబట్టి నువ్వు నన్ను తక్కువగా చూస్తున్నావు. ప్రాపంచిక సంపదల పట్ల నీ ప్రేమ నిన్ను కుహనా దేవుళ్ళను ఆరాధించేలా చేసింది. నీ బంగారు ఆభరణాలు, నీ తోటలు శాశ్వతమైనవి కావు. చివరకు అవి దుమ్ముధూళిలో కలసిపోతాయి. నీ స్నేహితులు, నీ దుర్మార్గానికి సహాయం చేస్తున్నవారు నిజానికి నీ అసలైన శత్రువులు.

నేను అల్లాహ్‌ను పూర్తిగా నమ్ముకున్నాను. నా సంపదలు నిజానికి నా ఆరోగ్యం, నా మానసిక శాంతి. నేను సాధారణమైన ఆహారం తీసుకుంటాను, కాని నేను ఆరోగ్యంగా జీవించి ఉండడానికి ఆ ఆహారం చాలు. నా జీవన విధానం నన్ను నీ మాదిరిగా అహంభావిగా మారకుండా కాపాడుతుంది. నాకు లభించే ప్రతిఫలం శాశ్వతమైన శాంతి, శాశ్వతమైన సౌభాగ్యాల స్వర్గవనం. కాబట్టి, సోదరా! నువ్వు నీ భౌతిక వస్తుసంపదల ఆరాధనను మానుకో, అవన్నీ అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలుగా గుర్తించి అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించు. నా బీదరికం కారణంగా, నాకున్న తక్కువ సంతానం కారణంగా నన్ను హీనంగా చూసే బదులు నువ్వు నీ అందమైన తోటలోకి వెళ్ళినప్పుడు ఇదంతా అల్లాహ్ అభీష్టమే, అల్లాహ్ శక్తి తప్ప మరో శక్తి ఏదీ లేదు అని అంటే బాగుండేది అన్నాడు. కాని ఖత్రూస్ తన తోటను చూసి పొంగిపోతూ తన సోదరుడు వెళ్ళిపోవడాన్ని చూడనన్నా చూడలేదు.

ఆ తర్వాతి రోజు ఎప్పటి మాదిరిగా ఖత్రూస్ తన తోట చూడడానికి వెళ్ళాడు. కాని తోటను సమీపిస్తూ అక్కడి దృశ్యాన్ని చూసి నిర్ఘాంతపోయి ఆగిపోయాడు. అతని తోటలు పూర్తిగా ధ్వంసమైపోయాయి. అక్కడి సెలయేరు పూర్తిగా అసలు ఎప్పుడూ లేనట్లుగా ఎండిపోయింది. ఖత్రూస్ గొంతు ఎండిపోయింది. అల్లాహ్ పట్ల తన కృతఘ్నత, తన స్వార్థం, అహం, దుర్మార్గాలే తనను నాశనం చేశాయని గుర్తించాడు. కోపంగా తన చేతులు నులుముకుంటూ, "అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించకుండా ఉన్నట్లయితే ఎంత బాగుండును" అనుకున్నాడు. *(చదవండి దివ్యఖుర్ఆన్ : 18:33-44)*

## గ్రహించవలసిన పాఠాలు

- అల్లాహ్‌ను నిరాకరించడం మాత్రమే కుఫ్ర్ (అవిశ్వాసం) కాదు. అహం, గర్వం, ఆడంబరాలు, పరలోకాన్ని కాదనడం కూడా కుఫ్ర్‌కు దారితీస్తాయి.
- తన సౌభాగ్యాలు, తన హోదాసంపదలన్నీ తన సొంత శక్తిసామర్థ్యాల వల్లనే లభించాయని, అల్లాహ్ అనుగ్రహం ఇందులో ఏమీ లేదని, తాను అల్లాహ్‌కు జవాబు చెప్పుకోవలసిన అవసరం లేదని భావించేవాడు కూడా అవిశ్వాసియే. అల్లాహ్ విధించే శిక్ష అనూహ్యంగా, అతి తీవ్రంగా ఉంటుంది.
- దేవుని అనుగ్రహాలు, సౌభాగ్యాలకుగాను 'మాషా అల్లాహ్, లా ఖువ్వత ఇల్లా బిల్లాహ్' (ఇదంతా అల్లాహ్ అభీష్టమే. అల్లాహ్ శక్తి తప్ప మరో శక్తి ఏదీలేదు) అని పలకాలి. ఇది దివ్యఖుర్‌ఆన్ నేర్పిన గొప్ప ప్రార్థన.

https://teluguislam.net



# ప్రవక్త యూనుస్

(అలైహిస్సలాం)

**చేప కడుపులో సజీవంగా మిగిలిన మనిషి**

**(800-750 క్రీ.పూ.)**



యూనుస్‌ను చేప మ్రింగేసింది. అప్పుడు అతను తన్ను తానే నిందించుకోసాగాడు. ఒకవేళ అతను (అల్లాహ్) పవిత్రతను కొనియాడటంలో నిమగ్నుడై ఉండకపోతే... పునరుత్థానదినం వరకు చేప కడుపు లోనే ఉండిపోయేవాడు.

(ఖుర్‌ఆన్ *37 : 141-143*)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

నైనవాహ్ పట్టణ ప్రజలు విగ్రహారాధకులు. వారి జీవన విధానం సిగ్గు-లజ్జ లేకుండా ఉండేవి. వారి వద్దకు ప్రవక్త యూనుస్(అస)ను అల్లాహ్ పంపించాడు. వారిని సంస్కరించడానికి, అల్లాహ్‌ను ఆరాధించేలా వారిని తీర్చిదిద్దడానికి ప్రవక్త యూనుస్ (అస) వచ్చారు. తమ ఆరాధనా విధానంలో యూనుస్ జోక్యం వారికి నచ్చలేదు. "మా తాతముత్తాతలు ఈ దేవుళ్ళనే ఆరాధించారు. మేము వీటిని చాలా కాలంగా ఆరాధిస్తున్నాము. మాకు ఎలాంటి హాని కలుగలేదు" అని వారు ఆయన మాటలను తిరస్కరించారు.

విగ్రహారాధన ఎంత అవివేకమైనదో, అల్లాహ్ ఆరాధనలోని ఔచిత్యమెంత గొప్పదో ఆయన వారికి నచ్చజెప్పడానికి చాలా విధాలుగా ప్రయత్నించారు. కాని వారు ఆయన మాటలు వినలేదు. తమ విధానాలు మార్చుకోనట్లయితే అల్లాహ్ శిక్ష విరుచుకుపడుతుందని ఆయన వారిని హెచ్చరించారు. అయినా వారు లక్ష్యపెట్టలేదు. తాము ఏ శిక్షకూ భయపడమని అన్నారు. ఆ శిక్ష ఏంటో రానీ చూద్దాం అన్నారు. నిరాశకు గురయిన యూనుస్ (అస) వారితో, "అలా అయితే నేను మిమ్మల్ని మీ దురదృష్టానికి వదలి వేస్తున్నాను" అన్నారు. ... తర్వాత ఆయన అల్లాహ్ శిక్ష ... పట్టణాన్ని చుట్టుకుంటు... ఆ పట్టణాన్ని వదలి వెళ్ళిపో...

### గ్రహించవలసిన పాఠాలు

- అల్లాహ్‌ను నిరాకరించడం మాత్రమే కుఫ్ర్ (అవిశ్వాసం) కాదు. అహం, గర్వం, ఆడంబరాలు, పరలోకాన్ని కాదనడం కూడా కుఫ్ర్‌కు దారితీస్తాయి.
- తన సౌభాగ్యాలు, తన హోదాసంపదలన్నీ తన సొంత శక్తిసామర్థ్యాల వల్లనే లభించాయని, అల్లాహ్ అనుగ్రహం ఇందులో ఏమీ లేదని, తాను అల్లాహ్‌కు జవాబు చెప్పుకోవలసిన అవసరం లేదని భావించేవారు కూడా అవిశ్వాసులే. అల్లాహ్ విధించే శిక్ష అనూహ్యంగా, అతి తీవ్రంగా ఉంటుంది.
- దేవుని అనుగ్రహాలు, సౌభాగ్యాలకుగాను 'మాషా అల్లాహ్, లా ఖువ్వత ఇల్లా బిల్లాహ్' (ఇదంతా అల్లాహ్ అభీష్టమే. అల్లాహ్ శక్తి తప్ప మరో శక్తి ఏదీలేదు) అని పలకాలి. ఇది దివ్యఖుర్‌ఆన్ నేర్పిన గొప్ప ప్రార్థన.

https://teluguislam.net



# ప్రవక్త యూనుస్

(అలైహిస్సలాం)

చేప కడుపులో సజీవంగా మిగిలిన మనిషి

(800-750 క్రీ.పూ.)



యూనుస్‌ను చేప మ్రింగేసింది. అప్పుడు అతను తన్ను తానే నిందించుకోసాగాడు. ఒకవేళ అతను (అల్లాహ్) పవిత్రతను కొనియాడటంలో నిమగ్నుడై ఉండకపోతే... పునరుత్థానదినం వరకు చేప కడుపు లోనే ఉండిపోయేవాడు.

(ఖుర్‌ఆన్ 37 : 141-143)

నైనవాహ్ పట్టణ ప్రజలు విగ్రహారాధకులు. వారి జీవన విధానం సిగ్గు-లజ్జ లేకుండా ఉండేవి. వారి వద్దకు ప్రవక్త యూనుస్(అస)ను అల్లాహ్ పంపించాడు. వారిని సంస్కరించడానికి, అల్లాహ్‌ను ఆరాధించేలా వారిని తీర్చిదిద్దడానికి ప్రవక్త యూనుస్ (అస) వచ్చారు. తమ ఆరాధనా విధానంలో యూనుస్ జోక్యం వారికి నచ్చలేదు. "మా తాతముత్తాతలు ఈ దేవుళ్ళనే ఆరాధించారు. మేము వీటిని చాలా కాలంగా ఆరాధిస్తున్నాము. మాకు ఎలాంటి హాని కలుగలేదు" అని వారు ఆయన మాటలను తిరస్కరించారు.

విగ్రహారాధన ఎంత అవివేకమైనదో, అల్లాహ్ ఆరాధనలోని ఔచిత్యమెంత గొప్పదో ఆయన వారికి నచ్చజెప్పడానికి చాలా విధాలుగా ప్రయత్నించారు. కాని వారు ఆయన మాటలు వినలేదు. తమ విధానాలు మార్చుకోనట్లయితే అల్లాహ్ శిక్ష విరుచుకుపడుతుందని ఆయన వారిని హెచ్చరించారు. అయినా వారు లక్ష్యపెట్టలేదు. తాము ఏ శిక్షకూ భయపడమని అన్నారు. ఆ శిక్ష ఏంటో రానీ చూద్దాం అన్నారు. నిరాశకు గురయిన యూనుస్ (అస) వారితో, "అలా అయితే నేను మిమ్మల్ని మీ దుర దృష్టానికి వదలి వేస్తున్నాను" అన్నారు. ఆ తర్వాత ఆయన అల్లాహ్ శిక్ష ఇక ఆ పట్టణాన్ని చుట్టుకుంటుందని భయపడి ఆ పట్టణాన్ని వదలి వెళ్ళిపోయారు.

ఆయన పట్టణం వదలి వెళ్ళిన వెంటనే అక్కడి ఆకాశం ఎర్రగా మంటలా మారిపోయింది. ఈ దృశ్యం చూసి ప్రజలు భయపడ్డారు. ఆద్, సమూద్, నూహ్ జాతి ప్రజల వినాశం గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు కూడా అలాంటి గతి పట్టనుందా! అన్న ఆలోచన వారిలో నెమ్మదిగా ధార్మిక విశ్వాసాన్ని సృజించింది. వారంతా ఒక కొండపై గుమిగూడారు. అల్లాహ్ కారుణ్యం కోసం, ఆయన క్షమా భిక్ష కోసం ప్రార్థించడం ప్రారంభించారు. వారి మొరలతో కొండలు ప్రతిధ్వనించాయి. నిజాయితీతో కూడిన పశ్చాత్తాపం వాతావరణమంతా అలముకుంది. అల్లాహ్ వారిపై తన ఆగ్రహాన్ని తొలగించి వారిని మరలా అనుగ్రహించాడు. భయంకరమైన తుఫాను శిక్ష తప్పుకోగానే వారు యూనుస్ ప్రవక్తను మళ్ళీ రావలసిందిగా కోరారు. ఆయన వచ్చి తమకు సరియైన మార్గం చూపించాలని కోరారు.

## పడవ ప్రయాణం

ఈలోగా యూనుస్ ప్రవక్త (అస)ఒక పడవలో ప్రయాణమయ్యారు. ఆయనతో పాటు కొంతమంది ప్రయాణీకులు ఉన్నారు. సముద్రంలో ప్రయాణమైన తర్వాత తీవ్రమైన తుఫాను గాలికి పడవ చిగురుటాకులా వణకిపోసాగింది. పర్వతాల వంటి అలల తాకిడికి పడవ తలక్రిందులైపోతోంది. పడవలో చాలా సామాను ఉంది. ప్రయాణీకులు తమ సామాన్లను పడవ నుంచి బయటకు విసరివేసారు. అయినా పడవలో బరువు చాలా ఎక్కువ ఉంది. ఇంకా బరువు తగ్గించకపోతే పడవకు ప్రమాదం. కాబట్టి కనీసం ఒక వ్యక్తిని సముద్రంలోకి విసిరేస్తే బరువు తగ్గుతుందని మిగిలిన వాళ్ళు బ్రతుకుతారని అనుకున్నారు. అందరూ చీటీలు వేశారు. ఈ లాటరీలో యూనుస్ ప్రవక్త పేరు వచ్చింది.

యూనుస్ ప్రవక్త గురించి వారికి తెలుసు. చాలా మంచివారు, గౌరవనీయుడు. అటువంటి మనిషిని సముద్రంలో వదిలేయడానికి వాళ్ళు ఇష్టపడలేదు. అందువల్ల వాళ్ళు మళ్ళీ లాటరీ వేశారు. రెండవసారి కూడా యూనుస్ ప్రవక్త పేరే వచ్చింది. చివరిసారిగా చూద్దామని మూడవసారి వేశారు. అప్పుడు కూడా యూనుస్ ప్రవక్త పేరే వచ్చింది. ఇందులో అల్లాహ్ అభీష్టం ఉందని యూనుస్ ప్రవక్త గుర్తించారు. ఆయన అల్లాహ్ అనుమతి లేనిదే తన పనిని మధ్యలో వదలివేశారు. ఒక ప్రవక్తగా ఆయన తీవ్రమైన తప్పిదానికి పాల్పడ్డారు.

https://teluguislam.net



ప్రయాణీకులు తనను సముద్రంలో వదిలేయక ముందే ఆయన లేచి అల్లాహ్ పేరు స్మరిస్తూ సముద్రంలోకి దూకారు. భారీ అలల్లో ఆయన కలసిపోయారు.

## చేప కడుపులో

యూనుస్ (అస) కళ్ళు తెరిచేసరికి తాను తడితడిగా మెత్తగా ఉన్న ఒక నేలపై ఉన్నట్లు భావించారు. తన చుట్టూ ఉన్న ప్రదేశం అంతా మూసివేయబడిన ఒక గుహలా ఉంది. అంతా చాలా చీకటిగా ఉంది. కాని చాలా మృదువుగా, మెత్తగా ఉంది. ఆయనకు కుదుపులు తగులుతున్నాయి. అలల్లో పడవకు తగిలే కుదుపుల వంటివి. తాను ఒక పెద్ద చేప కడుపులో ఉన్నట్లు ఆయన గుర్తించారు. తుఫాను సముద్రంలో ఆయన్ను కాపాడడానికి గాను అల్లాహ్ ఆయన్ను ఒక చేప మింగేసేలా చేశాడు. ఆయన వెంటనే అల్లాహ్‌ను తలచుకుని తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. "అల్లాహ్ తప్ప వేరే దేవుడు ఎవరూ లేరు. ఔన్నత్యం ఆయనదే. నిస్సందేహంగా నేను తప్పు చేశాను" అన్నారు. అనంత కరుణామయుడు, అపారంగా క్షమించేవాడయిన అల్లాహ్ ఈ ప్రార్థనను ఆలకించాడు. ఆ వెంటనే తాను బలవంతంగా బయటకు తోయబడిన అనుభూతి యూనుస్(అస)కు కలిగింది. ధడాలున ఆయన మెత్తని నేలపై వచ్చిపడ్డారు. ఆయన్ను బయటకు కక్కేసేలా అల్లాహ్ ఆ చేపకు ఆజ్ఞాపించాడు. యూనుస్ (అస) వెంటనే అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించారు.

ఆయన ఒక నిర్జన ప్రదేశంలో ఉన్నారు. బలహీనంగా, ఒంటరిగా మిగిలిపోయారు. ఆయన పెద్ద పెద్ద ఆకులున్న ఒక పొదలో పడి ఉన్నారు. ఎండ వేడిమి నుంచి ఆ ఆకులు రక్షణ కల్పిస్తున్నాయి. అక్కడ చాలా సొరకాయలు ఉన్నాయి. వాటితో ఆయన తన ఆకలిని తీర్చుకున్నారు. నెమ్మదిగా ఆయన శక్తిని పుంజుకున్నారు. తన స్వస్థలం నైనవాహ్‌కు ప్రయాణమయ్యారు. అక్కడ ప్రజల్లో వచ్చిన మార్పును చూసి చాలా ఆనందించారు. ప్రజలంతా ఆయన్ను చాలా ఆదరంగా స్వాగతించారు. తామంతా నిజమైన దేవుణ్ణి విశ్వసించడం ప్రారంభించామని ఆయనకు తెలిపారు. వారంతా కలసి దేవునికి కృతజ్ఞతా సూచకంగా ప్రార్థనలు చేశారు. *(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 6:86-57, 21:87-88 37:139-158)*

### గ్రహించవలసిన పాఠాలు

- యూనుస్ ప్రవక్త (అస) తనకు అప్పగించబడిన పనిని మధ్యలో విడిచి పెట్టి పట్టణాన్ని వదలి వెళ్ళిపోయారు. ఆయన అల్లాహ్ మార్గదర్శనం కోరకుండానే ఈ నిర్ణయం తీసుకున్నారు. తన నిర్లక్ష్యానికి శిక్షను అనుభవించారు.
- తమపై శిక్ష విరుచుకుపడే సూచనలు కనబడగానే దుర్మార్గులు తమ తప్పును గుర్తించి అల్లాహ్‌ను క్షమాభిక్ష అర్థిస్తూ కారుణ్యం కోసం ప్రార్థించారు. అల్లాహ్ తన ఆగ్రహాన్ని ఉపసంహరించుకుని వారిని సురక్షితంగా విడిచిపెట్టాడు. యూనుస్ ప్రవక్త (అస) విషయంలోనూ ఇదే జరిగింది. అల్లాహ్ ఆయన్ను ఒక విచిత్రమైన, భయంకరమైన సంఘటనకు గురిచేశాడు. ఆయన తన తప్పును గుర్తించి అల్లాహ్‌ను క్షమాభిక్ష కోరారు. అల్లాహ్ కరుణ చూపి ఆయన్ను కాపాడాడు.
- ప్రవక్త యూనుస్ (అస) చేసిన సరళమైన, చిన్న ప్రార్థన చాలా ప్రాముఖ్యం కలిగినది.
- హజ్రత్ సాద్ బిన్ అబీ వక్కాస్ ఉటంకం ప్రకారం, ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "కష్టాల్లో ఉన్న ముస్లిం, యూనుస్ ప్రవక్త చేసిన ప్రార్థనతో దేవునికి మొరపెట్టుకుంటే అల్లాహ్ ప్రతిస్పందిస్తాడు. ఇది అల్లాహ్ చేసిన వాగ్దానంగా భావించబడుతుంది"- లా ఇలాహ ఇల్లా అంత సుబ్‌హానక, ఇన్నీ కుంతు మినజ్జాలిమీన్.

https://teluguislam.net



# ఉజైర్

(అలైహిస్సలాం)

(వందేళ్ళు నిద్రపోయిన మనిషి)

(500-400 క్రీ.పూ.)



అల్లాహ్ (ఉజైర్‌తో) అన్నాడు, "నువ్వు నూరేళ్ళు ఈ స్థితిలో పడిఉన్నావు. నీ అన్నపానీయాల వైపు చూడు. అవి ఏమాత్రం చెడిపోలేదు. మరి నీ గాడిదను కూడా చూసుకో.... మేము (గాడిద) ఎముకలను ఏ విధంగా లేపి, వాటిపై మాంసం నింపుతామో" (ఖుర్‌ఆన్ 2 : 259)

ఉజైర్ (అస) తన తోటలోకి ప్రవేశించి అక్కడి ప్రకృతి సౌందర్యానికి మ్రాన్పడి అలాగే కాసేపు నిలబడి పోయారు. పచ్చగా కళకళలాడే చెట్లు, వాటిపై ఒక కొమ్మ మీద నుంచి మరొక కొమ్మపైకి కిలకిలరావాలతో ఎగిరే పక్షులు, విసన కర్రల్లాంటి చెట్ల ఆకుల నుంచి వీస్తున్న స్వచ్ఛమైన పిల్లతెమ్మెరలు ఆస్వాదిస్తూ తన చేతిలో ఉన్న బుట్టను క్రిందపెట్టారు. అలా చాలా సేపు నిలబడిపోయారు. చెట్ల కొమ్మలు నోరూరించే పండ్ల భారంతో క్రిందికి వంగిపోయి ఉన్నాయి. ఆయన తన బుట్టను తీసుకుని అందులో రకరకాల పండ్లు కోసు కున్నారు. ఆ బుట్టను తన గాడిద వీపున కట్టారు. దానిపై కూర్చుని వెళ్ళిపోయారు.

దారిలో కూడా ప్రకృతి సౌందర్యం గురించి, ప్రకృతిలోని రమణీయత గురించి ఆలోచించి ఆశ్చర్యపోసాగారు. గాడిద దారితప్పి తనను ఎటో తీసుకు పోవడాన్ని ఆయన గుర్తించలేదు. ఆలో చనల నుంచి బయటపడి చూసేసరికి ఆయన ఒక పాడుపడిన ఊరిలో ఉన్నారు. నేలపై మానవుల కంకాళాలు, జంతువుల అస్థిపంజరాలు చెల్లా చెద రుగా పడిఉన్నాయి. వారంతా గతించిన కాలాల ప్రజలని, వారి చిహ్నాలు చిందర వందరగా పడి ఉన్నాయని గ్రహించారు.

https://teluguislam.net



ఆయన గాడిదపై నుంచి క్రిందికి దిగారు. గాడిదపై ఉన్న బరువును క్రిందికి దించి, ఒక కూలిపోయిన గోడకు అనుకుని కూర్చున్నారు. ఆ ఊరి ప్రజలకు ఏమయ్యిందో అని ఆలోచించసాగారు. ఆయనకు మరణానంతర జీవితం గురించి ఆలోచన వచ్చింది. మరణించిన వారు మళ్ళీ ఎలా బ్రతికించబడతారు? ఆయన మనసులో ఇలాంటి ఆలోచనలు ముసురుకున్నాయి. ఆలోచనల్లో మునిగి అలాగే కునికిపాట్లు పడుతూ నిద్రలోకి జారిపోయారు.

అలా రోజులు గడచిపోయాయి, నెలలు గతించాయి. సంవత్సరాలు కాల గర్భంలో కలసిపోయాయి. ఉజైర్ (అస) నిద్రలోనే ఉన్నారు. ఈ సుదీర్ఘకాలంలో ఆయన పిల్లలు, వాళ్ళ పిల్లలు, పిల్లల పిల్లలు ఇలా తరాలు గడచిపోయాయి. జాతులు అంతరించాయి. కొత్త జాతులు ఉనికిలోకి వచ్చాయి.

అల్లాహ్ తన ప్రవక్తలతో వ్యవహరించే తీరు విభిన్నంగా ఉంటుంది. సాధారణ విశ్వాసికి ఆధ్యాత్మిక విశ్వాసానికి సంబంధించిన అనుభూతి లభించక పోయినా అతను తన విధులను నిర్వర్తించవలసి ఉంటుంది. కాని దేవుని సందేశ హరులైన ప్రవక్తలకు వారి విధుల నిర్వహణలో, దేవుని సందేశం ప్రజలకు అందజేయడంలో పటిష్టమైన సంకల్పం అవసరం. అందుకుగాను జీవితానికి సంబంధించిన లోతయిన వాస్తవాలను తెలుసుకోవలసిన అవసరం కూడా వారికి ఉంటుంది. అందుకే ప్రవక్తల వద్దకు దైవదూతలు వచ్చేవారు. స్వర్గనరకాలు, భూమ్యాకాశాలు, మరణానంతరం జీవితం వగైరా వాస్తవాలను వారికి చూపించడం జరిగేది.

## మెలకువ

ఉజైర్ (అస) తన దీర్ఘనిద్ర నుంచి మేల్కొన్నారు. అల్లాహ్ ఆదేశానుసారం ఆయన నిద్ర పూర్తయ్యింది. ఆయన నిద్రపోయినప్పుడు ఎలా ఉన్నారో నిద్ర లేచినప్పుడు కూడా అలాగే ఉన్నారు. ఒక దైవదూత ఆయన ముందు ప్రత్యక్షమయ్యాడు. ఉజైర్‌తో దైవదూత, "ఎంతకాలం నిద్రపోయానని భావిస్తున్నావు?" అని ప్రశ్నించాడు. ఉజైర్ (అస) జవాబిస్తూ, "నేను రోజులో చాలా భాగం నిద్ర పోయి ఉంటాను" అన్నారు. దైవదూత ఆయన్ని చూస్తూ, "కాదు, నువ్వు వంద సంవత్సరాలు నిద్రపోయావు. చూడు! నీ పండ్లు అప్పుడు ఎంత తాజాగా ఉన్నాయో ఇప్పుడు కూడా అంతే తాజాగా ఉన్నాయి. నీ త్రాగునీరు కూడా చాలా స్వచ్ఛంగా ఉంది. కాని నీ గాడిదను చూడు, కేవలం దాని అస్థిపంజరం మాత్రమే



మిగిలి ఉంది. ఇప్పుడు.. అల్లాహ్ మహత్యాన్ని చూడు..మరణించిన వారిని మళ్ళీ ఆయన ఎలా బతికిస్తాడో అర్థం చేసుకో.. దీన్ని నీ ప్రభువు తరపు నుంచి నిదర్శనంగా భావించు. నీ మనస్సులో ఉన్న అనుమానాలన్నీ తొలగించుకో" అన్నాడు.

ఉజైర్ (అస) చూస్తుండగానే గాడిద అస్థిపంజరంపై మాంసం కండరాలు చోటు చేసుకున్నాయి. గాడిద మళ్ళీ సజీవంగా లేచి నిలబడింది. ఆయన ఆశ్చర్యంగా, "అల్లాహ్ ఏమైనా చేయగల శక్తి కలిగినవాడని నేనిప్పుడు దృఢంగా నమ్ముతున్నాను" అన్నారు.

## అంతరించిన గతం

ఉజైర్‌కు తెలిసిన ప్రాంతాలన్నీ పూర్తిగా మారిపోయాయి. తన ఇంటిని వెదకడానికి చాలా సమయం పట్టింది. చివరకు ఇంటికి చేరుకుంటే అక్కడ ఆయనకు ఒక వృద్ధమహిళ కనబడింది. ఆమె కళ్ళు కనబడడం లేదు. కాని ఆమె జ్ఞాపకశక్తి చాలా బలంగా ఉంది. ఉజైర్ (అస) ఆమెను గుర్తించారు. తాను ఇల్లు వదలి వచ్చినప్పుడు ఆమె తన ఇంటిలో పనిచేసే చిన్నపిల్ల. ఆయన ఆమెతో, "ఇది ఉజైర్ ఇల్లేనా" అని ప్రశ్నించారు. ఆమె సమాధానం ఇస్తూ, "అవును" అంది. ఆమె దుఃఖంతో, "ఉజైర్ ఇల్లు వదలి వెళ్ళిపోయారు. చాలా సంవత్సరాలైపోయాయి. ఆ తర్వాత ఎవరికీ ఆయన ఎక్కడికెళ్ళిందీ తెలియరాలేదు. ఆయన గురించి తెలిసిన వాళ్ళు చాలా మంది చనిపోయారు. చాలా కాలంగా ఆయన పేరు ప్రస్తావించిన వాళ్ళు కూడా లేరు" అంది. ఉజైర్ (అస) ఆమెతో, "నేనే ఉజైర్. అల్లాహ్ అభీష్టం వల్ల నేను చాలా కాలం నిద్ర పోయాను. అల్లాహ్ నన్ను వంద సంవత్సరాల తర్వాత నిద్ర లేపాడు" అన్నారు.

ఈ మాటలు విని ఆ వృద్ధమహిళ చాలా ఆశ్చర్యపోయింది. కాస్సేపు ఏమీ మాట్లాడలేదు. తర్వాత, "ఉజైర్ (అస) చాలా ధర్మాత్ముడు. అల్లాహ్ ఆయన ప్రార్థనలను వినేవాడు. ఆయన రోగుల స్వస్థత కోసం ప్రార్థించిన ప్రతిసారీ వారికి ఆరోగ్యం చేకూరేది. కాబట్టి, నువ్వు ఉజైర్‌వే అయితే నా ఆరోగ్యం కోసం, నా కంటిచూపు కోసం అల్లాహ్‌ను ప్రార్థించు" అని అడిగింది.

ఉజైర్ (అస) అల్లాహ్‌ను వేడుకున్నారు. అల్లాహ్ ఆయన ప్రార్థనలకు ప్రతిస్పందించాడు. ఆ వృద్ధమహిళకు ఆరోగ్యం చేకూరింది. ఆమె కంటిచూపు మళ్ళీ వచ్చింది. ఆమె ఆయనకు ధన్యవాదాలు చెప్పి ఈ వార్త అందరికీ

https://teluguislam.net



చెప్పడానికి తక్షణమే బయటకు వెళ్ళింది. ఉజైర్ పిల్లలు, మనుమలు, మనుమల పిల్లలు అందరూ పరుగున వచ్చారు. యువకునిగా కనబడుతున్న ఉజైర్‌ని చూసి ఆయన తమకు తాతగారని వారు నమ్మలేకపోయారు. "ఇది నిజమా!" అని గుసగుసలాడు కోసాగారు. ప్రస్తుతం ముసలివాడై పోయిన ఉజైర్ కొడుకు ఒకరు "నా తండ్రికి భుజంపై ఒక పుట్టుమచ్చ ఉండేది. మా అందరికీ ఆ పుట్టుమచ్చ గురించి బాగా తెలుసు. మీరు ఆయనే అయితే ఆ పుట్టుమచ్చ చూపించండి" అని ప్రశ్నించాడు. ఉజైర్ తన భుజంపై ఉన్న పుట్టుమచ్చను చూపించారు. అయినా వారికి సంతృప్తి కలగలేదు. మరో కుమారుడు, "జెరుసలేమ్‌ను బుఖ్తేనస్సర్ ఆక్రమించుకుని తౌరాత్ గ్రంథాలన్నింటినీ ధ్వంసం చేసినప్పటి నుంచి తౌరాత్ కంఠస్థం చేసిన వాళ్ళు చాలా తక్కువ మంది మిగిలారు. అలా తౌరాత్ కంఠస్థం చేసిన వారిలో మా తండ్రిగారు కూడా ఒకరు. మీరు ఆయనే అయితే తౌరాత్ వినిపించండి" అనడిగాడు. ఉజైర్ తౌరాత్ మొత్తం పఠించి వినిపించారు. ఆయన స్వరానికి వారు మంత్రముగ్ధులై విన్నారు. నిజంగా ఉజైర్ (అస) తిరిగి వచ్చారని వారికి అప్పటికి నమ్మకం కలిగింది. అందరూ ఆయన్ను ప్రేమతో కౌగిలించుకున్నారు. ఆనంద భాష్పాలు రాల్చారు.

ఆ పిదప యూదులు, "అల్లాహ్ ఉజైర్‌ను మళ్ళీ బ్రతికించాడు. కాబట్టి ఆయన తప్పక అల్లాహ్ కుమారుడై ఉండాలి" అనడం ప్రారంభించారు.

*(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 9:30, 2:259)*

### గ్రహించవలసిన పాఠాలు

- సాధారణంగా మనిషి కళ్ళకు కనబడే వాటిని పట్టించుకోకుండా తమ స్వంత ఆలోచనలకు ప్రాధాన్యం ఇస్తారు. ఉజైర్ తిరిగి రావడం అల్లాహ్ చూపించిన మహత్యంగా గ్రహించే బదులు యూదులు ఆయన్ను దేవుని కుమారునిగా పిలువడం ప్రారంభించారు.



# ప్రవక్త అయ్యూబ్
## (అలైహిస్సలాం)
## సహనశీలికి ఎదురైన పరీక్షలు

మరి అయ్యూబు (స్థితిని గురించి కూడా ఓసారి మననం చేసుకోండి). అతను "నాకు ఈ వ్యాధి సోకింది. నువ్వు కరుణించే వారందరిలోకీ అపారంగా కరుణించే వాడవు" అని తన ప్రభువును మొరపెట్టుకున్నప్పుడు, మేము అతని ప్రార్థనను ఆలకించి, ఆమోదించాము. అతని బాధను దూరం చేశాము.

**(ఖుర్‌ఆన్ 21 : 83, 84)**

కొందరు దైవదూతలు అల్లాహ్ సృష్టిలోని కొన్ని ప్రాణుల గురించి మాట్లాడు కోసాగారు. విధేయత చూపి అల్లాహ్ ప్రసన్నతను పొందిన వారి గురించి వారు చర్చించుకోసాగారు. అలాగే అహంభావంతో విర్రవీగి అల్లాహ్ ఆగ్రహాన్ని కొని తెచ్చుకున్న వారి గురించి సంభాషిస్తుండగా ఒక దైవదూత, "ప్రస్తుతం భూమిపై ఉన్న వారిలో అత్యుత్తముడు అయ్యూబ్. ఆయన ఉన్నత వ్యక్తిత్వం కలిగినవాడు. గొప్ప సహనశీలి. ఎల్లప్పుడూ అపార కరుణామయుడైన విశ్వప్రభువును స్మరిస్తూ ఉంటాడు. అల్లాహ్‌ను ఆరాధించే వారికి ఆయన గొప్ప ఆదర్శం. అందుకు ప్రతిఫలంగా అల్లాహ్ ఆయనకు దీర్ఘాయుష్షు ప్రసాదించాడు. అపార సంపదలు ఇచ్చాడు. అయ్యూబ్ ఎన్నడూ అహంభావానికి పాల్పడలేదు. స్వార్థం ఆయనలో లేనేలేదు. ఆయన కుటుంబం, ఆయన సేవకులు, అవసరార్థులు, బీదలు అందరూ ఆయన సంపదలో భాగం పొందుతున్నారు. ఆయన బీదలకు అన్నంపెడతారు. వారికి దుస్తులు ఇస్తారు. బానిసలకు స్వేచ్ఛ ప్రసాదించడం కోసం వారిని కొంటారు. తన నుంచి దానధర్మాలు పొందేవారు తనకు ఉపకారం చేస్తున్న

https://teluguislam.net



ట్లుగా ఆయన వ్యవహరిస్తారు. ఆయన చాలా ఉదార స్వభావి, చాలా మంచి వాడు" అంటూ ప్రశంసించారు.

## ఇబ్లీస్ పగ

ఈ మాటలను ఇబ్లీస్ విన్నాడు. వాడికి చాలా కోపం వచ్చింది. అయ్యూబ్ (అస)ను ఎలాగైనా ప్రలోభపెట్టి ఆయన ధార్మిక విశ్వాసాన్ని దెబ్బతీయాలని, ఆయన్ను పతనం చేయాలని భావించాడు. వెంటనే ఆయన వద్దకు పోయాడు. ఆయన ప్రార్థనలను చెడగొట్టడానికి ప్రయత్నించాడు. ప్రపంచంలోని సుఖభోగాల గురించి ఆయనలో భావాలను రేకెత్తించడానికి చూశాడు. కాని అయ్యూబ్ నిజమైన విశ్వాసి. చెడు భావాలు తనను వశపరచుకోకుండా ఆయన జాగ్రత్త పడ్డారు. ఇది చూసి ఇబ్లీస్ మరింత అసహనానికి లోనయ్యాడు. అయ్యూబ్ అంటే వాడిలో మరింత ద్వేషం పెరిగింది.★

ఇబ్లీస్ ఒక పథకం వేశాడు. అల్లాహ్‌కు అయ్యూబ్ (అస) గురించి ఫిర్యాదు చేశాడు. అయ్యూబ్ నిరంతరం అల్లాహ్‌ను స్మరిస్తున్నప్పటికీ అదంతా స్వార్థంతో చేస్తున్నదేననీ, ఆయన నిజాయితీగా దైవస్మరణ చేయడంలేదని, అల్లాహ్ తనకిచ్చిన సంపదను వెనక్కి తీసుకుంటాడన్న భయంతో మాత్రమే ఆయన దైవ స్మరణ చేస్తున్నాడని, ఆయనదంతా ప్రదర్శన మాత్రమేనని, దురాశతో అల్లాహ్‌ను నమ్మించడానికి ప్రదర్శిస్తున్న దైవభక్తి మాత్రమేనని అన్నాడు. "మీరు గనుక అయ్యూబ్ కిచ్చిన సంపద వెనక్కి తీసుకుంటే, ఇక మీ నామస్మరణ చేయడు. నమాజులు మానేస్తాడు" అని అల్లాహ్‌తో అన్నాడు ఇబ్లీస్.

అయ్యూబ్ నిజాయితీ కలిగిన దైవభక్తుడనీ, కేవలం సంపద కోసం తనను ఆరాధించే వ్యక్తి కాదని, అయ్యూబ్ హృదయపూర్వకంగా తన పట్ల భక్తివిశ్వాసాలు కలిగిన వ్యక్తి అనీ, భౌతిక సంపదలకు - ఆయనగారి భక్తివిశ్వాసాలకు ఎలాంటి

★ ఆదమ్ (అస) విషయంలో ఇబ్లీస్ ఎలా వ్యవహరించాడో, ఏ విధంగా తిరస్కారానికి పాల్పడి అల్లాహ్ ఆగ్రహానికి గురయ్యాడో, ఎలా స్వర్గం నుంచి బహిష్కరించబడ్డాడో పాఠకులు ఇంతకు ముందు చదివారు. ఇబ్లీస్‌కు తీర్పుదినం వరకు అల్లాహ్ వ్యవధిని ఇచ్చాడు. అప్పటి వరకు వాడు తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరించే స్వేచ్ఛను కలిగి ఉన్నాడు.



సంబంధం లేదని అల్లాహ్ సెలవిచ్చాడు. అయ్యూబ్ ప్రవక్త భక్తివిశ్వాసాలు, ఆయన సహనశీలం గురించి ఇబ్లీస్‌కు అర్థమయ్యేలా చేయడానికి అల్లాహ్ నిర్ణయించు కున్నాడు. ఇబ్లీస్‌తో, "నువ్వు, నీ సహాయకులు అయ్యూబ్ సంపద విషయంలో మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి" అని స్వేచ్ఛ ఇచ్చాడు.

## మొదటి పరీక్ష

ఇబ్లీస్ చాలా ఆనందించాడు. తన సహాయకులందరినీ ప్రోగుచేసు కున్నాడు. అయ్యూబ్(అస) గారి పశుసంపదను, పొలాలను, సేవకులను, భోగభాగ్యాలన్నీ నాశనం చేసి ఆయన వద్ద చిల్లిగవ్వ లేకుండా చేయడానికి బయలుదేరాడు. సంతోషంతో అయ్యూబ్ వద్దకు వచ్చాడు. ఒక వృద్ధజ్ఞాని రూపంలో అయ్యూబ్ ముందు హాజరయ్యాడు. ఆయనతో, "నీ సంపద మొత్తం పోయింది. నువ్వు దానధర్మాలకు చాలా ఖర్చు చేస్తావు కాబట్టి, అల్లాహ్‌ను ప్రార్థిస్తూ నీ సమయాన్నంతా వ్యర్థం చేస్తున్నందువల్ల నీ సంపద నాశన మయ్యిందని కొందరు చెబుతున్నారు. నీ శత్రువులకు ఆనందం కలిగించడానికే అల్లాహ్ ఇదంతా చేశాడని మరికొందరు అంటున్నారు. నష్టం కలుగకుండా కాపాడే శక్తి అల్లాహ్‌కు ఉన్నట్లయితే నీ సంపదను ఆయన కాపాడి ఉండేవాడు" అన్నాడు. కాని అయ్యూబ్ (అస) నిజమైన విశ్వాసి. ఆయన జవాబిస్తూ, "నా నుంచి అల్లాహ్ తీసుకున్నదంతా నిజానికి అల్లాహ్‌కు చెందినదే. నాకు కేవలం కొంతకాలానికి మాత్రమే ఆ సంపద అధీనం చేయబడింది. అల్లాహ్ తనకు ఇష్టం వచ్చిన వారికి ఇస్తాడు, తనకు ఇష్టం వచ్చిన వారి నుంచి తీసుకుంటాడు" అని చెప్పి ఆయన అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడ్డారు.

ఇదంతా చూసిన ఇబ్లీస్ చాలా నిరాశకు గురయ్యాడు. మళ్ళీ అల్లాహ్‌తో, "నేను అయ్యూబ్ సంపద అంతా నాశనం చేశాను. అయినా ఆయన మీ పట్ల విశ్వాసంగా ఉన్నాడు. కాని నిజానికి అతను తన నిరాశను దాచుకుంటున్నాడు. ఎందుకంటే, అతనికి చాలామంది సంతానం ఉన్నారు. వారి ద్వారా మళ్ళీ సంపద పొందాలని ఆశిస్తున్నాడు. కాబట్టి అతని సంతానంపై నాకు అధికారాన్ని ప్రసాదించాలని కోరుతున్నాను. తండ్రికి సంతానం వల్లనే నిజమైన పరీక్ష ఎదురవుతుంది. అప్పుడు అయ్యూబ్ ఎలా తిరస్కారానికి పాల్పడుతాడో మీరే చూస్తారు" అన్నాడు.

https://teluguislam.net



అల్లాహ్ ఇబ్లీస్‌కు అతడు కోరిన అధికారాన్ని ఇచ్చాడు. నువ్వేం చేసినా అయ్యూబ్ (అస)లో భక్తివిశ్వాసాలను ఇసుమంత కూడా తగ్గించలేవని హెచ్చరించాడు.

## రెండవ పరీక్ష

ఇబ్లీస్ తన సహాయకులందరితో మళ్ళీ అయ్యూబ్ (అస)పై కుట్రలు అమలు చేశాడు. అయ్యూబ్ (అస) సంతానం నివసిస్తున్న ఇంటి పునాదులను కుదిపేశాడు. ఇల్లు కుప్పకూలింది. పిల్లలందరూ మరణించారు. ఆ పిదప అయ్యూబ్ వద్దకు పెద్ద సానుభూతిపరునివలే నటిస్తూ వెళ్ళాడు. ఆయన్ను ఓదారుస్తున్నట్లు నటిస్తూ, "మీ పిల్లలు మరణించిన పరిస్థితులు చాలా విచారకరమైనవి. నిజంగా మీరు ప్రార్థిస్తున్న దేవుడు మీ ప్రార్థనలకు సరయిన ప్రతిఫలం ఇవ్వడం లేదు" అన్నాడు. ఈ మాటలు చెప్పి అయ్యూబ్ (అస) ఏమంటారో అని ఆత్రుతగా ఎదురుచూడసాగాడు. ఇక ఇప్పుడు అయ్యూబ్ (అస) నిజంగా అల్లాహ్‌ను తిరస్కరిస్తూ మాట్లాడుతారని వాడి ఆశ. కాని అయ్యూబ్ (అస) జవాబు వాడిని మరింత నిరాశకు గురిచేసింది. ఆయన వాడికి జవాబిస్తూ, "ఇచ్చేవాడు అల్లాహ్‌యే.. ఆయన తానిచ్చినది కొన్నిసార్లు తీసుకుంటాడు. అల్లాహ్ కొన్నిసార్లు ప్రసన్నుడవుతాడు, కొన్నిసార్లు ఆగ్రహిస్తాడు. అంతా మన ఆచరణలను బట్టి ఉంటుంది. నాకు మంచి జరిగినా, చెడు జరిగినా ఏం జరిగినా నేను మాత్రం అల్లాహ్ పట్ల నా విశ్వాసం విషయంలో స్థిరంగా ఉంటాను. సృష్టికర్తకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను" అన్నారు. ఈ మాటలు చెప్పి ఆయన అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడ్డారు. ఇదంతా చూసిన ఇబ్లీస్ చాలా నిరాశకు గురయ్యాడు.

## మూడవ పరీక్ష

ఇబ్లీస్ మళ్ళీ అల్లాహ్‌తో, "ప్రభూ! అయ్యూబ్ సంపద అంతా పోయింది. అతని సంతానం అందరూ మరణించారు. కాని అతను శారీరకంగా చాలా ఆరోగ్యంగా ఉన్నాడు. అతను మంచి ఆరోగ్యంతో ఉన్నంత కాలం మిమ్మల్ని ఆరాధిస్తునే ఉంటాడు. ఆ విధంగా తన సంపదను, సంతానాన్ని మళ్ళీ పొందాలని ప్రయత్నిస్తాడు. కాబట్టి నాకు అతని శరీరంపై అధికారాన్ని ఇవ్వండి. నేను అతని



శరీరాన్ని బలహీనం చేసివేస్తాను. అప్పుడు మీరే చూస్తారు, అతను ఏ విధంగా తిరస్కారానికి పాల్పడుతాడో!" అన్నాడు. ఇబ్లీస్‌కు ఒక గుణపాఠం గరపాలని అల్లాహ్ నిర్ణయించుకున్నాడు. అయ్యూబ్ నిజమైన భక్తివిశ్వాసాలు కలిగిన వారని వాడికి స్పష్టంగా తెలియజేయాలని భావించాడు. అందువల్ల ఇబ్లీస్‌కు అతడి మూడవ కోరికను కూడా మన్నించాడు. అయితే ఒక షరతు పెట్టాడు. "అతని శరీరంపై నీకు అధికారం ఇస్తాను. కాని అతని ఆత్మపై, అతని మనోమస్తిష్కాలపై మాత్రం కాదు. ఎందుకంటే, ఈ ప్రదేశాల్లో నాకు సంబంధించిన జ్ఞానం, నా ధర్మం ఉంటాయి" అన్నాడు.

ఇబ్లీస్ తనకు లభించిన కొత్త అధికారంతో అయ్యూబ్ (అస) శరీరంపై దాడి చేసి దానిని అనేక వ్యాధులకు గురయ్యేలా చేశాడు. చివరకు ఆయన శరీరం కేవలం ఎముకల గూడుగా మిగిలింది. అస్థిపంజరానికి చర్మం తొడిగిన మాదిరిగా తయారయ్యింది. అనేక శారీరక బాధలతో ఆయన అలమటించడం ప్రారంభమయ్యింది. కాని ఈ బాధలన్నింటినీ ఆయన భరించారు. ఎల్లప్పుడూ అల్లాహ్ పట్ల తన విశ్వాసంలో పటిష్టంగా నిలబడ్డారు. ఈ కష్టాలు, బాధలను సహనంతో భరించడమే కాదు, ఏ విధంగానూ ఆయన ఫిర్యాదు చేయలేదు. అల్లాహ్ దాసులు కష్టాల్లో సహాయం కోసం ఇతరుల వైపు చూడరు. అల్లాహ్ కారుణ్యం పట్ల ఎల్లప్పుడూ ఆశావాదులుగా ఉంటారు. చివరకు అయ్యూబ్ దగ్గరి బంధువులు, మిత్రులు కూడా ఆయన్ను వదిలేశారు. ఆయన్ను అమితంగా ప్రేమించే ఆయన భార్య మాత్రమే ఆయనతో మిగిలారు. ఆయనకు కష్టాల్లో ఆమె వెంట ఉన్నారు. ప్రేమాభిమానాలతో ఆయన్ను చూసుకున్నారు. అనేక సంవత్సరాలుగా ఆయన అనుభవించిన సుదీర్ఘకష్టాల ప్రయాణంలో ఆమె ఆయనకు తోడుగా వెంట నడిచింది.

ఇప్పుడు ఇబ్లీస్ మరింత కలతకు గురయ్యాడు. తన సహాయకులందరినీ సలహాలు అడిగాడు. కాని ఎవరూ అతనికి సలహా ఇవ్వలేకపోయారు. ఇబ్లీస్‌నే వాళ్ళు నిలదీస్తూ, "నీ జిత్తులమారితనం అయ్యూబ్ ముందు విఫలమయ్యిందేంటి? మానవులకు పితామహుడైన ఆదమ్‌ను ప్రలోభపెట్టడంలో నువ్వు సఫలమయ్యావు కదా... ఇక్కడ విఫలమయ్యావేంటి?" అన్నారు.

## నాలుగవ పరీక్ష

ఇబ్లీస్ అయ్యూబ్ ప్రవక్త భార్య వద్దకు వెళ్ళాడు. ఒక మనిషి రూపంలో ఆమె వద్దకు వెళ్ళి, "మీ భర్త ఎక్కడ ఉన్నారు?" అని ప్రశ్నించాడు. ఆమె తన వేలితో మంచంపై నిర్జీవ కళేబరం మాదిరిగా పడి ఉన్న తన భర్తను చూపించింది. "అక్కడ ఉన్నారు. చూడండి, చావుకు బ్రతుకుకు మధ్య ఉన్నారు" అని జవాబిచ్చింది. ఇబ్లీస్ ఆమె పట్ల సానుభూతి చూపుతున్నట్లు నటిస్తూ, ఆమె భర్తతో గడిపిన మంచి రోజులను గుర్తు చేశాడు. అయ్యూబ్ (అస) ఆరోగ్యంగా ఉన్నప్పుడు, వారి వద్ద పుష్కలంగా సంపద, సంతానం ఉన్నప్పటి రోజులను గుర్తు చేశాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ప్రస్తుతం అనుభవిస్తున్న కష్టాలు తలచుకుని ఆమె రోదించింది. దుఃఖంతో అయ్యూబ్ (అస) వద్దకు వెళ్ళి, "మన ప్రభువు విధిస్తున్న ఈ కష్టాలను ఎంత కాలం భరిస్తారు? మనం ఇలాగే సంపద, సంతానం, మిత్రులు ఎవరూ లేకుండా గడుపవలసిందేనా? ఈ కష్టాలను తొలగించాలని మీరు అల్లాహ్‌ను ఎందుకు ప్రార్థించడం లేదు?" అనడిగింది.

అయ్యూబ్ (అస) నిట్టూర్చుతూ... బలహీన స్వరంతో జవాబిచ్చారు. "ఇబ్లీస్ నీలో ఇలాంటి భావాలు రేకెత్తించి ఉంటాడు. అందువల్లనే నీవు అసంతృప్తికి గురయ్యావు. ఒక విషయం చెప్పు, ఎంతకాలం నేను ఆరోగ్యం, సంపదలను అనుభవించాను?" అని ప్రశ్నించారు. ఆమె జవాబిస్తూ, "ఎనభై సంవత్సరాలు" అంది. మళ్ళీ అయ్యూబ్ (అస) ఆమెను ప్రశ్నిస్తూ, "మనం ఎంతకాలంగా కష్టాలను అనుభవిస్తున్నాం?" అనడిగారు. ఆమె జవాబిస్తూ, "ఏడేళ్ళుగా"అని అంది. అప్పుడు అయ్యూబ్ (అస) ఆమెకు జవాబిస్తూ, "అలా అయితే ఈ కష్టాలను తొలగించాలని అప్పుడే నా ప్రభువును కోరడం నాకు సిగ్గుచేటు. ఎందుకంటే నేను ఆరోగ్యం, ఐశ్వర్యాలు అనుభవించినంత కాలం కష్టాలను అనుభవించలేదు. నీ విశ్వాసం బలహీనమైనట్లుంది. నువ్వు అల్లాహ్ సంకల్పం పట్ల అసంతృప్తికి గురయ్యావు. నాకు మళ్ళీ ఆరోగ్యం చేకూరితే, నిన్ను వంద దెబ్బలతో శిక్షిస్తాను. ఈ రోజు నుంచి నీ చేతి నుంచి ఆహారం కాని, పానీయం కాని తీసుకోనని ప్రమాణం చేస్తున్నాను. నన్ను నా మానాన వదిలేయ్. నా ప్రభువు అభీష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది" అన్నారు. ఆమె హృదయ విదారకంగా దుఃఖిస్తూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది. ఆమెకు ఇక వెళ్ళక తప్పలేదు. వేరెక్కడయినా ఆశ్రయం వెదుక్కోక తప్పలేదు.

https://teluguislam.net



## తొలగిన కష్టాలు

ఈ నిస్సహాయ స్థితిలో అయ్యూబ్ ప్రవక్త (అస)దేవుని ప్రార్థనల్లో గడిపారు. దైవకారుణ్యం కోసం వేడుకున్నారు. అంతేకాని ఎలాంటి ఫిర్యాదులు చేయలేదు. "ప్రభూ! నేను ఈ వ్యాధితో చాలా కాలంగా బాధపడుతున్నాను. నీవు పరమ కరుణామయుడివి" అని ప్రార్థిస్తూ గడిపారు. అల్లాహ్ ఆయన ప్రార్థనలకు ప్రతిస్పందించాడు. ఆయనకు జవాబిస్తూ, "నీ కాలితో నేలను కొట్టు, అక్కడి నుంచి నీటి ఊట ఉబికివస్తుంది. ఆ నీటిని త్రాగి, దానితో స్నానం చేయ్" అని అల్లాహ్ సూచించాడు. అయ్యూబ్ (అస) అలాగే చేశారు. ఆ వెంటనే ఆయన ఆరోగ్యం కుదుటపడింది.

ఈలోగా అయ్యూబ్ ప్రవక్త భార్య తన భర్తను వదలి ఎక్కువ రోజులు ఉండలేకపోయారు. ఆయన వద్దకు క్షమాపణ కోరుకోవడానికి వచ్చారు. ఆయన సేవలో గడుపడానికి వచ్చారు. కాని ఇంటిలోకి వచ్చి అక్కడి మార్పును చూసి ఆమె ఆశ్చర్యపోయారు. అయ్యూబ్ (అస) పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు. ఆమె ఆశ్చర్యంతో, ఆనందంతో ఆయన్ను కౌగిలించుకుని, అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించింది.

## ప్రతిజ్ఞ

ఇప్పుడు అయ్యూబ్ (అస) మరింత ఆందోళనకు గురయ్యారు. తనకు ఆరోగ్యం చేకూరితే తన భార్యను వంద దెబ్బలతో శిక్షిస్తానని ప్రమాణం చేసి ఉన్నారు. కాని ఆమెను బాధించే ఉద్దేశ్యం ఆయనకు ఎంతమాత్రం లేదు. కాని తన ప్రమాణం ప్రకారం చేయకపోతే దేవునిపై చేసిన ప్రమాణం భంగపరచిన వారవుతారు. ఈ సంకటాన్ని అల్లాహ్ స్వయంగా తొలగించాడు. అల్లాహ్ ఆయనకు సలహా ఇచ్చాడు. "వంద గడ్డిపోచలు కలిపి ఒక కట్టగా చేయ్.. నీ భార్య శరీరానికి ఆ కట్టను ఒకసారి తాకించు. ఆ విధంగా నీ బాధ్యత పూర్తవుతుంది. నీ కష్టకాలంలో నీ వెంట ఉన్న నిజాయితీ కలిగిన నీ భార్య పట్ల సాసుభూతి, దయలను ప్రదర్శించినట్లవుతుంది" అన్న సలహాను ఆయన అమలు చేశారు.

*(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 38:41-44, 21:83-84, 6:84)*

## గ్రహించవలసిన పాఠాలు

- ప్రవక్తలకు కూడా పరీక్షలు, కష్టాలు తప్పవు. మనిషిని అతని విశ్వాస స్థాయికి అనుగుణంగా పరీక్షించడం జరుగుతుందని అంటారు. మనిషి బలమైన విశ్వాసం కలిగినవాడయితే కఠినమైన పరీక్షలకు గురిచేయడం జరుగుతుంది. ఈ విధంగా అల్లాహ్ మనిషి విశ్వాసాన్ని పరీక్షిస్తాడు. ఈ పరీక్షల్లో సహనం వహించినవారికి తన కారుణ్యంతో ప్రతిఫలం ప్రసాదిస్తాడు. అల్లాహ్ ఈ విధంగానే అయ్యూబ్ ప్రవక్తను పరీక్షించాడు. ఆయన సహనానికి మారు పేరుగా నిలిచారు. అయ్యూబ్ (అస) వంటి సహనం కలిగిన వ్యక్తిగా ఎవరినైనా ప్రశంసించడమంటే భావం అత్యంత ఉత్తమ స్థాయి సహనం కలిగినవాడని చెప్పడమే.
- సబ్ర్ (సహనం) గురించి డెబ్భయిసార్ల కన్నా అధికంగా దివ్యఖుర్‌ఆన్ ప్రస్తావించింది. మిగిలిన సద్గుణాలకన్నా సహనాన్ని అల్లాహ్ అధికంగా ప్రశంసించాడు.
- భార్యతో ఎలా వ్యవహరించాలన్నది అయ్యూబ్ ప్రవక్త ఆచరణల్లో తెలుస్తుంది. అయ్యూబ్ ప్రవక్త కష్టాల్లో ఉన్నప్పుడు ఇబ్లీస్ ఆయన భార్యను ప్రలోభానికి గురిచేశాడు. అందువల్ల ఆయన తన భార్యను శిక్షిస్తానని ప్రమాణపూర్వకంగా చెప్పారు. కాని ఆమె ఆయన పట్ల చాలా విశ్వాసంగా ఉన్న మహిళ. అందువల్ల ఆమె పట్ల ఉదారంగా వ్యవహరించవలసి ఉంది. ఈ సమస్యను పరిష్కరించడానికి అల్లాహ్ ఒక చక్కని మార్గాన్ని ఆయనకు చూపించాడు.
- వంద గడ్డిపోచల కట్టతో భార్యను తాకాలని చూపించిన పద్ధతి నిజానికి అల్లాహ్ నేర్పిన ఒక పాఠం. మాటలకు, వాస్తవాలకు మధ్య ఉన్న భేదాన్ని గుర్తించవలసిన అవసరాన్ని ఈ పద్ధతి తెలుపుతుంది. బహిరంగంగా విధించే సాధారణమైన శిక్ష కూడా మనిషికి సరిపోతుంది.
- అనాలోచితంగా ప్రమాణాలు చేయరాదని దివ్యఖుర్‌ఆన్ బోధిస్తుంది.

https://teluguislam.net



# ప్రవక్త ఇల్యాస్

(అలైహిస్సలాం)



ఇల్యాస్ ప్రవక్త కాలంలో ప్రజలు 'బాల్' విగ్రహాన్ని సూర్యదేవుడి పేరుతో ఆరాధించేవారు.

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

బాల్‌బక్ పట్టణంలో బనీ ఇస్రాయీల్‌కు చెందిన ఒక వర్గం ప్రజలు నివసించేవారు. ఈ పట్టణం లెబనాన్‌లో ఉంది. కాని ఈ ప్రజలు ప్రవక్తల బోధనలను పెడచెవినపెట్టి విగ్రహారాధన ప్రారంభించారు. వారు ఒక పెద్ద విగ్రహాన్ని తయారు చేసి దానికి "బాల్" అని పేరు పెట్టారు (సూర్యునికి గౌరవసూచకంగా తయారు చేసిన విగ్రహం అది). ఈ విగ్రహాన్ని తమ ప్రధాన దైవంగా భావించేవారు. అందువల్లనే ఆ పట్టణానికి "బాల్‌బక్" అన్న పేరు వచ్చింది. బాల్‌బక్ అంటే బాల్ నగరమని అర్థం (టవర్ ఆఫ్ బాబెల్).

వారి వద్దకు అల్లాహ్ తన ప్రవక్త ఇల్యాస్‌ను పంపించాడు. ఆయన వారి వద్దకు వచ్చి హితబోధ చేశారు. ఏకైక దేవుడైన అల్లాహ్‌ను ఆరాధించాలని, సూర్య దేవుడని బాల్ ఆరాధన చేయరాదని చెప్పారు. కాని వారు ఆయన మాటలను తిరస్కరించారు. ఫలితంగా ఇహలోకంలోను, పరలోకంలోనూ అల్లాహ్ ఆగ్రహానికి గురయ్యారు.

ఇల్యాస్(అస) చూపిన నిజాయితీ, కఠిన ప్రయత్నాల కారణంగా అల్లాహ్ ఆయన గురించి చాలా గొప్పగా దివ్య ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించాడు:

"ఇల్యాస్ ఒక ప్రవక్త. ఆయన తన జాతి ప్రజలతో, 'మీరు మీ విధిని నిర్వర్తించరా? మీరు బాల్‌కు మొరపెట్టుకుని ఉత్తమ సృష్టికర్తను విస్మరిస్తారా? అల్లాహ్ మీకు ప్రభువు, మీ పూర్వీకులకు అందరికీ ప్రభువు' అని చెప్పారు. కాని వారు ఆయన్ను తిరస్కరించారు. వారిని తప్పక లాక్కురావడం జరుగుతుంది (శిక్షించడానికి). నిజాయితీ, నిబద్ధత కలిగిన దైవభక్తులను తప్ప. మేము ఆయన పేరును తర్వాతి తరాల్లో ప్రస్తావించబడేలా చేశాము. ఇల్యాస్‌పై శాంతి కురియుగాక! సానుభూతితో వ్యవహరించిన వారిని మేము ఈ విధంగా బహూకరి స్తాము. ఆయన మాపై విశ్వాసం కలిగిన దాసుల్లో ఒకడు."

*(దివ్యఖుర్‌ఆన్ : 37:123-132)*

ఇల్యాస్ ప్రవక్త తర్వాత అల్లాహ్ 'అల్‌యసా'ను ప్రవక్తగా పంపాడు.

*(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 38:48, 6:25)*

https://teluguislam.net



# చెల్లాచెదరైన బనీఇస్రాయీల్ ప్రజలు

(క్రీ.పూ.587 కాలం)



ప్రవక్త జెరిమియా బోధనల్ని లక్ష్యపెట్టని కారణంగా ఇస్రాయీల్ ప్రజలు బుఖ్తనస్సర్ చేతిలో ఘోర పరాభవం చవిచూశారు.

ఒక దశలో బనీఇస్రాయీల్ ప్రజలకు చెడులే జీవన విధానంగా మారిపోయాయి. వారు సుఖవిలాసాల కోసం ప్రాకులాడే ప్రజలుగా మారిపోయారు. అల్లాహ్ పట్ల తమ విధిబాధ్యతలను మరచిపోయారు. మూసా ప్రవక్త (అ) మరణం తర్వాత శాంతిభద్రతలన్నవి అక్కడ కనుమరుగయ్యాయి. వారి హృదయాల్లో దయ, కారుణ్యం అన్నవి మాయమయ్యాయి. ఆ తర్వాత వచ్చిన ప్రవక్తలను వారు తిరస్కరిస్తూ వచ్చారు. ప్రవక్తలను అబద్ధాలకోరులుగా ఆరోపించే వారు.

ఈ కాలంలో అల్లాహ్ వారిని కరుణించి, వారిని హెచ్చరించే ప్రవక్తను వారి వద్దకు పంపించాడు. ఒక మార్గ దర్శిని వారి వద్దకు పంపాడు. ఆ ప్రవక్త పేరు జెరిమియా (అరబీ పేరు "అర్మియా"). ఆయన ఒక గౌరవనీయమైన కుటుంబంలో జన్మించారు. ఆయన వారికి హిత బోధ చేసేవారు. సెన్నాచెరిబ్ వారిని నాశనం చేయడానికి ప్రయత్నించిన కాలాన్ని గుర్తుచేశారు. వారిని రక్షించ వలసిందిగా ప్రవక్త షైజా (ఇసాయ) దేవుణ్ణి ప్రార్థించిన వైనాన్ని జ్ఞాపకం చేశారు. ఫలితంగా అల్లాహ్ సెన్నాచెరిబ్ సైన్యాన్ని వ్యాధికి గురిచేసి నాశనం చేశాడు. కాని బనీఇస్రాయీల్ ప్రజలు

https://teluguislam.net



షైజా (అస)పట్ల కృతజ్ఞత చూపలేదు. ఆయన్ను అవమానించారు. ఆయన గొంతుకోసి హతమార్చారు. ఈ పద్ధతులను మార్చుకోకపోతే వారిపై అల్లాహ్ శిక్ష వచ్చిపడుతుందని ప్రవక్త జెరిమియా (అస) వారిని హెచ్చరించారు. అల్లాహ్ వారిపై భయంకరమైన సైన్యాన్ని పంపుతాడని, ఆ సైన్యం బీభత్సాన్ని సృష్టించి వారిని నాశనం చేస్తుంది జాగ్రత్త పడండన్నారు.

కాని అహంకారంతో బనీఇస్రాయీల్ ప్రజలు ఆయన్ను తిరస్కరించారు. తమను అల్లాహ్ ఎంచుకున్నాడని, తాము అల్లాహ్ సృష్టిలో ఎంపికైన జాతికి చెందినవారమని, తమ జాతికి పవిత్రమైన అల్లాహ్ వాక్యాలను ప్రసాదించడం జరిగిందని, అందువల్ల అగ్నిని పూజించే, విగ్రహాల ముందు సాగిలబడే అవిశ్వాసుల చేతిలో తాము ఓడిపోయే పరిస్థితి అల్లాహ్ ఎన్నటికీ కలుగజేయడని వాదించారు.

బనీఇస్రాయీల్ ప్రజలు అహంకారంతో తప్పులకు పాల్పడినప్పుడు అల్లాహ్ ఆగ్రహం వారిని విడిచిపెట్టలేదన్న వాస్తవాన్ని కూడా ప్రవక్త జెరిమియా (అస) వారికి గుర్తుచేశారు. కాని వారికి ఆయన సలహా నచ్చలేదు. ఆయన సలహాను మన్నించే బదులు వారు ఆయన్ను సంకెళ్ళతో బంధించి జైలులో పడవేశారు.

ఒక రోజు ఆకాశమంతటా దట్టమైన మేఘాలు అలముకున్నాయి. సూర్యుని కిరణాలు ఒక్కటి కూడా నేలకు చేరకుండా మబ్బులు క్రమ్ముకున్నాయి. పూర్తి రాజ్యం చీకట్లో జారిపోయింది. మబ్బులు తొలగేసరికి ఒక పెద్ద సైన్యానికి నాయకత్వం వహిస్తున్న సైన్యాధిపతి గుర్రంపై వారి వైపు వస్తున్నాడు. అతడు నెబుచాద్నిజ్జార్ (అరబీ పేరు - బుఖ్తనస్సర్). అతడు బాబిలోనియాకు చెందిన వాడు. బనీఇస్రాయీల్ ప్రజలను శిక్షించడానికి వచ్చాడు. బనీఇస్రాయీల్ ప్రజలు ప్రమత్తతలో ఉన్నారు. అతడిని ఎదుర్కోడానికి సిద్ధంగా లేరు. అతడి సైన్యం వారిపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడింది. కనబడిన ప్రతిదీ నాశనం చేసింది. చేతికి దొరికినవారిని హతమార్చింది. వారి పట్టణాలు శిథిలాలయ్యాయి. బనీఇస్రాయీల్ ప్రజలు బానిసలయ్యారు. విజేతలు వారిని వివిధ ప్రాంతాల్లో అమ్మేశారు.

బుఖ్తనస్సర్ మరణించిన తర్వాత అనేక సంవత్సరాలకు బాబిలోనియా రాజ్య సింహాసనాన్ని దయాహృదయం కలిగిన రాజు అధిష్టించాడు. బనీఇస్రాయీల్ ప్రజల దయనీయ స్థితిని గమనించిన రాజు వారి గురించి విచారించాడు. బనీఇస్రాయీల్ ప్రజలు యాకూబ్ ప్రవక్త, దావూద్ ప్రవక్తల సంతతికి చెందినవారని తెలుసుకున్నాడు. వారు సిరియా భూభాగంలో నివసించేవారని, సిరియా భూభాగం సస్యశ్యామలమైనదని, సహజ వనరుల సంపదతో తులతూగే ప్రదేశమనీ, కాని బుఖ్తనస్సర్ వారి పట్టణాలను నాశనం చేసి వారిలో చాలా మందిని హతమార్చి వారిని బానిసలుగా మార్చాడని తెలుసుకున్నాడు. రాజుకు వారి స్థితి చూసి జాలి కలిగింది. వారంతా ఇక బానిసత్వం నుంచి విముక్తి పొందారని, వారు స్వేచ్ఛగా తమ భూభాగానికి వెళ్ళవచ్చని ప్రకటించాడు.



బనీఇస్రాయీల్ ప్రజలు ఆనందంతో తమ స్వస్థలాలకు చేరుకున్నారు. అపార కరుణామయుడైన అల్లాహ్ వారిపై తన కృపాకటాక్షాలను మరోసారి వర్షించాడు. వారి సంతతి వృద్ధి చెందింది. వారి పంటలు పుష్కలంగా పండాయి. వారి పశుసంపద పెరిగింది. అల్లాహ్ పట్ల కృతజ్ఞతలు చూపే బదులు వారు మళ్ళీ రుజుమార్గాన్ని వదలి పక్కదారులు పట్టారు. గత అనుభవాల నుంచి వారు పాఠాలు నేర్చుకోలేదు. చెడులు వారి ప్రవృత్తిగా మారిపోయాయా అనిపించింది. ఈ కాలంలోనే గొప్ప ప్రవక్తలు జకరియా, యహ్యా (బాప్టిస్ట్ జాన్) వారి వద్దకు వచ్చారు. ఇస్రాయీల్ ప్రజలు ఈ ప్రవక్తల హితబోధలను వినే బదులు వారికి వ్యతిరేకంగా కుట్రలు పన్ని వారిని హతమార్చారు.

## దేవుని శాపం

మరోసారి అల్లాహ్ శాపం వారిపై పడింది. ఈసారి గొప్ప సేనాధిపతి టైటస్ నాయకత్వంలో రోమన్లు వారి ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. ఈ యుద్ధంలో వారి ఇళ్ళూవాకిళ్ళు సర్వనాశనమయ్యాయి. మరోసారి వారు బానిసలయ్యారు. స్వంతదేశం లేని జాతిగా మారారు. ప్రపంచంలోని నలుమూలలా చెల్లాచెదరయ్యారు. పరాభవాలకు, అవమానాలకు గురయ్యారు.

(చదవండి దివ్య ఖుర్ఆన్ 5 :74-76, 3:112)

## గ్రహించవలసిన పాఠాలు

- జాతి, వర్ణం, వర్గం, మతం, వంశం, గతచరిత్రలోని ఔన్నత్యం, సంపద, అధికారం, జ్ఞానం, నైపుణ్యం, సౌందర్యం, సంస్కృతి వగైరా ఏ విషయానికి సంబంధించిన అధిక్యత అయినా గాని లేక కేవలం నోటి మాటగా అల్లాహ్‌ను విశ్వసించడంగాని వీటిలో దేనినీ అల్లాహ్ శాశ్వత అనుగ్రహాలను పొందడానికి సిఫారసుగా భావించరాదు. మనిషి ఆచరణాత్మకంగా చేసే పనులు, మనిషి అవలంబించే రుజుమార్గం ఆధారంగానే అల్లాహ్ నిర్ణయాలు తీసుకుంటాడు. ఆచరణలో తప్పుదారిపడితే అల్లాహ్ శిక్ష మనిషిపై పడుతుంది. ఈ శిక్ష అనేక రూపాలుగా ఉండవచ్చు
- ఈ సూరాలను పరిశీలించండి 2:177,207-212, 3:16-17,92, 133-135, 191-195, 4:36,125, 5:96, 7:42-43, 16:97, 107:1-7



# ప్రవక్త జకరియా
## (అలైహిస్సలాం)



కాలంకాని కాలంలో లభించే ఖర్జూరపండ్లలా ముసలితనంలోనూ అల్లాహ్ కారుణ్యంతో ప్రవక్త జకరియాకు సంతానం ప్రాప్తమయ్యింది.

జకరియా (అస)కు వయసు మీద పడింది. ఆయన ముసలివారయ్యారు. వయసుతో పాటు మనిషి కూడా వంగిపోయారు. ఇప్పుడాయన తొంభై సంవత్సరాల జీవనసంధ్యలో ఉన్నారు. వయసు సహకరించకపోయినా ఆయన ఆరాధనాలయానికి రోజూ వెళ్ళి తన ప్రసంగాలు వినిపించేవారు.

జకరియా (అస) సంపన్నుడు కాదు. అయినప్పటికీ అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడానికి ఎల్లప్పుడూ ఆయన సిద్ధంగా ఉండేవారు. ఆయనకు జీవితంలో ఉన్న ఒకే ఒక్క అసంతృప్తి సంతానం లేకపోవడం. ఆయన భార్య గొడ్రాలు. పిల్లలు లేకపోవడం వల్ల ఆయన బాధపడేవారు. తన పనిని తన తర్వాత కొనసాగించేవారు ఎవరూ ఉండరన్న భావన ఆయన్ను ఆందోళనకు గురిచేసేది. ప్రజలకు బలమైన నాయకుని అవసరం ఉంది. వారిని అలాగే వదిలేస్తే వారు అల్లాహ్ చూపించిన మార్గాన్ని వదలి, దైవం పంపిన చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది.

## మర్యం

ఆరాధనాలయంలో ఒక మారుమూల గదిలో ఒంటరిగా మర్యం నివసించేవారు (మర్యం గురించిన పూర్తి కథ తర్వాతి పుటల్లో రానుంది).

https://teluguislam.net



జకరియా (అస) ఆరాధనాలయానికి రోజూ వెళ్ళేవారు. ఒక రోజు ఆయన మర్యంను చూడడానికి అక్కడికి వెళ్ళారు. ఆ గదిలో తాజా ఫలాలు ఆయనకు కనబడ్డాయి. పైగా ఆ కాలంలో లభించని పండ్లవి. ఆయన ఆశ్చర్యపోయారు. తనకు తప్ప మరెవ్వరికీ ఆ గదిలో ప్రవేశించే అనుమతి లేదు. ఆ పండ్లు ఎలా వచ్చాయని ఆయన అడిగినపుడు, ఆ పండ్లు అల్లాహ్ పంపినవని ఆమె జవాబిచ్చారు. ప్రతిరోజూ ఉదయం ఆ పండ్లు తన గదిలో ఉంటున్నాయని అన్నారు. కాని ఈ విషయమై ఆయన ఎందుకు అంత ఆశ్చర్య పోతున్నారో ఆమెకు అర్థం కాలేదు. అదే విషయం ఆయన్ను అడిగారు. "అల్లాహ్ తాను కోరిన వారికి అపరిమితంగా ప్రసాదిస్తాడన్న విషయం మీకు తెలియదా?" అన్నారామె. ఆ పవిత్రమైన కన్య అడిగిన ప్రశ్న ఆయనకు కనువిప్పు కలిగించింది. ఈ ముసలి వయసులో ఒక శిశువును ప్రసాదించమని దేవుణ్ణి ఎందుకు ప్రార్థించరాదు? అన్న భావన ఆయన మనసులో కలిగింది. ఆయన భార్యకు పిల్లలను కనే వయసు దాటిపోయింది. కాని కరుణామయుడైన దేవునికి సాధ్యం కానిది ఏదీ లేదు. ఆయన వెంటనే ఆరాధనాలయంలోనికి వెళ్ళి దేవుని ముందు సాష్టాంగపడి, "ప్రభూ! నా ఎముకలు బలహీనమయ్యాయి. నా వెంట్రుకలు నెరిసిపోయాయి. నేను మీ ఆరాధనలను ఎన్నడూ విస్మరించలేదు. ప్రభూ, నాకు ఒక వారసుడిని ప్రసాదించండి. ప్రభువును సేవించడానికి" అని ప్రార్థించారు.

## దైవదూత సాక్షాత్కారం

తన ముందు దైవదూత ప్రత్యక్షమయ్యేసరికి జకరియా (అస) తన కళ్ళను తానే నమ్మలేకపోయారు. ఆయన భార్యకు ఒక కుమారుడు జన్మించనున్నాడన్న శుభవార్తను వినిపించాడా దైవదూత. ఆ శిశువుకు యహ్యా అన్న పేరు పెట్టాలని చెప్పాడు. ఆయన ఆశ్చర్యపోయారు, తన చెవులను నమ్మలేకపోయారు. తాను చాలా ముసలివాడినైపోయానని, తన భార్య కూడా ముసలిదైపోయిందని, ఆమె గొడ్రాలని, ఇక పిల్లలు ఎలా పుడతారని ఆయన ప్రశ్నించారు. దైవదూత జవాబిస్తూ, "అలాగే జరుగుతుంది. అల్లాహ్ ఇలా చెప్పాడు: 'మీరు అసలు లేనప్పుడు మిమ్మల్ని సృష్టించాను. అలాంటి నాకు అలా చేయడం చాలా తేలిక' అన్నాడు. ఈ శుభసంఘటనకు ఏదన్నా గుర్తును ప్రసాదించమని జకరియా (అస) కోరారు. ఈ సంఘటనకు గుర్తు ఏమంటే మీరు మూడు రోజుల పాటు ఎవరితోనూ మాట్లాడలేరు, కేవలం సంజ్ఞలు మాత్రమే చేయగలరు అని దైవదూత



చెప్పాడు. ఆయన సంతోషంతో బయటకు పరుగెత్తారు. ప్రజలందరికీ ఈ విషయం చెప్పాలని, ప్రజలు దేవుణ్ణి రాత్రింబవలు స్తుతించేలా అందరికీ తెలియజేయాలని భావించారు.

## యహ్యా జననం

కొంత కాలానికి యహ్యా జన్మించారు. ఆయనకు దేవుడు అపారమైన వివేకాన్ని, విజ్ఞానాన్ని ప్రసాదించాడు. ఆయన దేవుని ప్రవక్తగా మారవలసి ఉంది. యహ్యా దేవుణ్ణి నిబద్ధతతో ప్రార్థించేవారు. తరచూ ఉపవాసాలు ఉండేవారు. తౌరాత్‌కు సంబంధించిన ఎలాంటి ప్రశ్నలకైనా ఆయన సమాధానం ఇచ్చేవారు. ఆయన పేరుప్రఖ్యాతులు దేశమంతటా వ్యాపించాయి. ఆయన సత్యాన్ని నిలబెట్టడానికి వచ్చిన వ్యక్తి. అసత్యాన్ని అంతం చేయడానికి వచ్చినవారు. అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ ఆయన భయపడేవారు కాదు.

(చదవండి దివ్యఖుర్ఆన్ : 19:2-15)

## కామాతురాణాం న భయం న లజ్జ

పలస్తీనా పాలకుడు హెరాల్డ్ అంటీపాస్, హెరోడియాస్‌ను ప్రేమించాడు. ఆమె అతని సోదరుని కుమార్తె. తన సోదరుని కుమార్తెను పెళ్ళాడాలని పథకాలు వేయసాగాడు. ఈ పెళ్ళిని ఆమె తల్లి కూడా ప్రోత్సహించింది. కొన్ని జియోన్‌లు (యూద ఆరాధనాలయాలు) కూడా దీనిని సమర్థించాయి. పాలకుడిని మంచి చేసుకోవాలనే ఉద్దేశ్యంతో లేదా పాలకుడి పట్ల భయంతో అవి అలా చేశాయి.

పాలకుడి ఈ పథకాల గురించి తెలిసిన యహ్యా తక్షణం దీనిని ఖండిస్తూ, అలాంటి పెళ్ళి, నిషిద్ధబంధుత్వాల పెళ్ళి (ఇన్‌సెస్ట్)గా ప్రకటించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఈ పెళ్ళికి ఆమోదం తెలిపేది లేదన్నారు. తౌరాత్ చట్టాలకు ఈ వివాహం విరుద్ధమైనదనీ, ఇది చట్టాన్ని అతిక్రమించడం అవుతుందని చెప్పారు.

## ప్రలోభం

యహ్యా ప్రకటన విన్న హెరోడియాస్ మండిపడింది. తనకు చిన్నాన్న వరుస అయిన హెరాల్డ్‌ను పెళ్ళాడి రాజ్యాన్ని ఏలాలన్నది ఆమె ఆకాంక్ష. తన లక్ష్యాన్ని సాధించుకోవడం కోసం ఆమె ఒక పథకం వేసింది. ఆకర్షణంగా సింగారించుకుని, హెరాల్డ్‌ను రెచ్చగొట్టేలా అతని ముందు ఆడిపాడింది. కామంతో కళ్ళుమూసుకు పోయిన హెరాల్డ్ ఆమెను కౌగిలించుకుని ఆమె కోరిన వరం

ఏదైనా ఇస్తానన్నాడు. ఆమె వెంటనే, "నాకు యహ్‌యా తల కావాలి. అతను యావత్తు రాజ్యంలో మీ గౌరవాన్ని, నా గౌరవాన్ని మంటగలిపాడు. ఈ కోరిక తీర్చితే నేను చాలా సంతోషిస్తాను. నన్ను నేను మీకు అర్పించుకుంటాను" అంది. ఆమె మాయలో పడిపోయిన హెరాల్డ్ ఆమె పైశాచిక కోరికను మన్నించాడు. యహ్‌యాను హతమార్చి ఆయన తలను హెరోడియాస్ వద్దకు తీసుకురావడం జరిగింది. ఆయన తలను చూసి ఆ క్రూరమైన మహిళ ఆనందంతో చిందులు వేసింది. కాని దేవుని ప్రియప్రవక్తను హతమార్చినందుకు ఆమెకే కాదు మొత్తం బనీఇస్రాయీల్ ప్రజలందరూ తీవ్రమైన శిక్షను చవిచూడవలసి వచ్చింది. శత్రు సైన్యాలు ఆ రాజ్యాన్ని సర్వనాశనం చేశాయి. *(దివ్యఖుర్‌ఆన్ : 19:2-15)*

### గ్రహించవలసిన పాఠాలు

- దంపతులు ఎంత ముసలివారయినప్పటికీ పిల్లలు కావాలని కోరుకోవడం సహజమైన కోరిక. అల్లాహ్‌ను ప్రార్థిస్తే, అల్లాహ్ తలచితే జరగనిది ఏదీ లేదు. జకరియా భార్య చాలా ముసలి వయసులో కూడా గర్భం దాల్చడం సాధ్యమయ్యింది.
- మర్యమ్ గదిలో తాజా పండ్లను చూసిన తర్వాత కాని జకరియా వంటి ప్రవక్త కూడా అల్లాహ్ కరుణకు హద్దుల్లేవన్న సత్యాన్ని గుర్తించలేక పోయారు.
- తమ జీవిత విధానాన్ని మార్చుకోవడానికి ఎంతమాత్రం సిద్ధంగా లేని మూర్ఖపు ప్రజలతో వ్యవహరించవలసి వచ్చినప్పుడు సంస్కర్తల కార్య భారం మరింత కష్టమైపోతుంది.
- రాజ్యాన్ని పాలించే రాజు, అతని ప్రియురాలి మధ్య ఉన్న నిషిద్ధ సంబంధాన్ని ఖండించడం వల్ల వాటిల్లే పరిణామాలు యహ్‌యాకు బాగా తెలుసు. అల్లాహ్ పట్ల తనకు ఉన్న విధిబాధ్యతలు కూడా ఆయనకు తెలుసు. అందుకే తన విధినిర్వహణకు ప్రాణాలు పణంగా పెట్టారు. (ముహమ్మద్ ప్రవక్త (స) ప్రవచనం ప్రకారం సత్యం ఎంత చేదైనదయినా గాని సత్యాన్నే పలుకాలి)
- చెడును నిరోధించనివారు చివరకు చెడు చేసే వారితో పాటు శిక్షకు గురికావలసి వస్తుంది.



# నగర ప్రజలు-నలిపి చంపబడినవారు

అతని తరువాత మేము అతని జాతి వారిపై ఆకాశం నుంచి ఏ సైనిక దళాన్నీ దింపలేదు. దాని అవసరం మాకు లేదు కూడా. అది (ఆ శిక్ష) ఒకేఒక్క కేక మాత్రమే! అంతే, వారంతా (ఆ దెబ్బకు) ఆరిపోయారు.

(ఖుర్‌ఆన్ 36 : 28 - 29)

హబీబ్ నజ్జార్ ఒక వడ్రంగి. ఒక క్రూరమైన రాజు పరిపాలిస్తున్న రాజ్యంలో ఆయన నివసించేవారు. ఆ రాజు కాని, ఆ రాజ్యంలోని ప్రజలు కాని అల్లాహ్‌ను ఆరాధించేవారు కాదు. హబీబ్ మాత్రం తన తాత తండ్రులు ఆచరించిన ధర్మానికి కట్టుబడ్డారు. ఒకే దేవుడైన అల్లాహ్‌ను ఆరాధించే ధర్మం అది. సత్య మార్గాన్ని తాను అనుసరించడం మాత్రమే కాదు, రాజును, ప్రజలను కూడా ఒకే దేవుని ఆరాధనకు పిలిచేవారు. కాని వారు ఆయన పిలుపును పట్టించుకోలేదు, ఆయన్ను పిచ్చివాడనేవారు. కాని ఆయన నిరాశపడలేదు. ఒకే దేవుని సందేశాన్ని ప్రచారం చేయడం మానుకోలేదు. చివరకు రాజభటులు ఆయనగారి వడ్రంగపు కార్ఖానాకు తాళం వేసేశారు. ప్రజలు ఆయనపై దాడి చేయడం కూడా ప్రారంభించారు. చివరకు ఆయన నగరాన్ని విడిచి పారిపోవలసి వచ్చింది.

నగరం బయట ఉన్న ఒక గుహలో ఆయన ఆశ్రయం పొందారు. దగ్గరలోని దట్టమైన అడవిలో ఆయన ఆకలిని తీర్చడానికి కావలసిన పండ్లు, పక్షులు, చిన్న చిన్న జంతువులు లభించాయి. ఇక్కడ ఆయన ఏకైక దేవుడైన అల్లాహ్‌ను

https://teluguislam.net

స్వేచ్ఛగా ఆరాధించుకునే వీలు కలిగింది. ఒక రాత్రి ఆయన కలలో తను స్వర్గంలో ఉన్నట్లు చూశారు. తన పట్ల దేవుడు ప్రసన్నుడైనట్లు కలగాంచారు.

## సాదిక్ మరియు మస్‌దూక్

ఈలోగా సాదిక్, మస్‌దూక్‌లనబడే ఇద్దరు అక్కడికి వచ్చారు. అక్కడి రాజు, ప్రజలు చేస్తున్న విగ్రహారాధన పట్ల వారు చాలా వ్యాకులపడ్డారు. వారిద్దరు ప్రజలకు ధర్మబోధ చేయడం ప్రారంభించారు. ప్రజలను రుజుమార్గానికి పిలువడం మొదలుపెట్టారు. అల్లాహ్‌ను ఆరాధించాలని, ఆయన ఆదేశాలనే శిరసావహించాలని ఉద్బోధించసాగారు. వారెక్కడి నుంచి వచ్చారు? అసలు వాళ్ళెవరని ప్రజలు అడగడం ప్రారంభించారు. తాము దేవుని తరపున ప్రవక్తలుగా వచ్చామని వారిద్దరు చెప్పారు. కాని ప్రజలు వారి మాటలు వినలేదు. "మీరు కూడా మా వంటి సాధారణ మనుష్యులే. మీకు కూడా మృత్యువు వస్తుంది. అలాంటి మిమ్మల్ని దేవుడు మా వద్దకు ప్రవక్తలుగా పంపాడా? మీరు అబద్ధాలు చెబుతున్నారని" మండిపడ్డారు. హబీబ్ నజ్జార్‌ను వదిలించుకోవడం ద్వారా తాము హాయిగా ఉన్నామని భావిస్తుంటే, మళ్ళీ ఈ ఇద్దరు ఎక్కడి నుంచి వచ్చారని రాజు ఆగ్రహించాడు. పైగా ఈ ఇద్దరు చాలా తెలివితో ప్రచారం చేస్తున్నారు. కనుక వీరు మరింత ప్రమాదం కాగలరని అనుకున్నాడు. ఈ ప్రచారాన్ని మానకపోతే రాళ్ళతో కొట్టి చంపిస్తామని హెచ్చరికలు చేశాడు. ఈ హెచ్చరికలను బహిరంగంగా, అందరిముందు చేయడం జరిగింది. ఆ విధంగా ఈ ఇద్దరి మాటలు వినకుండా ప్రజలను కూడా భయపెట్టడం జరిగింది.

## తిరిగి వచ్చిన హబీబ్

హబీబ్ ఈ ఇద్దరి గురించి విన్నారు. ప్రజలను సంస్కరించడానికి వారిద్దరు చేస్తున్న ప్రయత్నాల గురించి తెలుసుకున్నారు. తక్షణం ఆయన వెనుదిరిగి పట్టణానికి వచ్చారు. సాదిక్, మస్‌దూక్‌లు చేస్తున్న హితబోధను ప్రజలు వినాలని, సన్మార్గం ఏదో తెలుసుకోవాలని హబీబ్ కూడా ప్రచారం చేయడం ప్రారంభించారు. వారిద్దరు తమ స్వార్థం కోసం ఏదీ చేయడం లేదు. ప్రజల నుంచి వారేమీ ఆశించడం లేదు. పైగా ప్రజలకు సహాయపడాలనుకుంటున్నారు. ఈ వాస్తవాలను ప్రజలకు చెప్పి నచ్చజెప్పడానికి శతవిధాల ప్రయత్నించారు. కాని ప్రజల హృదయాలు బండబారిపోయాయి. వారి చెవులకు మంచి మాటలు

https://teluguislam.net



ఎక్కలేదు. హబీబ్‌పై ఆగ్రహంతో మండిపడుతూ మూకుమ్మడిగా ఆయనపై పడి అమానుషంగా కొట్టడంతో ఆయన చనిపోయారు. ఆ విధంగా ఆయన అమరుడు (షహీద్) అయ్యారు. ఇద్దరు ప్రవక్తలను కూడా ఆ దుర్మార్గులు హింసించక ముందే దైవదూత జిబ్రయీల్ (అస)కు దేవుని వద్ద నుంచి ఆదేశం అందింది. దుర్మార్గులపై శిక్ష విరుచుకుపడనుంది. శిక్ష రాకముందే ఇద్దరు ప్రవక్తలను తక్షణం ఆ పట్టణం వదలి వెళ్ళిపోవలసిందిగా ఆదేశించడం జరిగింది. వారు వెంటనే ఆ పట్టణం వదలి వెళ్ళిపోయారు.

ఒక మహాప్రేలుడు ఆ పట్టణాన్ని కుదిపేసింది. మహావృక్షాలు కూకటి వ్రేళ్ళతో తల్లక్రిందులయ్యాయి. పట్టణంలోని భవనాలన్నీ సర్వనాశనం అయ్యాయి. శిథిలాలు తప్ప మరేమీ మిగల్లేదు. అందరూ ఆ శిథిలాల క్రింద నలిగిపోయారు. సన్మార్గానికి కట్టుబడిన హబీబ్ ఆత్మ శరీరాన్ని వదలి స్వర్గానికి చేరుకుంది. అల్లాహ్ స్వాగతం పలికి దానిని స్వర్గంలో ప్రవేశపెట్టాడు. అంతా హబీబ్ తన కలలో చూసిన మాదిరిగానే జరిగింది. (దివ్యఖుర్‌ఆన్ : 36 : 13-30)

> షహీద్ అంటే అమరగతిపొందినవాడు. సత్యం కోసం నిలబడి, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా అసత్యానికి, అన్యాయానికి వ్యతిరేకంగా మొక్కవోని దీక్షతో నిలబడి సత్యానికి సాక్ష్యం పలికిన వ్యక్తిని, ఆ క్రమంలో ప్రాణాలు పోగొట్టుకున్న వ్యక్తిని "షహీద్" అంటారు. షహీద్‌కు అల్లాహ్ స్వర్గం ప్రసాదిస్తాడు.

https://teluguislam.net



# మర్యమ్

ప్రవక్త ఈసా (అస)గారి మాతృమూర్తి (అలైహిస్సలామ్)



"ఓ మర్యమ్! నీవు ఈ చెట్టు మొదలు పట్టి ఊపితే నీపై తాజా ఖర్జూరపు పండ్లు రాలతాయి."
(ఖుర్ఆన్ 19 : 25)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ప్రవక్త జకరియా (అస) గారి భార్య సోదరికి ఒక కుమార్తె ఉంది. ఆమె పేరు హన్నా. ఆమెకు ఇమ్రాన్‌తో పెళ్ళయ్యింది. ఇమ్రాన్ ఇస్రాయీల్ నాయకుల్లో ఒకరు. ఈ దంపతులకు చాలా సంవత్సరాల వరకు సంతానం కలగలేదు. బిడ్డలను ఎత్తుకున్న తల్లుల్ని చూసినప్పుడల్లా పిల్లల కోసం ఆమె హృదయం పరితపించేది. ఇలా చాలా సంవత్సరాలు గడచి పోయాయి. అయినా ఆమెలో సంతానం గురించి ఆశ మాత్రం సజీవంగా ఉండేది. ఏదో ఒక రోజున అల్లాహ్ తనకు సంతానం ప్రసాదిస్తాడన్న నమ్మకం ఆమెలో ఉండేది. తన సంతానాన్ని అల్లారు ముద్దుగా పెంచుకోవాలని కలలు కనేది.

ఆమె తనకు సంతానం ప్రసాదించమని దేవుడికి మొరపెట్టుకుంది. భూమ్యాకాశాల ప్రభువైన అల్లాహ్‌ను ప్రార్థించేది. తనకు సంతానాన్ని ప్రసాదిస్తే, ఆ సంతానాన్ని జెరుసలేంలోని దైవ గృహం సేవలో ఉంచుతానని ఆమె మొక్కుకుంది. అల్లాహ్ ఆమె ప్రార్థన విన్నాడు. ఆమె మొర ఆలకించాడు. ఆమెకు సంతానాన్ని ప్రసాదించాడు. ఆమె కడుపులో పసిబిడ్డ పెరగడం ప్రారంభమైంది. ఆమె ఆనందానికి పట్టపగ్గాల్లేవు. అల్లాహ్‌కు శతవిధాల కృతజ్ఞతలు అర్పించుకుంది. ఆమె భర్త ఇమ్రాన్ కూడా చాలా సంతోషించారు. దేవునికి ధన్యవాదాలు తెలుపుకున్నారు.



కాని, ఆమె గర్భంతో ఉన్నప్పుడే ఆమె భర్త చనిపోయారు. ఆమె ఎంతగానో రోదించింది. తమకు పుట్టబోయే బిడ్డను చూడకముందే చనిపోయిన దురదృష్టం ఇమ్రాన్‌ది. చివరకు ఆమెకు ఆడబిడ్డ పుట్టింది. ఆమె మరలా దేవునికి మొరపెట్టుకుంటూ, "ప్రభూ! నాకు ఆడబిడ్డను ప్రసాదించావు. ఆడబిడ్డ మగబిడ్డ వంటిది కాదు. నా బిడ్డకు నేను మర్యమ్ (భక్తురాలు) అని పేరు పెట్టాను. ఆమెను, ఆమె సంతానాన్ని నువ్వు షైతాన్ బారి నుంచి కాపాడాలని నేను కోరుకుంటున్నాను" అని ప్రార్థించింది.

హన్నాకు ఒక సమస్య ఎదురయ్యింది. ఆమె తనకు పుట్టబోయే బిడ్డను దైవగృహం సేవకు అర్పిస్తానని మొక్కుకుంది. కాని ఆడపిల్లలను అక్కడ అనుమతించడం జరగదు. ఆమె ఈ విషయమై చాలా ఆందోళన చెందసాగింది. ఆమె సోదరి భర్త జకరియా (అస)ఆమెకు ధైర్యం చెప్పేవారు. దైవానికి ఆమె గురించి తెలుసనీ, ఆమెకు పుట్టిన ఆడబిడ్డ గురించి కూడా దైవానికి తెలుసనీ, ఆమె దేవుని సేవకు ఎలా అర్పితమైంది కూడా దేవునికి తెలుసనీ ఆయన నచ్చజెప్పేవారు. అందువల్ల ఆమె తన బిడ్డను ఒక వస్త్రంలో చుట్టి దైవగృహం పెద్దలకు అప్పగించింది. ఆడబిడ్డ కావడం వల్ల ఆమె సంరక్షణ బాధ్యత ఎవరికి అప్పగించాలన్నది దైవగృహం పెద్దలకు ఒక సమస్యగా మారింది. తాము ఎంతగానో అభిమానించే, తమకు ఇష్టుడైన తమ నాయకుడి అనాథ బిడ్డ సంరక్షణ బాధ్యత స్వీకరించడానికి చాలా మంది ముందుకు వచ్చారు. అప్పుడు జకరియా (అస) మాట్లాడుతూ, " దైవగృహంలో మిగిలిన వారందరి కన్నా నేను ఈ బిడ్డకు సమీప బంధువును. కాబట్టి నేను ఆమె సంరక్షణ పట్ల మిగిలిన వారందరికన్నా ఎక్కువ శ్రద్ధ తీసుకుంటానని" తెలిపారు.

అప్పట్లో వివాదాలు పరిష్కరించుకోవడానికి లాటరీ వేసే పద్ధతి అచరించేవారు. ఇప్పుడు కూడా అదే పద్ధతి ప్రకారం లాటరీ వేశారు. బిడ్డ సంరక్షణ బాధ్యత స్వీకరిస్తామని ముందుకు వచ్చిన వారందరికీ ఒక్కొక్క గడ్డిపోచను ఇవ్వడం జరిగింది. ఆ గడ్డిపోచను నదిలో వేయాలనీ, ఎవరి గడ్డిపోచ మునిగి పోకుండా తేలుతూ ఉంటుందో వారే సంరక్షణ బాధ్యత తీసుకోవాలని నిర్ణయించారు. ఒక్క జకరియా వేసిన గడ్డిపోచ తప్ప మిగిలిన వారందరి గడ్డిపోచలు నదిలో మునిగి పోయాయి. ఆ తర్వాత అందరూ ఈ నిర్ణయానికి కట్టుబడి జకరియా(అస)ను సంరక్షకునిగా అంగీకరించారు.

https://teluguislam.net



దైవగృహంలో మర్యమ్ వద్దకు మిగిలిన వాళ్ళెవ్వరూ వెళ్ళకుండా జకరియా (అస) అక్కడ ఒక గదిని కట్టించారు. ఆమె పెరిగి పెద్దవసాగింది. ఎక్కువ సమయం దైవారాధనలో గడుపసాగింది. జకరియా (అస) రోజూ వచ్చి ఆమెకు కావలసినవి ఇచ్చి వెళుతుండేవారు. ఈ విధంగా అనేక సంవత్సరాలు గడచి పోయాయి. ఒక రోజు జకరియా (అస) అక్కడికి వచ్చేసరికి అక్కడ తాజా ఫలాలు కనబడ్డాయి. వాటిని చూసి జకరియా (అస) చాలా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే అయన వాటిని తీసుకురాలేదు. మరొకరు వచ్చే అవకాశం లేదు. (కొందరు దివ్య ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం, ఆ కాలంలో లభించే అవకాశంలేని ఫలాలు ఆమె వద్ద జకరియాకు కనబడ్డాయి). ఆయన ఆశ్చర్యంగా ఈ ఫలాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ఆమె జవాబిస్తూ, ఈ ఫలాలు అల్లాహ్ వద్ద నుంచి వచ్చాయనీ, అల్లాహ్ తాను తలచుకున్న వారికి ఏమైనా ఇస్తాడని జవాబు చెప్పింది. ఈ మాటలు విన్న జకరియాకు అల్లాహ్ మర్యమ్‌కు ఉన్నత హోదా ఇచ్చాడనీ, మిగిలిన మహిళలు ఎవ్వరికీ లభించని ఉత్కృష్ట హోదా మర్యమ్‌కు లభించిందని అర్థమయింది. అప్పటి నుంచి జకరియా (అస) ఆమె వద్ద మరింత అధిక సమయం గడుపుతూ ఆమెకు దైవ ధర్మాన్ని బోధించేవారు. ఈ విధంగా మర్యమ్ ఒక ధర్మపరాయణురాలైన మహిళగా, అల్లాహ్‌ను రాత్రింబవలు స్తోత్రం చేసే మహిళగా ఎదిగారు.

(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 3 : 33-47, 4:156, 19:16-34, 21:91, 66:12)



# ప్రవక్త ఈసా

## (అలైహిస్సలామ్)

మర్యమ్ కుమారుడైన మసీహ్ ఒక ప్రవక్త తప్ప మరేమీ కాదు. ఆయనకు మునుపు కూడా ఎంతో మంది ప్రవక్తలు గతించారు. ఆయన తల్లి సద్వర్తనురాలు. ఆ తల్లీ కొడుకులిరువురూ అన్నం తినేవారే.

**(ఖుర్‌ఆన్ 5 : 75)**

మర్యమ్ దైవగృహంలో ఆరాధనలో ఉన్నప్పుడు ఒక దైవదూత పురుషుని రూపంలో ఆమె ముందు ప్రత్యక్షమయ్యాడు. ఆమె భయంతో వణుకుతూ అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించింది. "నీవే గనుక దేవునికి భయపడే వానివైతే (ఇక్కణ్నుంచి వెళ్ళిపో), నేను నీ నుంచి అల్లాహ్ శరణు కోరుతున్నాను" అంటూ దేవుణ్ణి ప్రార్థించింది. దైవదూత ఆమెను ఉద్దేశించి మాట్లాడుతూ, "భయపడవద్దు. నీకెలాంటి ప్రమాదమూ లేదు. నేను నీ ప్రభువు పంపగా వచ్చిన దూతను మాత్రమే. నన్ను ప్రభువు నీ వద్దకు పంపాడు. నీకు సన్మార్గుడైన ఒక కుమారుణ్ణి ప్రసాదించ డానికి" అన్నాడు. ఈ మాటలు విని మర్యమ్ నిర్ఘాంతపోయింది. ఆమె దైవదూత చెప్పిన మాటలకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, "నాకు కుమారుడు ఎలా పుడతాడు. నన్ను ఏ పురుషుడూ తాకలేదే. నేను శీలం లేనిదాన్ని కాదు" అన్నారు. దైవదూత ఆమెకు సమాధానమిస్తూ, అలాగే అవుతుంది. నీ ప్రభువుకు ఇది చాలా తేలిక. ఆయన నీ కుమారుడిని మానవాళికి ఒక నిదర్శనంగా, అల్లాహ్ తరపున కారుణ్యంగా తయారు చేస్తాడని చెప్పాడు. ఈ మాటలు పలికిన దైవదూత అదృశ్యమయ్యాడు.

https://teluguislam.net



## ఆందోళన

దైవదూత రాక వల్ల మర్యమ్(అస) చాలా ఆందోళనకు గురయ్యారు. నెలలు గడచినకొద్దీ ఆమె ఆందోళన ఎక్కువయ్యింది. భర్త లేకుండా బిడ్డకు జన్మనివ్వడం ఎలా? ఎలా సమాధానమిచ్చుకోగలదు?

ఆమెలో మరో ప్రాణి ఊపిరి పోసుకుంటుందన్న విషయం త్వరలోనే ఆమెకు తెలిసివచ్చింది. ఆమె బరువెక్కిన హృదయంతో దైవగృహాన్ని వదలి నజరేత్‌కు వెళ్ళిపోయారు. నజరేత్ పట్టణంలోనే ఆమె జన్మించారు. ప్రజలకు దూరంగా ఒక చిన్న ఇంట్లో ఆమె నివసించసాగారు.

కాని భయం, ఆందోళన ఆమెను వదలిపెట్టలేదు. ఆమె ఒక ఉన్నత కులీన కుటుంబానికి, ధర్మపరాయణుల కుటుంబానికి చెందిన స్త్రీ. ఆమె కుటుంబ చరిత్ర ఘనమైనది. ఆమె తండ్రిని చెడ్డవాడిగా చెప్పే ధైర్యం ఎవరూ చేయలేదు. ఆమె తల్లిని ఎవరూ వ్రేలెత్తి చూపలేదు. కాని ఇప్పుడు ఆమె గురించి ప్రశ్నించే వారికి ఏమని జవాబు చెప్పగలదు. ఇలా కొన్ని నెలలు గడచిపోయాయి. ఆమె ఈ మానసిక ఒత్తిడిని భరించలేకపోయారు. గర్భంలో బిడ్డను మోస్తూ ఆమె నజరేత్‌ను విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఎక్కడికి వెళ్ళాలన్నది ఆమెకు తెలియదు. ఎక్కడికో అక్కడికి ఈ ప్రాంతం నుంచి, ఈ వాతావరణం నుంచి దూరంగా వెళ్ళిపోవాలని బయలు దేరారు.

## పురిటి నొప్పులు

అలా బయలుదేరిన ఆమె ఎక్కువ దూరం వెళ్ళక ముందే పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. ఆమె ఒక చెట్టును ఆనుకుని కూర్చుండిపోయారు. అక్కడే ఆమె ఒక మగశిశువుకు జన్మనిచ్చారు. అందమైన ఆ శిశువు ముఖాన్ని తదేకంగా చూడసాగారు. తండ్రి లేకుండా ఆ శిశువును ఈ లోకంలోకి తీసుకు వచ్చినందుకు ఆమెకు చాలా బాధ కలిగింది. ఆమె చాలా విచారంగా, "ఇదంతా జరక్కముందే నేను చనిపోయి ఉంటే ఎంత బాగుండేది?" అనుకున్నారు. హఠాత్తుగా ఆమెకు ఒక స్వరం వినిపించింది. "దుఃఖించవద్దు, నీ ప్రభువు ఇక్కడికి సమీపంలో ఒక సెలయేరును ఏర్పాటు చేశాడు. ఇక ఆహారం విషయానికి వస్తే, ఈ ఖర్జూరం చెట్టు మొదలు పట్టుకుని ఊపితే ఖర్జూరాలు రాలతాయి. వాటిని తిని, సెలయేటి నీరు తాగి నీవు కోల్పోయిన బలాన్ని తిరిగి పొందు. సంతోషంగా ఉండు. నీవు



చూస్తున్నది అల్లాహ్ శక్తిసామర్థ్యాల ప్రభావాన్ని. వాటి వల్ల ఎండిపోయిన ఖర్జూరం చెట్టు నీ కోసం ఫలాలను ఇస్తోంది" అని ఆ స్వరం పలికింది. దేవుని తరఫున వినిపించిన ఆ స్వరం ఆమెకు ధైర్యాన్నిచ్చింది. ఆమె స్వచ్ఛమైన నడవడికకు, వ్యక్తిత్వానికి ఇది నిదర్శనం. ఆమె తిరిగి పట్టణానికి వెళ్ళాలని నిర్ణయించు కున్నారు. కాని ఆమెలోని భయాలు మళ్ళీ ఆమెను చుట్టుముట్టాయి.

## అప్పుడే జన్మించిన శిశువు మాట్లాడడం

ఆమె ప్రజలకు ఏమని జవాబు చెప్పగలదు? తల్లి పడుతున్న ఆందోళనను గుర్తించినట్లు శిశువు తానే స్వయంగా మాట్లాడడం ప్రారంభించాడు. "నీవు ఎవరినైనా కలిస్తే వారితో.. దేవుని కోసం నేను ఈ రోజు ఉపవాసం ఉంటున్నాను. ఈ రోజు ఎవరితోనూ మాట్లాడను" అని పలకాలని చెప్పాడు. ఈ అసాధారణ సంఘటన, పుట్టిన బిడ్డ మాట్లాడిన సంఘటన చూసి ఆమెలోని భయాలు చాలా వరకు తగ్గిపోయాయి.

## అపవాదు

ఆమె అనుకున్నట్లే, పట్టణ ప్రజలు ఆమెను, ఆమె ఒడిలో ఉన్న బిడ్డను అనుమానంగా చూడడం ప్రారంభించారు. ఆమెను నిందించడం ప్రారంభించారు. "ఓ హారూన్ సోదరి! (ప్రవక్త హారూన్, ఆమెకు పూర్వీకుడు). నువ్వు చేసింది మహా పాపం. నీ తండ్రి చెడ్డవాడు కాదే, నీ తల్లి చెడ్డది కాదే" అంటూ నిలదీయడం ప్రారంభించారు. ఆమె తన నోటిపై వ్రేలు ఉంచుకుని తన బిడ్డ వైపు సైగ చేసింది. వారు ఆశ్చర్యంగా, "పసిబిడ్డతో మేం ఎలా మాట్లాడగలం?" అన్నారు. కాని వారిని ఆశ్చర్యానికి గురిచేస్తూ ఆ బిడ్డ స్పష్టంగా మాట్లాడడం ప్రారంభించింది. "నేను అల్లాహ్ దాసుడను. అల్లాహ్ నాకు గ్రంథాన్ని ఇచ్చి నన్ను ప్రవక్తగా చేసి పంపాడు" అని పలికాడు.

ఆ బిడ్డ విశిష్టమైనదని ప్రజలు గ్రహించారు. అల్లాహ్ తాను అనుకున్నది జరగడానికి కేవలం 'అయిపో' అంటే చాలు. ఆయన తలచినది జరిగిపోతుందని తెలుసుకున్నారు. కాని ఇదంతా ఒక కనికట్టు విద్యగా భావించినవారు కూడా కొందరు ఉన్నారు. అయితే, ఈ పరిణామం తర్వాత మర్యమ్ (అస) నజరేత్‌లో ఎలాంటి వేధింపులు లేకుండా నివసించడం సాధ్యపడింది.

https://teluguislam.net



## ప్రవక్త పదవికి సంబంధించి మరిన్ని నిదర్శనాలు

ప్రవక్త క్రీస్తు (అస) పెరిగి పెద్దయిన కొద్దీ ఆయన ప్రవక్త పదవికి సంబంధించి మరిన్ని నిదర్శనాలు బహిర్గతం కాసాగాయి. ఆయన తన స్నేహితులతో మాట్లాడుతూ, వారి కొరకు వారి ఇంట ఎలాంటి భోజనం సిద్ధంగా ఉన్నదో చెప్పేవారు. వారు ఎక్కడ ఏది దాచి ఉంచారో కూడా చెప్పేసేవారు. ఆయన పాఠాలు నేర్చుకుంటున్నప్పుడు చాలా శ్రద్ధగా వినేవారు. తనకు నేర్పబడిందంతా కంఠస్థం చేసేసేవారు. ఆయన తన ఉపాధ్యాయులను ప్రశ్నించి ప్రతిదీ తెలుసుకునేవారు.

పన్నెండు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు ఆయన తన తల్లితో కలసి జెరుసలేం వెళ్ళారు. ఆయన అక్కడ ఆరాధనాలయంలో తిరుగుతూ, రబ్బీలు (యూద మతబోధకులు) చేస్తున్న బోధనలను అక్కడి జనసమూహంతో పాటు కలసి విన్నారు. అక్కడ ఉన్న వారందరూ పెద్దలే. పెద్దవారి మధ్య కూర్చుని మతవిషయాలు వినడానికి ఆయన ఏమాత్రం సంకోచించలేదు. మతబోధకుల ఉపన్యాసాలు శ్రద్ధగా విన్న తర్వాత ఆయన ఆసక్తిగా ఎన్నో ప్రశ్నలు అడిగి వారి నుంచి జవాబులు తీసుకున్నారు. తన అభిప్రాయాలు నిర్మొహమాటంగా తెలిపారు. ధైర్యంగా ప్రశ్నలు అడిగి, తన అభిప్రాయాలు తెలుపుతున్న ఆ బాలుని చూసి రబ్బీలు కాస్త కలవరపడ్డారు. ఆయన అడిగిన ప్రశ్నలకు వారి వద్ద జవాబులు లేవు. వారు ఏం చెప్పాలో తెలియని పరిస్థితికి గురయ్యారు. ఆయన ప్రశ్నలు అడక్కుండా అడ్డుకోవడానికి, ఆయన నోరు విప్పకుండా చేయడానికి వాళ్ళు ప్రయత్నించారు. కాని ప్రవక్త క్రీస్తు (అస)వారి ఎత్తుగడలు సాగనివ్వలేదు. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా తెలియజేశారు. ఈ వాగ్వివాదంలో ఆయన ఎంతగా నిమగ్నమై పోయారంటే, ఆయనకు తాను ఇంటికి తిరిగి వెళ్ళవలసి ఉందన్న విషయం కూడా గుర్తుకు రాలేదు.

ఈలోగా ఆయన తల్లి ఆయన కోసం వెదికి, ఆయన స్నేహితులతో కలసి ఇంటికి వెళ్ళిపోయి ఉంటారని భావించి తమ ప్రాంతానికి తిరుగుముఖమయ్యారు. కాని ఇంటికి వచ్చి చూస్తే ఆయన లేరు. ఆమె తిరిగి జెరుసలేం వచ్చి ఆయన కోసం వెదకడం ప్రారంభించారు. చివరకు ఆరాధనాలయంలో మతబోధకుల మధ్య, వారితో మాట్లాడుతూ ఆయన కనబడ్డారు. ఆయన చాలా మామూలుగా, మతచర్చలు ఎప్పటి నుంచో చేస్తున్న వ్యక్తి మాదిరిగా ఎలాంటి బిడియం లేకుండా వారి మధ్య కూర్చుని మాట్లాడుతూ కనబడ్డారు. మర్యమ్ (అస) ఆయన్ను చూసి నిశ్చింతగా ఊపిరి పీల్చుకుని, తనను హైరానాకు గురి చేసినందుకు మందలించాగు. ఆయన జవాబిస్తూ, మతపెద్దలతో చర్చల్లో మునిగి తాను సమయాన్ని మరచిపోయానని అన్నారు.



## జిబ్రయీల్ రాక

ప్రవక్త క్రీస్తు (అస) ముప్పయి సంవత్సరాల వయసుకు చేరుకున్న తర్వాత దైవ దూత జిబ్రయీల్ ఆయన వద్దకు వచ్చి ఇంజీల్ గ్రంథాన్ని ఇచ్చారు. దైవ గ్రంథమైన ఇంజీల్, అంతకు ముందు అరుదెంచిన ప్రవక్తల గ్రంథాలను, అంతకు ముందు అవతరించిన దైవసందేశాలను అన్నింటినీ ధృవీకరించిన గ్రంథం. కాని అప్పటికి యూదులు తమ ప్రవక్త మూసా (అస) తీసుకువచ్చిన తౌరాత్ గ్రంథానికి చాలా దూరమైపోయారు. వారు కేవలం సంపదను కూడ బెట్టడంలో మునిగి పోయారు. ఆరాధనాలయాల నిర్మాణం పేరిట ప్రజల నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసేవారు, కాని ఆ సొమ్ము యావత్తు తమ స్వార్థం కోసం ఉపయోగించు కునేవారు.

అయితే, పునరుజ్జీవనాన్ని (మరణానంతరం మళ్ళీ బ్రతికించబడడాన్ని), తీర్పు దినాన్ని విశ్వసించే ఒక వర్గం కూడా వారిలో ఉండేది. అలాగే, బహిరంగంగా మాత్రం చాలా ధర్మపరాయణుల్లా, దైవభీతి కలవారిగా నటిస్తూ, తమ వ్యక్తిగత జీవితాల్లో అన్ని విధాల చెడుల్లో కూరుకుపోయిన వర్గం కూడా ఉండేది.

ప్రవక్త క్రీస్తు (అస) తన సందేశ ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారు. అల్లాహ్ మార్గానికి ప్రజలను ఆహ్వానించడం మొదలుపెట్టారు. యూదులు కూరుకు పోయిన చెడుల గురించి వివరిస్తూ వారిని మందలించేవారు. యూద మతపెద్దల ద్వంద్వ ప్రమాణాలను విమర్శించేవారు. వారి నైతిక పతనం పట్ల వారిని హెచ్చరించేవారు. కాని యూద మతపెద్దలు ప్రవక్త క్రీస్తు హితబోధను పెడచెవినపెట్టారు. పైగా ఆయనకు శత్రువులై పోయారు. తమ విలాసవంతమైన జీవితాలకు ప్రమాదం ముంచుకు వచ్చిందని భయపడ్డారు. సత్యాన్ని అణచివేయడానికి అన్ని విధాల ఎత్తుగడలకు పాల్పడ్డారు. అలాంటి ఎత్తుగడల్లో ఒకటేమిటంటే, ప్రవక్త క్రీస్తును ఆయన ప్రవక్త పదవికి సంబంధించి నిదర్శనాలు చూపమని అడగడం.

https://teluguislam.net



## ప్రవక్త క్రీస్తు ప్రదర్శించిన మహత్యాలు

ప్రవక్త క్రీస్తుకు అల్లాహ్ మహత్యాలు ప్రదర్శించే శక్తిని ప్రసాదించాడు. ఆయన మట్టితో ఒక పక్షిని తయారు చేసి దానిలోకి ఊదారు. అల్లాహ్ అభీష్టంతో ఆ మట్టిపక్షి ప్రాణం పోసుకుంది. ఆయన గ్రుడ్డివారికి చూపు వచ్చేలా చేశారు. చెవిటివారికి వినికిడి శక్తి వచ్చేలా చేశారు. కుష్ఠువ్యాధిగ్రస్తులకు వ్యాధి నయమయ్యేలా చేశారు. మరణించిన వారు ప్రాణం పోసుకునేలా చేసి చూపించారు. ఇవన్నీ ఆయన అల్లాహ్ అభీష్టంతో మాత్రమే చేసి చూపించగలిగారు. ఇన్ని మహత్యాలు చేసి చూపించినప్పటికీ చాలా మంది ఆయన్ను విశ్వసించే బదులు ఆయన్ను మంత్రగానిగా ఆరోపించారు. అయితే ప్రవక్త క్రీస్తు బోధనలు కొందరిని ఆకట్టుకున్నాయి. ఒక చిన్న సమూహం ఆయన బోధనలను విని ఆయన్ను విశ్వసించింది.

కొంతకాలం తర్వాత ప్రవక్త క్రీస్తు (అస) తన వ్యతిరేకులను బహిరంగంగా ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నారు. ఆ రోజు పండుగ రోజు. యూద మత పెద్దలు అందరూ జెరుసలేంలో సమావేశమై ఉన్నారు. పెద్ద బహిరంగ సభను ఉద్దేశించి వారు ప్రసంగించడానికి వచ్చారు. ఆ బహిరంగ సభను ఉద్దేశించి ప్రవక్త క్రీస్తు (అస) ప్రసంగించారు. ఆయన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఈ పరిణామం యూద మతపెద్దలను తీవ్రంగా అసహనానికి గురిచేసింది. ఎలాగైనా ప్రవక్త క్రీస్తును వదిలించుకోవాలని భావించారు.

కాని బహిరంగంగా ఆయనకు కీడు తలపెట్టడం వారి వల్ల కాలేదు. ఎందుకంటే, ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయన్ను అభిమానిస్తున్నారు. అందువల్ల ఆయనకు వ్యతిరేకంగా కుట్రపన్నడం ప్రారంభించారు.

(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 17:16-36, 2:87, 3:45-60. 4:156-159/171-172, 5:17/46/72/75, 19:30-31, 23:15, 63:57-65, 61:6-14, 5:109-120, 57:26-27, 9:111)

## విందులో మహత్యం

తన శిష్యులతో సహా ప్రవక్త క్రీస్తు (అస) ప్రతి పట్టణాన్ని సందర్శించి అల్లాహ్ సందేశాన్ని ప్రచారం చేయడం ప్రారంభించారు. ఆయన శిష్యులు సంఖ్యలో చాలా తక్కువ మంది కాని ఆయన కోసం దృఢంగా నిలబడే మద్దతుదారులు. ప్రవక్త క్రీస్తు (అస) అన్యాయాలకు వ్యతిరేకంగా తన గొంతు విప్పారు.



ఈ ప్రయాణాల్లో ఒకసారి ఒక బంజరు భూమికి చేరుకున్నారు. వారు అలసిపోయి ఉన్నారు. ఆకలిదప్పులతో ఉన్నారు. ప్రవక్త క్రీస్తు(అస) వారి ధైర్యస్థైర్యాలను పెంచడానికి తన దైవిక ఉద్యమం గురించి వారికి సమగ్రంగా వివరించడం ప్రారంభించారు. ఆ విధంగా వారు ఆకలిదప్పులను మరచిపోయేలా చేయాలనుకున్నారు. కాని కేవలం నోటి మాటల ద్వారా ఆకలిదప్పుల బాధలు తీరడం లేదు. వారు ఏదైనా మహత్యం చూపించాలని కోరారు. ఆహార పదార్థాలు వడ్డించిన ఒక బల్ల తమ ముందుకు వచ్చేలా చేయాలని కోరారు. వారు ఈ కోరిక కోరడం వెనుక ఎలాంటి మూర్ఖపు ఆలోచనలు లేవు, వారి విశ్వాసంలోనూ ఎలాంటి లోపం లేదన్న విషయం ప్రవక్త క్రీస్తు (అస) గ్రహించారు. వాళ్ళు కేవలం అల్లాహ్ శక్తిసామర్థ్యాలను మరోసారి చూడాలనుకుంటున్నారు. ప్రవక్త క్రీస్తు (అస) సృష్టికర్తను వేడుకుంటూ, ఒక మహత్యం చూపించాలని అభ్యర్థించారు. అల్లాహ్ ఆయన ప్రార్థనను ఆలకించాడు. మరుక్షణం వారి ముందు ఆహార పదార్థాలు వడ్డించిన ఒక బల్ల ప్రత్యక్షమయ్యింది. ఇది తనకు, తన శిష్యులకు ఒక పరీక్ష అవుతుందేమో అని ఆయన భయపడ్డారు. ఈ మహత్యం తనకు, తన శిష్యులకు ఒక కారుణ్యంగా చేయాలని ఆయన అల్లాహ్‌కు మొరపెట్టుకున్నారు. ఆ తర్వాత వారంతా ఆ ఆహార పదార్థాలను కడుపారా భుజించారు. ఈ విందులో చుట్టుప్రక్కల ప్రజలు చాలా మంది వచ్చి పాల్గొన్నారు. అందరూ తిన్నారు. దైవికంగా అక్కడకు వచ్చిన ఆ ఆహార పదార్థాలు ఎంత మంది తిన్నా తరగలేదు. ఆ తర్వాత కూడా చాలా కాలం వరకు ఆ మహత్యం గురించి ప్రజలు కథలు కథలుగా చెప్పుకున్నారు. ఈ మహత్యం తర్వాత చాలా మంది ప్రవక్త క్రీస్తు సందేశాన్ని విశ్వసించారు.

*(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 5:112-115)*

## అబద్ధపు ఆరోపణలు

యూద మతపెద్దల వాదనలను తప్పుగా నిరూపిస్తూ, సత్య మేదో అసత్య మేదో తేటతెల్లం చేస్తుండడంతో ప్రవక్త క్రీస్తు (అస) వారికి కంటగింపయ్యారు. ఆయన పట్ల వారు వైరం పెంచుకున్నారు. ఆయన వాదనలకు వ్యతిరేకంగా వారు సమర్థవంతంగా వాదించలేకపోయారు. అందువల్ల ఆయన్ను ఒక మోసగానిగా, ఒక అబద్ధాలకోరుగా ప్రచారం చేయడం ప్రారంభించారు. ఆ ప్రాంతం పాలకుని వద్ద ఆయనకు వ్యతిరేకంగా ఒక తప్పుడు ఫిర్యాదు నమోదు చేశారు. అప్పట్లో అక్కడ రోమన్ ప్రభుత్వం పాలిస్తోంది. ప్రవక్త క్రీస్తు ప్రజలను రెచ్చగొడుతున్నారని,

https://teluguislam.net



విదేశీ పాలకులపై తిరగబడేలా చేస్తున్నారని, ఆయన చర్యలు యూద ధర్మంపై తిరుగు బాటుకు దారితీస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ఆయన్ను ఒక మంత్ర గానిగా ఆరోపించారు. మంత్రతంత్రాలు చేస్తున్నాడన్నారు.

ప్రవక్త క్రీస్తు (అస) ప్రదర్శించిన అనేక మహత్యాలను చూసిన తర్వాత కూడా వారు తమ వైఖరిని మార్చుకోలేదు. మోసాలకు, ద్రోహాలకు పూనుకున్నారు. ఆయన్ను చంపేయాలని భావించారు. రోమన్ పాలకులను కూడా ఈ పరిణామాలు కలవరానికి గురిచేశాయి. ప్రజల్లో సమానత్వం వంటి విప్లవాత్మక భావాలు వ్యాపించడాన్ని వాళ్ళు కూడా సహించలేరు. చివరకు ప్రవక్త క్రీస్తును నిర్బంధించడానికి వాళ్ళు అంగీకరించారు. కాని ప్రవక్త క్రీస్తు (అస) వారికి ఎక్కడ కూడా కనబడలేదు. ఆయన దైవసందేశాన్ని ప్రచారం చేస్తూ దూరప్రదేశాల్లో తిరుగుతున్నారు. పరిస్థితులకు అనుగుణంగా బహిరంగంగా లేదా రహస్యంగా ఆయన ప్రచారం కొనసాగుతోంది.

## మోసం

ప్రవక్త క్రీస్తు ఆచూకి చెప్పినవారికి భారీ బహుమానం ఇస్తామని పాలకులు ప్రలోభపెట్టారు. ఈ ప్రలోభానికి ప్రవక్త క్రీస్తు శిష్యుల్లో ఒకడైన 'జూడా' లొంగిపోయాడు. తన గురువుకు ద్రోహం చేయడానికి సిద్ధమయ్యాడు. తనెవరూ గుర్తుపట్టకుండా ఉండడానికి వేషం మార్చుకుని రోమన్ సైనికులతో కలసి ప్రవక్త క్రీస్తును వెదకడంలో పాలుపంచుకున్నాడు. చాలా సేపు వెదకిన తర్వాత చీకటి పడుతున్న సమయంలో ప్రవక్త క్రీస్తు రాత్రి గడపడానికి బస చేయాలనుకున్న తోటకు చేరుకున్నారు. ఆ ప్రదేశాన్ని రోమన్ సైనికులు చుట్టుముట్టడాన్ని చూసిన క్రీస్తు శిష్యులు పారిపోయారు. ప్రవక్త క్రీస్తు (అస) వంటరిగా శత్రువుల వలయంలో మిగిలిపోయారు.

కాని అల్లాహ్ ఆయన్ను వదలిపెట్టలేదు. ప్రవక్త క్రీస్తు (అస) అక్కడ సైనికులకు ఎవరికీ కనబడకుండా అదృశ్యమయ్యేలా చేశాడు అల్లాహ్. క్రీస్తు కోసం వెదుకుతున్న సైనికులకు ఒక వ్యక్తి కనబడ్డాడు. అతని రూపురేఖలు క్రీస్తును పోలి ఉన్నాయి. వారు తక్షణం అతన్ని నిర్బంధించారు. ఈ వ్యక్తి మరెవరో కాదు, స్వయంగా జూడాయే. అతను ఎంతగా నిర్ఘాంతపోయాడంటే, తనను అన్యాయంగా నిర్బంధిస్తున్నారని చెప్పడానికిగాని, తన వాదన వినిపించడానికి గాని అతని నోరు పెగలలేదు. ప్రవక్త క్రీస్తుకు ద్రోహం చేసిన ఫలితమిది. ఆ



విధంగా జూడా కుట్ర బెడిసికొట్టేలా చేశాడు అల్లాహ్. సైనికులు అతన్ని ఈడ్చుకుని శిలువ వేసే ప్రదేశానికి తీసుకుపోయారు. చిత్రవధకు, పరాభవంతో కూడిన మరణానికి గురయ్యాడతను. కాగా ప్రవక్త క్రీస్తును అల్లాహ్ కాపాడాడు.

### గ్రహించవలసిన పాఠాలు

- తీర్పుదినాన మానవులను మళ్ళీ బ్రతికించడం జరుగుతుందన్న విషయానికి ఒక నిదర్శనంగా క్రీస్తు ప్రవక్తను తండ్రి లేకుండా సృష్టించడం జరిగింది. ప్రవక్త క్రీస్తు పుట్టుకకు ముందు యూదుల ఒక గ్రూపు మరణానంతరం మళ్ళీ బ్రతికించడం జరగదని వాదించేది. ఈ గ్రూపును సెడ్యూసీస్ అనేవారు. ల్యూక్, అధ్యాయం 20, వాక్యం 27 ప్రకారం, 'అప్పుడు కొందరు సెడ్యూసీలు - మృత్యువుతో జీవితం ముగిసి పోతుందని విశ్వసించేవారు - మరణానంతరం మళ్ళీ బ్రతికించడం లేదన్నారు).
- గత కాలాలకు చెందిన ప్రవక్తలపై అవతరించిన క్రింది గ్రంథాలతో పాటు ఇంజీల్ గురించి కూడా దివ్యఖుర్‌ఆన్‌లో ప్రస్తావనలు ఉన్నాయి. ప్రస్తుత బైబిల్ వీటి నుంచి ఏర్పడిందే! బైబిల్‌లో పాతనిబంధన, కొత్త నిబంధనలు ఉన్నాయి. యూద మతానికి సంబంధించిన పాత నిబంధనను మాత్రమే యూదులు అంగీకరిస్తారు. ప్రవక్త క్రీస్తు (అస) యూద ప్రవక్తలలో చివరి వారయినప్పటికీ కొత్త నిబంధనను వాళ్ళు అంగీకరించరు.

  1. **తౌరాత్** (పాత నిబంధన... మూసా ప్రవక్త (అస)పై అవతరించిన గ్రంథం)

  2. **జబూర్ (డేవిడ్ పాటలు, పాత నిబంధనలో ఉన్నవి)**

  3. **ఇంజీల్ (గ్రీకులో ఇవాంజిల్, ఇంగ్లీషులో గోస్పెల్) ప్రవక్త క్రీస్తుపై అవతరించింది. దీనిని క్రయిస్తవులు కొత్త నిబంధనగా పేర్కొంటారు.**
- ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న ఈ గ్రంథాలలో దివ్య ఖుర్‌ఆన్ ప్రస్తావనలు వేటిని సూచిస్తున్నాయో చెప్పలేము. అయితే ఈ గ్రంథాల

https://teluguislam.net



భాగాలు మాత్రమే దొరుకుతున్నాయి. ఈ గ్రంథాలు సంపూర్ణంగా, మార్పులు లేకుండా ఉన్నాయని చెప్పే పరిస్థితి లేదు. ఇందులో అనేక వైరుధ్యాలు మనకు కనబడతాయి. కాని దివ్యఖుర్‌ఆన్ నేటికి 1400 సంవత్సరాలుగా ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా భద్రంగా ఉంది.

- కొత్త నిబంధనకు సంబంధించి ఇద్దరు మార్క్, లూకాలు నిజానికి ప్రవక్త క్రీస్తును అయన జీవిత కాలంలో అనుసరించిన పన్నెండు మంది శిష్యుల లోని వారుకాదు. ( గోస్పెల్ అఫ్ బార్నబాస్‌తో సహా) క్రీస్తు శిష్యులలో కొందరి రచనలను తదుపరి కాలాల క్రయిస్తవులు సందేహాస్పదమైన రాతలుగా తిరస్క రించారు.

- జె.సి. ఫెంటాన్, యార్క్‌షైర్‌లోని వెంత్‌వర్త్‌కు మాజీ మతాధికారి. తర్వాత అయన లీచ్‌ఫీల్డ్ థియోలాజికల్ కాలేజికి వెళ్ళారు. ఆయన రాసిన పుస్తకం "సెయింట్ మాథ్యూస్" 1963లో ప్రచురిత మయ్యింది. పెంగ్విన్ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. అందులో ఆయన ఇలా రాశారు: శిలువ వేసిన తర్వాత నుంచి గోస్పెల్స్ రాయబడిన సమయం వరకు గడచిన కాలంలో కొంత మంది ప్రారంభ కాలాలకు చెందిన క్రయిస్తవులు క్రీస్తు శిలువ వేయబడలేదని, అయనకు బదులు మరొకరు శిలువ వేయబడ్డారని విశ్వసించారు. క్రీస్తు శిలువపై మరణించలేదని విశ్వసించే క్రయిస్తవ వర్గం కూడా ఉంది. వారి అభిప్రాయం ప్రకారం, క్రీస్తు శిలువ నుంచి సజీవంగా బ్రతికి క్రిందికి వచ్చారు. 19వ శతాబ్దం ప్రారంభంలో కొందరు క్రీస్తు శిలువపై నీరసపడ్డారని, తర్వాత రాతి సమాధి నుంచి బయటకు వచ్చారని కొత్త సిద్ధాంతాలు ప్రతిపాదించారు.

- ప్రవక్త క్రీస్తు ప్రత్యక్ష శిష్యుల్లో ఒకరు రాసిన 'గోస్పెల్ అఫ్ బార్నబాస్'ను కొత్త నిబంధన నుంచి తొలగించడం అన్నది క్రీస్తు తర్వాత చాలా శతాబ్దాలకు జరిగింది. ఈ గోస్పెల్ ఒరిజినల్ కాపీ వియన్నాలో ఇంపీరియల్ లైబ్రరీలో భద్రపరచబడి ఉంది. లాన్స్‌డేల్, లారా రాగ్‌లు అనువదించిన ప్రతి ఇది. అక్స్‌ఫర్డ్ ప్రెస్ దీనిని 1907లో ప్రచురించింది. ఈ పుస్తకం 481వ పేజిలో ఈ విషయం స్పష్టంగా రాయబడింది. జూడా రూపురేఖలు ఆ సమయంలో పూర్తిగా ప్రవక్త క్రీస్తును పోలి ఉన్నందు వల్ల అతన్ని క్రీస్తుకు బదులు శిలువ వేయడం జరిగిందని బార్నబాస్ అన్నారు. ఈ మాటలు క్రీస్తు శిలువ వేయబడడాన్ని ఖండిస్తున్నాయి.



- ప్రాచీన కాలానికి చెందిన 'డెడ్ సీ స్క్రోల్స్'ను ఒక అరబ్బు పశువుల కాపరి ఒక గుహలో కనుగొన్నాడు. వీటిని కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా దాదాపు నలభై సంవత్సరాల పాటు రహస్యంగా ఉంచడం జరిగింది. వీటిని పలస్తీనాకు చెందిన యూదులు రాశారని తెలుస్తోంది. ప్రవక్త క్రీస్తు జీవిత కాలానికి రెండు శతాబ్దాల ముందు నుంచి ప్రవక్త క్రీస్తు జీవితకాలం వరకు వ్రాయబడిన పత్రాలివి. బైబిల్‌కు సంబంధించిన అతిపురాతనమైన వ్రాతప్రతులివే.

- హిబ్రూ యూనియన్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ బెన్ జిమ్ వాకోల్డర్, మార్టిన్ అబెక్‌లు ఈ వ్రాతప్రతులను రహస్యంగా ఉంచడాన్ని సవాలు చేసి వాటిని బయటకు తీయడానికి కృషిచేశారు. ఈ వ్రాతప్రతుల ద్వారా మనకు మార్పులు చేర్పులకు గురికాని పత్రాలు దొరకవచ్చు.)

# క్రయిస్తవ విశ్వాసం

(నేడు మనకు తెలిసిన విశ్వాసాలు)



"వారు ఆయనను చంపలేదు, శిలువపై ఎక్కించనూ లేదు. వారు భ్రమకు గురిచేయబడ్డారంతే!"
(దివ్యఖుర్‌ఆన్ 4 : 157)

ముస్లిములు ఇతర మతాల గురించి తెలుసుకోవడం ఎంతయినా అవసరం. ఆ విధంగా వారు ఇస్లామేతర విశ్వాసాలకు దూరంగా ఉండే అవకాశం లభిస్తుంది. అంతేకాదు, దివ్యఖుర్‌ఆన్ ఇతర మతాలను చులకన చేయడాన్ని నిషేధించిందన్న వాస్తవాన్ని కూడా మనం దృష్టిలో ఉంచుకోవాలి.

ప్రవక్త క్రీస్తు (అస) ఒక కొత్త మతాన్ని దేన్నీ తీసుకురాలేదు. ఆయన ఇస్రాయీల్‌కు చెందిన చెల్లాచెదరయిన తెగల వద్దకు పంపబడ్డారు. మూసా ప్రవక్త (అస) తీసుకు వచ్చిన దైవచట్టాలను ధృవీకరించడానికి ఆయన పంపబడ్డారు. ఈ విషయం క్రయిస్తవ గ్రంథాలలోను నిర్ధారితమయ్యింది. ఆయన ఎన్నడూ తాను దేవుణ్ణని చెప్పుకోలేదు. త్రిత్వాన్ని ఎన్నడూ ప్రచారం చేయలేదు. దైవం మానవ కుమారునిగా రావడం గురించి కాని, లేక 'మౌలిక పాపం' (ఒరిజినల్ సిన్) గురించి కాని ఆయన చెప్పలేదు. కాని ఆయన బోధనలను తర్వాతి కాలాల్లోని మతపెద్దలు మార్చి వేశారు. పాల్ ముఖ్యంగా ఈ మార్పులు చేశారు. పునరుజ్జీవం, దైవసామ్రాజ్యం, శిలువ వగైరా పదాలకు ఆయన కొత్త అర్థాలు ఇచ్చారు.

https://teluguislam.net



*(ఈ అనుచరులకు బహుశా బైబిల్ నుంచే అందుకు కావలసిన ప్రేరణ లభించి ఉంటుంది. బైబిల్‌లో దైవాన్ని సాధారణ మనిషి స్థాయికి తీసుకొచ్చిన ప్రస్తావనలు చాలా ఉన్నాయి. మామ్రే మైదానాల్లో ప్రవక్త అబ్రహాం దేవుని కాళ్ళు కడిగి విందు భోజనం వడ్డించిన ప్రస్తావన అలాంటిదే. జెనెసిస్ : 18:1-8. ఇక్కడ సబ్ హెడింగ్‌లో ముగ్గురు దైవదూతలు దేవుని వెంబడి వచ్చారన్న విషయం ఉంది. ఇక్కడ దేవుడు వచ్చిన విషయం స్పష్టంగా ప్రస్తావించబడింది. ఆధునిక సంచికల్లో ఈ కథనం విభిన్నంగా ఉంది.*

*జెనెసిస్ 32:24లో ప్రవక్త జాకబ్ భౌతికంగా దేవునితో మల్లయుద్ధం చేసిన ప్రస్తావన ఉంది. ఇక్కడ మళ్ళీ సబ్‌హెడింగ్ క్రింద దైవదూత అని ఉంది. కాని టెక్స్ట్‌లో ఈ ప్రస్తావన లేదు. పైగా ప్రవక్త జాకబ్ "నేను దేవుడిని ముఖాముఖి చూశాను. నా జీవితం రక్షణ పొందింది" అన్న మాటలు ఉన్నాయి. బహుశా ఇవి మల్లయుద్ధం తర్వాత చెప్పిన మాటలు కావచ్చు.)*

## త్రిత్వం

క్రయిస్తవ విశ్వాసం ప్రకారం, త్రిత్వం అంటే దైవానికి సంబంధించిన మూడు రూపాలు. దైవం, దైవకుమారుడు, పరిశుద్ధాత్మ. దేవునికి ఈ మూడు రూపాలున్నాయని విశ్వసిస్తారు. ప్రతీ రూపం దేనికదే సమగ్రమైందని, మళ్ళీ ఈ మూడు ఒక్కటే అని అంటారు. ఈ విశ్వాసం ప్రకారం, క్రీస్తు దేవుని కుమారుడు. దేవుని వారసుడు. పూర్తిగా దేవుని వంటివాడు.

*(కొలోసియన్లు : 1:15-20, హిబ్రూస్, 1:1-14)*

ఇస్లామీయ విశ్వాసం ఏమంటే, దేవుడు ఎవరికీ జన్మించలేదు. ఆయనకు సంతానం లేదు. ఆయనే సర్వస్వాన్ని సృష్టించాడు. ఆయన సాటిలేనివాడు. ఆయన ఒకే ఒక్కడు. ఆయన వంటివాడు మరెవ్వరూ లేరు. దేవునికి సహవర్తులుగా లేదా భాగస్వాములుగా ఇతరులను నిలబెట్టడం మహాపాపం. దేవుని వద్ద మధ్యవర్తులు లేరు. ఎవరూ ఆయన ఎదుట ఎవరికీ సిఫారసు చేయలేరు. దైవవిశ్వాసం, మంచి పనులు తప్ప మరేవీ ఆయన సమక్షంలో మనిషికి ఉపయోగపడవు.

https://teluguislam.net



## దైవకుమారుడు

ప్రవక్త క్రీస్తును దేవుని కుమారుడుగా విశ్వసిస్తారు. ఈ విశ్వాసం అనువాదాల్లో వచ్చిన పొరపాటు వల్ల జనించింది. ప్రవక్త క్రీస్తు మరణించిన తర్వాత దాదాపు ముప్పయి సంవత్సరాల వరకు గోస్పెల్స్ సంకలనం చేయబడ లేదని క్రయిస్తవ పండితులే అంగీకరిస్తున్నారు. ప్రారంభంలో గోస్పెల్స్ గ్రీకు భాషలో వ్రాయబడ్డాయి. ఇందులో కొన్ని మౌఖికంగా అందినవి, కాగా కొన్ని రాతప్రతుల ద్వారా లభించినవి. రాతప్రతుల ద్వారా లభించినవి అర్మాయిక్ భాషలో ఉన్నవి. ఈ భాషను అప్పటి యూదులు మాట్లాడేవారు. కాని ఇప్పుడు ఆ మూలప్రతులేవీ అందుబాటులో లేవు. కొత్త నిబంధనలో కూడా కొన్ని ప్రవక్త క్రీస్తు అనుచరులు చెప్పినవి, కొన్ని కొత్తవారు చెప్పినవి. అందువల్ల వీటి మధ్య వైరుధ్యాలున్నాయి. ప్రవక్త క్రీస్తు(అస)పై అవతరించిన అసలు గ్రంథం కానీ, బైబిలు ప్రవక్తలపై అవతరించిన దైవసందేశాలు కాని ఏవీ కూడా నేడు లభించడం లేదు. (అయితే రోమన్ కేథలిక్ బైబిల్‌కు, ఇతర ప్రతులకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది).

పాల్ ఈ అనువాదం చేసినప్పుడు, గ్రీకు భాషలో ఉన్న "దైవదాసుడు" అన్న పదాన్ని (ఈ పదాన్ని ప్రవక్త క్రీస్తు ఎక్కువగా ఉపయోగించారు) అనువదించేటపుడు ఈ పొరపాటు దొర్లింది. ఈ పదానికి గ్రీకు భాషలో "దేవుని దాసుడు" అన్న అర్థంతో పాటు "దేవుని కుమారుడు" అన్న అర్థం కూడా ఉంది. పాల్ ఇందులో రెండవ అర్థాన్ని స్వీకరించి అనువాదం చేశాడు. ఈ పొరపాటు తర్వాతి కాలాల్లో క్రయిస్తవ విశ్వాసాలను, దైవభావనను మార్చివేసింది.

> *టైమ్ పత్రిక 1988 ఆగస్టు 15 సంచికలో వచ్చిన వ్యాసం ఇక్కడ ప్రస్తావించదగినది. ఆ వ్యాసంలో ఈ పంక్తులు ఉన్నాయి. "క్రీస్తు, క్రయిస్తవ మతాల చరిత్రలను మనం పోల్చి చూసినట్లయితే మనకు ఇద్దరు క్రీస్తులు ఉన్నట్లు అనిపిస్తుంది. చారిత్రక క్రీస్తు, ఏకదైవారాధనను బోధించిన ప్రవక్త ఒకరు కాగా పాల్ తదితరులు సృష్టించిన పౌరాణిక క్రీస్తు మరొకరు. ప్రవక్త క్రీస్తు బోధనలను మార్చి, మార్పులు చేర్పులకు గురిచేసి ఈ కొత్త క్రీస్తును సృష్టించడం జరిగిందని ఎన్. ఓస్లింగ్ అధ్యయనం ధృవీకరిస్తోంది."*



> *ఈ ఆరోపణ కేవలం ఒక్క పాల్ మీద మాత్రమే కాదు, పీటర్‌పై కూడా ఈ ఆరోపణ ఉంది. ఆయన దృక్పథం... ఆయన ఆకలితో ఉన్నప్పుడు ఏర్పరచుకున్న దృక్పథం ప్రారంభ కాలాల్లోని క్రయిస్తవుల ఆహార నియమాలను మార్చివేసింది. పాత దైవగ్రంథాల్లో నిషిద్ధమైన ఆహారాన్ని నేడు క్రయిస్తవులు అనుమతించబడిన ఆహారంగా మార్చుకోవడానికి కారణమయ్యింది. (చూడండి : యాక్ట్స్ 10:9-16, 11:5-10). ఈ మార్పులు ప్రవక్త క్రీస్తు జీవన విధానానికి విరుద్ధమైనవి.*
>
> *బైబిల్ ఇలాంటి ఆహారాన్ని నిషేధిస్తుందని, దివ్యఖుర్‌ఆన్ 5వ సూరా 4వ ఆయతులో సూచించిన విధంగా జుబహ్ చేయబడిన ఆహారాన్నే బైబిల్ కూడా బోధిస్తుందని తెలిస్తే ఆలోచించే క్రయిస్తవులు ఆశ్చర్యపోక తప్పదు. చూడండి లెవిటాకస్ : 11:7, 17:14, డైటరానమీ :12:2, 14:18, యాక్ట్స్ : 15:29)*
>
> *పీటర్ వ్యాఖ్యలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. మాథ్యూస్ అధ్యాయం 16, వాక్యం 18లో ఆయన తనను క్రీస్తు చాలా ప్రశంసించినట్లు , దేవుని దీవెన పొందిన వానిగా పొగిడినట్లు, క్రీస్తు కట్టబోయే చర్చికి పునాదిరాయి వంటి వానిగా అభివర్ణించినట్లు చెబుతాడు. కాని అయిదు వాక్యాల తర్వాత క్రీస్తు అతడిని తీవ్రంగా ఖండిస్తూ, సాతానుగా, తనను దారితప్పించిన వానిగా వ్యాఖ్యానిస్తాడు.)*

దివ్యఖుర్‌ఆన్‌లోని 9:30-31 ఆయతులో దేవుడు ఈ విషయాన్ని స్పష్టంగా విశదీకరించాడు:

> "ఉజైర్ అల్లాహ్ కుమారుడు" అని యూదులు అంటారు. "మసీహ్ అల్లాహ్ కుమారుడు" అని క్రైస్తవులు అంటారు. వారికి పూర్వం అవిశ్వాసంలో పడివున్న వారి మాటలను అనుకరిస్తూ వారు తమ నోటితో అనే ఈ మాటలు నిరాధారమైనవి. దేవుని దెబ్బ వారిపై పడుగాక! వారెలా మోస పోతున్నారు! వారు అల్లాహ్‌ను కాదని తమ పండితులను, తమ సన్యాసులను తమ ప్రభువులుగా చేసుకున్నారు. వాస్తవానికి, ఒకే దేవుని దాస్యం తప్ప మరెవరి దాస్యాన్నీ చేసే ఆజ్ఞ వారికి ఇవ్వబడలేదు. ఆయన

https://teluguislam.net



తప్ప ఆరాధనకు అర్హుడైన వాడెవడూ లేడు. ఆయన పరిశుద్ధుడు. వారు పలుకుతున్న బహుదైవత్వ మాటలకు అతీతుడు."

(ఖుర్‌ఆన్ 9 : 30 - 31)

## పునరుజ్జీవం

క్రయిస్తవ విశ్వాసం ప్రకారం, ప్రవక్త క్రీస్తును ఉంచిన రాతి సమాధి తర్వాత ఖాళీగా కనబడింది. ఆయన మరణించి మళ్ళీ సజీవుడయ్యారు. ఆ పిదప స్వర్గానికి అధిరోహించారు. (గత అధ్యాయంలో దీని గురించి దివ్యఖుర్‌ఆన్ ఏమంటుందో తెలుసుకున్నాము)

## అసలు పాపం

"అసలు పాపం" అన్న సిద్ధాంతం ప్రకారం, యావత్తు మానవాళి పాపం కారణంగా జన్మించింది. ఆదిపురుషుడు ఆదమ్, ఆయన సంతానం శాశ్వత పాపానికి గురయ్యారు. ఎందుకంటే, ఆదమ్, ఆయన భార్య హవ్వాలు నిషిద్ధ ఫలాన్ని తిన్నారు కాబట్టి. ఈ పాపం నుంచి విముక్తి పొందాలంటే మనిషి ఒక మతపెద్ద ద్వారా బాప్తిజం పొందక తప్పదు. లేకపోతే మనిషి నరకంలో శిక్ష అనుభవించవలసి ఉంటుంది. కొన్ని చర్చిల ప్రకారం, మనిషి తన పాపాలను మత పెద్ద ముందు అంగీకరించడం కూడా తప్పనిసరి.

ఈ విషయంలో మనం ఇస్లామీయ విశ్వాసాన్ని పరిశీలిస్తే, మనిషి ఎలాంటి పాపం లేకుండా పాపరహితుడిగా జన్మిస్తాడు. మనిషి ఆచరించిన చెడు కర్మల వల్ల మాత్రమే మనిషి పాపాత్ముడవుతాడు. కేవలం దేవుడు మాత్రమే మనిషిని క్షమించగలడు. మనిషి ప్రత్యక్షంగా దేవుణ్ణి మొరపెట్టుకోగలడు. క్షమాభిక్ష అర్థించగలడు. పశ్చాత్తాపపడడం, మంచి పనులు చేయడం వల్ల మనిషి క్షమాభిక్ష పొందగలడు. దేవుడు అపార కృపాశీలుడు, పరమ దయామయుడు. ముస్లిముకు మతపెద్దల ద్వారా బాప్తిజము పొందవలసిన అవసరం లేదు. మతపెద్దల ముందు అంగీకరించవలసిన అవసరమూ లేదు. ముస్లిమ్ ఎవరైనా తన పశ్చాత్తాపం తానే స్వయంగా దేవునికి ప్రకటించవచ్చు.



**క్రయిస్తవ విశ్వాసం కొన్ని ప్రశ్నలకు జన్మనిస్తోంది. అవి ఏమంటే:**

- తల్లిదండ్రులు చేసిన పాపానికి పిల్లలకు శిక్ష విధిస్తారా?
- తన సృష్టి అయిన మానవుడు చేసిన ఒక చిన్న పొరపాటును ఏమాత్రం క్షమించలేని వాడా దేవుడు?
- ఎందుకు అనేక సంవత్సరాల తర్వాత దేవునికి తన స్వంత కుమారుడు ఉండాలన్న ఆలోచన వచ్చింది? అనేక సంవత్సరాల తర్వాత కాని మానవాళి పాపాల ప్రక్షాళనకు కావలసిన రక్తం పారించడానికి తన స్వంత కుమారుణ్ణి అత్యంత అమానుషంగా హత్యకు గురయ్యే పరిస్థితి కల్పించవలసి వచ్చిందా?
- ప్రవక్త క్రీస్తు మన పాపాల కోసం మరణించి ఉన్నట్లయితే, ఆయన ద్వారానే సాఫల్యం సాధ్యమయ్యేదయితే, ఆయనకన్నా ముందు పుట్టి గతించిన మానవాళి సాఫల్యం ఎలా సాధ్యం? అంటే ఆయనకు ముందు పుట్టిన ప్రజలు, ఆయనకన్నా ముందు వచ్చిన ప్రవక్తలు అందరికీ శాశ్వత పాపం నుంచి విముక్తి లేదా?

## జుల్‌ఖర్‌నైన్
(మహా సాహసవంతుడు)



"నా ప్రభువు వాగ్దాన సమయం వచ్చినపుడు ఆయన దీనిని (ఈ గోడను) నేలమట్టం చేసేస్తాడు" అని జుల్‌ఖర్‌నైన్ చెప్పాడు.
**(దివ్యఖుర్‌ఆన్ 18 : 98)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

జుల్‌ఖర్‌నైన్ వద్ద అతిపెద్ద సైన్యం, ఒక మహాసామ్రాజ్యం ఉండేవి. అల్లాహ్ అతడికి భూమిపై అధికారం ప్రసాదించాడు. అతడికి కావలసిన సమస్తమూ ఇచ్చాడు. ఆ మహాసైన్యం అతడి ఆజ్ఞను జవదాటేది కాదు. అతడికి లొంగని దేశం లేదు. అతడికి అనువుకాని ప్రదేశం అంటూ ఏదీ లేదు. ఎలాంటి సాహసమైనా అతడికి సాధ్యం కానిది కాదు. అతడు పాల్గొన్న ప్రతి యుద్ధం లోనూ విజేతగా నిలిచాడు.

అప్పటి ప్రపంచంలో నలు మూలలా అతడు పర్యటించాడు. తూర్పు నుంచి పడమరకు ప్రతీ చోటికి వెళ్ళాడు, ఒక ప్రదేశంలో ఒక పెద్ద సరస్సు వద్ద నీరు బురదతో కలసి బుడగలుగా వస్తుండడాన్ని చూశాడు. ఈ ప్రదేశం ప్రపంచానికి చివరిదా లేక ఈ ప్రదేశం తర్వాత కూడా ప్రపంచం ఉందా అని ఆలోచించ సాగాడు. ఆ ప్రదేశంలో కొందరు మనుష్యులు కనబడ్డారు. వాళ్ళు దైవం గురించి తెలియని అవిశ్వాసులు. పరమ దుర్మార్గులు. ప్రజలను దోచుకోవడం, హత్యలు చేయడం వృత్తిగా బ్రతుకుతున్నవాళ్ళు. జుల్‌ఖర్‌నైన్ దేవుణ్ణి ప్రార్థించి మార్గ దర్శకత్వం కోసం మొరపెట్టుకున్నాడు. అల్లాహ్ అతడికి రెండు మార్గాలలో ఒకదాన్ని ఎంచుకోమన్నాడు. "జుల్‌ఖర్‌నైన్ వారిని శిక్షించు లేదా



వారిపై దయచూపు". జుల్ ఖర్‌నైన్ తన సైనికులతో, "మనం ఇక్కడ దుర్మార్గులను శిక్షిద్దాం. వాళ్ళు ప్రభువు వద్దకు వెళ్ళిన తర్వాత మళ్ళీ తగిన శిక్ష పొందుతారు. అయితే మనం మంచివారిని దయతో చూద్దాం" అన్నాడు. జుల్‌ఖర్‌నైన్ ఆ ప్రజలను సంస్కరిస్తూ అక్కడ కొంతకాలం గడిపాడు. అక్కడ న్యాయాన్ని స్థాపించిన తర్వాత, మంచివారిని అక్కడ పాలకులుగా నియమించిన తర్వాత వారి నుంచి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

### యాజూజ్ , మాజూజ్

జుల్‌ఖర్‌నైన్, మహాసాహసి అయిన పాలకుడు. తూర్పు దిశగా ప్రయాణం చేశాడు. అవిశ్వాసులను సంస్కరిస్తూ, వారితో యుద్ధాలు చేస్తూ తన సైన్యంతో యాత్ర కొనసాగించాడు. ఆయన ప్రతి యుద్ధంలోనూ విజేతగా నిలిచాడు. అలా ప్రయాణిస్తూ అతను ఒక ప్రదేశానికి వచ్చాడు. ఆ ప్రదేశం నాగరికతకు ఆఖరుగా భావించాడు. అక్కడ ప్రజలకు నివాస గృహాలు లేవు. ఎలాంటి ఆశ్రయం లేదు. కనీసం చెట్టు నీడ కూడా వారికి లేదు. వారంతా పరమ అజ్ఞానంలో బ్రతుకుతున్నారు. ఆయన వారి మధ్య కొంతకాలం నివసించాడు. వారికి సంస్కారాన్ని నేర్పాడు. నాగరికతను నేర్పాడు. వారికి అల్లాహ్ గురించి బోధించాడు. వారి కోసం ఒక మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత అతను పశ్చిమ దిశగా ప్రయాణం ప్రారంభించాడు.

ఆ విధంగా జుల్‌ఖర్‌నైన్ ఒక దేశానికి చేరుకున్నాడు. ఆ దేశం రెండు కొండల నడుమ ఉంది. చాలా అభివృద్ధి చెందిన దేశం అది. అక్కడి ప్రజలు జుల్‌ఖర్‌నైన్‌తో తమకు, తమ పొరుగు దేశానికి మధ్య ఒక గోడ కట్టాలని అభ్యర్థించారు. పొరుగు దేశం ప్రజలు తమపై దాడి చేసి తమ సంపద దోచుకుని హత్యాకాండకు పాల్పడుతున్నారని అన్నారు. పొరుగున ఉంటున్నది యాజూజ్, మాజూజ్ తెగలు. అడ్డుగోడ కట్టినందుకు ప్రతిగా సుంకం చెల్లిస్తామని కూడా వారన్నారు. కాని జుల్‌ఖర్‌నైన్ వారికి జవాబిస్తూ, "నాకు అల్లాహ్ చాలినంత ధనం ప్రసాదించాడు. కనుక మీ శ్రమ తప్ప మరేమీ నాకు అవసరంలేదు. మీకు - దురాక్రమణదారులకు మధ్య పటిష్టమైన అడ్డుగోడ నేను నిర్మిస్తాను" అన్నాడు. వారు సంతోషంగా ఒప్పుకున్నారు.

ఇనుమును భారీగా ఉపయోగించి జుల్‌ఖర్‌నైన్ రెండు కొండల మధ్య ప్రదేశాన్ని పూరించాడు. ఒక భారీ గోడను నిర్మించి ఆ గోడపై కరిగిన లోహాన్ని

https://teluguislam.net

https://teluguislam.net



పోతపోసాడు. దురాక్రమణదారులు ఆ లోహపు నునుపైన గోడపైకి ఎక్కడం కాని, గోడను పగులకొట్టి చొరబడడం కాని సాధ్యపడని విధంగా తయారుచేశాడు. ఆ దేశ ప్రజలు సంతోషించారు. గోడ నిర్మాణం పూర్తయిన తర్వాత జుల్‌ఖర్‌నైన్ అల్లాహ్‌కు కృతజ్ఞతగా నమాజు చేశాడు. "నా దేవుని కారుణ్యం తప్ప ఇది మరేమీ కాదు. నా దేవుని వాగ్దాన సమయం వచ్చినపుడు ఆయన దానిని దుమ్ములో కలిపేస్తాడు. నా ప్రభువు వాగ్దానం సత్యమైనది" అన్నాడు. (దివ్యఖుర్‌ఆన్ 18:83-98, ఇంతకు ముందు చెప్పబడిన కథ కూడా ఈ రిఫరెన్సులో ఉంది)



# కొండ గుహ వారు

(క్రీ.పూ.65 డెసియస్ పాలనా కాలం)



"వారు గుహలో 309 సంవత్సరాలు (నిదురపోతూ) ఉన్నారు." (ఖుర్‌ఆన్ 18 : 25)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఇఫిసస్ నగరంలో పండుగ రోజు అది. ఆ రోజున ప్రజలు తమ విగ్రహాలకు పూజలు చేసి వాటికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తారు. కాని ఈ కార్యక్రమంలో పాల్గొనకుండా ఒక యువకుడు దూరంగా ఉండిపోయాడు. ఎందుకంటే, అతని మనసులో ఈ కార్యక్రమం పట్ల అనేక అనుమానాలు ఉన్నాయి. అతను ఒక చెట్టు నీడన కూర్చుని నగరంలో జరుగుతున్న కార్యక్రమం గురించి ఆలోచించసాగాడు. కొంతసేపటి తర్వాత అతని మిత్రుడొకరు వచ్చి కలిశాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి మరొకరు. అలా మొత్తం ఏడుగురు మిత్రులు అక్కడ కలిశారు. వారందరి ఆలోచనా విధానం ఒక్కటే. విగ్రహారాధన పట్ల, విగ్రహారాధకుల పట్ల వారి మనస్సులో అనేక అనుమానాలున్నాయి. అల్లాహ్ వారికి సత్యాన్ని గ్రహించే వివేకం ప్రసాదించాడు. వారు తాము నమ్మిన ధార్మిక విశ్వాసాన్ని తమ హృదయాల్లోనే దాచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఎందుకంటే రాజు కూడా విగ్రహారాధకుడే కాబట్టి తమ విశ్వాసం గురించి చెబితే రాజు వేధింపులకు గురిచేస్తాడని భయపడ్డారు.

## రహస్య సమాలోచన

వారంతా మళ్ళీ ఒక రాత్రి సమావేశమయ్యారు. అందులో ఒకరు గుసగుసగా మిగిలినవారితో మాట్లాడుతూ,

https://teluguislam.net



"రాజుగారికి మన గురించి తెలిసిపోయిందట, మనం మతం మార్చు కున్నామని తెలిసి రాజు కోపంతో మండిపడుతున్నాడట, కనుక మనం విగ్రహారాధనలో పాల్గొనకపోతే శిక్షిస్తానని బెదిరించినట్లు కూడా తెలిసింది. రేపు మనల్ని తన దర్బారుకు పిలిపిస్తాడు. దర్బారులో మనపై విచారణ జరిపిస్తాడు. ఇప్పుడు మనమేం చేయాలో ఆలోచించండి" అన్నాడు. మరొక యువకుడు జవాబిస్తూ, "నాకు కూడా ఈ విషయం తెలిసింది. కాని ఇదంతా ఒక పుకారు మాత్రమే అనుకుంటున్నాను. ఏదిఏమైనా మనం మన విశ్వాసం విషయంలో దృఢంగా ఉండాలి. మళ్ళీ విగ్రహారాధనకు మరలిపోవడం మన వల్ల కానిపని. ఈ సృష్టి మొత్తానికి మహా సృష్టికర్త ఒకడున్నాడని చెప్పడానికి చాలా నిదర్శనాలున్నాయి" అన్నాడు.

## రాజుగారి దర్బారులో

మరుసటి రోజు ఆ ఏడుగురిని రాజుగారు దర్బారుకు పిలిచాడు. వారిని ప్రశ్నించడానికే రాజు పిలుస్తున్నాడని, రాజుకు కొత్త మతం అంటే గిట్టదని వారికి బాగా తెలుసు. అయినా వారు భయపడలేదు. తమ ప్రభువు భూమ్యాకాశాలకు ప్రభువని, ఆ సృష్టికర్తను తప్ప మరెవ్వరినీ దేవునిగా అంగీకరించలేమని నిర్భయంగా చెప్పారు. అల్లాహ్‌ను తిరస్కరిస్తే మహాపాపం చేసినట్లు అవుతుందని కూడా వివరించారు.

ఈ మాటలు విని రాజుగారికి చాలా కోపం వచ్చింది. వారికో మరణశిక్ష విధిస్తానన్నాడు. కాని వారు కులీన కుటుంబాలకు చెందినవారయినందువల్ల వారికి ఒక రోజు గడువు ఇచ్చాడు. ఈలోగా తమ కొత్త మతాన్ని వదులుకోనట్లయితే వారికి చావు తప్పదని హెచ్చరించాడు. వారు అల్లాహ్ పట్ల విశ్వాసంతో మరింత బలాన్ని పొంది ఇలా జవాబిచ్చారు. "రాజా! ఈ మతాన్ని మేము ఎవరి ప్రోద్బలం వల్లనూ స్వీకరించలేదు. అజ్ఞానం వల్లనూ స్వీకరించలేదు. ఎవరి బలవంతం వల్లనూ ఈ మతాన్ని స్వీకరించలేదు. మా హృదయాలలో ఉన్న సహజ సిద్ధమైన భావనల ప్రేరణ వల్ల మాకు లభించిన వరం ఇది. అల్లాహ్ మా హృదయాలను ప్రకాశవంతం చేశాడు. ఆయన ఒక్కడే దేవుడు. ఆయనే మాకు ప్రభువు. ఆయనే భూమ్యాకాశాలకు ప్రభువు. మేము ఆయన్ను తప్ప మరెవ్వరినీ దేవునిగా ఆరాధించలేము. రాజా.. మా పట్ల నీవు ఎలా వ్యవహరించాలనుకున్నా.. నీ యిష్టం.. ఇప్పుడే నీ యిష్టమొచ్చినట్లు చేయడం మంచిది" అన్నారు. రాజు



జవాబిస్తూ, "నేను నా నిర్ణయాన్ని ప్రకటించేశాను. కాబట్టి మీకు ఒక రోజు ఆలోచించుకునే గడువు ఉంది. రేపు నేను నా తుది తీర్పు వినిపిస్తాను" అన్నాడు.

## తప్పించుకోవడం

రాజదర్బారు నుంచి వచ్చిన తర్వాత వాళ్ళు తమ పథకాన్ని ఆచరణలో పెట్టడానికి పూనుకున్నారు. వారిలో ఒకడు మిగిలినవారితో, "మనం మన విశ్వాసం పట్ల ఎంత దృఢంగా ఉన్నామో రాజుకు తెలుసు కాబట్టి తప్పక మన మీద చర్య తీసుకుంటాడు. ఒకవేళ రాజు చర్య తీసుకోకపోతే ప్రజలు రాజును బలహీనుడిగా భావించి పరిహాసిస్తారు. కాబట్టి మనం ఇక్కడ ఉండడం క్షేమం కాదు, పట్టణాన్ని వదలి కొండ గుహల్లో ఎక్కడైనా తలదాచుకుందాం. అక్కడ మనం స్వేచ్ఛగా మన విశ్వాసం ప్రకారం జీవించవచ్చు. ఎవరి జోక్యం ఉండదు" అన్నాడు.

తమకు లభించిన ఆహార పదార్థాలు తీసుకుని ఆ ఏడుగురు యువకులు కొండలకు వెళ్ళిపోయారు. అక్కడ వారందరికీ సరిపోయే వైశాల్యం ఉన్న ఒక గుహ కనబడింది. ఆ గుహలో వాళ్ళు దాక్కున్నారు. వారిని అనుసరిస్తూ ఒక కుక్క కూడా అక్కడి వరకు వచ్చింది. ఆ కుక్క గుహ ముఖద్వారం వద్ద కూర్చుంది. వాళ్ళు తమ వద్ద ఉన్న ఆహార పదార్థాలు తిని, సమీపంలోని వాగు నీరు త్రాగి విశ్రాంతి తీసుకున్నారు. కొద్దిసేపటికే వాళ్ళంతా గాఢనిద్రలో మునిగిపోయారు.

ఆ ఏడుగురు పట్టణం వదలి వెళ్ళిన విషయాన్ని అందరూ చెప్పుకోసాగారు. వాళ్ళు ఎక్కడికి వెళ్ళారో ఎవరికీ తెలియలేదు. వారి తల్లిదండ్రులు వారిని వెదకడానికి చాలా మందిని పంపించారు. రాజు కూడా దేశం యావత్తు వారి కోసం వెదికించాడు. కాని వారి జాడ దొరకలేదు. వారు ఈ విధంగా మాయం అయిపోయిన సంఘటన తర్వాత చాలా కాలం వరకు జనం కథలుగా చెప్పుకున్నారు. అనేక తరాల వరకు ఈ కథ వ్యాపించింది.

## దీర్ఘనిద్ర

రోజులు, నెలలు గడచాయి. తర్వాత సంవత్సరాలు గడచిపోయాయి. వాళ్ళు అలాగే గాఢనిద్రలో ఉండిపోయారు. సూర్యకిరణాలు ఆ గుహలోనికి రాలేదు. కటిక చీకటిలో ఉండడం వల్ల వారి గురించి బాటసారులకు కూడ తెలుసుకునే అవకాశం చిక్కలేదు. వారి చుట్టూ ఉన్న దుర్మార్గపు ప్రపంచం నుంచి

అల్లాహ్ వారికి ఆశ్రయం కల్పించాడు. ఆ విధంగా వారు 309 సంవత్సరాల కాలం నిద్రలో గడిపారు. (దివ్యఖుర్‌ఆన్ ప్రకారం మూడు వందలకు పైబడి తొమ్మిది సంవత్సరాలు. దీన్ని బట్టి 300 సంవత్సరాలు సూర్యమాన సంవత్సరాలని, పైన ఉన్న తొమ్మిది సంవత్సరాలు చంద్రమాన సంవత్సరాల లెక్కలోనివని గ్రహించ వచ్చు.)

ఆ తర్వాత అల్లాహ్ వారిని మళ్ళీ నిద్ర నుంచి లేపాడు. నిద్ర నుంచి మేల్కొన్న తర్వాత ఆ ఏడుగురు తాము చాలాసేపు నిద్రపోయామని అను కున్నారు. అందులో ఒకడు జవాబిస్తూ బహుశా ఒక రోజంతా నిద్రపోయి ఉంటామన్నాడు. మరొకడు జవాబిస్తూ, సూర్యాస్తమయం ఇంకా కాలేదు కాబట్టి రోజులో కొంత భాగం మాత్రమే నిద్రపోయి ఉంటామన్నాడు. ఇంకొకడు మాట్లా డుతూ, "ఈ ఊహలు కట్టిపెట్టండి. నిజం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ముందు నాకు ఆకలి చాలా వేస్తోంది. మనలో ఎవరినైనా పట్టణానికి పంపించి ఆహారం తెప్పిద్దాం. మన జేబుల్లో ఎవరి వద్ద ఎంత సొమ్ము ఉందో పోగు చేయండి. పట్టణా నికి వెళ్ళేవారె వరయినా చాలా జాగ్రత్తగా ఉండాలి. మన ఆచూకి ఎవరికీ తెలియ కూడదు" అన్నాడు. వాళ్ళంతా తమ వద్ద ఉన్న సొమ్మును ఒకరికి ఇచ్చారు. అతడిని పట్టణానికి పంపించారు.

ఆ యువకుడు పట్టణం దగ్గరకు చేరుకుంటున్నప్పుడు, అక్కడి పరిస రాలు చూసి చాలా ఆశ్చర్యపోయాడు. అంతా కొత్తగా ఉంది. అతను ఏదీ గుర్తు పట్టలేక పోయాడు. భవనాలు, ప్రజల వస్త్రధారణ, వ్యవహారశైలి అన్నీ మారి పోయాయి. అతను ఒక పలహారశాల చూసి అందులోకి ప్రవేశించాడు. ఆ దుకాణందారుడు యువకుడి ముఖంలోని తేజస్సుకు ఆశ్చర్యపోయాడు. యువకుడు రొట్టెలు కావాలని అడిగాడు. కాని ఆ యువకుడు ఇచ్చిన నాణేలు చూసి దుకాణందారుడు ఆశ్చర్యపోయాడు. ఆ విచిత్రమైన నాణేలు ఎక్కడి నుంచి తీసుకువచ్చావని ప్రశ్నించాడు. అలాంటి నాణేలు ఇక్కడ వాడకంలో లేవని అన్నాడు. వారిద్దరి మధ్య వాగ్వివాదం ప్రారంభమయ్యింది. త్వరలోనే జనం గుమి గూడారు. ఆ యువకుడు ఆ ప్రాచీన నాణేలను ఎక్కడి నుంచి సంపాదించాడో తెలుసుకోవాలని ప్రతి ఒక్కరూ భావించారు. ఆ యువకుడు ఆ డబ్బు తన స్వంతమని వాదించాడు. రాజభటులు అక్కడికి వచ్చారు. ఆ యువకుడిని న్యాయస్థానానికి తీసుకుపోవడం జరిగింది. అక్కడ ఆ యువకుణ్ణి ప్రశ్నించడం

https://teluguislam.net



జరిగింది. అతను తన గురించి చెప్పాడు. గుహలో ఉన్న తన ఆరుగురు మిత్రుల గురించి కూడా చెప్పాడు. అప్పుడు ప్రజలకు ఆ యువకుడెవరో తెలిసింది. మూడు వందల తొమ్మిది సంవత్సరాల క్రితం పట్టణం నుంచి మాయమైన ఏడుగురు యువకుల్లో ఒకడిగా అతడిని గుర్తించారు. దుర్మార్గపు రాజు మరణించి అనేక వందల సంవత్సరాలయ్యిందని తెలిసి ఆ యువకుడు కూడా ఆశ్చర్య పోయాడు.

## కొత్త రాజ్యం

ఈ సంఘటన గురించిన వార్త రాజుగారికి తెలిసింది. ఆయన ఒక సందేశ హరుడిని పంపి ఆ యువకుడిని పిలుచుకురమ్మన్నాడు. యువకుడు చెప్పిన విచిత్రమైన కథ విన్న తర్వాత రాజు ఆ యువకునితో కలసి కొండ గుహ వద్దకు వెళ్ళాడు. యువకుడు తన మిత్రులను గుహ బయటకు రమ్మని పిలిచాడు. ఇప్పుడు భయపడవలసిన పనిలేదని చెప్పాడు. వారు బయటకు వచ్చారు. ఆ యువకుల ముఖాలపై తేజస్సు చూసి రాజు మ్రాన్పడిపోయాడు. వారిని చాలా అభిమానంగా ఆలింగనం చేసుకున్నాడు. మిగిలిన యువకులు తమ మిత్రుడి ద్వారా జరిగిన కథ తెలుసుకున్నారు.

రాజు వారిని తన భవనానికి రమ్మన్నాడు. కాని వారు ఆ ఆహ్వానాన్ని మర్యాదగా కాదంటూ, తమ బంధువులు, మిత్రులు అందరూ మరణించి నందు వల్ల ఇక జీవితంలో తమకు కావలిసింది ఏమీ మిగల్లేదని అన్నారు. వారు చేతులెత్తి అల్లాహ్‌ను ప్రార్థిస్తూ తమను కారుణ్యంతో కాపాడమని కోరుకున్నారు. ఆ వెంటనే వారి ఆత్మలు వారి శరీరాలను వదలి వెళ్ళిపోయాయి. అయినా ఆ యువకుల ముఖాలు తేజస్సుతో ప్రకాశిస్తూనే ఉన్నాయి. వారి అంత్యక్రియలకు వేలాది ప్రజలు హాజరయ్యారు. కొండ గుహను వారి సమాధిని రాజు అందంగా కట్టించాడు. *(చదవండి దివ్యఖుర్‌ఆన్ : 18:9-26)*

సమాధులను అందంగా కట్టించడం అన్నది ముహమ్మద్ ప్రవక్త(స) ప్రవచనం ప్రకారం నిషిద్ధం. ప్రవక్త ముహమ్మద్ (స), ఆయన సహచరులు, షహీదులు (అమరవీరులు) ఎవరి సమాధులు కూడా ఈ విధంగా కట్టించబడలేదు.

https://teluguislam.net



అయిదవ విభాగం

# తున్‌నువాస్

ఈ కథలు ప్రవక్త ముహమ్మద్ (స) పుట్టుకకు ముందు కాలానికి సంబంధించినవి



**తున్‌నువాస్ యూదు మతం స్వీకరించని వారిని అగ్నిగుండంలోకి విసరి వేసి శిక్షించాడు.**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

హిమ్యరైట్ వంశానికి చెందిన తున్‌నువాస్ రాజు యమన్ దేశాన్ని పాలించేవాడు. తనకు ముందు పాలించిన పాలకుల దుర్మార్గపు పాలనా విధానాన్ని, భోగవిలాస జీవనాన్ని ఆయన ఏవగించుకునేవాడు. దైవారాధన పట్ల అనురక్తుడైన, ధర్మపరాయణుడైన రాజు ఆయన.

ఎస్రిబ్‌లో (ఈ నగరానికి తర్వాత 'మదీనా' అన్న పేరు పడింది) కొన్ని యూద తెగలు నివసిస్తుండేవి. రాజు అక్కడికి వెళ్ళినప్పుడు ఆ యూదులతో ధార్మిక చర్చలు జరిపేవాడు. చర్చల్లో వారి వాదన ఆయనకు నచ్చింది. ఆయన యూదునిగా మారాడు. తన రాజ్యానికి తిరిగి వచ్చిన తర్వాత తన ప్రజలందరినీ యూద మతం స్వీకరించాలని ప్రకటించాడు. యూద మతం స్వీకరించని వారిని శిక్షించాడు. భయం వల్ల చాలా మంది యూద మతం స్వీకరించారు.

యమన్‌కు పొరుగున ఉన్న నజ్రాన్ ప్రదేశంలో క్రయిస్తవులు అల్ప సంఖ్యాకులు. క్రయిస్తవులు రాజుగారి యూద మతాన్ని స్వీకరించడానికి ఇష్టపడలేదు. వారందరినీ అగ్నిగుండం లోకి విసిరేసి శిక్షించాడు. ప్రజలను ఫలానా మతం స్వీకరించాలని అతి క్రూరంగా బలవంతంచేసే పద్ధతిని పాటించాడు.



రాజు తన స్వంత అనుభవాల నుంచి కూడా గుణపాఠాన్ని స్వీకరించలేదు. ధార్మిక చర్చల ద్వారా ఆయన యూద మతం మంచిదని గ్రహించాడే కాని బలవంతం వల్ల కాదు కదా? ఇతరులను వారి మతాన్ని వదలి ఫలానా మతం స్వీకరించాలని బలవంతం పెట్టడం వల్ల వారి హృదయాలను గెలుచు కోవడం సాధ్యపడదు. తర్వాత రాజు తన దుర్మార్గానికి తగిన ఫలితం అనుభవించాడు. తన రాజ్యాన్ని కోల్పోయాడు. (తర్వాతి అధ్యాయంలో ఈ కథను మరింత వివరంగా చదువుకోగలరు).

https://teluguislam.net



# అగ్ని అఖాతాల ప్రజలు

**నిజమైన క్రైస్తవులను సజీవ దహనం చేసిన సంఘటన (క్రీ.శ. 6వ శతాబ్దం)**



**"విశ్వాసులైన పురుషులను, స్త్రీలను వేధింపులకు గురిచేసిన దుర్మార్గులు పశ్చాత్తాపపడకపోతే వారిని నరకాగ్నిలో కాల్చబడం జరుగుతుంది"**
*(ఖుర్ఆన్ : 85 : 10)*

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఎడారిలో వేడిగాడ్పు బలంగా కొడుతోంది. ప్రజలు ఎలాంటి పని చేయడానికి సాధ్యపడని వేడి వాతావరణం అది. నజ్రాన్ నుంచి ఒక వ్యక్తి 'సన్ఆ' నగరానికి వచ్చాడు. 'సన్ఆ' నగరం యమన్‌కు రాజధాని. ఆ వ్యక్తి తిన్నగా రాజు గారి దర్బారుకు వెళ్ళాడు. ఆ సమయంలో ఒక సందర్శకుడు రావడాన్ని చూసి అక్కడి రక్షకభటులు ఆశ్చర్యపోయారు. వేడికి ముఖం మాడి పోతున్న సమయంలో వచ్చిన ఆ వ్యక్తిని ఆశ్చర్యంగా చూశారు. ఈ ఎండలో పడి ఎందుకు వచ్చావని అతన్ని ప్రశ్నించారు. "రాజు తున్‌నువాస్‌కు ఒక ముఖ్యమైన విషయం చెప్పడానికి వచ్చాను" అన్నాడు ఆ వ్యక్తి. భటులు ఆ వ్యక్తితో రాజుగారు విశ్రాంతి తీసుకుంటున్నారని, కాస్త చల్లబడిన తర్వాత ఆయన ఉద్యానవనానికి వస్తారని, అక్కడ ఆయన సందర్శకులను కలుసుకుంటారని చెప్పారు. ఆ వ్యక్తి రాజుగారు వచ్చేవరకు వేచిఉంటానని అక్కడే నీడలో కూలబడ్డాడు.

రాజుగారు ఉద్యానవనానికి వెళుతున్నప్పుడు ఆ వ్యక్తిని రాజు ముందు ప్రవేశపెట్టడం జరిగింది. లాంఛనంగా రాజుగారికి చేయవలసిన నమస్కారాలు, వందనాలు అన్నీ అయిన తర్వాత ఆ వ్యక్తి తన సందేశాన్ని ఇలా వినిపించాడు. "క్రీస్తు తీసుకువచ్చిన కొత్త మతం



నజ్రాన్‌లో వ్యాపిస్తోంది. చాలా మంది ప్రజలు ఆ మతాన్ని ఇప్పటికే స్వీకరించారు. యూదుల్లో కూడా కొందరు ఆ మతాన్ని అవలంబించారు. కొత్తగా మతం స్వీకరించినవాళ్ళు రోజూ మతబోధ చేస్తున్నారు. ప్రజల్ని పాతమతం వదలాలని చెబుతున్నారు. రాజుగారు తక్షణం చర్య తీసుకోనట్లయితే ప్రజలందరూ క్రీస్తు మతానికి మారిపోతారు" అన్నాడు.

ప్రజలు కొత్త మతం పట్ల ఎందుకు ఆకర్షితులవుతున్నారని రాజుగారు ఆ వ్యక్తిని ప్రశ్నించాడు. ఆ వ్యక్తి జవాబుగా క్రింది కథ చెప్పాడు:

"నజ్రాన్‌కు తీసుకువచ్చిన బానిసల్లో ఖాయ్‌మియున్ అనబడే గ్రీకు, సాలెహ్ అనబడే అరబ్బు ఉన్నారు. ఖాయ్‌మియున్ ఒక విగ్రహారాధకుని వద్ద బానిసగా పెరిగాడు. ఆ విగ్రహారాధకుడు ఇతడిని ధర్మపరాయణునిగా భావించేవాడు. ఇతడు పగలంతా కష్టపడి పని చేసేవాడు, రాత్రి దైవారాధనలో గడిపేవాడు. ఒక రోజు సాయంత్రం యజమాని తన బానిస గదిలోకి వెళ్ళాడు. ఆ గదిలో ఎలాంటి దీపం లేకపోయినా గదంతా వెలుతురు పరచుకుని ఉంది. యజమాని ఇది చూసి ఆ బానిసను నీ మతం ఏది అని ప్రశ్నించాడు. ఆ బానిస జవాబిస్తూ, తాను అల్లాహ్‌ను ఆరాధిస్తానని చెప్పాడు. అల్లాహ్ సర్వసృష్టికర్త అని, ప్రభువులకు ప్రభువని చెప్పాడు. ప్రవక్త క్రీస్తు బోధనల వల్ల ఆ బానిస అల్లాహ్ గురించి తెలుసుకున్నాడు. ఆ బానిస తన యజమానితో దేవుడిని మాత్రమే ఆరాధించాలని, విగ్రహాలను, చెట్లను పుట్లను పూజించడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదని చెప్పాడు. వాటికి ఎలాంటి శక్తిసామర్థ్యాలు లేవని, సర్వశక్తిమంతుడు అయిన అల్లాహ్ పంపే తుఫానులు సమస్తాన్ని తుడిచేస్తాయని అన్నాడు. యజమాని మాట్లాడుతూ, అల్లాహ్ నిజంగా అలా చేస్తే తాను తన మతం మార్చుకుంటానని అన్నాడు. ఖాయ్‌మియున్ అల్లాహ్‌ను ప్రార్థించాడు. ఒక తీవ్రమైన గాలివాన ప్రారంభమయ్యింది. కొద్దిసేపటికే భయంకరమైన తుఫానుగా మారింది. ఆ అజ్ఞాన ప్రజలు ఆరాధిస్తున్న తాటిచెట్లను కూకటివ్రేళ్ళతో ఆ తుఫాను కూల్చివేసింది. ఇది చూసిన యజమాని తక్షణం ఖాయ్‌మియున్ చెప్పిన ప్రకారం, కొత్త ధర్మాన్ని స్వీకరించాడు. ఈ సంఘటన చాలా దూరప్రాంతాలకు వ్యాపించింది. ప్రజలు తండోప తండాలుగా కొత్త ధర్మంలోకి మారడం ప్రారంభమయ్యింది."

తున్‌నువాస్ ఈ కథను జాగ్రత్తగా విన్నాడు. తర్వాత ఆ వ్యక్తిని ప్రశ్నిస్తూ ఖాయ్‌మియున్ గత చరిత్ర గురించి నీకేమన్నా తెలుసా అని ప్రశ్నించాడు. ఆ

వ్యక్తి జవాబిస్తూ ఖాయ్‌మియున్ మిత్రుడు అరబ్బు సాలెహ్ అనీ, సిరియాలో ఈ ఇద్దరూ కలిశారని, ఖాయ్‌మియున్ పట్ల సాలెహ్‌కు అభిమానం ఏర్పడిందని, ఖాయ్‌మియున్ మంచివాడు, తెలివిగలవాడని, అందువల్ల సాలెహ్ అతడిని వెన్నంటి ఉండాలని నిర్ణయించుకున్నాడని, ఒకరోజు వారిద్దరూ ఎడారిలో ప్రార్థన చేస్తుండగా ఒక క్రూరమృగం వారి వైపు దూసుకువచ్చిందని, సాలెహ్ బిగ్గరగా ఖాయ్‌మియున్‌ను పిలుస్తూ తప్పుకోమన్నాడని, కాని ప్రార్థనలో మునిగి ఉన్న ఖాయ్‌మియున్ ఏమాత్రం తొణకలేదని, అతడి మీదకు లంఘించిన క్రూరమృగం తక్షణం ప్రాణాలు వదిలిందని, ఇలాంటి కథలను సాలెహ్ అనేకం చెపుతున్నాడని, ఈ ఇద్దరినీ అరబ్బులు పట్టుకుని బానిసలుగా అమ్మేశారని తెలియజేశాడు.

ఈ కథ యావత్తు విన్న రాజు ఆగ్రహంతో మండిపడ్డాడు. నజ్రాన్‌లో మరో మతం ఎలా ఉంటుంది? ఇక్కడి ప్రజలు తౌరాత్ చట్టాలు తప్ప మరో చట్టాలను ఎలా అవలంబిస్తారని చిందులు వేశాడు.

నజ్రాన్ ప్రజలు తౌరాత్ మతాన్ని మళ్ళీ అవలంబించకపోతే వారికి గుణపాఠం నేర్పుతానని ప్రతిజ్ఞ చేశాడు. ఆ వెంటనే తున్‌నువాస్ ఒక పెద్ద సైన్యాన్ని తీసుకుని నజ్రాన్‌కు బయలుదేరాడు. అక్కడికి వెళ్ళగానే క్రయిస్తవ నాయకులను పిలిచి వారికి హెచ్చరికలు జారీచేశాడు. "మీరు తుబు మతాన్ని మళ్ళీ స్వీకరించండి లేదా నా శిక్ష రుచిచూడండని" హూంకరించాడు. కాని క్రయిస్తవ నాయకులు తొణకలేదు. మేము ఈ కొత్త మతాన్ని మా హృదయాల్లో ప్రతిష్ఠించుకున్నాము. మా విశ్వాసం చాలా దృఢంగా ఉంది. మేము ఈ విశ్వాసాన్ని వదులుకోలేము. బలప్రయోగం వల్ల మా విశ్వాసాన్ని మార్చడం సాధ్యం కాదని నిబ్బరంగా జవాబిచ్చారు. ఈ జవాబు విని రాజు మరింత ఆగ్రహించాడు. సైనికులను పిలిచి లోతయిన కందకాలు తవ్వమన్నాడు. ఆ కందకాల్లో బొగ్గు, కలప నింపాలని చెప్పాడు. ఆ తర్వాత ఆ కందకాలకు నిప్పు పెట్టాడు. మంటలు ఉవ్వెత్తున ఎగసాయి. ఆ మంటల పొగ సుదూరం వరకు కనబడసాగింది. క్రయిస్తవులందరినీ వరుసగా నిలబెట్టి చివరిసారిగా అడుగుతున్నాను, మీ మతాన్ని వదులుకుంటారా లేక మంటల్లో మాడి మసవుతారా చెప్పండన్నాడు. వారు మతం మార్చుకోవడానికి నిరాకరించారు. ఆ వెంటనే వారిని ఒకరి తర్వాత ఒకరుగా ఆ మంటల్లో విసరి వేయడం జరిగింది. రాజు ఎవరి మీద కూడా జాలి చూపలేదు. ముసలివారిని, చిన్నపిల్లలను కూడా వదలిపెట్టలేదు. నజ్రాన్‌లో ఒక్క విశ్వాసి కూడా ఉండకుండా



చేశాడు. కేవలం ఒకేఒక్క వ్యక్తి ఈ హత్యాకాండ నుంచి ప్రాణాలతో బయటపడగలిగాడు. ఈ సంఘటనను అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ప్రస్తావిస్తూ ఇలా హెచ్చరించాడు:

**"విశ్వాసులైన పురుషులను, స్త్రీలను వేధింపులకు గురిచేసిన ఈ దుర్మార్గులు పశ్చాత్తాపపడకపోతే వారిని నరకాగ్నిలో కాల్చడం జరుగుతుంది"**

***(దివ్యఖుర్ఆన్ : 85:4-10)***

*(ఇక్కడ క్రయిస్తవులను దివ్యఖుర్ఆన్ విశ్వాసులుగా పేర్కొంది. ప్రవక్త క్రీస్తు అసలు బోధనలను విశ్వసించిన వారినే ఈ విధంగా సంబోధించడం జరిగింది. అంతేకాని దైవకుమారుడన్న భావాన్ని నమ్మేవారిని కాదు.)*

## నజాషీ (క్రయిస్తవ రాజు)

నజ్రాన్‌లో ఒక వ్యక్తి ఈ అగ్నిగుండం శిక్ష నుంచి తప్పించుకుని పారిపోగలిగాడు. ఆ వ్యక్తి కాన్‌స్టాంటినోపుల్ సామ్రాజ్యానికి పారిపోయాడు. కాన్‌స్టాంటినోపుల్ చక్రవర్తి క్రయిస్తవ పరిరక్షకునిగా ఉండేవాడు. నజ్రాన్ నుంచి పారిపోయి వచ్చిన వ్యక్తి రోదిస్తూ జరిగిన వృత్తాంతం యావత్తు వివరించాడు. అల్లాహ్ ఆరాధకులను ఎంత క్రూరంగా మంటల్లో విసరేసి చంపింది తెలియజేశాడు. తున్‌నువాస్‌పై ఒక సైన్యాన్ని పంపి అతడి గర్వాన్ని, అణచివేతలను పరిసమాప్తి చేయాలని కోరాడు. చక్రవర్తి వెంటనే అబీసీనియా రాజు నజాషీకి ఒక లేఖ రాశాడు. అబీసీనియాను ఇప్పుడు ఇథియోపియా అంటున్నారు. నజాషీ క్రయిస్తవ రాజు. ఇథియోపియా రాజ్యం ఎమన్‌కు పొరుగున ఉంది. నజ్రాన్ నుంచి వచ్చిన వ్యక్తికి ఆ లేఖను ఇచ్చి వెంటనే వెళ్ళి నజాషీని కలువమన్నాడు చక్రవర్తి.

నజాషీ నిజమైన క్రయిస్తవుడు. తోటి క్రయిస్తవులు నజ్రాన్‌లో ఎదుర్కొన్న దారుణాల గురించి విన్న నజాషీ చాలా ఆవేదన చెందాడు. తక్షణం ఒక పెద్ద సైన్యాన్ని ఎమన్‌కు పంపించి తగిన ప్రతీకారం చేయాలని సంకల్పించాడు. భీకర యుద్ధం జరిగింది. తున్‌నువాస్ ఆ యుద్ధంలో దారుణ పరాభవానికి గురయ్యాడు. ఈ యుద్ధ ఫలితంగా ఎమన్ ఇథియోపియాకు వలస రాజ్యంగా మారింది.

https://teluguislam.net

https://teluguislam.net



# సబా రాజ్యం

ఎమన్‌లో ముఅన్నియా పరిపాలన అంతమయ్యింది. రాజ్యం సబా వారి హస్తగతమైంది. అయితే సబాలు కూడా పాత రాజుల సంప్రదాయాలు, భాష, విధానాలనే అవలంబించారు. అతి కొద్ది కాలంలోనే వారు అసాధారణ ప్రగతి సాధించారు. మారిబ్ పట్టణం రాజధానిగా వారి పరిపాలన కొనసాగింది.

ఎమన్ చాలా సారవంతమైన దేశం. విశాలమైన లోయలు, మైదానాలతో విరాజిల్లే దేశం. కాని నీటి సమస్య తీవ్రంగా ఉంది. వర్షాకాలంలో వానలు బాగా కురిసేవి. కాని వర్షపు నీరు ఎక్కడా నిలువ ఉండేది కాదు. మొత్తం నీరంతా ప్రవహించి పోయేది. ఎమన్ ప్రజలు కష్టజీవులు. ఒక గొప్ప నీటిపారుదల వ్యవస్థను నిర్మించుకున్నారు. అక్కడ సహజమైన నదులేవీ లేవు. అందువల్ల వర్షపు నీటిని ఆనకట్టల ద్వారా నిలువ చేసి కాలువల ద్వారా తమ అవసరాలకు తరలించేవారు. ఈ కాలువల ఆధారంగానే వ్యవసాయం జరిగేది. మారిబ్‌లో చాలా పెద్ద నీటి పారుదల వ్యవస్థ ఉండేది. ప్రాచీన కాలంలో ఇలాంటి నీటిపారుదల వ్యవస్థ, ఇలాంటి ఇంజనీరింగ్ నైపుణ్యం చాలా అరుదుగా కనబడుతుంది. కేవలం బాబిలోనియాలో మాత్రమే ఇలాంటి నీటిపారుదల వ్యవస్థ ఉండేది. మారిబ్ నుంచి



**"మేము సబా వారి ఆనకట్టను తెంచి వారిపైకి వరదను పంపాము."**

**(దివ్యఖుర్ఆన్ : 34 : 16)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం



ఎమన్‌లోని చాలా ప్రాంతాలకు నీరు సరఫరా అయ్యేది. ఈ నీటిపారుదల వ్యవస్థ వల్ల ఆ ఎడారి నేలలు చాలా వరకు సస్యశ్యామలం అయ్యాయి. మారిబ్ పట్టణం ఒక పెద్ద ఉద్యానవనంలా ఉండేది. ప్రజలు చాలా కష్టించి పని చేసేవారు. ఫలితంగా పంటలు పుష్కలంగా పండేవి. పశుసంపదతో, పాడిపంటలతో దేశం అలరారేది. కాని ప్రజలు ఈ సౌభాగ్యం యావత్తు అల్లాహ్ ప్రసాదించినదని మరచి పోతే సంపద, భోగభాగ్యాలు కూడా శాపాలుగా పరిణమిస్తాయి. భోగభాగ్యాల జీవితం వారిని ఏమరుపాటుకు గురిచేసింది. దేవుణ్ణి మరచిపోయేలా చేసింది. అనేక రకాల చెడులు వారిలో చోటుచేసుకున్నాయి. వారు స్వార్థపరులుగా, అహంకారులుగా తయారయ్యారు. చివరకు సోమరితనానికి గురయ్యారు. ఆనకట్టల నిర్వహణ విషయంలో అశ్రద్ధ చూపారు.

ఒక రాత్రి విపత్తు విరుచుకుపడింది. అతిపెద్ద ఆనకట్ట తెగింది. కట్ట తెంచుకున్న నీరు ఒకదాని తర్వాత ఒకటిగా అనేక ఆనకట్టలను ధ్వంసం చేసింది. ఆ మహావరదలో యావత్తు దేశం నాశనమయ్యింది. నీటిపారుదల వ్యవస్థ యావత్తు కుప్పకూలిపోయింది. ఒకప్పుడు ఉద్యానవనంగా అలరారిన దేశం ఒక శిథిల నగరంలా మారింది. అడవి చెట్లు, పిచ్చిమొక్కలు, చింతపండువంటి ఫలాలు తప్ప మరేమీ పండని నేలగా రూపాంతరం చెందింది. చివరకు ఒకప్పుడు ఉద్యానవనాల్లో కిలకిలరావాలతో అహ్లాదపరిచిన పక్షులు కూడా వలస పోయాయి. సబా ప్రజలు తమ ఇళ్ళూవాకిళ్ళు వదలి ఇతర ప్రాంతాలకు తరలి పోవలసి వచ్చింది. కొందరు సిరియా వెళ్ళిపోయారు. కొందరు మక్కాలోను, కొందరు ఎస్రిబ్‌లోను, ఇతర ప్రదేశాలలోను వెళ్ళి స్థిరపడ్డారు. ఆ విధంగా ఆ ప్రజలు చెల్లాచెదరయ్యారు.

**సబా ప్రజలకు ఎదురైన విపత్తు గురించి తర్వాతి తరాలు కథలు కథలుగా చెప్పుకొన్నాయి. అల్లాహ్ కారుణ్యం వల్ల అపరిమిత సౌభాగ్యాలు పొందిన వారు దేవుణ్ణి మరచిపోయి ఏ విధంగా నాశనమైంది అనేక తరాల వారికి గుణపాఠంగా మిగిలిపోయింది. *(దివ్యఖుర్ఆన్ : 34:15-20)***

# అబ్రహా
## (ఏనుగుల వాళ్ళ గాధ)



**నీ ప్రభువు ఏనుగుల వారిపట్ల వ్యవహరించిన తీరును నీవు చూడ లేదా?....... ఎట్టకేలకు, ఆయన వారిని తిని (తొక్కి వేసి)న తొక్కు మాదిరిగా చేసేశాడు.**

**(ఖుర్‌ఆన్ 105 : 1 - 5)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

అబీసీనియా పరిపాలనలో ఉన్న యమన్ వలస రాజ్యానికి సైన్యాధిపతి అబ్రహా. తన సైన్యంతో యమన్‌పై అధికారాన్ని కైవసం చేసుకున్నాడు. అబ్రహాతో యుద్ధం చేసే బదులు అతడినే ఎమన్‌కు గవర్నరుగా నియమించడం మంచిదని అబీసీనియా రాజు భావించాడు.

యమన్‌కు పొరుగున ఉంది మక్కా. యమన్ ప్రజలే కాదు, ఆ చుట్టు ప్రక్కల ప్రజలందరూ మక్కా పట్ల గౌరవాదరాలు, భక్తిప్రపత్తులు ప్రదర్శించడాన్ని అబ్రహా చూశాడు. మక్కా యాత్ర కోసం ప్రజలు దూరదూర ప్రాంతాల నుంచి రావడాన్ని చూశాడు. ప్రజలను క్రయిస్తవం పట్ల ఆకర్షితులయ్యేలా చేయడానికి, వారిని మక్కాకు దూరం అయ్యేలా చేయడానికి నిర్ణయించుకుని సన్‌ఆ నగరంలో ఒక్క అందమైన ఆరాధనాలయం నిర్మించాడు. సన్‌ఆ పట్టణం యమన్‌కు రాజధాని నగరం. మక్కాలోని కాబా గృహం చాలా సాధారణంగా ఉంటుంది. అబ్రహా రాజు సన్‌ఆలో నిర్మించిన ఆరాధనాలయం అట్టహాసంగా, అనేక అలంకరణలతో చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. కాని అంత గొప్ప కట్టడాన్ని నిర్మించినప్పటికీ అతను ఊహించినట్లు జరగలేదు. వివిధ ప్రదేశాల ప్రజలే కాదు, స్వయంగా తన



ప్రజలు కూడా మక్కా యాత్రకు వెళ్ళడం మానుకోలేదు. ప్రాచీన కాబాకు పోటీగా అబ్రహా కొత్త దైవగృహాన్ని నిర్మించాడని చెప్పుకుంటూ ప్రజలు అతడి ప్రయత్నాల పట్ల నవ్వుకునేవారు. అబ్రహా నిర్మించిన ఆరాధనాలయాన్ని కనాన్‌కు చెందిన ఒక వ్యక్తి దూషించడమే కాదు, ఆరాధనాలయానికి నష్టం కలిగించాడు. దీంతో అబ్రహాకు తీవ్రమైన కోపం వచ్చింది. కాబా గృహం పట్ల ప్రజలకున్న అభిమానం వల్లనే, కాబా గృహం పట్ల ప్రజలకున్న గౌరవప్రపత్తుల కారణంగానే తాను నిర్మించిన ఆరాధనాలయం పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని భావించాడు. కాబా పట్ల అతని కోపం, ద్వేషం ఎక్కువయ్యాయి. ఎలాగైనా కాబా గృహాన్ని నాశనం చేయాలని భావించాడు. కాబా గృహంపై దాడికి ఒక పెద్ద సైన్యాన్ని సమకూర్చుకున్నాడు.

## వ్యతిరేకత

అబ్రహా రాజు కాబా పట్ల విద్వేషం పెంచుకున్నప్పటికీ ఎమన్ ప్రజలు మాత్రం కాబా పట్ల గౌరవాదరాలు ప్రదర్శించారు. కాబాను కూలదోయాలన్న అబ్రహా ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించారు. తునాఫర్ అనే ఒక ధర్మపరాయణుడు ప్రజలను సమీకరించి అబ్రహా సైన్యంతో పోరాడాడు. కానీ బలమైన అబ్రహా సైన్యం ముందు వారు నిలువలేకపోయారు. ఇంకా కొన్ని తెగలు కూడా అబ్రహాను వ్యతిరేకించాయి. కాని వారెవ్వరూ అబ్రహాను నిలువరించలేకపోయారు. అందరినీ అబ్రహా ఓడించాడు. ఓడిపోయిన తెగలు భారీకప్పాలు చెల్లించి అబ్రహాకు లొంగిపోవలసి వచ్చింది. ఇలా ఓడిపోయిన తెగలకు చెందిన వారిలో కొందరిని అబ్రహా తన వెంట మక్కాకు రమ్మన్నాడు. మక్కాకు వెళ్ళే సురక్షిత మార్గం చూపాలని ఆదేశించాడు. అబూరిగాల్ అనే వ్యక్తి అబ్రహాకు ముగమ్మస్ ప్రాంతానికి దారి చూపాడు. ముగమ్మస్ ప్రదేశం తాయిఫ్, మక్కాలకు మధ్యన ఉంది. అబ్రహా సైన్యం అక్కడ బిడారు వేసింది (అబూరిగాల్ సమాధి ముగమ్మస్ వద్ద ఇప్పటికీ భద్రంగా ఉందంటారు).

అక్కడి నుంచి అబ్రహా బలమైన దళాన్ని పంపి తిహామా, ఖురైష్ తెగల పశువులను స్వాధీనపరచుకుని తీసుకురమ్మన్నాడు. అబ్రహా సైన్యం ఆహార అవసరాలకు ఆ పశువులు కావాలి. అలా దోచుకువచ్చిన పశువుల్లో మక్కాలోని ఖురైష్ నాయకుడు, హాషిమ్ కుమారుడు అబ్దుల్ ముత్తలిబ్‌కు చెందిన రెండు

https://teluguislam.net

https://teluguislam.net



వందల ఒంటెలు కూడా ఉన్నాయి. హజ్ యాత్రికులకు నీటి సరఫరా చేసే బాధ్యత కూడా ఆయన నిర్వహిస్తుంటారు (అబ్దుల్ ముత్తలిబ్ ప్రవక్త ముహమ్మద్ (స)కు తాతగారు).

మక్కా ప్రజలు అబ్రహాను పట్టణంలోకి రాకుండా అడ్డుకోవాలని సన్నాహాలు ప్రారంభించారు. ఒక సైన్యాన్ని సమకూర్చడం మొదలుపెట్టారు. కాని అబ్రహా సైన్యాన్ని చూసిన తర్వాత, అంత భారీ సైన్యాన్ని నిలువరించడం తమ వల్ల కాదని గ్రహించారు.

అబ్రహా వద్ద నుంచి ఒక సందేశహరుడు మక్కా నగరానికి వచ్చాడు. ఖురైష్ నాయకులతో కలసి మాట్లాడాలన్నాడు. అతడిని అబ్దుల్ ముత్తలిబ్ వద్దకు తీసుకువెళ్ళారు. ఆ సందేశహరుడు అబ్రహా సందేశాన్ని వినిపించాడు. అబ్రహా మక్కా నగర ప్రజలతో పోరాడాలని రాలేదు. వారికి ఎలాంటి హాని తలపెట్టడం అతడి ఉద్దేశ్యం కాదు. అబ్రహా కేవలం కాబా గృహాన్ని పడగొట్టడానికి మాత్రమే వచ్చాడు. కాబట్టి ఈ విషయం చర్చించడానికి అబ్దుల్ ముత్తలిబ్‌ను అబ్రహా ఆహ్వానించాడు.

## ఒంటెల సమస్య

అబ్దుల్ ముత్తలిబ్ తన కుటుంబ సభ్యులతో, తన సలహాదారులతో కలసి అబ్రహా వద్దకు వెళ్ళారు. అబ్దుల్ ముత్తలిబ్ గాంభీర్యం చూసి అబ్రహా అవాక్కయ్యాడు. ఆయన్ను చాలా మర్యాదగా ఆహ్వానించాడు. తన ప్రక్కన ఆయన్ను కూర్చుండబెట్టుకున్నాడు. ఆ విధంగా రాజు తన ప్రక్కన కూర్చుండబెట్టడం అత్యున్నత స్థాయి మర్యాదకు చిహ్నం. అబ్రహా ఆయనతో మీరేమన్నా విజ్ఞప్తి చేయాలనుకుంటున్నారా అని ప్రశ్నించాడు. అబ్దుల్ ముత్తలిబ్ జవాబిస్తూ, సైన్యం పట్టుకెళ్ళిన తన రెండు వందల ఒంటెలను తిరిగి ఇప్పించాలని అన్నాడు. ఈ విజ్ఞప్తి విని అబ్రహా కాస్త నిరాశ చెందాడు. అబ్దుల్ ముత్తలిబ్‌తో, "నేను మిమ్మల్ని మొదట చూసినపుడు మీ గాంభీర్యం చూసి అచ్చెరువొందాను. అందువల్లనే మీకు అత్యున్నత మర్యాద ఇచ్చాను. కాని ఇప్పుడు మీరు ఒక సాధారణ మనిషి మాదిరి చాలా చిల్లర స్థాయి విజ్ఞప్తి చేశారు. ఇక మీ మీద నాకు ఎలాంటి గౌరవం మిగల్లేదు. మీరు కాబా గృహాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తారని నేను భావించాను" అన్నాడు. అబ్దుల్ ముత్తలిబ్ వెంటనే జవాబిస్తూ, "నేను ఆ ఒంటెలకు యజమానిని, వాటిని మీ సైన్యం ఎత్తుకు వచ్చింది. ఇక కాబా విషయమంటారా.. కాబా గృహం యజమాని ఉన్నాడు. దాని రక్షణ ఆయనే చూసుకుంటాడు" అన్నారు. అబ్రహా ఈ మాటలు విని కోపంగా, "మా నుంచి మిమ్మల్ని ఎవరు కాపాడగలరు?" అన్నాడు. "అయితే, మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి" అన్నారు అబ్దుల్ ముత్తలిబ్. మహాగంభీరంగా కనబడే ఆ వృద్ధుని నిర్లక్ష్యధోరణి చూసి అబ్రహా మరేమీ మాట్లాడ లేకపోయాడు. తన సైన్యం పట్టుకువచ్చిన ఒంటెలను అప్పగించాడు.



అబ్దుల్ ముత్తలిబ్‌తో వచ్చిన ఇతర సభ్యులు అబ్రహాకు నచ్చజెప్పడానికి, కాబా గృహానికి నష్టం కలిగించకుండా చూడడానికి ప్రయత్నించారు. అందుకు బదులుగా తిహామా, ఖురైష్ తెగలు పండించే పంటలో మూడవ వంతు అబ్రహాకు చెల్లించడానికి కూడా సిద్ధపడ్డారు. కాని అబ్రహా ఒప్పుకోలేదు. అతడు సంపద కోసం రాలేదు. కాబాను ధ్వంసం చేయాలన్న ఉద్దేశ్యంతోనే వచ్చాడు. మక్కా ప్రతినిధులు బరువెక్కిన హృదయాలతో వెనుదిరిగారు. ఇప్పుడేం జరుగనుందో వారికి అర్థం కాలేదు.

## ఖాళీ అయిన మక్కా

అబ్దుల్ ముత్తలిబ్ మక్కా ప్రజలను నగరం వదలి కొండల్లో తలదాచుకోవలసిందిగా సలహా ఇచ్చారు. అబ్రహా సైన్యం వెళ్ళే వరకు తిరిగి నగరానికి రావద్దని అన్నారు. ఆ రాత్రి మక్కా ప్రజలు కాబా గృహానికి వీడ్కోలు ప్రదక్షిణ చేశారు. అబ్దుల్ ముత్తలిబ్, ఆయన సలహాదారులు కాబా గృహం ద్వారాన్ని ఆలింగనం చేసుకుని సుదీర్ఘకాలం దేవుణ్ణి ప్రార్థించారు. ఎలాగైనా కాబా గృహాన్ని కాపాడాలని మొరపెట్టుకున్నారు.

మరుసటి రోజు అబ్రహా తన ఏనుగునెక్కి కాబా గృహాన్ని ధ్వంసం చేయడానికి బయలుదేరాడు. ఆ సైన్యం కాబా సమీపిస్తున్నప్పుడు హఠాత్తుగా అబాబీల్ అని పిలువబడే పక్షులు గుంపులు గుంపులుగా వచ్చాయి. ఆ పక్షులు గులక రాళ్ళను కరచుకు వచ్చాయి. ఆ మహాసైన్యంపై ఆ పక్షులు రాళ్ళను వేయడం ప్రారంభించాయి. పక్షులు జారవిడిచిన ఆ రాళ్ళు శరవేగంగా సైనికుల శరీరాలను చీల్చుతూ నేలపై పడసాగాయి. చాలా మంది అప్పటికప్పుడే మరణించారు. అబ్రహా తీవ్రంగా గాయపడ్డాడు. తన సైన్యాన్ని తక్షణం ఉపసంహరించుకుని

ఎమన్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. ఎమన్ రాజధాని నగరం సన్ఆ చేరుకున్న తర్వాత కొన్ని రోజులకే అబ్రహా తీవ్రమైన బాధతో మరణించాడు. అప్పటి నుంచి అరబ్బులు తమ కేలండరును మార్చుకుని ఈ సంవత్సరం నుంచి కొత్త కేలండరును, "ఏనుగుల సంవత్సరం" నుంచి లెక్క మొదలయ్యే కేలండరును తయారు చేసుకున్నారు.

**ఈ అద్భుతమైన సంఘటన నిజానికి ప్రవక్త ముహమ్మద్ (స) రాకకు ముందు, ఆయన రాకను సూచిస్తూ జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (స) కూడా ఆ సంవత్సరమే జన్మించారు. ఆయన పెరిగిపెద్దయి కాబా గృహాన్ని విగ్రహారాధన నుంచి కాపాడారు. *(దివ్యఖుర్ఆన్ : 105 : 1-5)***

### గ్రహించవలసిన పాఠాలు

- మనం చరిత్ర నుంచి గుణపాఠాలు గ్రహించాలి.
- అబ్రహా వద్ద ఉన్న బలమైన సైన్యాన్ని ఎదిరించడం అబ్దుల్ ముత్తలిబ్ తెగవారి చిన్న సైన్యానికి సాధ్యం కాదు. అందువల్ల ఆయన వివేకాన్ని ప్రదర్శిస్తూ అబ్రహాను ఎదిరించకుండా ఊరుకున్నారు. తన ప్రజలను ఆ ప్రాంతం నుంచి దూరంగా పంపి వారిని కాపాడారు. అల్లాహ్ రక్షించేవాడని ఆయన బలంగా విశ్వసించేవారు.

https://teluguislam.net



ఆరవ విభాగం

# ఇస్లామీయ యుగం



**"ఆయనే తన ప్రవక్తకు సన్మార్గాన్ని, సత్యధర్మాన్ని ఇచ్చిపంపాడు – దాన్ని మత ధర్మాలన్నింటిపై ఆధిక్యం వహించేలా చేయటానికి! ఈ విషయం బహుదైవారాధకులకు ఇష్టంలేకపోయినా సరే."**
***(ఖుర్ఆన్ 61 : 9)***

ఈ విభాగంలో దివ్యఖుర్ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన కొన్ని ముఖ్యమైన సంఘటనలను తెలుసుకుందాం. ఇస్లామీయ యుగం ప్రారంభ కాలానికి సంబంధించిన సంఘటనలివి. ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత కాలానికి సంబంధించిన వివిధ సంఘటనల గురించి ఇక్కడ తెలుసుకుందాం. ఇందులో కొన్ని పోరాటాలు ఉన్నాయి. కొన్ని యుద్ధాలు ఉన్నాయి. ఇస్లామ్ శత్రువులు, కొందరు చరిత్రకారులు కూడా ఈ పోరాటాలు, యుద్ధాలను ప్రస్తావిస్తూ ఇస్లామ్ కత్తి వల్ల వ్యాపించిందని ఆరోపిస్తుంటారు. కాని ఈ ఆరోపణ అర్థంలేని, వాస్తవ విరుద్ధమైన ఆరోపణ మాత్రమే.

## అణచివేతలు

ప్రవక్త ముహమ్మద్ (స) మక్కా నగరంలో నివసించేవారు. పదమూడు సంవత్సరాల కాలం ఆయన మక్కా ప్రజలకు శాంతియుతంగా నచ్చజెబుతూ ఇస్లామ్ ప్రచారాన్ని నిర్వహించారు. దేవుడొక్కడేననీ, ఆయన్ను మాత్రమే ఆరాధించాలని చెప్పినందుకు ఆయన్ను, ఆయన అనుచరులను ఆయన స్వంత తెగకు చెందిన ఖురైష్ ప్రజలు తీవ్రమైన వేధింపులకు, చిత్రహింసలకు గురిచేశారు. ఆయన అనుచరులను కొందరిని చిత్రవధకు గురిచేసి చంపారు. ఈ వేధింపులు, చిత్రహింసలన్నీ ఆయన

మౌనంగా భరించారు. తనను హతమార్చాలని వారు కుట్రపన్నడం గురించి తెలిసిన తర్వాత మాత్రమే ఆయన యస్రిబ్ (మదీన) నగరానికి తరలివెళ్ళి పోయారు. ఆయన ఆస్తిపాస్తులను, ఆయన అనుచరుల ఆస్తిపాస్తులను మక్కాలోని ఖురైషులు స్వాధీనం చేసుకున్నారు.

మదీనాలో ఒక బలమైన ముస్లిం (ఏకదైవారాధకుల) రాజ్యాన్ని స్థాపించిన తర్వాత ఆయన అణచివేతదారులపై ఒక ఆర్థిక యుద్ధాన్ని ప్రారంభించారు. ఆ విధంగా మతస్వేచ్ఛ, వాక్స్వాతంత్ర్యం తదితర స్వేచ్ఛలను కాపాడడానికి ప్రయత్నించారు. మొదట ఆయన ఖురైషుల ఒక వ్యాపార బృందాన్ని అడ్డుకోవాలని చూశారు. కాని ఆ బృందం తప్పించుకుంది. మక్కా ఖురైషులు ఒక సైన్యాన్ని పంపి ప్రవక్త ముహమ్మద్ (స)ను, ఆయన అనుచరులను అందరినీ అంతం చేయాలని చూశారు. అప్పుడు అల్లాహ్ ఆయనకు పూర్తి స్థాయి యుద్ధం చేసే అనుమతి ఇచ్చాడు.

**ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యబడుతూ ఉందో, వారికి (యుద్ధం చేయటానికి) అనుమతి ఇవ్వబడింది; ఎందుకంటే వారు అన్యాయానికి గురి అయినవారు. నిశ్చయంగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు. వారు అన్యాయంగా తమ ఇళ్ల నుండి తరిమివేయబడినవారు. వారి తప్పు కేవలం, "అల్లాహ్ మా ప్రభువు" అని అనటమే. అల్లాహ్ గనక ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తొలగిస్తూ ఉండకపోతే, ఆశ్రమాలు, చర్చీలు, యూదుల ప్రార్థనా లయాలు, మస్జిదులు- వేటిలో అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరింపబడుతుందో- అన్నీ ధ్వంసం చేయబడి ఉండేవే. అల్లాహ్‌కు సహాయపడేందుకు సమాయత్తం అయిన వారికి అల్లాహ్ కూడా తప్పకుండా సహాయపడతాడు. నిశ్చయంగా అల్లాహ్ మహాబలుడు, సర్వాధిక్యుడు.** ***(దివ్యఖుర్‌ఆన్ : 22:39-40)***

కాని అణచివేతలకు పాల్పడడాన్ని, ఇతరుల హక్కులకు భంగం కలిగించడాన్ని అల్లాహ్ నిషేధించాడు. అలాగే ఇస్లామ్ ప్రచారంలో బలప్రయోగాన్ని కూడా అల్లాహ్ అనుమతించలేదు.

**"ధర్మం విషయంలో నిర్బంధంకానీ, బలాత్కారంకానీ లేవు. సత్యవాక్కు అసత్యవాక్కుల నుండి ప్రస్ఫుటం చెయ్యబడింది."** ***(దివ్య ఖుర్‌ఆన్ : 2:256)***

https://teluguislam.net



**"ఇది సత్యం, మీ ప్రభువు నుండి వచ్చింది. ఇష్టమైనవారు దానిని స్వీకరించనూవచ్చు. ఇష్టంకాని వారు దానిని తిరస్కరించనూ వచ్చు"**

***(దివ్యఖుర్‌ఆన్:18 - 29)***

## బిలాల్ (రజి)

మక్కా నగరం. ఖలఫ్ కుమారుడు ఉమయ్యా, ఇంట్లో కూర్చుని ఉన్నాడు. ఒక వ్యక్తి వచ్చి అతని ప్రక్కన కూర్చుని, "ఉమయ్యా! నీకీ విషయం తెలుసా... అబిసీనియాకు చెందిన నీ నీగ్రో బానిస బిలాల్, రాత్రులు ముహమ్మద్‌ను సందర్శించడానికి దొంగచాటుగా వెళుతున్నాడు. వాడు కొత్త మతం స్వీకరించాడనీ, ఇతరులను కూడా కొత్త మతం స్వీకరించేలా ప్రేరేపిస్తున్నాడని నాకు తెలిసింది" అన్నాడు. ఈ మాటలు వినగానే ఉమయ్యా ఉలిక్కిపడ్డాడు. "నువ్వు చెప్పేది నిజమేనా?" అన్నాడు నమ్మలేనట్లు. "నా దగ్గర సాక్ష్యాలున్నాయి. నీకు చెబితే నీ బానిసను అదుపులో ఉంచుకుంటావని వచ్చాను. ఇతర బానిసలు కూడా పెడదారి పట్టకుండా నీ బానిసను కట్టడి చేయ్. అసలే మనవాళ్ళలో ఉన్నత వంశాల వాళ్ళు కూడా కొత్త మతం స్వీకరిస్తున్నారు" అన్నాడు. ఉమయ్యాకు తీవ్రమైన కోపం వచ్చింది. బిలాల్ (రజి)కు మరచిపోలేని పాఠం నేర్పాలనుకున్నాడు.

## బిలాల్ (రజి) ఒప్పుకోలు

ఉమయ్యా వెంటనే బిలాల్(రజి)ను పిలిచి, "రాత్రులు దొంగచాటుగా ముహమ్మద్ (స)ని కలువడానికి వెళుతున్నావా లేదా? ముహమ్మద్ (స) మతాన్ని స్వీకరించావా లేదా? మన దేవుళ్ళు లాత్, ఉజ్జాలను నువ్వు తిరస్కరిస్తున్నావా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు. తన యజమాని చాలా కోపంగా ఉండడం చూసి బిలాల్ (రజి) మొదట కంగారుపడ్డారు. అయినా జవాబిస్తూ, "నేను ఇస్లాం స్వీకరించానన్న విషయాన్ని కాదనడం లేదు. నేను ముహమ్మద్ (స) సందేశాన్ని హృదయపూర్వకంగా విశ్వసిస్తున్నాను" అన్నారు. ఉమయ్యా కోపంతో ఊగిపోయాడు. "నువ్వు ఒక బానిసవు మాత్రమే. నిన్ను కొన్న రోజునే నేను నీ శరీరాన్ని, నీ మనస్సును, నీ ఆత్మను కూడా కొనేశాను. అంటే నువ్వు నీ యిష్టం వచ్చినట్లు ఆలోచించడానికి, చేయడానికి ఎలాంటి స్వేచ్ఛ లేదు. ఇక్కడ నువ్వు నా ఆదేశాలు వినడం మాత్రమే చేయాలి. నేను ఆరాధించే దేవుళ్ళను మాత్రమే నువ్వు కూడా ఆరాధించాలి" అని చిందులు వేశాడు. బిలాల్ (రజి) బెదరలేదు. "నా శరీరం

https://teluguislam.net



మాత్రమే మీకు బానిస. నా మనసు, నా ఆత్మ కాదు. నా విశ్వాసం హృదయం నుంచి జనించింది. నా హృదయంపై మీకు ఎలాంటి అధికారం లేదు" అన్నారు. ఉమయ్యా మండిపడ్డాడు. "నువ్వు ఒక బానిసవు మాత్రమే. నీ తల నుంచి నీ పాదాల వరకు అంతా ఒక బానిసవు మాత్రమే. నీ హృదయం, నీ ఆత్మ అన్నీ నేను కొనేశాను. నేను చెప్పిన మాట వినకుండా తలబిరుసుగా మాట్లాడినందుకు శిక్ష తప్పదు. నీ బుర్రలోంచి ఈ పిచ్చి పిచ్చి మతవిశ్వాసాలన్నీ వదిలే వరకు నిన్ను శిక్షిస్తాను" అన్నాడు.

## చిత్రహింసలు

ఉమయ్యా తన ఇతర బానిసలను పిలిచి బిలాల్ (రజి) కాళ్ళుచేతులు కట్టెయ్యమన్నాడు. బహిరంగ స్థలంలో తీసుకువెళ్ళి కొరడాతో కొట్టమన్నాడు. బిలాల్ (రజి) శరీరం రక్తసిక్తమయ్యేలా కొట్టిన తర్వాత వాళ్ళు ఆయన శరీరాన్ని ఈడ్చు కుంటూ బానిసల కొట్టంలో పారేశారు. యజమాని వద్దకు వెళ్ళి, "అయ్యా! మామూలు మనిషయితే మా దెబ్బలకు ఎప్పుడో లొంగిపోయేవాడు. కాని బిలాల్ (రజి) సాధారణమైన వ్యక్తి కాదు. కొరడా శరీరాన్ని తాకి మాంసఖండాలు ఎగసి పడినా ఆయన మాత్రం 'దేవుడొక్కడే' అన్న మాట తప్ప మరేమీ చెప్పలేదు. కనీసం బాధను కూడా వ్యక్తం చేయలేదు" అన్నారు. ఉమయ్యా ఏం చెప్పాలో తెలియక వారిని వెళ్ళిపొమ్మన్నాడు.

ఆ రోజు సాయంత్రం ఉమయ్యా బానిసల కొట్టంలోనికి వెళ్ళి చూశాడు. అక్కడ కనబడిన దృశ్యం మనిషన్న వాడినెవడినైనా కదిలించేస్తుంది. నెత్తురుతో కలిసిన శరీరం నేలపై పడి ఉంది. శరీరమంతా కొరడా దెబ్బల గుర్తులు. ఒళ్ళంతా దెబ్బలమయమే. కాని ఆ దృశ్యం ఉమయ్యాను ఏమాత్రం కదిలించలేదు. నిర్దయగా కాలితో తన్నాడు. ఆ శరీరం నుంచి ఎలాంటి బాధను వ్యక్తం చేసే శబ్దం వినబడలేదు. కాని రెండు కళ్ళు అతడిని సూటిగా చూశాయి. ఉమయ్యా వెటకారంగా మాట్లాడుతూ, "ఈ దెబ్బలతో నీకు బుద్ధి వచ్చి ఉంటుంది. నువ్వు చెప్పే ఒకే దేవుడికి ఏమయ్యింది? నిన్ను రక్షించలేదా?" అన్నాడు. బిలాల్ (రజి) తన యజమాని వైపు ఎలాంటి బెదురు లేకుండా తిన్నగా చూస్తూ, "నీ కొరడా దెబ్బలు నా శరీరాన్ని తునాతునకలు చేయవచ్చు గాక, కాని ఒకే ఒక్క దేవుడిపై నా విశ్వాసం చెక్కుచెదరదు" అన్నారు. ఆ వెంటనే ఆయన కళ్ళపై మగత కమ్ముకుంది. ఆయన దేవుడొక్కడే అంటూ పలవరిస్తూ స్పృహ కోల్పోయారు.



మరుసటి రోజు మధ్యాహ్నం, ఎండ తీవ్రంగా ఉంది. వేడి పొగలు సెగలు క్రక్కుతోంది. ఉమయ్యా తన బానిసలను పిలిచి బిలాల్ (రజి)ను బహిరంగ ప్రదేశానికి ఈడ్చుకురమ్మన్నాడు. బిలాల్ (రజి)ను తీసుకొచ్చి ఎండలో పారేశారు. ఒక పెద్ద బండరాతిని ఆయన రొమ్ముపై ఉంచారు. అలా ఆ ఎండలో రొమ్ముపై కాలే బండరాతిని ఉంచి గంటలకొద్దీ వదిలేశారు. ఆయన శరీరం క్రింద ఉన్న వేడి ఇసుక చర్మాన్ని మలమల మాడుస్తోంది. ఎడారి వేడిగాలికి ఇసుక ఆయన ముక్కు పుటాల్లోకి, కళ్ళలోకి వచ్చిపడుతోంది. తల ఎండ తీవ్రతకు పగిలిపోయేలా బాధిస్తోంది. ఒక విధమైన మగతలోకి ఆయన జారిపోయారు. అయినా ఆయన నోటి వెంట దేవుడొక్కడే అన్న మాటలు తప్ప మరో మాట వినబడలేదు.

ఈ విధంగా ఉమయ్యా అనేక రోజుల పాటు ఆయన్ను హింసించడం కొనసాగించాడు. కాని బిలాల్ (రజి)వైఖరిలో రవ్వంత మార్పు కూడా రాలేదు. ఆయన్ను ఎంతగా హింసిస్తే ఆయన అంతగా ఏకైక దేవుని పట్ల నిబద్ధతను ప్రదర్శించ సాగారు. ఎలాంటి బాధలు, హింసలు ఆయన్ను చలించేలా చేయలేక పోయాయి.

ఒక రోజు ప్రవక్త ప్రియసహచరుడు అబూబక్ర్ సిద్దీక్ (రజి) మక్కా శివార్లలో నడిచివెళుతున్నారు. ఆయన చెవులకు దేవుడొక్కడే అన్న పదాలు, అతి గంభీరమైన పదాలు వినిపించాయి. ఆ శబ్దం ఎక్కడి నుంచి వస్తుందా అని ఆసక్తిగా అటుగా వచ్చారు అబూబక్ర్ (రజి). అక్కడ ఉమయ్యా అత్యంత క్రూరంగా బిలాల్ (రజి)ను హింసిస్తున్న దృశ్యం కనబడింది. ఉమయ్యా ఆయనపై నిలబడి పైశాచికంగా నవ్వుతున్నాడు. ఇది చూసి అబూబక్ర్ (రజి), "ఆ మనిషి అలమటిస్తుంటే నీ హృదయంలో ఎలాంటి జాలి పుట్టడం లేదా? ఇలాంటి అమానుష హింసలకు గురిచేస్తున్నావు. ఇతను చేసిన నేరం ఏమిటి?" అనడిగారు. ఉమయ్యా గర్వంగా, "వీడు నా బానిస.. నా యిష్టం వచ్చినట్లు చేసు కుంటాను. నన్ను తప్పు పట్టవద్దు. దీనికంతటికీ కారణం నువ్వూ, నీ సహచరులే. నీకంత జాలిగా ఉంటే వీడిని కొనుక్కుని ఈ బాధల నుంచి విముక్తి కలిగించ వచ్చు కదా? ఆ రకంగా అయినా నేను వీడిని వదిలించు కుంటాను" అన్నాడు.

ఆ వెంటనే అబూబక్ర్ (రజి) తన సొమ్ముతో బిలాల్(రజి)ను కొని ఉమయ్యా హింసల నుంచి విముక్తి లభించేలా చేశారు. ఆ తర్వాత అబూబక్ర్

(రజి) బిలాల్ (రజి)తో, "అల్లాహ్ ప్రసన్నత కోసం నేను నీకు స్వేచ్ఛ ప్రసాదిస్తున్నాను. కాని ముందు నాతో రా.. నీ గాయాలకు చికిత్స చేయడం అవసరం" అన్నారు. తనతో పాటు బిలాల్(రజి)ను ఇంటికి తీసుకెళ్ళి ఆయన గాయాలకు చికిత్స చేయించారు.

క్రూరుడైన ఉమయ్యాకు, జాలిగుండె కలిగిన అబూబక్ర్(రజి)కు మధ్య ఉన్న విభేదాన్ని దివ్యఖుర్‌ఆన్ ఈ క్రింది విధంగా ప్రస్తావించింది:

**"నేను మిమ్మల్ని ప్రజ్వలించే అగ్ని గురించి హెచ్చరించాను. (సత్యాన్ని) తిరస్కరించి, ముఖం తిప్పుకున్న పరమ దౌర్భాగ్యుడు తప్ప మరెవ్వరూ అందులో కాలిపోరు. పరిశుద్ధుడు కావటానికి తన సంపదను ఖర్చుచేసే పరమ దైవభీతిపరుడు దానికి దూరంగా ఉంచబడతాడు. అతనికి ఎవ్వరూ ఏ విధమైన ఉపకారం చేయలేదు దానికి అతను బదులు తీర్చేందుకు. అతను కేవలం మహోన్నతుడైన తన ప్రభువు ప్రసన్నతను పొందటానికి మాత్రమే ఈ పని చేస్తున్నాడు."** ***(దివ్యఖుర్‌ఆన్ : 92 :14-20)***

## సందేశ ప్రచారం

యస్రిబ్‌లో అరబ్బు తెగలు ఔస్, ఖజ్‌రజ్ నివసిస్తున్నాయి. యస్రిబ్ నగరమే తర్వాత మదీనా నగరంగా పేరుపొందింది. ఈ రెండు తెగలు నిజానికి ఒకే మూల వంశానికి చెందినవి. కాని వారి మధ్య తరచుగా వివాదాలు చెలరేగుతుండేవి. అనేక సందర్భాల్లో యుద్ధాలు జరిగాయి. 'బుఆస్' యుద్ధం చాలా భయంకరంగా జరిగింది. ఈ యుద్ధంలో ఇరు తెగలకు చెందిన అనేక మంది ప్రముఖ నాయకులు మరణించారు. ఇరు తెగలు భారీగా నష్టపోయాయి. ఈ యుద్ధం తర్వాత కొంతకాలం యుద్ధ విరమణ వంటిది అమలయ్యింది. ఈ యుద్ధవిరమణ కాలంలో ఖజరజ్ తెగ యూదులకు దగ్గరయ్యింది. రెండు తెగలు కొత్త నేతలను ఎన్నుకున్నాయి. కొత్త నేతల ఎన్నిక తర్వాత ఔస్ తెగ ఒక బృందాన్ని మక్కాకు పంపించి అక్కడి ఖురైషులతో మైత్రి ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించింది.

ప్రవక్త ముహమ్మద్ (స)కు వారి రాక గురించి తెలిసింది. ఆయన వెళ్ళి వారిని కలుసుకున్నారు. వారిని మృదుమధురంగా పలకరించారు. "మీరు దేని

https://teluguislam.net



కోసం వచ్చారో అంతకన్నా ఉన్నతమైన విషయం మీకు చెప్పనా" అనడిగారు. వారు ఆసక్తిగా అదేమిటో చెప్పండన్నారు. ప్రవక్త ముహమ్మద్ (స) వారికి ఇస్లామ్ గురించి తెలియజేశారు. దివ్యఖుర్‌ఆన్‌లోంచి కొన్ని ఆయతులను వారికి చదివి వినిపించారు. ఆ వచ్చిన బృందంలో ఇయాస్ అనే ఒక యువకుడు ఉన్నాడు. ఈ వాక్యాలను వినగానే అతను లేచి, "ప్రజలారా! ఈయన చెప్పింది సత్యం. మనం దేనికోసం వచ్చామో అంతకన్నా ఈయన చెప్పింది ఎంతో ఉన్నతమైంది" అన్నాడు. కాని ఆ బృందం నాయకుడు మాత్రం తీవ్రంగా ప్రతిస్పందించాడు. నాయకుడు అబ్దుల్ హైసర్ గుప్పెడు ఇసుక తీసి ఆ యువకుడి మీదకు విసరి, "నీకు ఇదే ఉత్తమమైంది" అన్నాడు. "మేము దీని కోసం రాలేదు. మేం వేరే పని మీద వచ్చాం" అని తిరస్కరించాడు. ఆ యువకుడు మౌనంగా ఊరుకున్నాడు. ప్రవక్త (స) అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

## హృదయపూర్వక స్వీకారం

ఆ సంవత్సరం మక్కాయాత్ర సందర్భంగా ఖజ్‌రజ్ తెగవారు కొందరు హజ్ యాత్రకు వచ్చారు. (మక్కా యాత్ర అన్నది అరబ్బులు వేలాది సంవత్సరాలుగా ఆచరిస్తున్న సంప్రదాయం). వారి రాక గురించి తెలుసుకున్న ప్రవక్త వారిని కలుసుకున్నారు. వారికి తానెవరో తెలియజేశారు. వారు ఆయన మాటలు ఆసక్తిగా విన్నారు. ఆయన దివ్యఖుర్‌ఆన్‌లోని కొన్ని ఆయతులను వారికి వినిపించారు. ఆ తర్వాత వారు తమలో తాము సంప్రదించుకున్నారు. "యూదులకు తెలుపబడిన ప్రవక్త ఈయనే. మనం వారికన్నా ముందుగా ఈయనకు విధేయత చూపుదాం" అని నిర్ణయించుకున్నారు.

ఆ తర్వాత కొన్ని ప్రశ్నలు అడగడం, ప్రవక్త (స) వారి ప్రశ్నలకు జవాబులు ఇవ్వడం జరిగింది. వాళ్ళు ఆయన్ను ప్రవక్తగా విశ్వసించడమే కాదు, ఇస్లామ్ నియమాలను తూ.చా. తప్పకుండా పాటిస్తామని వాగ్దానం చేశారు. ఆ తర్వాత వారు ప్రవక్త(స)తో మాట్లాడుతూ, "మా నగరంలో మా మనుషులు ఇంకా చాలా మంది ఉన్నారు. వైరం, చెడుల వల్ల ముక్కలు ముక్కలైన మాలాంటి ప్రజలు ఎవ్వరూ ఉండరు. మీ ద్వారా అల్లాహ్ మమ్మల్ని ఏకం చేయుగాక. మేము ఏ విధంగా మీ మతాన్ని స్వీకరించామో అదే విధంగా మీ మతాన్ని స్వీకరించాలని మేము వారిని కూడా ఆహ్వానిస్తాము. మీవంటి మంచి మనిషిని, వివేకవంతుణ్ణి మేము ఇంతకు ముందు కలువలేదు" అన్నారు.

https://teluguislam.net



ఖజ్‌రజ్ బృందం యస్రిబ్ తిరిగి వెళ్ళి తమ మాట వినేవారందరికీ ఈ సందేశాన్ని చేరవేసింది. ఖజ్‌రజ్ తెగవారు ఇస్లామ్ పట్ల అనురక్తులయ్యారు. ఆ విధంగా ఇస్లామ్ వేగంగా విస్తరించింది. ఈ వార్త తెలిసి ప్రవక్త ముహమ్మద్ (స) చాలా సంతోషించారు.

## తలబిరుసు తిరస్కారం

కాని, మక్కాలో ఖురైషులు మాత్రం ప్రవక్త (స) సందేశప్రచారాన్ని ఏమాత్రం సహించలేదు. ఆయన సందేశాన్ని అడ్డుకోవడమే కాదు, ఇస్లామ్ స్వీకరించిన వారిని తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసేవారు. ప్రవక్త (స) ఇతర తెగల వారికి ఇస్లామ్ సందేశాన్ని వినిపించారు. సకీఫ్, తాయిఫ్, కిందా, బనీ ఆమిర్, బనీ హనీఫా తెగలు కూడా ఖురైషుల మాదిరిగానే తిరస్కారానికి ఒడిగట్టాయి. ప్రవక్త కాస్త నిరుత్సాహ పడినప్పటికీ నిరాశపడలేదు. ఆయన మళ్ళీ మక్కాలో జరిగే హజ్ యాత్ర కాలం కోసం ఎదురు చూడసాగారు. హజ్ సందర్భంగా యస్రిబ్ నుంచి వచ్చే వారి కోసం ఎదురుచూడసాగారు.

## విశ్వాస ప్రకటన

మళ్ళీ ఆయన యస్రిబ్ నుంచి వచ్చిన యాత్రికులనే కలుసుకున్నారు. వారంతా ముస్లిములే. వారు మొత్తం పన్నెండు మంది. ఇందులో ఇద్దరు ఔస్ తెగవారు. పది మంది ఖజ్‌రజ్ తెగకు చెందినవారు. వారు ఇస్లామ్ పట్ల తమ విశ్వాసాన్ని ప్రకటించారు. ప్రవక్త ముహమ్మద్ (స)పట్ల విధేయత ప్రకటించారు. “ఒకేఒక్క దేవుడు అల్లాహ్‌కు భాగస్వాములను నిలబెట్టము” అని, దొంగతనం చేయము, వ్యభిచారానికి పాల్పడము, ఆడశిశువులను హతమార్చము అని, ఈ ప్రతిజ్ఞను ఎన్నడూ భంగపరచము అని వారు ప్రతిన చేశారు. అంతేకాదు, మక్కా ప్రజలకు ఈ ప్రతిజ్ఞ గురించి తెలియజేయకుండా, రహస్యంగా ఉంచుతామని కూడా వారు వాగ్దానం చేశారు.

ప్రవక్త (స) వారితో పాటు అబ్దుద్దార్ కుమారుడు ముసఅబ్‌ను పంపించారు. ముసఅబ్ వారికి ఇస్లామ్ నియమాలను నేర్పారు. ఆ మరుసటి సంవత్సరం యస్రిబ్ నుంచి డెబ్బయి మంది స్త్రీపురుషుల బృందం ప్రవక్త(స)ను కలుసుకోవడానికి వచ్చింది. వారి రాక గురించి తెలిసిన ప్రవక్త (స) వారిని అకబా అనే ప్రదేశం వద్ద రహస్యంగా కలుసుకున్నారు. ప్రవక్త(స)తో పాటు ఆయన



చిన్నాన్న అబ్బాస్ కూడా వారిని కలుసుకోవడానికి వచ్చారు. అబ్బాస్ అప్పటికి ముస్లిమ్ కాదు. కాని ప్రవక్త(స)కు ఏదైనా హాని జరగవచ్చన్న భయంతో ఆయన ప్రవక్త (స) వెంట వచ్చారు. ఆయనకు తన అన్న కుమారుని క్షేమం పట్ల ఆదుర్దా ఉండేది. అక్కడ ఖజ్‌రజ్ బృందంతో మొదట మాట్లాడింది కూడా ఆయనే. “ఖజ్‌రజ్ ప్రజలారా! ప్రవక్త ముహమ్మద్ (స)ను ఆయన బంధువులు అమితంగా గౌరవిస్తారని మీకు తెలుసు. ఆయన బోధిస్తున్న మతాన్ని తిరస్కరిస్తున్న వారి నుంచి ఆయన్ను మేము కాపాడుకుంటున్నాము. ఆ విధంగా ఆయన ఇక్కడ క్షేమంగా ఉండేలా చూసుకుంటున్నాము. కాని ఆయన మీతో పాటు, మీ మధ్య నివసించాలన్న కోరిక వెలిబుచ్చారు. మీరు మీ మాట నిలబెట్టుకునే సామర్థ్యం కలిగి ఉన్నట్లయితే, శత్రువుల నుంచి ఆయన్ను కాపాడే శక్తి కలిగి ఉన్నట్లయితే ఆయన మీ వెంట వెళ్ళవచ్చు. కాని మీరు ఆయన్ను కాపాడడంలో విఫలం అవుతామని భయపడుతున్నట్లయితే ఆయన్ను ఇక్కడే విడిచిపెట్టండి. ఇక్కడ ఆయనకు రక్షణ ఉంది” అన్నారు. ఈ మాటలు విన్న తర్వాత యస్రిబ్ బృందం నాయకుడు జవాబిస్తూ, “మీరు చెప్పిన మాటలు మేము విన్నాము. ఇప్పుడు ప్రవక్త(స)ను మాట్లాడనివ్వండి. తన తరపు నుంచి, తన ప్రభువు తరపు నుంచి ఆయన ఎలాంటి షరతులు విధిస్తారో చెప్ప నివ్వండి” అన్నాడు. ప్రవక్త (స) దైవ స్తోత్రం చేసి దివ్యఖుర్‌ఆన్ నుంచి కొన్ని వాక్యాలు పఠించి ఇలా అన్నారు: “మీరు మీ స్త్రీలను, మీ పిల్లలను ఏ విధంగా కాపాడు తారో అదే విధంగా నన్ను కాపాడితే నేను మీ వెంట ఉంటాను” అన్నారు. ఆ వెంటనే మారుహ్ కుమారుడు బర్రా లేచి ప్రవక్త (స) చేయి పుచ్చుకుని, “మిమ్మల్ని సత్యంతో పంపించిన ప్రభువు సాక్షి, మేము మా కుటుంబాలను ఏ విధంగా కాపాడుకుంటామో అదే విధంగా మిమ్మల్ని కాపాడుకుంటాము. కాబట్టి మా ఒప్పందాన్ని అంగీకరించండి. ఓ ప్రవక్తా(స)! మేము యుద్ధతెగకు చెందిన వాళ్ళం. తండ్రి నుంచి కుమారునికి ఆయుధాలు వారసత్వంగా పుచ్చుకుంటున్నవాళ్ళం” అన్నాడు.

అయితే మారుహ్ కుమారుడు అబ్బాస్ లేచి, “ఈ ప్రతిజ్ఞ చేయడం ద్వారా యావత్తు తెగలతో యుద్ధం కొనితెచ్చుకుంటున్నామన్న విషయాన్ని మీరు గుర్తించారా?” అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు జవాబుగా వారంతా ముక్తకంఠంతో, “ఆయన్ను మేము రక్షించుకుంటాం.. అందుకు బదులుగా మా సంపదలు కోల్పోయినా, మా నాయకులను ఎదిరించవలసి వచ్చినా, చివరకు మా ప్రాణాలు

కోల్పోవలసివచ్చినా సరే" అన్నారు. ఆ తర్వాత వాళ్ళు ప్రవక్త (స) వైపు తిరిగి, "దైవప్రవక్తా! ఇందుకు బదులుగా మాకు లభించే బహుమానం ఏమిటి?" అని ప్రశ్నించారు. ప్రవక్త (స) వారికి జవాబిస్తూ, "స్వర్గం" అన్నారు. వారు ఈ జవాబుతో సంతృప్తి చెందారు. అందరూ ప్రతిజ్ఞ చేశారు.

వారి నాయకుల్లో ఒకడైన అబుల్ హైసమ్ మాట్లాడుతూ, "ఓ దైవప్రవక్తా! మాకు - యూదులకు మధ్య ఒడంబడిక ఉంది. అవసరమైతే ఆ ఒడంబడికను మేము రద్దు చేసుకుంటాము, అయితే, అల్లాహ్ మీకు మా ప్రత్యర్థులపై విజయాన్ని ప్రసాదిస్తే మీరు మళ్ళీ మీ ప్రజల వద్దకు వెళ్ళిపోతారని, మమ్మల్ని వదలి వేస్తారని భయపడుతున్నాము" అన్నాడు. ప్రవక్త (స) ఆయనకు జవాబిస్తూ,"మీ రక్తం నా రక్తం. మీ వినాశం నాకు వినాశం. మీరు ఎవరిపై యుద్ధం చేస్తారో వారిపై నేను యుద్ధం చేస్తాను. మీరు ఎవరితో శాంతి ఒప్పందం చేసుకుంటారో వారితో నాకు శాంతి ఒప్పందం ఉంటుంది. మీలో ఉత్తమమైన పన్నెండు మందిని నాయకులుగా నాకు ఇవ్వండి. ప్రవక్త క్రీస్తు శిష్యుల మాదిరిగా వారు మీ మంచిచెడ్డలు చూస్తారు. మీ అందరిపై నేను పర్యవేక్షకునిగా ఉంటాను" అన్నారు. ఈ హామీ తర్వాత ప్రతిజ్ఞ సమగ్రమయ్యింది.

## తీవ్ర ప్రతిస్పందనలు

ప్రవక్త(స)ను తమ అధినాయకునిగా యస్రిబ్ బృందం స్వీకరించి ఆయన చేతుల మీదుగా ప్రతిజ్ఞ చేసిందన్న వార్త శరవేగంగా వ్యాపించింది. యస్రిబ్‌లో ఇస్లాం విస్తరిస్తుందన్న వార్త ఖురైషులను కలవరానికి గురిచేసింది. ఫలితంగా ఇస్లామ్‌ను తుడిచేయాలన్న ఉద్దేశ్యంతో ఖురైషులు మక్కాలో ఉన్న ముస్లిములను అనేక విధాలుగా చిత్రహింసలకు గురి చేయడం తీవ్రం చేశారు. మక్కా నగరం ముస్లిములపాలిట మరుభూమిగా మారింది. చిత్రహింసలు నిత్యకృత్యాలయ్యాయి.

ముస్లిములు చాలా దారుణంగా హింసలకు గురవుతుండడాన్ని ప్రవక్త (స) గమనించారు. అందువల్ల వారిని యస్రిబ్ వలసపోవలసిందిగా సలహా ఇచ్చారు. "అల్లాహ్ అక్కడ మీకు సోదరులను ఇచ్చాడు. సురక్షితమైన ప్రాంతాన్ని కూడా ఇచ్చాడు" అన్నారు. పెద్దసంఖ్యలో ముస్లిములు మక్కా వదలి యస్రిబ్ వలస పోవడం ప్రారంభమయ్యింది. వారిని అడ్డుకోవడానికి ఖురైషులు చాలా ప్రయత్నించారు, అయినా చాలా మంది వారిని తప్పించుకుని యస్రిబ్ చేరుకున్నారు.



## ముహాజిర్లు

యస్రిబ్ వలసపోయిన ప్రారంభ కాలానికి చెందిన ముస్లిములు దృఢమైన విశ్వాసానికి ఉదాహరణలు. వారిని దివ్యఖుర్‌ఆన్ "ముహాజిర్లు"గా అభివర్ణించింది. ఈ పదం "హిజ్రత్" నుంచి వచ్చింది. హిజ్రత్ అంటే అల్లాహ్ మార్గంలో వలసపోవడం (కాందిశీకులుగా వెళ్ళడం కాదు). యస్రిబ్‌లో ఉన్న విశ్వాసులు వారిని సాదరంగా ఆహ్వానించారు. వారిని తమ సోదరులుగా చూసుకున్నారు. తమ సంపదను వారితో పంచుకున్నారు. యస్రిబ్‌లోని ఈ ప్రజలనే దివ్యఖుర్‌ఆన్ అన్సార్లుగా అభివర్ణించింది. అన్సార్లు అంటే సహాయపడినవారు. విశ్వాసులకు సహకారం అందించినవారు.

## ఒక అందమైన యువకుడు

అబ్దుద్దార్ కుమారుడు ముసఅబ్ మక్కా వీధుల్లో నడిచి వెడుతుంటే ఆయన వైపు చూడని అమ్మాయి ఉండేది కాదు. ఇంటి కిటికీలోంచి లేదా తలుపు చాటు నుంచి ఆయన వైపు చూసి ఆయన తనను జీవిత భాగస్వామిగా చేసుకుంటే బాగుండునని భావించేవారు చాలా మంది అమ్మాయిలు. అలాంటి సౌందర్యం ఆయనది. అంతేకాదు, ఆయన తల్లి చాలా సంపన్నురాలు. ఆమెకు ఆయన ఒకేఒక్క కుమారుడు. అత్యంత ఖరీదైన దుస్తులు ఆయన ధరించేవారు. రోజుకు కనీసం మూడుసార్లు తన దుస్తులు మార్చేవారు. అత్యంత ఖరీదైన సువాసన ద్రవ్యాలు ఉపయోగించేవారు. ఆయన తల్లికి ఆయన పట్ల చాలా ప్రేమ. కాని అలాంటి తల్లి కూడా ఆయన పట్ల తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన చేసిన నేరం ఏమంటే ప్రవక్త (స) బోధనలు వినడానికి ఆయన రోజూ అర్ఖమ్ ఇంటికి వెడుతున్నారన్న విషయం ఆమెకు తెలిసింది. కోపం పట్టలేక ఆమె కుమారుడిని నిలదీసింది. "నువ్వు ఆ ముహమ్మద్ బోధనలు వింటున్నావట నిజమేనా?" అన్న ప్రశ్నకు ఆయన నిబ్బరంగా జవాబిస్తూ, "అవునమ్మా! నేను ఆయన బోధనలు వినడమే కాదు, ముస్లిమ్‌గా మారాను కూడా" అన్నారు. ఈ జవాబు ఆమె కోపాన్ని మరింత అధికం చేసింది. "ఎంత ధైర్యం నీకు. వెంటనే ఆ మతాన్ని వదలి మన పూర్వీకుల మతాన్ని స్వీకరించు లేదా నేను చిల్లిగవ్వ

https://teluguislam.net

https://teluguislam.net



కూడా ఇవ్వను.. నీ ఖరీదైన దుస్తులన్నీ తీసేసుకుంటాను" అని బెదిరించింది. ఆయన ప్రశాంతంగా జవాబిస్తూ, "అమ్మా! నువ్వు ఏది మంచిదనుకుంటే అది చేయవచ్చు" అన్నారు.

ఆమె కోపం పట్టలేక కుమారుడి ఖరీదైన దుస్తులన్నీ తీసేసుకుంది. అయనకు డబ్బులు ఇవ్వడం నిలిపేసింది. ముస్లిమ్‌గా ఉన్నంతకాలం తన ఇంటికి రావద్దని చెప్పేసింది. ఆమె బంధువులు ఆమెకు పూర్తిగా వత్తాసు పలికారు. ఇస్లామ్‌ను వదలిపెట్టకపోతే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని కూడా ఆయన్ను హెచ్చరించారు.

ఆయన వద్ద ఏమీ మిగల్లేదు, ఒంటి మీద ఉన్న ఒక పొడుగైన చొక్కా తప్ప. నిన్నటి వరకు ఎంతో ఆడంబరంగా బ్రతికిన ఆ యువకుడు ఒక్కసారిగా నిరు పేదగా మిగిలిపోయాడు. ఖురైషులు ఆయన పరిస్థితి చూసి ఎగతాళిగా నవ్వడం ప్రారంభించారు. ఆయన గురించి తెలిసిన ముస్లిములు కూడా జాలి పడ్డారు. కాని ఆయన ఇవేవీ పట్టించుకోలేదు. ప్రవక్త (స) గారి బోధనలకు క్రమం తప్పక హాజరయ్యేవారు. ఆయన తల్లికి ఆయన పట్ల చాలా ప్రేమ. అందువల్ల ఒక సందేశాన్ని పంపించింది. "నువ్వు ఆ కొత్త మతాన్ని వదలిపెట్టనంత వరకు నేను అన్నపానీయాలు ముట్టేది లేదు. ఇలాగే చచ్చిపోతాను" అంటూ వచ్చిన ఆ సందేశాన్ని ఆయన అందుకున్నారు. ఆమె కేవలం బెదిరించడం మాత్రమే కాదు, చెప్పినట్లే నిరాహారదీక్ష ప్రారంభించింది. ముసఅబ్ ఆమె వద్దకు వెళ్ళి తన దృఢసంకల్పాన్ని ఎలాంటి సంకోచం లేకుండా వినిపించారు. "అమ్మా! నీ వద్ద వంద జీవితాలు ఉండి ఒక దాని తర్వాత ఒక జీవితాన్ని ఇలా సమాప్తం చేసుకున్నప్పటికీ నేను నా విశ్వాసాన్ని వదులుకోను" అని ఖచ్చితంగా చెప్పేశారు. ఆ తల్లికి తన నిరాహారదీక్ష విరమించడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.

ఈ కాలంలోనే యస్రిబ్ నుంచి మొదటి బృందం వచ్చి ప్రవక్త(స)ను అకబా వద్ద కలుసుకుంది. తమతోపాటు ఎవరినన్నా ఇస్లామ్‌ను బోధించడానికి పంపాలని వారు ప్రవక్తను (స) కోరారు. ప్రవక్త (స) మరో ఆలోచన లేకుండా ముసఅబ్‌ను ఎన్నుకున్నారు. ఆ విధంగా యస్రిబ్ చేరుకున్న ముసఅబ్ వారికి ఇస్లామ్ బోధించడం ప్రారంభించారు. ఎవరి మాట వినని మొండిఘటాలుగా పేరొందిన వారిని కూడా ఆయన తన వాక్చాతుర్యంతో తన మాట వినేలా చేసేవారు. "నేను చెప్పేది వినండి. మీకు నచ్చితే స్వీకరించండి లేకపోతే లేదు" అంటూ ఆయన



చెప్పే మాటలు చాలా మంది హృదయాలను మార్చివేశాయి. ఆయన్ను అందరూ అల్ ముఖ్‌రీ (పారాయణం చేసేవాడు) అని పిలువసాగారు. ఆయన దివ్య ఖుర్ఆన్ పారాయణం అంత మధురంగా ఉండేది!

మరుసటి సంవత్సరం ముసఅబ్ యస్రిబ్ నుంచి డెబ్బయి మంది బృందాన్ని తీసుకుని మక్కా వచ్చారు. ఆయన ప్రవక్త (స) వద్దకు వచ్చి యస్రిబ్‌లో ఇస్లామ్ స్వీకరించని కుటుంబం అంటూ ఒక్కటి కూడా మిగల్లేదని, ప్రతి కుటుంబంలోనూ ఎవరో ఒక్కరు ఇస్లామ్ స్వీకరించారని అన్నారు. ఆ విధంగా ప్రవక్త (స) ఆయన సహచరులు యస్రిబ్‌కు వలస వెళ్ళడానికి అనుకూలమైన వాతావరణాన్ని ఆయన ఏర్పరచగలిగారు.

ముసఅబ్ మక్కా వచ్చిన విషయం ఆయన తల్లికి తెలిసింది. ఆమె ఆయనకు కబురు పంపారు. తన వద్దకు వచ్చిన కుమారుడిని ఆమె మందలించడం ప్రారంభించింది. "నీకు తల్లి పట్ల ప్రేమ లేదు. ఇక్కడకు వచ్చిన వెంటనే తల్లిని కలువడం నీ బాధ్యత కాదా?" అన్నారు. ఆయన తొణక్కుండా జవాబిస్తూ, "అమ్మా! ప్రవక్త(స)ను కలసి ఆయనకు జరిగిన సంఘటనలు నివేదించడం నా ప్రథమ బాధ్యత" అన్నారు.

యస్రిబ్‌లో ఆయన చేసిన ప్రయత్నాలకు నిదర్శనం ప్రవక్త(స)కు అక్కడ లభించిన ఘనమైన స్వాగతం. బద్ర్ యుద్ధంలో పోరాడి ఇస్లామ్‌కు విజయం సాధించిన కొందరు వీరుల్లో ఆయన కూడా ఒకరు. ఉహుద్ యుద్ధం సందర్భంగా ఆయన చేసిన త్యాగం ఎన్నటికీ మరువలేనిది. ఆ యుద్ధంలో ప్రవక్త (స) ఒక కొండపై నిలబడి ఉన్నారు. ఆయన శత్రువుల దాడికి అందుబాటులో ఉన్న పరిస్థితి అది. శత్రు వర్గానికి చెందిన విలుకాళ్ళు ప్రవక్త(స)కు గురిపెట్టడాన్ని ముసఅబ్ చూశారు. ఆయన తక్షణం ప్రవక్త(స)కు అడ్డుగా నిలబడి ఆ బాణాలన్నింటికి తన శరీరాన్నే డాలుగా చేశారు. ఆ విధంగా ఆయన ప్రవక్త (స) చేతుల్లో తుదిశ్వాస వదిలారు.

యుద్ధానంతరం ప్రవక్త సహచరులు ముసఅబ్ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నప్పుడు ఆయన ధరించిన పొడుగైన చొక్కానే ఆయనకు శవవస్త్రంగా ఉపయోగించదలిచారు. కాని ఆ చొక్కాతో తల భాగాన్ని కప్పితే కాళ్ళు అనాచ్ఛాదితంగా ఉండిపోతున్నాయి. కాళ్ళను కప్పితే ఆయన శిరోభాగం అనాచ్ఛాదితంగా ఉండిపోతోంది. ప్రవక్త ఈ పరిస్థితి చూసి ఆయన శిరోభాగాన్ని చొక్కాతో కప్పాలని,

కాళ్ళను సువాసన కలిగిన మొక్కలతో కప్పాలని ఆదేశించారు. ఆ విధంగా ఆయన్ను ఉహుద్ వద్ద ఖననం చేశారు.

మసూద్ కుమారుడు అబ్దుల్లాహ్ ఆయన గురించి మాట్లాడుతూ, "ఇస్లాం ప్రారంభ కాలంలోని ముస్లిములమైన మేము ఇస్లాం విజయాల తర్వాత మా ప్రయత్నాలకు బదులుగా ఈ ప్రపంచంలో కూడా ప్రతిఫలాన్ని పొందాము. కాని ముసఅబ్ అలాంటి ప్రతిఫలం ఏదీ పొందలేదు. ఆయన ఇస్లాం స్వీకరించినప్పటి నుంచి ఆయనే ఇచ్చారు. ఇస్లాం కోసం ఆయన తన వారసత్వ సంపదను కూడా వదులుకున్నారు. చివరకు ఆయన ప్రాణత్యాగం చేసిన తర్వాత ఆయన ఖననానికి తగిన శవవస్త్రం కూడా లేని పరిస్థితిలో ఈ లోకాన్ని వదలి వెళ్ళారు" అన్నారు.

ముసఅబ్‌ను, ఆయన వంటి వారిని దివ్యఖుర్‌ఆన్ క్రింది విధంగా ప్రస్తుతించింది:

"విశ్వాసులలో అల్లాహ్‌కు తాము చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపిన వారు ఉన్నారు. వారిలో కొందరు తమ మొక్కుబడిని తీర్చుకున్నారు, మరికొందరు సమయం కోసం నిరీక్షిస్తున్నారు. వారు తమ వైఖరిని ఏమాత్రం మార్చుకోలేదు." **(దివ్యఖుర్‌ఆన్ : 33-23)**

## గ్రహించవలసిన పాఠాలు

☛ అందమైన యువకుడు ముసఅబ్‌కు అన్ని విధాల విలాసవంతమైన జీవితం ఉండేది. ఆయన అందగాడు. మధురమైన కంఠం కలవారు. సంపన్నురాలైన, తనను అమితంగా ప్రేమించే తల్లి ఉండేది. ఆయనకు ఎలాంటి కొదువ ఉండేది కాదు. తాను కోరిన సుందరాంగితో వివాహం చేసుకోగలిగి ఉండేవారు. కాని ఆయన ప్రవక్త (స) పట్ల విశ్వాసాన్ని ఎంచుకున్నారు. తన తల్లి కన్నా ఎక్కువగా ప్రవక్త (స) పట్ల, ఇస్లాం పట్ల ఆయన ప్రేమ చూపారు. ఎంతగా ప్రేమించారంటే, ప్రవక్త (స) కోసం ప్రాణ త్యాగం చేశారు. దైవసందేశహరుని చేతుల్లో తుదిశ్వాస వదిలే సౌభాగ్యాన్ని పొందారు.

https://teluguislam.net



# ఇస్రా
## (రాత్రి ప్రయాణం)

**(ఇస్రా అంటే మేరాజ్ యాత్ర కాదు. అయితే మేరాజ్ యాత్రలో ఒక భాగంగా దీనిని అర్థం చేసుకోవాలి. ప్రవక్త (స) హిజ్రత్ చేయడానికి ఒక ఏడాది ముందు జరిగిన సంఘటన ఇది)**



**తన దాసుణ్ణి రాత్రికి రాత్రే మస్జిదె హరామ్ నుండి మస్జిదె అక్సా వరకు తీసుకుపోయిన అల్లాహ్ పరిశుద్ధుడు.**
**(ఖుర్‌ఆన్ 17 : 1)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఉమ్మెహానీ ప్రవక్త ముహమ్మద్ (స)కు వరుసకు చెల్లెలు అవుతారు. ప్రవక్త (స)కు పెదనాన్న అయిన అబూతాలిబ్ కుమార్తె ఆమె. ప్రవక్త (స) బోధనలను తూ.చా. తప్పక పాటించే ముస్లిం. ఒక రాత్రి ప్రవక్త ముహమ్మద్ (స) ఆమె ఇంట బస చేశారు. మరుసటి రోజు ఉదయం తన ప్రార్థనలు ముగించుకున్న తర్వాత దైవప్రవక్త (స) ఆమెను పిలిచారు. ఆ రాత్రి జరిగిన అసాధారణ సంఘటన గురించి ఆమెకు వినిపించారు:

"రాత్రి నేను నీతోపాటు ఇషా నమాజు చేశాను. కాని ఆ తర్వాత నేను జెరుసలేమ్ వెళ్ళాను. అక్కడ ప్రార్థనలు చేశాను. ఇప్పుడు ఇక్కడ నీతో పాటు ఫజర్ నమాజు చేయటానికి వెనుతిరిగి వచ్చాను. ఇప్పుడు నేను బయటకు వెళ్ళి నా ఈ అనుభవాన్ని అందరికీ చెబుతాను. ఎందుకంటే దేవుని శక్తిసామర్థ్యాల గురించి, ఆయన నాపై కురిపించిన అనుగ్రహం గురించి అందరికీ చెప్పడం నా బాధ్యత" అన్నారు.

ఉమ్మె హానీ దృఢమైన విశ్వాసం కలిగిన మహిళ. ప్రవక్త (స) మాటలను ఆమె కొంచెం కూడా అనుమానించలేదు. కాని ప్రజల మనస్తత్వం కూడా ఆమెకు బాగా తెలుసు. ప్రవక్త (స) బయటకు వెళ్ళి ప్రజలకు ఈ విషయం తెలిపితే వాళ్ళు ఆయన్ని పరిహసిస్తారని ఆమె

https://teluguislam.net



భయపడ్డారు. అందువల్ల ఆమె ప్రవక్త(స)తో, "అన్నయ్యా! నిన్ను కాదంటున్న వాళ్ళ వద్దకు, నీ సందేశాన్ని తిరస్కరిస్తున్న వాళ్ళ వద్దకు వెళ్ళ వద్దు. ఇప్పుడు నీవు నాకు చెప్పిన విషయం వారికి చెబితే వాళ్ళు ఎగతాళి చేయవచ్చు.. అబద్ధాలు చెబుతున్నావని ఆరోపించవచ్చు" అన్నారు.

ఆమె చెప్పిన మాటల్లో నిజం ఉందని ప్రవక్త (స) కూడా గ్రహించారు. కాని తనకు దేవుడు చూపించిన అద్భుతమైన అనుభవం గురించి ప్రజలకు చెప్ప కుండా దాచి ఉంచరాదనుకున్నారు. ఆయన అల్లాహ్ తరపున పూర్తి మానవాళి కొరకు పంపబడిన ప్రవక్త. అందువల్ల 'ఇస్రా' వంటి అద్భుతమైన అనుభవం గురించి ప్రజలకు చెప్పవలసిన అవసరం ఎంతయినా ఉంది. ఈ ఆలోచనలతో ఆయన ఉమ్మె హానీ ఇంటి నుంచి బయటకు వచ్చి తిన్నగా కాబా గృహానికి వెళ్ళారు.

ఆయన బయటకు వెళ్ళడాన్ని చూసిన ఉమ్మె హానీ కంగారుగా తన పరిచారిక నబాను పిలిచి ప్రవక్త (స)ను అనుసరించి వెళ్ళమని, ఆయన చెప్పిన మాటలకు ప్రజల ప్రతిస్పందన ఎలా ఉందో గమనిస్తూ, ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఆదేశించారు.

చాలా సేపటి తర్వాత నబా వచ్చి ఆమెకు జరిగిన వృత్తాంతం వివరించింది. ప్రవక్త (స) కాబా గృహానికి ఆనుకుని ఉన్న ప్రదేశం హతీమ్ వద్ద కూర్చున్నారని, అబూజహల్ ఎగతాళిగా ఆయన్ను, "ఏంటి! ఈ రోజు మాకు చెప్పడానికి ఏదైనా కొత్త విషయం ఉందా?" అని ప్రశ్నించాడని, ప్రవక్త (స) జవాబిస్తూ, "అవును, మీకు ఒక అద్భుతమైన విషయం చెప్పాలి. నేను రాత్రి జెరుసలేమ్‌కు ప్రయాణం (ఇస్రా) చేశాను" అంటూ వివరించారనీ, ఆయన్ను అడ్డుకుంటూ అబూజహల్ గేలిచేస్తున్నట్లుగా, "రాత్రి జెరుసలేమ్ వెళ్ళి పొద్దుటికల్లా వచ్చేయడమా... ఇక్కడ ప్రజలందరినీ పిలుస్తాను. ఇప్పుడు నాకు చెప్పింది వాళ్ళందరికీ చెబుతావా" అన్నాడనీ, అందుకు ప్రవక్త (స) అంగీకరించారని తెలిపింది.

అబూజహల్ జనాన్ని పోగుచేసి, ప్రవక్త (స)ను ఎగతాళి చేస్తున్నట్లుగా, "బనీ కాబ్ వంశస్తులారా! లుఐ సంతానమా! వినండి, ముహమ్మద్ ఏదో అంటు న్నారు వినండి" అన్నాడు. జనాన్ని చూసి ప్రవక్త (స) తన కథనాన్ని మార్చుకుంటా రని అబూ జహల్ అనుకున్నాడు. కాని ప్రవక్త (స) తన అనుభవాన్ని మరోసారి వివరించారు. "నేను రాత్రి ప్రయాణం (ఇస్రా) చేసి జెరుసలేమ్ వెళ్ళాను. అక్కడ నేను ప్రవక్తల బృందాన్ని కలుసుకున్నాను. ఆ బృందంలో ఇబ్రాహీమ్, మూసా, ఈసా ప్రవక్తలు కూడా ఉన్నారు. నా నాయకత్వంలో వాళ్ళు ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత నేను వారితో మాట్లాడాను" అన్నారు. అబూజహల్ ఆయన్ను అడ్డు కుంటూ, "నువ్వు నిజంగా వారిని చూసి ఉన్నట్లయితే వాళ్ళు ఎట్లా ఉంటారో కాస్త వర్ణించు" అన్నాడు. ప్రవక్త (స) జవాబిస్తూ,"ఈసా మామూలు ఎత్తు కలిగి ఉన్నారు. ఆయన, ఎర్రని శరీర వర్ణం నల్లని గెడ్డం కలిగి ఉన్నారు. చాలా పవిత్రంగా కనిపించారు. మూసా చాలా పొడవుగా బలిష్ఠంగా ఉన్నారు. ఇబ్రాహీమ్ చాలా వరకు నన్ను పోలి ఉన్నారని" తెలిపారు. ఇదంతా వింటున్న జనంలోని ఒక వ్యక్తి "మీరు చెప్పేది నిజమే అయితే, మాకు రుజువులు చూపించండి" అన్నాడు. ప్రవక్త(స) దానికి కూడా జవాబిస్తూ, "నేను చెప్పినదానికి రుజువు లేమంటే, నేను వెళుతున్నప్పుడు దారిలో ఒక తెగవారి ఒంటెల బిడారును చూశాను. నేను స్వారీ చేస్తున్న వాహనం వారిని దాటినప్పుడు ఆ ఒంటెలు బెదిరి పారిపోయాయి. నేను ఆ తెగవారికి ఆ ఒంటెలు ఎక్కడ దొరుకుతాయో చెప్పాను. ఆ తర్వాత సిరియా నుంచి ప్రయాణం చేస్తున్నప్పుడు మక్కా కొండల దగ్గర నేను మరో బిడారును దాటాను. ఆ బిడారులోని వాళ్ళందరూ గాఢనిద్రలో ఉన్నారు. వారి వద్ద నీళ్ళ కుండ ఒకటి కనబడింది. దానిపై మూత వేసి ఉంది. నేను మూత తీసి నీళ్ళు తాగి తర్వాత మూత మళ్ళీ యథాతథంగా పెట్టేశాను. ఆ బిడారు ఇప్పుడు తన్‌యీమ్ ప్రదేశానికి చేరుకుని ఉంటుంది. ఆ బిడారుకు అగ్రభాగాన ఒక మచ్చల ఒంటె ఉంది. దానిపై రెండు పెద్ద పెద్ద కూజాలు ఉన్నాయి. ఒకటి నల్లనిది, రెండవది తెల్లనిది" అన్నారు. ఈ వివరాలు విన్న ప్రజలు ఇదంతా నిజమో కాదో తేల్చుకోవాలని ఆతృత పడ్డారు. కొందరు వెంటనే తన్‌యీమ్‌కు బయలుదేరారు. అక్కడ వారికి ప్రవక్త (స) వర్ణించిన బిడారు ఆయన చెప్పినట్లే కనబడింది.

ఇంత ఖచ్చితమైన ఆధారం ఉన్నప్పటికీ కొందరికి ఇంకా అనుమానాలు వదల్లేదు. అదీ కుమారుడు ముత్‌యిమ్ ప్రవక్త(స)తో మాట్లాడుతూ, "నిన్నటి కన్నా నేడు నాకు వ్యతిరేకత ఇంకా ఎక్కువయ్యింది. అత్యంత వేగంగా వెళ్ళే ఒంటె కూడా జెరుసలేమ్ వెళ్ళడానికి కనీసం నెల రోజుల సమయం తీసుకుం టుంది. తిరిగి రావడానికి మళ్ళీ నెల రోజులు పడతాయి. అలాంటిది నువ్వు ఒక్క రాత్రిలో వెళ్ళి వచ్చానని చెబితే నేను నమ్మను. నువ్వు చెబుతున్నది అబద్ధమని ప్రమాణ పూర్వకంగా చెబుతున్నాను" అన్నాడు.

ప్రవక్త(స) సహచరులైన అబూబక్ర్ (రజి) వెంటనే ఇలా అన్నారు: "ముహమ్మద్ (స)! మీరు చెబుతున్నది సత్యమని నేను ప్రకటిస్తున్నాను. మీరు చెబుతున్నది ఎంత అసాధ్యంగా కనబడుతున్నప్పటికీ నేను నమ్ముతున్నాను" అన్నారు. (అప్పటి నుంచి అబూబక్ర్ (రజి)కు సిద్దీక్, అంటే సత్యానికి సాక్ష్యం పలికినవాడు అన్న పేరు స్థిరపడింది). అక్కడ గుమిగూడిన జనంలో చాలా మంది అబూబక్ర్(రజి) మాటలతో ఏకీభవించారు. కాని కొందరు విశ్వసించడానికి సిద్ధపడలేదు.

తన పరిచారిక ద్వారా ఈ వివరాలు తెలుసుకున్న ఉమ్మెహానీ పరిచారికతో, "విశ్వాసం విషయంలో బలహీనంగా ఉన్న వారి గురించి ఆందోళన చెందవలసిన పనిలేదు, విశ్వాసం బలహీనపడిన వారు ముస్లిం సమాజం నుంచి బయటకు వెళ్ళిపోయినా ఫర్వాలేదని" వ్యాఖ్యానించారు.

## మేరాజ్

ఇస్రా (రాత్రి ప్రయాణం) సందర్భంగానే మేరాజ్ సంఘటన కూడా జరిగింది. జెరుసలేమ్‌లోని మస్జిదుల్ అక్సా నుంచి మేరాజ్ (అధిరోహణ) ఏడు ఆకాశాలకు జరిగింది.

మేరాజ్ గురించి దివ్యఖుర్‌ఆన్ 53:1-18లో ప్రస్తావన ఉంది. అయితే మేరాజ్ అన్న పదం అక్కడ వాడడం జరగలేదు.

https://teluguislam.net



# వలస

## (హిజ్రత్) క్రీ .శ. 622

**ఇస్లామీయ క్యాలెండరు మొదలయింది ఈ సంవత్సరం నుంచే. దీన్నే హి.శ. (హిజ్రీ శకం) అంటారు.**



ఎవరు విశ్వసించి, స్వస్థలాన్ని విడిచి వలసపోయారో, అల్లాహ్ మార్గంలో పోరాటం సలిపారో, మరెవరు (వారికి) ఆశ్రయమిచ్చి ఆదుకున్నారో - వారే నిజమయిన విశ్వాసులు.

(ఖుర్‌ఆన్ *8 : 74*)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ముస్లిములు పెద్ద సంఖ్యలో యస్రిబ్‌కు వలసపోతే, వాళ్ళు అక్కడ బలపడి మక్కాలో ఉన్న ముస్లిములకు సహాయసహకారాలందించడం ప్రారంభిస్తారని ఖురైషులు భయపడ్డారు. అలా జరిగితే మక్కాలోని ఖురైషుల పరిస్థితి బలహీన పడుతుంది. ఈ సమస్య గురించి చర్చించడానికి వాళ్ళు సమావేశమయ్యారు. అదే సమయంలో ప్రవక్త(స)ను కాపాడుతూ వచ్చిన పెదనాన్న అబూతాలిబ్ మరణించారు. ఈ పరిణామం తమకు మంచి అవకాశాన్ని ఇస్తుందని, గట్టి చర్య తీసుకోవడానికి ఇదే తగిన సమయమని వాళ్ళు భావించారు. ఆ సమావేశంలో హిషామ్ కుమారుడు అబుల్ బఖ్తరీ ఒక ప్రతిపాదన చేశాడు. "మనం ముహమ్మద్‌ను నిర్బంధించి, గతకాలాల తిరుగుబాటు కవులను కట్టేసిన విధంగా సంకెళ్ళతో కట్టి పారేద్దాం" అన్నాడు. కాని చాలా మంది ఈ సూచనతో ఏకీభవించలేదు. అలా చేస్తే ముహమ్మద్ తెగకు చెందిన వాళ్ళు రెచ్చిపోతారని భయపడ్డారు (తెగలో వారికి ఎన్ని విభేదాలున్నప్పటికీ, తెగలో ఒక వ్యక్తి హత్య జరిగితే మొత్తం తెగ దానికి ప్రతీకారం తీర్చుకునే నియమం ఉండేది). అప్పుడు ఉమర్ కుమారుడు అబుల్ అస్వద్ రాబియా మాట్లాడుతూ, ముహమ్మద్(స)ను బహిష్కరిద్దాం

https://teluguislam.net



అన్నాడు. కాని ఈ సూచన కూడా చాలా మందికి నచ్చలేదు. అలా చేస్తే ముహమ్మద్ (స) ఇతర ప్రాంతాల ప్రజలను ముస్లిములుగా మార్చే స్వేచ్ఛను పొందుతారని భయపడ్డారు.

## హత్యకు కుట్ర

చాలా సేపు చర్చ జరిగిన తర్వాత హిషామ్ కుమారుడు అబూజహల్ సూచనను వాళ్ళు అంగీకరించారు. ఆ సూచన ప్రకారం, ప్రతీ తెగకు చెందిన ఒక బలమైన యువకుడిని ఎన్నుకోవాలి. అలా వివిధ తెగలనుంచి ఎంపికైన యువకులు నిర్ధారిత సమయంలో ముహమ్మద్(స)పై దాడి చేసి అందరూ ఆయనపై విరుచుకుపడాలి. ఆ విధంగా చేస్తే అన్ని తెగల వాళ్ళు ఆయన్ను హత్య చేసినట్లు అవుతుంది. ఈ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం కోసం బనీ అబ్దె మునాఫ్ (ప్రవక్తతో దగ్గరి రక్త సంబంధం ఉన్న వంశస్థులు) అన్ని తెగలతో పోరాడవలసి వస్తుంది. ఖురైష్‌లోని అన్ని తెగలతో తలపడవలసి వస్తుంది. అలా చేయడం వారికి సాధ్యం కాదు. అందువల్ల వాళ్ళు ప్రతీకారం తీర్చుకునే అవకాశం లేదు, రక్తపరిహారంగా కొంత మొత్తం స్వీకరించడం తప్ప వారికి మరో దారి ఉండదు. ఈ విధంగా తమ అధికారానికి, తమ పెత్తనానికి అడ్డుపడుతున్న ముహమ్మద్ ప్రవక్త (స)ను వదిలించుకోవచ్చని వారు కుట్ర పన్నారు.

## ప్రవక్త (స) అనుచరుని పథకం

ఉత్తమమైన వ్యక్తిత్వం కలిగిన అబూబక్ర్ (రజి) తన ప్రాణాలకన్నా ఎక్కువగా ముహమ్మద్ (స)ను ప్రేమించేవారు. అబూబక్ర్‌లో ఉన్న సుగుణాలను ప్రవక్త (స) గుర్తించారు. అందుకే ఆయన్ను 'సిద్దీక్' అని పిలిచేవారు. అంటే సత్యాన్ని విశ్వసించేవాడని అర్థం. అంతేకాదు, ఆయన్ను అతీక్ (అంటే నరకాగ్ని నుంచి విముక్తి పొందినవాడు) అని కూడా పిలిచేవారు. అబూబక్ర్ యస్రిబ్‌కు వలస పోవాలని అనుకున్నారు. ప్రవక్త (స) కూడా తనతో పాటు వస్తే బాగుండునని భావించారు. ఈ ప్రయాణానికిగాను ఆయన రెండు బలిష్టమైన ఒంటెలను కూడా సిద్ధం చేసుకున్నారు.

## దైవిక మార్గదర్శకత్వం

ప్రవక్త (స)ను హత్య చేయాలని ఖురైష్ తెగలు కుట్ర పన్నిన రోజున అల్లాహ్ ఈ కుట్ర గురించి ప్రవక్త (స)కు తెలిపాడు. అంతేకాదు, మక్కా వదలి



వెళ్ళడానికి అనుమతి కూడా ప్రసాదించాడు. ప్రవక్త (స) అబూబక్ర్ ఇంటికి వెళ్ళి అల్లాహ్ తనకు మక్కా వదలి వెళ్ళడానికి, యస్రిబ్ వలసపోవడానికి అనుమతి ఇచ్చిన విషయం తెలిపారు. అబూబక్ర్ వెంటనే, "నేను కూడా మీతోపాటు రావచ్చునా" అని ప్రశ్నించారు. ఈ మాటలు విని ప్రవక్త (స) చాలా సంతోషించారు. ఇషా నమాజు తర్వాత రాత్రి బయలుదేరుదామని చెప్పారు. అబూబక్ర్ సంతోషంగా ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవడానికి వెళ్ళిపోయారు.

ప్రవక్త (స) ఇంటికి వెళ్ళి, అలీ (రజి)ను పిలిచారు. ఆయన ప్రవక్త (స)కు చిన్నాన్న కుమారుడు. అలీ(రజి)ను తన పడకపై, తన దుప్పటి కప్పుకుని పడుకోవాలని చెప్పారు. ధైర్యానికి మారుపేరయిన అలీ(రజి) ఏమాత్రం సంకోచించకుండా అంగీకరించారు. అల్లాహ్ అభీష్టం వల్ల ఆ ఇంటిని అప్పటికే చుట్టుముట్టిన శత్రువులు మగతనిద్రకు గురయ్యారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రవక్త (స) ఎలాంటి అడ్డు లేకుండా తన ఇంటిని విడిచి బయటకు వచ్చారు. ఆయన వెళ్ళి అబూబక్ర్ (రజి)ను కలుసుకున్నారు. ఇద్దరూ కలిసి యస్రిబ్ దిశగా ప్రయాణమయ్యారు. తెల్లారక ముందే వారు సౌర్ గుహ వద్దకు చేరుకున్నారు. ఆ గుహలో దాక్కోవడం మంచిదని భావించారు. తమ ఒంటెలను అక్కడ మేతమేయడానికి వదలివేసారు.

ఆ రోజు తెల్లవారుజామున శత్రువులు ప్రవక్త (స) ఇంటిలోకి ప్రవేశించారు. కాని ఆశ్చర్యంగా వారికి ప్రవక్త (స) పడకపై అలీ కనబడ్డారు. తాము హతమార్చాలనుకున్న ప్రవక్త (స) దొరకలేదు. వాళ్ళు వెంటనే ఈ విషయం తమ నాయకులకు చెప్పడానికి పరుగులు తీశారు. ఆ వెంటనే అబూజహల్ పరుగున అబూబకర్ ఇంటికి వెళ్ళాడు. ప్రవక్త (స)కు అబూ బక్ర్ (రజి) అత్యంత సన్నిహితుడన్న విషయం అతడికి తెలుసు. అబూబక్ర్ (రజి) కూడా ప్రవక్త (స)తో కలసి వెళ్ళిపోయి ఉంటారని అనుమానించాడు. అబూబక్ర్ (రజి) కుమార్తె అస్మాను, "మీ నాన్న ఎక్కడ?" అని గద్దించాడు. ఆమె తనకు తెలియదని చెప్పింది. ఆగ్రహం పట్టలేని అబూజహల్ ఆమెను చాచి కొట్టాడు. ఆ వెంటనే అందరినీ సమావేశపరచి, తప్పించుకున్న వారిని పట్టుకోవడానికి మనుష్యులను పంపాలని చెప్పాడు.

## గాలింపు

తప్పించుకున్న ప్రవక్త (స)ను పట్టుకోవడానికి గాలింపు మొదలైంది. సౌర్

https://teluguislam.net



గుహ సమీపంలో గిట్టల చప్పుడు విన్న అబూబక్ర్ (రజి) చాలా భయపడ్డారు. "ఇప్పుడేం చేద్దాం.. మనం ఇద్దరమే ఉన్నాం" అన్నారు. ప్రవక్త (స) జవాబిస్తూ, "భయపడవద్దు మిత్రమా! మనం ముగ్గురం ఉన్నాం. అల్లాహ్ మనతో ఉన్నాడు" అన్నారు. వెదుకుతున్న వాళ్ళు సౌర్ గుహ వద్దకు వచ్చారు. ఎంత వెదికినా వారికి ముహమ్మద్ (స) జాడ కనిపించలేదు. చివరికి వేసారి మక్కాకు తిరిగి వెళ్ళి పోయారు.

ప్రవక్త (స)ను పట్టుకోవడానికి అవసరమైన సమాచారాన్ని ఇస్తే వారికి వంద ఒంటెల బహుమానం ఇస్తామని ఖురైషు నాయకులు ప్రకటించారు. కినాన తెగకు చెందిన సురాకా ఈ ప్రకటన విన్నాడు. ప్రవక్త (స) ఆచూకీ తెలుసుకోవాలని బయలుదేరాడు.

అబూబక్ర్ (రజి)కు చెందిన ఇద్దరు నమ్మకస్తులైన నౌకర్లకు ప్రవక్త (స) తప్పించుకున్న విధానం తెలుసు. అందులో ఒకరు ఫుహైరా కుమారుడు ఆమిర్. ఆయన అక్కడ గొర్రెలను తోలుకు వచ్చి మేతకు వదిలేవారు. సాయంత్రం పూట గుహలో ఉన్నవారి కోసం పాలు, మాంసం ఇచ్చి వెళ్ళేవారు. రెండవ నౌకరు ఉరైత్ కుమారుడు అబ్దుల్లాహ్. ఈయన రోజు మక్కాలో జరుగుతున్న పరిణామాల వార్తలు తీసుకొచ్చి వారికి వినిపించేవారు. ఖురైషుల పథకాల గురించి తెలిపే వారు. అబ్దుల్లాహ్ వెళ్ళిపోయిన వెంటనే ఆమిర్ తన గొర్రెల మందతో ఆయన వెనక వెళ్తూ కాలి గుర్తులు లేకుండా చెరిపేసేవారు.

బహుమానం కోసం ఆశపడిన వాళ్ళు అనేక మంది దూరదూర ప్రాంతాల వరకు ప్రవక్త (స) కోసం వెదికారు. రెండు దినాలు, మూడు రాత్రులు ప్రవక్త (స), అబూబకర్ (రజి) ఆ గుహలో గడిపారు. గుహలో అధిక సమయం ప్రార్థనలు చేస్తూ గడిపేవారు.

మూడవ రోజున ఖురైషులు ఇక ఆశ వదులుకుని వెదకడం మానుకున్నారు. అబూబక్ర్ (రజి) తన సేవకుడిని తమ ఒంటెలను తీసుకురమ్మని చెప్పారు. ఒంటెలు రాగానే ఇద్దరూ మళ్ళీ యస్రిబ్ దిశగా ప్రయాణమయ్యారు.

## పట్టుబడిన ప్రయాణీకులు

అందరూ వెదకులాట మానుకున్నప్పటికీ సురాకా మాత్రం పట్టు వదల్లేదు. శరవేగంగా యస్రిబ్ దిశగా ప్రయాణమయ్యాడు. దూరంగా ఇద్దరు ప్రయాణీకులు



ఒంటెలపై వెళుతున్న దృశ్యం కనబడింది. ఒరలోంచి కత్తి దూసి వారివైపు దూసుకు వెళ్ళాడు. కాని హఠాత్తుగా అతడి గుర్రం తూలిపడింది. అతను గుర్రం నుంచి నేలపై పడ్డాడు. ముందు పోతున్న ఇద్దరు తమ ఒంటెలను మరింత వేగంగా అదిలించారు. సురాకా మళ్ళీ గుర్రంపైకి ఎక్కాడు. కాని మళ్ళీ గుర్రం తూలింది. మళ్ళీ నేలపై పడ్డాడు. ప్రవక్త (స)కు దైవికమైన రక్షణ ఉందన్న విషయం అతడికి అర్థం అయ్యింది. తన కత్తిని ఒరలో పెట్టుకుని ప్రవక్త(స)తో క్షమాభిక్ష కోరుకున్నాడు. వారి గురించి ఎవరికీ చెప్పనని ప్రమాణం చేశాడు. ప్రవక్త (స) అతడి కోసం ప్రార్థన చేశారు. తాను జనం ముందు చేసిన సవాలును మరచిపోయి సురాకా తన గుర్రాన్ని ఎక్కి, వెనక్కి ప్రయాణమయ్యాడు.

## సుస్వాగతం

ప్రవక్త మహనీయులు (స) వస్తున్న వార్త యస్రిబ్‌లో వ్యాపించింది. జనం పట్టరాని ఆనందంతో ఆయన కోసం ఎదురుచూడడం ప్రారంభించారు. ఆయనకు స్వాగతం పలకడానికి వారు రోజూ పట్టణం శివార్లలోకి వచ్చి పొద్దుటి నుంచి సాయంత్రం వరకు ఎదురు చూసి వెనుతిరిగి వెళ్ళేవారు. ఒక రోజు అదే విధంగా ఎదురుచూస్తున్నప్పుడు ఒక వ్యక్తి దూరం నుంచి ప్రవక్త (స)ను, ఆయన సహచరుడు అబూబక్ర్ (రజి)లను చూసి సంతోషంగా, ప్రవక్త (స) వస్తున్నారని బిగ్గరగా అరచి చెప్పాడు. ఆ వెంటనే ప్రజలందరూ హర్షధ్వానాలు చేశారు. పాటలు పాడుతూ స్త్రీపురుషులు, పిల్లలు అందరూ ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రవక్త (స) అధిరోహించిన ఒంటె మందగమనంతో జనం మధ్య నుంచి వెళుతున్నప్పుడు ప్రతి ఒక్కరు ఆ ఒంటె తాడును పట్టుకుని, "ఓ ప్రవక్తా! మా యింట బసచేయండి" అని అభ్యర్థించసాగారు. ప్రవక్త (స) వారిని ఆశీర్వదిస్తూ, "నా ఒంటెను తన దారిన నడవనివ్వండి. దీనిని అల్లాహ్ నడిపిస్తున్నాడు" అన్నారు. ఒంటె ఖుబా దిశ నుంచి నజ్జార్ కుమారుడు మాలిక్ ఇంటి వైపుగా నడిచింది. కొంత దూరం ముందుకు వెళ్లిన తర్వాత ఒంటె అక్కడ కూర్చున్నది. అది ఖాళీ స్థలం, ఖర్జూరాలు ఎండబెట్టడానికి వాడుకుంటున్న స్థలం. రాఫె అనే వ్యక్తి కుమారులు సహ్ల్, సుహేల్‌లకు చెందిన స్థలం అది. వాళ్ళిద్దరూ అనాథలు. తండ్రిలేని వారు. ప్రవక్త (స) ప్రజలను ఉద్దేశించి, "నేను ఇక్కడ ఉంటాను" అన్నారు.

అల్లాహ్! నా నివాస స్థలానికి శుభాన్ని ప్రసాదించు. నీవే శుభాన్ని ప్రసాదించే వాడవు" అని ప్రార్థించారు. ఆయన ఆ అనాథ బాలల సంరక్షకుడిని పిలిచి ఆ స్థలానికి తగిన వెల చెల్లించారు. అబూ అయ్యూబ్ అన్సారీ ప్రవక్త (స) సామాను తన ఇంటికి తీసుకువెళ్ళారు. జురారా కుమారుడు అసద్ ప్రవక్త (స) ఒంటెను తనతో తీసుకువెళ్ళారు.

మక్కా నుంచి వచ్చినవారిని ప్రవక్త (స), "ముహాజిర్లు" అని పిలిచారు. ముహాజిర్లంటే వలసవచ్చినవారని అర్థం. యస్రిబ్‌లో వారికి ఆశ్రయం ఇచ్చిన వారిని "అన్సార్లు" అని పిలిచారు. ముహాజిర్లకు, అన్సార్లకు మధ్య ఆయన సోదర బంధాన్ని ఏర్పాటు చేశారు. ఇస్లాం ఆధారంగా వారిని సమైక్యపరిచారు. ఆ విధంగా ప్రవక్త (స) ఏర్పాటు చేసిన వ్యవస్థను వారు భక్తిశ్రద్ధలతో అవలంబించడం ప్రారంభించారు.

యస్రిబ్‌లో ఆయన అనుచరులతో కలసి అల్లాహ్ ఆదేశాల ప్రకారం ఉత్తమమైన జీవన వ్యవస్థను నెలకొల్పసాగారు. ఆ రోజు నుంచి యస్రిబ్ పట్టణాన్ని 'మదీనతున్నబీ' (అంటే ప్రవక్త పట్టణం)గా పిలువడం ప్రారంభ మయ్యింది [illegible] అంటున్నారు. (చదవండి దివ్యఖుర్‌ఆన్ : 8:30, 9:39

- కొందరు చరిత్రకారులు చెబుతున్నట్లు ప్రవక్త (స), ఆయన సహచరులు మక్కా నుంచి మదీనాకు పారిపోయి రాలేదు. ఇది పిరికితనంతో కూడుకున్న చర్య కూడా కాదు. ఉమర్ (రజి) చెప్పిన మాటల ప్రకారం: హిజ్రత్ అన్నది సత్యానికి, అసత్యానికి మధ్య విభజన రేఖ. ముస్లిములు తమ కేలండరును దాని ప్రకారం ప్రారంభించుకోవలసి ఉంది.
- వలస వెళ్ళే క్రమంలో విశ్వాసులు అనేక విధాలుగా త్యాగాలు చేయవలసి వచ్చింది. తమ కుటుంబాలను, ధనసంపదలను వదులుకుని వెళ్ళవలసి వచ్చింది. తమ కుటుంబ సభ్యులను, క్రూరంగా వ్యవహరించే అవిశ్వాసుల మధ్య వదలి వెళ్ళవలసి వచ్చింది. ఖురైషులు అనేకసార్లు పాల్పడిన దాడులను, దౌర్జన్యాలను భరించవలసి వచ్చింది. కాని దూర దృష్టితో చూస్తే, హిజ్రత్ అన్నది అజ్ఞానతకు వ్యతిరేకంగా తిరుగు బాటును



https://teluguislam.net

పటిష్టపరచడానికి ఉద్దేశించిన ఒక దృఢమైన పథకం అని తెలుస్తోంది. ఆ ప్రకారమే చివరకు ఇస్లాము విజయాన్ని సాధించింది.

- విశ్వాసులు వలసపోవడమన్నది చరిత్రలో కొత్త కాదు. ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) ఇరాక్ నుంచి సిరియాకు వలసవెళ్ళారు. ప్రవక్త మూసా (అ) ఈజిప్టు నుంచి సినాయికు, పలస్తీనాకు వలసవెళ్ళారు. ప్రవక్త ఈసా (అ) బెత్లెహేము నుంచి జెరుసలేముకు వలసవెళ్ళారు. నేడు ఆధునిక కాలంలోనూ ఇది జరుగుతోంది.
- ఇలా వలస వచ్చిన వారిని ఇస్లాము కాందిశీకులుగా పరిగణించదు. వారిని వలసవచ్చిన వారిగా, ముహాజిర్లుగానే దివ్యఖుర్‌ఆన్ ప్రస్తావించింది. వారు సత్యం కోసం వలసవచ్చిన వారు. మదీనాలో వారిని ఆహ్వానించిన వారిని అన్సార్లుగా ప్రస్తావించడం జరిగింది. అన్సార్లంటే ఇక్కడ సత్యానికి సహాయపడినవారని అర్థం. ఆ తర్వాత ముహాజిర్లు, అన్సార్లు లౌకికంగాను, ఆధ్యాత్మికంగాను ఈ పరిణామం వల్ల గొప్ప ప్రయోజనాలు పొందారు. విశ్వాసం విషయంలో దృఢంగా నిలబడిన వారికి లభించే ప్రతిఫలం ఇది.
- ప్రవక్త (స), అబూబకర్(రజి)లు తప్పించుకున్న విధానం ఇక్కడ గమనించదగినది. చక్కని పథకం ప్రకారం, ఎక్కడా ఎలాంటి పొరపాటు లేకుండా జాగ్రత్తపడ్డారు. వారు ఇంటిని వదలి వ్యతిరేక దిశలో ముందుగా ప్రయాణం చేశారు. తర్వాత ఒక గుహలో కొంతకాలం ఎవరికీ కనబడకుండా దాగి ఉన్నారు. మక్కా నుంచి సమాచారం తమకు చేరే ఏర్పాటు చేసుకున్నారు. కాలిగుర్తులు ఎవరికీ కనబడకుండా చెరిపివేయించారు.
- "ఎవరు అల్లాహ్ మార్గంలో వలసపోయారో, తరువాత చంపబడ్డారో లేక మరణించారో వారికి అల్లాహ్ మంచి ఉపాధిని ప్రసాదిస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే ఉత్తమ ఉపాధి ప్రదాత." (దివ్యఖుర్‌ఆన్ : 22:58)
- మహాప్రవక్త ముహమ్మద్ (స) అందుకే ప్రతి ముస్లిం ఒక ముహాజిరని వ్యాఖ్యానించారు. అంటే ముస్లిం చెడుల నుంచి దూరంగా వలస పోతాడు. ఇంటి నుంచి వెళ్ళకపోయినా మనిషిగా చెడులకు దూరం అవుతాడు.

https://teluguislam.net



# బద్ర్ యుద్ధం

కామన్ ఎరా, క్రీ.శ. 624



బద్ర్ (యుద్ధం)లో మీరు అత్యంత దయనీయస్థితిలో ఉన్నప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ఆదుకున్నాడు. కాబట్టి అల్లాహ్‌కు మాత్రమే భయపడండి.

**(ఖుర్‌ఆన్ 3 : 123)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ముహాజిర్లు మదీనాలో శాంతిగా బ్రతకసాగారు. కాని మక్కాలో ఖురైషుల దౌర్జన్యాలను వారు మరచిపోలేదు. వారు తమ ఇళ్ళూవాకిళ్ళు వదలి వలస పోయేలా చేసింది ఖురైషులే. అంతేకాదు, ముహాజిర్లు తమ ప్రియమైన కుటుంబ సభ్యులను కూడా మక్కాలో వదలి వచ్చారు. వారిని చూడాలన్న కోరిక కూడా ముహాజిర్లలో బలంగా ఉండేది. మక్కాలోని శత్రువులపై ఒత్తిడి తీసుకొచ్చే చర్య ఏదైనా చేపట్టడం అవసరమయ్యింది. ఖురైషుల వర్తకబిడారులు మక్కా నుంచి సిరియాకు వెళ్ళి వస్తుంటాయి. వాటిని అడ్డుకోవాలని ఆలోచించారు.

## సమాచార సేకరణ

హిజ్రత్ జరిగిన రెండవ ఏట ప్రవక్త (స) ఒక బృందాన్ని సమాచార సేకరణకు పంపించారు. ఆ బృందానికి జహష్ కుమారుడు అబ్దుల్లాహ్ నాయకత్వం వహించారు. మదీనా నుంచి బయలు దేరిన తర్వాత రెండు రోజులకు మక్కా-మదీనాల మధ్య ఉన్న తాయిఫ్ ప్రాంతంలోని నఖ్‌లా ప్రదేశానికి చేరుకోవాలని చెప్పారు. అక్కడికి వెళ్ళిన తర్వాత మాత్రమే చదవాలని ఒక లేఖను కూడా ఇచ్చారు. ఆ లేఖలో అబ్దుల్లాహ్‌కు ఏం చేయాలో వివరమైన సూచనలు చేశారు. ప్రవక్త (స) చెప్పిన విధంగా నఖ్‌లా



చేరుకున్న అబ్దుల్లాహ్, ఆ లేఖను చదివి తనతో వచ్చిన వారిని ఉద్దేశించి, “ప్రవక్త(స) నఖ్‌లాలో ఖురైషుల పథకాలేమిటో తెలుసుకోవాలని నన్ను ఆదేశించారు. మీకు ఇష్టం లేకపోతే బలవంతంగా మీతో ఈ పని చేయించవద్దని కూడా ఆదేశించారు” అని చెప్పారు. ఈ మాటలు విన్న బృంద సభ్యులు ఏమాత్రం సంకోచం లేకుండా తాము ప్రవక్త (స) చెప్పిన ప్రతీ పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని, తమకు అల్లాహ్‌పై, అల్లాహ్ ప్రవక్తపై పూర్తి విశ్వాసం ఉందని అన్నారు. బృందంలోని ఇద్దరు తమ శిబిరం వద్ద ఒంటెలకు కాపలాగా ఉండి పోయారు. కాని ఆ యిద్దరిని ఖురైషుల దళం ఒకటి చూసి వారిని నిర్బంధించింది.

## పవిత్ర మాసాల్లో అతిక్రమణలు

ఈలోగా అబ్దుల్లాహ్, అతని తోటి వారు ముందుకు వెళ్ళారు. తమ తోటి వారు ఇద్దరు ఖురైషుల నిర్బంధంలో ఉన్న విషయం వారికి తెలియదు. వారికి ఒక వర్తక బిడారు కనబడింది. మక్కా నుంచి ఒక్క రోజు ప్రయాణ దూరంలో ఆ బిడారు ఉంది. ఆ బిడారుపై దాడి చేయాలని వారు భావించారు. కాని వారిలో ఒకరు వారిస్తూ, అలా చేయడం వల్ల పవిత్ర మాసాల నియమాలు ఉల్లంఘించడం అవుతుందని చెప్పాడు. (జిల్‌హజ్, జిల్‌ఖాదా, ముహర్రం, రజ్జబ్ నెలల్లో అరబ్బులు నిర్యుద్ధ నియమాలను పాటిస్తారు. వర్తక బిడారుల కదలికలు సురక్షితంగా ఉండడానికి ఈ నియమాలు ఉపయోగపడేవి). కాని అబ్దుల్లాహ్, ఆయన తోటి వారు ఈ నియమాన్ని ప్రక్కన పెట్టి వర్తక బిడారుపై దాడి చేశారు. బిడారును తమ అధీనంలోకి తీసుకుని, ఖైదీలను వెంటబెట్టుకుని మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు.

ఈ విషయం తెలియగానే ప్రవక్త (స) ఆగ్రహించి, వారిని మందలించారు. తాను వారిని దాడులు చేయడానికి పంపలేదని, కేవలం సమాచార సేకరణకు మాత్రమే పంపించానని అన్నారు. ఆ దాడిలో లభించిన యుద్ధసొత్తు గాని, ఖైదీలను గాని స్వీకరించడానికి ఆయన నిరాకరించారు. అదృష్టవశాత్తు అల్లాహ్ నుంచి అవతరించిన ఒక ఖుర్‌ఆన్ వాక్యం ఈ సంక్షోభాన్ని నివారించింది.

నిషిద్ధ మాసంలో యుద్ధం చెయ్యటాన్ని గురించి ప్రజలు నిన్ను అడుగుతారు. వారికి ఇలా సమాధానం చెప్పు: “ఆ మాసంలో యుద్ధం చెయ్యటం మహా నేరమే. కాని అల్లాహ్ మార్గంలో అవరోధాలు

https://teluguislam.net



కల్పించటం, అల్లాహ్‌ను తిరస్కరించటం, అల్లాహ్ ఆరాధకులను 'మస్జిదె హరామ్'ను దర్శించకుండా ఆటంకపరచటం, అందులో ఉండేవారిని బయటికి గెంటి వెయ్యటం అల్లాహ్ దృష్టిలో అంతకంటే గొప్ప నేరం. ఇంకా, హింస ద్వారా ధర్మాన్ని అణచటం రక్తపాతం కంటే అత్యంత తీవ్రమైనది. మిమ్మల్ని మీ ధర్మాన్నుండి మళ్ళించ గలగటం వారికి సాధ్య పడితే, వారు అంతవరకు మీతో యుద్ధం చేస్తూనే పోతారు (ఈ విషయం బాగా అర్థం చేసుకోండి). మీలో ఎవరైనా తన ధర్మాన్ని పరిత్యజించి, అవిశ్వాస స్థితిలో మరణిస్తే, అతడు చేసిన మంచి పనులన్నీ ఇహపర లోకాలు రెండింటిలోనూ వృథా అవుతాయి. అటువంటి వారంతా నరక వాసులు. నరకంలోనే వారు శాశ్వతంగా ఉంటారు."(ఖుర్ఆన్ 2 : 217)

ఈ దివ్యఖుర్ఆన్ వాక్యం అవతరించిన తర్వాత ముస్లిములు చాలా ఆనందించారు. దాడిలో పాల్గొన్న ప్రవక్త (స)సహచరులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రవక్త (స) యుద్ధసొత్తును, ఖైదీలను స్వీకరించి అందరికీ పంచారు.

## ఖురైషుల ప్రతిస్పందన

దాడి గురించి తెలిసిన ఖురైషులు మండిపడ్డారు. వెంటనే ఖైదీలను విడుదల చేయాలని, సంపదను వాపసు చేయాలని వర్తమానం పంపారు. పవిత్ర మాసాల్లో దాడులకు పాల్పడినందుకు ముస్లిములను నిందించారు. కాని ప్రవక్త (స) వారి ఒత్తిడికి లొంగలేదు. మక్కా ఖురైషులు నిర్బంధించి ఉన్న ముస్లిము లను విడిచిపెడితే, తాము నిర్బంధించిన ఖురైషులను విడిచిపెడతామని తెలిపారు. వర్తక సామగ్రిని, సంపదను వాపసు చేసే ప్రసక్తి లేదన్నారు. ఖురైషులకు మరో మార్గం కూడా ఏదీ లేదు. కాబట్టి ఒప్పుకోక తప్పలేదు. ఈ దాడికి నాయ కత్వం వహించిన అబ్దుల్లాహ్‌కు ఈ సంశయం వదల్లేదు. ఆయన ప్రవక్త (స)తో, "ప్రవక్తా! మేము చేసిన పనిని అల్లాహ్ తన మార్గంలో చేసిన ప్రయత్నంగా పరిగ ణిస్తాడని ఆశిస్తున్నాను. ముజాహిదీన్లకు (అల్లాహ్ మార్గంలో నిరంతరం శ్రమించి నవారు) మాదిరిగా మాకు కూడా ఉత్తమ ప్రతిఫలం ప్రసాదిస్తాడని అనుకుంటు న్నాము" అన్నారు. అప్పుడు అవతరించిన దివ్యఖుర్ఆన్ వాక్యాలు ముస్లిము లకు ఊరటను కలిగించాయి. ఆ ఖుర్ఆన్ వాక్యాలు:



"విశ్వసించి, అల్లాహ్ మార్గంలో తమ ఇల్లూ వాకిలీ సయితం విడిచి జిహాద్ చేసేవారు దైవకారుణ్యం ఆశించటానికి అన్ని విధాలా అర్హులు. అల్లాహ్ వారి తప్పులను క్షమించి వారిని కరుణిస్తాడు."

(దివ్యఖుర్ఆన్ 2 : 218)

ఖురైషులకు సంబంధించినంత వరకు ముస్లిములు పవిత్ర మాసాలను ఉల్లంఘించారు. ఈ విషయాన్ని ప్రచారం చేసి ఇతర తెగలను ముస్లిములకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడానికి వారు ప్రయత్నం ప్రారంభించారు. ఇప్పుడు ఖురైషు లకు- తమకు మధ్య శాంతియుతంగా సమస్య పరిష్కారమయ్యే సూచనలు లేవన్నది ముస్లిములు గ్రహించారు. శత్రుత్వం అలాగే కొనసాగింది.

## వర్తక సామగ్రి నిండిన బిడారు

ఖురైషు నాయకుడు, హర్బ్ కుమారుడు అబూసుఫ్యాన్ సిరియా నుంచి వస్తున్నాడని, ఆయనతో పాటు పెద్ద వర్తక బిడారు, ధనసంపదలతో ఉందని ఒక రోజు ప్రవక్త (స) ముస్లిములకు తెలియజేశారు. ఈ వర్తక బిడారును అడ్డుకోండి, అల్లాహ్ మీకు దానిని ప్రసాదించవచ్చు అన్నారు. చాలా తక్కువ మంది ముస్లి ములు ఈ బిడారుపై దాడికి వెళ్ళారు. ఈ దాడిలో సాహసం లేదని చాలా మంది భావించారు. పెద్దగా ప్రతిఘటన ఉండదని అనుకున్నారు. కాని అబూసుఫ్యాన్ చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. తన బిడారుపై దాడి జరగవచ్చని భయపడ్డారు. అటుగా వచ్చే ప్రయాణీకులను ప్రశ్నించి సమాచారం సేకరించారు. ముస్లిములు దారికాచి ఉన్నారని గ్రహించారు. ఒక దళాన్ని పంపించి వారి గురించి సమాచారం సేకరించారు. అంతేకాదు, ఒక వార్తాహరుడిని పంపించి, మక్కాలోని ఖురైషులకు తన పరిస్థితిని, తన బిడారుపై దాడి జరిగే ప్రమాదాన్ని తెలియజేశారు.

## విచిత్రమైన కల

మక్కాలో అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడు అబ్బాస్ ఉండేవారు. ఆయన ప్రవక్త (స)కు చిన్నాన్న అవుతారు. కాని ఆయన ఇంకా ఇస్లామ్ స్వీకరించలేదు. అబ్బాస్ సోదరి ఆతికాకు ఒక విచిత్రమైన కల వచ్చింది. ఆ కలలో ఆమె, ఒంటెపై స్వారీ చేస్తున్న ఒక యోధుడిని చూసింది. ఆ యోధుడు సహాయం కోసం మూడు సార్లు బిగ్గరగా అరిచాడు. ఆ తర్వాత అతడు కాబా గృహం పైకెక్కి సహాయం కోసం

https://teluguislam.net



ఎలుగెత్తి అరిచాడు. ఆ తర్వాత అతడు ఒక పెద్ద కొండపై కనబడ్డాడు. ఒక పెద్ద శిలను క్రిందికి దొర్లించాడు. ఆ శిల దొర్లి, రాతిముక్కలు అన్ని దిశలకు ఎగిరి వచ్చి పడ్డాయి. ఈ సంఘటన నుంచి ఒక్క కుటుంబం కూడా తప్పించుకోలేక పోయింది. ఈ కల గురించి ఆమె అబ్బాస్‌కు చెప్పారు. అబ్బాస్ ఈ కల గురించి ఉత్బా కుమారుడు వలీద్‌కు చెప్పారు. అయితే దీని గురించి ఎవరికీ చెప్పవద్దని, ఇతరులకు తెలిస్తే తనను పరిహసిస్తారని అన్నారు. అయితే వలీద్ ఈ కల గురించి తన తండ్రికి చెప్పాడు. ఆ పిదప ఈ కల గురించిన వార్త తెగలోని చాలా మందికి తెలిసిపోయింది.

మరుసటి రోజు అబ్బాస్ కాబా గృహ ప్రదక్షిణ పూర్తి చేసిన తర్వాత, అబూ జహల్ ఆయన వద్దకు వచ్చి, "ముత్తలిబ్ కుటుంబంలో మీకు ఒక వ్యక్తి తాను ప్రవక్తనని చెప్పడంతో తృప్తి కలుగలేదా, ఇప్పుడు నీ ఇంట్లో కూడా ఒక మహిళా ప్రవక్త పుట్టుకొచ్చిందా ఏమిటి?" అన్నాడు ఎగతాళిగా. అబ్బాస్ జవాబిస్తూ, "నువ్వేం చెబుతున్నావో నాకు అర్థం కావడం లేదు" అన్నారు. అబూజహల్ మరింత గేలి చేస్తున్నట్లు, "నేను నీ సోదరి కల గురించి మాట్లాడుతున్నాను. మేము మూడు రోజుల పాటు చూస్తాము. ఈలోగా కలలో చూసింది జరుగుతుందో లేదో చూద్దాం. జరక్కపోతే, నీ వంశం అరబ్బుల్లో పెద్ద అబద్ధాలకోరు వంశంగా పరిగణిస్తాం" అన్నాడు. అబ్బాస్ తన సోదరికి అలాంటి కల ఏదీ రాలేదని అన్నారు. కాని ఆయన ఇంటికి వెళ్ళగానే ఆయన తెగ మహిళలు ఆయన్ను నిలదీశారు. "అబూజహల్ కారుకూతలను ఎందుకు భరించావు. వాడు మన తెగ పురుషులనే కాదు మహిళలను కూడా అవమానించాడు. నువ్వు ఒక పిరికివాడివ"ని నిందించారు. అబ్బాస్ ఆగ్రహంగా, "అల్లాహ్ సాక్షి, ఇప్పుడే వాడి వద్దకు వెళతాను. వాడు మళ్ళీ ఆ మాటలు చెబితే గట్టిగా బుద్ధి చెప్పి వస్తాను" అన్నారు.

ఈ సంఘటన జరిగిన మూడవ రోజున అబ్బాస్ కాబాగృహానికి వెళ్ళారు. అబూజహల్ కోసం చూశారు. వాడు కాస్త దూరంలో కూర్చుని కనబడ్డాడు. వాడిని చూడగానే అటుగా వేగంగా నడిచారు. కాని అబూ జహల్ వేగంగా ద్వారం వైపు కదిలాడు. కారణమేమంటే, అబూ సుఫ్యాన్ పంపించిన వార్తాహరుడు ద్వారం దగ్గర ఒంటెపై ఉన్నాడు. ఆ ఒంటె ముక్కు నుంచి రక్తం కారుతుంది. ఒంటెపై ఉన్న జీను కూడా తిరగబడి ఉంది. వార్తాహరుడి చొక్కా చిరిగిపోయి ఉంది.



ఏదో పోరాటం నుంచి వస్తున్నట్లు కనబడుతున్నాడు. ఆ వ్యక్తి సహాయం చేయండంటూ మూడుసార్లు అరిచాడు. "ఖురైష్ ప్రజలారా! అబూ సుఫ్యాన్ వర్తక బిడారులో ఉన్న మీ సామగ్రికి ప్రమాదం ముంచుకు వచ్చింది. ముహమ్మద్ ఆ సామగ్రిని అడ్డుకోబోతున్నారు. మీరు మీ సామగ్రి కాపాడుకోవడానికి తక్షణం వెళ్ళండి"అన్నాడు. ఈ సంఘటన తర్వాత ఆతికా కల నిజమే అయ్యింది. ఖురైష్‌లోని ప్రతి ఒక్క కుటుంబం ఈ కబురు వల్ల ఉలిక్కిపడింది.

## ఖురైష్‌ల సన్నాహాలు

దిగ్భ్రాంతికి గురైన ఖురైషులు తర్వాత తేరుకుని సన్నాహాలు మొదలు పెట్టారు. శక్తి ఉన్న ప్రతిఒక్కడు ఆయుధం చేతపట్టాడు. లేదా తన స్థానంలో పోరాడడానికి ఇంకొకరిని నియమించాడు. అలా ఒక్కొక్క కిరాయి యోధుడికి అయిదువేల దిర్హములు చెల్లించడానికి కూడా సిద్ధపడ్డారు. వాళ్ళు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఒక అనుమానం వచ్చింది. తాము మక్కా వదలి వెళ్ళడాన్ని అవకాశంగా తీసుకుని శత్రుతెగ ఖినాన వాళ్ళు మక్కాపై దాడి చేయవచ్చని అనుమానించారు. కాని ఖినాన తెగకు చెందిన మాలిక్ కుమారుడు సురాకా తమ తెగవాళ్ళు దాడి చేయరని హామీ ఇచ్చాడు. ఈ హామీ తీసుకున్న తర్వాత ఖురైషులు తమ బిడారును కాపాడుకోవడానికి బయలుదేరారు.

## ముస్లిముల ఏర్పాట్లు

ఈలోగా ప్రవక్త ముహమ్మద్ (స) నల్ల జెండాలు చేపట్టిన రెండు దళాలను తీసుకుని మదీన వదలి బయలుదేరారు. అబూతాలిబ్ కుమారుడు అలీ(రజి) ఒక దళానికి నాయకత్వం వహించారు. అన్సార్లు రెండవ దళంలో ఉన్నారు. అయితే వారి వద్ద సరిపడ సంఖ్యలో ఒంటెలు లేనందువల్ల ముహమ్మద్ (స), ఆయన సహచరులు వంతులవారీగా ఒంటెలపై స్వారీ చేశారు. దారిలో కనబడిన వారిని ప్రశ్నించి బిడారు గురించి సమాచారాన్ని సేకరించారు.

ఈ విధంగా వాళ్ళు సఫ్రా లోయకు చేరుకున్న తర్వాత ముహమ్మద్ (స) ఒక దళాన్ని సమాచారం సేకరించడానికి ముందుగా పంపారు. ఈ దళం జఫీరాన్ వద్ద ఆగింది. మక్కా ఖురైషులు పెద్ద సైన్యంతో బయలుదేరారన్న వార్త వారికి చేరింది. ప్రవక్త (స) వెంటనే ఈ కొత్త పరిణామం గురించి తన సహచరులతో చర్చించారు. ఉమర్ కుమారుడు మిక్దాద్ మాట్లాడుతూ, "ప్రవక్తా (స)! మీరు

https://teluguislam.net



ముందుకు సాగండి. అల్లాహ్ మీకు ఏం చెయ్యమని ఆదేశించాడో ఆ పని కానివ్వండి. మేమంతా మీతో ఉన్నాము. మేము బనీ ఇస్రాయీల్ వంటి వాళ్ళం కాదు. వాళ్ళు మూసా(స)కు చెప్పిన మాదిరిగా, 'నువ్వూ నీ ప్రభువూ పోయి పోరాడండి, మేము ఏం జరుగుతుందో చూస్తాము' అని చెప్పే వాళ్ళం కాదు. మేము, 'మీరూ మీ ప్రభువు ముందుకు సాగండి, మేమంతా మీతో పాటు ఉన్నామని' చెబుతున్నాం. మీకు సత్యాన్ని ఇచ్చి పంపించిన ప్రభువు ఎంత సత్యమైన వాడో మేము చివరి వరకు మీతో ఉండడం అంతే సత్యం" అన్నాడు.

ప్రవక్త (స) అతనికి ధన్యవాదాలు చెప్పి అతని కోసం ప్రార్థించారు. ఆ తర్వాత ఆయన అన్సార్ల వైపు తిరిగి వారి సలహా అడిగారు. అన్సార్లలో ముఆజ్ కుమారుడు సాద్ జవాబిస్తూ, "మీరు మా జవాబు కోసం చూస్తుంటే, ఓ ప్రవక్తా! మేము మిమ్మల్ని విశ్వసిస్తున్నాము. మీరు తీసుకువచ్చిన హితబోధ సత్యమైనదని విశ్వసిస్తున్నాము. దాని ప్రాతిపదికన మేము మీకు వాగ్దానం చేస్తున్నాము. మేము మీ మాట వింటాము, విధేయత చూపుతాము. కాబట్టి మీరు మీ ఇష్టమొచ్చిన నిర్ణయం తీసుకోవచ్చు" అన్నారు. ఈ జవాబు విని ప్రవక్త (స) చాలా సంతోషించారు. ఆయన ఆనందంగా, "పదండి ముందుకు సాగుదాం. మన ముందున్న రెండింటిలో ఒకదాన్ని అల్లాహ్ నాకు వాగ్దానం చేశాడు. వర్తక బిడారు కాని, ఖురైషుల సైన్యం కాని స్వాధీనమైన దృశ్యాన్ని నేను చూస్తున్నాను" అన్నారు.

## బెదరిపోయిన నౌకర్లు

వాళ్ళు బద్ర్ లోయకు చేరుకున్నారు. ప్రవక్త (స) తన సహచరులు కొందరిని దగ్గరలోని నీటిమడుగు వద్దకు పంపారు. అక్కడి నుంచి శత్రువుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని అన్నారు. అక్కడ వారికి ఖురైషులకు నీటిని మోసే ఇద్దరు నౌకర్లు కనబడ్డారు. వారిని బంధించి ప్రవక్త వద్దకు తీసుకువచ్చారు.

ప్రవక్త (స) ప్రార్థనలో ఉండడం వల్ల సహచరులు స్వయంగా ఆ నీరు మోసేవాళ్ళను ప్రశ్నించడం ప్రారంభించారు. వాళ్ళు ఏ తెగకు చెందినవారు, ఎక్కడికి వెడుతున్నారు వగైరా ప్రశ్నలు వేశారు. బందీలు తాము కేవలం నీటిని మోసే వాళ్ళం మాత్రమేనని మొత్తుకున్నారు. కాని వారి మాటలను కొందరు ముస్లిములు నమ్మలేదు. వారిని కొట్టి నిజం రాబట్టాలనుకున్నారు. ఈ దెబ్బలను తప్పించుకోవడానికిగాను వారు తాము అబూ సుఫ్యాన్ బిడారుకు చెందిన వాళ్ళమని చెప్పారు. ఈ జవాబుతో తృప్తిపడిన ముస్లిములు వాళ్ళను కొట్టడం ఆపారు. ఆ తర్వాత ప్రవక్త (స) ప్రార్థన ముగించి అక్కడకు వచ్చారు. "మీ బందీలు నిజం చెప్పినప్పుడు మీరు వారిని కొట్టారు. వారు అబద్ధం చెప్పినప్పుడు కొట్టడం మానేశారు" అన్నారు. బందీల వైపు తిరిగి, ఖురైష్ సైన్యం ఎక్కడ ఆగిందో చెప్పమన్నారు. దగ్గరలోని కొండ వద్ద వాళ్ళు విడిది చేశారని బందీలు చెప్పారు. ఖురైషులు రోజుకు ఎన్ని ఒంటెలను కోస్తున్నారని ప్రవక్త (స) ప్రశ్నించారు. బందీలు జవాబిస్తూ, తొమ్మిది లేదా పది ఒంటెలను రోజూ కోస్తున్నారని చెప్పారు. దీన్ని బట్టి శత్రువుల సంఖ్య తొమ్మిది వందల నుంచి వేయి వరకు ఉండవచ్చని ప్రవక్త (స) తన సహచరులకు తెలిపారు. అంటే మక్కాలో పోరాడే వాళ్ళు దాదాపుగా అందరూ వచ్చేశారు.



అటు అబూ సుఫ్యాన్ పంపించిన దళం కూడా సమాచారాన్ని సేకరించి ఆయన వద్దకు చేరుకుంది. ముస్లిముల సైన్యం బద్ర్ దగ్గరగా విడిది చేసిందని తెలిపింది. ఆయన వెంటనే ప్రయాణ మార్గాన్ని మార్చి, బద్ర్‌కు కుడి వైపుగా సాగిపోయే మార్గాన మక్కాకు శరవేగంగా ప్రయాణం కొనసాగించారు. ఈ మార్గాన ప్రమాదం నుంచి బయటపడిన సూచనలు కనబడిన వెంటనే ఆయన ఒక వార్తాహరుడిని ఖురైషుల వద్దకు సంపించారు. ఆ వార్తాహరుడు బద్ర్ వైపు సాగిపోతున్న ఖురైషు సైన్యాన్ని చేరుకున్నాడు. అబూసుఫ్యాన్ వర్తక బిడారు ఇప్పుడు క్షేమంగా ఉందని, ఎలాంటి సహాయం అవసరం లేదని వార్తాహరుడు సైన్యానికి తెలిపాడు.

## అబూజహల్ మొండితనం

ఈ సందేశం చేరుకున్న తర్వాత ఖురైష్ సైన్యానికి నాయకత్వం వహిస్తున్న అబూజహల్ తన సైనికులతో, "మనం వెనుదిరిగేది లేదు. మనం బద్ర్ చేరుకుందాం. విజయాన్ని సాధిద్దాం. అక్కడ మనం చాలా గొర్రెలను కోసి తినవచ్చు, కావలసినంత తాగవచ్చు. మన వినోదానికి నాట్యకత్తెలు ఉండనే ఉన్నారు. బద్ర్‌లో మనం అందరం సమైక్యంగా సాధించిన విజయాన్ని అరేబియా ప్రజలందరూ తెలుసుకుంటారు. మనం అంటే ఎల్లప్పుడూ భయపడతారు" అన్నాడు. షారిఖ్ కుమారుడు అల్ అఖ్నస్ ఈ మాటలతో ఏకీభవించలేదు. అతడు తన తెగ బనీ జుహ్రహ్ వారిని ఉద్దేశించి, "మనం కాపాడుకోవడానికి వచ్చిన సంపద ఇప్పుడు సురక్షితంగా ఉంది. కాబట్టి ఇప్పుడు మనం వెనక్కి తిరిగి

https://teluguislam.net



వెళ్ళి పోదాం. అనవసరపు అహంకారాలతో మన సమయాన్ని వ్యర్థం చేయవద్దు" అన్నాడు. ఆ తెగవాళ్ళు ఈ మాటలు విని వెనుదిరిగారు. అబూజహల్ అతని సైన్యం మాత్రమే మిగిలింది.

ముస్లిములు పంపిన సమాచార సేకరణ బృందం వెనుదిరిగి వచ్చి, అబూ సుఫ్యాన్ మార్గాన్ని మార్చి మక్కాకు వెడుతున్నాడని, కాని మక్కా వారి సైన్యం ఎదురు దిశగా దగ్గరకు వస్తుందని తెలిపారు. ముస్లిముల్లో కొందరు, "ఇప్పుడు మనం మదీనాకు తిరిగి వెళ్ళిపోవడం మంచిద"నుకున్నారు. శత్రుసైన్యానికి చాలా దగ్గరగా వచ్చినందువల్ల ఇప్పుడు ఈ అవకాశాన్ని వదలరాదని మరికొందరు భావించారు. ముస్లిములు బద్ర్ వద్ద ఉన్న ఒక నీటి ఊట వద్ద విడిది చేసి తమ తదుపరి కార్యాచరణ గురించి ఆలోచించసాగారు. యుద్ధం సందర్భంగా అల్లాహ్ ఆదేశంతో వర్షం కురిసింది. ముస్లిములు ఉన్న వైపు ఇసుక నేల గట్టిపడి వారికి మంచి ఆధారాన్ని ఇచ్చింది. పైగా ముస్లిములు ఎత్తు ప్రదేశంలో ఉన్నందు వల్ల అక్కడ కురిసిన వర్షం నేలను గట్టిగా చేయడమే కాక క్రిందికి ప్రవహించి, ఖురైషులు విడిది చేసిన ప్రదేశాన్ని ముంచెత్తింది. అక్కడ నేల బురద బురదగా మారి ఖురైషు సైన్యానికి కొత్త సమస్యలు సృష్టించింది.

ముంజిర్ కుమారుడు అల్ హుబాబ్ ప్రవక్త ముహమ్మద్ (స)తో, వర్షం నీరు క్రిందికి ప్రవహించకుండా అడ్డుకోవాలని, ఆ విధంగా శత్రువులకు నీటి సరఫరా లేకుండా చేయవచ్చని సూచించారు. ముస్లిం సైన్యం ఆ సలహా పాటిం చింది. దాంతో ఖురైషు సైన్యానికి మరిన్ని కష్టాలు వచ్చిపడ్డాయి.

ముఆజ్ కుమారుడు సాద్ ప్రవక్త (స)తో, "ప్రవక్తా! మీ కోసం కలపతో ఒక శిబిరం లాంటిది కట్టాలనుకుంటున్నాం అనుమతించండి, ఒకవేళ మనం ఈ యుద్ధంలో పరాజయం పాలయినా మీరు క్షేమంగా మదీనా చేరుకోవచ్చు, అక్కడ మా కుటుంబసభ్యులు మీకు కావలసిన భద్రత కల్పిస్తారు" అన్నారు. సాద్ కోసం ప్రవక్త ముహమ్మద్ (స) ప్రార్థించారు. కలప కట్టడం నిర్మించడానికి అనుమతిం చారు.

ఖురైష్ దళం ముస్లిముల సమాచారాన్ని సేకరించి, ముస్లిము సైన్యంలో కేవలం మూడు వందల మంది మాత్రమే ఉన్నారని, సైనిక సామగ్రి కూడా చాలా తక్కువగా ఉందని, కాని చాలా ఉత్సాహంగా ఉన్నారని తెలియజేసింది. ముస్లి ముల్లో ఉన్న ఉత్సాహం గురించి తెలిసిన ఖురైష్ సైన్యం ఒకింత ఆందోళనకు



గురయ్యింది. ఖురైష్ సైన్యంలో కాస్త తెలివిగా ఆలోచించేవారు, ఈ పరిణామాలు మంచివి కావని భయపడ్డారు. ముస్లిములు ఈ యుద్ధంలో కనుక గెలుపొందితే, ఇప్పటి వరకు అరేబియా వర్తక బిడారులకు నాయకులుగా వ్యవహరిస్తున్న ఖురైషులు తమ హోదా కోల్పోతారని కూడా భయపడ్డారు. రబీయా కుమారుడు ఉత్బా సైన్యానికి సలహా ఇస్తూ, "ఖురైషు ప్రజలారా! ఈ యుద్ధంలో మనం గెలుపొందినా మనకు దొరికేది ఏదీ లేదు. మనం మన తెగవారి రక్తాన్నే చిందిస్తాం. అందువల్ల మనం వెనుదిరిగి వెళ్ళిపోదాం పదండి" అన్నాడు. కాని ఆ మాటలు విన్న అబూజహల్ కోపంతో మండిపడ్డాడు. ఇంతకు ముందు ముస్లిములతో జరిగిన పోరాటాల్లో మరణించిన వారి గురించి చెప్పి రెచ్చగొట్టాడు. ప్రతీకారం తీర్చుకోకుండా వెళ్ళేది లేదన్నాడు. అతడి ప్రసంగంతో ఖురైషులు రెచ్చిపోయారు. ప్రతీకారం ప్రతీ ఒక్కడిలో బుసలుకొట్టసాగింది.

## యుద్ధం

సైన్యాలు రెండూ ముఖాముఖి అయ్యాయి. చెక్కతో కట్టిన తన శిబిరం నుంచి ప్రవక్త (స) శత్రుసైన్యాన్ని పరిశీలించారు. సంఖ్యలో ముస్లిములకన్నా చాలా ఎక్కువగా ఉన్నారు. మూడు రెట్లు ఉన్నారు. దాదాపు రెండు వందల మంది అశ్విక దళంలో ఉన్నారు. ముస్లిముల వద్ద ఉన్నది రెండే గుర్రాలు. శత్రు సైన్యం అన్నివిధాలా ముస్లిం సైన్యంకన్నా బలంగా ఉంది. ప్రవక్త (స) వెంటనే తన సహచరుల వద్దకు వెళ్ళి వారి ధైర్యస్థైర్యాలు పెంచడానికి మాట్లాడారు. వారితో యుద్ధప్రణాళిక చర్చించారు. తన ఆదేశం లేకుండా యుద్ధం ప్రారంభించ వద్దని వారికి సూచించారు. యుద్ధంలో విలుకాండ్రు మొదట దాడి చేయాలి. శత్రు సైన్యంపై శరపరంపర కురిపించాలి. ఆ తర్వాత ఆయన తన శిబిరానికి వెనుదిరిగి వచ్చారు. ఆయనలో ఆందోళన ఉంది. మోకాళ్ళపై కూలబడి, చేతులెత్తి ఆయన అల్లాహ్‌కు మొరపెట్టుకున్నారు. "అల్లాహ్! ఖురైషులు బలగర్వంతో, అహంకారంతో, అవిశ్వాసంతో నిన్ను సవాలు చేయడానికి, నీ సందేశాన్ని అబద్ధంగా నిరూపించడానికి వచ్చారు. ప్రభూ! నువ్వు నాకు వాగ్దానం చేసిన విజ యాన్ని ప్రసాదించు. ప్రభూ! ఈ రోజు కనుక నా యీ గుప్పెడు మంది ఓడిపోతే, నీ ఆరాధన చేసేవారు ఇక ఎవరూ ఉండరు" అని ప్రార్థించారు. ఆయన తన ప్రభువును వేడుకుంటూ, మొర పెట్టుకుంటూ అలాగే చాలాసేపు గడిపారు. ఆయన కప్పుకున్న దుప్పటి క్రిందికి జారిపోయింది. అబూబక్ర్ (రజి) ఆ దుప్పటిని

https://teluguislam.net



ఎత్తి, "ఓ దైవప్రవక్తా! మీరు ప్రభువును వేడుకున్న తర్వాత, వాగ్దానం చేసిన విజయాన్ని ఆయన తప్పక ప్రసాదిస్తాడు. విజయం తప్పక మీకు వశమవుతుంది" అన్నారు. అయినా ప్రవక్త (స) అలాగే ప్రభువు సన్నిధిలో విధేయతతో కూలబడి ప్రార్థిస్తూ చివరకు నిద్రలో జారుకున్నారు. నిద్రలో ముస్లిములు విజయం సాధించడాన్ని ఆయన చూశారు. ఈ విషయమై దివ్యఖుర్‌ఆన్ ఇలా తెలిపింది:

> **ప్రవక్తా(స)! ముస్లిములను యుద్ధానికి పురికొల్పు. మీలో గనక ఇరవై మంది స్థైర్యం కలవారు ఉంటే, వారు రెండొందల మందిని జయిస్తారు. ఇంకా అటువంటి వారు వంద మంది గనక ఉంటే వేయి మంది సత్యతిరస్కారులను జయిస్తారు. ఎందుకంటే, సత్య తిరస్కారులు బుద్ధిహీనులైన ప్రజలు.**
> ***(ఖుర్‌ఆన్ 8 : 65)***

ప్రవక్త (స) తన శిబిరం నుంచి బయటకు వచ్చి తన వారి వద్దకు చేరుకుని వారిని ప్రోత్సహించారు. తర్వాత కొంత మట్టి తీసుకుని శత్రువుల వైపు విసరి "గ్రుడ్డివారయి పోవుగాక" అన్నారు.

తన సహచరులను ఆజ్ఞాపిస్తూ ముందుకు కదలండని, ఒక్కుమ్మడిగా శత్రువుపై విరుచుకుపడాలని చెప్పారు. ముస్లిములు, "అహద్.. అహద్. అల్లాహ్ ఒక్కడే.. అల్లాహ్ ఒక్కడే" అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అల్లాహ్ వారికి బలం చేకూర్చడానికి దైవదూతలను పంపించాడు. విజయం తమదే అన్న అనుభూతిని వారప్పుడే పొందారు.

ముస్లిములు అత్యంత ధైర్యసాహసాలతో పోరాడారు. యుద్ధరంగంలో ఒక విచిత్రమైన దుమ్ము ఆకాశాన్ని అలముకోవడం వారు చూశారు. మృత్యుదూత శత్రుసైన్యం మధ్యన ఉండి వారి శరీరాల నుంచి ఆత్మలను వెలికితీస్తున్న దృశ్యంగా ఆ ధూళిమేఘం కనిపించింది.

## బిలాల్ (రజి) ప్రతీకారం

శత్రుసైన్యంలో బిలాల్ (రజి)కు తన మాజీ యజమాని కనిపించాడు. తనను నానావిధాలుగా చిత్రహింసలకు గురిచేసిన వాడిని చూడగానే ఆయన, "ఉమయ్యా! అవిశ్వాసుల నాయకుడా!" అంటూ అరిచారు. తనను అనేక రకాలుగా వాడు హింసలకు గురిచేసిన సంఘటనలు ఆయనకు గుర్తుకు వచ్చాయి. వాడి వైపు శరవేగంగా కదిలారు. వాడు భయపడి పారిపోవడానికి ప్రయత్నించాడు. "వాడు తప్పించుకుంటే నేను బ్రతకడం అనవసరం" అంటూ బిలాల్ (రజి)వాడి వెంట పడ్డారు. కాని ఇతరులు బిలాల్(రజి)ను అడ్డుకుంటూ, ఉమయ్యా వ్యవహారం తమకు వదిలేయమన్నారు. కాని బిలాల్ (రజి)తన శక్తినంతా కూడదీసుకుని ఉమయ్యా వైపు కదిలారు. వాడి వైపు లంఘించి ఒక్క వేటుకు నేలకూల్చారు.



చివరకు దుమ్ము తొలగిపోయిన తర్వాత చూస్తే యుద్ధరంగం అంతా కళేబరాలతో నిండి ఉంది. శత్రువుల శవాలను ఒక కందకంలో వేయించారు ప్రవక్త (స). ఆ తర్వాత వారిని ఉద్దేశిస్తూ, "కందకంలో పడిఉన్న వారలారా! మీరు నాకు ఎలాంటి బంధువులు? ఇతరులు నన్ను విశ్వసించినా మీరు మాత్రం నన్ను తిరస్కరించారు. ఇతరులు నాకు ఆశ్రయం కల్పించినా మీరు మాత్రం నన్ను బలవంతంగా నా ఇంటి నుంచి వెళ్ళిపోయేలా చేశారు. ఇతరులు నాకు సహాయం కోసం ముందుకు వచ్చారు కాని మీరు నాతో పోరాడారు. మీ ప్రభువు వాగ్దానం సత్యమైనదని ఇప్పటికయినా తెలిసిందా? నా ప్రభువు వాగ్దానం సత్యమైనదని నేనయితే గ్రహించాను" అన్నారు.

ప్రవక్త సహచరులు ఆయన్ను, "ప్రవక్తా(స)! మరణించిన వారికి చెబుతున్నారా!" అని ఆశ్చర్యంగా ప్రశ్నించారు. దానికి ప్రవక్త (స)జవాబిస్తూ, "మీరు విన్నట్లే వారు నా మాటలు వింటున్నారు. అయితే వాళ్ళు జవాబు చెప్పలేరంతే" అన్నారు. ఆ తర్వాత ప్రవక్త (స) ఆ కందకాన్ని మట్టితో నింపమన్నారు.

ప్రవక్త సహచరుల్లో ఒకరయిన అబూహుజైఫా తండ్రి శత్రుసైన్యం పక్షాన పోరాడి యుద్ధంలో మరణించారు. అబూహుజైఫా విచారంగా ఉండడాన్ని ప్రవక్త (స) చూశారు. ఆయనతో ప్రవక్త (స), 'అబూ హుజైఫా! నీ తండ్రి మరణం నిన్ను బాధిస్తోందని నాకు తెలుసు" అన్నారు. అబూ హుజైఫా (రజి) జవాబిస్తూ, "ప్రవక్తా(స)! నేను నా తండ్రి మరణం పట్ల బాధపడడం లేదు. ఆయన తెలివి, విచక్షణ, మంచితనం కలిగిన మనిషి. ఆ గుణగణాలు ఆయన్ను ఇస్లాం పరిధిలోకి తీసుకు వస్తాయని ఆశించాను. కాని ఆయన అవిశ్వాసిగా మరణించడమే నాకు చాలా బాధ కలిగిస్తోంది" అన్నారు. ప్రవక్త (స) ఆయన కోసం ప్రార్థిస్తూ ఆయన్ను దగ్గరకు తీసుకుని ఓదార్చారు.

https://teluguislam.net



ఈ విజయం ద్వారా అల్లాహ్ తమకు ప్రసాదించిన యుద్ధసొత్తు, బందీలను తీసుకుని అల్లాహ్‌కు ముస్లిములు కృతజ్ఞతలు అర్పించారు.

*( చదవండి దివ్యఖుర్‌ఆన్ : 2:217-218, 8:7-10)*

## గ్రహించవలసిన పాఠాలు

☛ విజయం పొందడానికి దివ్యఖుర్‌ఆన్‌లో ఉన్న విధానం, ప్రవక్త (స) అనేక పోరాటాల్లో ఆచరించి విజయాలు సాధించిన విధానం ఏమంటే :

1. పూర్తిగా అల్లాహ్‌ను నమ్ముకోవాలి. ఆయనే శక్తిసామర్థ్యాలు ప్రసాదించేవాడు.
2. అల్లాహ్‌ను, దైవప్రవక్త(స)ను పూర్తిగా విశ్వసించి విధేయత చూపాలి.
3. అవిశ్వాసాన్ని పూర్తిగా వదలివేయాలి.
4. పోరాటం అన్నది పూర్తిగా అల్లాహ్ కోసమే కావాలి. బలప్రదర్శన కోసమో, కీర్తిసంపదలు పొందడానికో కారాదు.
5. అనైక్యతను సృష్టించే చిన్న చిన్న వివాదాలకు దూరంగా ఉండాలి.
6. కష్టాలు ఎదురైనప్పుడు సహనం వహించాలి.
7. సంఖ్యాబలాన్ని చూసి, శక్తిసామర్థ్యాలను చూసి, వ్యక్తిగత సామర్థ్యం చూసుకుని గర్వించరాదు.
8. యుద్ధప్రణాళికను రూపొందించాలి. పథకాలు వేయాలి. సాధ్యమైనంతవరకు అవసరమైన సామగ్రిని సేకరించాలి.
9. శత్రువును ఎదుర్కుంటున్నప్పుడు దృఢచిత్తంతో ఉండాలి.
10. శత్రువు బలాధిక్యతను చూసి భయపడిపోరాదు.

☛ జిహాద్ అంటే అర్థం సత్యమార్గాన నిరంతరం సంఘర్షించడం. మనిషిలో అంతర్గతంగా ఉన్న, సమాజంలో ఉన్న చెడులకు వ్యతిరేకంగా, ఆధ్యాత్మిక విలువలు పెంచడానికి చేసే ప్రయత్నాన్ని 'జిహాద్' అంటారు. కేవలం ఈ క్రింది కారణాలతో మాత్రమే ముస్లిములు అల్లాహ్ కోసం చేసే యుద్ధంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడడానికి దిగవచ్చు:



1. తమ ధర్మాన్ని, తమ ధర్మం అవలంబించడానికి ఉన్న స్వేచ్ఛను కాపాడుకోవడానికి.
2. అణచివేతలకు గురయిన వారిని కాపాడ్డానికి.
3. అణచివేతను ప్రతిఘటించడానికి.
4. ఇస్లామీయ భూభాగాలను కాపాడడానికి.
5. ముస్లిములపై దాడులకు సహాయపడేవారిపై దాడి చేయడానికి.
6. ప్రాణాలను, గౌరవమర్యాదలను, సంపదను కాపాడడానికి.

☛ నిరాయుధులు, యుద్ధంలో పాల్గొనని వారు, స్త్రీలు, సాధారణ పౌరులు, పిల్లలు, వృద్ధులు, వికలాంగులపై దాడి చేసే అనుమతి ఇస్లాంలో లేదు. దోపిడీకి పాల్పడ్డం, పంటలు నాశనం చేయడం, పశువులు, ఆహార పదార్థాలు నాశనం చేయడం, విధ్వంసం సృష్టించడం వగైరా చేష్టలు ఇస్లాంలో నిషిద్ధం. అయితే, గూఢచారులు, ద్రోహులు, కపటులను శత్రువులుగా, పోరాటంలో ఉన్న శత్రువులుగా పరిగణించడం జరుగుతుంది.

https://teluguislam.net



## పరిహారం



దైవప్రవక్త (స) బద్ర్ యుద్ధ ఖైదీల నుంచి ధనాన్ని, వారి విద్యను పరిహారంగా గ్రహించి వారిని విడుదల చేశారు.

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

బద్ర్ యుద్ధంలో బ్రతికిబయట పడిన ఖురైషులు మక్కా దిశగా పారిపోయారు. కొందరు ఒంటరిగా, కొందరు జట్లుగా పారిపోయారు. చాలా మంది యుద్ధవీరులు మరణించారు. యుద్ధ సామగ్రి పూర్తిగా కోల్పోయారు. యుద్ధ సామగ్రి ఏమాత్రం లేని, స్వల్ప సంఖ్యలో ఉన్న ముస్లిముల చేతిలో వారు దారుణమైన పరాభవాన్ని ఎదుర్కొన్నారు. ముస్లిములు ఈ యుద్ధంలో అమరులైన తమ తోటి వారిని గౌరవలాంఛనాలతో సమాధి చేశారు. యుద్ధసొత్తును పంపిణీ చేశారు. అమరులైన కుటుంబాల వారికి వారి భాగాన్ని న్యాయంగా చెల్లించారు.

అయితే యుద్ధఖైదీల విషయంలో ఏం చేయాలన్నది తేలలేదు. ఇది ఒక సమస్యగా మారింది. ఈ సమస్య గురించి ప్రవక్త (స) తన సహచరులతో చర్చించారు. స్వయంగా నిర్ణయం తీసుకునే విజ్ఞత, శక్తిసామర్థ్యాలు ఆయనకు ఉన్నాయి. అయినా ఆయన సలహా మండలి విధానాన్ని పాటించేవారు. ఆ విధంగా భవిష్యత్తులో ముస్లిములకు ఒక మార్గదర్శక సూత్రంగా సలహా సంప్రదింపుల విధానాన్ని ఏర్పరిచారు. నియంతృత్వానికి దూరంగా ఉండేలా చేశారు.



అబూబక్ర్ (రజి) సలహా ఇస్తూ, ఖైదీలు ప్రవక్త తెగకు చెందినవారే కాబట్టి వారిని విడచిపెట్టి తన పలుకుబడిని పెంచుకోవాలని అన్నారు. కాని ఈ సూచనను ఉమర్ (రజి) ఒప్పుకోలేదు. వారందరూ ప్రవక్త (స)ను నానావిధాలుగా వేధించిన వాళ్ళనీ, మక్కా నుంచి ప్రవక్త(స)ను బహిష్కరించిన వాళ్ళనీ, వారందరినీ హతమార్చాలని ఆయన అన్నారు. ఎందుకంటే వాళ్ళు అవిశ్వాసుల నాయకులు కూడా, అల్లాహ్ వారిపై ప్రవక్త(స)కు విజయాన్ని ప్రసాదించాడు, వారు చెల్లించే పరిహారాల అవసరం ప్రవక్త(స)కు లేదు, కాబట్టి వారిని హతమార్చడమే మంచిదని తన అభిప్రాయం చెప్పారు. ప్రవక్త (స)అందరి అభిప్రాయాలు విన్నారు. తర్వాత నిర్ణయం తీసుకుందామని చెప్పి తన శిబిరానికి వెళ్ళిపోయారు.

కాస్సేపటి తర్వాత ఆయన తిరిగి వచ్చారు. “అల్లాహ్ కొందరి హృదయాలను మృదువుగా, కరిగిపోయేవిగా చేశాడు. కొందరి హృదయాలను కఠినంగా శిలల మాదిరిగా చేశాడు. అబూబక్ర్! నీ అభిప్రాయం ప్రవక్త ఇబ్రాహీమ్ అభిప్రాయాన్ని పోలి ఉంది. ప్రవక్త ఇబ్రాహీమ్, “నన్ను అనుసరించేవాడు నా వాడు, నన్ను కాదనేవాని విషయం, అల్లాహ్ కరుణామయుడు, దయామయుడు” అన్నారు. నీ అభిప్రాయం ప్రవక్త ఈసా అభిప్రాయాన్ని కూడా పోలి ఉంది. ప్రళయదినాన ఆయన తనను దేవునిగా మార్చిన వాళ్ళ పట్ల ఆందోళనగా ఇలా అంటారు: “ప్రభూ! నువ్వు వారిని శిక్షిస్తే, అప్పుడు కూడా వాళ్ళు నీకు దాసులే, కాని నువ్వు కనుక వారిని క్షమిస్తే నువ్వు అపార శక్తిసామర్థ్యాలు, అత్యంత వివేకం కలిగిన వాడివి” అన్నారు. ఉమర్! ఇక నీ అభిప్రాయం నూహ్ ప్రవక్త అభిప్రాయాన్ని పోలి ఉంది. ఆయన తన ప్రభువుతో, “ప్రభూ! భూమిపై ఒక్క అవిశ్వాసిని కూడా వదలొద్దు” అన్నారు. అలాగే నీ అభిప్రాయం మూసా అభిప్రాయాన్ని పోలి ఉంది. ఆయన ప్రభువుతో, “వారి సంపదలను సర్వనాశనం చేయి. వారు తమ బాధాకర మైన అంతాన్ని చూసే వరకు వారు విశ్వసించకుండా వారి హృదయాలను కఠిన శిలలుగా మార్చివేయి” అన్నారు.

ఆ తర్వాత ప్రవక్త (స) బందీలకు రెండు ప్రత్యామ్నాయాలు చూపారు. వారు పరిహారం చెల్లించి విడుదల పొందవచ్చని ప్రకటించారు. కాని అప్పుడు

https://teluguislam.net



ప్రవక్త (స) తీసుకున్న ఈ నిర్ణయం సరయిన నిర్ణయంకాదు. అందుకే ప్రవక్త(స)కు హెచ్చరికగా క్రింది దివ్యఖుర్‌ఆన్ వాక్యం అవతరించింది:

> "ధరణిలో శత్రువులను పూర్తిగా అణచనంతవరకు, తన వద్ద యుద్ధఖైదీలను ఉంచుకోవటం అనేది ఏ ప్రవక్తకూ తగదు. మీరు ప్రాపంచిక ప్రయోజనాలను కాంక్షిస్తున్నారు. కాని అల్లాహ్ (మీ కొరకు) పరలోకాన్ని కాంక్షిస్తున్నాడు. అల్లాహ్ శక్తిమంతుడు, వివేకవంతుడూను."
>
> *(దివ్యఖుర్‌ఆన్ 8 :67)*

ఈ ఆదేశానికి అర్థమేమంటే, శత్రువులను అయన కఠినంగా శిక్షించాలి. ఆ విధంగా ఇస్లామ్ శత్రువులపై తన ఆధిక్యతను నిరూపించాలి. వారికి అవకాశాన్ని, ప్రత్యామ్నాయాలను ఇవ్వడం పొరపాటు.

> "ప్రవక్తా! నీ అధీనంలో బందీలుగా ఉన్నవారితో ఇలా అను: "మీ హృదయాలలో ఏపాటి మంచితనమైనా ఉన్నదని అల్లాహ్‌కు తెలిస్తే, ఆయన మీ వద్ద నుండి తీసుకున్న దానికంటే ఎంతో ఎక్కువగా మీకు ఇస్తాడు. మీ తప్పులను మన్నిస్తాడు. అల్లాహ్ మన్నించేవాడూ, కరుణించేవాడూను." *(దివ్యఖుర్‌ఆన్ 8 : 70)*

అయితే ప్రవక్త (స) ముందు తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయడం జరగలేదు. పరిహారం తీసుకుని విడిచిపెట్టడానికి అనుమతి ఇవ్వడం జరిగింది.

## కవి విన్నపం

బద్ర్ యుద్ధం తర్వాత యుద్ధఖైదీలను విడిచిపెట్టడం జరిగింది. కొందరిని పరిహారం తీసుకుని విడిచిపెట్టారు. కొందరిని పది మంది పిల్లలకు చదవడం వ్రాయడం నేర్పిన తర్వాత విడిచిపెట్టారు. ఆ విధంగా అవిశ్వాసుల నైపుణ్యాన్ని వినియోగించుకోవటం జరిగింది. పరిహారంగా డబ్బు పుచ్చుకునే బదులు వారి నుంచి విద్యా సేవలు పొందటం మేలని దైవప్రవక్త (స) భావించారు.

అబూ ఇజ్జా అల్ జుహమీ అనే ఖైదీని దైవప్రవక్త (స) ముందు హాజరు పరచటం జరిగింది. అతను మక్కా నగరంలో ప్రఖ్యాతి గాంచిన కవి. దైవప్రవక్త (స) ముందు అతను తన గోడు వెళ్ళబుచ్చుకున్నాడు. "దైవప్రవక్తా! నేను



కటిక పేదవాణ్ణి. నాకు చాలా మంది పిల్లలు ఉన్నారు. వాళ్ళను విచిడిపెట్టి నేను ఎక్కువ కాలం ఉండలేను. వాళ్ళకు ఆహార అవసరాలు సమకూర్చాలి. నా మీద దయతలచండి" అంటూ అతను అత్యంత దీనంగా వేడుకున్నాడు. దైవప్రవక్త (స) ఎటువంటి పరిహారం తీసుకోకుండానే అతన్ని వదలిపెట్టేశారు. అంతేకాదు, చాలా పెద్ద మొత్తంలో అతనికి ధనం కూడా ఇచ్చారు. ఆ కవి నమ్మలేనన్నట్లుగా చూస్తుండిపోయాడు. అతను ఊహించిన దాని కంటే ఎన్నో రెట్లు ఔదార్యం చూపారు దైవప్రవక్త (స). పరిహారం ఇచ్చి ఖురైషులు తమ ఖైదీలు కొంతమందిని విడిపించుకున్నారు. ఇదంతా చూస్తున్నప్పుడు అబూ సుఫ్యాన్ మనసు కోపంతో రగిలిపోసాగింది. యుద్ధంలో తమ ప్రజల చావుకు ప్రతీకారం తీర్చుకోవాలని ఖురైషు నాయకులు అతన్ని పురికొల్పసాగారు.

https://teluguislam.net



# ఖుబైబ్

## (అదీ కుమారుడు - చిత్రవధకు గురైన కవి)

(అల్లాహ్ ఆయన పట్ల ప్రసన్నుడగు గాక!)



"దైవప్రవక్త (స)కు ఒక చిన్న ముల్లు గుచ్చుకున్నా ఈ ప్రాణం సుఖంగా ఉండజాలదు" అన్నారు ఖుబైబ్ (రజి) మక్కా అవిశ్వాసులతో.

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

మక్కా- మదీనా నగరాల మధ్య ఉంటున్న ఒక తెగ తరఫున రాయబార బృందం ఒకటి దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చింది. తమకు ఇస్లాం ధర్మం బోధించేందుకు ఒక గురువును పంపించమని వారు దైవప్రవక్త (స)ను కోరారు. దైవ ప్రవక్త (స) వారి కోరికను మన్నించి అదీ కుమారుడు ఖుబైబ్ (రజి)ను వారి వెంట పంపించారు. ఖుబైబ్ (రజి) గొప్ప విద్యావంతులు. కవి. అంతే కాదు, బద్ర్ యుద్ధంలో పాల్గొని శత్రువు వెన్నులో వణుకు పుట్టించిన మహా సమర యోధులు కూడా.

అసలు ఆ రాయబార బృందం ఉద్దేశాలు మంచివి కావు. వాస్తవానికి వారు ఒక పథకంతో దైవప్రవక్త (స) వద్దకు వచ్చారు. ముస్లింలు తమ వెంట పంపే వ్యక్తిని మక్కా ఖురైషులకు అమ్మితే చాలా సొమ్ము ముడుతుందని వారు ఆశపడ్డారు. పథకం ప్రకారమే వారు ఖుబైబ్ (రజి)ని తాళ్ళతో కట్టి మక్కా వారికి అప్పగించారు. అందుకు మక్కా వారు చాలా పెద్ద మొత్తంలో సొమ్ము ముట్టజెప్పారు. మక్కా వారి తరఫున అబూ ఇహ్అబ్ కుమారుడు హిజ్ర్ ఆ మొత్తం చెల్లించాడు. అతను తమీమ్ తెగకు చెందినవాడు. అతని తండ్రి బద్ర్ యుద్ధంలో ముస్లింల చేతుల్లో మరణించాడు. తండ్రి మరణానికి ప్రతీకారం



తీర్చుకోవటానికి అతను ఖుబైబ్‌ను అధిక ధరకు కొన్నాడు. ఆయన్ని అత్యంత దారుణంగా, క్రూరాతి క్రూరంగా నరికి చంపేందుకు తన్‌యీమ్ ప్రాంతానికి తీసుకువెళ్ళాడు. తాళ్లతో బిగుతుగా, కదిలేందుకు కూడా వీలులేని విధంగా బంధించబడివున్న ఖుబైబ్ (రజి) హిజ్ర్‌ను ఉద్దేశించి, తనకు రెండు రకాతులు నమాజ్ చేసుకునేందుకు అనుమతించాలని కోరారు. హిజ్ర్ ఆయనకు అనుమతి ఇచ్చాడు. ఖుబైబ్ (రజి) త్వరగా రెండు రకాతులు నమాజ్ పూర్తి చేసుకున్నారు. నమాజు అనంతరం హిజ్ర్ వెంట వచ్చిన మక్కా వారిని ఉద్దేశించి ఆయన, "చావుకు భయపడి సుదీర్ఘంగా నమాజు చేస్తున్నాడని మీరు భావిస్తారనే ఆలోచన నాకు లేనట్లయితే నేను ఇంకా చాలా సేపు నమాజు చేసేవాణ్ణి" అన్నారు.

మక్కావారు ఆయన్ని ఒక స్తంభానికి కట్టేశారు. చివరగా ఆయనతో, "ఇస్లాంను విడిచిపెట్టు. మేము నిన్ను వదిలేస్తాం" అన్నారు. వారి మాటలు విని ఆయన, "మీరు మొత్తం ప్రపంచాన్ని నా కాళ్ళ దగ్గర పడేసినా నేను ఇస్లాంను వదలిపెట్టను"అని నవ్వుతూ బదులిచ్చారు. మక్కావారి ఆగ్రహం కట్టెలు త్రెంచుకుంది. తమ ఆరాధ్య దేవత అయిన 'లాత్' విగ్రహంపై ప్రమాణం చేస్తూ, "నువ్వు మా మాటను కాదంటే, దారుణంగా చంపేస్తాం" అన్నారు. "నా మరణం అల్లాహ్ మార్గంలో జరుగుతున్నప్పుడు, ఇక దాని గురించి చింతించాల్సిన పనిలేదు" అన్నారాయన. తన ముఖాన్ని దైవగృహం, కాబా వైపుకు తిప్పుకున్నారు. కాని మక్కా వారు బలవంతంగా ఆయన ముఖాన్ని మరో దిక్కుకు మరల్చారు. అప్పుడాయన దివ్యఖుర్ఆన్‌లోని ఈ వాక్యం పఠించారు:

> **"తూర్పు అయినా, పడమర అయినా, (ఏ దిక్కు అయినా) అల్లాహ్‌దే. మీరు మీ ముఖాన్ని ఏ దిక్కుకు త్రిప్పినా, అక్కడ మీకు అల్లాహ్ సమ్ముఖం లభిస్తుంది."** ***(దివ్యఖుర్ఆన్ 2 : 115)***

తర్వాత ఆయన అల్లాహ్‌ను ఈ విధంగా వేడుకున్నారు:

**"ఓ అల్లాహ్! ఇక్కడ చుట్టూ ఇస్లాం శత్రువులే నాకు కనిపిస్తున్నారు. ప్రవక్త (స)కు నా తరఫున శుభాశీస్సులు అందజేసేవారెవరూ కనిపించటం లేదు. ఓ అల్లాహ్! దయచేసి నువ్వు నా తరఫున ప్రవక్త (స)కు శుభాశీస్సులు అందజేయి".**

https://teluguislam.net



ఒక కథనం ప్రకారం ఆ సమయంలో దైవప్రవక్త (స) మదీనా నగరంలో తన సహచరులతోపాటు కూర్చొని వున్నారు. ఉన్నపళంగా ఆయన మగతలోకి వెళ్ళిపోయారు. కాసేపటికి తేరుకుని జిబ్రాయీల్ దూత తన వద్దకు వచ్చారనీ, ఖుబైబ్ తరపున తనకు శుభాశీస్సులు అందజేశారని తన వెంటవున్న సహచరులకు చెప్పారు.

అటు, ఖుబైబ్ (రజి)ను ఈటెలు ధరించి వున్న నలభై మంది బహుదైవారాధకులు చుట్టుముట్టారు. వాళ్ళల్లో ఒకడు, "బద్ర్‌యుద్ధంలో మన తండ్రుల్ని చంపిన వారిలో వీడూ ఉన్నాడు" అంటూ తోటివారిని రెచ్చగొడుతూ మాట్లాడాడు. ఖుబైబ్ (రజి) బిగ్గరగా, "ఓ అల్లాహ్! నీ ప్రవక్త సందేశాన్ని మేము ప్రజలకు చేరవేశాము. ఈ రోజు నా పట్ల ఇక్కడ ఏం జరుగుతుందో నీ ప్రవక్తకు తెలియజేయి. అల్లాహ్! వీరి సంఖ్యను తగ్గించు. వీరిని వధించు. నీ ఆగ్రహం నుంచి ఏ ఒక్కడూ తప్పించుకోకూడదు." అని ప్రార్థించారు.

ఖుబైబ్ (రజి) పెట్టిన శాపం వినగానే అబూ సుఫ్యాన్ కుమారుడు ముఆవియా వెనక్కి తగ్గారు. (ఈయన తర్వాత ఇస్లాం స్వీకరించారు). హిజామ్ కుమారుడు హకీమ్, ముత్ఆ కుమారుడు జుబైర్‌లు అక్కణ్ణుంచి పరుగులు తీశారు. మిగిలినవాళ్ళు మాత్రం తమ దగ్గరున్న ఈటెలతో ఖుబైబ్ (రజి)ను నిర్దాక్షిణ్యంగా పొడవసాగారు. ఆయన శరీరం నెత్తురోడసాగింది. ఆ స్థితిలోనే ఆయన తన ముఖాన్ని కాబాగృహం వైపు త్రిప్పి, "నా ముఖాన్ని కాబా గృహం వైపు త్రిప్పిన అల్లాహ్‌కు స్తోత్రములు. ఆ గృహాన్ని ఆయన తన కొరకు, తన ప్రవక్తల కొరకు, తన విశ్వాసుల కొరకు ఎన్నుకున్నాడు" అన్నారు.

ఖురైషుల నాయకుడైన అబూ సుఫ్యాన్ ఆయన మీద జాలిపడుతున్నట్లు నటిస్తూ, "చూడు! నువ్వు ఎలాంటి బాధల్లో చిక్కుకున్నావో! అక్కడ నీ ప్రవక్త ముహమ్మద్ మాత్రం తన ఇంట్లో సుఖంగా ఉన్నాడు. ఇప్పుడు నీ స్థానంలో ఆయన వుండి, నువ్వు నీ ఇంట్లో సుఖంగా ఉంటే బాగుంటుందని అనిపించటం లేదూ?!" అని అడిగాడు. ఖుబైబ్ (రజి) వెంటనే, "దైవప్రవక్త (స)కు ఒక చిన్న ముల్లు గుచ్చుకున్నా ఈ ప్రాణం సుఖంగా ఉండజాలదు" అన్నారు.

ఆయన మాటలు అబూ సుఫ్యాన్‌కు ఛెళ్ళుమనిపించాయి. ఒక మనిషి పట్ల ఎవరైనా అసలు, ఇంత అభిమానం కలిగి వుంటారా అని ఆశ్చర్యపోయాడు. దైవప్రవక్త (స)కు ఆయన అనుచరులు విశ్వాసులైనంతగా ప్రపంచంలో మరెవరూ విశ్వాసులు కారని ఆయనకు అర్థం అయింది.



# ఉహుద్ యుద్ధం

(క్రీ.శ.625)



ఆ సమయంలో మీరు పరారవసాగారు. ఇంకొకరిని పట్టించుకునే ధ్యాసే మీకు లేకపోయింది. ఆ క్షణంలో వెనుక నుంచి ప్రవక్త మిమ్మల్ని కేక వేస్తూనే వున్నాడు. కనుక మీకు దక్కకుండా పోయిన దాని గురించి, వాటిల్లిన నష్టాన్ని గురించి మీరు బాధపడకుండా ఉండటానికి అల్లాహ్ మీకు దుఃఖం వెంబడి దుఃఖం కలుగజేశాడు.

(ఖుర్ఆన్ 3 :153)

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

హిజ్రీ మూడో సంవత్సరం. ఖురైషులు మదీనాపై దాడి చేయటానికి సమర సన్నాహాలు చేయసాగారు. ఈ సన్నాహాలకు రబీయా కుమారుడు అబ్దుల్లాహ్, అబూ జహల్ కుమారుడు ఇక్రిమా, ఉమయ్యా కుమారుడు సఫ్వాన్‌లు నాయకత్వం వహించారు. వారిని యుద్ధానికి ప్రేరేపిస్తూ ఖురైషు స్త్రీలు కూడా యుద్ధ సన్నాహాల్లో తమ వంతు పాత్రను పోషించారు. అపార యుద్ధ సామగ్రిని వెంటబెట్టుకొని వారు ప్రవక్త నగరం వైపు కదం తొక్కారు. అదను చూసి మదీనాపై దాడి చేయటానికి ఉహుద్ పర్వతం దగ్గర కాపు కాశారు.

అటు మదీనాలో ప్రవక్త (స) తన ప్రజలను అప్రమత్తం చేశారు. శత్రువు దాడిని ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండమని చెప్పారు. కపట నాయకుని కుమారుడైన అబ్దుల్లాహ్ కూడా ఈ సందర్భంగా దైవప్రవక్త ఆలోచనను సమర్థించారు. తమ ధనప్రాణాలను సైతం అల్లాహ్ మార్గంలో ధారపోయాలని ఎంతగానో ఉవ్విళ్ళూరుతోన్న ఒక యువవర్గం మాట్లాడుతూ, "ఓ దైవ ప్రవక్తా! 'వీళ్లు మమ్మల్ని చూసి భయపడ్డారు' అని శత్రువులు గేలిచేసే పరిస్థితి రాకుండా, వారిని ఎదుర్కోవటానికి ఇప్పుడే మాకు అనుమతి

https://teluguislam.net



ఇవ్వండి అని కోరారు. అయితే అబ్దుల్లాహ్ (రజి) గత సంఘటనలను ప్రస్తావించి, ముస్లింలు మదీనాలో ఉండి శత్రువులను ఎదుర్కోవటమే మేలని వాదించారు. "మదీనావాసులు శత్రువుల్ని ఎదుర్కోవటానికి నగరం నుంచి బయటికి వెళ్ళినప్పుడల్లా వారికి నష్టమే జరిగింది, అలాగాకుండా శత్రువులు మదీనాపై దాడిచేసినప్పుడు మదీనావాసులే విజయం సాధించారు" అని అభిప్రాయపడ్డారు. ఈ వాదోపవాదాలు జరుగుతూ ఉన్నాయి. అంతలో జుమా నమాజుకు వేళ అయింది.

నమాజు తర్వాత ప్రవక్త (స) శిరస్త్రాణం, కవచం ధరించారు. మదీనా లోనే ఉండి శత్రువును ఎదుర్కోవాలనే తన తొలి అభిప్రాయాన్ని ఆయన మార్చుకున్నట్లు ఇది సూచించింది. అప్పుడు యువకులు, "దైవప్రవక్తా! మా వల్ల మీరు శత్రువుని ఎదుర్కొనే విషయంలో, తమ స్వంత అభిప్రాయాన్ని మార్చుకున్నట్లు అనిపిస్తోంది. మదీనాలో ఉండి యుద్ధం చేయాలన్నదే తమరి నిర్ణయం అయితే అలాగే కానివ్వండి. మనం ఇక్కణ్ణుంచే శత్రువు దాడిని ఎదుర్కొందాం" అన్నారు. దానికి ఆయన, "ఒక ప్రవక్త యుద్ధ కవచం ధరించిన తరువాత, ఇక యుద్ధతంత్రం ముగిసేవరకూ అతనికి కవచం విడిచే అనుమతి లేదు" అన్నారు.

తర్వాత ఆయన ఇబ్నె ఉమ్మె మక్తూమ్‌ను తన గైర్హాజరులో మదీనాకు నాయకునిగా నియమించారు. తాను తిరిగి వచ్చేవరకు మదీనా ప్రజల మంచి చెడ్డలను పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయనకు పురమాయించారు. వెయ్యి మంది సిపాయిలతో కూడిన ప్రవక్త సైన్యం ఉహుద్ పర్వతం వైపు బయలు దేరింది.

## పిరికిపంద

మార్గమధ్యంలో ఉబై కుమారుడైన అబ్దుల్లాహ్ ముందుకు వెళ్ళటానికి నిరాకరించాడు. మదీనాలో ఉండి శత్రువుని ఎదుర్కోవాలనే తన అభిప్రాయాన్ని ప్రవక్త గౌరవించలేదన్న సాకుతో తనవాళ్లను తీసుకొని వెనుదిరిగి వెళ్ళిపోవ టానికి నిశ్చయించుకున్నాడు. మొత్తం సైన్యంలో మూడో వంతు జనం అతని అనుంగు అనుచరులే ఉన్నారు. (నిజానికి మదీనాలో ఉండి శత్రువుని ఎదుర్కో వాలన్నది ప్రవక్త అభిప్రాయమే! పరిస్థితుల ఔచిత్యం రీత్యా దాన్ని ఆయన మార్చుకోవలసి వచ్చింది. అబ్దుల్లాహ్ ఆ అభిప్రాయాన్ని సమర్థించినవాడే గాని, మొదటగా ఆ అభిప్రాయాన్ని వెలిబుచ్చినవాడు కాదు). సైన్యాన్ని ఈ స్థితిలో విడిచిపెట్టి వెళ్ళిపోదలచుకున్నవారిని ఉద్దేశించి ఉమర్ కుమారుడు అబ్దుల్లాహ్ (రజి), "ప్రజలారా! నేను మీకు అల్లాహ్‌ను గుర్తు చేస్తున్నాను. ఈ రోజు మీరు మమ్మల్ని, మన ప్రవక్తను ఈ స్థితిలో వదలి వెళ్ళకండి" అని ఎంతగానో బతిమాలారు. కాని వారు ఆయన గోడును ఏ మాత్రం పట్టించుకో కుండా వెళ్ళిపోయారు. అసలే తక్కువ సంఖ్యలో ఉన్న ముస్లిం సైన్యం మరింత బలహీనపడిపోయింది.



## యుద్ధ ప్రణాళిక

సైన్యం తక్కువగా ఉన్నప్పటికీ ముస్లింలు ధైర్యం కోల్పోలేదు. మిగిలిన ఏడొందల మందిని వెంటబెట్టుకొని దైవప్రవక్త (స) కదనరంగం వైపు తరలివెళ్ళారు. శత్రువులకు - ఉహుద్ పర్వతానికి మధ్య సైన్యాన్ని మోహరిం చారు. వారి వెనుక పర్వతం దగ్గర ఒక కనుమ లాంటిది ఉంది. అటు నుంచి శత్రువులు వెన్నుపోటు పొడవకుండా దైవప్రవక్త (స) కొంతమంది విలుకాండ్రను ఆ స్థలంలో నియమించారు. ఎట్టి పరిస్థితిలోనూ ఆ స్థలం విడిచిరావద్దని వారికి గట్టిగా తాకీదు చేశారు. తాను ఆదేశించనంతవరకూ దాడికి దిగవద్దని ఇతర సైనికులందరికీ ఆయన పురమాయించారు.

మరోవైపు ఖురైషులు మూడువేల సైనికుల్ని, రెండు వందల వాహనా లను వెంటబెట్టుకొని వచ్చారు. తమ కంటే నాలుగురెట్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నవారితో పోరాడవలసిన క్లిష్ట సమయం ముస్లిములకు ఆసన్నమయింది. శత్రు సైన్యానికి కుడివైపు వలీద్ కుమారుడు ఖాలిద్ తన అశ్వదళానికి నాయ కత్వం వహిస్తుండగా, ఎడమవైపు అబూ జహల్ కుమారుడు ఇక్రిమా తన పటాలానికి నాయకత్వం వహిస్తున్నాడు. వీళ్ళిద్దరూ అరేబియాలో బాగా పేరెన్నికగన్న యుద్ధవీరులు!

## దైవప్రవక్త (స) ఖడ్గం

ప్రవక్త (స) ఒర నుంచి ఖడ్గం లాగి తన సైన్యాన్ని ఉద్దేశించి, "మీలో ఈ ఖడ్గాన్ని స్వీకరించి దీని హక్కుని నెరవేర్చగల వారెవ్వరు?" అని అడిగారు. అబూ దుజానా (రజి) ముందుకు వచ్చి, "దైవప్రవక్తా! ఏమిటి దీని హక్కు?"

https://teluguislam.net



అని అడిగారు. దానికి ప్రవక్త (స), "దీని పదును పోయే వరకూ, నువ్వు దీనితో శత్రువులను వధించాలి" అని చెప్పారు. అందుకు అబూ దుజానా (రజి) అంగీకరిస్తూ, "దైవప్రవక్తా! నేను ఆ ఖడ్గాన్ని తీసుకొని, దాని హక్కుని నెరవేరుస్తాను" అన్నారు. దైవప్రవక్త (స) నుంచి ఆయన ఖడ్గం స్వీకరించారు. దాని పిడికి ఒక గుడ్డ చుట్టారు. తర్వాత ఆ ఖడ్గం చేత బట్టుకొని సైనిక పంక్తుల మధ్య వీరునివలె నడుస్తూ కనిపించారు. అప్పుడు ప్రవక్త (స), "ఇటువంటి సందర్భాల్లో తప్ప గర్వాన్ని అల్లాహ్ ఎంతమాత్రం ఇష్టపడడు" అని చెప్పారు.

అటు ఖురైషు శిబిరంలో అబూ సుఫ్యాన్ తన సైన్యానికి జాగ్రత్తలు చెప్పటం ప్రారంభించాడు. తమ జెండాలను ఎట్టి పరిస్థితిలోనూ క్రింద పడనీయరాదని సైన్యంలోని పతాకధారులకు గట్టిగా తాకీదు చేశాడు. బద్ర్ యుద్ధంలో మొదట తమ పతాకధారులే బందీలుగా పట్టుబడిన వైనాన్ని వారికి గుర్తు చేశాడు. అన్ని జాగ్రత్తలు చెప్పిన తర్వాత మక్కా సైన్యాన్ని ముందుకు నడిపించాడు. సరిగ్గా వారి వెనుకే అతని భార్య ఉత్బా కుమార్తె హింద్ మహిళల సైన్యానికి నాయకత్వం వహిస్తూ ముందుకు నడిచింది. యుద్ధంలో పాల్గొన్న ఆ స్త్రీలు డప్పులు వాయిస్తూ, పాటలు పాడుతూ కదన రంగంలోకి పురుషులను పురికొల్పసాగారు.

## హంజా (రజి) వీరమరణం

శత్రువుల తరపున బాగా యుద్ధ నైపుణ్యం ఉన్న వారిలో వహ్షీ ఒకడు. వహ్షీ అంటేనే క్రూరుడు! ఇతడు జుబైర్ బానిస. దైవప్రవక్త (స) గారి బాబాయి హంజాను హతమార్చితే అతనికి బానిసత్వం నుండి స్వేచ్ఛ ఇవ్వటమేగాక, గొప్ప బహుమానం కూడా ఇస్తామని ఖురైషులు వాగ్దానం చేశారు. బహుమానానికి ఆశపడ్డ ఆ క్రూరుని కళ్లు హంజా (రజి) కోసం వెతికాయి. యుద్ధంలో హంజా మెరుపు వేగంతో తన ఖడ్గాన్ని ఝుళిపిస్తున్నారు. శత్రుసైన్యంలోకి చొచ్చుకుపోయి తన కరవాలంతో డజన్లమంది శత్రువుల్ని మట్టి కరిపిస్తున్నారు. అప్పుడే వహ్షీ హంజాపైకి తన ఈటెను విసిరాడు. అది హంజా ఛాతీలో దిగబడింది. హంజా నేలకొరిగారు.



## ప్రవక్త ఖడ్గపు బాధ్యత నెరవేరిన సందర్భం!

ప్రవక్త గారిచ్చిన ఖడ్గం చేతబట్టుకొని అబూ దుజానా (రజి) శత్రు సైన్యంలోకి చొచ్చుకుపోతున్నారు. ఆయన ఖడ్గపు ధాటికి ఒక్కొక్క శత్రువు ప్రాణాలు అనంత వాయువుల్లో కలసిపోతున్నాయి. సరిగ్గా అప్పుడే హింద్ చుట్టూ కలియజూసింది. తాను యుద్ధం నడిమధ్యలో నించొని వున్నట్లు ఆమెకు అర్థమయ్యింది. అదీగాక తను అబూ దుజానాకు దగ్గర్లో ఉంది. వెంట్రుకవాసిలో అబూ దుజానా ఖడ్గపు వేటు, ఆమె నుంచి తప్పింది. ఆయన వేగంగా ఖడ్గం ఝుళిపించుకుంటూ వస్తున్నారు. అప్పుడే హింద్ అటువైపు వచ్చింది. తన ఖడ్గం ఒక స్త్రీ మీద పడబోతుందని వెంటనే అబూ దుజానా (రజి) అర్థం చేసుకున్నారు. అంతే క్షణాల్లో ఆయన తన చెయ్యిని ఆపుకొని ఖడ్గం ప్రక్కకు మరలించారు. ఆ విధంగా తృటిలో ఆమె ప్రాణానికి ముప్పు తప్పింది. ఒక స్త్రీ రక్తంతో దైవప్రవక్త ఖడ్గపు ఆశయం భగ్నం కాకూడదని అబూ దుజానా (రజి) తలపోశారు.

యుద్ధం తొలి దశలో ముస్లింలు మక్కావారిని చిత్తుగా ఓడించారు. శత్రువులు నలువైపుల నుంచి ముట్టడించబడ్డారు. వారి వెన్నుల్లో వణుకు పుట్టింది. బ్రతుకు జీవుడా! అనుకుంటూ వారంతా యుద్ధ మైదానం వదలి పలాయనం చిత్తగించారు.

## యుద్ధసొత్తు మీద ఎగబడ్డ జనం

శత్రువులు పారిపోవటం చూసి, తాము ఇక గెలిచామనే భావనతో కొంతమంది ముస్లింలు సైనిక పంక్తులను విడిచిపెట్టి యుద్ధసొత్తు మీదికి ఎగబడ్డారు. తోటి సైనికులు యుద్ధసొత్తు కోసం పరుగులు తీయటం గమనించి, కనుమ దగ్గర కాపలాకాస్తున్న విలుకాండ్రు కూడా ఆ స్థానాన్ని వదలిపెట్టి, యుద్ధసొత్తు వైపు పరుగెత్తుకొచ్చారు. అప్పుడు ఆ స్థానం ఖాళీ అయింది. కనుమదారి నుంచి అడ్డు తొలగింది. ముస్లింలపై వెనుక నుంచి దాడి చేయటానికి శత్రువులకు మంచి అవకాశం లభించింది. శత్రువులు ఆ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకున్నారు. ఈ అనూహ్య పరిణామం ముస్లిం సైన్యాన్ని ఊపిరిసలపనీయకుండా చేసింది.

https://teluguislam.net



## శత్రువుల సాహసం!

అబూ తల్హా ఖురైషుల యుద్ధపతాకాన్ని పట్టుకొని ఉన్నాడు. యుద్ధంలో అతని చేతులు రెండూ తెగిపోయాయి. తెగిపోయిన ఆ చేతులతోనే అతను యుద్ధపతాకాన్ని గుండెలకు హత్తుకొని పైకెత్తి పట్టుకున్నాడు. అల్ఖమ కుమార్తె ఉమ్రా అటుగా పరుగెత్తుకొని వచ్చింది. ఆ పతాకం జారిపోకుండా గట్టిగా పట్టుకొని, ఖురైషు యువకుల్ని పిలిచింది. అరబ్బు పురుషులే కాదు, అరబ్బు స్త్రీలు కూడా మహా ధైర్యవంతులై ఉంటారన్న దానికి ఇదొక మచ్చుతునక!

ముస్లిం సైన్యాల పంక్తుల్లో కలకలం రేకెత్తింది. కనుమ దారి ఖాళీ అయింది. అంది వచ్చిన ఆ అవకాశాన్ని శత్రువులు జారవిడుచుకోలేదు. శత్రువులు పూర్తి బలంతో వెనుకనుంచి ముస్లింలపై దాడి చేశారు. ఛిన్నా భిన్నమై ఉన్న ముస్లింలపై మళ్ళీ పంజా విసరటం శత్రువుకు చాలా సులువు అయింది. అతి కొద్ది సమయంలోనే శత్రువులు ముస్లింలపై ఆధిక్యతను సాధించగలిగారు.

## వదంతి

ముస్లింలు ఇప్పుడు పూర్తిగా శత్రువుల అదుపులో ఉన్నారు. చాలామంది యుద్ధభూమి వదలి పారిపోయారు కూడా. కొంతమంది మాత్రం ధైర్యం కోల్పోకుండా పోరాడుతున్నారు. అప్పుడే దైవప్రవక్త (స) చనిపోయారనే ఒక వదంతి వ్యాపించింది. దాంతో ముస్లింలకు మిన్ను విరిగి మీదపడినట్లు అనిపించింది. నిజానికి దైవప్రవక్త (స) చనిపోలేదు. ఆ సమయంలో ఆయనకు గాయాలు మాత్రమే అయ్యాయి. బాగా రక్తస్రావం జరిగింది. ఆయన్ని శత్రువుల దాడి నుంచి రక్షించటానికి సహచరులు (సహాబా) చుట్టూ గుమిగూడి నిలుచున్నారు. వారిలో అబూబక్ర్, ఉమర్, అలీ, అబ్దుల్లాహ్ కుమారుడు తల్హా, అవ్వామ్ కుమారుడు జుబైర్ మొదలగువారు ఉన్నారు. ఇక ముస్లింలకు విజయం లభించే అవకాశాలు దాదాపు లేకపోయాయి. సహచరులు ప్రవక్త (స)ను పర్వతం చాటుకు తీసుకొని వెళ్ళారు. ఖలఫ్ కుమారుడు ఉబై వాళ్ళ వెంటపడ్డాడు. "ముహమ్మద్ ఎక్కడ? అతను క్షేమంగా ఉంటే నేను సుఖంగా ఉండలేను" అని అరవసాగాడు. అప్పుడు దైవప్రవక్త సహచరులొకరు, "దైవప్రవక్తా! తమరు గనక అనుమతిస్తే మాలో ఎవరో ఒకరు వెళ్ళి అతని



పని పూర్తిచేసి వస్తారు" అన్నారు. అందుకు దైవప్రవక్త (స), "అతన్ని రానివ్వండి" అన్నారు. ఉబై దగ్గరకు రాగానే, బరిసె ఎత్తి అతని మెడపైకి విసిరారు. అంతే అతను చచ్చి ఊరుకున్నాడు.

సహచరులు నీళ్ళు తీసుకొని వచ్చి నెత్తురోడుతున్న దైవప్రవక్త ముఖారవిందం కడిగారు. ఈ యుద్ధంలో ముస్లింలు బాగా కుదిపివేయ బడ్డారు. డెబ్భైరెండు మంది గొప్ప యోధుల్ని వారు కోల్పోయారు. నిజానికి ముస్లింలు ప్రారంభంలో విజయానికి చాలా చేరువలో ఉన్నారు. అయితే అల్లాహ్ తలంపు వేరుగా ఉంది. ఈ సందర్భాన్ని ఖుర్ఆన్ ఇలా స్పృశిస్తోంది:

> **"అల్లాహ్ మీకు చేసిన (సహాయం చేస్తాననే) తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. ప్రారంభంలో ఆయన ఆజ్ఞ ప్రకారం మీరే వారిని చంపుతూ ఉన్నారు. కాని మీరు బలహీనతను ప్రదర్శించినప్పుడు, మీ కర్తవ్యం విషయంలో పరస్పరం విభేదాలకు గురి అయినప్పుడు మీరు వ్యామోహపడిన వస్తువును (అంటే విజయధనాన్ని) అల్లాహ్ మీకు చూపగానే మీరు మీ నాయకుని ఆజ్ఞను ఉల్లంఘించారు - ఎందుకంటే, మీలో కొందరు ఇహాన్ని కోరారు, మరికొందరు పరాన్ని కోరారు-అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని పరీక్షించటానికి అవిశ్వాసులకు బదులుగా మిమ్మల్ని ఓటమిపాలు చేశాడు." *(దివ్యఖుర్ఆన్ 3 : 152)***

అబూ సుఫ్యాన్ ఒక చెట్టునెక్కి, "యుద్ధం సరిసమానం అయింది. ఆ రోజుకి ప్రతీకారం ఈ రోజు" అన్నాడు. ప్రవక్త (స) అతనికి సమాధానం ఇవ్వలేనంత బలహీన స్థితిలో ఉన్నారు. అందుకని ఉమర్ (రజి) బిగ్గరగా, "అల్లాహ్ అందరికంటే గొప్పవాడు, మహాశక్తిశాలి. మేమూ మీరూ సమానం కాము. ఎందుకంటే మేము మరణించిన తర్వాత స్వర్గానికి వెళతాం, మీరేమో నరకానికి పోతారు" అన్నారు. అబూ సుఫ్యాన్, "ఉమర్! దగ్గరకు రా" అని పిలిచాడు. నిర్భయంగా అతని దగ్గరకు వెళ్ళారు ఉమర్ (రజి). "ఉమర్! దైవం మీద ప్రమాణం చేసి చెప్పు, ముహమ్మద్ మా చేతుల్లో చచ్చాడు కదూ?" అని అనుమానంగా అడిగాడు. దానికి ఉమర్ (రజి) సమాధానంగా, "దైవం సాక్షి! ఆయన నిక్షేపంగా ఉన్నారు. నీ కారుకూతలేంటో కనుక్కొని రమ్మని ఆయనే నన్ను పంపించారు" అని చెప్పారు. ఆ మాట వినగానే అబూ సుఫ్యాన్‌కు,

https://teluguislam.net



ఇక తాము యుద్ధం వదలి వెళ్ళిపోవటమే లౌక్యం అనిపించింది. "త్వరగా ఇక్కణ్ణుంచి పారిపోండి" అని అతడు తన ప్రజలకు ఆదేశించాడు.

## శత్రువుపై నిఘా

చెల్లాచెదరైన సైన్యాన్ని ప్రవక్త (స) తిరిగి ఒక చోటకు సమీకరించారు. అలీ (రజి)ని సైన్యాధిపతిగా నియమించారు. పారిపోతున్న అబూ సుఫ్యాన్ సైన్యాన్ని వెంబడించమని అలీ (రజి)కు ఆదేశించారు. వారు గుర్రాలను మోహరించారో లేక ఒంటెలను మోహరించారో చూసి రమ్మని పంపించారు. ఒకవేళ వారు ఒంటెలను మోహరించి గుర్రాలను వదలిపెట్టినట్లయితే మక్కాకు తిరిగి వెళ్తున్నట్లనీ, అలాగాకుండా గుర్రాలను మోహరించి ఒంటెలను వదలిపెట్టినట్లయితే వారు తిరిగి మదీనాపై దండెత్తే ఉద్దేశ్యంతో ఉన్నట్లనీ ప్రవక్త (స) సూచించారు.

## స్త్రీల అనాగరిక ప్రవర్తన

యుద్ధంలో అమరగతి నొందిన వీరుల శవాలకు ఖనన సంస్కారాలు నిర్వహించటానికి దైవప్రవక్త (స) పర్వతంపై నుంచి క్రిందికి దిగివచ్చారు. కాని అక్కడి దృశ్యం చూసిన ప్రవక్త (స) హతాశులయ్యారు. ఆ సన్నివేశం ఆయన హృదయాన్ని కలచివేసింది. శత్రువులు యుద్ధంలో శవాల పట్ల చాలా అనుచితంగా వ్యవహరించారు. హింద్ ప్రవర్తన మరీ ఘోరంగా ఉండింది. ఆమె నిర్దాక్షిణ్యంగా హంజా (రజి) పొట్ట చీల్చి, పచ్చి కాలేయాన్ని బయటికి తీసి నమిలి మింగలేక ఉమ్మేసింది. ఇతర స్త్రీలు కూడా చాలా క్రూరంగా ప్రవర్తించారు. కొందరు ముస్లింల ముక్కుల్ని, చెవుల్ని కోసి మాలగా చేసుకుని మెడల్లో వేసుకున్నారు. హంజా మృతదేహాన్ని కప్పివేయమని ప్రవక్త (స) ఆదేశించారు. ఆయన కోసం దేవుణ్ణి ప్రార్థించారు. తర్వాత ప్రతి ఒక్క మృతుని కోసం దేవుణ్ణి ప్రార్థించారు. డెబ్భై రెండు మృతదేహాలను ఖననం చేశారు. శత్రు సైనికుల మృతదేహాలకు కూడా ఆయన ఖనన సంస్కారాలు చేయించారు.

శత్రువులను దైవప్రవక్త (స) హమ్రావుల్ అసద్ వరకు వెంబడించారు. మదీనాకు పది కిలోమీటర్ల దూరంలో హమ్రావుల్ అసద్ ఉంది. ముస్లింలు తమను వెంబడిస్తున్నారన్న సంగతి అబూ సుఫ్యాన్‌కు అర్థమయింది. భయం కొద్దీ అతను, సైన్యంతోపాటు మక్కా వైపు పలాయనం చిత్తగించాడు.



## గ్రహించవలసిన పాఠాలు

- అల్లాహ్ మార్గంలో అవసరమైనప్పుడు తప్ప, గర్వ ప్రదర్శనకు అనుమతి లేదు.
- యుద్ధ ప్రణాళికను ఎంత పకడ్బందీగా తయారు చేసుకున్నా సైన్యాధిపతి ఆదేశాలను పాలించకపోతే యుద్ధంలో ఓటమి ఖాయం.
- దైవవిధిని నిర్లక్ష్యం చేసి ప్రాపంచిక వస్తువుల మీద వ్యామోహం చూపితే దాని ఫలితం పరాజయమే అవుతుంది.
- వదంతులు ధైర్యవంతుల్ని సైతం భయభ్రాంతులకు లోనుచేస్తాయి.
- విపత్కర పరిస్థితుల్లో యుద్ధప్రణాళికలో భాగంగా రణరంగం నుంచి వెనక్కి తగ్గటం సమంజసమే. ఇది పిరికితనం క్రిందికి రాదు.
- శత్రువులు వెళ్ళిపోయిన తర్వాత కూడా దైవప్రవక్త (స) నిఘా కార్యక్రమాన్ని ఆపలేదు. వాళ్లను అనుసరించి వాళ్ళ కార్యకలాపాల్ని గమనిస్తూ ఉన్నారు.
- ఈ యుద్ధంలో శత్రు స్త్రీలు చాలా క్రూరంగా ప్రవర్తించారు.
- శత్రు సైనికుల మృత కళేబరాలను కూడా ఖననం చేయించటం దైవప్రవక్త (స) మంచితనాన్ని సూచిస్తోంది.

# పొరబాటుగా జరిగిన ప్రతీకారం



గోడమీద నుంచి ఒక పెద్ద బండరాయిని దొర్లించి తమను సహాయం కోరటానికి వచ్చిన దైవప్రవక్త (స)ను చంపాలని యూదులు కుట్రపన్నారు.

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఇస్లాంకు పూర్వం అజ్ఞాన కాలంలో ఉమయ్యా అద్దమ్రీ పెద్ద కసాయివాడని ప్రతీతి. అతను ఎంతోమంది అమాయక ప్రజల్ని అతి క్రూరంగా హత్య చేశాడు. అయితే అతని కుమారుడు అమ్ర్ మాత్రం అల్లాహ్‌పై అపారమైన నమ్మకం గల ముస్లింగా రాణించారు. ఆయన గొప్ప యుద్ధ వీరుడు కూడా.

ఉహుద్ యుద్ధం జరిగిన తరువాత అమ్ర్ ఒకసారి మదీనా నగరం వైపు వెళ్తున్నారు. మవూన బావి దగ్గరకు రాగానే బనూ అమ్ర్ తెగవారి చేతిలో డెబ్భై మంది ముస్లింలు అతి దారుణంగా హత్యచేయబడిన సంగతి ఆయనకు గుర్తొచ్చింది. (బనూ అమ్ర్ తెగవారు తమకు ఇస్లాం ధర్మం బోధించటానికి ధర్మబోధకుల్ని పంపించమని ఒకప్పుడు దైవప్రవక్త (స)ను కోరారు. దైవప్రవక్త (స) వారి కోరికను మన్నించి బోధకుల్ని పంపారు. నిజానికి వారు ముస్లింలను హత్య చేసే ఉద్దేశ్యంతోనే దైవప్రవక్త (స) ముందు ఆ ప్రతిపాదన పెట్టారు.) అప్పుడు జరిగిన సంగతులన్నీ అమ్ర్ గారికి ఒక్కొక్కటిగా గుర్తుకు రాసాగాయి. అప్పుడే ఆ తెగకు చెందిన ఇద్దరు మనుషులు ఆయనకు కనిపించారు. వాళ్లను చూడగానే అమ్ర్ ఆవేశాన్ని ఆపుకోలేక పోయారు. వెంటనే ఆ ఇద్దరిని కడతేర్చారు. దార్లో ఆయనకు



ఒక ముస్లిం ఎదురయ్యాడు. ఆయన చేసిన హత్య గురించి తెలుసుకున్నాడు. ఆ ఇద్దరిని చంపి అమ్ర్ చాలా పెద్ద పాపం చేసినట్లు ఆ ముస్లిం మాట్లాడాడు. కారణం, చనిపోయిన ఇద్దరూ దైవప్రవక్త (స)తో శాంతి ఒప్పందం చేసుకుని వున్నారు. ఈ సంగతి త్వరగా దైవప్రవక్త (స)కు తెలియపరచమని అతను అమ్ర్‌కు సలహా ఇచ్చాడు. అప్పుడు గాని అమ్ర్‌కు తాను చేసిన తప్పు ఎంతటి తీవ్రమైనదో బోధపడలేదు. క్షణం ఆలస్యం చేయకుండా దైవప్రవక్త (స) సన్నిధికి చేరుకొని జరిగినదంతా ఆయనకు వివరించారు. అది వినగానే దైవప్రవక్త(స) ముఖారవిందం కోపంతో ఎరుపెక్కింది. అమ్ర్‌ను తీవ్రంగా మందలిస్తూ, "నువ్వు ఇద్దరు విశ్వాసుల్ని హత్య చేశావు. ఇప్పుడు నేను వారి కుటుంబానికి వెంటనే రక్తపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అది కూడా వెంటనే చెల్లించాలి. లేకపోతే ఆ కుటుంబం వారు ప్రతీకారం తీర్చుకోవటానికి వస్తారు" అన్నారు. దురదృష్టవశాత్తూ, ఆ సమయంలో దైవప్రవక్త (స) దగ్గర డబ్బులేదు. అందుకని ఆర్థిక సహాయం నిమిత్తం యూద తెగ అయిన బనూ నజీర్‌ని సంప్రదించాలని ఆయన నిశ్చయించారు. ఈ తెగ మదీనా నగర శివార్లలో నివసించేది. దైవప్రవక్త (స) మదీనాకు వచ్చిన కొత్తలో వారు ఆయనతో ఒక ఒప్పందం చేసుకొని ఉన్నారు. ఒప్పందం అయితే చేసుకున్నారు గాని దైవప్రవక్త (స) పట్ల వారికి ఎక్కడలేని అసూయ, కోపం! అదీగాక అమ్ర్ (రజి) చేతుల్లో హతులైన కుటంబాల వారితో వీరికి మైత్రీ సంబంధాలు ఉన్నాయి.

అప్పుడు బనూ నజీర్ తెగకు నాయకుడు, అఖ్తబ్ కుమారుడు హుయ్. దైవప్రవక్త (స) తమ ప్రాంతానికి రానున్నారని అతనికి తెలిసింది. తమకు స్వాగతం పలకటానికి నగరం శివార్లలోకి వస్తున్నానని అతడు దైవప్రవక్త (స)కు కబురు పంపాడు. ముస్లింలు ఆయుధాలు లేకుండానే వచ్చారు. బనూ నజీర్ తెగతో తమకు శాంతి ఒప్పందం ఉంది కనుక వారి వల్ల తమకు ఎటువంటి హాని ఉండదని ముస్లింలు భావించారు. దైవప్రవక్త (స)ను కలవగానే యూదులు తమ మనసుల్లోని క్రోధాన్ని దాచిపెట్టి, ముఖాలకు నవ్వు పులుముకొని ఆయన్ని స్వాగతించారు. దైవప్రవక్త (స) మాత్రం చాలా ప్రశాంతంగా, హుందాగా వారికి అభివాదం చేశారు. తర్వాత తన రాక ఉద్దేశం వారికి వివరించారు. ఒక ముస్లిం వల్ల పొరపాటున ఇద్దరు అమ్ర్ తెగవారు హతమయ్యారనీ, వారితో శాంతి ఒప్పందం ఉన్న కారణంగా వారికి రక్తపరిహారం చెల్లించటం

https://teluguislam.net



తన విధిగా భావిస్తున్నాననీ, అయితే ప్రస్తుతం తన వద్ద డబ్బు లేనందువల్ల అప్పు అడగటానికి వచ్చానని ఆయన వారికి చెప్పారు. దానికి హుయ్ చాలా తియ్యగా మాట్లాడుతూ, "ఓస్, ఇదెంత పని! ముహమ్మద్! మీరు కాసేపు విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. మేము ఇప్పుడే ఆ డబ్బు మీకు సమకూరుస్తాం" అన్నాడు. దైవప్రవక్త (స), ఆయన సహచరులు పట్టణ ప్రహరీ గోడ ప్రక్కన డబ్బు కోసం వేచి ఉన్నారు.

## కుట్ర

దైవప్రవక్త (స), ఆయన సహచరులు నిరాయుధులుగా ఉండటం చూసి యూదులువారిని హతమార్చటానికి కుట్రపన్నారు. జహష్ కుమారుడు అమ్ర్ ఆ పాపం చేయటానికి ముందుకొచ్చాడు. ఒక పెద్ద రాతి బండను గోడపై నుంచి దైవప్రవక్త (స) మీదకు దొర్లించటానికి వాడు పూనుకున్నాడు. గురిచూసి దొర్లించాలనుకొని క్రిందికి తొంగిచూస్తే అక్కడ ఎవరూ కనిపించ లేదు. వాడు ఆశ్చర్యపోయాడు.

పరిస్థితుల్ని బేరీజు వేసుకున్న దైవప్రవక్త (స) అక్కడ వేచి ఉండటం సముచితం కాదని గ్రహించారు. మదీనాకు తిరిగి వచ్చేశారు. బనూ నజీర్ తెగవారు తమను హత్య చేయటానికి కుట్ర పన్నారనీ, అల్లాహ్ తనకు వహీ ద్వారా ఆ విషయం తెలియజేశాడని దైవప్రవక్త (స) సహచరులకు చెప్పారు. ముస్లింలందరిని సమీకరించి తమకూ - బనూ నజీర్ తెగవారికి మధ్య ఉన్న శాంతి ఒప్పందం భగ్నమయిందనీ, ఇకనుంచి తమకూ - వారికి మధ్య యుద్ధ వాతావరణం నెలకొని ఉంటుందనీ, కనుక ముస్లింలందరూ అప్రమత్తులై ఉండాలని ఆయన ప్రకటించారు.

## ద్రోహుల బహిష్కరణ

దైవప్రవక్త (స) బనూ నజీర్ తెగవారి వద్దకు మస్లమ కుమారుడు ముహమ్మద్‌ను పంపించి వెంటనే మదీనా విడిచిపెట్టి వెళ్ళాలనీ, లేదా వారిని మదీనా నుంచి బలవంతంగా తరిమివేయటం జరుగుతుందని చివరిసారిగా హెచ్చరించారు. దైవప్రవక్త (స) పంపిన వార్తాహరుడు వారి ముందు ఇలా ప్రకటించాడు: "ఓ బనూ నజీర్ ప్రజలారా! మీ నమ్మక ద్రోహం బట్టబయలు అయింది. మీ కుటిల ప్రయత్నాల గురించి అల్లాహ్ తన ప్రవక్తకు తెలియజేశాడు. ఇంతకు ముందు మదీనా నగరాన్ని వదలిపెట్టిన బనూ ఖైనుఖా తెగవారిలా మీరు కూడా ఇళ్లు ఖాళీ చేసి మీ ప్రాణాలను రక్షించుకోండి."



తమ బండారం బయటపడిందని బనూ నజీర్ తెగవారు అర్థం చేసుకున్నారు. నగరం విడిచి వెళ్ళిపోనటానికి సిద్ధమయ్యారు. కాని కపటుల నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉబై మాత్రం వారిని రెచ్చగొడ్తూ, "మీ ఇండ్లను వదలిపెట్టి వెళ్ళకండి. ముహమ్మద్‌కు వ్యతిరేకంగా మేము మీకు సహాయపడతాం. ఒకవేళ మిమ్మల్ని బలవంతంగా గెంటివేస్తే, మీతోపాటు మేమూ వస్తాం" అన్నాడు.

ముందుగా ఆ ప్రాంతాన్ని ముట్టడించమని దైవప్రవక్త (స) తన సైన్యాన్ని ఆదేశించారు. వారి ఆహార సరఫరాను నిలిపివేశారు. ఇక వారికి లొంగిపోవటం మినహా మార్గాంతరం లేకపోయింది. చాలా రోజుల వరకు వారు తమ ఇండ్లల్లోనే దాక్కొని ఉన్నారు. ముస్లింలు తలచుకుంటే కోటకు నిప్పంటించి ఎలుకల్ని రప్పించినట్లు వారిని బయటికి రప్పించగలిగేవారు. కాని దానివల్ల అమాయక స్త్రీలకు, పిల్లలకు, ముసలివారికి హాని కలిగే ప్రమాదం ఉంటుంది. అసలు రక్తపాతం జరగకూడదన్నది దైవప్రవక్త (స) అభిమతం. అందుకని ఆయన ముందుగా చుట్టప్రక్కల పొలాల్లో ఉన్న ఖర్జూర చెట్లు నరికివేయమని ముస్లింలను ఆదేశించారు. తెగవారి ఆహార వనరులు మూతపడ్డాయి. దైవప్రవక్త (స) ముందు లొంగిపోవటం మినహా తాము బతికి బట్టకట్టే మార్గం లేదని వారికి అర్థమయ్యింది. తమకు కొంత సమయం కావాలని వారు దైవప్రవక్త (స) దగ్గరికి రాయబారం పంపారు. మదీనా విడిచివెళ్ళటానికి సిద్ధమయ్యారు. అయితే తమ ఒంటెలు మోయగలిగినంత సామగ్రి వెంట తీసుకెళ్ళటానికి అనుమతించమని కోరారు. దైవప్రవక్త (స) వారి కోరికను మన్నిస్తూ ఆయుధాలు మాత్రం తీసుకెళ్ళవద్దని చెప్పారు. ఆ విధంగా వారు ఒక్క ఆయుధాలు వదలిపెట్టి మిగిలిన సామగ్రి తాము తీసుకెళ్ళగలిగినంత తీసుకొని మదీనా నగరం విడిచి వెళ్ళిపోయారు.

ఈ వృత్తాంతాన్నే ఖుర్‌ఆన్ క్లుప్తంగా ఇలా వర్ణించింది :

**"ఒకవేళ అల్లాహ్ దేశబహిష్కార విషయాన్ని వారి నొసట రాసి ఉండక**

పోతే, ప్రపంచంలోనే ఆయన వారిని శిక్షించి ఉండేవాడు. పరలోకంలో వారి కొరకు నరక శిక్ష ఉండనే ఉంది. వారు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తనూ వ్యతిరేకించినందు వల్లనే ఇదంతా జరిగింది. అల్లాహ్‌ను ఎవడు వ్యతిరేకించినా, వాడిని అల్లాహ్ చాలా కఠినంగా శిక్షిస్తాడు. మీరు ఏ ఖర్జూరపు చెట్లను నరికివేశారో లేక ఏ ఖర్జూరపు చెట్లను వాటి వ్రేళ్లతో యథాతథంగా ఉండనిచ్చారో, ఇదంతా అల్లాహ్ ఆజ్ఞతోనే జరిగింది. అల్లాహ్ ఈ ఆజ్ఞను దుర్మార్గులను అవమానపరచేందుకు ఇచ్చాడు." *(దివ్యఖుర్‌ఆన్ 59:3-5)*

### గ్రహించవలసిన పాఠాలు

- బాధ్యతా రాహిత్యంతో, అతిగా ఆవేశపడ్తూ వ్యక్తులు చేసే కొన్ని పనులు సమాజానికి హానికరం కావచ్చు. అటువంటి పనులను ఆపాలి. చూడండి! దైవప్రవక్త (స) ఆ అవాంఛనీయ సంఘటనను నివారించే పనిలో భాగంగా రక్తపరిహారానికి డబ్బులు సమీకరించటంలో ఏమాత్రం ఆలస్యం చేయలేదు.
- దైవప్రవక్త (స)ను హత్యచేయాలన్న శత్రువుల కుట్రను అల్లాహ్ భగ్నం చేశాడు.
- సంఘ విద్రోహులపై గట్టి చర్యలు తీసుకోవాలి.
- అమాయక ప్రజల, పశువుల రక్తపాతాన్ని దైవప్రవక్త (స) ఇష్టపడలేదు. పైగా తాము తీసుకెళ్లగలిగినంత సామగ్రి తీసుకెళ్ళే అనుమతి ఇచ్చి శత్రువుల మీద కూడా ఆయన ఎంతో కరుణ చూపారు.



# శత్రు మూకలు

## (అహ్‌జాబ్)

### కందక యుద్ధ పూర్వ రంగం



ఓ విశ్వాసులారా! అల్లాహ్ మీపై కురిపించిన దయానుగ్రహాన్ని కాస్త జ్ఞప్తికి తెచ్చుకోండి. మీపై సైనిక దళాలు దండెత్తి వచ్చినప్పుడు మేము వాటిపై ప్రచండమైన పెనుగాలిని, మీకు కానరాని సైన్యాలను పంపాము.
**(ఖుర్‌ఆన్ 33 : 9)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

బనూ నజీర్ తెగ నాయకుడు హుయయ్ బిన్ అఖ్‌తబ్ బహిష్కృత జీవితం గడుపుతున్నప్పటికీ దైవప్రవక్త (స) పట్ల, ముస్లింల పట్ల విరోధాన్ని మానుకోలేదు. మదీనా నగరం నుంచి ఇస్లాం ధర్మాన్ని కూకటివ్రేళ్ళతో పెకిలించివేసి మళ్లీ తన సొంతగడ్డపై పాగా వేయాలని ఎత్తులు వేయ సాగాడు. ఈ కుట్రలో భాగంగానే అతను దైవప్రవక్త శత్రువులందరినీ కలిపి ఒక కూటమిని తయారు చేయటం మొదలుపెట్టాడు. బహిష్కృత జీవితం గడుపుతున్న ఇతరులందరినీ సమీకరించి, ముహమ్మద్ పీడ వదిలించుకోవటానికి ఏకం కమ్మని వారికి పిలుపునిచ్చాడు. వారందరి తరపున ప్రతినిధిగా, ఖురైషులను కూడా తమ కూటమిలో కలుపుకునే ఉద్దేశంతో వారిని సంప్రతించటానికి మక్కా నగరం వెళ్ళాడు. అతని వెంట మరి కొందరు యూదులు కూడా మక్కా వెళ్ళారు.

మక్కాలో ఖురైషుల కార్యదర్శి వారితో మాట్లాడుతూ, "మీరు గ్రంథ ప్రజలు. ఈ విషయంలో మా కర్తవ్యం ఏమిటో మీరే నిర్ణయించాలి. అయితే ఒక మాటకు సమాధానం చెప్పండి; ఒకే దేవుణ్ణి పూజించే ముహమ్మద్ మతం కన్నా వివిధ దేవుళ్ల విగ్రహాలను

https://teluguislam.net



పూజించే మా మతం గొప్పదా కాదా?" అని అడిగాడు. దానికి యూదులు అతణ్ణి సమర్థిస్తూ, "మీ మతం విషయంలో మీరు ఎటువంటి సందేహానికి లోనుకావలసిన అవసరం లేదు. మీరు అనుసరిస్తున్న మతమే సరైనది. ముహమ్మద్ అనుసరిస్తున్న మతం సరైనది కాదు. మీ విగ్రహాలు తలచుకుంటే కీడు తలపెట్టగలవు. తలచుకుంటే వరాలు కూడా ప్రసాదించగలవు. ఒక్కడైన ముహమ్మద్ దేవునికి ఈ అధికారాలేవీ లేవు. అసలు ఇటువంటి సందర్భంలో మీరు మీ మెదడులోకి ఇటువంటి అనుమానాలు రానీయకండి. లేకపోతే ముహమ్మద్‌తో యుద్ధం చేయాలనే మీ నిర్ణయం చల్లబడే ప్రమాదముంది. బనూ ఖురైజా యూదులతోనూ, ఇతర అరబ్బు తెగలవారందరితోనూ మేము ఒక కూటమిని తయారు చేస్తాం, మనందరం కలసికట్టుగా ముహమ్మద్ కథను కంచికి చేర్చుదాం" అన్నారు.

మదీనాలో ముస్లింల సుస్థిరతను దెబ్బతీయటానికి మక్కావాసులు దీనిని తమకు అందివచ్చిన అవకాశంగా భావించారు. అంతే, వారు కూడా ఆ కూటమిలో చేరిపోయారు. ఆ తరువాత నాయకులందరూ కలసి గత్ఫాన్, అష్జా తెగలవారిని సంప్రతించారు. తర్వాత మదీనాలోని బనూ ఖురైజా తెగవారిని కూడా సంప్రతించారు (చూడబోతే ఈ తెగ అప్పటికి దైవప్రవక్త (స)తో శాంతి ఒప్పందం కుదుర్చుకుని ఉంది. కాని తర్వాత అది శాంతి ఒప్పందాన్ని భగ్నం చేసి ద్రోహానికి పాల్పడింది). కూటమి నాయకులు తమ తెగ వారిని కలవటానికి వస్తున్నారన్న సంగతి బనూ ఖురైజా నాయకుడు కాబ్‌కు తెలిసింది. అతను ఆందోళన చెందాడు. పెద్ద నాయకులను లోపలికి అడుగుపెట్టనీయకుండా ఇండ్ల తలుపులు మూసుకోవాలని అతను ప్రజలకు పురమాయించాడు. కూటమి నాయకులు అక్కడికి చేరుకున్నారు. హుయ్ నేరుగా కాబ్ ఇంటికి వెళ్ళి అతన్ని గట్టిగా పిలుస్తూ, "కాబ్, తలుపు తెరు. నేనొక శుభవార్త మోసుకొచ్చాను. అది నీ ప్రజలకు ఎంతో ఉపయోగపడు తుంది" అన్నాడు. కాబ్ దానికి సమాధానమిస్తూ, "లేదు, ప్రస్తుతం మాకూ-ముహమ్మద్‌కు మధ్య శాంతి ఒప్పందం నడుస్తోంది. అనవసరంగా ఈ శాంతిపూర్వక వాతావరణాన్ని నేను భగ్నం చేయలేను" అన్నాడు. దానికి హుయ్ అతన్ని రెచ్చగొడ్తూ, "ముహమ్మద్ నీ మతం వాడు కాదు. గత్ఫాన్, అష్జా తెగలవారితో నేనొక కూటమిని తయారు చేశాను. వాళ్ళూ వస్తారు. మనకిక



విజయం ఖాయం. మనమందరం కలసి బలమైన శక్తిగా రూపొందుతాం" అన్నాడు. "నీవు ఉత్తుత్తి వాగ్దానాలు చేస్తావు. ఏమైనా ముహమ్మద్‌తో చేసుకున్న ఒప్పందాన్ని నేను భగ్నం చేయను" అన్నాడు కాబ్. అతని సమాధానం విని హుయ్ నిరుత్సాహపడలేదు. ముహమ్మద్ (స) పైకి అతన్ని పురికొల్పుతూనే ఉన్నాడు. తన ఆలోచనే సరైనదని వితండవాదం చేశాడు. ఆఖరికి కాబ్‌ను కూడా కూటమిలో చేర్చటంలో కృతకృత్యుడయ్యాడు.

## కందక యుద్ధం

బనూ ఖురైజా తెగవారు ఒప్పందాన్ని భగ్నం చేశారన్న సంగతి ముహమ్మద్ (స)కు తెలిసింది. హుయ్ మరియు కాబ్ ఇద్దరూ కలిసి మదీనాపై దండెత్తాలనుకున్న వార్త కూడా ఆయన (స)కు చేరింది. కొందరు సహచరుల సలహాపై మదీనా చుట్టూ, శత్రువు లోనికి ప్రవేశించటానికి అనువుగా ఉన్న ప్రదేశాల్లో, బాగా లోతుగా ఉండే విశాలమైన కందకాలు త్రవ్వమని దైవప్రవక్త (స) ముస్లింలను ఆదేశించారు. సమరోత్సాహంతో ముస్లింలు ఈ కార్యం పూర్తిచేశారు. తర్వాత వివిధ ప్రదేశాల్లో ముస్లిం విలుకాండ్రు నియమించ బడ్డారు. అదే సమయంలో కొంత మంది ముస్లింలు విజయం తమకే వరిస్తుం దన్న అల్లాహ్ వాగ్దానం విషయంలో సందేహానికి లోనయ్యారు. నిజానికి ఈ పరిస్థితులు ముస్లింల సహనస్థయిర్యాలను పరీక్షించటానికి అల్లాహ్ తరఫు నుంచే సృష్టించబడ్డాయన్న విషయాన్ని వారు తెలుసుకోలేకపోయారు. వారి విశ్వాసం బలహీనపడిపోసాగింది. అది వారిని కపటుల మాదిరిగా మార్చి వేసింది. వారు పరస్పరం మాట్లాడుకుంటూ, "ఖైసర్ (పర్షియన్ రాజు), ఇంకా కిస్రా (రోమన్ చక్రవర్తి) నిధులు లభిస్తాయని ముహమ్మద్ (స) మనకు వాగ్దానం చేశారు. కాని మనకైతే ఏమీ కనిపించటం లేదు. ఆయన మనల్ని మూర్ఖుల్ని చేశారు" అనుకున్నారు. కొందరైతే మదీనా నుంచి పారిపోదామని కూడా భావించారు. ఏవో వంకలు చూపెడుతూ మదీనా విడిచిపెట్టి వెళ్ళటానికి అనుమతించమని దైవప్రవక్త (స)ను కోరసాగారు. "మా ఇండ్లు బార్లా తెరుచుకొని ఉంటాయి. శత్రువులు చాలా సులభంగా మా ఇండ్లల్లోకి జొరబడవచ్చు. వారు మమ్మల్ని నాశనం చేసేస్తారు" అని దీనంగా వేడుకున్నారు. (నిజానికి

https://teluguislam.net



అలాంటిది ఏమీ లేదు, జిహాద్‌లో పాల్గొనకుండా ఉండటం కోసం... వారు చూపెట్టిన ఒక వంక మాత్రమే.)

ముస్లింలు నలువైపుల నుంచి ముట్టడించబడ్డారు. దానికి తోడు పంక్తుల్లో ఉన్న కపటులు పలాయనం చిత్తగించారు. అందువల్ల ముస్లింల సంఖ్య ఇంకా తక్కువైపోయింది.

## ముసుగులోని మధ్యవర్తి

మసూద్ కుమారుడు నుఐమ్ గత్‌ఫాన్ తెగకు చెందినవారు. ఈయన చాలా తెలివైన మనిషి. దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళి, "దైవప్రవక్తా! నేను ఇస్లాం స్వీకరించాను. కాని చాలా మందికి ఈ విషయం తెలియదు. కావాలనే నేనలా చేశాను. ఇప్పుడు నేను ముసుగులో ఉండి, మధ్యవర్తిగా ప్రవర్తించి, ఒక ఎత్తు వేయాలని అనుకుంటున్నాను. మీరు దానికి అనుమతిస్తారా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స), "సరే, కానియ్యి. నీకొక్కడికే అనుమతినిస్తున్నాను. వేరెవ్వరికీ ఆ అనుమతి లేదు. అల్లాహ్ కూడా నీకు సహాయం చేస్తాడని ఆశిస్తున్నాను" అన్నారు.

నుఐమ్ అందరికంటే ముందు బనూ ఖురైజా తెగవారి దగ్గరకు వెళ్ళి, "నేను మిమ్మల్ని ఎంతగా ప్రేమిస్తానో, మీ నాయకుల్ని ఎంతగా అభిమానిస్తానో తెలుసు కదా?" అన్నారు. ఆయన ముస్లిం అయిన సంగతి యూదులకు తెలియదు. అందుకని వారు సమాధానంగా, "అవును, అందులో సందేహమే లేదు" అన్నారు. అప్పుడు ఆయన వారిలో అనుమానాలు రేకెత్తిస్తూ, "చూడండి! మీ సంపద, మీ స్త్రీలు, మీ పిల్లలు అందరూ మదీనాలోనే ఉన్నారు. ఒకవేళ యుద్ధంలో పరాజయమే గనక ఎదురైతే ఖురైషులు, గత్‌ఫాన్ తెగవారు మెల్లగా జారుకుంటారు. కాని మీ సంగతి అలా కాదు. మీరు దారుణంగా పట్టుబడతారు. అప్పుడు మీ జీవితాలు ముహమ్మద్ (స) దయాదాక్షిణ్యాల పైనే ఆధారపడి ఉంటాయి. మీరు ఒంటరిగానయితే ఆయనతో పోరాడలేరు. అది మీకూ తెలుసు" అని భయపెట్టారు.

నుఐమ్ మాటలు విని తమకు తగిన సలహా ఇవ్వమని ఆయన్నే కోరారు బనూ ఖురైజావారు. అప్పుడాయన, "మీ కూటమి తెగలవారు మిమ్మల్ని మోసం చేయకుండా జాగ్రత్తపడండి. వారి నాయకుల్లో కొందరిని మీ దగ్గర ఉంచేలా మీరు ఖురైషు, గత్‌ఫాన్ తెగలవారిపై ఒత్తిడి తీసుకురండి, సొంత భద్రత కోసం మీరు ఆ మాత్రం నిర్ణయాలు తీసుకోవటం చాలా అవసరం సుమా!" అంటూ మెల్లగా వారికి నచ్చచెప్పారు.



ఆయన మాటలు వారిపై బాగా పనిచేశాయి. వారు ఆయన సలహాను అంగీకరించారు. తర్వాత ఆయన ఖురైషుల దగ్గరికి వెళ్ళి వారి ముందు కూడా ఖురైజా తెగవారి ముందు చేసినటువంటి ప్రతిపాదననే చేశారు. పైగా వాళ్ళకి ఇంకో అబద్ధం కూడా చెప్పారు. తమ భద్రత కోసం తాము కొంత మంది ఖురైషు నాయకుల్ని తమ వద్ద ఉంచుకుంటున్నామనీ, తర్వాత వారిని మీకు అప్పజెబుతామనీ, మీరు వారిని చంపేయవచ్చు అని ఖురైజా తెగవారు ముహమ్మద్ (స)కు కబురు పంపినట్టు కూడా ఆయన వారితో అబద్ధమాడారు.

తర్వాత ఆయన తన సొంత తెగవారి దగ్గరికి వెళ్ళి వాళ్ళకు కూడా అదే సలహా ఇచ్చారు. ఖురైషులకు చెప్పిన అబద్ధమే వాళ్ళతోనూ చెప్పారు. ఆయన అల్లిన కథను అందరూ నమ్మారు. ప్రతీ తెగవారు స్వీయ భద్రత కోసం ఎదుటి తెగవారి మనుషుల్ని తమ వద్ద ఉంచుకోనిదే ఇతరుల్ని నమ్మలేని స్థితిని మొత్తానికి ఆయన వారి మధ్య సృష్టించగలిగారు.

అటు ఖురైషులు యుద్ధానికి సమాయత్తం కాసాగారు. మదీనా చుట్టూ త్రవ్వబడి ఉన్న కందకాలను గుర్రాలతో దాటలేమని తెలుసుకున్న ఖురైషులు తమ యుద్ధ ప్రణాళికలో మార్పులు చేసుకోసాగారు. ఇటు ముస్లిం విలుకాండ్రు కూడా వారిని ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నారు. ఒక శుక్రవారం సాయంత్రం ఖురైషులు అబూజహల్ కుమారుడు ఇక్రిమాను తమ ప్రతినిధిగా బనూ ఖురైజా వారి వద్దకు పంపారు. తాము ఒక సరికొత్త ప్రదేశంలో ఉన్న కారణంగా అక్కడి వాతావరణం తమ జంతువాహనాలను నాశనం చేసేట్టు ఉందనీ ఆయన వారితో చెప్పాడు. అందుకని యూదులు తమతో ఉండాలని కోరాడు.

దానికి సమాధానంగా బనూ ఖురైజా సర్దారు అయిన కాబ్, ఖురైషులు తమల్ని మోసం చేయకుండా ఉండేందుకుగాను వారు తమ నాయకులు కొందర్ని తమ వద్ద ఉంచాలన్నాడు. కాబ్ చేసిన ప్రతిపాదన ఖురైషు ప్రతినిధి వర్గానికి చాలా వింతగా తోచింది. తమ నాయకులను అపహరించేందుకే

https://teluguislam.net



బనూ ఖురైజా వారు ఈ కుట్ర పన్నారని ఖురైషు ప్రతినిధులు అనుమానించారు. అందుకని అతని ప్రతిపాదనను తిరస్కరించి తిరిగి వచ్చేశారు. వారి ఈ ప్రవర్తన అటు బనూ ఖురైజా వారిని కూడా అనుమానంలో ముంచెత్తింది. ఈ విషయం గత్ఫాన్ తెగవారికి తెలిసినప్పుడు వారు కూడా కూటమిలో తమకు తోడుగా ఉన్న ఇతర వర్గాలను అనుమానించటం మొదలుపెట్టారు. ఖురైషులు మరో ప్రతినిధి బృందాన్ని బనూ ఖురైజా వారి దగ్గరకు పంపించి ఈ సందేశం ఇచ్చారు:

"మేము మా నాయకుల్లో ఎవర్నీ మీకు అప్పజెప్పబోము. ఇష్టం ఉంటే మాతోపాటు యుద్ధానికి రండి. లేదంటే మీ ఖర్మ."

ఈ కబురు అందగానే బనూ ఖురైజా వారు నుఐమ్ తమను హెచ్చరించినట్టుగానే జరిగిందనుకొని, ప్రమాదం నుంచి బయటపడినందుకు లోలోపలే సంబరపడ్డారు.

శత్రు కూటమి యుద్ధం కోసం క్యాంపు వేసింది. ఆ రాత్రి ఒక భయంకరమైన పెనుగాలి వీచింది. దాంతో వారి పొయ్యిలన్నీ ఆరిపోయాయి. అన్నం కుండలు నేలపాలయ్యాయి. ఇది వారిని విపరీతమైన భయాందోళనలకు గురిచేసింది. క్యాంపును విరమించి మక్కాకు తిరిగి వెళ్ళిపోయేందుకు నాయకులు నిశ్చయించుకున్నారు. ఖుర్ఆన్ ఈ సందర్భాన్ని ఇలా వివరిస్తోంది:

> **"అల్లాహ్ అవిశ్వాసులను వెనక్కి తరిమాడు, వారు ఏ లాభాన్నీ పొందకుండానే, కడుపు మంటతో మరలిపోయారు. విశ్వాసుల పక్షాన యుద్ధం చేయటానికి అల్లాహ్యే సరిపోయాడు. అల్లాహ్ సర్వశక్తి సంపన్నుడు, సర్వసమర్థుడూను. ఈ దాడి చేసిన వారికి తోడ్పడిన గ్రంథ ప్రజలను తమ దుర్గాల నుండి అల్లాహ్ క్రిందికి తీసుకువచ్చాడు. వారి హృదయాలను భయంతో నింపాడు. ఈనాడు వారిలోని ఒక వర్గం వారిని మీరు చంపుతున్నారు. మరొక వర్గం వారిని మీరు ఖైదీలుగా చేస్తున్నారు. ఆయన మిమ్మల్ని వారి భూమికి, వారి గృహాలకూ, వారి ఆస్తులకూ వారసులుగా చేశాడు; మీరు ఎన్నడూ అడుగు మోపని ప్రాంతాన్ని ఆయన మీకు ఇచ్చాడు; అల్లాహ్ అన్నీ చేయగల సమర్థుడు."**
>
> ***(అల్ అహ్జాబ్ : 25-27)***



## గ్రహించవలసిన పాఠాలు

- కేవలం విగ్రహారాధకులైన ఖురైషుల మద్దతు కోసం వెంపర్లాడిన కపట యూదులు విగ్రహారాధనను పొగడటానికి గాని, ఏకదైవారాధనను కించపరచటానికి గాని వెనుకాడలేదు.
- నుఐమ్ చాలా తెలివైనవారు. ఇస్లాం కోసం ఆయన ఒక పెద్ద సైన్యం కూడా చేయలేని సేవ చేశారు.
- దైవవిరోధుల్ని మోసం చేయటం, వారు ఎటూ తేల్చుకోలేకుండా చేయటం, వారిలో భయాందోళనలు కలిగించటం సమ్మతమే.
- అల్లాహ్ తన విశ్వాసుల్ని అనూహ్యమైన పద్ధతుల్లో రక్షించి వారికి విజయాన్ని ప్రసాదించగలడు. వారు అల్ప సంఖ్యలో ఉన్నా, వారి దగ్గర తగినంత యుద్ధబలం లేకపోయినా సరే; సోవియట్ యూనియన్ లాంటి ఒక అగ్రరాజ్యం అఫ్ఘాన్ యోధుల చేతుల్లో చిత్తుగా ఓడిపోవటాన్ని ఇందుకు బలమైన నిదర్శనంగా తీసుకోవచ్చు.

# ఇస్లాం విజయారంభం



**ఆయనే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ, సత్యధర్మాన్నీ ఇచ్చి పంపాడు - ముష్రిక్కులకు ఎంత సహించరానిదయినా సరే ఇతర ధర్మాలపై దానికి ఆధిక్యతను వొసగటానికి!**
**(ఖుర్‌ఆన్ 9 : 33)**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

ఒకనాడు కలలో దైవప్రవక్త (స)కు ఇలా సెలవీయబడింది: "అల్లాహ్ సంకల్పిస్తే, మీరు తప్పకుండా మస్జిదె హరామ్‌లో పూర్తి శాంతితో ప్రవేశిస్తారు. మీరు శిరోముండనం చేయించుకుంటారు, వెంట్రుకలను కత్తిరించుకుంటారు. మీకు ఏ భయమూ ఉండదు. మీకు తెలియని విషయం ఆయనకు తెలుసు. కనుక ఆ స్వప్నం నిజం కాకముందే, ఆయన ఈ సమీప విజయాన్ని మీకు ప్రసాదించాడు."

*(దివ్యఖుర్‌ఆన్ : 48 : 27)*

నిద్రలేవగానే ఆయన ముఖారవిందం ఆనందంతో కాంతులీనసాగింది. తన సహచరులందరినీ ఆయన మస్జిద్ వద్దకు రమ్మని కబురు చేశారు. సహచరులు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా దైవప్రవక్త (స) చెప్పిన చోటికి చేరుకున్నారు. దైవప్రవక్త (స) తమల్ని అందరినీ ఒకేసారి రమ్మని కబురు పంపారంటే, ఎంతో ముఖ్యమైన సమాచారం తెలియజేయటానికే అయివుంటుందని వారికి బాగా తెలుసు. దైవప్రవక్త (స) తాను చూసిన కల గురించి సహచరులకు వివరించారు. ముస్లింలు నిర్భయంగా మక్కాలో ప్రవేశిస్తున్నట్టు తాను కలలో చూశానని చెప్పారు. కనుక ఉమ్రా యాత్ర చేసిరావటానికి మక్కా వెళ్ళేందుకు సిద్ధం కావాలని ఆయన



తన సహచరులకు ఆదేశించారు. కాబా గృహానికి గౌరవంగా బలి ఇచ్చేందుకుగాను జంతువులను కూడా వెంట తీసుకువెళ్ళాలని సూచించారు. ఈ యాత్ర గురించిన సమాచారం మదీనాలో, మదీనా చుట్టుప్రక్కల గ్రామాల్లో దావానలంలా వ్యాపించింది. మదీనాలో ఉంటున్న మక్కావాసులకు ఈ వార్త ఎనలేని సంతోషాన్ని కలిగించింది. కాబా గృహం పట్ల గౌరవభావంతో ఉమ్రా యాత్ర చేసేందుకు, తమ సొంత గడ్డపై మళ్ళీ అడుగుపెట్టే అవకాశం లభిస్తున్నందుకు వారు ఎంతగానో పొంగిపోయారు. మక్కాలో నిర్బంధించబడ్డ తమ భార్యాపిల్లల్ని, బంధు మిత్రుల్ని కలుసుకోబోతున్నామన్న వార్త ఆ వలస జీవుల మనసుల్ని పులకింపజేసింది.

మదీనా నగరం నలువైపుల నుంచి తండోపతండాలుగా, జన ప్రవాహం కదిలివచ్చింది. దైవప్రవక్త (స) కలను నిజం చేయటానికి, తమ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకోవటానికి ప్రజలు గుంపులు గుంపులుగా వచ్చి దైవప్రవక్త (స) దగ్గర చేరారు. ఆ విధంగా స్త్రీలు, పురుషులు అందరూ కలసి పదహారు వందల మంది యాత్రీకులు మక్కాకు బయలుదేరారు. దారిలో రెండు నగరాలకు మధ్య ఖుజాఅ తెగకు చెందిన బిషర్ అనే అయన్ని ముస్లింలు కలిశారు. దైవప్రవక్త (స) ఆయన్ని మక్కా పరిస్థితులు తెలుసుకుని రమ్మని పంపారు. ఆయన తిరిగి వచ్చి, "దైవప్రవక్తా! మీరు చెప్పినట్టుగానే నేను మక్కా వెళ్ళివచ్చాను. మీ కల గురించి, మీ మక్కా ప్రయాణం గురించి వారికి తెలిసిపోయింది" అని సమాచారం అందించాడు. మక్కా వారి స్పందన ఎలా ఉందని దైవప్రవక్త (స) అడిగారు. దానికి సమాధానమిస్తూ అతను, "వాళ్ళంతా ఏకమయి, మిమ్మల్ని మక్కాలోకి రానీయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నారండీ! మక్కాలో గొప్ప యోధుడైనటువంటి వలీద్ కుమారుడు ఖాలిద్ తన సైన్యంతో ఖిరాఅల్ ఖమీమ్ అనే చోట మిమ్మల్ని నిలువరించనున్నాడని మక్కా ప్రజలు చెప్పుకుంటుండగా విన్నాను" అని చెప్పాడు.

అప్పుడు దైవప్రవక్త (స), "ఖురైషుల పరిస్థితి కడు శోచనీయం. గత యుద్ధంలో వారు వినాశపు అంచులకు చేరుకున్నారు. అయినా గాని వారికి బుద్ధి రాలేదు. నేను వారిని వారి మానాన వదిలేస్తానని వారనుకుంటున్నారేమో? లేదు అలా ఎన్నటికీ జరగదు. అల్లాహ్ నన్ను, తన సందేశం ఇచ్చి పంపాడు. నా

https://teluguislam.net

https://teluguislam.net



అంతిమ శ్వాస వరకు నేను ఆయన మార్గంలో కృషి చేస్తూనే ఉంటాను." ఖాలిద్‌తో, అతని అశ్వదళంతో మనకు పనిలేదు. మనం యుద్ధానికి వెళ్ళటం లేదు. శాంతియుతంగా ఉమ్రా యాత్ర చేయటానికి మాత్రమే వెళ్తున్నాం" అన్నారు.

తర్వాత ఆయన, "ఖాలిద్‌కు ఎదురుపడకుండా మక్కా వెళ్ళేందుకు వేరే మార్గం ఎవరికయినా తెలుసా?" అని అడిగారు. అప్పుడు అస్లమ్ తెగకు చెందిన ఒకతను తనకు అటువంటి మార్గం తెలుసని చెప్పి, దైవప్రవక్త (స) కూర్చొని ఉన్న ఒంటె అల్ ఖస్వా కళ్ళెం చేతబట్టుకొని ముందుకు నడిచాడు. ఇతర ముస్లింలు కూడా అతన్ని అనుసరించారు. పర్వత ప్రాంతం గుండా కొంత దూరం ప్రయాణించి వారంతా ఒక రహదారికి చేరుకున్నారు.

## ఒంటె విచిత్ర ప్రవర్తన

దైవప్రవక్త (స) కూర్చొని ఉన్న ఒంటె అకస్మాత్తుగా ఆగిపోయింది. అడుగు ముందుకు వేయకుండా నడిబాటలో కూర్చుండిపోయింది. దైవప్రవక్త (స) ఒంటెను చాలా అదిలించారు. కాని లాభం లేకపోయింది. ఒంటె మొండికేసిందని కొంతమంది అన్నారు. కాని అసలు విషయం ఏమిటో దైవప్రవక్త (స)కు అర్థమయింది. తన సహచరులతో ఆయన, "లేదు, ఒంటె మొండికేయలేదు. మునుపటిలాగే అది ఇప్పుడు కూడా విధేయంగానే ఉంది" అని చెప్పారు. తర్వాత ఆయన అబ్రహా, అతని ఏనుగు మక్కాపై దాడి చేసిన సంగతిని సూచిస్తూ, "ఎవరయితే మక్కాలోకి ఏనుగును ప్రవేశించకుండా అడ్డుకున్నాడో ఆయనే ఈ ఒంటెను కూడా ముందుకు వెళ్ళకుండా ఆపాడు. ఇందులో ఓ మంచి సూచన కూడా ఉంది. ఎవరి చేతుల్లోనయితే ముహమ్మద్ ప్రాణం ఉందో ఆయన సాక్షి! ఖురైషులు నాతో చర్చలు జరపటానికి వస్తారు. విశ్వాసానికి విఘాతం రానంత వరకు వారు ఎటువంటి షరతులు పెట్టినా నేను వాటిని అంగీకరిస్తాను" అన్నారు.

మక్కాలోకి ప్రవేశించకుండా కొంత సమయం వేచి ఉండాలని దైవప్రవక్త (స)కు దైవికంగా సూచనలు అందాయి.

## హుదైబియా ఒప్పందం

దైవప్రవక్త (స) ఒంటె ఆగిన ప్రాంతం హుదైబియాగా పిలువబడుతుంది.



దైవప్రవక్త (స) అక్కడే వేచి ఉండాలని నిశ్చయించారు. చాలాసేపటి తర్వాత మక్కా వైపు నుంచి ఒక రౌతు వస్తున్నట్లు కనిపించాడు. అతను ఖుజాఅ తెగకు చెందిన వర్ఖా కుమారుడు బుదైల్. ఈ తెగకు ముస్లింలతో ఒప్పందం ఉంది. అతను దగ్గరకు రాగానే జనం అతన్ని ప్రశ్నించసాగారు. కాని అతను ఎవరికీ జవాబు చెప్పకుండా నేరుగా దైవప్రవక్త (స) గుడారం దగ్గరికి, "ముహమ్మద్! నేను మిమ్మల్ని కలవటానికి వచ్చానన్న సంగతి ఖురైషులకు తెలియదు. ఖురైషు నాయకులు నిన్న ఒక సమావేశం జరిపారు. అందులో మిమ్మల్ని మక్కాలోకి అడుగుపెట్టనీయరాదని ప్రతినబూనారు. మీకు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించారు. తాము పూజించే విగ్రహాల సమక్షంలోనే వారు ఒట్టేసుకున్నారు. దైవప్రవక్తా! మీతో నా మనవి ఏమంటే, మీరు చాలా జాగ్రత్తగా ఉండండి. వారు మీకు ఏ విధంగానైనా హాని కలిగించటానికి ప్రయత్నించవచ్చు" అంటూ ముస్లింలను అప్రమత్తం చేశాడు ఆ వ్యక్తి.

అందుకు దైవప్రవక్త (స) బదులిస్తూ, "బుదైల్! నేనిక్కడికి యుద్ధం కోసం రాలేదు. నిజానికి మేము పుణ్యక్షేత్రాన్ని సందర్శించటానికి వచ్చాము. అందుకోసం బలి ఇవ్వటానికి పశువులను కూడా వెంటతెచ్చాము. చూడు, మేమంతా ఇహ్రామ్ దుస్తుల్లోనే ఉన్నాము. వీలైతే నువ్వు ఈ విషయాలు ఖురైషులకు తెలియజెయ్యి. బహుశా నీ ద్వారా అల్లాహ్ రక్తపాతాన్ని ఆపివేయవచ్చు. వారి హృదయాల్లోని క్రోధం కొంచెమైనా తగ్గవచ్చు" అన్నారు.

బుదైల్ మక్కాకు తిరిగివెళ్ళి చూస్తే, ఖురైషులు ఇంకా ముహమ్మద్ (స) రాక గురించే చర్చించుకుంటున్నారు. బుదైల్ వారి దగ్గరికి వెళ్ళాడు. అతను ముహమ్మద్ (స)ను కలిసిన సంగతి వారికి ముందుగానే తెలిసిపోయింది. వారు అతని మీద మండిపడ్డారు. ముస్లింల గురించి తమ గుండెల్లో రగులుతున్న క్రోధాగ్నిని వెళ్ళగ్రక్కుతూ, "ఏమిటి, ముహమ్మద్ మళ్ళీ మా మీద దాడి చేసి, మమ్మల్ని అవమానపరచటానికి వచ్చాడా? ఉత్బా, షైబా, ఇబ్నె హిషామ్ లాంటి మా నాయకుల్ని చంపింది చాలదంటనా? వారి చావు దృశ్యం ఇంకా మా కళ్ళ ముందు నుంచి తొలగిపోలేదు. వారి భార్యలు ఇంకా వారి కోసం ఏడుస్తూనే ఉన్నారు. ఇంతలోనే మరో యుద్ధానికి తెగబడ్డాడా?" అని గాండ్రించారు.

బుదైల్ వారి మాటను మధ్యలోనే ఆపి, "నన్ను నమ్మండి. నేను కళ్ళారా చూసి వచ్చాను. వారంతా ఇహ్రామ్ దుస్తులు ధరించి ఉన్నారు. సాంప్ర

https://teluguislam.net



దాయిక ఖడ్గాలు తప్ప వారి దగ్గర ఇతర ఆయుధాలు కూడా ఏమీ లేవు. పైగా వారు బలి ఇవ్వటానికి ఎన్నో జంతువులను కూడా తీసుకువచ్చారు. వాళ్ళది ఒకే ఆశ, అది ఉమ్రా చేయటం" అని చెప్పాడు. ఈ ధర్మకార్యాన్ని నిర్వర్తించుకొని శాంతియుతంగా వెళ్ళిపోయేందుకు ముహమ్మద్ (స)ను అనుమతించమని కూడా అతను ఖురైషు సర్దారులను కోరాడు.

## మధ్యవర్తికి చీవాట్లు

తాము దూసిన ఖడ్గాలు శాంతించి తిరిగి ఒరల్లోకి వెళ్తాయని ఆశిస్తున్న ట్లయితే, వెంటనే తాను ఆ భ్రమ నుంచి తేరుకోవాలని ఖురైషులు బుదైల్‌ను హెచ్చరించారు. తమకు సలహాలు ఇవ్వటం మానుకొమ్మంటూ అతనికి చీవాట్లు పెట్టారు. అతని మాటల్ని విషపూరితమైనవిగా పేర్కొన్నారు. అతని తెగవారు ముహమ్మద్ (స)తో ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇక తమను తప్పుదారి పట్టించటం మానుకుంటే మంచిదని వారు అతన్ని హెచ్చరించారు.

## మరో రాయబారం

మక్కా ప్రజల నాయకుడైన అబూ సుఫ్యాన్ తన ప్రజలకు సలహా ఇస్తూ, "బనూ హులైస్ నాయకుడు, అల్‌ఖమా కుమారుడైన అల్ హులైస్‌ను మనం మన రాయబారిగా ముహమ్మద్ (స) వద్దకు పంపుదాం. అతను మన పొరుగువాడే. అదీగాక అతను మన కూటమి సభ్యుడు. అతను ముహమ్మద్ (స) ను మదీనాకు త్రిప్పి పంపించగల్గుతాడేమో" అన్నాడు. అబూ సుఫ్యాన్ సలహాను అందరూ అంగీకరించారు. అల్ హులైస్ తనను కలిసినప్పుడు ముహమ్మద్ (స) చాలా సంతోషించారు. హులైస్ చాలా సుగుణవంతుడు.

బలి ఇవ్వటానికి తెచ్చిన పశువులు ఎండకు అల్లాడిపోతున్న దృశ్యాన్ని దైవప్రవక్త (స) హులైస్‌కు చూపించారు. ఉమ్రా యాత్ర పూర్తి చేసుకొని, తొందరగా పశువులను బలి ఇచ్చి, మదీనాకు వెళ్ళిపోవాలని తాము ఎంత ఆతురతగా ఎదురు చూస్తున్నదీ దైవప్రవక్త (స) అతనికి వివరించారు. పశువుల దుస్థితిని చూసి హులైస్ చలించిపోయాడు. వెంటనే ఖురైషుల వద్దకు వెళ్ళి, పుణ్యక్షేత్ర యాత్ర చేసుకోవటానికి వచ్చినవారిని ఆపటం మహాపాపమని అన్నాడు. తమ ప్రదేశం కాని వాళ్ళయిన యుహ్‌జార్, హిమ్‌యర్ తెగలవారికి



తాము కాబా యాత్ర చేసుకోవటానికి అనుమతించిన సంగతిని గుర్తు చేస్తూ, ముహమ్మద్ (స) తాతగారు తమ గొప్ప నాయకుల్లో ఒకరనీ, ఆయన మనవణ్ణి మక్కాలో అడుగుపెట్టనీయకుండా నిలువరించటం భావ్యం కాదని చెప్పాడు. "ప్రజలను హజ్, ఉమ్రా యాత్రలు చేయకుండా ఆపటానికి నేను మీతో కూటమిలో చేరలేదు. ఒకవేళ మీరు ఈ విషయంలో మొండిగా ప్రవర్తిస్తే, నేను మన మధ్య ఉన్న ఒప్పందాన్ని త్రెంచుకోవాల్సి వస్తుంది" అని హెచ్చరించి అక్కణ్ణుంచి బయలుదేరాడు. ఖురైషులు అతన్ని ఆపుతూ, మరీ అంత కోప్పడ వద్దనీ, ఆలోచించుకోవటానికి తమకు కొంత సమయం ఇవ్వమని కోరారు.

ఖురైషులు మీమాంసలో పడిపోయారు. ఒక వైపేమో తాము ముహమ్మద్ (స)ను అడ్డుకుంటామని తమ పూజ్య దేవతల ముందు ఒట్టేసు కుని ఉన్నారు. మరో వైపు గత యుద్ధాల్లో ముస్లింల శక్తిసామర్థ్యాలనూ వారు చవిచూసి ఉన్నారు. బద్ర్ యుద్ధం రోజున ఒక చిన్న సైనిక పటాలం చేతిలో వారు తిన్న చావుదెబ్బ వారి జీవిత చరిత్రలో ఒక చీకటి పుటగా మిగిలి పోయింది. అలాగే ఉహుద్ యుద్ధంలో తాత్కాలికంగా తమది పైచేయి అయినా అందులోనూ వారికి ఒరిగిందేమీ లేదు. ఇటీవల జరిగిన కందక యుద్ధ భయానక పరిణామాలూ ఇంకా వారి స్మృతిపథం నుంచి చెరిగిపోలేదు.

అయితే ముస్లింలను అడ్డుకోకుండా మక్కాలోకి స్వాగతిస్తే, అది తమ పాలిట ఇంకా అవమానకరంగా పరిణమిస్తుందన్న భయం కూడా మరో వైపు ఖురైషులను వెంటాడుతూ ఉంది.

## మూడో మధ్యవర్తిత్వం

తాయిఫ్ నగర నాయకుడు, మసూద్ కుమారుడు నుఐమ్, ఖురైషులతో మాట్లాడుతూ, "మాకూ-మీకూ మధ్య ఒప్పందం ఉంది. నాకు అనుమతి ఇవ్వండి. నేను ముహమ్మద్(స)తో మాట్లాడివస్తాను" అన్నాడు.

ఖురైషులు వెంటనే అంగీకరించారు. నుఐమ్ దైవప్రవక్త (స)ను కలిశాడు. ఆయన గాంభీర్యాన్ని, ఆయన అవగాహనా శక్తిని చూసి అతను అవాక్కయ్యాడు. బెదురుతూనే ఆయన వంక తలెత్తి చూశాడు, ధైర్యం కూడగట్టుకొని, "ఓ ముహమ్మద్! నీ సొంత ప్రజలతోనే యుద్ధం చేయటానికి నువ్వు జనాన్ని కూడగట్టుకుని వచ్చినట్లున్నావు. నేను చెబుతున్నాను విను! ఖురైషులు ఎంతో

https://teluguislam.net



గౌరవ ప్రతిష్ఠలు కలవారు. వారు అవమానించదగ్గవారు కాదు. నువ్వు మక్కాలోకి అడుగుపెట్టరాదని వారు తమ దేవుళ్ళ ముందు ప్రతిజ్ఞ చేశారు. ఖురైషులు గొప్ప యుద్ధ వీరులన్న సంగతి నీకు తెలుసు. వాళ్ళతో యుద్ధం చేసి గెలవటం నీ వల్ల కాని పని. నువ్వు మక్కావారికి సహాయం చేయాల్సిందిపోయి, వారితో కయ్యం కొనితెచ్చుకుంటావెందుకు? నా మాట విని తిరిగి వెళ్ళిపో" అన్నాడు.

దైవప్రవక్త (స) ఎంతో ఓర్పుగా అతను చెప్పినదంతా విని, ఆఖరికి అతనికి సమాధానమిస్తూ, "నేను బుదైల్‌కు చెప్పాను. అల్ హులైస్‌కూ చెప్పాను. నీకూ అదే చెబుతున్నాను. నేను యుద్ధం చేయటానికి రాలేదు. నేనిక్కడికి ఉమ్రా యాత్ర చేయటం కోసం వచ్చాను. వారు గనక నా కార్యాన్ని పూర్తిచేసుకోనిస్తే మంచిది, లేదంటే అల్లాహ్ తరఫు నుంచి తదుపరి ఆజ్ఞ అందేవరకు నేనిక్కడే వేచి ఉంటాను" అన్నారు.

నుఐమ్ మక్కాకు తిరిగి వెళ్ళి, తాను ముహమ్మద్ (స)తో జరిపిన చర్చలు విజయవంతం కాలేదని సమాచారం అందించాడు. అసలు అతని ప్రతిస్పందన ఏమిటని ఖురైషులు అతన్ని గుచ్చి గుచ్చి అడిగారు. అందుకతను, "ప్రజలారా! వినండి. నేను ఎన్నో రాజ్యాల రాజులను, చక్రవర్తులను చూశాను. పర్షియా చక్రవర్తిని, అబీసీనియా రాజుని, ఎందరెందర్నో నేను సందర్శించాను. కాని ముహమ్మద్ (స) సహచరులు ఆయన్ని గౌరవించినంత గొప్పగా, ఇతర ఏ ప్రజలూ తమ రాజుని, చక్రవర్తిని గౌరవించటం నేనెన్నడూ చూడలేదు. వారు ఆయన నాయకత్వాన్ని మనసా, వాచా అంగీకరించి, తమ వ్యవహారాలను నడపటంలో ఆయనకు సంపూర్ణ అధికారాన్ని ఇచ్చారు. ఆయన అభిప్రాయాన్ని వారు మనసారా అంగీకరిస్తారు. కనుక మీకు నా సలహా ఏమంటే, ఈ విషయంలో మీరు ఓ ఒప్పందానికి రండి, ఎందుకంటే నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది." అన్నాడు.

అతని మాటలు విన్న తర్వాత ఖురైషులు తలపొగరుతో, "ఖురైషులు వారధి లాంటివారు. ఆ వారధిని ఎవరూ దాటలేరు. 'ఖురైషు' అంటే ఎవరూ అధిరోహించలేని పర్వత శిఖరం. మా జెండాలు ఎన్నటికీ తలదించవు" అన్నారు.

## ద్రోహం

ఖురైషులు ఒక సమావేశం ఏర్పాటు చేశారు. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ముస్లింల విషయమై తమ నిర్ణయం మార్చుకోరాదని అందులో వారు ప్రతిపాదన



చేశారు. అంతేకాదు, ముహమ్మద్ (స)పై ఆయన వెంట ఉన్న యాత్రికులపై రాత్రికి రాత్రి దాడి చేయాలని కూడా వారు ఆ సమావేశంలో నిర్ణయించుకున్నారు. గొప్ప సాహసవంతుడు, యువకుడు అయిన ఇబ్నె ముగ్రీని వారు ఈ పని కోసం నియమిస్తూ, "మనవాళ్ళలో మంచి విలుకాళ్లు అయిన వారిని కొంత మందిని వెంటబెట్టుకొని వెళ్ళి, ముస్లింలపై బాణాలు కురిపించు. వారు చెల్లాచెదరైపోయి మదీనాకు పారిపోవాలి" అని సూచనలిచ్చారు.

అదృష్టవశాత్తూ, ఆ రోజు రాత్రి దైవప్రవక్త (స), ముస్లింల శిబిరం చుట్టూ కొంతమంది కాపలాదార్లను నియమించారు. అటు ముగ్రీ అనుచరులు ముస్లింలపై దాడి చేయటానికి వచ్చారు. కాని వారు చివరికి, తాము తవ్విన గోతిలో తామే పడ్డారు. దాడి చేయటానికి వచ్చినవారు ముస్లింల చేతిలో బందీలయ్యారు. అయితే, ఇరుపక్షాల మధ్య వైషమ్యాన్ని తొలగించేందుకు దైవప్రవక్త (స) వారిని విడిచిపెట్టేశారు. మక్కావారితో శాంతిచర్చలు జరిపేందుకు హిరాష్‌ను పంపించారు. చర్చల కోసం వెళ్ళిన ఆ ప్రతినిధి వర్గం అత్యంత ఆందోళనకర స్థితిలో వెనక్కి వచ్చింది. "ఓ ప్రవక్తా! ఖురైషులు క్రోధాగ్నిలో రగిలిపోతున్నారు. వారు నా ఒంటెను చంపేశారు. అహాబిష్ తెగవారు నన్ను కాపాడారు కాబట్టి సరిపోయింది. లేకపోతే వారు అసలు నన్ను చంపేసేవారే" అని హిరాష్ చెప్పారు.

రాయబారికి, రాయబారి సొమ్ముకు కీడు తలపెట్టటమనేది అరబ్బుల్లో ఎన్నడూ లేదు. అసలు అద్రోక పెద్ద ఘాతుకంగా భావించబడేది. ఖురైషులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ముస్లింల పట్ల ఖురైషులు ఎంతటి కోపావేశాలతో రగిలిపోతున్నారో ఈ దురాగతం వెల్లడి చేసింది. దైవప్రవక్త (స) మాత్రం ఈ సంఘటనపై చాలా సౌమ్యంగా స్పందించారు. ఖురైషులకు వ్యతిరేకంగా ఆయన ఒక్క మాట కూడా అనలేదు. రాయబారులు అందించిన సమాచారం గురించి అన్ని కోణాల్లో ఆలోచించటం మొదలుపెట్టారు. తర్వాత తన సహచరులను ఉద్దేశించి, "మనం వారి క్రూరత్వాన్ని సహనంతో ఎదుర్కొందాం. వారి ఈ రోగానికి మన్నింపుల మందుతో చికిత్స చేద్దాం. బహుశా హిరాష్ వారి కంటికి గొప్ప రాయబారిగా కనిపించలేదేమో! ఉమర్ (రజి) అయితే బాగా చర్చలు జరపగలరని నా అభిప్రాయం" అన్నారు.

అందుకు ఉమర్ (రజి) అనుమానం వెలిబుచ్చుతూ, "దైవప్రవక్తా! ఇంతవరకు నేనెప్పుడూ మీ మాట కాదనలేదు. కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో నేను

https://teluguislam.net



మక్కాకు వెళితే నా ప్రాణానికే ముప్పు. మక్కావారు నన్నూ, నా తెగ అయిన బనూ అదీ వారిని విపరీతంగా ద్వేషిస్తున్నారు. మేమంతా ముస్లింలమై మక్కా వదలిపెట్టి వచ్చాము. అక్కడ నాకు రక్షణ కల్పించేవారెవ్వరూ లేరు. అయితే మక్కాలో మంచి స్థానం, రక్షణ కలిగిన వ్యక్తి మనలో ఒకరు ఉన్నారు. ఆయన మరెవరో కాదు, ఉస్మాన్ (రజి). మక్కా నాయకులైన ఉఖబా, అబాన్, ముఆవియా, అబూ సుఫ్యాన్ వీళ్లందరూ ఆయన వంశం వారే. కాబట్టి ఉస్మాన్ (రజి)కు మక్కాలో ఎటువంటి హాని ఉండదు" అన్నారు. అప్పుడు ఉస్మాన్ (రజి) స్వయంగా ఈ కార్యం నిర్వర్తించటానికి ముందుకు వచ్చారు.

ఉస్మాన్ (రజి) నగరంలోకి వెళ్ళి అబాన్ ఇంటి తలుపు తట్టారు. అబాన్ తలుపు తెరిచి చూశాడు. ఉస్మాన్(రజి)ను చూడగానే, "స్వాగతం, రా, తమ్ముడూ! ఈ రాత్రి పూట నువ్వు ఇక్కడ ఏం చేస్తున్నావు? ముహమ్మద్ శిబిరాన్ని వదలిపెట్టి ఇక్కడికెందుకు వచ్చావు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు. ఉస్మాన్ (రజి) అతనికి బదులిస్తూ, "నేనిక్కడికి రాయబారిగా వచ్చాను. ఖురైషులు అర్థం చేసుకోలేకపోతున్న ఒక విషయాన్ని వారికి వివరించటానికి నేను ఇక్కడికి వచ్చాను. వారు ఏమైనా హాని తలపెడతారేమోనని భయంగా ఉంది. నాకు నీ రక్షణ కావాలి" అన్నారు. అబాన్ ఆయన్ని ఖురైషు నాయకుల వద్దకు తీసుకువెళ్ళి, "మీకు తెలుసు కదా! ఇతను నా తమ్ముడు ఉస్మాన్. ఇతను ఇప్పుడు నా రక్షణలో ఉన్నాడు. ఇతన్ని ముహమ్మద్ పంపించారట. ఇతను మీతో ఏదో మాట్లాడాలంటు న్నాడు" అని చెప్పాడు. ఉస్మాన్ (రజి) చెప్పినదంతా విన్న తర్వాత ఖురైషులు, "కాబా చుట్టూ తవాఫ్ (ప్రదక్షిణ) చేసేందుకు మేము ముహమ్మద్‌ను అనుమతిం చము. కావాలంటే నువ్వు తవాఫ్ చేసుకోవచ్చు" అన్నారు.

తనకు ఆ అవకాశం ఇస్తామని చెప్పినందుకు ఉస్మాన్ (రజి) వారికి కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. కాని తవాఫ్ చేయటానికి మాత్రం నిరాక రించారు. ముహమ్మద్ (స)కు, ఆయన అనుచరులందరికీ ఉమ్రా చేసుకునే అనుమతి ఇచ్చేంత వరకు తానూ మస్జిదె హరామ్‌లో అడుగుపెట్టనని ఆయన ఖురైషు పెద్దలకు నిర్మొహమాటంగా చెప్పేశారు.

## ఉస్మాన్ (రజి) నిర్బంధం

మదీనాకు వలసవెళ్ళకుండా మక్కాలోనే బంధింపబడి ఖురైషుల అగడాలకు గురవుతూ ఉన్న అణగారిన ముస్లింల ఇండ్లను ఉస్మాన్ (రజి)



సందర్శించారు. "మీరు నిరాశపడవద్దు, అల్లాహ్ త్వరలోనే మీకు విముక్తి కలిగి స్తాడు" అని ఆయన వారికి ధైర్యం చెప్పారు. ఖురైషులకు ఈ విషయం తెలిసింది. మక్కావారిలో అనైక్యతా బీజాలు నాటుతున్నాడనే నెపంతో వారు ఆయన్ని నిర్బంధించారు.

అటు దైవప్రవక్త (స), ఉస్మాన్ (రజి) రాక కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూడసాగారు. ఉస్మాన్ (రజి) ఖురైషుల చేతుల్లో వధింపబడ్డారన్న ఒక వదంతి దైవప్రవక్త (స)కు చేరింది. ఈ పుకారు విని ముస్లింలు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. అప్పుడు దైవప్రవక్త (స) ముస్లింలకు, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని బోధించారు. ఆ వదంతి నిజానిజాలు తెలిసేదాకా వేచిఉండమని చెప్పారు. తర్వాత ఆయన దైవధ్యానం చేయటానికి ఒక చెట్టు క్రిందికి వెళ్ళారు.

## వెనక్కి తగ్గిన ఖురైషులు!

ముస్లింల దగ్గర తగినన్ని ఆయుధాలు లేవు. అయినా సరే ఖురైషులు ఉస్మాన్ (రజి)ను హత్య చేసిన సంగతి నిజమని తేలితే ఖురైషులతో తప్పకుండా యుద్ధం చేయాలని వారు నిర్ణయించుకున్నారు. అప్పుడే అమ్ర్ కుమారుడు సుహైల్ గుర్రం మీద స్వారీ చేస్తూ తమ వైపు దూసుకువస్తున్నట్లు కనిపించాడు. దైవప్రవక్త (స) సుహైల్‌ను చూసి, "ఖురైషులు స్వయంగా ఇతన్ని పంపించి నట్లయితే వారు శాంతిని కోరుకుంటున్నారని భావం. ఎందుకంటే సుహైల్ చాలా వివేకవంతుడు, మంచి మనిషి. ఇలాంటి మనిషిని ఖురైషులు శాంతి చర్చల కోసమే పంపిస్తారు" అని చెప్పారు. దైవప్రవక్త (స) మాట నిజమని తేలింది. సుహైల్ వచ్చీరాగానే, "ముహమ్మద్! అసద్ తెగవారి ప్రతిజ్ఞ గురించి పూర్తి వివరాలు మేము విన్నాము. మీ శిబిరంపై దాడి జరిపినందుకు ఖురైషులు చాలా చింతిస్తున్నారు. ఉస్మాన్ (రజి) వధించబడలేదు. భద్రతా కారణాల దృష్ట్యా ఆయన్ని ఆపి ఉంచటం జరిగింది. త్వరలోనే ఆయన్ని విడిచిపెట్టేస్తాం. నేనిక్కడికి ఒక శాంతి దూతగా వచ్చాను. మేము తాత్కాలికంగా యుద్ధానికి స్వస్తి పలుకు తున్నాం. బహుశా ఈ విధంగా మన విభేదాలు సమసిపోవచ్చు" అన్నాడు.

దైవప్రవక్త (స) సుహైల్‌ను తన గుడారంలోకి తీసుకువెళ్ళారు. దాదాపు గంటన్నర సేపు చర్చలు జరిగాయి.

# ఒప్పందం

## (క్రీ.శ. 628)



**హి.శ. 6వ సంవత్సరంలో ముస్లిములకు, మక్కా అవిశ్వాసులకు మధ్య ఒక చారిత్రాత్మక ఒప్పందం జరిగింది. దాన్నే హుదైబియా ఒప్పందం అంటారు.**

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

చివరికి ఇరుపక్షాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందంలోని అంశాలు ఇవి :

1. ముస్లింలు ఈ సంవత్సరం ఉమ్రహ్ చేయలేరు. అయితే మరుసటి యేడు వారికి ఉమ్రహ్ యాత్ర చేసుకునే అనుమతి ఉంటుంది. అప్పుడు ఖురైషులు మక్కా ఖాళీ చేస్తారు. మూడు రోజుల వరకు ముస్లింలు స్వేచ్ఛగా ఉమ్రహ్ చేసుకోవచ్చు.
2. మరుసటి యేడు ఉమ్రహ్‌కు వచ్చినప్పుడు ముస్లింలు తమ సాంప్రదాయిక ఖడ్గాలు తప్పితే ఇతర ఆయుధాలేవీ వెంట తీసుకు రాకూడదు. ఆ ఖడ్గాలు కూడా ఒరల్లోనే అణిగి ఉండాలి.
3. పదేండ్ల వరకు ఇరుపక్షాల మధ్య యుద్ధం అనేది జరగదు.
4. ముస్లింలలో ఎవరైనా ఖురైషుల దగ్గరికి వెళ్ళిపోవాలనుకుంటే ముస్లింలు వారిని నిరభ్యంతరంగా వెళ్ళనివ్వాలి. అయితే ముస్లింలను తిప్పి పంపించాలన్న నియమం ఖురైషులకు లేదు. అది ఖురైషుల ఇష్టాయిష్టాల మీదే ఆధారపడి ఉంటుంది.
5. మక్కా నుంచి ఖురైషుల కళ్లుగప్పి



ఎవరైనా ముస్లింల దగ్గరికి వచ్చి చేరితే వారిని ముస్లింలు తిప్పి పంపించాలి.

6. ఏ తెగ అయినా ఖురైషుల తరఫు నుంచి ఈ ఒప్పందంలోకి చేరదలిస్తే నిరభ్యంతరంగా చేరవచ్చు.
7. అలాగే ఏ తెగ అయినా ముస్లింల తరఫు నుంచి ఈ ఒప్పందంలో చేరదలిస్తే నిరభ్యంతరంగా చేరవచ్చు.

ఈ ఒప్పందంలోని షరతులు ఏకపక్షంగా ఉన్నట్లు ముస్లింలకు అనిపించింది. వారు దీని పట్ల చాలా అసంతృప్తిని వెలిబుచ్చారు. అదీగాక ముస్లింలు ఏ ఉద్దేశంతో మక్కాకు బయలుదేరారో ఆ ఉద్దేశం నెరవేరటం లేదు.

ఉమర్ (రజి) ఆగ్రహోదగ్రులయ్యారు. అబూబక్ర్ (రజి)ను ఆయన, "అల్లాహ్ సాక్షిగా అడుగుతున్నాను, చెప్పండి! ముహమ్మద్ (స) దైవప్రవక్త కాదా?" అని అడిగారు. "ఔను. అందులో సందేహం ఏముంది?" అన్నారు అబూబక్ర్ (రజి). ఉమర్ (రజి) మళ్ళీ, "మనం ముస్లింలంకామా?" అని అడిగారు. "అవును" అని బదులిచ్చారు అబూబక్ర్ (రజి). "మక్కా వారు అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పించిన ముష్రిక్కులు కారా?" అని అడిగారు.

అవునన్నట్టు తల ఊపారు అబూబక్ర్ (రజి).

ఉమర్ (రజి) ప్రశ్నల వర్షం కురిపిస్తూనే పోతున్నారు.

"మరలాంటప్పుడు మనం మన ధర్మం మూలంగా ఎందుకు వేధించబడుతున్నాం?" అని అడిగారాయన.

"ఉమర్! ముహమ్మద్ (స)దైవప్రవక్త అన్న మాటకు విధేయులై ఉండండి" అని అబూబక్ర్ (రజి) ఆయనకు హితోపదేశం చేశారు.

దానికి ఉమర్ (రజి) "ముహమ్మద్ (స) నిజమైన దైవప్రవక్త అని నేను నమ్ముతున్నాను. ఇబ్నె అర్ఖమ్ ఇంట్లో ఇస్లాం స్వీకరించిన నాటి నుంచి నేను ఈ మాట అంటూ వస్తున్నాను. ఈ ప్రత్యేక సందర్భంలో తప్ప నేను ఇంతకు ముందెన్నడూ ఈ రకమైన సందేహం వెలిబుచ్చలేదు. దైవప్రవక్త (స) మమ్మల్ని ఇక్కడికి ఉమ్రహ్ చేయటానికి తీసుకువచ్చారు. కాని ఈ ఒప్పంద షరతులు మమ్మల్ని ఉమ్రహ్ చేయకుండా అడ్డుకుంటున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో నాకు అర్థం కావటం లేదు" అన్నారు.

https://teluguislam.net

https://teluguislam.net



"ఉమర్! నీ మనసులోని భావాలకు సమాధానం నా దగ్గర లేదు. నా సలహా ఏమిటంటే, నువ్వు నేరుగా దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళి ఆయన ముందు నీ సందేహం వెలిబుచ్చు" అన్నారు అబూబక్ర్ (రజి). ఉమర్ (రజి) దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళి అబూబక్ర్ (రజి)ని అడిగిన ప్రశ్నలే అడిగారు. దైవప్రవక్త (స) సమాధానమిస్తూ, "నేను దేవుని దాసుణ్ణి, దేవుని ప్రవక్తను. నేను ఆయన ఆజ్ఞల్ని ఉల్లంఘించను. కనుక ఆయన నన్ను ఎన్నటికీ ఒంటరిగా వదలిపెట్టడు. మీరు కాబా గృహాన్ని సందర్శిస్తారని నేనన్న మాట వాస్తవమే. కాని అది ఈ సంవత్సరమే జరుగుతుందని నేను చెప్పలేదు కదా! కనుక ఉమర్ ! కాస్త ఓపికపట్టండి. నేను చెప్పినట్లుగానే మీరు తప్పకుండా కాబా గృహాన్ని సందర్శించి తవాఫ్ చేస్తారు" అని చెప్పారు. ఉమర్ (రజి)కు దైవప్రవక్త (స) మాటలు విషయాన్ని మరో కోణంలో అర్థం చేసుకునేలా చేశాయి. ఆయన మనసులోని సందేహాలన్నీ తొలగిపోయాయి.

## ఒప్పంద రాతలో భేదాభిప్రాయాలు

సుహైల్‌తో కలిసి కూర్చుని ఒప్పందంలోని షరతులను నమోదు చేయమని దైవప్రవక్త (స) అలీ (రజి)కు పురమాయించారు. దైవప్రవక్త (స) ఒక్కొక్క మాట చెబుతుంటే అలీ (రజి) వాటిని ఒక పత్రం మీద రాయసాగారు. ముందుగా, ***"అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం"*** అని రాశారు. అంతలో సుహైల్ కల్పించుకొని, ***"ఈ ప్రారంభ వచనం నాకు పరిచయం లేదు. అల్లాహ్ పేరుతో ప్రారంభం అని రాయండి చాలు"*** అన్నాడు. దైవప్రవక్త (స) అతని అభ్యంతరాన్ని అంగీకరించారు. అతను అన్న ప్రకారమే అలీ (రజి) ప్రారంభ వచనం రాశారు. తర్వాత దైవప్రవక్త (స) ఇలా రాయించారు:

***"ఇవి దైవప్రవక్త (స)కు - సుహైల్ బిన్ అమ్ర్‌కు మధ్య జరిగిన ఒప్పందం షరతులు."***

సుహైల్ మళ్ళీ అడ్డు తగిలాడు, "నువ్వు నిజంగా దైవప్రవక్తవని నేను నమ్మినట్లయితే నేను నిన్ను వ్యతిరేకించాల్సిన అవసరం ఏముంది? నీ మీద యుద్ధం చేయాల్సిన అవసరం కూడా ఉండదు. అందుకని **'దైవప్రవక్త'** అని గాకుండా **'అబ్దుల్లాహ్ కుమారుడు ముహమ్మద్'** అని రాయండి" అన్నాడు.

అతని ఈ అభ్యంతరాన్ని కూడా దైవప్రవక్త (స) మన్నించారు.



ఒప్పంద నియమాల నమోదు కార్యక్రమం ముగిసింది. ఈ సమయంలో సుహైల్ ఎలాంటి అభ్యంతరాన్నీ వ్యక్తం చేయలేదు. అక్కడున్న వారందరికీ ఒప్పంద పత్రం చదివి వినిపించబడింది. ఇరుపక్షాల వారు ఆ ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. దానికి సాక్షుల్ని కూడా నియమించటం జరిగింది. ఒప్పంద షరతులు ముస్లింలను కించపరచినట్లుగా ఉన్నప్పటికీ ముస్లింలు ఎలాంటి ఆందోళన వ్యక్తం చేయలేదు. తమ అసంతృప్తిని లోలోపలే దిగమింగారు.

## ముస్లింలకు మొదలైన కష్టాలు!

ఒప్పంద పత్రంలోని సిరా ఇంకా ఆరనే లేదు, అంతలోనే ఒకతను వచ్చి పడ్డాడు. అతని కాళ్లూ చేతులూ సంకెళ్లతో బంధించబడి ఉన్నాయి. ఇతని పేరు అబూ జందల్. ఖురైషుల తరఫున సంధి కోసం రాయబారిగా వచ్చిన సుహైల్ కుమారుడే ఇతను. తాను ఇస్లాం స్వీకరించాననీ, మదీనాకు వలసపోతుంటే ఖురైషులు తనను బంధించి ఉంచారనీ, ఎలాగో వారి నుంచి తప్పించుకుని వచ్చానని చెప్పుకొచ్చాడు. ఇకపై ముస్లింలతో కలసి ఉండాలని కోరుకుంటున్నాననీ, తనను కూడా మదీనా తీసుకువెళ్ళమని దైవప్రవక్త (స)ను, ముస్లింలను ప్రాధేయపడసాగాడు.

ఆ దృశ్యం చూసి తండ్రి హృదయం ఎంతగానో బాధపడింది. అయినా గుండె రాయి చేసుకొని కుమారుని వంక గుర్రుగా చూశాడు సుహైల్ . తర్వాత దైవప్రవక్త (స)ను ఉద్దేశించి, "ముహమ్మద్ ! మన మధ్య ఇప్పుడే ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం నా కుమారుణ్ణి నేను నా వెంట మక్కాకు తీసుకు వెళ్తాను" అన్నాడు. సంకెళ్లతో బంధించబడి ఉన్న ఆ యువకుడు, పదేపదే బ్రతిమాలటం చూసి ముస్లింల హృదయాలు చలించిపోయాయి. "ఇష్టం వచ్చినట్లు చిత్రహింసలు పెట్టుకోమని నన్ను ఖురైషులకు అప్పగించి వెళ్తున్నారా దైవప్రవక్తా?!" అని కడుదీనంగా మొరపెట్టుకుంటున్నాడు ఆ యువకుడు. దైవప్రవక్త (స) అతనికి బదులిస్తూ, "అబూ జందల్! సహనం వహించు. నీ కోసం, ఇంకా మక్కాలో అణగారిపోతున్న ఇతర ముస్లింల కోసం అల్లాహ్ త్వరలోనే ఏదైనా పరిష్కారం చూపిస్తాడు. నేను ఇప్పుడే ఖురైషులతో ఒక ఒప్పందం మీద సంతకం చేశాను. నేను వారికి మాట ఇచ్చాను. నేను మాట తప్పేవాణ్ణి కాను" అని చెప్పారు. అంతలోనే సుహైల్ వచ్చి, ఏడుస్తున్న తన కుమారుణ్ణి గట్టిగా పట్టుకొని సంకెళ్లతో ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళాడు.

https://teluguislam.net



"ఉమర్! నీ మనసులోని భావాలకు సమాధానం నా దగ్గర లేదు. నా సలహా ఏమిటంటే, నువ్వు నేరుగా దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళి ఆయన ముందు నీ సందేహం వెలిబుచ్చు" అన్నారు అబూబక్ర్ (రజి). ఉమర్ (రజి) దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళి అబూబక్ర్ (రజి)ని అడిగిన ప్రశ్నలే అడిగారు. దైవప్రవక్త (స) సమాధానమిస్తూ, "నేను దేవుని దాసుణ్ణి, దేవుని ప్రవక్తను. నేను ఆయన ఆజ్ఞల్ని ఉల్లంఘించను. కనుక ఆయన నన్ను ఎన్నటికీ ఒంటరిగా వదలిపెట్టడు. మీరు కాబా గృహాన్ని సందర్శిస్తారని నేనన్న మాట వాస్తవమే. కాని అది ఈ సంవత్సరమే జరుగుతుందని నేను చెప్పలేదు కదా! కనుక ఉమర్! కాస్త ఓపికపట్టండి. నేను చెప్పినట్లుగానే మీరు తప్పకుండా కాబా గృహాన్ని సందర్శించి తవాఫ్ చేస్తారు" అని చెప్పారు. ఉమర్ (రజి)కు దైవప్రవక్త (స) మాటలు విషయాన్ని మరో కోణంలో అర్థం చేసుకునేలా చేశాయి. ఆయన మనసులోని సందేహాలన్నీ తొలగిపోయాయి.

## ఒప్పంద రాతలో భేదాభిప్రాయాలు

సుహైల్‌తో కలిసి కూర్చుని ఒప్పందంలోని షరతులను నమోదు చేయమని దైవప్రవక్త (స) అలీ (రజి)కు పురమాయించారు. దైవప్రవక్త (స) ఒక్కొక్క మాట చెబుతుంటే అలీ (రజి) వాటిని ఒక పత్రం మీద రాయసాగారు. ముందుగా, ***"అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం"*** అని రాశారు. అంతలో సుహైల్ కల్పించుకొని, ***"ఈ ప్రారంభ వచనం నాకు పరిచయం లేదు. అల్లాహ్ పేరుతో ప్రారంభం అని రాయండి చాలు"*** అన్నాడు. దైవప్రవక్త (స) అతని అభ్యంతరాన్ని అంగీకరించారు. అతను అన్న ప్రకారమే అలీ (రజి) ప్రారంభ వచనం రాశారు. తర్వాత దైవప్రవక్త (స) ఇలా రాయించారు:

***"ఇవి దైవప్రవక్త (స)కు - సుహైల్ బిన్ అమ్ర్‌కు మధ్య జరిగిన ఒప్పందం షరతులు."***

సుహైల్ మళ్ళీ అడ్డు తగిలాడు, "నువ్వు నిజంగా దైవప్రవక్తవని నేను నమ్మినట్లయితే నేను నిన్ను వ్యతిరేకించాల్సిన అవసరం ఏముంది? నీ మీద యుద్ధం చేయాల్సిన అవసరం కూడా ఉండదు. అందుకని **'దైవప్రవక్త'** అని గాకుండా **'అబ్దుల్లాహ్ కుమారుడు ముహమ్మద్'** అని రాయండి" అన్నాడు.

అతని ఈ అభ్యంతరాన్ని కూడా దైవప్రవక్త (స) మన్నించారు.



ఒప్పంద నియమాల నమోదు కార్యక్రమం ముగిసింది. ఈ సమయంలో సుహైల్ ఎలాంటి అభ్యంతరాన్నీ వ్యక్తం చేయలేదు. అక్కడున్న వారందరికీ ఒప్పంద పత్రం చదివి వినిపించబడింది. ఇరుపక్షాల వారు ఆ ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. దానికి సాక్షుల్ని కూడా నియమించటం జరిగింది. ఒప్పంద షరతులు ముస్లింలను కించపరచినట్లుగా ఉన్నప్పటికీ ముస్లింలు ఎలాంటి ఆందోళన వ్యక్తం చేయలేదు. తమ అసంతృప్తిని లోలోపలే దిగమింగారు.

## ముస్లింలకు మొదలైన కష్టాలు!

ఒప్పంద పత్రంలోని సిరా ఇంకా ఆరనే లేదు, అంతలోనే ఒకతను వచ్చి పడ్డాడు. అతని కాళ్లూ చేతులూ సంకెళ్లతో బంధించబడి ఉన్నాయి. ఇతని పేరు అబూ జందల్. ఖురైషుల తరఫున సంధి కోసం రాయబారిగా వచ్చిన సుహైల్ కుమారుడే ఇతను. తాను ఇస్లాం స్వీకరించాననీ, మదీనాకు వలసపోతుంటే ఖురైషులు తనను బంధించి ఉంచారనీ, ఎలాగో వారి నుంచి తప్పించుకుని వచ్చానని చెప్పుకొచ్చాడు. ఇకపై ముస్లింలతో కలసి ఉండాలని కోరుకుంటున్నాననీ, తనను కూడా మదీనా తీసుకువెళ్ళమని దైవప్రవక్త (స)ను, ముస్లింలను ప్రాధేయపడసాగాడు.

ఆ దృశ్యం చూసి తండ్రి హృదయం ఎంతగానో బాధపడింది. అయినా గుండె రాయి చేసుకొని కుమారుని వంక గుర్రుగా చూశాడు సుహైల్. తర్వాత దైవప్రవక్త (స)ను ఉద్దేశించి, "ముహమ్మద్! మన మధ్య ఇప్పుడే ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం నా కుమారుణ్ణి నేను నా వెంట మక్కాకు తీసుకు వెళ్తాను" అన్నాడు. సంకెళ్లతో బంధించబడి ఉన్న ఆ యువకుడు, పదేపదే బ్రతిమాలటం చూసి ముస్లింల హృదయాలు చలించిపోయాయి. "ఇష్టం వచ్చినట్లు చిత్రహింసలు పెట్టుకోమని నన్ను ఖురైషులకు అప్పగించి వెళ్తున్నారా దైవప్రవక్తా?!" అని కడుదీనంగా మొరపెట్టుకుంటున్నాడు ఆ యువకుడు. దైవప్రవక్త (స) అతనికి బదులిస్తూ, "అబూ జందల్! సహనం వహించు. నీ కోసం, ఇంకా మక్కాలో అణగారిపోతున్న ఇతర ముస్లింల కోసం అల్లాహ్ త్వరలోనే ఏదైనా పరిష్కారం చూపిస్తాడు. నేను ఇప్పుడే ఖురైషులతో ఒక ఒప్పందం మీద సంతకం చేశాను. నేను వారికి మాట ఇచ్చాను. నేను మాట తప్పేవాణ్ణి కాను" అని చెప్పారు. అంతలోనే సుహైల్ వచ్చి, ఏడుస్తున్న తన కుమారుణ్ణి గట్టిగా పట్టుకొని సంకెళ్లతో ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళాడు.

https://teluguislam.net



ఒప్పందంలోని విషయాలు మక్కా వారందరికీ తెలియటానికి ఎక్కువ సమయం పట్టలేదు. బక్ర్ తెగ ఖురైషులతో చేతులు కలిపింది. మరోవైపు ఖుజాఅ తెగ ముస్లింలతో స్నేహ సంబంధాలు ఏర్పరచుకుంది.

ముస్లిం శిబిరంలో ప్రకటన గావించమని దైవప్రవక్త (స) ఒక వ్యక్తిని పంపించారు. "ముస్లిములారా! ఖురైషులతో మనకు ఒప్పందం కుదిరింది. కనుక ఇక మీ జంతువులను ఖుర్బానీ చేసేయండి. శిరోముండనం చేయించుకోండి లేదా వెంట్రుకలు కత్తిరించుకోండి. ఇహ్రామ్ దీక్షను విరమించండి. ఇక మనం మన ఇండ్లకు వెళ్ళిపోదాం" అని ఆ వార్తాహరుడు మూడు సార్లు ప్రకటించాడు. కాని ఏ ఒక్కరూ అతని మాటల మీద ఆసక్తి చూపలేదు. అతను దైవప్రవక్త (స) గుడారం వద్దకు వెళ్ళి, ఆయనకు వారి ప్రవర్తనను గురించి తెలియజేశాడు. దైవప్రవక్త (స) కాస్త అసహనంతో గుడారంలోకి వెళ్ళిపోయారు. ముఖకవళికల్ని బట్టి ఆయన ఆందోళనలో ఉన్నారని పసిగట్టిన ఆయన భార్య ఉమ్మె సలమా, "ఏమయింది దైవప్రవక్తా! ఎందుకలా ఉన్నారు?" అని అడిగారు. "నా ప్రజలు నా మాటను తిరస్కరించారు"అని దైవప్రవక్త (స) బదులిచ్చారు. అప్పుడామె ఆయనకు ధైర్యం చెబుతూ, "దైవప్రవక్తా! మీ ఆచరణలోనే వారికి గొప్ప ఆదర్శం ఉంది. వారికి అందరికంటే గొప్ప ఆదర్శమూర్తి మీరు. ముందు మీరు బయటికి వెళ్ళి మీ జంతువులను ఖుర్బానీ ఇవ్వండి. మీ వెంట్రుకలను కత్తిరించుకోండి. మీ ఆదర్శాన్ని వారు తప్పకుండా అనుసరిస్తారని నాకు నమ్మకముంది" అని సలహా ఇచ్చారు.

దైవప్రవక్త (స) ప్రజల వద్దకు వెళ్ళి, "ఒకవేళ మీరు ఇస్లాంను విడిచిపెట్ట దలచుకుంటే, వెళ్ళండి, వెళ్ళి ఆ ఖురైషులతోనే కలవండి. ధర్మాన్ని వదలిపెట్టేవారి అవసరం మాకు లేదు. ఇక ఉమ్రా సంగతంటారా?! వచ్చే ఏడాది ఉమ్రా యాత్ర చేయటానికి, ఇప్పుడు మనం తిరిగి వెళ్ళిపోదాం. నేను ఏది చేసినా అల్లాహ్ ఆజ్ఞ మేరకే చేస్తాను. ఆయనే నా సహాయకుడు. ఆయన నన్ను ఎన్నటికీ ఒంటరిగా వదలిపెట్టడు. ప్రస్తుతం ఏం చేయాలనేది నేను మీ నిర్ణయానికి వదలిపెట్టేస్తున్నాను" అన్నారు.

తర్వాత ఆయన తన జంతువులను ఖుర్బానీ ఇచ్చారు. శిరోజాలను కత్తిరించేసుకున్నారు. ఇహ్రామ్ దుస్తులు విడిచారు. ముస్లిలందరూ ఆయన్ని అనుసరించటానికి ఇక ఎంతో సమయం పట్టలేదు. వారి సందేహాలన్నీ తొలగిపోయాయి.



## గ్రహించవలసిన పాఠాలు

- అల్లాహ్ ముస్లింల విశ్వాసాన్ని అనూహ్యమైన రీతుల్లో పరీక్షిస్తుంటాడు. దైవప్రవక్త కలను ఆధారంగా చేసుకొని ముస్లింలు పవిత్ర యాత్రకు బయలుదేరారు. అయితే తమ ఉద్దేశం నెరవేరకుండానే ఇండ్లకు తిరిగొచ్చేశారు. ఈ ప్రయాణంలోనే ఖురైషులతో వారు ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. దాని వల్ల కొంతకాలం కోసమైనా యుద్ధ వాతావరణాన్ని ఆపేందుకు అవకాశం కలిగింది. ముస్లింలు తమ పరిస్థితులు మెరుగుపర్చుకునే అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా ముస్లింలు కనబరచిన సహనం, వారి త్యాగభావం వారికి వారు ఊహించిన దాని కంటే ఎన్నోరెట్లు గొప్ప ప్రతిఫలం తెచ్చిపెట్టింది. తర్వాత జరిగిన సంఘటనలే దాన్ని రుజువు చేశాయి.
- ఖురైషుల ప్రవర్తన అత్యంత అవమానకరంగానూ, క్రూరంగానూ ఉండింది. ఒప్పంద పత్రంపై రాసిన అల్లాహ్ గుణగణాలనూ, అలాగే దేవుడు తనకు ఇచ్చిన 'దైవప్రవక్త' అనే బిరుదును తొలగించమని స్వయాన దైవప్రవక్తపైనే వారు ఒత్తిడి తీసుకువచ్చారు. సగటు విశ్వాసికి ఇది అల్లాహ్ పట్ల అపచారంగా, మౌలిక విశ్వాసాల పట్ల అవమానంగా కనిపిస్తుంది. దైవప్రవక్త (స) సమయానుకూలంగా స్పందించి ఇస్లాంకు గొప్ప కీర్తిని సంపాదించి పెట్టారు.
- దైవప్రవక్త (స)కు ఆయన భార్య నుంచి మంచి సలహా లభించింది.
- అల్లాహ్‌ను మహోన్నత ప్రభువుగా ఖురైషులు తిరస్కరించేవారు కాదు. అయితే అల్లాహ్‌తోపాటు ఇతర చిల్లర దేవుళ్ళను కూడా వారు పూజించేవారు. ఈ పద్ధతి ఖండించదగినది.
- దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి తండ్రి పేరు అబ్దుల్లాహ్.

https://teluguislam.net



## అబూ బసీర్ దైన్యస్థితి

హుదైబియా ఒప్పందంలోని షరతులు ముస్లింలకు మింగుడు పడటం లేదు. ఈ సంవత్సరం ఉమ్రహ్ చేయకుండా తిరిగి వెళ్లటం వారి హృదయాల్లో తీవ్ర అసంతృప్తిని నింపింది. అబూ జందల్ దైన్యస్థితిని చూసి కూడా, తాము ఆయనకు సహాయపడ లేకపోవటంతో వారి అహం దెబ్బతింది. ఈ సంఘటనలన్నీ వారి మనసుల్లో మెదలుతుండగానే మరో సంఘటన జరిగింది. వారి గాయాలపై మళ్లీ కారం చల్లినట్లయింది.

అబూ బసీర్ మదీనాకు చేరుకున్నారు. మక్కాలో ఖురైషులు ఆయన్ని విపరీతంగా బాధించారు. ఆ సంగతి ఆయన్ని చూస్తేనే తెలిసిపోతుంది. ముస్లింలు తనకు కుశల ప్రశ్నలు వేసినప్పుడు ఆయన తన దురవస్థ గురించి ఇలా చెప్పుకొచ్చారు:



మక్కాలో ఇస్లాం స్వీకరించిన అబూ బసీర్‌ను ఖురైష్ అవిశ్వాసులు బంధించి చిత్రహింసలకు గురిచేశారు.

గమనిక: చిత్రం కేవలం ఊహాత్మకం

“ఒకప్పుడు ముహమ్మద్ (స) సందేశం మీద నాకు విపరీతమైన కోపం ఉండేది. ఆయన మక్కా వదలిపెట్టి మదీనాకు వలస వచ్చినప్పుడు ఆయన్నొక తిరుగు బాటుదారునిగా, తన వంశానికి చెడ్డ పేరు తీసుకువచ్చిన వానిగా నేను భావించాను. ఒకరోజు ఎవరో ఖుర్‌ఆన్ పారాయణం చేస్తుంటే విన్నాను. ఆ శబ్దం వినకూడదని నేను చాలా ప్రయత్నించాను. కాని ఏదో తెలియని శక్తి నన్ను అక్కణ్ణుంచి కదలకుండా



ఆపింది. నేను బలవంతాన అక్కడి నుంచి వెళ్ళిపోదామని నిశ్చయించాను. కాని ఆ కొద్ది సమయంలోనే నేను ఖుర్‌ఆన్ పారాయణంలోని అందానికి, దాని శైలికి ముగ్ధుణ్ణయ్యాను. ఆ విధంగా నేను ఇస్లాంకు దగ్గరవుతూ కొద్ది రోజులకే ముస్లింనైపోయాను. ఇటీవల నేను మదీనాకు వచ్చి ముస్లింలతో కలసి జీవించాలనుకున్నాను. నా ఉద్దేశం ఖురైషులకు తెలియజేస్తే, వారు నన్ను బంధించి నిర్దాక్షిణ్యంగా వేధించారు. ఆఖరికి దేవుని దయతో కాపలాదారుల కండ్లు గప్పి నేను పారిపోయి వచ్చాను. మీతో కలిసి జీవించాలనీ, మీతో కలిసి అల్లాహ్ మార్గంలో కృషి చేయాలని నా చిరకాల వాంఛ.”

అబూ బసీర్ ఈ మాటలు చెబుతుండగానే ఖురైషుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆయన్ని వెతుక్కుంటూ అక్కడికి వచ్చారు. దైవప్రవక్త (స)తో వారు, “ఓ ముహమ్మద్! మాకు తెలిసినంతమటుకు నీవు నీ చిన్నతనంలో కూడా ఆడినమాట తప్పేవాడవు కాదు. అబూ బసీర్ మా మతాన్ని వదలిపెట్టాడు. మా ఆచారాలను కాలరాశాడు. అతనో తిరుగుబాటుదారు. మనం చేసుకున్న ఒప్పందం ప్రకారం అతన్ని బంధించి తీసుకువెళ్లే హక్కు మాకుంది” అన్నారు. దైవప్రవక్త (స) వారికి బదులిస్తూ, “నేను ఒప్పందాన్ని ఉల్లంఘించలేదు. అదిగో అబూ బసీర్. అల్లాహ్ త్వరలోనే అతన్ని, ఇతర ముస్లింలను రక్షించే మార్గం తీసుకువస్తాడు” అని చెప్పారు. మక్కావారు అబూ బసీర్‌ను బంధించి తమ వెంట తీసుకువెళ్లారు.

## ముస్లింలపై మరో పిడుగు

అబూ బసీర్ విషయంలో దైవప్రవక్త స్పందనను చూసి ముస్లింలు హతాశులయ్యారు. వారి మొహాల్లో కోపం చిందులేసింది. అయితే ఆ తర్వాత కొద్ది సేపటికే అబూ బసీర్ గుర్రం మీద స్వారీ చేస్తూ తమ వైపు రావటం చూసి వారు ఆశ్చర్యపోయారు. ఆయన వెంట ఆయన్ని పట్టుకెళ్ళిన భటులు కూడా లేరు. ఆ ఇద్దరు భటుల్లో ఒకణ్ణి తాను చంపేశానని, ఇంకొకతను తప్పించుకుని పారిపోయాడని అబూ బసీర్ వాళ్లతో చెప్పారు. ఇప్పుడు తాను ముస్లింలతో కలసి ఉండటానికి వచ్చానన్నారు. కాని దైవప్రవక్త (స)తన సహచరులతో, “ఇప్పుడు నేను ఒప్పందంలో ఉన్నాను. ఆ ఒప్పందాన్ని గౌరవించటం విధి. అబూ బసీర్ ధైర్యాన్ని నేను మెచ్చుకుంటాను. కాని మదీనాలో ఉండటానికి నేను ఆయన్ని

https://teluguislam.net



అనుమతించలేను. ఆయన్ని మరెక్కడికైనా వెళ్ళమనండి. ఆయన ఎక్కడికి వెళ్ళినా నా ప్రాంతం ఆయనకు ఆశ్రయం అవుతుందని , అల్లాహ్ ఆయన ప్రార్థనల్ని, ఆరాధనల్ని స్వీకరిస్తాడని నేను ఆశిస్తున్నాను" అన్నారు. మరో దారి లేక అబూ బసీర్ మదీనా విడిచి వెళ్ళవలసి వచ్చింది. ఆయన మనసు ఎంతో బాధపడింది. ఎక్కడికి వెళ్ళాలో పాలుపోని పరిస్థితి!

అత్యంత దైన్య స్థితిలో అబూ బసీర్ తిరిగి వెళ్ళి పోవటం ముస్లింలను మరోమారు కంట తడిపెట్టించింది. ముస్లింలు మరింత భావోద్వేగానికి లోనయ్యారు.

అలాగే చాలా నెలలు గడిచాయి. ఒక రోజు ఎవరో రౌతు మదీనా వైపు రావటం ముస్లింలకు కనిపించింది. అతను కూడా కొత్తగా ఇస్లాం స్వీకరించి మక్కా నుంచి పారిపోయి వస్తున్నాడని ముస్లింలు అనుకున్నారు. అతనికి ఎదురుగా వెళ్ళి, "ముస్లింగా మారి ఇక్కడికి వచ్చావా బాబూ! అయితే వెంటనే ఇక్కణ్ణుంచి వెళ్ళిపో. ఈ నగరం నీకు అనువైన స్థలం కాదు. ఎందుకంటే ఖురైషులతో మాకు ఒప్పందం ఉంది. ఖురైషుల నుంచి మేము నిన్ను విడిపించలేము" అంటూ అతని ముందు తమ అశక్తతను వెల్లడిస్తూ మాట్లాడారు. తాము ముస్లింలమైనందున ఒప్పందాన్ని ఎన్నటికీ ఉల్లంఘించలేమని ఖరాకండీగా చెప్పేశారు. మదీనా గాకుండా మరెక్కడికైనా వెళ్ళమనీ, అల్లాహ్ సహాయంపై నమ్మకముంచమని వారు అతనికి సలహాలివ్వసాగారు.

వారి మాటలు విన్న ఆ మనిషి బిగ్గరగా నవ్వేశాడు. "మీరు పొరబడుతున్నారు. నేను ముస్లింను కాను. నేను మా ప్రజల మతాన్ని ఎన్నటికీ వదలిపెట్టను. నేను ఖురైషుల తరపున రాయబారిగా వచ్చాను. ఎంతో ముఖ్యమైన విషయమై ముహమ్మద్ (స)తో మాట్లాడటానికి నేనిక్కడికి వచ్చాను" అని చెప్పాడు. ఖురైషులు ఈ సమయంలో రాయబారం ఎందుకు పంపి ఉంటారు? అని ముస్లింలు పునరాలోచనలో పడిపోయారు. వారు ఆ వచ్చిన వ్యక్తిని ముహమ్మద్ (స) దగ్గరికి తీసుకువెళ్ళారు. అతను దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ, "ఇంతకు ముందు మా దగ్గరి నుంచి పారిపోయిన అబూ బసీర్ విషయం గురించి మీతో మాట్లాడటానికి ఖురైషులు నన్ను పంపారు. అతను ఒక ఎడారిలో దాక్కున్నాడు. ఆ ప్రదేశం మక్కా నుంచి పారిపోతున్నవారికి ఆశ్రయంగా మారింది. అబూ



బసీర్, అతని అనుచరులు మా మీద యుద్ధం ప్రకటించారు. వారు మా వ్యాపార బృందాలను అడ్డుకొని మా సరుకును దోచుకుంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం అడగటానికి నేను మీ దగ్గరికి వచ్చాను. మదీనాకు వచ్చే ముస్లింలను మక్కాకు తిరిగి పంపించాలనే ఒప్పంద నియమాన్ని మనం ఉభయులం కలసి మార్చుకుంటే, ఇకముందు ఆ సమస్య ఉండదని మా అభిప్రాయం. వారు మీ వెంట ఉండటమే మాకు శ్రేయస్కరం. తద్వారా కొత్తగా ఇస్లాం స్వీకరించేవారు అబూ బసీర్ వర్గంలో చేరకుండా ఉంటారు. లేకపోతే అబూ బసీర్ అనుచరుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయే అవకాశం ఉంది. అదే జరిగితే వారి చేతుల్లో మేము ముప్పుతిప్పలు పడతాము" అన్నాడు. ఒప్పందంలోని ఆ నియ మాన్ని మార్చటానికి దైవప్రవక్త (స) సంతోషంగా అంగీకరించారు.

పరిస్థితుల్లో వచ్చిన ఈ మార్పుకు ముస్లింలు చాలా సంతోషించారు. వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తమ సోదరులు ఇప్పుడు తమతోనే ఉంటారు. తమతోనే కలసి, శాంతిసుహృద్భావ వాతావరణంలో అల్లాహ్‌ను ఆరాధిస్తారు. ఈ పరిణామం ముస్లింలకు అమితమైన ఆనందాన్నిచ్చింది.

మరుసటి సంవత్సరం వందలాది ముస్లింలు మక్కా వెళ్ళి ఉమ్రా యాత్ర నిర్వహించారు. అయితే ముస్లింలకు బాధ కలిగించిన విషయం ఏమిటంటే ఒప్పందం ప్రకారం ముస్లింలు మక్కాలో మూడు రోజులు మాత్రమే ఉండాలి. అదీగాక ఈ ఆంక్షలు పదేండ్ల దాకా ఉంటాయి.

కాని అల్లాహ్ లీల అనూహ్యంగా పనిచేస్తూ ఉంటుంది. మళ్లీ పరిస్థితులు మరో మలుపు తీసుకున్నాయి.

## కాబా సాక్షిగా రక్తపాతం!

ఒక రోజు రాత్రి సాలిమ్ కుమారుడు అమ్ర్ మదీనా వైపు పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతను బనీ ఖుజాఆ తెగకు చెందినవాడు. ఖుజాఆ తెగవారికి ముస్లింలతో మైత్రీసంబంధాలున్నాయి. అతను దైవప్రవక్త (స)కు ఒక ముఖ్య సమాచారం అందించాడు. "బక్ర్ తెగవారు మన ప్రజలపై దాడిచేసి మనవాళ్లను కొంత మందిని చంపేశారు. మేము వాళ్లను ఎదుర్కోబోయేంతలో వాళ్లకు తోడుగా ఖురైషులు కూడా ఆయుధాలతో సహా మా మీదికి వచ్చారు. మేము వాళ్ళతో

https://teluguislam.net



పోరాడలేక పవిత్ర కాబా గృహంలోకి పరుగెత్తి అక్కడ దాక్కున్నాము. కాని వారు కాబా గృహ పవిత్రతను కూడా కాలరాసి సరిగ్గా అక్కడే మన ప్రజలను చంపేశారు. మాలో కొంత మంది ఎలాగో తప్పించుకుని వర్ఖా కుమారుడు బుదైల్ ఇంట్లో దాక్కున్నారు. ఆయన మాకు రక్షణ ఇచ్చారు.” అని చెప్పాడు.

తన మాటల చివర్లో అమ్ర్ ఒక అందమైన కవితను ఆలాపించి తన తెగ వారికి సహాయం చేయమని కోరాడు. దైవప్రవక్త (స) వారి సహాయం కోసం అల్లాహ్‌ను ప్రార్థించారు.

ఖురైషుల ఈ అనాగరిక చర్య హుదైబియా ఒప్పందాన్ని బహిరంగంగా ఉల్లంఘించటమే! ముస్లింలతో సహకార ఒప్పందం కలిగివున్న తెగ మీద దాడి చేయటమే కాదు, కాబా గృహ పవిత్రతను కూడా ఖురైషులు కాలరాశారు. ఇప్పుడు ముస్లిం లకు జిహాద్‌ను ప్రకటించటం తప్ప ప్రత్యామ్నాయం కనిపించలేదు.

ఖురైషులు కాబా గృహంలో దాడులకు తెగబడిన, హత్యలకు పాల్పడిన రాత్రి తెల్లారిన అప్పటికిగాని ఖురైషులకు తాము ఎంతటి ఘోరానికి పాల్పడినది తెలిసి రాలేదు. దీనికి ముస్లింలు ప్రతీకారం చేస్తారని వారిలో భయం మొదలయింది. ప్రస్తుత పరిస్థితిలో ఖురైషులు యుద్ధానికి సిద్ధంగా లేరు. ఖురైషు నాయకులందరూ ఒకచోట సమావేశమయ్యారు. విభిన్న అభిప్రాయాలు వెల్లువెత్తాయి. ఒకానొక దశలో, ఏమైనాసరే మక్కాపై దాడి చేయకుండా ముహమ్మద్ (స)ను అడ్డుకోవాలని వారంతా కూడబలుక్కున్నారు. వారి నాయకుల్లో అబూ సుఫ్యాన్ అగ్రగణ్యులు. మక్కాలోనే కాదు, మొత్తం అరేబియా దేశంలో ఆయనకు గొప్ప గౌరవాదరణలు ఉన్నాయి. దైవప్రవక్త (స)తో చర్చలు జరిపే బాధ్యత ఆయనకు అప్పగించబడింది.

## కోపోద్రిక్త ముస్లింలు

మక్కావారు తమ భవిష్యత్తును అబూసుఫ్యాన్ చేతుల్లో పెట్టారు. ఆయన మదీనాకు బయలుదేరారు. ఖురైషులు సృష్టించిన రక్తపాతం గురించి మదీనా వాసులకు ముందుగానే తెలిసి ఉండటం ఆయన్ని ఆశ్చర్యపరచింది. ముస్లింలు ఆయన ముందు తమ కోపాన్ని వెళ్లగ్రక్కారు. తాను ఏ సమస్య పరిష్కారం కోసం వచ్చారో ఆ సమస్య జటిలమైపోతోందని ఆయనకు అర్థమైపోయింది. ఇక తాను మక్కాకు తిరిగి వెళ్ళిపోవాలా లేక దైవప్రవక్త (స) దగ్గరికి



వెళ్ళి క్షమాపణలు చెప్పుకోవాలా అని ఆలోచించుకోసాగారు. చాలా సేపు దైవప్రవక్త (స) ఇంటి ముందే నిలుచున్నారు. కాని ఎవరూ ఆయన్ని లోనికి ఆహ్వానించలేదు. తన కూతురు ఉమ్మె హబీబా రమ్‌లా ఇంటికి వెళ్ళారాయన. ఆమె దైవప్రవక్త (స) భార్య. తన తండ్రికి ఆమె కూడా ఎటువంటి స్వాగత సత్కారాలు చేయలేదు. పైగా ఆయనపై కినుకనే వ్యక్తపరిచారు. అవమానంతో, పరాభవంతో కూతురి ఇంటి నుంచి బయలుదేరారు అబూసుఫ్యాన్. దారిలో ఆయనకు దైవప్రవక్త (స) కనిపించారు. దైవప్రవక్త (స) మౌనంగా, తీక్షణంగా ఆయన వైపు చూడసాగారు. ఆయన వెనక్కి తిరిగి ఉమర్ (రజి) దగ్గరికి పరుగెత్తారు. తనను ఆదుకోమని కోరారు. ఉమర్ (రజి) మరింత ఆగ్రహ వర్షం కురిపించారు. ఇక మక్కాకు తిరిగి వెళ్ళిపోవటం తప్ప అబూ సుఫ్యాన్‌కు గత్యంతరం లేకపోయింది.

## జిహాద్ ప్రకటన

అబూ సుఫ్యాన్ మదీనా నుంచి వెళ్ళిపోగానే దైవప్రవక్త (స) యుద్ధ సన్నాహాలను తీవ్రతరం చేశారు. అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే ముస్లిం తెగలన్నీ కూడా రమజాన్ నెల సొంతం మదీనాలో గడపాలని ఆయన ప్రకటన చేయించారు. లెక్కలేనన్ని గుర్రాలు, ఆయుధాలు సన్నద్ధం చేయబడ్డాయి. వివిధ తెగల ప్రజలు యుద్ధానికి సమాయత్తమయ్యారు. మదీనా పుర వీధుల్లో జనసంద్రం పోటెత్తింది.

మజ్‌మా, గుఫార్, అస్‌జార్, సులైమ్ మొదలగు ప్రాంతాల నుంచి ప్రజలు మదీనాకు వచ్చారు. ముస్లిం సైనికబలం వెల్లువెత్తినట్లుగా ఉంది. అంత పెద్ద సైన్యం గురించి అరబ్బులు కనీవినీ ఎరుగరు. సైన్యానికి సంబంధించిన విషయాలు రహస్యంగా ఉంచాలని దైవప్రవక్త (స) ముస్లింలకు సూచించారు. హఠాత్తుగా, మక్కా వారు ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలోనే మక్కాపై ఈ దాడి జరగబోతోంది. ఖురైషుల ఎదురుదాడి మూలంగా పవిత్ర మక్కా నగరంలో రక్తపాతం జరగటం ఆయనకు ఎంతమాత్రం ఇష్టం లేదు.

## విజయ వీచికలు

అల్లాహ్ రక్షణతో దైవప్రవక్త (స) గారి శాంతి పతాకం ఆకాశంలో రెపరెపలాడింది. దైవప్రవక్త (స) కోసం ప్రాణార్పణకైనా సిద్ధపడ్డ పన్నెండు వేల మంది

https://teluguislam.net



సైనికులు మదీనా నుంచి బయలుదేరారు. మార్గమధ్యంలో వారు అబ్బాస్‌ను, ఆయన కుటుంబం వారిని కలిశారు. అబ్బాస్ దైవప్రవక్త (స) గారి బాబాయి. ఆయన దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ, "ఓ దైవప్రవక్తా! నేను ఎప్పటి నుంచో ముస్లింగా ఉన్నాను. అయితే బహిరంగంగా అందరిముందు ఈ విషయాన్ని బయటపెట్టలేకపోయాను. ఏది ఏమైనా ఇక నేను ఈ రహస్యాన్ని దాచలేను. ఇప్పుడు నేను అల్లాహ్ కోసం మదీనా వలసవెళ్లాలని నిశ్చయించుకొని బయలు దేరి వస్తున్నాను" అని చెప్పారు. అందుకు దైవప్రవక్త (స) బదులిస్తూ, "బాబాయ్! మీరు ఇస్లాం స్వీకరించటాన్ని మేము మనసారా స్వాగతిస్తున్నాం. అల్లాహ్ మీకు శుభం చేస్తాడు. మీకు రక్షణ కల్పిస్తాడు. మీ కుటుంబీకుల్ని మదీనాకు పంపించేసి సైన్యంలో చేరిపోండి. ఇస్లాంకు లభించబోయే విజయాన్ని చూసి తరించండి" అన్నారు. ఆయన సైన్యం వైపు చూశారు. కనుచూపు మేర ఆయనకు సైన్యమే కనిపించింది. లోయలు, పర్వతాలు ఎక్కడ చూసినా ముస్లిం సైనికులే కనిపిస్తు న్నారు. ఆ దృశ్యాన్ని చూసిన అబ్బాస్ (రజి), "దైవప్రవక్తా! ఇంత పెద్ద సైన్యం మక్కాలోకి ప్రవేశిస్తే ఆడ మగ, చిన్నాపెద్ద అందరూ భయంతో వణకిపోతారు" అని స్పందించారు.

## అబ్బాస్ (రజి) జోక్యం

తన కుటుంబీకులను మదీనాలో విడిచిపెట్టిన తర్వాత అబ్బాస్ (రజి) రాత్రికి రాత్రే ఒక రహస్య మార్గం గుండా మక్కా వైపు బయలుదేరారు. ముహమ్మద్ (స) సైన్యంతో ఢీకొనవద్దనీ, అందులోనే ఖురైషుల క్షేమం ఉందనీ ఆయన వారిని హెచ్చరించదలిచారు. దారిలో ఆయనకు కొందరు మాట్లాడుకుం టున్నట్లు శబ్దం వినిపించింది. దగ్గరకు వెళ్ళి చూస్తే అబూ సుఫ్యాన్, ఆయన అనుచరులు కనిపించారు. తాను ముస్లింగా మారిన సంగతి వారి ముందు దాచ టంలో ఇక అర్థం లేదని భావించి వారికి తన సంగతి మొత్తం చెప్పేశారు. ఇంత చీకట్లో మీరు ఇక్కడ ఏం చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. అబూ సుఫ్యాన్ బదులిస్తూ, "మేము యుద్ధం ఎలాగూ చేయలేము. కనుక ఇక్కడ ఉండి ముహమ్మద్ కదలికల గురించి సమాచారం సేకరిస్తున్నాము. మేము ఒప్పందాన్ని ఉల్లంఘించాము. ముహమ్మద్ మా మీద ప్రతీకారం తీర్చుకుంటారని మాకు అనుమానంగా ఉంది" అన్నారు. దానికి అబ్బాస్ (రజి), "అబూ సుఫ్యాన్! నీవు ఎవరి గురించి మాట్లాడుతున్నావో తెలుసా? ఆయన దైవప్రవక్త (స). ఆయన



సైన్యం మక్కాకు దగ్గర్లోనే ఉంది. ఆ సైన్యం ఇసుకేస్తే రాలనంత పెద్ద సంఖ్యలో ఉంది. ఆయన విజయం సాధిస్తే, ముస్లింలు నిన్ను విడిచిపెట్టరు. తప్పకుండా చంపేస్తారు. ఆ దృశ్యం నేను చూడలేను. కనుక ఓ ఖురైషు నాయకా! దైవప్రవక్త (స)ను, నీ క్షమాభిక్ష గురించి అడుగుతాను. పద ఆయన దగ్గరికి వెళ్దాం" అన్నారు.

వాహనంపై అబ్బాస్ (రజి) వెనుక అబూ సుఫ్యాన్ కూర్చొని దైవప్రవక్త (స) వద్దకు బయలుదేరారు. వారిరువురిని చూసి ముస్లింలు ఆశ్చర్యపోయారు. ఉమర్ (రజి) ఎగిరి గంతేస్తూ, "అబూ సుఫ్యాన్! ఓ దైవవిరోధీ! నువ్వు నా చేతుల్లో పడ్డావు. ఈ రోజు మీకూ - మాకూ మధ్య ఒప్పందం కూడా లేదు. ఇటువంటి అవకాశం కల్పించినందుకు నేను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అని బిగ్గరగా అన్నారు. దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళి ఆయన, "ఓ దైవప్రవక్తా! చూడండి, మీ ముందు ఎవరు నిలుచొని ఉన్నారో! అబూ సుఫ్యాన్! ఇతను మనకు దొరికిపోయేలా చేశాడు అల్లాహ్. ఈ రోజు ఇతని మెడ నరికి నా గుండెను చల్లార్చు కోకుండా ఆపటానికి ఏ ఒప్పందమూ లేదు" అన్నారు. అంతలో అబ్బాస్ (రజి) కల్పించుకొని, "లేదు, దైవప్రవక్తా! అబూ సుఫ్యాన్‌కు నేను రక్షణ ఇస్తున్నాను. మీరు నా రక్షణను అగౌరవపరచరని నేను ఆశిస్తున్నాను" అన్నారు.

ఉమర్ (రజి) ఊరుకోలేదు. అమితమైన కోపాన్ని ప్రదర్శిస్తూ, "అబూ సుఫ్యాన్ ఖురైషుల నాయకుడు. మన యుద్ధాలన్నిటిలో ఇతను వారికి నాయ కుడిగా ఉన్నాడు. ఉహుద్ యుద్ధ ప్రధాన సూత్రధారి ఇతను. శత్రుమూక లన్నీ మదీనాపై దాడి చేసినప్పుడు కూడా ఇతనే వారికి నాయకత్వం వహించాడు. ఇతని మరణం ముస్లింలకు గొప్ప ఊరటనిస్తుంది" అన్నారు. దానికి అబ్బాస్ (రజి), "ఓ ఉమర్! అబూ సుఫ్యాన్ మీ వంశం వారైతే మీరు ఆ మాట అని ఉండరు. ఈయన అబ్దె మనాఫ్ వంశం వారైనందున మీరు ఈయన చావుని ఇంతగా కాంక్షి స్తున్నారు" అన్నారు. ఉమర్ (రజి) కోపం కట్టలు త్రెంచుకుంది. "ఓ అబ్బాస్! మీరు హద్దులు దాటుతున్నారు. నా కన్న తండ్రి ఇస్లాం స్వీకరించి నప్పటి కంటే మీరు ఇస్లాం స్వీకరించినప్పుడు నాకు ఎక్కువ ఆనందం కలిగింది. ఎందుకో తెలుసా? మీ సహచర్యం, మీ సంభాషణ దైవప్రవక్త (స)ను ఎంతగానో మురిపిం చాయి" అన్నారు. అబ్బాస్ (రజి) ఆయన మాటకు సమాధానం ఇవ్వ బోయేంత లోగా దైవప్రవక్త (స) అడ్డుపడి, "అబ్బాస్! అబూ సుఫ్యాన్‌ను మీ విడిదికి తీసుకొని వెళ్ళండి. ఈ రాత్రికి బాగా విశ్రాంతి తీసుకోండి. రేపు తెల్లారిన తర్వాత ఈయన్ని

https://teluguislam.net



నా దగ్గరికి తీసుకురండి, అప్పుడు ఏం చేయాలో నిర్ణయిద్దాం" అన్నారు. ఇక ఉమర్ (రజి) కూడా ఏమీ మాట్లాడలేదు.

## అబూ సుఫ్యాన్ సందేహాలు

అబ్బాస్ (రజి) అబూ సుఫ్యాన్‌ను తన వెంట తీసుకొని వెళ్ళారు. ఇద్దరూ రాత్రంతా కలసి కూర్చొని వివిధ విషయాల గురించి మాట్లాడుకున్నారు. అబూ సుఫ్యాన్ ఇస్లాం స్వీకరిస్తారని అబ్బాస్ (రజి) ఆశిస్తున్నారు.

మరునాడు తెల్లవారు జామున వేల మంది ముస్లింలు ప్రార్థనకై నిలుచొని ఉండటం అబూ సుఫ్యాన్ చూశారు. "వీళ్ళ ఏం చేస్తున్నారు?" అని అబ్బాస్‌ను అడిగారు. వారు ప్రార్థన చేస్తున్నారని అబ్బాస్ (రజి) చెప్పారు. "రా, వుజూ చేసుకో. మనం దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్దాం" అన్నారు. అబూ సుఫ్యాన్ కాస్త తటపటాయిస్తూనే ఆయన్ని అనుసరించారు. దైవప్రవక్త (స) వారిద్దరిని స్వాగతించి కూర్చోబెట్టారు. "అబూ సుఫ్యాన్! అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని మీరు తెలుసుకోవాల్సిన సమయం వచ్చేసింది" అన్నారు. దానికి అబూ సుఫ్యాన్ మాట్లాడుతూ, "మీరు ఎంతటి ఉదార స్వభావులు! ఎంతటి సహనశీలురు?! మీరు చెబుతుంది నిజమే. అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడే గనక ఉండి ఉంటే ఈపాటికి అతను మాకు సహాయం చేసి ఉండాల్సింది" అన్నారు. దైవప్రవక్త (స) ఆయనకు ఇస్లాం సందేశం అందజేస్తూ, "అబూ సుఫ్యాన్! నేను నిజంగా అల్లాహ్ ప్రవక్తనని మీరు విశ్వసించాల్సిన సమయం ఇది" అన్నారు. దానికి అబూ సుఫ్యాన్, "మీరు ఎంతో మంచివారు. ఎంతో వివేకవంతులు. అయితే ఇప్పటికీ నాకు మీ ప్రవక్త పదవికి సంబంధించి కొన్ని సందేహాలున్నాయి" అన్నారు. అంతలో అబ్బాస్ (రజి) అడ్డుకొని, "అబూ సుఫ్యాన్! సత్యం పగటి వెలుతురంత స్పష్టంగా ఉంది. సత్యాన్ని కానకుండా చేస్తున్న నీ కంటి తెరల్ని తొలగించుకో. నీ హృదయ జ్యోతిని మసకబార్చిన అనుమానపు అడ్డుతెరల్ని దూరం చెయ్యి. నా మాట విని ముస్లింగా మారిపో. ప్రపంచంలోనూ, పరలోకంలోనూ నిన్ను నువ్వు కాపాడుకుంటావు" అని హితవు చెప్పారు. అబూ సుఫ్యాన్ ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. కొద్దిసేపటి దాకా ఆయన నోటి నుంచి మాట రాలేదు. తర్వాత ఆయన బిగ్గరగా, "అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్య దేవుడులేడనీ, ముహమ్మద్ (స) అల్లాహ్ ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను" అని ప్రకటించారు.



అబూ సుఫ్యాన్ (రజి) ఇస్లాం స్వీకారం అందరినీ ఆనందంలో ముంచెత్తింది. అబూ సుఫ్యాన్, అబ్బాస్ (రజి) లిరువురూ అక్కణ్ణుంచి బయలుదేరారు. వుజూ ఎలాచేయాలో, నమాజులు ఎలా నిర్వర్తించాలో అబూ సుఫ్యాన్ (రజి)కు నేర్పించే బాధ్యత స్వయానా అబ్బాస్ (రజి) స్వీకరించారు. విశ్వాసం (ఈమాన్)కు సంబంధించిన మౌలిక విషయాలు ఆయన అబూ సుఫ్యాన్‌కు నేర్పించారు. దైవప్రవక్త (స) దగ్గరికి తిరిగి వెళ్ళి, "దైవప్రవక్తా! అబూ సుఫ్యాన్ గురించి నాకు బాగా తెలుసు. ఆయన ఇప్పటివరకు ఒక నాయకునిగా జీవితం గడిపారు. ఎంతైనా ఇస్లాం సందేశం ఆయనకు ఇప్పుడు కొత్తగానే ఉంటుంది. ఇస్లాం ధర్మం ఆయన హృదయాంతరాళంలో ఇంకా పూర్తిగా నాటుకోలేదు. ఆయన గర్వపడే విధంగా ఆయనకేదయినా స్థానం ఇవ్వండి. దాంతో ఇస్లాం ఆయన హృదయంలో గట్టిగా నాటుకుంటుంది" అని విన్నవించుకున్నారు.

దైవప్రవక్త (స) కొద్దిసేపు మౌనంగా ఉండి తర్వాత ఇలా ప్రకటించారు: "సరే, ఆయనతో చెప్పండి. మక్కాలో అబూ సుఫ్యాన్ ఇంట్లోకి ప్రవేశించిన వారం దరూ సురక్షితంగా ఉంటారు. అలాగే సైన్యంతో తలపడకుండా ఇండ్లల్లోకి వెళ్ళిపోయి గడియ వేసుకున్న వారు కూడా సురక్షితంగా ఉంటారు."

## మక్కాకు తిరిగొచ్చిన అబూ సుఫ్యాన్

దైవప్రవక్త (స) తనకు ప్రసాదించిన గౌరవానికి అబూ సుఫ్యాన్ పొంగిపోయారు. ముస్లింల శిబిరం నుంచి బయలుదేరి త్వరత్వరగా మక్కాలోకి ప్రవేశించారు. ప్రజలందరిని సమావేశపరచి ఉపన్యాసం ఇచ్చారు. "ప్రజలారా! ముహమ్మద్ (స) సైన్యంతో వస్తున్నారు. మీరు మునుపెన్నడూ చూడనంత పెద్ద సైన్యం అది. నా ఇంట్లో ప్రవేశించిన వారంతా సురక్షితంగా ఉంటారని ఆయన నాకు మాటిచ్చారు" అని చెప్పారు.

ఈ మాటలు వినగానే ఆయన భార్య హింద్ కోపంతో చిందులు వేసింది. "ఈ ద్రోహిని చంపేయండి. ఇతను తన ప్రజలకు ద్రోహం చేశాడు" అని అన్నది. హింద్ మాటలు విని ప్రజలు అవాక్కయ్యారు. అబూ సుఫ్యాన్‌ను, స్వయానా ఆయన భార్యే ధిక్కరించటం చూసిన జనం తమ చెవుల్ని తామే నమ్మలేకపోయారు. అబూ సుఫ్యాన్ (రజి) మళ్లీ ప్రజలను ఉద్దేశించి,

https://teluguislam.net



"ప్రజలారా! నా భార్య మాటలు విని మోసపోవద్దు. మీ బాగుకోరి నేను ఈ సలహా ఇస్తున్నాను. మిమ్మల్ని కాపాడాలనీ, అనవసర రక్తపాతాన్ని నివారించా లన్నదే నా ఉద్దేశం. మీరు ముహమ్మద్ (స) సైన్యాన్ని ఎదుర్కోలేరు" అని హితవు చెప్పారు. "మరి మక్కా ప్రజలందరూ మీ ఇంట్లో సరిపోరు కదా?!" అని జనం సందేహం వెలిబుచ్చారు. అబూ సుఫ్యాన్ (రజి) దానికి సమాధాన మిస్తూ, "తమ ఇండ్లల్లోకి వెళ్ళి గడియ వేసుకునేవారు కూడా సురక్షితంగా ఉంటారు. మస్జిదుల్ హరామ్‌లోకి వెళ్ళినవారు కూడా రక్షణ పొందుతారు" అని చెప్పారు. "బతుకు జీవుడా" అనుకుంటూ ప్రజలంతా సురక్షిత స్థానాల వైపు పరుగులు తీశారు.



# విజయంలోన వినయం!

(క్రీ.శ. 629)

(ఓ ప్రవక్తా!) అల్లాహ్ సహాయం అందినప్పుడు, విజయం వరించినప్పుడు, ప్రజలు గుంపులు గుంపులుగా అల్లాహ్ ధర్మంలోకి వచ్చి చేరటాన్ని నీవు చూసినప్పుడు, నీవు నీ ప్రభువు స్తోత్రంతో సహా ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉండు. మన్నింపుకై ఆయన్ని ప్రార్థించు. నిస్సందేహంగా ఆయన మహా గొప్పగా పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు.

**(ఖుర్‌ఆన్ *110 : 1 - 3*)**

దైవప్రవక్త (స) సైన్యంతో సహా మక్కాలోకి ప్రవేశించారు. అప్పు డాయన నల్లటి తలపాగా ధరించి వున్నారు. అల్లాహ్‌కు కృతజ్ఞతగా ఆయన శిరస్సు వంగి ఉంది.మక్కాలో ఆయనకు ఎటువంటి ప్రతిఘటన ఎదురు కాలేదు. అల్లాహ్ తనపై అవతరింపజేసిన విజయ వచనాలను ఉచ్చరిస్తూ మక్కాలో అడుగు పెట్టారాయన.

తర్వాత కాబా దగ్గరికి వెళ్ళి తవాఫ్ (కాబా చుట్టూ ప్రదక్షిణలు) చేశారు. హజ్రె అస్వద్‌ను (నల్లరాయిని) చుంబించారు. తర్వాత ఒక పెద్ద సమూహం వైపు దృష్టి సారించారు. వారెవరో కాదు, అడుగడుగునా ఇస్లాంకు, ముస్లింలకు హాని తలపెట్టాలని ప్రయత్నించిన ఖురైషు సర్దారులు. తమ భవిష్యత్తు గురించి ముహమ్మద్ (స) ఏం తీర్పు చెబుతారో నని వారు భయంతోనూ, ఆత్రుతతోనూ ఎదురుచూడసాగారు.

ఖురైషులు తనను విపరీతంగా వేధించారు. అవమానపరిచారు. తన పట్ల చాలా కరకుగా ప్రవర్తించారు. మరి ఈ రోజు తాను కాబా గృహం వద్ద విజేతగా నిలుచున్నారు.

దైవప్రవక్త (స) వారిని ఉద్దేశించి, "ఓ ఖురైషు ప్రజలారా! నేను మిమ్మల్ని ఏం చేయబోతున్నానని అనుకుంటున్నారు మీరు?" అని అడిగారు. వారిలో తెలివైన

https://teluguislam.net



వాడు ఒకడు తలపైకెత్తి, "మీరు చాలా గొప్ప వ్యక్తి. దయాశీలి. మీరు మా విషయంలో ఎంతో ఉదారంగా నిర్ణయం తీసుకుంటారని మేము ఆశిస్తున్నాం" అన్నాడు. దానికి దైవప్రవక్త (స) బదులిస్తూ, "యూసుఫ్ ప్రవక్త తన సోదరులతో అన్న మాటే నేనూ అంటాను. ఈ రోజు మీపై ఏ నిందా లేదు. శాంతిగా, స్వేచ్ఛగా మీరు ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవచ్చు" అన్నారు.

మక్కా ప్రజల కొరకు దైవప్రవక్త (స) ప్రకటించిన క్షమాగుణం ఆయన లోని గొప్ప ఔదార్యానికి అద్దం పట్టింది. ముహమ్మద్ (స) మామూలు వ్యక్తి కారు. ఆయన ఒక దైవప్రవక్త, దయాశీలి. ఆయన మనసులో ద్వేషానికి కొంచెమైనా స్థానం లేదు. అల్లాహ్ ఆయనకు శత్రువులపై ఆధిక్యతను ఇచ్చాడు. కాని ఆయన మన్నింపుల వైఖరిని ఇష్టపడ్డారు. ఆ విధంగా ఆయన తన తరం వారికోసం, తర్వాతి తరాల వారి కోసం ఒక గొప్ప ఆదర్శాన్ని నెలకొల్పారు.

## వంచకులు

దైవప్రవక్త సందేశాన్ని విశ్వసించిన వారి హృదయాలు శాంతిని, సుఖాన్ని ఆస్వాదించాయి . ఆయన సందేశం దేశమంతటా వ్యాపిస్తోంది. అయితే కొన్ని శక్తులు ఆ సందేశాన్ని వ్యాపించకుండా అడ్డుకోవటానికి శతవిధాలా ప్రయత్నించాయి. ముహమ్మద్ (స) అంటే వారికి గిట్టలేదు. ఆయన ఉనికి తమ నాయకత్వానికి ఎసరు పెడుతుందని వారు భయపడ్డారు. వారిలో ఈ రెండు వర్గాల వారున్నారు:

1. ఒకరు, మక్కా ముష్రిక్కులు, అరబ్బు బహుదైవారాధకులు. వీరు ఇస్లాం సందేశాన్ని పూర్తిగా తిరస్కరించారు. తమ శత్రుత్వాన్ని వీరు రహస్యంగా ఉంచలేదు. ఇస్లాంను అణగదొక్కటానికి దొరికిన ప్రతి అవకాశాన్నీ వీరు పూర్తిగా వినియోగించుకున్నారు. దైవప్రవక్త నాయకత్వాన్ని చూసి వారు అసూయతో రగిలిపోయేవారు. ఫలితంగా ఇది బహిరంగ విద్వేషానికి తెరతీసింది. అటువంటి సందర్భాల్లో యుద్ధాన్ని నివారించేందుకుగాను దైవప్రవక్త (స) వారితో వివిధ ఒప్పందాలు కుదుర్చుకున్నారు. మరికొన్ని సందర్భాల్లో గత్యంతరం లేక వారితో యుద్ధాలు కూడా చేయవలసి వచ్చింది.

2. రెండవ వర్గంవారు, నయవంచకులు (మునాఫికూన్). ఈ వర్గం ఇస్లాంకు చాలా నష్టం కలిగించింది. ఈ వర్గంవారు తమ హృదయాల్లో ఉన్న



విషయాలకు భిన్నమైన మాటలు పలికేవారు. పైకి వారు ముస్లింల లాగానే కనిపించేవారు. దైవప్రవక్త (స)ను, ఇస్లాంను అభిమానిస్తున్నట్లు నటించేవారు. కాని వారి హృదయాల్లో విపరీతమైన అసూయా ద్వేషాలు గూడుకట్టుకొని ఉండేవి. లోలోపలే వారు ముస్లింలకు వ్యతిరేకంగా కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడుతుండేవారు. అల్లాహ్ వారిని ఇలా వర్ణించాడు:

> **"వారు విశ్వాసులను కలుసుకున్నప్పుడు "మేమూ విశ్వాసులమే" అని అంటారు. తర్వాత తమ షైతానుల సర్దారులతో కలసినప్పుడు, 'మేము మీతోనే ఉన్నాం. మేము నిజంగా ఇస్లాం స్వీకరించలేదు' అని చెబుతారు."**
> ***(దివ్యఖుర్‌ఆన్ 2 :14)***

## భగ్గుమన్న ప్రాంతీయ విభేదాలు

బనూ ముస్తలిఖ్ యుద్ధానంతరం ముస్లిం సైన్యం మదీనాకు తిరుగు ప్రయాణయ్యింది. మార్గం మధ్యలో విశ్రాంతి నిమిత్తం 'మురైసీ' అనే ఒయాసిస్సు వద్ద ఆగింది. ఆ సైన్యంలో యహ్యా అనే అతను ఉన్నాడు. ఇతను గిఫార్ తెగకు చెందినవాడు, ఉమర్ (రజి) గారి సేవకుడు.

మరో సేవకుడు ఉన్నాడు. అతని పేరు సినాన్. ఇతను జుహ్నీ తెగకు చెందినవాడు. జుహ్నీ తెగకు ఔస్ తెగతో మైత్రీ సంబంధాలున్నాయి. ఈ సేవకులిద్దరూ బావి దగ్గర నీళ్లు తోడుకునే విషయంలో గొడవపడ్డారు. తనకు సహాయం చేయటానికి రమ్మని యహ్యా ముహాజిర్లను పిలిచాడు. అటు సినాన్ అన్సార్‌లను కేకవేశాడు. మొత్తానికి ఇస్లాం ధర్మం రూపుమాపటానికి ప్రయత్నిస్తూ వచ్చిన ప్రాంతీయతత్వాన్ని ఈ సేవకులిద్దరూ తట్టిలేపారు.

ఈ వివాదం అబ్దుల్లాహ్ బిన్ ఉబైకు, ఇంకా ఇతర కపటులకు వినోదంగా మారింది. ప్రాంతీయ విభేదాల ఆధారంగా ముస్లింల మధ్య చిచ్చు రగుల్గొల్పటానికి కపటులు కుట్ర పన్నారు. అందుకు ఈ వివాదాన్ని సువర్ణావకాశంగా భావించారు. మదీనా నగర స్థానిక ప్రజలను కొంత మందిని కూడగట్టి వారిలో విద్వేష భావాలను నూరిపోయటానికి అబ్దుల్లాహ్ బిన్ ఉబై ప్రయత్నించాడు. "ముహమ్మద్, అతని అనుచరులు మదీనాకు వచ్చిననాటి నుంచీ మనం పరాభవంపాలుగాని రోజులేదు. ఈ ముహాజిర్లు మా ఉప్పు తిని ఇప్పుడు

https://teluguislam.net



మా మీదే పెత్తనం చెలాయించటానికి ప్రయత్నిస్తున్నారు. కుక్కకు బాగా తిండిపెడితే ఆఖరికి అది యజమానినే మింగేస్తుందట. అలా అయిపోయింది మన పరిస్థితి. మనం మదీనాకు వెళ్ళిన తర్వాత ఇక ఈ కాందిశీకులకు సహాయం చేయటం ఆపేద్దాం. వారిని వేరెక్కడికైనా వెళ్ళిపోమనండి. ఈ రోజు మనం వారికి సహాయం చేస్తున్నాం. రేపు వారు మనల్నే ఇక్కణ్ణుంచి వెళ్ళగొడ్తారు. మనల్ని యుద్ధాలకు పంపించి మన సంఖ్యను తగ్గించాలనీ, మన పిల్లలను అనాథలుగా మార్చి, మన స్త్రీలను విధవలుగా చేయాలని ముహమ్మద్ పెద్ద కుట్ర పన్నాడు" అని చెప్పాడు.

## కపటాగ్రేసరుని అబద్ధ ప్రమాణం

ఈ మాటలు వింటున్న వారిలో జైద్ బిన్ అర్ఖమ్ కూడా ఉన్నారు. ఈయన నిజమైన ముస్లిం. దైవప్రవక్త (స)ను ఎంతగానో అభిమానించేవారు. ముస్లింలందరూ ఐకమత్యంతో, శాంతిసామరస్యాలతో కలసి జీవించాలని ఆయన కోరుకునేవారు. అందుకని ఆయన ధైర్యంగా అబ్దుల్లాహ్ బిన్ ఉబైను అడ్డుకున్నారు. "అల్లాహ్ తోడు. నువ్వు తుచ్ఛుడివి. నీ సొంత తెగవారు కూడా నిన్ను ఇష్టపడరు. నిన్ను అనుసరించేవారు చాలా తక్కువ మంది ఉన్నారు. ముహమ్మద్ (స) బలమైన నాయకులు. అల్లాహ్ సన్నిధిలో, ముస్లింల దగ్గర అన్ని చోట్ల ఆయన ఆదరణీయులు" అన్నారు. ఆ కపటుల సమూహం తనకు హాని తలపెట్టకముందే ఆయన అక్కణ్ణుంచి బయటపడ్డారు. నేరుగా దైవప్రవక్త (స) శిబిరానికి వెళ్ళి కపటుల దుష్టయత్నాల గురించి ఆయనకు తెలియజేశారు. ఈ మాటలు వినగానే దైవప్రవక్త (స) ముఖారవిందంలో ఆందోళన తాలూకు ఛాయలు కనిపించాయి. ముస్లింలలో మొదటిసారి అనైక్యతా భావాన్ని గమనించారాయన. ఈ విచ్ఛిన్నతను మొగ్గలోనే తుంచే యడం మంచిదని భావించారు. అందుకోసం ప్రణాళికను రూపొందించు కున్నారు.

అబ్దుల్లాహ్ తెగకు చెందిన నాయకుడు ఒకతను ఈ సంగతి తెలుసుకొని దైవప్రవక్త (స)కు అభ్యంతరం చెప్పాడు. "దైవప్రవక్తా! అబ్దుల్లాహ్ మా నాయకుల్లోనివాడు. ఒక సామాన్య వ్యక్తి మాటలు విని ఆయన మీద చర్య



తీసుకోవటం సముచితం కాదు" అన్నాడు. దైవప్రవక్త (స) జైద్ వైపు తిరిగి, "బహుశా నీకు అలాంటి భ్రమ కలిగిందేమో?" అన్నారు. జైద్, తాను విన్నదాని మీద తనకు గట్టి నమ్మకం ఉన్నట్లు, "లేదు, దైవప్రవక్తా! అలాంటిదేమీ లేదు" అన్నారు. "బహుశా నువ్వు అతని మాటల్ని అర్థం చేసుకోవటంలో పొరపాటు పడ్డావేమో?" అని మళ్ళీ అడిగారు దైవప్రవక్త (స). కాని జైద్ మాత్రం తనమాట మీద గట్టిగా నిలబడ్డారు. అప్పుడు దైవప్రవక్త (స) అబ్దుల్లాహ్‌ను పిలిపించి, "ఏమిటి నేను విన్నది నిజమేనా? నువ్వు ఆ మాటలు అన్నావా?" అని అడిగారు. జైద్ చెప్పిన మాటలు అతనికి వినిపించారు. అబ్దుల్లాహ్ వెంటనే మాట మార్చాడు. "అల్లాహ్ సాక్షి! పవిత్ర గ్రంథాన్ని మీపై అవతరింప జేసిన దేవుని సాక్షి! నేను అస్సలు ఆ మాట అనలేదు. జైద్ అబద్ధం చెబు తున్నాడు" అన్నాడు. నిస్సిగ్గుగా వాడు దేవుని మీద ప్రమాణం కూడా చేశాడు. అప్పుడు ఉమర్ (రజి) అతనిపైకి ఎగబడుతూ, "దైవప్రవక్తా! వీడు అబద్ధం చెబుతున్నాడు. మీరు నాకు అనుమతి ఇవ్వండి, వీణ్ణి ఇక్కడికిక్కడే మట్టికరి పిస్తాను" అన్నారు. దానికి దైవప్రవక్త (స) బదులిస్తూ, "ఉమర్! ఊరుకోండి. ముహమ్మద్ తన ప్రజల్ని తానే చంపుతున్నాడని ప్రజలు చెప్పుకుంటే ఏమవు తుందో ఆలోచించండి?" అన్నారు.

మరునాడు తెల్లవారు జామున ఇక ఆ ప్రదేశం నుంచి ప్రయాణం కొనసాగించాలని దైవప్రవక్త (స) తన సహచరులకు ఆదేశించారు. సాధారణంగా దైవప్రవక్త (స) అంత ఉదయాన్నే ప్రయాణం మొదలుపెట్టరు. కాని సైనికుల్ని ప్రయాణంలో ఉంచితే బావి దగ్గర జరిగిన గొడవను వారు మరిచిపోతారని భావించి ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారు.

మార్గంలో వారికి ఉసైద్ కలిశారు. అంత పొద్దున్నే దైవప్రవక్త (స) ప్రయాణంలో ఉండటం చూసి ఆశ్చర్యపోతూ ఆయన, "దైవప్రవక్తా! ఏమిటి ఈ రోజు మీరు వేళకాని వేళలో ప్రయాణం చేస్తున్నారు" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) బదులిస్తూ, "మీ సహచరుడు ఏమన్నాడో తెలుసా?" అని ప్రశ్నించారు. "ఏ సహచరుడు? అసలు ఏమన్నాడతను?" ఆందోళనగా అడిగారు ఉసైద్. "మదీనా వెళ్ళిన తర్వాత గొప్పవారు హీనుల్ని వెళ్ళగొడ్తారట.

మీ అబ్దుల్లాహ్ అన్నాడు" అంటూ దైవప్రవక్త (స) ఆయనకు జరిగినదంతా వివరించారు. అప్పుడు ఉసైద్ స్పందిస్తూ, "దైవప్రవక్తా! మీరే గొప్పవారు. మీరు తలచుకున్నప్పుడు మీరే అతన్ని మదీనా నుంచి గెంటివేయగలరు. అతని విషయంలో మీరు కాస్త జాగ్రత్తగా ఉండటమే మంచిది. మీరు మదీనా రావటంతో వాడి పదవి కాస్తా పోయింది. అందుకే అతను అసూయతో కుళ్లి పోతున్నాడు" అని చెప్పారు.

దైవప్రవక్త (స) ప్రయాణం కొనసాగిస్తూనే పోయారు. మదీనా చేరుకునే దాకా మధ్యలో ఎక్కడా మజిలీ చేయలేదు. విశ్రాంతి కోసం కూడా ఆగలేదు. మదీనా చేరుకోగానే దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ వాక్యాలు అవతరించాయి :

> "కపటులు నీ దగ్గరికి వచ్చినప్పుడు 'మీరు దైవప్రవక్త అని మేము ఒప్పుకుంటున్నాము' అంటారు. నీవు తన ప్రవక్త అన్న విషయం అల్లాహ్‌కు బాగా తెలుసు. కపటులు అబద్ధాలకోరులని అల్లాహ్ ధృవీక రిస్తున్నాడు." ***(ఖుర్‌ఆన్ : 63 : 1 - 8)***

### గ్రహించవలసిన పాఠాలు

- కపటులు అల్లాహ్ పేరుతో అబద్ధపు ప్రమాణాలు కూడా చేయగలరు. ముస్లింల సమైక్యతను భంగం చేయటానికి వారు వర్ణం, వర్గం, వంశం, తెగ, ప్రాంతం, జాతి మొదలగు విచ్ఛిన్నకర పద్ధతులను అనుసరిస్తారు.

https://teluguislam.net



# హునైన్ యుద్ధం

> హునైన్ యుద్ధం జరిగిన రోజున అల్లాహ్ మిమ్మల్ని ఆదుకున్నాడు. ఆ సందర్భంగా మీరు మీ అధిక సంఖ్యపై గర్వపడ్డారు. కాని ఆ సంఖ్యాబలం మీకే విధంగానూ ప్రయోజనం కలిగించలేదు. భూమి విశాలంగా ఉండి కూడా మీకోసం ఇరుకై పోయింది. అప్పుడు మీరు వెన్ను చూపి మరలిపోయారు. ఆ తరువాత అల్లాహ్ తన ప్రవక్తపై, విశ్వాసులపై తన తరఫు నుంచి స్థిమితాన్ని అవతరింపజేశాడు. మీకు కానరాని సేనలను పంపించాడు. సత్య తిరస్కారులను శిక్షించాడు. ***(ఖుర్‌ఆన్ 9 : 25,26)***

తాయిఫ్ నగరానికి మాజీ నాయకుడు జురైజ్. ఆయన వయోవృద్ధుడు, అంధుడు. యుద్ధతంత్రాల గురించి ఆయనకు బాగా తెలుసు. ఆయన, ఒక ఒంటె మీద కూర్చొని ఉన్నాడు. సేవకుడు ఒంటె తోలుకొని వెళ్తున్నాడు. ప్రస్తుతం తాము ఏ ప్రదేశంలో ఉన్నామని ఆయన తన సేవకుణ్ణి అడిగాడు. అది ఔతాస్ ప్రదేశమని సేవకుడు చెప్పాడు. అక్కడే విడిది చేయమని జురైజ్ తన ప్రజలకు సలహా ఇచ్చాడు. ఆ ప్రదేశం కొండలేవీ లేకుండా, మరీ సమతలంగానూ కాకుండా చాలా అనుకూలంగా ఉంది.

అక్కడికి కొద్దిదూరంలో ఆయనకు స్త్రీల, పిల్లల శబ్దాలు, జంతువుల అరుపులు వినిపించాయి. అక్కడ ఎవరున్నారని ఆయన తన సేవకుల్ని అడిగాడు. "మన కొత్త నాయకుడు మాలిక్‌కు ప్రజలను యుద్ధానికి సమాయత్తం చేస్తున్నాడు. ధనసంపదల్ని, భార్యాబిడ్డల్ని సైతం వెంటబెట్టు కొని ఒక చోట సమావేశం అవమని ఆయన ప్రజలకు ఆదేశించాడు" అని సేవకులు జురైజ్‌కు తెలిపారు. తనను ఆ కొత్త నాయకుని వద్దకు తీసుకువెళ్ళమని జురైజ్ సేవకుల్ని కోరాడు. సేవకులు ఆయన్ని మాలిక్ దగ్గరికి తీసుకు వెళ్ళారు. జురైజ్, మాలిక్‌ను "ఏం

https://teluguislam.net



జరుగుతుందిక్కడ?" అని అడిగాడు. దానికి మాలిక్ బదులిస్తూ, "ముహమ్మద్ ఎటువంటి ప్రతిఘటన ఎదురుకాకుండానే నిక్షేపంగా మక్కాలోకి ప్రవేశించాడు. మక్కా తర్వాత పెద్ద నగరం మాదే. కనుక భవిష్యత్తులో ముహమ్మద్ (స) మనపై కూడా దాడి చేయవచ్చు. హవాజిన్, నస్ర్, జుషామ్, సఖీఫ్ మొదలగు తాయిఫ్ తెగలన్నీ కూడా ముహమ్మద్ (స) మీద మెరుపుదాడి చేయాలని నిశ్చయించాయి" అని చెప్పాడు. అది విని జురైజ్, "మరయితే ఇక్కడ పశువుల అరుపులు, చిన్న పిల్లల ఏడుపులు ఎందుకు వినపడుతున్నాయి?" అని అడిగాడు. దానికి సమాధానమిస్తూ మాలిక్, "మనవాళ్లు ముహమ్మద్(స) సైన్యాన్ని చూసి బెదిరిపోయి యుద్ధం చేయకుండా ఉంటారేమోనని నాకు భయంగా ఉంది. అందుకని నేను వారి స్త్రీలను, పిల్లలను యుద్ధ మైదానానికి వెంట తీసుకొచ్చాను. తమ భార్యాబిడ్డల్ని, సిరిసంపదల్ని కాపాడుకోవటానికి అయినా మన సైనికులు తప్పకుండా యుద్ధం చేయవలసి ఉంటుంది" అని చెప్పుకొచ్చాడు. దానికి జురైజ్ తల అడ్డంగా ఆడిస్తూ, "ఈ విషయంలో నేను నీతో ఏకీభవించలేను. మీరు ఓడిపోతే మీ భార్యాబిడ్డల ముందే అవమానం పాలవుతారు. కాబట్టి వీళ్లను యుద్ధమైదానం నుంచి పంపేయండి" అని సలహా ఇచ్చాడు. కాని మాలిక్ మాత్రం తల పొగరుతో, "నీవు ముసలోడివై పోయావు. యుద్ధ తంత్రాలకు సంబంధించి నీ విద్యలకు కాలం చెల్లింది. ఈ విషయాలను నువ్వు పట్టించుకోకు. నీకన్నా సమర్థవంతులే ఈ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు" అన్నాడు.

మొత్తానికి వారు ముస్లింలపై మెరుపుదాడి చేయటానికి గట్టిగా నిశ్చయించుకున్నారు.

## ఓటమి తీరంలో...

మక్కాను జయించి మదీనాకు బయలుదేరారు దైవప్రవక్త (స). మార్గ మధ్యంలో ఆయనకు కొన్ని తెగలు తమ మీద దాడి చేయటానికి పూనుకున్నాయన్న వార్త అందింది. మదీనాకు చేరుకున్న తర్వాత ఆయన ముస్లింలకు, ఆయుధాలు దింపవద్దని ఆదేశించారు. ప్రస్తుతం విశ్రాంతి తీసుకోవటానికి అవకాశం లేదని చెప్పారు. అరేబియాలో అవిశ్వాసులకు గట్టి పట్టు ఉన్న చివరి ప్రాంతం తాయిఫ్. దైవప్రవక్త (స) ముస్లిం సైన్యాలను అటు వైపు నడిపించారు. తన తెల్లటి కంచర గాడిదపై స్వారీ చేస్తూ ఉన్నారాయన.



దానిపేరు దుల్‌దుల్. ముస్లింలు సూర్యాస్తమయానికి ముందే తాయిఫ్ నగరానికి దగ్గర్లోని హునైన్ పర్వతాల వద్దకు చేరుకున్నారు. అయితే హఠాత్తుగా అవిశ్వాసులు అన్ని వైపుల నుంచి ముస్లింలపై దాడి చేశారు. ఆ హఠాత్పరిణామానికి ముస్లింలు కకావికలయ్యారు. ముస్లిం సైన్యం ఛిన్నాభిన్నమైపోయింది. దైవప్రవక్త (స) ఆందోళనకు గురయ్యారు. కలసికట్టుగా పోరాడమని ముస్లింలను పిలిచారు. కాని ఆ స్థితిలో ఆయన మాటల్ని ఎవరూ పట్టించుకోలేదు. వెనక్కి తిరిగి చూస్తే అబూబక్ర్, ఉమర్, అలీ, అబూ సుఫ్యాన్, ఇంకా తన వంశస్తులు మరికొంత మంది మాత్రమే ఆయనకు కనిపించారు. అబూ సుఫ్యాన్ (రజి) తన భావాలను అణచుకోలేకపోయారు. బిగ్గరగా అరుస్తూ, "అల్లాహ్ సాక్షి! ఇక మనం ఓడిపోయినట్లే. అవిశ్వాస సైన్యాలను సముద్ర కెరటాలే ఆపగల్గుతాయి" అన్నారు.

అటు శత్రువుల వైపు నుంచి హంబల్ కుమారుడు కలాదా గట్టిగా అరుస్తూ, "నేటితో ముహమ్మద్ మంత్రజాలం అంతమైపోతుంది" అన్నాడు. అన్సార్లనందరినీ తిరిగి కూడగట్టమని దైవప్రవక్త (స) అబ్బాస్ (రజి)కు ఆదేశించారు. అబ్బాస్ (రజి), "ఓ అన్సార్‌లారా!, దైవప్రవక్త కోసం ప్రాణార్పణకు సిద్ధపడ్డ వీరుల్లారా!, శత్రువులకు వ్యతిరేకంగా తనకు సహాయపడమని ఆయన మిమ్మల్ని పిలుస్తున్నారు" అని ఎలుగెత్తి ప్రకటించారు. అబ్బాస్ (రజి) పిలుపు తమ కర్ణపుటాలకు తాకగానే అన్సార్ యోధులు, పారిపోతున్న వారల్లా వెనక్కి తిరిగి, "లబ్బైక్ యా రసూలల్లాహ్, లబ్బైక్ (దైవప్రవక్తా! వచ్చేస్తున్నాం)" అంటూ పరుగెత్తుకొచ్చారు. క్షణాల్లో ముస్లిం సైన్యం బారులు తీరింది. దృఢచిత్తులైన యోధులతో ముస్లిం సైన్యం అవిశ్వాసులపై ఉవ్వెత్తున ఎగిసిపడింది. ముస్లింల ధైర్యం అవిశ్వాసులకు సముద్రంలో తుఫానులా అగుపించింది. భయంతో ప్రాణాలు అరచేతిలో పట్టుకొని, వెంటతెచ్చిన సామగ్రినంతటిని వదలిపెట్టేసి, యుద్ధమైదానం నుంచి పలాయనం చిత్తగించారు అవిశ్వాసులు.

*(చదవండి, ఖుర్‌ఆన్ 9 : 25)*

## తాయిఫ్ ముట్టడి

హునైన్ యుద్ధమైదానం నుంచి పారిపోయిన బనూ సఖీఫ్ తెగ తాయిఫ్ నగరంలోకి జొరబడింది. ఈ నగరంలో పటిష్టమైన కోటలెన్నో ఉన్నాయి. రక్షణ నిమిత్తం నగరం చుట్టూ ఎన్నో ప్రాకారాలు నిర్మించబడి ఉన్నాయి.

ముస్లిం సైనికులు వారిని వెంబడించారు, కాని వారు అప్పటికే తమ కోటల్లోకి వెళ్ళి దాక్కున్నారు . ఒక యేడాదికి సరిపోయే ఆహారం కూడా వారు ముందే కోటలో సమకూర్చుకొని పెట్టుకున్నారు. ముస్లిం సైనికులు సాహసం చేసి ప్రహరీ గోడలు దూకి లోనికి ప్రవేశించారు. కాని అవిశ్వాసులు పైనుంచి వారిపై ధారాపాతంగా బాణాల వర్షం కురిపించారు. దాని వల్ల ఎంతో మంది ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. అయినా దైవప్రవక్త (స) ముట్టడిని ఆపలేదు. పగలు, రేయి ఇరవై రోజుల వరకూ ఈ యుద్ధం కొనసాగింది.

దైవప్రవక్త (స) ఒక చెక్క ట్యాంకును తయారు చేసి దాన్ని బండి చక్రాలపై బిగించారు. ప్రపంచంలో మొట్టమొదటి యుద్ధ ట్యాంకుగా దీన్ని చెప్పుకోవచ్చు. కొంత మంది సైనికులు ఆ ట్యాంకులో కూర్చున్నారు. తర్వాత ఆ ట్యాంకును ప్రాకారంలోనికి నెట్టటం జరిగింది. అయితే ప్రతిఘటించేవారు కూడా బాగా తెలివైనవారే. ఇనుమును బాగా కాల్చి మండుతున్న ఆ ఇనుప ముక్కల్ని వారు చెక్క ట్యాంకులపై విసరివేయసాగారు. కాలుతున్న చెక్క ట్యాంకుల నుంచి బయటపడి, పారిపోతూ వున్న ముస్లిం సైనికుల్ని శత్రువులు బాణాలతో ఏరివేయటం ప్రారంభించారు.

ఖర్జూర చెట్లను, ద్రాక్ష తోటల్ని నరికివేస్తామని దైవప్రవక్త (స) కోటలోని వారిని బెదిరించారు. దాని వల్ల మరుసటి యేడు శత్రువులకు ధాన్యపు గింజలు ఉండవు. అందుకు భయపడి శత్రువులు లొంగిపోతారేమోనని దైవప్రవక్త(స) ఆశించారు. అయితే బనూ సఖీఫ్ తెగవారు దైవప్రవక్త (స) వద్దకు రాయబారం పంపించారు. చెట్లు రాతి నేలలో నాటబడి ఉన్నందున వాటిని గనక ఒకసారి ధ్వంసం చేస్తే మళ్ళీ ఆ నేలలో చెట్లు పెరగవనీ, అలా చేయకుండా కేవలం పంట వరకు తీసుకోవలసిందని వారు దైవప్రవక్తను కోరారు. చెట్లు నరకటం వల్ల శాశ్వత నష్టం వాటిల్లుతుందని గ్రహించిన దైవప్రవక్త (స) ఆ నిర్ణయం మానుకున్నారు.

తర్వాత దైవప్రవక్త (స) మరో పద్ధతిలో దాడి చేయాలని నిర్ణయించారు. కోటపై నిప్పుల బాణాలు కురిపించి, మెరుపుదాడుల్లో తర్ఫీదైన సైనికుల్ని కోటపైకి వదలాలని అనుకున్నారు అయితే అంతలో ఆయనకు ఒక ఆలోచన వచ్చింది. దైవప్రవక్త (స)కు ఆ నగరంతో ప్రగాఢమైన అనుబంధం ఉంది. తాను ఒక నిస్సహాయ అనాధునిగా ఉన్నప్పుడు తనను పెంచి పోషించిన

https://teluguislam.net



హలీమా దాది ఆ నగరంలోనే నివసించేవారు. ఆ విషయం గుర్తుకు రాగానే ఆయన మనసు ద్రవించిపోయింది.

దైవప్రవక్త (స), ఆయన సహచరులు ఇండ్ల నుంచి బయలుదేరి అప్పటికి రెండు మాసాలు గడిచిపోయాయి. త్వరలో జుల్ ఖాదా నెల కూడా ప్రారంభం కానుంది. ఆ నెలలో యుద్ధం చేయటం నిషిద్ధం. అందుకని దైవప్రవక్త (స)ఒక నిర్ణయానికి వచ్చారు. శత్రువులకు ఓ సందేశం పంపిస్తూ తాము తాయిఫ్ ముట్టడిని ఎత్తివేస్తున్నామనీ, ఈ విషయమై చర్చించటానికి ఒక ప్రతినిధి బృందాన్ని పంపమని ఆ సందేశంలో దైవప్రవక్త (స) శత్రువులను కోరారు. అక్కణ్ణుంచి బయలుదేరే ముందు శత్రువుల నగరంపై శాపం పెట్టమని దైవప్రవక్త (స)ను సహచరులు కోరారు. కాని ఆయన మాత్రం, తాయిఫ్ వాసులకు సత్యాన్ని గ్రహించే సద్బుద్ధిని ప్రసాదించమని అల్లాహ్ను ప్రార్థించారు.

ముస్లింలు మరుసటి సంవత్సరం తిరిగొచ్చి తమ చెట్లను నరికివేశారంటే ఇక తమకు చావు తప్పదని గ్రహించిన శత్రువులు, ముస్లింలపై దాడి చేయటం, వారిని ఎదిరించటం సముచితం కాదని భావించారు. ఇరువర్గాల మధ్య ఒక ఒప్పందం తీసుకువచ్చే విషయమై చర్చించేందుకు తమ ప్రతినిధి బృందాన్ని మదీనా పంపించారు. వారి రాక గురించి తెలుసుకొని దైవప్రవక్త (స) ఎంతో సంతోషించారు.

బనూ సఖీఫ్ బృందం మదీనా నగరానికి చేరుకుంది. చూస్తే అక్కడి ప్రజలందరూ ముస్లింలుగా మారి ఉన్నారు. వారి మొండితనం మెత్తబడింది. ఇప్పుడిక తాము ముస్లింల ముందు లొంగిపోవటమే సముచిత మని భావించారు వారు. కాని ఒక షరతు మీద ఇస్లాంలోకి ప్రవేశించాలని వారు భావించారు. మూడు సంవత్సరాల వరకు తమ విగ్రహాలను పూజించుకోవటానికి అనుమతి ఇవ్వాలని వారు దైవప్రవక్త (స)ను కోరారు. కాని దైవప్రనక్త (స) వారి ఈ షరతును అంగీకరించలేదు. కనీసం ఒక్క సంవత్సరమైనా పూజించుకోనివ్వాలని వారు దైవప్రవక్త (స)ను బ్రతిమాలారు. కాని దైవప్రవక్త (స) ససేమిరా అన్నారు. కనీసం ఆరు నెలల కోసమైనా అనుమతించండి దైవప్రవక్తా!

అని విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (స), తౌహీద్ (ఏకదైవారాధన) విషయంలో ఎట్టి పరిస్థితిలోనూ తాను రాజీపడేదిలేదని, ఖరాకండీగా చెప్పేశారు. ఎట్టకేలకు తాయిఫ్‌వాసులు లొంగిపోయారు.

దైవప్రవక్త (స) తాయిఫ్‌వాసుల పట్ల ఎంతో కరుణావాత్సల్యాలతో వ్యవహరించారు. హునైన్ యుద్ధంలో పట్టుబడిన వారి బందీలను విడుదల చేశారు. ఒకప్పుడు తాయిఫ్‌వాసులు దైవప్రవక్త (స)ను రాళ్లతో కొట్టి ఆయన రక్తం కళ్లచూశారు. తనకు సహాయం చేయమని కోరటానికి వెళితే అత్యంత పరాభవ స్థితిలో నగరం నుంచి వెడలగొట్టారు. అయినా కూడా ప్రస్తుతం దైవప్రవక్త (స) అవేవీ పట్టించుకోలేదు, బేషరతుగా వారి బందీలను విడిచి పెట్టారు. దైవప్రవక్త (స) అవలంబించిన ఉదార వైఖరి వారి మనసుల్ని చాలా ప్రభావితం చేసింది. వారి మనసులు ఇస్లాం వైపు మొగ్గాయి. వారందరూ దృఢమైన ముస్లింలుగా మారిపోయారు.

### గ్రహించవలసిన పాఠాలు

- విధ్వంసంతో కూడిన విజయం దైవప్రవక్త (స) ఆశయం కాదు. యుద్ధ సమయంలో ఆయన మనుషులనే కాదు, వృక్షజాతి సంక్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకున్నారు. తాయిఫ్ నగరాన్ని చూడగానే ఆయనకు తన బాల్యం గుర్తుకు వచ్చింది. చిన్నతనంలో తనను అల్లారుముద్దుగా పెంచిన 'హలీమా అమ్మ' ఆ నగరంలోనే నివసించేదని గుర్తుకురాగానే ఆయన హృదయం ద్రవించిపోయింది. వెంటనే ఆయన యుద్ధ తంత్రంలో మార్పులు చేసుకున్నారు.
- ప్రాణ శత్రువులను సైతం శపించకుండా, వారు సన్మార్గంపైకి రావాలని ప్రార్థించటం ఆయన ఔదార్యాన్ని చాటిచెబుతోంది.
- తౌహీద్ విషయంలో ఎన్నటికీ రాజీపడకూడదు.
- శత్రువులు వ్యక్తిగతంగా తనను ఎంతో బాధపెట్టారు. అయినప్పటికీ దైవప్రవక్త (స) వారి మీద ప్రతీకారం తీర్చుకోలేదు. పైగా వారిపట్ల కరుణా వాత్సల్యాలతోనే వ్యవహరించారు. ఫలితంగా ప్రాణశత్రువులు సైతం ప్రాణ మిత్రులుగా మారి ఇస్లాంలో దృఢవిశ్వాసులుగా రాణించారు.

https://teluguislam.net



# ముగ్గురు ముస్లింల బహిష్కారం

(ఖుర్‌ఆన్ 9 : 118)

ఏ 'ముగ్గురి' వ్యవహారం వాయిదా వేయబడిందో వారి వైపుకు కూడా (అల్లాహ్ దయతో మరలాడు). భూమి విశాలంగా ఉండి కూడా వారికి ఇరుకైపోయింది. వారి ప్రాణాలు కూడా వారికి భారమైపోయాయి. అల్లాహ్ పట్టు నుంచి తమను కాపాడుకోవటానికి ఆయన వైపుకు మరలటం తప్ప మార్గాంతరం లేదని వారు గ్రహించారు. ఇక మీదట కూడా వారు ఈ విధంగా మరలి వచ్చేటందుకు గాను అల్లాహ్ వారి వైపుకు మరలాడు.

మండు వేసవి. మదీనాలో బాగా డబ్బు కొరత ఉంది. ప్రతి ఒక్కడూ కోత కొచ్చిన పంటను అమ్ముకొని డబ్బు సంపాదించుకోవాలని ఎదురు చూస్తున్న కాలం అది. సరిగ్గా ఆ సమయంలోనే, జిహాద్ కోసం సన్నద్ధం కావాలంటూ దైవ ప్రవక్త (స) తరపున ముస్లింలకు ఒక ఉత్తర్వు వెలువడింది. తబూక్‌వాసులు జకాత్ పన్నులు చెల్లించటానికి నిరాకరించారు, కనుక వారి మీద సైనిక చర్య చేపట్ట వలసిన అవసరం ఏర్పడిందని దైవప్రవక్త (స) చెప్పారు. అసలే గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న ముస్లింలు ఈ యుద్ధ వార్త విని మరింత కలవరానికి గురయ్యారు.

ప్రారంభంలో ముస్లింలు దైవ ప్రవక్త ఆదేశాన్ని అర్థం చేసుకోలేక పోయారు. దానికి మొదటి కారణం, అంతకు ముందెన్నడూ వాళ్లు అటువంటి మండు వేసవిలో ప్రయాణాలు చేయలేదు. రెండవ కారణం, ప్రస్తుతం వారు పంటను కోసి భద్రపరచుకునే పనిలో ఉన్నారు. కోతకొచ్చిన పంటను అలాగే వదిలేసి వెళితే పంటకు విపరీతమైన నష్టం వాటిల్లుతుంది. అసలే దారిద్ర్యంతో మగ్గుతున్న వారి జీవితాలు మరింత దుర్భరమైపోతాయి. విశ్వాసంలో బాగా పరిపక్వతనొందిన కొంత మంది అగ్రశ్రేణి ముస్లింలు కూడా ఇదంతా ఆలోచించు

https://teluguislam.net



కొని మొదట్లో యుద్ధానికి వెళ్లకుండా ఉండాలని నిశ్చయించుకున్నారు. అయితే ఇస్లాం పట్ల వారికి గల ప్రగాఢ విశ్వాసం, అనంతరం వారిలోని ఈ తాత్కాలిక బలహీనతను దూరం చేసేసింది.

ఈ సందర్భంగా ముస్లింల పోరాట స్ఫూర్తికి గండి కొట్టటానికి కపటులు విశ్వప్రయత్నాలూ చేశారు. కాని వారికి అడుగడుగునా అపజయమే ఎదురైంది. ప్రజలు ఇస్లాం పట్ల మొక్కవోని విశ్వాసాన్ని ప్రదర్శించారు. కపటులకు ఇది చెంపపెట్టు అయింది.

మొత్తానికి ఒక పెద్ద సైన్యం యుద్ధానికి బయలుదేరింది. కొందరు మదీనా లోనే ఉండిపోయారు. అన్ని విధాలా ఆరోగ్యంగా ఉండి కూడా వారు యుద్ధానికి బయలుదేరలేదు. వారిలో ఈ నలుగురు ముస్లింలు కూడా ఉన్నారు: అబూ ఖైసమా, కాబ్ బిన్ మాలిక్, మురారా బిన్ రబీ, హిలాల్ బిన్ ఉమయ్యా.

అబూ ఖైసమాకు ఇద్దరు భార్యలు. వారిద్దరూ భర్తను సంతోషపెట్టటంలో పరస్పరం పోటీపడేవారు. ఇద్దరూ ఆయనకు ఎంతో రుచికరమైన వంటకాలు వండిపెట్టేవారు. ఒకనాటి రుచికరమైన భోజన సమయంలో ఆయనకు దైవప్రవక్త (స) గుర్తుకువచ్చారు. ముస్లిం సైన్యం ఎక్కడ ఉన్నదో, వారి దగ్గర చాలినన్ని ఆహారపానీయాలు ఉన్నాయో లేవో అనే ఆలోచనలు ఆయన మనసును కలవరపెట్టాయి. అంతే, ఎంతో రుచికరమైన ఆ భోజనాన్ని సైతం పక్కకు నెట్టేసి, "అక్కడ దైవప్రవక్త (స) మండుటెండల్లో, మలమల మాడే ఇసుక ఎడారిలో ధర్మం కోసం శ్రమిస్తుంటే, నేను చల్లటి నీడలో, విందులు ఆరగిస్తూ, అందమైన స్త్రీలతో ఆనందిస్తూ గడపటమా?! అసంభవం. నా భార్యల్లో ఎవరి ఇంటికీ నేను వెళ్ళను, దైవప్రవక్త (స)తో కలిసి యుద్ధం చేయటానికి ఇప్పుడే బయలుదేరుతాను, అల్లాహ్ సాక్షి" అంటూ భోజనం మీద నుంచి లేచారు. ఆయుధాలు ధరించి సైన్యంలో కలవటానికి బయలుదేరారు.

## రేపుమాపులతోనే గడిచిపోయిన పుణ్యకాలం!

మిగతా ముగ్గురు కొన్ని రోజులు ఆనందంగా గడిపారు. తర్వాత వారికి తమ తప్పు తెలిసొచ్చింది. అదీగాక మదీనాలో స్త్రీలు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు, ముసలివారు తప్ప మరెవరూ లేరని తెలిసినప్పుడు పశ్చాత్తాపంతో వారు మరింత కుమిలిపోయారు. ఇప్పుడైనా తాము జిహాద్‌లో పాల్గొనాలని నిశ్చయించు



కున్నారు. కాని అప్పటికే చాలా ఆలస్యమైపోయింది. దైవప్రవక్త (స) జిహాద్ కార్యం ముగించుకొని వెనుతిరగటమూ జరిగింది. ఆయన మదీనా చేరుకునే సమయం దగ్గరపడేకొద్దీ, తమ పిరికితనానికి ఆయన ముందు ఏం జవాబు చెప్పాలనే ఆందోళన వారిలో పెరిగి పోసాగింది. తబూక్ నుంచి తిరిగి రాగానే దైవప్రవక్త (స) మొట్టమొదటగా మస్జిద్‌కు వెళ్ళారు. కృతజ్ఞతా ప్రార్థనలు చేశారు. తర్వాత ప్రజలను కలిసేందుకు అక్కడే ఆసీనులయ్యారు. కపటులు ఒక్కొక్కరే ఆయన ముందుకు వచ్చి యుద్ధంలో పాల్గొనలేకపోవటానికి ఏవో సాకులు చెప్పసాగారు. దైవప్రవక్త (స) వారి కట్టుకథలు విని, "మీ మాటల్లోని నిజాయితీ గురించి అల్లాహ్‌కు మాత్రమే తెలుసు, ఆయనే మీ గురించి తీర్పు చేస్తాడు" అన్నారు. తర్వాత కాబ్ వంతు వచ్చింది. ఆయన మెల్లగా దైవప్రవక్త (స) ముందుకు వెళ్ళి పలకరించారు. ఆయన్ని చూస్తూనే దైవప్రవక్త (స) చిరు నవ్వును చిందిస్తూ, "నువ్వు ఎందుకు వెనక ఉండిపోయావు?" అని అడిగారు. కాసేపటిదాకా ఏం జవాబు చెప్పాలో కాబ్‌కు అర్థం కాలేదు. ఆయన చాలా మాటకారి. తలచుకుంటే క్షణాల్లో ఆయన ఒక కథ అల్లేసి ఎదుటివారిని మెప్పించ గలరు. కాని ఇప్పుడు పరిస్థితి వేరు. దైవప్రవక్త (స) ఆయన్ని యుద్ధానికి రాకపోవ టానికి కారణమేమి టని అడుగుతున్నారు. అందుకని ఆయన ఎంతో వినయంగా, నిజాయితీగా జవాబు చెప్పారు. "దైవప్రవక్తా! నేను మదీనాలో ఉండిపోవటానికి కారణమంటూ ఏమీ లేదు. సైన్యంతోపాటు బయలుదేరటానికి ఆ సమయంలో నేను అన్ని విధాలా ఆరోగ్యంగానే ఉన్నాను" అన్నారు. దానికి దైవప్రవక్త (స) బదులిస్తూ, "నువ్వు నిజం చెబుతున్నావు" అన్నారు. తర్వాత ఆయన్ని ఉద్దేశించి, "అల్లాహ్ నీ వ్యవహారాన్ని తేల్చేదాకా వేచి ఉండు" అని చెప్పారు. మిగతా ఇద్దరు, హిలాల్ మరియు మురారాలు కూడా ఎటువంటి అబద్ధపు సాకులు చెప్పకుండా నిజాయితీగా తమ తప్పును ఒప్పుకున్నారు. ఆ ముగ్గురితో ఎటువంటి సంబంధాలు పెట్టుకోరాదని, సామాజికంగా వారిని బహిష్కరించాలని దైవప్రవక్త (స) ప్రజలకు ఆదేశించారు.

హిలాల్ మరియు మురారాలు తమ ఇండ్లల్లోనే స్వీయ నిర్బంధానికి పూను కున్నారు. బయటికి వెళ్ళకుండా తమల్ని తాము ఇండ్లల్లోనే కట్టిపడేసు కున్నారు. కాని కాబ్ బాగా యువకులు. కాబట్టి రోజులాగే ఆయన మార్కెట్టుకి వెళ్ళేవారు,

https://teluguislam.net



మస్జిదుకు వెళ్తుండేవారు. దైవప్రవక్త (స)కు సలాం చేసేవారు. కాని ఆయన నుంచి ఎటువంటి సమాధానమూ లభించేది కాదు. కొంతకాలం తర్వాత ఆయన ఏకాంతాన్ని భరించలేకపోయారు. అందుకని తన బంధువు అబూ ఖతాదాను కలవటానికి బయలుదేరారు. ఖతాదా ఇంటి గోడ దూకి లోపలికి వెళ్ళారు. ఖతాదాకు సలాం చేశారు. కాని ఆయన మాత్రం జవాబు చెప్పలేదు. దాంతో కాబ్‌కు కోపమొచ్చింది. "అబూ ఖతాదా! దేవుడి మీద ప్రమాణం చేసి అడుగుతున్నాను, చెప్పు. దేవుణ్ణి, దైవప్రవక్త(స)ను నేను ఎంతగానో అభిమానిస్తున్నానన్న సంగతి నీకు తెలియదా?" అని గట్టిగా అడిగారు. అబూ ఖతాదా మౌనంగా ఉన్నారు. కాబ్ మళ్లీ మళ్లీ ఆయన్ని ప్రశ్నించారు. కాని ఎంత అడిగినా ఆయన జవాబు చెప్పలేదు. ఆఖరిసారి అడిగినప్పుడు "అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు" అని చెప్పి ఊరుకున్నారు. ఆ సమాధానం వినగానే కాబ్‌కు దుఃఖం ముంచుకొచ్చింది. కళ్ల వెంబడి అశ్రుధారలు ప్రవహించాయి.

## వల విసిరిన గస్సాన్ రాజు!

ఒక రోజు కాబ్ బజారు గుండా నడుచుకుంటూ వెళ్తున్నారు. ఆయనకు ఒక క్రైస్తవుడు ఎదురై, పట్టువస్త్రంలో చుట్టబడి ఉన్న ఒక లేఖ అందించాడు. అందులో ఇలా రాసి ఉంది:

> ***"మీ నాయకుడు మిమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నాడని మాకు తెలిసింది. మీరు మామూలు కుటుంబంలో పుట్టినవారు కాదు. మదీనాలో ఉండి మీరు బాధల్ని భరించటం మాకు అస్సలు నచ్చటం లేదు. మీరు మా దగ్గరికి రండి. ఇక్కడ మీకు ఏ లోటూ ఉండదు. దయచేసి మీకు సకల మర్యాదలు చేసుకునే సౌభాగ్యాన్ని మీరు మాకు కలుగజేస్తారని ఆశిస్తున్నాం."***

అది చదివి కాబ్ భోరున ఏడ్చేశారు. ఉత్తరం చించి అవతల పారేశారు. మనస్ఫూర్తిగా ఇస్లాం స్వీకరించిన వ్యక్తి ఆయన. ఇతర ఏ సంపద, ఏ గౌరవమూ ఆయన్ని ఈమాన్ భాగ్యం నుంచి వేరుచేయజాలదు.

కాబ్, ఆయనగారి ఇద్దరు మిత్రులు సమాజం నుంచి బహిష్కరించబడి అప్పటికి నలభై రోజులు అయ్యాయి. తర్వాత ఆ ముగ్గురు తమ భార్యలకు



కూడా దూరంగా ఉండాలని దైవప్రవక్త (స) తరఫు నుంచి మరో ఆదేశం వెలువడింది.

హిలాల్ భార్య దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళి, "దైవప్రవక్తా! హిలాల్ బొత్తిగా నిస్సహాయులు. నేను ఆయన వెంట ఉండకపోతే ఆయన ఇంకా చాలా బాధపడతారు. కనుక ఆయనకు తోడుగా ఉండటానికి దయచేసి నన్ను అనుమతించండి" అని కోరింది. దైవప్రవక్త (స), "నువ్వు ఆయన బాగోగులు చూడవచ్చు. కాని ఆయన వెంట ఆయన భార్యగా మాత్రం ఉండకూడదు" అన్నారు. ఆ మాట విని నవ్వుతూ ఆమె, "మీరు ఆయనకు ఏకాంతం విధించినప్పటి నుంచి, తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపంతో ఏడుస్తూ ఉండటంలోనే ఆయన కాలం గడచిపోతోంది దైవప్రవక్తా!" అని చెప్పి వెళ్ళిపోయింది.

కాబ్, దైవప్రవక్త (స) దగ్గరికి వెళ్ళి, "దైవప్రవక్తా! నేను నా భార్యకు విడాకులు ఇవ్వాలా?" అని అడిగారు. అందుకు దైవప్రవక్త (స), "నువ్వు ఆమెకు దూరంగా ఉండాలని మాత్రమే చెప్పాను" అని ముక్తసరిగా సమాధానమిచ్చారు.

హిలాల్ భార్య తన భర్తకు తోడుగా ఉండటానికి దైవప్రవక్త (స) నుంచి అనుమతి తీసుకున్నారు. అది చూసి కాబ్ బంధుమిత్రులు చాలా మంది, "నీ భార్యను కూడా దైవప్రవక్త (స) వద్దకు వెళ్ళి అనుమతి తీసుకోమని చెప్పు" అని ఆయనకు సలహాలు ఇవ్వసాగారు. కాని అందుకు ఆయన నిరాకరించారు. "హిలాల్ ముసలివారు. అందుకని ఆయన దైవప్రవక్త (స) దగ్గర అనుమతి కోరారు. కాని నేను యువకుణ్ణి. ఆ విధమైన అనుమతి అడగటానికి నా దగ్గర ఎలాంటి కారణమూ లేదు" అంటూ ఆయన వారి సలహాను త్రోసిపుచ్చారు.

యాభయవ రోజున దైవప్రవక్త (స) మీద అల్లాహ్ వాణి అవతరించింది. ఆ ముగ్గురి పశ్చాత్తాప భావాన్ని అల్లాహ్ స్వీకరించాడని ఆయన ఎంతో సంతోషంగా ప్రకటించారు. కొంత మంది ముస్లింలు ఆ శుభవార్త అందజేయటానికి కాబ్ మిత్రుల దగ్గరికి పరుగెత్తుకుని వెళ్ళారు. దైవప్రవక్త (స) దగ్గరి నుంచి వచ్చిన ఆ శుభవార్త విని కాబ్ ఎంతగానో సంతోషించారు. ఒంటి మీదున్న చొక్కా తీసి ఆ శుభవార్త మోసుకొచ్చిన వానికి కానుకగా ఇచ్చారు. తర్వాత దైవప్రవక్త (స)ను కలవటానికి మస్జిద్‌వైపు పరుగెత్తారు. దైవప్రవక్త (స) ఆయన్ని చూసి,

https://teluguislam.net



"సంతోషించు కాబ్! ఈ రోజు నీ జీవితంలో అత్యంత సంతోషదాయకమైన రోజు" అంటూ అభినందించారు. కాసేపటికి హిలాల్, మురారాలు కూడా అక్కడికి చేరుకున్నారు. వారి గురించి అవతరించిన ఖుర్‌ఆన్ వాక్యాలు దైవప్రవక్త (స) వారికిచదివి వినిపించారు :

> "ఇంకా వ్యవహారం వాయిదా వెయ్యబడిన ఆ ముగ్గురిని కూడా ఆయన క్షమించాడు. ఇంత పెద్ద వైశాల్యం కలిగి ఉండి కూడా, భూమి వారికి ఇరుకై పోయింది. వారి ప్రాణాలు కూడా వారికి భారమైపోయాయి. అల్లాహ్ నుండి తమను కాపాడుకోవటానికి స్వయంగా అల్లాహ్ కారుణ్యం తప్ప వేరే ఆశ్రయం ఏదీ లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు అల్లాహ్, కనికరంతో వారి వైపునకు మరలాడు, వారు ఆయన వైపునకు మరలి వచ్చేటందుకు. నిశ్చయంగా ఆయన చాలా క్షమించేవాడూ, కరుణించే వాడూను." *(దివ్యఖుర్‌ఆన్ 9 : 118)*



# విశ్వాసుల మాతపై కపటుల నీలాపనిందలు

**(ఖుర్‌ఆన్ 24 : 23)**
సౌశీల్యవతులుగా ఉన్న, ఏ పాపం ఎరుగని విశ్వసించిన స్త్రీలపై అపనింద మోపేవారు ఇహపరాలలో శపించబడ్డారు. వారి కోసం చాలా పెద్ద శిక్ష ఉంది.

పడమటి దిక్కున సూర్యుడు అస్తమించాడు. ఎడారి మొత్తం, మెల్లగా రేచీకటి ఒడిలోకి జారుకుంటోంది. కాసేపటికి ఆ ప్రదేశమంతా అంధకారం అలుముకుంది. చెవులు మూసుకుపోయినట్లు నిశ్శబ్దం!

బనూ ముస్తలిక్‌తో యుద్ధం ముగిసిన తర్వాత జరిగిన సంఘటన ఇది. దైవప్రవక్త (స), ఆయన సహచరులు బనూ ముస్తలిక్ ప్రాంతం నుంచి మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు. సైన్యమంతా ఆ ఎడారి ప్రాంతాన్ని దాటుకొని ముందుకు వెళ్ళిపోయింది. అందరికంటే వెనుక ఒక కావలివాడు సైన్యం వెళ్ళిన దారిని పరిశీలిస్తూ, తాను కూర్చొని ఉన్న ఒంటెను ముందుకు ఉరికిస్తున్నాడు. ఆయన పేరు సఫ్వాన్ బిన్ ముఅత్తల్ (రజి). సులైమ్ తెగకు చెందినవారు. ముస్లింల వస్తువులు ఏవైనా దారిలో పడిపోతే వాటిని తీసుకు వచ్చే బాధ్యత ఆయనకు అప్పజెప్ప బడింది. సైన్యం నడిచిన దారిని పరిశీలించుకుంటూ వెనుక నుంచి వస్తున్నారాయన. సైన్యం చాలా దూరం వెళ్ళిపోయింది. తిరిగి సైన్యంలో కలవటానికి ఆయన త్వరత్వరగా వెళ్తున్నారు. దార్లో ఆయనకు ఏదో వస్తువు నేల మీద పడివున్నట్లు కనిపించింది. వెంటనే ఆయన ఒంటెను ఆపటానికి ప్రయత్నిం

చారు. కాని వేగంలో ఉన్న ఆ ఒంటె కాస్త ముందుకు పోయిగాని ఆగలేదు. ఒంటె దిగి వెనక్కి వచ్చారాయన. చూస్తే ఎవరో మనిషి దుప్పటి కప్పుకొని పడుకొని ఉన్నట్లు కనిపించింది. అప్పటికి ఇంకా పొద్దుపోలేదు. చుట్టూ మసక చీకటి ఉంది. అయినా పరిసరాలు మాత్రం స్పష్టంగానే కనిపిస్తున్నాయి. ఆ వ్యక్తి వైపు ఆయన బాగా పరిశీలనగా చూశారు. ఆమె దైవప్రవక్త (స) భార్య ఆయిషా (రజి. అన్‌హా) అని అర్థం కాగానే వెనక్కి తిరిగి, ఎడారిలో ఈ వేళ ఒంటరిగా ఈమె ఇక్కడ ఎందుకు ఉన్నారు? అని ఆలోచనలో పడిపోయారు. అక్కడ జరిగిన అలికిడికి ఆయిషా (రజి.అన్‌హా)కు మెలకువ వచ్చింది. ఆమె ఉలిక్కిపడి లేచారు. ఎవరో వ్యక్తి ముందు నిలుచుని ఉండటం చూసి మొహం మీద వస్త్రం కప్పుకున్నారు.

"ఓ గౌరవ నారీ! మీరు ఇక్కడేం చేస్తున్నారు?" అని అడిగారు సఫ్వాన్. భయంతో వణికిపోతున్న ఆయిషా (రజి.అన్‌హా) ఆయనకు సమాధానం కూడా చెప్పలేకపోయారు. సఫ్వాన్ (రజి) ఒంటెను ఆమె ముందుకు తీసుకువచ్చి కూర్చోబెట్టారు. ఆమెను ఒంటె మీద కూర్చోమని చెప్పారు. తర్వాత ఒంటె కళ్లెం పట్టుకొని సైన్యం వెళ్ళిన దారిలో నడవటం ప్రారంభించారు. ఆ చీకట్లో నడుచుకుంటూ వెళ్ళినప్పుడు వారిరువురి మధ్య ఎలాంటి సంభాషణ జరగలేదు. మర్నాడు మధ్యాహ్నానికి వారు సైన్యం దగ్గరికి చేరుకోగలిగారు. ఆయిషా (రజి. అన్‌హా) ఒంటె మీద కూర్చొని ఉండటం, ఆ ఒంటెను సఫ్వాన్ తోలుకొని రావటం చూసి దైవప్రవక్త (స) ఆశ్చర్యపోయారు. "ఏం జరిగింది? నువ్వు ఎలా వెనక బడ్డావు? అని దైవప్రవక్త (స) ఆమెను అడిగారు.

అప్పుడు ఆయిషా (రజి.అన్‌హా) ఇలా వివరించారు!

"నిన్న రాత్రి మీరు విడిది నుంచి బయలుదేరినప్పుడు నేను కాలకృత్యాల కోసం వెళ్ళి ఉన్నాను. తిరిగి వచ్చినప్పుడు నా హారం ఎక్కడో పడిపోయింది. మళ్ళీ నేను హారం వెతుక్కోవటానికి వెళ్ళాను. నేను తిరిగొచ్చేసరికల్లా మీరంతా వెళ్ళిపోయారు. నేను ఎన్నో సార్లు కేకవేశాను. కాని ఎవరూ నా కేకలు వినిపించుకోలేదు. అక్కడే ఉండిపోవటం మంచిదనుకున్నాను. నేను లేకపోవటం చూసి మీరు నన్ను వెతుక్కుంటూ తిరిగి అక్కడికి వస్తారని నేను భావించాను. నా దుప్పటిని నిండుగా కప్పుకొని ఆ ఇసుక మీదే మేను వాల్చాను. కాసేపటికి నాకు నిద్రపట్టింది. తిరిగి నేను కళ్లు తెరిచి చూసినప్పుడు సఫ్వాన్ నా ముందు కనిపించారు. ఆయనే

https://teluguislam.net



దయతో నన్ను ఇక్కడికి తీసుకువచ్చారు. సఫ్వాన్‌కు మంచి బహుమానం ఇవ్వాలి."

దైవప్రవక్త (స) ఆమెను కొంచెం కూడా అనుమానించలేదు. అసలు ఆయన ఎందుకు అనుమానిస్తాగు? ఆమె ఎవరు? అబూ బక్ర్ (రజి) కుమార్తె. ఎంతో పరువు ప్రతిష్ఠలు గల కుటుంబం ఆయనది. ఆమె పవిత్రతను, నైతికతను అనుమానించటానికి అస్సలు వీలులేదు. అదీగాక ఆమె దైవప్రవక్త (స) సహధర్మచారిణి. ఒక అపవిత్ర స్త్రీతో తన ప్రవక్త కాపురం చేయటానికి దేవుడు అసలు అవకాశం కల్పించడు. దైవప్రవక్త (స) ఆమెను అనుమానించలేదు. పైగా తన ప్రియ సతీమణికి కలిగిన అసౌకర్యానికి ఆయన ఎంతగానో చింతించారు. సైన్యాన్ని తొందరగా ఇండ్లకు చేర్చాలన్న తొందర్లో ఆయన ఆమె బాగోగుల్ని మరచిపోయారు.

## నీచమైన నీలాపనిందలు

కొందరు చాలా విచిత్రమైన మనస్తత్వం కలిగివుంటారు. పొద్దస్తమానం ఇతరుల తప్పులెన్నుతూ, ఉబుసుపోక కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటారు. ఇతరుల మనసు నొప్పించటంలో వారి నాలుకలు చురకత్తుల్లా పనిచేస్తాయి. దైవప్రవక్త (స) కాలంలో మదీనాలోనూ ఇటువంటి అనుమానాల అయ్యలు కొందరు ఉండేవారు. ఆయిషా (రజి.అన్‌హా)కు - ఆ యువకునికి మధ్య ఏదో అక్రమం జరిగివుంటుందని వారు అనుమానం లేవదీశారు. ఆ యువకునికి మంచి బహుమానం ఇవ్వాలన్న ఆయిషా (రజి.అన్‌హా) ప్రతిపాదనను వారు తమ అపనిందకు ఆధారంగా చూపెట్టారు. దైవప్రవక్త (స) అంటే గిట్టనివారికి ఈ సంఘటన అందివచ్చిన అవకాశం అయింది. దైవప్రవక్త కుటుంబ మర్యాదల్ని కాలరాయాలని కాచుకొని వున్నవారికి ఈ సంఘటన ఒక వరమయింది. దైవప్రవక్త (స)ను ఆయన అనుయాయులందరి ముందు తల వంచుకునేలా చేయాలని దుర్మార్గులు పథకం రచించారు.

విశ్వాసుల మాత, దైవప్రవక్త సతీమణి ఆయిషా (రజి.అన్‌హా)పై మోపబడిన ఇటువంటి నీచమైన అపనిందలకు బాగా ప్రచారం కల్పించిన వ్యక్తి ఉబై కుమారుడు అబ్దుల్లాహ్. ఇతను ముందు నుంచే కపటుల నాయకునిగా వ్యవహరిస్తూ వచ్చాడు. సాబిత్ కుమారుడు హస్సాన్, అసాసా కుమారుడు మిస్తహ్

లాంటి కొంతమంది ముస్లింలు కూడా అమాయకంగా ఆ కపటనాయకుని వలలో చిక్కుకున్నారు. మదీనాలో ఈ దుష్ప్రచారం విపరీతంగా వ్యాపిస్తూ పోసాగింది. ఆ ఇరువురు సౌశీల్యవంతుల మధ్య అనైతిక సంబంధాన్ని తాము కళ్లారా చూసినట్లే జనం చెప్పుకోసారు. అయితే, ప్రజల ఈ అనుచిత వ్యాఖ్యలు ఇంకా ఆయిషా (రజి.అన్హా) చెవులకు సోకలేదు. ఆమె దైవభక్తి, ధర్మపరాయణ తల గురించి తెలిసిన ప్రజలు ఆ సౌశీల్యవతి ముందు ఈ అనుచిత వ్యాఖ్యల గురించి ప్రస్తావించేందుకు కూడా ధైర్యం చేయలేకపోయారు. చాపక్రింద నీరులా వ్యాపిస్తూ పోతున్న ఈ దుష్ప్రచారం గురించి దైవప్రవక్త (స)కు కూడా ఏమీ తెలియకపోవటం విశేషం.

## నిరాదరణకు గురైన భార్య

ఆ కాలంలోనే ఆయిషా (రజి.అన్హా) జబ్బు పడ్డారు. తీవ్రమైన జ్వరం కారణంగా కొన్ని రోజులు ఆమె మంచంలో పడ్డారు. ఇంట్లో ఆమె బాగోగులు చూసేవారు, ఆమెకు ధైర్యం చెప్పేవారూ అందరూ ఉన్నారు. కాని ఆమె అస్వస్థత తగ్గే సూచనలు మాత్రం కనిపించలేదు. అందుకు ఇదీ ఒక కారణం; అంతకు ముందు ఆమె ఎప్పుడు జబ్బుపడినా దైవప్రవక్త (స) ఆమె ప్రక్కన కూర్చొని ఆమెకు ధైర్యం చెబుతుండేవారు. కాని ప్రస్తుతం దైవప్రవక్త (స) ధర్మకార్యాల్లో ఎక్కువగా నిమగ్నులై వుండటం వల్ల ఆమె బాగోగుల్ని అంత బాగా పట్టించుకోలేకపోయారు. దాంతో ఆవిడ మనస్తానికి గురయ్యారు. తన అసంతృప్తిని పరోక్షంగా వెలి బుచ్చుతూ, పుట్టిం టికి వెళ్ళేందుకు తనకు అనుమతి ఇవ్వమని ఆవిడ దైవప్రవక్త (స)ను కోరారు. బహుశా అనారోగ్య స్థితిలో ఆమెకు తల్లిదండ్రుల అవసరం ఉందేమో అని భావించి దైవప్రవక్త (స) కూడా అడిగిన వెంటనే అనుమతి ఇచ్చేశారు. అదీ ఆమెకు నచ్చలేదు. ఆమె మరింత అసంతృప్తికి లోనయ్యారు. తను ఆయనకు దూరంగా ఉంటే, అప్పుడైనా ఆయనకు తన ఆరోగ్యం గురించి ఆలోచన వస్తుందని భావించి ఆమె పుట్టింటికి వెళ్లిపోయారు. తన తల్లిదండ్రుల వద్ద మొత్తం ఇరవై రోజులు ఉన్నారు. దైవకృపతో ఆ కాలంలో అనారోగ్యం నుంచి ఆవిడ పూర్తిగా కోలుకున్నారు.

## వణికించిన వార్త

ఒకరోజు ఆయిషా (రజి.అన్హా) సరుకులు కొనటానికి అంగడికి వెళ్ళారు.


https://teluguislam.net

ఆమె వెంట మిస్తహ్ తల్లి కూడా ఉన్నారు. మిస్తహ్ నికార్సయిన ముస్లిం అయినప్పటికీ ఆయిషా (రజి.అన్హా) విషయంలో మాత్రం ఆయన విశ్వాసం ఆయన్ని కపటులతో వంతపాడకుండా ఆపలేకపోయింది. ఆయన తల్లి ఆయిషా (రజి.అన్హా)కు తోడుగా అంగడిలో నడుస్తూ ఉండగా ఆమె తొడుక్కుని వున్న పొడువాటి బట్టలు ఆమె కాళ్ళల్లో ఇరుక్కున్నాయి. క్రిందికి తూలిపోతూ ఆమె, “మా మిస్తహ్ నాశనం గాను!” అన్నారు. అది విని ఆయిషా (రజి.అన్హా) నిర్ఘాంత పోయారు. తల్లి తన సొంత కుమారుణ్ణే శపిస్తుండటం ఆమెకు విస్మయం కలిగించింది. “బద్ర్ యుద్ధంలో ఇస్లాం కోసం వీరోచితంగా పోరాడిన యోధుడు మీ అబ్బాయి. ఆయన్ని గురించి ఎందుకు అలా అంటారు?” అని మామూలుగానే అడిగారు ఆయిషా (రజి.అన్హా). “నీకు తెలియదా అమ్మా?” అని అమాయకంగా అడిగింది ఆ తల్లి. మదీనా నగరంలో ఆయిషా (రజి) గురించి చెప్పుకుంటున్న విషయాలన్నీ ఆవిడ ముందు ఏకరువుపెట్టింది. ఆ అపనిందల గురించి వినగానే ఆయిషా (రజి)కు గుండె ఆగినంత పనయింది. వెంటనే అక్కణ్ణుంచి ఇంటికి పరుగెత్తా రామె. ఇంటికి చేరుకోగానే తల్లిదండ్రుల ముందు భోరున ఏడ్చేశారు. “అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక! జనం నా మీద ఇంత పెద్ద అభాండాలు వేస్తుంటే, నాకు ఒక్క మాటయినా చెప్పకుండా దాస్తారా?” అని తల్లిని ప్రశ్నించారు. అందుకు ఆవిడ గారి తల్లి, “అమ్మాయీ! ఈ పుకార్లను నువ్వు అస్సలు పట్టించుకోవద్దు. నువ్వు ఒక అందమైన మహిళవి. నీ ఆయన నిన్ను అమితంగా ప్రేమిస్తారు. అయితే ఆయనకు ఇతర భార్యలు కూడా ఉన్నారు. అలాంటప్పుడు వారు నీ గురించి ఉబుసుపోక మాటలు మాట్లాడుకోవటం సహజమే” అంటూ తన కూతురికి నచ్చజెప్పటానికి ప్రయత్నించారు.

## ప్రవక్త (స)కూ తెలిసింది

సుమారు నెల రోజుల వరకు మదీనా ప్రజలు ఈ దుష్టవదంతి గురించి చిలవలు పలవలుగా చెప్పుకుంటూ ఉన్నారు. మనల్ని ఎవరైనా దూరం నుంచి అదేపనిగా చూస్తూ మాట్లాడుకుంటున్నారు, కాని మనం అక్కడకు చేరుకోగానే ఒక్కసారిగా వారు ఆ సంభాషణ ఆపేస్తారనుకోండి; అప్పుడు మనకు ఎలా అనిపిస్తుంది? మన గురించి వాళ్లు ఏం చెప్పుకుంటున్నారో ఆ తెలుసుకోవాలనే ఆత్రుత మనలో కలగటం సహజమే కదా! దైవప్రవక్త (స) పట్ల కూడా మదీనాలో అలాగే జరిగింది.

https://teluguislam.net



దైవప్రవక్త (స) చాలా తెలివైనవారు. ప్రతి విషయాన్ని ఆయన చాలా సునిశితంగా పరిశీలిస్తారు. తన చుట్టూ ఏదో సమస్య పరిభ్రమిస్తున్న సంగతి ఆయనకు అర్థమయింది. ఆ తర్వాత సహజంగానే ఆయనలో కొద్దిగా ఆందోళన మొదలయింది. వెంటనే ఆయన తనకు బాగా నమ్మకస్తులైన సహచరులను, దగ్గరి బంధువులను పిలిచి విషయం ఏమిటని అడిగారు. తర్వాత ఆయన, తన మరో భార్య, జహష్ కుమార్తె జైనబ్ దగ్గరకు వెళ్లారు. దైవప్రవక్త (స) పట్ల ప్రేమ విషయంలో జైనబ్‌కు - ఆయిషాకు మధ్య ఎప్పుడూ పోటీ ఉండేది. మదీనా ప్రజలు ఇంత రహస్యంగా ఏం మాట్లాడుకుంటున్నారో నీకేమయినా తెలుసా? అని అడిగారు. తాను ఆ నోట, ఈ నోట విన్న ఒకటి అరా మాటలు జైనబ్ (రజి. అన్‌హా) దైవప్రవక్త (స)తో చెప్పారు. సాధారణంగా ఇటువంటి పరిస్థితుల్లో ఏ స్త్రీ అయినా తన సవతి గురించి ఒకటికి నాలుగు అబద్ధాలు జోడించి చెబుతుంది. కాని జైనబ్ (రజి.అన్‌హా) మాత్రం ఆయిషా (రజి)కు వ్యతిరేకంగా పల్లెత్తు మాట అనలేదు. పైగా ఆమె మంచితనాన్ని మెచ్చుకుంటూ మాట్లాడారు. "ఇటువంటి అభాండాల నుంచి నేను నా చెవుల్నీ, దృష్టిని కాపాడుకుంటాను. ఆయిషా (రజి. అన్‌హా) గురించి నాకు బాగా తెలుసు. తను చాలా మంచి అమ్మాయి. అల్లాహ్ ఉన్నాడన్న మాట ఎంత సత్యమో నేను చెబుతున్న ఈ మాట కూడా అంతే సత్యం" అన్నారామె.

తర్వాత దైవప్రవక్త (స) తన బాబాయి కుమారుడు అలీ (రజి)ని సంప్రతించారు. "ఆయిషా గారి పనిమనిషి బురైరా. ఆమెను అడిగితే బాగుంటుంది కదా!" అని ఆయన సూచించారు. ఈ దుష్ప్రచారం గురించి నీకు ఏమి తెలుసని దైవప్రవక్త (స) బురైరాను ప్రశ్నించారు. అందుకు సమాధానమిస్తూ, "నాకు తెలిసినంత మటుకు ఆయిషాగాంలో అనుమానించదగిన విషయం ఏదీ లేదండీ. అప్పుడప్పుడూ ఆమె పిండిని నానబెడ్తారు. తర్వాత ఆ సంగతి మరిచిపోయి ఆదమరచి నిద్రపోతారు. దాంతో కోళ్లు మొదలైనవి వచ్చి ఆ పిండి మొత్తం ఆరగించి వెళ్లిపోతాయి. అంతకు మించిన నిర్లక్ష్యం ఏదీ నేను ఆమెలో చూడలేదు" అని చెప్పింది బురైరా.

## ప్రజలకు ప్రబోధనం

చాలా రోజులు గడిచిపోయాయి. దైవప్రవక్త (స) ఆయిషా (రజి.అన్‌హా)ను కలవలేదు. అయితే లోకం ముందు నిజాన్ని నిరూపించటానికి జిబ్రయీల్ దూత



అల్లాహ్ సందేశం తీసుకొని రావాలని ఆయన ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. ఒకరోజు ఆయన మస్జిదుకు వెళ్ళి ప్రజలందరినీ సమావేశపరిచారు. వారి మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజలారా! మీలో కొందరు నా కుటుంబం గురించి అసత్యాలను వ్యాపింపజేసి నన్ను బాధపెడుతున్నారు. అసలు ఇలా ఎందుకు జరుగుతోంది? నా కుటుంబంలో మంచి తప్పితే మరేమీ నాకు తెలియదు. అల్లాహ్ ఉనికి ఎంత సత్యమో నేను చెబుతున్న మాటలు కూడా అంతే సత్యం. మీరు ఆరోపిస్తున్న వ్యక్తి గురించి అనుమానాలు పెట్టుకోవటానికి కూడా నా దగ్గర ఎటువంటి ఆధారం లేదు. నేను ఇంట్లో ఉన్నప్పుడు తప్ప ఇంకెన్నడూ అతను నా ఇంటి గడప కూడా తొక్కలేదు" అన్నారు.

## ముఖాముఖి

దైవప్రవక్త (స) మస్జిద్ నుండి బయలుదేరి ఆయిషా (రజి.అన్‌హా) వద్దకు వెళ్లారు. అప్పటికి ఆమె ఇంకా తన పుట్టింట్లోనే ఉన్నారు. దైవప్రవక్త (స) అక్కడికి చేరుకున్నప్పుడు ఆమె తన తల్లిదండ్రుల ముందు ఏడుస్తూ కూర్చున్నారు. అక్కడ మరో అన్సార్ మహిళ కూడా ఉంది. దైవప్రవక్త (స) వారందరికి సలాం చేశారు. ఆయిషా (రజి)ను ఉద్దేశించి, "ఆయిషా! ప్రజలు నీ గురించి ఏం అనుకుంటున్నారో నువ్వు విని ఉంటావు. నువ్వు ఏ తప్పు ఎరుగని దానివయితే, అల్లాహ్ స్వయంగా నీ నిర్దోషిత్వాన్ని లోకం ముందు చాటిచెబుతాడు. నాకు ఆ నమ్మకం ఉంది. ఒకవేళ నువ్వు ఏదయినా తప్పు చేసివున్నట్లయితే పశ్చాత్తాపపడు, క్షమాభిక్ష కోసం అల్లాహ్‌ను వేడుకో" అన్నారు. దైవప్రవక్త (స)కు సమాధానం చెబుతారేమోనని తన తండ్రి వంక తీక్షణంగా చూశారు ఆయిషా (రజి.అన్‌హా). కాని ఆయన దైవప్రవక్త (స)కు ఏమీ బదులివ్వలేదు. పైగా తన కూతురితోనే, "అమ్మాయ్! ఏం మాట్లాడాలో నాకేమీ పాలుపోవటం లేదు" అన్నారు. కంది పోయిన ముఖంతో ఆమె తల్లి వంక చూశారు. దైవప్రవక్త (స)తో ఏం మాట్లాడాలో ఆమె తల్లికి కూడా అర్థం కాలేదు. అప్పుడు స్వయానా ఆయిషా (రజి.అన్‌హా)నే వారందరికి చాలా గట్టిగా జవాబు చెప్పారు. "మీరందరూ నా గురించి ఏదో విని నమ్మేశారు. ఇప్పుడు నేను, 'నాకేమీ తెలియదు, నేను నిర్దోషిని' అంటే మీకు నా మీద నమ్మకం కలగదు. చేయని తప్పుని చేశానని నేను ఒప్పుకుంటే ఆ అబద్ధాన్ని మీరు నమ్మేస్తారు. ఏమైనా, నేను ఏ తప్పూ చేయలేదన్న సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు" అన్నారు. ఈ సందర్భంగా ఆమె యాఖూబ్ ప్రవక్త పేరు గుర్తుతెచ్చుకోవటానికి

https://teluguislam.net



ప్రయత్నించారు. కాని ఆ నిస్పృహ స్థితిలో ఆమెకు ఆయన పేరు గుర్తుకురాలేదు. "ఈ దుష్పరిణామాన్ని నేను అత్యుత్తమ సహనంతో ఎదుర్కొంటాను' అని యూసుఫ్ ప్రవక్త తండ్రి చెప్పిన మాటలే నేను చెబుతున్నాను" అని మాత్రం అనగలిగారు. అల్లాహ్ తనకు న్యాయం చేస్తాడని ఆమె గట్టిగా నమ్మారు. అయితే తన సౌశీల్యతను రుజువు చేస్తూ దైవసందేశం అంత త్వరగా అవతరిస్తుందనీ, ప్రళయదినం వరకూ తనకు సంబంధించిన వాక్యాలు ప్రజల చేత పఠించబడతాయని ఆమె అస్సలు ఊహించలేదు. ఏదో ఒక కల ద్వారా అల్లాహ్ దైవప్రవక్త (స)కు నిజం తెలియపరుస్తాడని ఆవిడ భావించారు.

అనుకోకుండా ఒక్కసారిగా దైవప్రవక్త (స)ను ఒక విచిత్రమైన పరిస్థితి ఆవహించింది. దాని తాలూకు ఆనవాళ్లు ఆయన ముఖారవిందంపై స్పష్టంగా కనిపించాయి. ఆ హఠాత్పరిణామానికి అక్కడున్న వారంతా చాలా ఆందోళన పడ్డారు. ఆయన ముఖం నిండా చెమటలు పట్టాయి. మెల్లగా మగతలోకి జారుకున్నారాయన. కుటుంబ సభ్యులు ఆయన్ని చుట్టుముట్టారు. ఆయన తల క్రింద ఒక దిండు ఉంచారు. ఊపిరి బిగబట్టి అందరూ మౌనంగా కూర్చొని ఉన్నారు. ఆయిషా (రజి) నిర్భయంగా ఉన్నారు. కాని ఆమె తల్లిదండ్రులు ఆందోళనతో వణకిపోసాగారు. కాసేపటికి దైవప్రవక్త (స) మగత నుంచి తేరుకున్నారు. ఆయన ముఖారవిందం ఆనందంతో కళకళలాడుతూ ఉంది. ఆయన నోటి నుంచి వెలువడిన మొట్టమొదటి మాటలు: "శుభాకాంక్షలు ఆయిషా! అల్లాహ్ నీ నిర్దోషిత్వానికి సంబంధించి రుజువు పంపించాడు."

తర్వాత ఆయన ఈ క్రింది ఖుర్ఆన్ వాక్యాలు చదివి వినిపించారు:

"ఈ పెద్ద అపనిందను కల్పించి తెచ్చినది కూడా మీలోని ఒక వర్గమే. మీరు దీనిని మీ పాలిట కీడుగా భావించకండి. పైగా ఇది మీ కొరకు మేలైనదే. కాకపోతే (ఈ వ్యవహారంలో), వారిలో ప్రతి ఒక్కరికీ వారు సంపాదించిన దాన్నిబట్టి పాపం లభిస్తుంది. మరి వారిలో చాలా పెద్ద పాత్రను పోషించిన వాడికి మాత్రం మహా శిక్ష పడుతుంది. దాన్ని గురించి వినగానే విశ్వాసులైన స్త్రీ పురుషులు తమ వారి పట్ల మంచి తలంపుతో, "ఇది పచ్చి అభాండం" అని ఎందు కనలేదు? దీనిపై వారు నలుగురు సాక్షుల్ని ఎందుకు తీసుకురాలేదు? సాక్షుల్ని తీసుకురానందున ఈ నీలాపనిందను మోపినవారు అల్లాహ్ సన్నిధిలో అబద్ధాల కోరులయ్యారు.



ఇహపరలోకాలలో మీపై అల్లాహ్ అనుగ్రహం, ఆయన దయ గనక ఉండక పోతే ఏ మాటల్లోనయితే మీరు పడి పోయారో, దానికి పర్యవసానంగా, ఓ పెద్ద శిక్ష మిమ్మల్ని చుట్టుకునేదే! (ఎందుకంటే) అప్పుడు మీరు ఆ విషయాన్ని ఆ నోటా ఈ నోటా అందుకుని (వ్యాపింపజేశారు.) మీకు ఏ మాత్రం తెలియని విషయాన్ని మీ నోటితో పేలటం మొదలెట్టారు. మీరు దాన్ని చిన్న విషయంగా భావించారు. కాని అల్లాహ్ దృష్టిలో మాత్రం అది చాలా పెద్ద విషయం.

అసలు మీరు ఆ మాట వినగానే, "ఇలాంటి మాట చెప్పటం మనకు ఎంత మాత్రం తగదు. ఓ అల్లాహ్! నీవు పరమ పవిత్రుడవు. ఇది మాత్రం పెద్ద అభాండమే" అని ఎందుకు అనలేదు? మీరు నిజమైన విశ్వాసులే అయితే ఇక మీదట ఎన్నడూ ఇలాంటి చేష్టకు పాల్పడరాదని అల్లాహ్ మీకు బోధపరుస్తున్నాడు. అల్లాహ్ మీకు తన ఆయతులను విశదపరుస్తున్నాడు. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేకవంతుడు. ముస్లింలలో అశ్లీలత వ్యాపించాలని కోరుకునే వారికి ప్రపంచంలోనూ, పరలోకంలోనూ వ్యధాభరితమైన యాతన ఉంది. అల్లాహ్‌కు అంతా తెలుసు. కాని మీకు తెలియదు. అల్లాహ్ దయానుగ్రహాలే గనక మీపై లేకపోయినట్లయితే (మీ నిర్వాకానికి గాను ఇప్పటికే శిక్ష అవతరించేది). అల్లాహ్ ప్రేమమయుడు, కనికరం కలవాడు (కాబట్టి సరిపోయింది).

ఓ విశ్వాసులారా! షైతాను అడుగు జాడల్లో నడవకండి. షైతాను అడుగు జాడలలో నడిచే వారికి వాడు అశ్లీలతను, చెడు పనులను గురించి మాత్రమే ఆదేశిస్తాడు. అల్లాహ్ చలువ, ఆయన దాక్షిణ్యం గనక మీపై లేకపోతే మీలో ఎవడూ, ఎన్నటికీ పరిశుద్ధుడు అయ్యేవాడు కాడు. అయితే అల్లాహ్ తాను కోరిన వారిని పరిశుద్ధులుగా చేస్తాడు. అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు."

*(ఖుర్ఆన్ 24 : 11-21)*

ఈ వాక్యాలు వినగానే అందరి హృదయాల్లోనూ ప్రశాంతత నెలకొంది.

https://teluguislam.net



అయిషా (రజి) తల్లి సంతోషం పట్టలేక తన కుమార్తెతో, "లే, లేచి దైవప్రవక్తకు కృతజ్ఞతలు తెలుపుకో" అని అంది. కాని ఈ సంఘటన వల్ల బాగా మనస్తాపానికి గురైన అయిషా (రజి.అన్హా), "నేను కృతజ్ఞతలు తెలుపుకో వలసినది ఆయనకో లేక మీ ఇద్దరికో (తల్లిదండ్రులకు) కాదు. నా నిర్దోషిత్వాన్ని రుజువుచేసిన మహోన్నతుడైన అల్లాహ్‌కు ముందుగా నేను కృతజ్ఞతలు తెలుపుకుంటాను" అన్నారు.

## గ్రహించవలసిన పాఠాలు

- పొగ క్రింద మంట ఉంటుందని సాధారణంగా జనం అనుమానిస్తూ ఉంటారు. అయితే అల్లాహ్ దృష్టిలో అనుమానం కూడా ఒక అపరాధమే! చెడు మాటలు వినటం, అనాలోచితంగా వాటిని ఇతరుల ముందు చెప్పుకుంటూ తిరగటం క్షమించరాని నేరం. అందుకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ తీవ్రమైన శిక్ష ఉంటుంది. నిందలు, నిష్ఠూరాలు సభ్య సమాజంలో చెడుల్ని పెంచి పోషిస్తాయి. కనుక ఇస్లాం వాటిని "ఫిత్నా" (ఉపద్రవం) గా పరిగణిస్తుంది. ఒక్కవేళ ఎక్కడైనా వ్యభిచారం నిజంగా జరిగివున్నా కూడా, దాన్ని నిరూపించటానికి నలుగురు ప్రత్యక్ష సాక్షులు అవసరమని దివ్యఖుర్‌ఆన్ చట్టం డిమాండు చేస్తుంది. ఒకవేళ ఆ వ్యభిచారం గురించి సాక్ష్యం చెప్పటానికి ముగ్గురు ముందుకు వచ్చినా సరే వారి సాక్ష్యం చెల్లనేరదు. పైగా ఖుర్‌ఆన్ పెట్టిన "నలుగురి" నియమాన్ని ఉల్లంఘించి సౌశీల్యవతులైన అమాయక స్త్రీలపై అపనిందలు మోపటానికి సిద్ధమైనందుకు ప్రజలందరి సమక్షంలో వారికి కొరడా దెబ్బల శిక్ష విధించటం జరుగుతుంది. నూర్ (24వ) సూరాలో ఈ విషయం కూలంకషంగా చర్చించబడింది.
- జైనబ్ (రజి.అన్హా) అయిషా (రజి.అన్హా)కు సవతి. అయినప్పటికీ ఆమె అయిషా(రజి)నుగురించి చెడుగా పల్లెత్తు మాట అనలేదు. పైగా ఆవిడ మంచితనం గురించి చెప్పుకొచ్చారు.



- చెడు వదంతులు వ్యాపింపజేయటం గురించి ప్రజలను దైవప్రవక్త (స) బహిరంగంగా ప్రశ్నించారు.
- తన మీద మోపబడిన నీలాపనిందల గురించి విని అయిషా (రజి. అన్హా) నిలువెల్లా వణికిపోయారు. బాధపడ్డారు. భోరున విలపించారు. అయినప్పటికీ ఈ ఉపద్రవాన్ని సహనంతో, ఉత్తమోత్తమమైన రీతిలో భరించారు. సమాజంలో అన్యాయంగా అపనిందలను ఎదుర్కొనే ప్రతి ఒక్కరికీ ఆమె విధానం ఆదర్శనీయం. ఇతరుల కోసం గోతులు తవ్వేవారే తాము తవ్వుకున్న గోతుల్లో పడిపోతారు. అల్లాహ్ న్యాయం శీలవంతుల పక్షానే ఉంటుంది. వారిపై అభాండాలు మోపినవారే చివరికి కష్టాల పాలవుతారు.

https://teluguislam.net



# మస్జిదె జిరార్ - కపటుల మస్జిదు

(కపటులలో) మరికొంతమంది కూడా ఉన్నారు - కీడు కలిగించే, అవిశ్వాసంతో కూడిన మాటలు చెప్పుకునే ఉద్దేశంతో, విశ్వాసుల మధ్య చీలికను తెచ్చే లక్ష్యంతో, అంతకు మునుపు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను వ్యతిరేకించిన వ్యక్తికి ఆసరా ఇచ్చే ఆలోచనతో వారు ఒక మస్జిదును నిర్మించారు. (ఈ కట్టడాన్ని నిర్మించటంలో) తమ ఉద్దేశం మేలు చేయటం తప్ప మరొకటి కాదని వారు ప్రమాణాలు చేస్తారు. వారు అబద్ధాలకోరులన్న విషయానికి అల్లాహ్‌యే సాక్షి.

*(ఖుర్‌ఆన్ 9: 107)*

ఒక రోజు అర్ధరాత్రి. కొందరు వ్యక్తులు ఒకానొక ఇంట్లో రహస్యంగా గుమిగూడి సమావేశం నిర్వహించుకుంటున్నారు. వారిలో ఖుషైయిర్ కుమారుడు ముఅతిబ్ మాట్లాడుతూ, "ముస్లింలలో బనూ అమ్ర్ తెగవారికి లభిస్తున్న గౌరవాన్ని చూస్తే నాకు ఒళ్లు మండిపోతోంది. తమ ప్రాంతం ఖుబాలో ఒక మస్జిదును నిర్మించుకున్నందుకే వారికి ఆ గౌరవం, ఆ ఆదరణలు లభిస్తున్నాయి. వారు మా కంటే ఏ విషయంలో గొప్ప? మనం కూడా వారి వంశానికి చెందిన వాళ్ళమేగా?" అన్నాడు. అతని మాటలు విన్న మిగతా వాళ్లందరిలోనూ అసూయాగ్ని రగులుకుంది. హాతీ కుమారుడు సాలబా వారిని ఇంకా రెచ్చగొడుతూ, "అవును, వారికి లభిస్తున్న గౌరవాదరణలు చూస్తే నాక్కూడా చాలా కోపం వస్తోంది. ఇంకో విషయం ఏమిటంటే, ఇస్లాం మతం రోజు రోజుకూ బలం పుంజు కుంటోంది. ఒక తిరుగులేని శక్తిగా ఎదిగి పోతోంది. బిలాల్‌ను చూడండి. ఒకప్పుడు అతనో నీగ్రో బానిస. అతను నమాజు కోసం పిలుపునిస్తే, ముస్లింలు నమాజు కోసం గుంపులు గుంపులుగా పోగవుతారు. మస్జిదు నమాజ్ చేసేవారితో నిండిపోతుంది. అసలు ఇలా కలిసి నమాజ్ చేయటం వల్లనే వారి మధ్య సంబం



ధాలు పటిష్ఠం అవుతున్నాయేమో అనిపిస్తుంది నాకు" అన్నాడు. అంతలో ఆమిర్ కుమారుడు వదీఅ కల్పించుకొని, "ఇక మాటల వల్ల లాభం లేదు. మనం ఏదో ఒకటి చేయాలి. నా దగ్గర ఒక ఉపాయం ఉంది. నజ్రాన్ ప్రాంతపు క్రైస్తవ మత గురువు అబూ ఆమిర్ దగ్గర్నుంచి నాకు ఒక ఉత్తరం వచ్చింది. ముస్లింల ఐక్యతను విడగొట్టటానికి లభించే ఏ అవకాశాన్నీ చేజార నివ్వవద్దని అతను ఆ ఉత్తరంలో మనకు రాశాడు. అటు క్రైస్తవులు కూడా ముస్లింలపై మూకుమ్మడిగా దాడి చేయటానికి పొరుగు దేశాల వారందరి నుంచి సైనిక సహకారాన్ని కూడగడుతున్నారు" అని చెప్పుకొచ్చాడు.

అబూ ఆమిర్ ఒక క్రైస్తవ సన్యాసి. అతను ఇస్లాంను తిరస్కరించాడు. అంతటితో ఆగలేదు. దైవప్రవక్త (స)కు ప్రాణ శత్రువుగా మారాడు. ఇతని సారథ్యంలో ఇస్లాంకు వ్యతిరేకంగా ఒక తీవ్రమైన ఉద్యమం నడిచింది. ఆ తర్వాత అతను అరేబియా దేశం నుంచి పారిపోయాడు. కాన్‌స్టాంటినోపుల్ రాజు ఆశ్రయంలో తలదాచుకున్నాడు. అక్కణ్ణుంచి క్రైస్తవ మతావలంబీకుల్లో తనకు గల పరపతిని చూపించి బైజాంటిన్ చక్రవర్తి హెరాక్ల్యులస్ నుంచి కూడా సైనిక సహాయం పొందటానికి అతను కృషి చేశాడు. అంతేకాదు, మదీనా నగర స్థానికులైన కపటులతో రహస్యంగా రాయబారాలు నడిపాడు. దైవప్రవక్త (స)ను, ముస్లింలను ఓటమి పాలుచేయటానికి దేశాంతరం నుంచే కుట్రలు మొదలు పెట్టాడు.

## పారని పథకం!

రహస్య సమావేశంలో వదీఅ తన సహచరులతో మాట్లాడుతూ, "యుద్ధం చేసి ముహమ్మద్‌ను మనం ఓడించలేము. దానికి బదులు మనం ఎక్కడైనా కొంత స్థలం తీసుకుందాం. అక్కడ ఒక కొత్త మస్జిద్‌ను నిర్మిద్దాం. అది రాత్రి వేళల్లో మన సమావేశాలకు, అబూ ఆమిర్ నుంచి రహస్య సమాచారం పొందటానికి అనుకూలంగా ఉంటుంది. ఈ మస్జిద్‌కు ఇమామ్‌గా మనం జరియ్యా కుమారుడు మజ్మఅ్‌ను నియమిద్దాం. అతను ఖుర్‌ఆన్ గ్రంథం చక్కగా చదవగలడు. ముస్లింలు కూడా నమాజులో అతని సారథ్యాన్ని (ఇమామత్‌ను) ఇష్టపడతారు. అదీగాక అతను పిల్లవాడు. మన పథకం గురించి అతనికి అనుమానం కూడా రాదు" అని అందర్నీ ఒప్పిస్తూ తన ఉపాయం వివరించాడు.

https://teluguislam.net



అతని ఉపాయం అందరికీ నచ్చింది. అందరూ తమ వంతు సాయం చేయటానికి ముందుకు వచ్చారు. కొత్త మస్జిదు నిర్మాణం కోసం విరాళాలు సేకరించారు. అతి కొద్ది సమయంలోనే ఖుబా మస్జిదు కన్నా ఒక పెద్ద మస్జిద్‌ను నిర్మించేశారు. తర్వాత దైవప్రవక్త (స) వద్దకు వెళ్ళి, "దైవప్రవక్తా! ముసలివారికి, వ్యాధిగ్రస్తులకు అనువుగా ఉంటుందని భావించి మేము మా ప్రాంతంలో ఒక మస్జిదును నిర్మించాం. చలికాలంలో మస్జిదె ఖుబా దాకా నడిచివెళ్ళాలంటే బలహీనులకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. మజ్మ్హను మేము ఇమాముగా నియమించుకున్నాం. మీకు తెలియనిది ఏముంది? మజ్మ్హ చిన్నవాడైనప్పటికీ మంచి ప్రతిభావంతుడు. ఖుర్ఆన్ బాగా చదువుతాడు. మీరు ఒకసారి ఆ మస్జిదుకు వచ్చి నమాజు చేసి మమ్మల్ని ఆశీర్వదించాలని మా కోరిక. ఒకసారి మీరు మా మస్జిదును సందర్శిస్తే అది ఇతర ముస్లింలకూ ఆదర్శం అవుతుంది" అన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించటంలో దైవప్రవక్త (స) అమిత ఆసక్తిని కనబరుస్తారని వారు భావించారు. కాని ఆశ్చర్యకరంగా దైవప్రవక్త (స), " లేదు, నాకు ఇప్పుడు చాలా పనులున్నాయి. తీరిక దొరికినప్పుడు, దైవం తలిస్తే, నేను మీ వ్యవహారం గురించి తప్పక ఆలోచిస్తాను" అన్నారు. దైవప్రవక్త జవాబు విని వారు అవాక్కయ్యారు. ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూసుకుంటూ ఉండిపోయారు.

కొద్ది రోజులు గడిచాయి. దైవప్రవక్త (స) తబూక్ యుద్ధానికి వెళ్ళి వెను దిరిగి వస్తున్నారు. మరి రెండు రోజుల్లో ఆయన మదీనా నగరం చేరుకుంటారు. ఆ ప్రయాణంలోనే జిబ్రయీల్ దూత అల్లాహ్ సందేశం తీసుకొని దైవప్రవక్త (స) వద్దకు వచ్చారు. కపటుల దురుద్దేశాలను గురించి ఆయన దైవప్రవక్త (స)ను అప్రమత్తం చేశారు. కొత్త మస్జిదు నిర్మాణం తెరవెనుక నడిచిన కథ ఏమిటో ఆయనకు తెలియజేశారు.

దైవప్రవక్త (స) మదీనా చేరుకోగానే ఆ మస్జిద్‌ను దహనం చేశారు. కపటుల విద్రోహ బుద్ధి బట్టబయలయింది. అయితే ఆ తర్వాత కూడా కపటులు తమ నీచబుద్ధిని మానుకోలేదు. ముస్లింలకు వ్యతిరేకంగా కుట్రలు కొనసాగిస్తూనే పోయారు.

(చదవండి దివ్యఖుర్ఆన్ 9:107 -110)



# ముబాహిలా

## (సత్యవాదులకు - అసత్యవాదులకు మధ్య అల్లాహ్ అభిశాప సమరం)

నీ వద్దకు ఈ జ్ఞానం వచ్చిన తరువాత కూడా నీతో ఎవరయినా ఈ విషయంలో వాదనకు దిగితే వారితో స్పష్టంగా ఇలా చెప్పేయి : "రండి! మీరూ మేము కలసి మన కుమారులను, మన స్త్రీలను పిలుద్దాం. స్వయంగా మనం కూడా వద్దాం. ఆ తర్వాత - 'అబద్ధాలు చెప్పేవారిపై అల్లాహ్ శాపం పడుగాక' అని దీనాతిదీనంగా ప్రార్థిద్దాము."

***(ఖుర్ఆన్ 3 : 61)***

నజ్రాన్ ప్రాంతానికి క్రైస్తవ మత గురువు అబుల్ హారిస్. అతని వ్యక్తిగత సలహాదారు షరహ్‌బీల్. ఒక రోజు అతను తన సలహాదారుణ్ణి పిలిచి, "అబ్దుల్లాహ్ కుమారుడు ముహమ్మద్(స) నుంచి నాకు ఒక ఉత్తరం వచ్చింది. ఆయన మమ్మల్ని ఇస్లాం వైపుకు ఆహ్వానిస్తున్నాడు. ఈ ఆహ్వానాన్ని తిరస్కరించినట్లయితే మనం ఆయనకు కప్పం చెల్లించాల్సి ఉంటుంది లేదా వారితో యుద్ధానికి సిద్ధం కావలసి ఉంటుంది. ఈ విషయంలో నాకు నీ సలహా కావాలి. ఇస్మాయీల్ ప్రవక్త వంశంలో ఒక ప్రవక్తను పంపిస్తానని అల్లాహ్ వాగ్దానం చేసివున్నాడన్న సంగతి నాకూ తెలుసు. అయితే మత గ్రంథాలలో తెలుపబడిన ప్రవక్త ఈయనే అని మనం ఎలా నిర్ధారించుకోవాలి?" అని అడిగాడు. అందుకు షరహ్‌బీల్ సలహా యిస్తూ, "దీనికోసం మనం కొంత సమయం తీసుకుందాం. ఇలోగా మనం ఇతర ఆధ్యాత్మిక పండితులను కూడా సంప్రతించటానికి వీలుంటుంది" అని చెప్పాడు. ఈ విషయంపై వారి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. కాని దీని గురించి వారు ఒక ఖచ్చితమైన నిర్ణయానికి రాలేకపోయారు.

చర్చి గంటలను మోగించమని మత గురువు తరపున ఆదేశమయింది. చర్చి గంటల మోతను ఆ ప్రజలు ఒక

https://teluguislam.net



ప్రకటనగా, చర్చిపిలుపుగా భావిస్తారు. ఆనవాయితీ ప్రకారం నజ్రాన్ ప్రాంతంలో నివసిస్తున్న క్రైస్తవులందరూ ఆ గంటల మోత విని మతగురువు ముందు హాజరయ్యారు. ఆయన తన ప్రజలకు ముహమ్మద్ (స) పంపిన ఉత్తరం గురించి తెలియజేశాడు. అందరూ దీనిపై పరస్పరం సంప్రతించుకున్నారు. దీని మీద సుదీర్ఘ చర్చ జరిగింది. చివరికి వారు తమ తరఫున ఒక బృందాన్ని ముహమ్మద్ (స) వద్దకు పంపించి దీని గురించి ఆయనతోనే మాట్లాడాలని సమావేశంలో తీర్మానించుకున్నారు. వారి తరఫున మతపండితులతో కూడిన ఒక బృందం మదీనాకు బయలుదేరింది. ధగ ధగ మెరుస్తున్న సిల్కు వస్త్రాల్లో, ఖరీదైన రత్న ఖచిత ఉంగరాలు ధరించి, తళతళ మెరుస్తున్న శిలువ సూచకాలు మెడల్లో వేలాడదీసుకొని ఎంతో అట్టహాసంగా ఆ మతపెద్దలు మదీనాలోకి ప్రవేశించారు. దైవప్రవక్త (స)ను వారు మస్జిదె నబవీలో కలుసుకున్నారు. మర్యాదగా ఆయనకు అభివాదం చేశారు. దైవప్రవక్త (స) కూడా వారిని సాదరంగా లోనికి ఆహ్వానించారు.

చర్చ ప్రారంభించే ముందు వారు ప్రార్థన చేసుకున్నారు. దైవప్రవక్త (స) అందుకు అభ్యంతరం తెలుపలేదు. వారి కార్యదర్శి, షరహ్‌బీల్, దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ, "ముహమ్మద్! మేము క్రైస్తవులం. 'నేను దైవప్రవక్తను' అని మీరు చెబుతున్నారు సరే; కాని మీరు క్రీస్తు గురించి ఏం మాట్లాడతారో వినాలని ఉంది మాకు" అన్నాడు. దానికి సమాధానమిస్తూ ఆయన, "క్రీస్తు గురించి మీకు చెప్పటానికి ఇప్పుడు నా దగ్గర ఎటువంటి సమాచారమూ లేదు. అయితే మీరు రేపటి వరకు నిరీక్షించండి. ఈ రోజు రాత్రికల్లా ఏదైనా సమాచారం అల్లాహ్ నాకు వహీ ద్వారా అందజేస్తే, రేపు నేను మీకు తప్పకుండా తెలియజేస్తాను" అన్నారు.

మరునాడు ఆ క్రైస్తవ బృందం మస్జిదె నబవీ దగ్గరకు ఆహ్వానించబడింది. ఆ రాత్రి అల్లాహ్ తనకు అందజేసిన ఈ వహీ సమాచారాన్ని వారికి దైవప్రవక్త (స) పఠించి వినిపించారు:

**అల్లాహ్ దృష్టిలో ఈసా ఉపమానం ఆదం ఉపమానాన్ని పోలినదే. (ఆయన) అతన్ని మట్టితో చేసి 'అయిపో' అని ఆజ్ఞాపించగానే అతను (మనిషిగా) అయిపోయాడు. నీ ప్రభువు తరఫునుంచి (వచ్చిన) సత్యం ఇదే. జాగ్రత్త! శంకించే వారిలో చేరిపోకు.**

**కనుక నీ వద్దకు ఈ జ్ఞానం వచ్చిన తరువాత కూడా నీతో ఎవరయినా ఈ విషయంలో వాదనకు దిగితే వారితో స్పష్టంగా ఇలా చెప్పేయి:**



**"రండి! మీరూ మేము కలసి మన కుమారులను, మన స్త్రీలను పిలుద్దాం. స్వయంగా మనం కూడా వద్దాం. ఆ తర్వాత - 'అబద్ధాలు చెప్పేవారిపై అల్లాహ్ శాపం పడుగాక' అని దీనాతిదీనంగా ప్రార్థిద్దాము."**

***(దివ్యఖుర్‌ఆన్ 3 : 59-61)***

అంతా విన్న తర్వాత దీని గురించి ఆలోచించుకోవటానికి తమకు కొంత సమయం ఇవ్వమని దైవప్రవక్త (స)ను అభ్యర్థించి క్రైస్తవ బృందం అక్కణ్ణుంచి బయలుదేరింది.

షరహ్‌బీల్ తనవారికి సలహా యిస్తూ, "ఒకవేళ ముహమ్మద్ కేవలం ఒక ప్రాపంచిక రాజు గనక అయినట్లయితే, ఆయనకు అతి పొరుగున నివాసం ఉంటున్న మనం ఆయన్నుంచి సురక్షితంగా ఉండలేము. ఒకవేళ ఆయన నిజంగా దైవప్రవక్త అయి వుండి మనం ఆయన్ని నిర్లక్ష్యం చేసినట్లయితే, ఇక సందేహం లేదు, మనం అల్లాహ్ శాపాన్ని కొనితెచ్చుకుంటాం. అదే గనక జరిగితే మనలో ఎవరూ అల్లాహ్ శాపం నుంచి బతికి బట్టకట్టలేరు" అన్నాడు. అయితే ప్రస్తుతం తమ కర్తవ్యం ఏమిటని వారు అతన్నే అడిగారు. అందుకు అతను, "ఈ వ్యవహారాన్ని మనం ముహమ్మద్ చేతుల్లోనే పెడదాం" అన్నాడు. అతని సలహాను అందరూ అంగీకరించారు. దైవప్రవక్త (స) వద్దకు వెళ్ళి వారు, "ముహమ్మద్! అల్లాహ్ శాపాన్ని కొనితెచ్చుకోవటం మాకు ఇష్టం లేదు. అందుకని ఈ సమస్యకు పరిష్కారం మీరే నిర్ణయించండి. మీరు నిర్ణయించే దాన్ని మేము మనసారా అంగీకరిస్తాము. దానికి కట్టుబడి ఉంటాము" అని చెప్పారు. అందుకు దైవప్రవక్త (స), "మీ సంగతి సరే; కాని నజ్రాన్‌లో ఉన్న ఇతర క్రైస్తవుల సంగతేంటి?! వారు నా నిర్ణయా లను అమలుపరచటానికి నిరాకరిస్తేనో?" అని అడిగారు. దానికి షరహ్‌బీల్ బదులిస్తూ, "నా ప్రజలు నన్ను సంప్రతించకుండా ఏ పనీ చేయరు. అదీగాక మేము నజ్రాన్ క్రైస్తవ మతం తరఫున అధికారికంగా వచ్చినవాళ్ళం. మా మాటకు వారు ఎదురు చెప్పలేరు" అన్నాడు.

మరుసటి దినం దైవప్రవక్త (స) తన నిర్ణయం వెలిబుచ్చారు. "నేను మిమ్మల్ని ఇస్లాం స్వీకరించమని కోరుతున్నాను" అన్నారు. అందుకు వారు నిరాకరించారు. "మరయితే యుద్ధం చేస్తారా?" అని అడిగారు ప్రవక్త (స). ప్రస్తుతం

https://teluguislam.net



తాము పోరుబాట పట్టే స్థితిలో లేమని వారు సమాధానమిచ్చారు. మరయితే నజ్రాన్‌వాసులు తమ విధేయతా సూచకంగా ఇస్లామీయ రాజ్యానికి "రక్షణ రసుము" చెల్లించాలని దైవప్రవక్త (స) తీర్మానించారు. ఎంత సొమ్ము చెల్లించాలో చెప్పమని వారు ఆయన్ను అడిగారు. దైవప్రవక్త (స) వారికి సమాధానమిస్తూ, "నజ్రాన్ వాసులందరి తరపున సంవత్సరానికి రెండు వేల దిర్హములు చాలు. రుసుం మొత్తంలో సగభాగం, అంటే వెయ్యి దిర్హములు రజ్జబ్ నెలలో చెల్లించండి. మిగతా భాగం సఫర్ నెలలో చెల్లించవచ్చు. ప్రతి చెల్లింపుకు మధ్య ఆరు నెలల గడువు ఉంటుంది. మీరు ఈ నియమాలను అంగీకరించి, వాటికి కట్టుబడి ఉంటే అల్లాహ్ రక్షణను, అల్లాహ్ ప్రవక్త రక్షణను పొందుతారు. మీ మత గురువుల్ని, నాయకుల్ని ఎన్నుకోవటంలో మీకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. మీ ఆంతరంగిక వ్యవహారాల్లో మేము జోక్యం చేసుకోబోము. పైగా మీ నగరాన్ని బయటి, లోపలి దాడుల నుంచి రక్షిస్తాము. మీరు ఈ నియమాలను ఉల్లంఘించనంతవరకూ మన మధ్య ఈ ఒప్పందం కొనసాగుతుంది. మేమూ మీ పట్ల చాలా సౌమ్యంగా వ్యవహరిస్తాం" అని చెప్పారు. దైవప్రవక్త (స) తీర్మానం వారికి ఎంతో ఉత్తమమైనదిగా అనిపించింది. ఇంకేం! ఎదురు చెప్పకుండా వారు ఆ ఒప్పందం మీద సంతకంపెట్టారు. నజ్రాన్‌కు తిరిగి వెళ్లిన తర్వాత వారు దైవప్రవక్త ముహమ్మద్ (స)ను అమితంగా పొగిడారు. *(దివ్య ఖుర్‌ఆన్ 3:60 -62)*

### గ్రహించవలసిన పాఠాలు

- "ముబాహిలా" అనేది సత్యవాదులకు - అసత్యవాదులకు మధ్య జరిగే సంవాదంలో అనుసరించబడే ఒక ఇస్లామీయ విధానం. దాని ప్రకారం సంవాదనలో పాల్గొనే ప్రత్యర్థులు ఇరువురూ, తమ విశ్వాసాలు అసత్యమైన పక్షంలో తమపై అల్లాహ్ శాపం విరుచుకుపడాలని శపించుకుంటారు.
- దైవప్రవక్త (స) క్రైస్తవులను మస్జిదె నబవీలోనికి రానిచ్చారు. చర్చ ప్రారంభించటానికి ముందు వారు చేసుకున్న ప్రార్థనలకు ఆయన ఎటువంటి అభ్యంతరం తెలుపలేదు.



- తమ భవిష్యత్తును నిర్ణయించే అధికారాన్ని క్రైస్తవులు దైవప్రవక్త (స)కు అప్పగించారు. అయితే తనకు అప్పగించిన ఆ అధికారాన్ని దైవప్రవక్త (స) ఏమాత్రం దుర్వినియోగం చేయలేదు. పైగా వారికే మూడు విషయాల్లో ఏదో ఒక దాన్ని ఎంపిక చేసుకునే సౌలభ్యాన్ని సమకూర్చారు.
- క్రైస్తవులు రక్షణరుసుము చెల్లించటానికి అంగీకరించటంతో ఆయన వారికి ఇతర నియమాలను గురించి కూడా తెలియజేశారు. వాటిని అంగీకరించిన పక్షంలో వారి రాజ్యాన్ని బయటి శక్తుల దాడి నుంచి రక్షిస్తామని హామీ ఇచ్చారు. వారి రాజ్యంపై దైవప్రవక్త (స) ఎటువంటి భౌతిక ఆంక్షలు పెట్టలేదు. వారి మత వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకోలేదు.

https://teluguislam.net



# తప్పుడు సమాచారం

> **ఓ విశ్వాసులారా! ఎవడయినా దుర్వర్తనుడు మీ వద్దకు ఏదైనా సమాచారాన్ని తీసుకువస్తే, దాని నిజానిజాలను నిర్ధారించుకోండి. అన్యథా మీరు నిజం తెలియని కారణంగా ఇతర జనులకు నష్టం కలిగించి, తరువాత చేసిన దానిపై సిగ్గుతో కుంచించుకు పోవలసిన పరిస్థితి రావచ్చు.**
> **(ఖుర్‌ఆన్ *49 : 6*)**

ఇస్లాం ధర్మోన్నతి కోసం ముస్లింలు బనీ ముస్తలిక్ తెగవారితో జరిపిన యుద్ధం ముగిసింది. అనంతరం దైవ ప్రవక్త (స) ఆ తెగకే చెందిన ఒక మహిళను వివాహం చేసుకున్నారు. ఆ పెండ్లి మూలంగా బనీ ముస్తలిక్ తెగవారం దరికీ ఇస్లాం ధర్మాన్ని స్వీకరించే సౌభాగ్యం లభించింది.

దైవప్రవక్త (స) మదీనాకు తిరిగి వచ్చారు. అది జకాత్ (ధనవంతులు విధిగా చెల్లించవలసిన) సొమ్ము వసూలు చేసే కాలం. ఆ విధంగా వసూలైన సొమ్ము నిరుపేదలకు పంచిపెట్టబడుతుంది. దైవప్రవక్త (స)ఈ పనికోసం వలీద్‌ను బనీ ముస్తలిక్ తెగవారి వద్దకు పంపించారు. మదీనా నగరం నుంచి దైవప్రవక్త (స) పంపిన వ్యక్తి ఒకరు తమ వద్దకు వస్తున్నారని అటు బనీ ముస్తలిక్ తెగ వారికీ తెలిసిపోయింది. వారు ఎంతో సంతోషించారు. వలీద్‌కు ఘనస్వాగతం పలకటానికి వారంతా ఊరి పొలిమేరల దాకా వచ్చారు. అంతమంది జనం ఒకే సారి తనవైపు రావటం చూసి వలీద్ బెదిరిపోయారు. ఆ తెగవారితో ఆయనకు గతంలో ఎప్పుడో శత్రుత్వం ఉండేది. దాని గురించి ఆలోచించుకొని వారంతా తన మీదకు దాడి చేయటానికి వస్తున్నారని వలీద్ భ్రమించారు. దూరం నుంచే వెనక్కి తిరిగి పారిపోయి వచ్చేశారు.



వలీద్ దైవప్రవక్త (స) వద్దకు వెళ్ళి, "దైవప్రవక్తా! ఆ తెగవారంతా నన్ను చంపటానికి కుట్రపన్నారు. నేనెలాగో వాళ్ళ నుంచి తప్పించుకొని ప్రాణాలను దక్కించుకోగలిగాను. అసలు వాళ్లు ఇస్లాం ధర్మాన్ని వదలిపెట్టారు. మనకు జకాత్ చెల్లించటానికి కూడా నిరాకరించారు" అని చెప్పారు. ఆయన మాటలు విని దైవప్రవక్త (స) విచారం వ్యక్తం చేశారు. బనీ ముస్తలిక్ తెగవారి విశ్వాస ఘాతుకానికి తగిన బుద్ధి చెప్పాలని దైవప్రవక్త (స) యుద్ధసన్నాహాలు మొదలుపెట్టారు. అటు బనీ ముస్తలిక్ తెగవారికి దైవప్రవక్త (స) తమపై యుద్ధానికి సన్నద్ధం అవుతున్నట్టు సూచనలు అందాయి. బహుశా వలీద్ తమ గురించి దైవప్రవక్త (స)కు తప్పుడు సమాచారం ఇచ్చి వుంటారని వారు అర్థం చేసుకున్నారు. ఇక వారు ఏమాత్రం ఆలస్యం చేయదలచుకోలేదు. వెంటనే ఒక బృందాన్ని మదీనాకు పంపించి దైవప్రవక్త (స)కు ఈ విధంగా కబురుచేశారు:

"దైవప్రవక్తా! మీరు మా నుంచి జకాత్ సొమ్ము వసూలు చేయటానికి ఒక రాయబారిని పంపించారని మాకు తెలిసింది. దానికి మేము ఎంతగానో సంతోషించాము. మీ రాయబారిని సగౌరవంగా ఊళ్లోకి ఆహ్వానించాలని కోరు కున్నాం. అందరం కలసి ఊరి పొలిమేరలకు చేరుకున్నాం. కాని వలీద్ మమ్మల్ని చూడగానే వెనక్కు తిరిగి పారిపోయారు. ఆయన ఎందుకు పారిపోయారో మాకు అర్థం కాలేదు. ఆయన మీ దగ్గరకు వచ్చి, మేము ఆయన్ని హత్య చేయటానికి ప్రయత్నించినట్లు సమాచారం అందించారని ఇప్పుడే మాకు కబురు అందింది. కాని ఇది పచ్చి అబద్ధం. మేము ఇస్లాం స్వీకరించినప్పటి నుంచి అల్లాహ్‌పై మా నమ్మకంలో ఎటువంటి మార్పు రాలేదు."

దైవప్రవక్త (స)కు ఏమీ తోచలేదు. తాను ఎవరిని నమ్మాలి? వలీద్‌నా? బనీ ముస్తలిక్ తెగవారినా? ఆలోచిస్తూ ఉండిపోయారు దైవప్రవక్త(స). అంతలో పరమ ప్రభువైన అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ క్రింది వాక్యాన్ని అవతరింపజేసి దైవప్రవక్త (స) ఎదుర్కొంటున్న మీమాంసను తొలగించేశాడు:

**ఓ విశ్వాసులారా! ఎవడయినా దుర్వర్తనుడు మీ వద్దకు ఏదైనా సమాచారాన్ని తీసుకువస్తే, దాని నిజానిజాలను నిర్ధారిం చుకోండి. అన్యథా మీరు నిజం తెలియని కారణంగా ఇతర జనులకు నష్టం కలి గించి,**

తరువాత చేసిన దానిపై సిగ్గుతో కుంచించుకు పోవలసిన పరిస్థితి రావచ్చు. ( ఖుర్‌ఆన్ 49 : 6)

### గ్రహించవలసిన పాఠాలు

- మన వద్దకు ఏదయినా సమాచారం వస్తే దాన్ని పునర్విచారించుకోవాలని దివ్య ఖుర్‌ఆన్ మనల్ని ఆదేశిస్తోంది.
- జకాత్ సొమ్మును వసూలు చేయటానికి వెళ్ళిన వలీద్ (రజి) పాతకాలపు శత్రుత్వాన్ని పురస్కరించుకొని బనూ ముస్తలిక్ తెగవారి గురించి చాలా అనుచితంగా ఊహించుకున్నారు. దైవప్రవక్త (స)కు అల్లాహ్ తరఫున సందేశం అంది ఉండకపోతే ముస్లింలకు తీరని నష్టం వాటిల్లి ఉండేది.
- తప్పుడు ఆరోపణల్ని తక్షణం ఖండించి వాస్తవాలను వెల్లడి చేసుకోవటం శ్రేయస్కరం. లేకపోతే అనవసరమైన ఇబ్బందులకు లోనుకావలసి వస్తుంది.



https://teluguislam.net

# అల్ ముజాదిలా

## (వాదించిన మహిళ)

**(అనాలోచితంగా గాని, కోపంలో గాని విడాకులు ఇవ్వటం గురించిన కథ)**

(ఓ ప్రవక్తా!) తన భర్త విషయమై నీతో వాదిస్తూ, అల్లాహ్‌కు ఫిర్యాదు చేసుకుంటూ ఉన్న ఆ స్త్రీ మాటను అల్లాహ్ విన్నాడు. ఇంకా, అల్లాహ్ మీరిద్దరి మధ్య జరిగిన సంవాదనను (కూడా) విన్నాడు. నిశ్చయంగా అల్లాహ్ (అంతా) వినేవాడు, చూసేవాడు.
*(ఖుర్‌ఆన్ 58 : 1)*

సాలబా కుమార్తె ఖౌలా. యవ్వనంలో ఆమె చాలా అందగత్తె. సామిత్ కుమారుడు ఔస్‌ను ఆమె వివాహమాడారు. ఆ దంపతులు చాలా కాలం ఆనందమయ వైవాహిక జీవితం గడిపారు. తామిద్దరి ప్రేమకు ప్రతీకగా వారికి అనేకమంది సంతానం కూడా కలిగారు.

ఒకరోజు ఆమె అల్లాహ్‌ను ధ్యానిస్తూ కూర్చొని వున్నారు. అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ తస్బీహ్ వచనాలు పఠిస్తున్నారు. అప్పుడే భర్త ఔస్ ఆమె దగ్గరకు వచ్చారు. ప్రేమతో ఆమెను ముద్దాడుతూ దగ్గరకు తీసుకోవాలని సంకల్పించారు. ఆమె పూర్తిగా అల్లాహ్ ధ్యానంలో లీనమై ఉన్నారు. అల్లాహ్ పట్ల భక్తిభావం తప్ప మరో ధ్యాస ఆ సమయంలో ఆమెకు లేదు. అందుచేత ఆమె తన భర్త కోరికను మన్నించలేకపోయారు. సున్నితంగానే భర్త చేతులను వదలించుకున్నారామె. దాంతో ఔస్ మనసు నొచ్చుకుంది. తన భార్య అంతకు ముందెన్నడూ ఆ రీతిలో తన కోరికను తిరస్కరించలేదని ఊహించుకున్నారాయన. అంతే, తీవ్ర ఆగ్రహానికి లోనై, "నీవు నాకు తల్లిలాంటి దానివి పో!" అనేశారు.

ఈ మాట అనటంతో ఆయన తన భార్యకు విడాకులు ఇచ్చినట్లయింది. అజ్ఞాన కాలంలో భార్యలకు విడాకులిచ్చే మూర్ఖపు పద్ధతుల్లో ఇదొకటి. ఈ రకమైన

https://teluguislam.net



దొంకతిరుగుడు విడాకుల విధానాన్ని "జిహార్" అని అంటారు. తల్లిని వివాహ మాడటం నిషిద్ధమైనట్లే భార్యను కూడా తన కొరకు నిషేధించుకుంటున్నాను అని దీని భావం. ఇస్లాం ఈ విడాకుల విధానాన్ని ఖండించింది.

హఠాత్తుగా భర్త తనకు విడాకులిచ్చేసరికి ఖౌలా దిమ్మదిరిగిపోయింది. ఔస్‌తో తాను యేండ్లతరబడి కలసి జీవించింది. ఇన్నేండ్ల తర్వాత ఒక్కసారిగా విడాకులిచ్చేస్తే భర్త లేకుండా తాను ఎలా బ్రతకగలనని ఆమె తల్లడిల్లిపోయింది. తాను భర్తను అమితంగా ప్రేమించింది. ఆయన ద్వారా కలిగిన సంతానాన్ని అపురూపంగా పెంచుకుంది. అలాంటి భర్త తనను, తన పిల్లలను జీవితపు చీకట్లలో వదిలేసి వెళతాడా? అని ఆ స్త్రీ కన్నీటిపర్యంతమయింది. ఈ ప్రపంచంలో భర్త తప్ప తనకు "నా" అన్న వాళ్లెవరూ లేరు.

భవిష్యత్తు గురించి ఆలోచన ఆమె గుండెలో భయం రేపింది. పుట్టెడు దుఃఖంతో ఆమె తన సమస్యను దైవప్రవక్త (స) దృష్టికి తీసుకువెళ్ళింది. తీవ్రమైన బాధతో కృంగిపోతూ, "దైవప్రవక్తా! నేను ఔస్ భార్యను. నేను యవ్వనంలో ఉన్నప్పుడు ఎంతోమంది నాతో వివాహాన్ని కోరుకున్నారు. కాని అందర్నీ కాదని నేను ఔస్‌నే వరించాను. ఇప్పుడు నాకు వయసు పైబడింది. ఔస్ ద్వారా నాకు చాలామంది పిల్లలు కూడా పుట్టారు. ఈ పరిస్థితిలో ఔస్ నాకు విడాకులిచ్చారు. అనాలోచితంగా, అజ్ఞానంగా ఆయన అన్న మాట కారణంగా నేను ఆయనతో దాంపత్య జీవితానికి నిషిద్ధమైపోయానే!" అంటూ ఆమె రోదించింది.

తన సంకట పరిస్థితిని దైవప్రవక్త (స)కు వివరించింది: "పిల్లల్ని ఆయన దగ్గర వదిలేద్దామంటే అదీ సాధ్యం కాదు. ఎందుకంటే వాళ్లల్లో ఒకళ్ళిద్దరు చాలా పసిపిల్లలు. వారి మంచిచెడ్డ చూడటం ఆయనతో అయ్యేపని కాదు. సరే; పిల్లల్ని నేనే పోషించుకుందామంటే నాకు ఆ తాహతు లేదు. దయచేసి ఈ విషయంలో నాకు సరైన మార్గాన్ని సూచించండి దైవప్రవక్తా!" అని కడు దీనంగా వేడుకుంది.

ఆ పడతి మాటలు దైవప్రవక్త (స) కారుణ్య హృదయాన్ని కలచివేశాయి. ఆవిడ పరిస్థితిపై ఆయన తీవ్రమైన విచారాన్ని వ్యక్తం చేశారు. కాని ఈ సమస్యకు పరిష్కారం ప్రస్తుతం తన వద్ద కూడా ఏమీ లేదు. ఎందుకంటే అప్పటివరకు అల్లాహ్ దీని గురించి ఎటువంటి సమాచారం ఆయనకు పంపలేదు. ఆ విషయమే ఆయన ఆవిడతో చెప్పారు.



తన సమస్యకు ఏదో ఒక పరిష్కారం లభిస్తుందని గంపెడు ఆశతో ఆమె దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. కాని దైవప్రవక్త (స) జవాబు ఆమెను నిస్పృహకు గురిచేసింది. కట్టలు తెంచుకు వస్తున్న దుఃఖాన్ని అతి కష్టం మీద అపుకోవటానికి ప్రయత్నిస్తూ, "ఈ కష్ట కాలంలో నేను మహోన్నతుడైన అల్లాహ్ వైపునకే మరలుతున్నాను" అంటూ దేవుణ్ణి దీనాతిదీనంగా ప్రార్థించింది. ఆమె ప్రార్థన ముగిసేలోగానే దైవప్రవక్త (స)పై దేవుడు "వహీ" అవతరింపజేశాడు. అల్లాహ్ సందేశం ఆయన వద్దకు వచ్చేసింది. అర్ష్‌పై ఆసీనుడై ఉన్న అల్లాహ్ ఆ అబల ప్రార్థనను ఆలకించాడు. దైవప్రవక్త (స) ఆమెకు ఆ శుభవార్తను అందజేస్తూ, అల్లాహ్ తన వద్దకు పంపిన సందేశం వినిపించారు. ఎవరైనా 'జిహార్' ద్వారా విడాకులిచ్చి తర్వాత విడాకుల్ని ఉపసంహరించుకోదలిస్తే వారు ఈ మూడు పనుల్లో నుంచి ఏదో ఒక పని తప్పకుండా చేయాలి:

1) ఒక బానిసకు స్వేచ్ఛనివ్వాలి. లేదా

2) రెండు నెలలపాటు నిరంతరాయంగా ఉపవాసాలు పాటించాలి. లేదా

3) అరవైమంది నిరుపేదలకు భోజనం పెట్టాలి.

అల్లాహ్ సందేశం విన్న తర్వాత ఖౌలా (రజి.అన్‌హా) హృదయం శాంత పడింది. ఆమె మనసు సంతోషంతో నిండిపోయింది. దైవప్రవక్త (స) ఔస్‌ను పిలిచి, "ఎందుకిలా చేశావు?" అని అడిగారు. ఔస్ (రజి) అప్పటికే తాను చేసిన తప్పుకు పశ్చాత్తాప భావంతో కుమిలిపోతూ ఉన్నారు. ఆయన సమాధానమిస్తూ, "దైవప్రవక్తా! షైతాన్ నా మెదడులో చెడు ఆలోచన రేపాడు. ఆ బలహీన క్షణంలో నేను నా భావావేశాలను నియంత్రించుకోలేకపోయాను. పొరపాటున ఈ మూర్ఖ పనికి ఒడిగట్టాను" అని చెప్పారు. తాను చేసిన ఆ తప్పుకు ప్రాయశ్చిత్తం చెప్పమని దీనంగా అభ్యర్థించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (స) కొద్ది సమయం క్రితమే అవతరించిన ఈ ఖుర్‌ఆన్ వాక్యాలు ఆయనకు చదివి వినిపించారు:

**(ఓ ప్రవక్తా!) తన భర్త విషయమై నీతో వాదిస్తూ, అల్లాహ్‌కు ఫిర్యాదు చేసుకుంటూ ఉన్న ఆ స్త్రీ మాటను అల్లాహ్ విన్నాడు. ఇంకా, అల్లాహ్ మీరిద్దరి మధ్య జరిగిన సంవాదనను (కూడా) విన్నాడు. నిశ్చయంగా అల్లాహ్ (అంతా) వినేవాడు, చూసేవాడు.**

మీలో ఎవరయినాసరే తమ భార్యలపై 'జిహార్'ను ప్రయోగించినంత మాత్రాన (నీవు నా తల్లి వీపు లాంటి దానివి అని నోరు జారినంత మాత్రాన) వారు వారికి తల్లులైపోరు. వారిని కన్నవారు మాత్రమే వాస్తవానికి వారి తల్లులు. నిజానికి ఈ విధంగా పలికేవారు అసహ్యమైన మాటను, అబద్ధాన్ని పలికారు. నిశ్చయంగా అల్లాహ్ మన్నించేవాడు, క్షమాభిక్ష పెట్టేవాడూను.

మరెవరయినా తమ భార్యలపై 'జిహార్' ను ప్రయోగించి, తమ నోటి ద్వారా జారిపోయిన (తప్పుడు) మాటను ఉపసంహరించదలచుకుంటే వారు ఒకరినొకరు తాకకముందే అతను ఒక బానిసకు స్వేచ్ఛను ప్రసాదించాలి. దీని ద్వారా మీకు గుణపాఠం నేర్పబడుతున్నది. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు. ఆ స్థోమతలేనివాడు, భార్యాభర్తలు పరస్పరం ముట్టుకోకముందే ఆ రెండు మాసాలపాటు ఎడతెగకుండా ఉపవాసాలు పాటించాలి. ఈపాటి శక్తి కూడా లేనివాడు అరవైమంది అగత్యపరులకు అన్నం పెట్టాలి. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తపై మీ పరిపూర్ణ విశ్వాసం రూఢీ కావటానికే ఇది మీపై విధింపబడింది. ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. అవిశ్వాసులకు బాధాకరమైన శిక్ష ఖాయం.

***(ఖుర్‌ఆన్ 58 : 1-4)***

తర్వాత దైవప్రవక్త (స) ఔస్‌ను, "నువ్వు ఒక బానిసకు స్వేచ్ఛను ప్రసాదించగలవా?" అని అడిగారు. "అల్లాహ్ తోడు! నాకు అంత తాహతు లేదు దైవప్రవక్తా!" అని విన్నవించుకున్నారు ఔస్ (రజి). "పోనీ రెణ్ణెల్ల పాటు మధ్యలో ఒక్క రోజు కూడా నాగా లేకుండా ఉపవాసం ఉండగలవా?" అని మళ్ళీ అడిగారు దైవప్రవక్త (స). "లేదు దైవప్రవక్తా! నియమానుసారం భోజనం లేకపోతే నేను చాలా నీరసించిపోతాను. నా చూపు కూడా మందగిస్తుంది" అన్నారు ఔస్. అందుకు దైవప్రవక్త (స), "మరయితే అరవై మంది నిరుపేదలకు భోజనం పెట్టు, సరిపోతుంది" అని ఔస్‌తో అన్నారు. దానికి సమాధానమిస్తూ ఔస్ (రజి), "దైవప్రవక్తా! మీరు ఏదయినా దానధర్మం చేస్తే తప్ప, అది కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నాను నేను" అని చెప్పారు.

https://teluguislam.net



అరవైమంది నిరుపేదలను సమీకరించమని చెప్పారు. తర్వాత దైవప్రవక్త (స) స్వయంగానే ఆ నిరుపేదలకు భోజనం పెట్టే ఏర్పాట్లు చేశారు. ఆ విధంగా ఔస్ (రజి) పరిహారం (కఫ్ఫారా) చెల్లించినట్టయింది. ఎట్టకేలకు తన భార్యను మళ్లీ కలుసుకునే అవకాశం లభించినందుకు ఆయన చాలా సంతోషించారు. ఆపై ఖౌలా (రజి.అన్హా)తో ఆనందమయమైన ప్రేమైక జీవితాన్ని కొనసాగించారు.

## గ్రహించవలసిన పాఠాలు

- అజ్ఞాన కాలపు ఒక మూఢాచారం నుంచి బయటపడే మార్గాన్ని అల్లాహ్ ముస్లింలకు చూపించాడు. ఖౌలా (రజి.అన్హా) సంఘటన ఇందుకు తోడ్పడింది.
- అనూహ్య సంఘటనలు జరిగినప్పుడు కఫ్ఫారా (పరిహారం) ద్వారా పరిస్థితుల్ని చక్కదిద్దుకోవటానికి ఇస్లాం ధర్మం ఆస్కారం కల్పిస్తోంది. ఈ సుగుణం సత్యధర్మ సానుకూలతకు అద్దం పడుతోంది.
- శారీరక సత్తువ కలిగిన వారు పరిహారం (కఫ్ఫారా) క్రింద అరవైరోజుల పాటు నిరంతరాయంగా ఉపవాసం పాటించటం తప్పనిసరి.

https://teluguislam.net



# అత్ తహ్రీమ్

## (నిషిద్ధం)

## (తాత్కాలికంగా దాంపత్య సంబంధాలకు దూరంగా ఉండటానికి సంబంధించిన కథ)

ప్రవక్త తన భార్యలలో ఒకామెతో ఒక రహస్య విషయం చెప్పినప్పుడు, ఆమె ఆ విషయాన్ని (మరొకామెకు) తెలియపరిచింది. ఈ సంగతిని అల్లాహ్ తన ప్రవక్తకు తెలియపరచగా, ప్రవక్త ఈ విషయాన్ని కొంతచెప్పి, మరికొంత దాటవేశాడు. ప్రవక్త ఈ సమాచారాన్ని తన భార్యకు తెలిపినపుడు, 'ఇంతకీ ఈ విషయం మీకెవరు తెలిపారు?' అని ఆమె అడిగింది. "అన్నీ తెలిసిన, సర్వం ఎరిగిన అల్లాహ్ నాకీ సంగతిని తెలియజేశాడు" అని ప్రవక్త చెప్పాడు.

**(ఖుర్‌ఆన్ *66 : 3*)**

దైవప్రవక్త ముహమ్మద్ (అల్లాహ్ ఆయనపై శాంతి కారుణ్యాలు కురిపించుగాక!) సామాన్య మానవులుకారు. మానవ సుగుణాలన్నీ మూర్తీభవిం చిన మహా మనీషి ఆయన. ఉత్తమ నైతికతకు మారుపేరుగా ఆయన శుభనామం ప్రజా బాహుళ్యంలో నిత్యం కీర్తించబడుతూ ఉంటుంది. అల్లాహ్ దృష్టిలో ఆయన సృష్టిలో కెల్లా ఉత్తములు. ఇస్లామీయ రాజ్యభారాన్ని, ముస్లింల వ్యక్తిగత సమస్యలను పరిష్కరించే బాధ్యతను సైతం ఆయన తన భుజస్కంధాలపై వేసుకున్నారు. ఆయన గురించి తెలిసిన వారెవరైనా, ప్రజలు అనుసరించదగిన ఓ మహా నాయకునిగా ఆయన్ని గుర్తిస్తారు. ఆయన సూచనలు పాటిస్తూ, ఆయన అడుగుజాడల్లో నడిచేందుకు ఉత్సాహం చూపిస్తారు. నిరుపేదలు- ధనవంతులు, పుణ్యాత్ములు - పాపాత్ములు అందరి కోసం ఆయన ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరుచుకునే ఉంటాయి. తన ఇంటి వద్ద కాపలా కాయటానికి అంగ రక్షకుల అవసరం ఆయనకు ఎన్నడూ కలగలేదు.

ప్రవక్త (స)తో సాన్నిహిత్యాన్ని అభిల షించని వారు ఎవరుంటారండీ? ఈ విష యంలో ఆయన భార్యల ఆసక్తిని గురించి ఇక ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయన సామీప్యం కోసం



భార్యలు పరస్పరం పోటీ పడిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. కొన్నిసార్లు వారి మితిమీరిన ధోరణి దైవప్రవక్త (స)కు బాధాకరంగానూ పరిణమించేది.

దైవప్రవక్త సతీమణులు (రజి.అన్‌హున్న) ఉత్తమ నైతికతను కనబరచి ప్రజలకు ఆదర్శంగా నిలవ వలసినవారు. ప్రవర్తనలోనూ, పరుల పట్ల వ్యవ హారంలోనూ దైవప్రవక్త సతీమణులు అత్యున్నత స్థానంలో ఉండాలని జనం కోరుకోవటం సహజమే! ఈ విధంగా ఒక గొప్ప సామాజిక బాధ్యతను వారు నెరవేర్చవలసి ఉంటుంది. అదీగాక అల్లాహ్ వారిని విశ్వాసుల మాతలుగా పేర్కొన్నాడు. అయితే మనుషులు ఎంతటి గొప్పవారైనప్పటికీ మానవ సహజమైన బలహీనతలకు వారు అతీతులు కాలేరు. మానవ సహజమైన ఈ బలహీనతే దైవప్రవక్త సతీమణులను సైతం బాధ్యతల నిర్వహణ విషయంలో ఏమార్పుకు గురిచేసేది.

దైవప్రవక్త (స), ఆయన సతీమణులు మానవాతీతులు కారని తెలిపే సంఘటనలు ఇస్లామీయ చరిత్రలో కోకొల్లలుగా మనకు లభ్యమవుతాయి. అటువంటి ఒక సంఘటనను దివ్య ఖుర్‌ఆన్ సైతం చూచాయగా ప్రస్తావించింది. వివరాల్లోకి వెళితే....

అయిషా, హఫ్సా (రజి)లు దైవప్రవక్త (స) గారి భార్యలు. ఆయనకు అత్యంత దగ్గరి సహచరులైన అబూ బక్ర్, ఉమర్ (రజి)ల కుమార్తెలు వీరు. ఒకసారి దైవప్రవక్త (స) అయిషా, హఫ్సాలతో వేర్వేరుగా మాట్లాడుతూ వారిద్దరికి ఒక ముఖ్య సమాచారం గురించి చెప్పారు. దాన్ని రహస్యంగా ఉంచమని తాకీదు చేశారు. కాని ఆ రహస్యం రహస్యంగా ఉండలేదు. హఫ్సా (రజి.అన్‌హా) అయిషా (రజి) ముందు గుట్టును రట్టు చేసేశారు.

దైవప్రవక్త (స) వారిది వాత్సల్యకరమైన మనస్తత్వం. తన కుటుంబం పట్ల ఆయన ఎల్లప్పుడూ ప్రేమతో, ఆప్యాయతతోనే వ్యవహరించేవారు. కాని ఈ ఇరువురి భార్యల తప్పిదం పట్ల ఆయన మనసు చాలా నొచ్చుకుంది. కోపంలో ఆయన ఒక ప్రతినబూనారు. అల్లాహ్‌పై ప్రమాణం చేస్తూ, "నిర్ణీత కాలం వరకు నేను భార్యలతో దాంపత్య సంబంధాలకు దూరంగా ఉంటాను. వారు చేసిన తప్పుకు శిక్ష ఇది" అని ఆయన అన్నారు.

https://teluguislam.net



ఇక అప్పట్నుంచి దైవప్రవక్త (స) కొన్నాళ్ళు ఒక చిన్న కుటీరంలో విశ్రాంతి తీసుకుంటూ గడిపారు. ఆ కుటీరంలోకి వెళ్ళాలంటే, ఒక చెట్టునెక్కి దాని గుండా లోనికి ప్రవేశించవలసి ఉండేది. ఆ గదిలో ఒక ముతక చాప తప్ప మరేమీ ఉండేవి కావు. ఆ చాప మీదే దైవప్రవక్త (స) విశ్రాంతి తీసుకుంటూ ఉండేవారు. కొన్ని ఖర్జూర పండ్లు, కాసిన్ని ధాన్యపు గింజలు - ఇదే ఆ ఏకాంత జీవనంలో ఆయన ఆహారం! తన వ్యక్తిగత సేవకులు, సహచరులు అయిన రిహ్బాను ఆయన కుటీర ద్వారం వద్ద నియమించారు. తన అనుమతి లేకుండా ఎవరినీ లోనికి అనుమతించ వద్దని ఆయనకు పురమాయించారు. గదిలోపల ఆయన దైవధ్యానంలో నిమగ్నులై ఉండేవారు.

కొంత కాలం గడిచింది. దైవప్రవక్త కుటుంబ పరిస్థితులు బాగా లేవన్న సంగతి అందరికీ తెలిసిపోయింది. మరోవైపు దైవప్రవక్త (స) భార్యలకు విడాకులు ఇచ్చారన్న వదంతి కూడా జన సామాన్యంలో వ్యాపించింది. ఈ వార్త ఉమర్ (రజి)ను కలవరానికి గురిచేసింది. నిజం ఏమిటో తెలుసుకోవాలని ఆయన దైవప్రవక్త (స) వద్దకు బయలుదేరారు. కుటీరానికి చేరుకొని లోనికి వెళ్ళటానికి అనుమతించమని సేవకుణ్ణి కోరారు. కాని ప్రవక్త సేవకుడు ఆయన్ని లోనికి వెళ్ళటానికి అనుమతించలేదు. తాను దైవప్రవక్త (స) ను కలవాల్సిందేనని ఉమర్ (రజి) గట్టిగా మాట్లాడారు. ఇక ఉమర్‌ను ఆపటం కష్టమని భావించిన రిహ్బా ఆయన్ను లోనికి అనుమతించారు. లోపలికి వెళ్ళిన ఉమర్ (రజి), దైవప్రవక్త (స) ఆ చిన్న కుటీరంలో ఆహారం కోసం, విశ్రాంతి కోసం పడుతున్న ఇబ్బందిని చూసి ఏడ్వకుండా ఉండలేకపోయారు.

"ఉమర్! మీరు ఎందుకు ఏడుస్తున్నారు?" అని చాలా నెమ్మదిగా అడిగారు దైవప్రవక్త (స). ఆయన ఎదుర్కొంటున్న బాధను, ఇబ్బందిని చూసి తట్టుకోలేక విలపిస్తున్నానని ఉమర్ (రజి) బదులిచ్చారు.

తర్వాత వినయంగా ఆయనతో, "దైవప్రవక్తా! ఇంట్లో ఆడవాళ్ళు మీ మనసును నొప్పించారా? మీరు మీ భార్యలకు విడాకులు ఇచ్చారని జనం చెప్పు కుంటున్నారు. అది నిజమేనా? మీరు ఏం చేసినా ఫర్వాలేదు. అల్లాహ్ మీకు తోడుగా ఉన్నాడనీ, దైవదూతలంతా మీ పక్షానే ఉన్నారని మాకు గట్టి నమ్మకం



ఉంది. అబూ బక్ర్, నేను, ఇంకా విశ్వాసులందరం మీ వెంటే ఉన్నాం. మీకు ఏ ఆపద కలిగినా, ఏ కష్టం కలిగినా దాన్ని ఎదుర్కోవటానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని ఉమర్ (రజి) ఏవేవో విషయాలు మాట్లాడుకుంటూ పోతున్నారు.

ఉమర్ (రజి) మాటలు దైవప్రవక్త (స)కు నవ్వు తెప్పించాయి. ఆయన మోముపై చిరునవ్వు విరిసింది. తన భార్యల్లో ఎవరికీ తాను విడాకులు ఇవ్వ లేదని ఆయన ఉమర్ (రజి)కు చెప్పారు. ఆయన తిరిగొచ్చి ముస్లింలకు ఈ శుభవార్తను వినిపించారు. ప్రజలంతా ఆనందించారు.

మరి కొంత సమయం గడిచాక దైవప్రవక్త (స) ఇంటికి తిరిగి వచ్చారు. అప్పుడు ఆయిషా, హఫ్సా (రజి)లు తాము చేసిన తప్పిదంపై పశ్చాత్తాప పడుతూ, అల్లాహ్‌ను క్షమాభిక్ష వేడుకుంటూ, ప్రార్థనల్లో నిమగ్నులై ఉన్నారు. ఆ దృశ్యం చూసి ఆయన ఎంతగానో సంతోషించారు. దైవప్రవక్త (స) సతీమణులు అప్పు డప్పుడూ మానవ సహజమైన బలహీనతలకు లోనయ్యేవారన్న మాట నిజమే కాని వారు విశ్వాసుల్లో అందరికంటే ఉత్తమ సుగుణవంతులన్న విషయం మనం మరచిపోకూడదు. (చదవండి దివ్యఖుర్‌ఆన్ 66:1-5)

## గ్రహించవలసిన పాఠాలు

- ప్రజల బాధ్యతలను పర్యవేక్షిస్తూ ఉండటం ప్రవక్తకు అతి ముఖ్యమైన విషయం.
- "శిక్ష" నిమిత్తం కొంతకాలం వరకు భార్యల పట్ల దాంపత్య సంబంధాలకు దూరంగా ఉంటానని ప్రమాణం చేయటం దైవప్రవక్త (స) క్రియా శీలతను, ఈ విషయంలో ఆయన ప్రత్యేకతను సూచిస్తోంది. అయితే శిక్షను అమలు పరుస్తున్నప్పుడు తాను సైతం ఏకాంత జీవనంలో ఇబ్బం దులను ఎదుర్కోవటం గమనించదగిన విషయం.

https://teluguislam.net



# జైనబ్

## జహష్ కుమార్తె (రజియల్లాహు అన్హా)

ఇస్లాంలో దత్తతకు గల శాస్త్రీయ స్థానాన్ని వివరించిన సంఘటన

> అల్లాహ్ మీ దత్తపుత్రులను మీ (కన్న) కొడుకులుగా చేయలేదు. ఇవన్నీ మీ నోటిమాటలే. అల్లాహ్ సత్యం పలుకుతున్నాడు...... దత్తపుత్రులను వారి (కన్న) తండ్రుల సంబంధంతోనే పిలవండి. అల్లాహ్ దృష్టిలో ఇదే న్యాయం...... మరుపు వల్ల మీచేత ఏదన్నా (తప్పు) జరిగిపోతే దాని పాపం మీపై ఉండదు. అయితే హృదయ పూర్వకంగా చేసినపక్షంలో అది పాపమే.
>
> (ఖుర్‌ఆన్ 33 : 4 - 5)

ఖదీజా (రజి.అన్హా) దైవ ప్రవక్త (స) గారి మొదటి భార్య. ఆవిడ దైవ ప్రవక్త(స)ను అమితంగా ప్రేమించే వారు. ఒకసారి ఆవిడ ఒక బానిస బాలుణ్ణి కొనుగోలు చేశారు. ఆ బాలుని పేరు జైద్. అతని తండ్రి హారిస్. ఆ బాలుణ్ణి ఆమె ప్రవక్త(స)కు కానుకగా సమర్పించుకున్నారు. ఆయన ఆ బాలుణ్ణి ఎంతో వాత్సల్యంతో తన సంరక్షణలోకి తీసుకున్నారు. దైవప్రవక్త (స) కనబరిచిన ఆప్యాయతా అనురాగాలకు మురిసిపోయి ఆ పిల్లవాడు ఆయన దగ్గరే ఉండసాగాడు. ఎంతో ఇష్టపడి ఆయనకు సేవ చేస్తుండేవాడు.

ఒకరోజు బనూహారిస్‌కు చెందిన కొందరు బాటసారులు మక్కా నగరానికి వచ్చారు. వారు దైవ ప్రవక్త (స)ఇంటి వద్ద తిరుగుతున్న జైద్‌ను గుర్తుపట్టారు. అతను తమ తెగ పిల్లవాడనీ, ఎవరో అతణ్ణి అపహరించి తీసుకువెళ్ళారనీ, ఆ తర్వాత బానిసగా అమ్మి ఉండవచ్చని, ఇక ఆ పిల్లవాడిని తమకు అప్పజెప్పమని వారు దైవప్రవక్త (స)ను కోరారు. అతడి కొనుగోలుకు అయిన ఖర్చులు చెల్లించి అయినా సరే; అతన్ని వెంట తీసుకు వెళతామని పట్టుబట్టారు. అప్పుడు దైవప్రవక్త (స) వారితో, “ఈ విషయాన్ని మనం జైద్ ఇష్టానికి వదిలేద్దాం. అతను మీ వెంట వెళ్ళటానికి ఇష్టపడుతున్న



ట్లయితే తప్పకుండా తీసుకెళ్ళండి. నేను మీ నుంచి ఎలాంటి మూల్యం తీసుకోను. అతని కొనుగోలుకు అయిన వ్యయం కూడా నాకు అక్కరలేదు” అన్నారు. తర్వాత వారు జైద్‌ను వెంట తీసుకెళ్ళటానికి పిలిచారు. కాని ఆశ్చర్యంగా, ఆ పిల్లవాడు ప్రవక్త (స) వద్ద ఉండటానికే ఇష్టపడ్డారు. అతని విశ్వాసానికి ముచ్చటపడి దైవప్రవక్త (స) అతణ్ణి దత్తత తీసుకున్నాడు. అప్పట్నుంచి జనం ఆ బాలుణ్ణి జైద్ బిన్ ముహమ్మద్ (ముహమ్మద్ కుమారుడు జైద్) అని పిలుస్తుండేవారు.

జైద్ యుక్తవయస్సుకు చేరుకున్నారు. తన కుమారునిగా పెరిగిన ఆయనకు ఓ మంచి అరబ్బు మహిళతో వివాహం జరిపించాలని దైవ ప్రవక్త (స) కోరుకున్నారు. జహష్ కుమార్తె జైనబ్ సంబంధం దైవప్రవక్త (స)కు నచ్చింది. ఆమె ఎవరో కాదు, స్వయానా దైవప్రవక్త మేనత్త అయిన ఉమైమా కూతురే! కాని పెళ్ళికూతురు అన్నయ్య అబ్దుల్లాహ్‌కు ఈ సంబంధం నచ్చలేదు. జైద్ ఒకప్పుడు బానిస జీవితం గడిపినవారు. అలాంటి సాధారణ వ్యక్తి, అరబ్బుల్లో ఒక ఉన్నత తెగకు చెందిన తన చెల్లెలికి సరిజోడు ఎలా కాగలరని ఆయన ప్రశ్నించారు. అటు జైనబ్ (రజి.అన్హా) కూడా తన అన్న మాటను సమర్థిస్తూ దైవప్రవక్త (స) తీసుకువచ్చిన సంబంధాన్ని త్రోసిపుచ్చారు. వారిరువురి తిరస్కార ధోరణిపై అల్లాహ్ ఈ క్రింది ఖుర్‌ఆన్ వాక్యాలను అవతరింపజేశాడు:

> **(చూడండి) అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఏ వ్యవహారంలోనయినా ఒక నిర్ణయం చేసిన తరువాత విశ్వాసులైన ఏ పురుషునికిగానీ, స్త్రీకి గానీ తమకు వర్తించే ఆ వ్యవహారంలో ఎలాంటి స్వయం నిర్ణయాధికారం మిగిలి ఉండదు. ఒకవేళ ఎవరైనా అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపితే అతను స్పష్టమైన అపమార్గానికి లోనైనట్లే (జాగ్రత్త!).**
>
> ***(దివ్య ఖుర్‌ఆన్ 33: 36)***

ఈ వాక్యాలు చెవిన పడగానే జైనబ్, ఆవిడ అన్న ఇద్దరూ తమ మాటను వెనక్కు తీసుకున్నారు. అల్లాహ్ అభీష్టం ముందు శిరసావహించటానికి వారు సిద్ధమయ్యారు. ఎట్టకేలకు జైద్ - జైనబ్‌ల వివాహం జరిగింది. అల్లాహ్ వారి అదృష్టంలో రాసివుంచినంత కాలం వారిరువురూ భార్యాభర్తలుగా జీవితం గడిపారు.

https://teluguislam.net



## దంపతుల మధ్య తగాదాలు

జైద్ తన శక్తి మేరకు కష్టపడి పనిచేసి భార్యను సుఖపెట్టటానికి కృషి చేశారు. కొన్నాళ్ళ తర్వాత ఆ దంపతుల మధ్య తగాదాలు మొదలయ్యాయి. జైద్ సహించలేక ఒకనాడు భార్యకు విడాకులు ఇవ్వాలని భావించారు. ఆ విషయమై దైవప్రవక్త (స)ను సంప్రదించారు. "జైద్! నీ భార్య జైనబ్, నా మేనత్త కూతురు. అసలు మీ పెళ్ళి జరిగేది కాదు. అల్లాహ్ ప్రమేయంతో మీ ఇద్దరి వివాహం జరిగింది. కనుక ఓపిక పట్టు. తనతోనే కలిసి జీవించు" అని దైవప్రవక్త (స) జైద్‌కు నచ్చజెప్పి పంపించారు.

రోజులు గడుస్తున్న కొద్దీ ఆ దంపతుల మధ్య విభేదాలు పెరుగుతూనే పోయాయి. జైనబ్ నుంచి తనకు విడాకులు ఇప్పించమని దైవప్రవక్త (స)ను జైద్ మాటిమాటికి అడుగుతుండేవారు. ఆఖరికి జైద్ పరిస్థితిపై దైవప్రవక్త (స)కు జాలి కలిగింది. ఇక నీకు ఏది సముచితంగా కనిపిస్తే అది చేయి అని ఆయన జైద్‌తో అన్నారు. ఆ అవకాశం కోసం ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్న జైద్ భార్యకు విడాకులిచ్చేశారు.

అనేక నెలలు గడిచిపోయాయి. తర్వాత దైవప్రవక్త (స) స్వయంగా జైనబ్‌కు వివాహ సందేశం పంపించారు. ఆమె కూడా దైవప్రవక్త (స)ను వివాహం చేసుకోవటానికి సంతోషంగా అంగీకరించారు.

ఇక ఈ వివాహం ప్రజల్లో చర్చనీయాంశం అయింది. ఈ వివాహ చట్టబద్ధతను ప్రశ్నిస్తూ జనం ఆయన్ను వేధించటం మొదలు పెట్టారు. అరబ్బు బహుదైవారాధకుల ఆచారం ప్రకారం దత్త కుమారుని భార్యను వివాహం చేసుకోరాదు. దత్త కుమారుడు సొంత కుమారుని లాంటివాడేనని ఆ కాలం ప్రజల నమ్మకం. అప్పుడు దైవప్రవక్త (స) పై ఈ క్రింది వాక్యాలు అవతరించాయి. ఈ వాక్యాలు బహుదైవారాధకుల నోళ్ళు మూయించాయి. ఆస్తి పంపకాల వ్యవహారంలోగాని, మరే వ్యవహారంలోనైనా గాని దత్తపుత్రుల పట్ల కన్న కుమారుల మాదిరిగా వ్యవహరించటాన్ని ఈ వాక్యాలు సవాలు చేశాయి. మొత్తానికి దత్త కుమారుణ్ణి సొంత కుమారునిగా చేసే చట్టమేదీ లేదని అల్లాహ్ ఈ వ్యాక్యాల్లో నిరుపించాడు.



ఏ మనిషి శరీరంలోనూ అల్లాహ్ రెండు హృదయాలను ఉంచలేదు. మీరు మీ భార్యల్లో ఎవరినయినా మీ తల్లులుగా ప్రకటించినంత మాత్రాన అల్లాహ్ వారిని (నిజంగానే) మీ తల్లులుగా చేయలేదు. మీ దత్తపుత్రులను కూడా మీ (కన్న) కొడుకులుగా చేయలేదు. ఇవన్నీ మీ నోటి మాటలే. అల్లాహ్ సత్యం పలుకుతున్నాడు. ఆయన (రుజు) మార్గం చూపుతున్నాడు.

దత్తపుత్రులను వారి (కన్న) తండ్రుల సంబంధంతోనే పిలవండి. అల్లాహ్ దృష్టిలో ఇదే న్యాయం. ఒకవేళ వారి (కన్న) తండ్రులెవరో మీకు తెలీకపోతే, అట్టి పరిస్థితిలో వారు మీ ధార్మిక సోదరులు, స్నేహితులు అవుతారు. మరుపు వల్ల మీచేత ఏదన్నా (తప్పు) జరిగిపోతే దాని పాపం మీపై ఉండదు. అయితే హృదయపూర్వకంగా చేసినపక్షంలో అది పాపమే. అల్లాహ్ అపారంగా క్షమించే వాడు, అమితంగా కనికరించేవాడు.

*(దివ్య ఖుర్‌ఆన్ 33:4-5)*

అల్లాహ్ ఇంకా ఇలా సెలవిచ్చాడు:

(ఓ ప్రవక్తా! ఆ సందర్భాన్ని కాస్త జ్ఞాపకం చేసుకో) అల్లాహ్ అనుగ్రహించిన వ్యక్తితో, నువ్వు సయితం ఉపకారం చేసిన వానితో, "నువ్వు నీ భార్యను నీ దగ్గరే ఉండనివ్వు, అల్లాహ్‌కు భయపడు" అని చెప్పే వాడివి. కాని అల్లాహ్ బయటపెట్టాలని ఉన్న ఒక విషయాన్ని నువ్వు నీ మనసులోనే దాచిపెట్టావు. నువ్వు జనులకు భయపడేవాడివి. నిజానికి నువ్వు భయపడటానికి అల్లాహ్‌యే ఎక్కువ హక్కుదారుడు.

*(దివ్య ఖుర్‌ఆన్ 33:37)*

జైనబ్ వివాహం దైవప్రవక్త (స)తో ఈ విధంగా జరిగింది. అందుకనే జైనబ్ (రజి.అన్‌హా) తన సవతుల మీద గొప్పలు చెప్పుకుంటూ, "దైవప్రవక్త (స) తో మీ పెండ్లిళ్ళు మీ తండ్రుల, మీ సంరక్షకుల పెద్దరికంలో జరిగాయి. కాని నా పెండ్లి మాత్రం అల్లాహ్ మధ్యవర్తిత్వంతో జరిగింది" అంటుండేవారు.

మొత్తానికి దైవప్రవక్త - జైనబ్‌ల వివాహం అజ్ఞానకాలం నాటి ఒక మూఢాచారాన్ని సంస్కరించటానికి తోడ్పడింది. రక్తసంబంధాల ప్రాముఖ్యతను,

https://teluguislam.net



ఆస్తివారసత్వ పంపకాలను గురించి ఈ వివాహం మరింత స్పష్టంగా వివరించింది. సామాజిక జన జీవనంలో ఒకరు మరొకరికి దన్నుగా నిలిచినంత మాత్రాన, ఒకరు మరొకరితో అతి సన్నిహితంగా మెలిగినంత మాత్రాన వారి మధ్య రక్తసంబంధం పుట్టుకురాదు.

అయితే ఇటువంటి పరోపకార భావాలకు బహుశా ఇస్లాంలో స్థానం లేదని తలపోయటానికి కూడా వీల్లేదు సుమా! స్త్రీ పురుషుల మధ్య రక్త సంబంధం లేనప్పుడు ఖుర్‌ఆన్ నిర్ధారించిన వైవాహిక కట్టుబాట్లు వారికి వర్తించవని చెప్పటమే ఈ సంఘటన పరమార్థం. ఇతరుల పిల్లల్ని దత్తత తీసుకున్నంత మాత్రాన వారు తమ కన్న తల్లిదండ్రులకు కాకుండా పోరు. ఆ పిల్లలు తమ పేర్లతో పాటు తమ కన్న తల్లిదండ్రుల పేర్లనూ నిశ్చింతగా రాసుకోవచ్చు, అలా రాయాలి కూడా! ప్రజలు కూడా వారిని వారి కన్న తల్లిదండ్రుల పేర్లతోనే పిలవాలి. ఇది ఖుర్‌ఆన్ ఆదేశం. తాము దత్తత తీసుకున్న పిల్లలకే ఆస్తి మొత్తాన్ని ధారా దత్తం చేస్తామని అంటే ఇస్లాం ధర్మం ఒప్పుకోదు. అలా చేస్తే రక్తసంబం ధీకుల హక్కును కొల్లగొట్టినట్లవుతుంది. అలా అని మనిషిలోని సహజమైన భావాలను, ఆత్మీయతా అనురాగాలను ఇస్లాం ధర్మం నిర్దాక్షిణ్యంగా అణచి వేయదు. తాము కోరుకుంటే ఆస్తిలో మూడోవంతు దత్తపుత్రునికే ఇచ్చుకోవచ్చు. మిగిలినది మాత్రం రక్తసంబంధీకులకే దక్కాలి.

## గ్రహించవలసిన పాఠాలు

- దైవప్రవక్త (స) జీవితంలోని ఈ అపూర్వ సంఘటనపై ఇస్లాం శత్రువులు తీవ్ర అనుచితమైన వ్యాఖ్యలు చేశారు. దైవప్రవక్త (స) తన దత్త కుమారుని భార్యపై మోజు పడ్డారని (ఈ అనుచితమైన మాటను మన నోటితో అనవలసి వస్తున్నందుకు అల్లాహ్ మనల్ని క్షమించాలని ప్రార్థిస్తున్నాం), అందుకే జైద్ చేత ఆయన భార్యకు విడాకులు ఇప్పించారని కొంత మంది దుర్మార్గులు పనిగట్టుకొని దైవప్రవక్త (స)పై నిందారోపణలకు దిగారు. కాని వారి ఈ ఆరోపణలు పసలేనివి. జైనబ్ (రజి.అన్‌హా) స్వయానా దైవప్రవక్త (స) గారి మేనత్త కూతురు. తను పుట్టినప్పటి నుంచి



దైవప్రవక్త (స)కు తన గురించి బాగా తెలుసు. జైనబ్‌ను వివాహమాడాలనే కోరిక గనక తన మనసులో ముందు నుంచి ఉన్నట్లయితే ఆయన ఆమెను జైద్‌కిచ్చి వివాహం చేసేవారే కాదు. పైగా మంచి యవ్వనంలో ఉన్నప్పుడే ఆయన ఆమెను వివాహమాడేవారు. తన యాభై యేండ్ల వయసు దాకా ఆగవలసిన అవసరం ఆయనకు లేదు. అదీగాక ఆయన జైనబ్‌ను వివాహమాడినప్పుడు ఆమెకు నడివయసు దాటింది. అంతేకాదు, జైనబ్‌కు విడాకులు ఇవ్వవద్దని దైవప్రవక్త (స) జైద్‌కు పదే పదే తాకీదు చేసిన విషయం కూడా ఈ సందర్భంగా మనం గమనించాలి. జైనబ్ పట్ల సహనంతో ఉండటం ఇక తన వల్ల కాదని అన్నప్పుడు మాత్రమే దైవప్రవక్త (స) అయనకు విడాకుల అనుమతి ఇచ్చారు.

- దైవప్రవక్త (స) జైనబ్ (రజి)ని దైవాజ్ఞ మేరకే వివాహమాడారన్న విషయం అర్థమయితే, ఆవిడతో ఆయన వివాహం గురించి అసలు ఇంత చర్చ అనవసరం. అల్లాహ్ తన ఆజ్ఞను దేన్నయినా అమలు పరచదలచుకున్నప్పుడు, ప్రజల్లో ఒక అత్యుత్తమ ఆదర్శాన్ని నెలకొల్పటం కోసం, సాధారణంగా ప్రవక్త ద్వారానో లేక ప్రవక్త సమీప వ్యక్తుల ద్వారానో దాన్ని అమలు పరుస్తాడు. దీన్ని మనం అర్థం చేసుకోవాలి.

(చదవండి ఖుర్‌ఆన్ 33: 28-40+52 ఆయతుల వ్యాఖ్యానం)

https://teluguislam.net

## మీ అభిప్రాయాలు, సూచనలు మాకు రాయటం మర్చిపోకండి!



# ఇస్లామీయ ఆరాధనలు

ప్రతి ముస్లిం ఇంట్లో ఉండవలసిన పుస్తకం

**నిజంగా ప్రతి ముస్లిం ఇంట్లోనూ ఉండవలసిన పుస్తకమే కదా ఇది?!**

శాంతి మార్గం పబ్లికేషన్స్‌వారు ప్రచురించిన ఈ పుస్తకానికి పాఠకుల నుంచి వస్తోన్న విశేష స్పందన పబ్లికేషన్ సేవకగణంలో నూతనోత్తేజాన్ని నింపుతోంది. పాఠకుల అనూహ్య స్పందన ఈ పుస్తకాన్ని ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లోకి అనువదించేందుకు ప్రక్రియకు ప్రేరణగా నిలిచింది. పబ్లికేషన్ తన పాఠకులందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేసు కుంటోంది. ఇస్లామీయ ఆరాధనల్లో ఇంకా ఏ అంశాలను చేర్చితే ఈ పుస్తకం ఇది మరింత ప్రయోజనదాయకంగా రూపుదిద్దుకుంటుందనే విషయం గురించి పబ్లికేషన్ ఆలోచిస్తోంది. ఈ సందర్భంగా మీరూ మీ సలహాలు, సూచనలు మాకు పంపవచ్చు.

పాఠకులకు ఏ పుస్తకాలు అందజేయాలి? అనే దానికంటే పాఠకులు మన నుంచి ఎలాంటి పుస్తకాలు కోరుకుంటున్నారు? వారికి ఏ ధార్మిక గ్రంథాల అవసరం ఉంది? అనే విషయాలకే శాంతిమార్గం పబ్లికేషన్స్ పెద్దపీట వేస్తోంది. మరి పబ్లికేషన్స్ ఆశయం నెరవేరాలంటే అందులో పాఠకులైన మీ భాగస్వామ్యం చాలా అవసరం. ఈ ఆశయ సాధనలో భాగంగా రాష్ట్రం నలుమూలల నుంచీ ప్రజల అభిప్రాయాలను, సూచనలను సేకరించటం జరుగుతోంది. పాఠకుల నుంచి వస్తున్న సహేతుకమైన సలహాలు, సూచనలు శాంతిమార్గం చేపట్టే ధార్మిక పథకాల దిశానిర్దేశం చేయటంలో కీలకపాత్రను పోషిస్తున్నాయి.

**మరి ఆలస్యం దేనికి?!**

మీరూ మీ మనసులోని భావాలను మాతో పంచుకోవటానికి ప్రయత్నించండి. **మీ ఉత్తరాలు మరెన్నో పథకాలకు పునాదిరాళ్ళు కావచ్చు.**

**పాఠకుల స్పందనలే ప్రకాశకులకు అభినందనలు**

మా చిరునామా: శాంతిమార్గం పబ్లికేషన్స్
ఆషియానె రజీ, 16-2-867 10 అక్బర్‌బాగ్, సైదాబాద్, హైదరాబాద్-59
E-mail: shantimargam@gmail.com